కేరటాలు

కలిగి



III

అంతర భారతీయ పుస్తకమాల

కెరటాలు

రచన:

కల్కి

అనువాదము:

వాకాటి పాండురంగరావు



నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
న్యూఢిల్లీ

VISHWANDHRA BOOK HOUSE

IV

1974

© కె. రాజేంద్రన్, 1973

Price : 7-50

Original Title : ALAI OSAI (*Tamil*)
KERATALU (Telugu)

PUBLISHED BY THE DIRECTOR, NATIONAL BOOK TRUST, INDIA, NEW DELHI-16
PRINTED AT SOLAR WORKS, 12, THAMBU CHETTY STREET, MADRAS-1.

V

తొలిపలుకు

తమిళంలో రాయబడినప్పటికీ "అలై ఓసై" నవలయొక్క కథ తమిళనాడుకు పరిమితమైనదని చెప్పలేము. ఈ కథలో పాత్రలు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవి. కథ భారతదేశపు ముఖ్య నగరాలన్నింటా నడుస్తుంది. కనుక దీనిని అఖిలభారత దేశానికీ చెందిన నవల అని చెప్పవచ్చును.

రాజంపేట గ్రామంనుండి రజనీపూర్ దాక ఎన్నో నగరాలలో, గ్రామాలలో ఈ కథలోని వారు సంచరిస్తారు. కాని కథ నడక ఎక్కడా కుంటు వడదు.

ఉత్తర దక్షిణ భారతదేశాలెంతగా కలిసి వున్నాయో ఈ నవల నిరూపిస్తుంది. వివిధ రాష్ట్రాలవారు, వివిధ భాషలవారు ఈ కథలో దర్శనమిస్తారు. వీరందరూకూడా తమతమ రాగద్వేషాలతో మన హృదయాలకు చేరువగా వస్తారు. బాంధవ్యం ఆశిస్తారు. వీరందరూ మనకు సన్నిహితులే అనిపిస్తుంది.

కీర్తి శేషులు "కల్కి" గారు ఈ నవలలో ఎన్నో కొత్త పోకడలు పోయారు. ఈ నవలలో నాయకుడూ, ప్రతినాయకుడూ తానే అయిన ప్రధాన పాత్రను చూసి కోప్పడ్డమా, జాలి చెందడమా అన్న సందిగ్ధంలోకి పడతాము మనం. ఈ నవలలో ఇంకా ఎన్నో కొత్తందనాలున్నాయి.

మనదేశ స్వాతంత్ర్య పోరాటంలో అతి ముఖ్యమైన ఘట్టాలు ఈ కథకు నేపథ్యంగా ఉపకరించాయి. ఈ ప్రత్యేకత కారణంగా దీనినొక చారిత్రక నవలగా పేర్కొందా మనిపిస్తుంది.

గాంధీ మహాత్ముడి సమ్మోహనశక్తి ఏవిధంగా లక్షలాది ప్రజలను మంత్ర ముగ్ధులుగాచేసి దేశ స్వాతంత్ర్య సమరంలోకి దింపిందీ—ఈ నవల ద్వారా

ఈనాటి యువతీ యువకులు తెలుసుకోగలరు. తన రచనలన్నిటిలోనూ నాలుగు కాలాలపాటు నిలవ గలిగినది "అలై ఓ శై" ఒక్కటేనని రచయిత చెప్పుకున్నారు. అటువంటి ఈ నవలను ఏ భాషలోకి అనువదించినా పరసీయంగానే వుండి తీరుతుందని వేరే చెప్పనక్కరలేదు. తర్జుమావలన దీని శ్రేష్ఠత ఆవంతయినా తగ్గక పోవడం ఇంకొక చెప్పుకో దగిన అంశం.

"అలై ఓ శై" నవలకు శ్రీ కల్కి రాసిన 'మున్నుడి'నుండి ఒక భాగాన్ని క్కడ ఉటంకించడం సమంజసమనుకుంటాను; అది ఈ రచయిత హాస్య రచనాపటిమకు ఒక ఉదాహరణగాకూడా ఉపకరించగలదు.

"పుస్తకాల శక్తిగురించి మన పెద్దలు పలువిధాల చెప్పివున్నారు. పుస్తకాలు, అల్మారాకు అలంకారాలనీ, హస్తాలకు భూషణాలనీ వర్ణించారు. నిద్రలేమికి పుస్తకాలకు మించిన మందులేదని అనుభవ పూర్వకంగా సెల విచ్చారు. కొందరికి కాఫీ, లేక తేనీరు సేవిస్తే నిద్ర పాడవుతుంది. పుస్తకాన్ని చేతిలోకి తీసుకోగానే నిద్ర ముంచుకొచ్చేస్తుంది. పుస్తకాల మహిమ గురించి ఇంతకన్న ఏమి చెప్పాలి?

పుస్తకాలు సంపాదించడానికి మూడు మార్గాలున్నాయంటుంటారు. యాచించడం, అరువు తెచ్చుకోవడం, తస్కరించడం అన్నవే ఆ మార్గత్రయం. డబ్బిచ్చి కొనడం అన్నటువంటి నాల్గవమార్గాన్ని అనుసరించవలసిన అవసరం రైలు ప్రయాణాల సమయంలోనే కలుగుతుంటుంది.

రైలు ప్రయాణం చేసేటప్పుడు కొందరికి నిద్ర సరిగా రాదు. ఆ రైలు కదలికలకూ కుదుపులకూ, వచ్చే ఆకాస్త నిద్రాపోతుంది. అంచేత కాలక్షేపానికేదయినా పుస్తకం వుంటే బాగుండునే అన్పిస్తుంది. ఈ విధంగా గ్రంథపఠనానికి రైల్వేలు ఎంతయినా సేవచేస్తున్నాయి. అందుకనే అన్ని పెద్ద రైల్వేస్టేషన్లలోనూ పుస్తకాల దుకాణాలుంటాయి. పుస్తకం సంపాదించ

దానికి మొదట చెప్పిన మూడు మార్గాలూ రైలు ప్రయాణాలవేళ పనికిరావు, అప్పుడు నాల్గవ మార్గ మొక్కటే శరణ్యం.

ఒకసారి రైలు ప్రయాణం చేయవలసివచ్చినప్పుడు వాకూ అటువంటి పరిస్థితి ఎదురయింది. "ఎటూ నిద్ర రావడంలేదుకదా, ఏదయినా పుస్తకం కొందాము..." అని తిరుచ్చిరాప్పళ్ళి రైల్వే జంక్షన్‌లోని పుస్తకాల దుకాణానికి వెళ్ళాను. అక్కడ పుస్తకాలన్నిటినీ ఒకసారి పరికించి, తళతళమని మెరుస్తున్న త్రివర్ణ ముఖపత్రంవున్న ఒక ఇంగ్లీషు నవలను కొన్నాను. అది సుప్రసిద్ధ ఇంగ్లీషు హాస్య రచయిత పి. జి. ఓడ్‌హౌస్ రచించినది. ఆంగ్లేయుల వేషభాషలను సునిశితంగా చమత్కారంగా ప్రదర్శిస్తూ కడుపు చెక్కలయ్యేలా నవ్వించే రచనలు చేస్తారు ఓడ్ హౌస్. "నవ్వొస్తే సరేసరి, లేకపోతే నిద్రయినా వస్తుందికదా—" అని తెగించి ఆయిదుమ్మూప్పావలా పెట్టి ఆ పుస్తకం కొన్నాను. ఆ మూడువందల పేజీల పుస్తకంతోబాటు రైల్లో వెళ్ళి కూర్చున్నాను. ఆ పుస్తకం అంతవరకు 27 లక్షల 30 వేల ప్రతులు అమ్ముడు పోయిందని అట్టమీద రాసివుంది. డబ్బిచ్చి కొన్నవారు అంతమంది అయితే మిగతా మూడు విధాలా ఆ పుస్తకాన్ని సంపాదించి చదివిన వాళ్ళెంతమంది వుంటారో! నిజంగా ఆంగ్ల రచయితలు అదృష్టవంతులు—అనుకుంటూ పుస్తకాన్ని తెరిచి చదవసాగాను.

చదవడం మొదలు పెట్టగానే ఒక సందేహం తోచింది. రెండవపుట చదివేసరికి సందేహం బలపడింది. "ఆరినీ! ఈ కథే ఇంతకు ముందొకసారి చదివానుకదా! మళ్ళీ అదే పుస్తకాన్ని కొన్నానన్న మాట! ఐదుముప్పావలా గోవిందా!" అనుకుని ఆ పుస్తకాన్ని కింద పడేశాను...పాపం పుస్తకం ఏమి చేయగలదు? దాన్నిచూసి నేను నవ్వడానికి ముందుగా అదే నన్ను చూచి నవ్వింది. నాతో మాట్లాడిందికూడాను:" నాయనా! నన్నిట్లా దభీమని క్రింద పడేశావే? నువ్వూ ఒక రచయితవుకదా? నీ పుస్తకం కొని ఆశాభంగం చెందినవాడూ దాన్నిదేవిధంగా పడేయవచ్చునుకదా?" అంది.

దాంతో, కాస్తో కూస్తో వస్తున్న నిద్ర పటాపంచలయింది. కాలాన్ని ఎట్లా గడపడం అనిపించింది. పెట్టెను తెరచి బట్టలను పక్కకు తొలగించి చూడగా ''కంబరామాయణం'' ప్రతి కనుపించింది. దానిని చేతిలోకి తీసుకుని చదవసాగాను. కాలం ఎటా గడిచిందో తెలియలేదు.

వెయ్యేళ్ళ ముందు కంబన్ రాసిన పుస్తకం; నేను ఇదివరకు కనీసం వంద సార్లయినా చదివిన పుస్తకం. అయినా కంబన్ కవితపాతది అనిపించలేదు. పుస్తకాన్ని అవతలకి పారేద్దా మనిపించలేదు. చదవగా చదవగా క్రొత్తగా అన్పించింది. పాతకాలపు మహాజ్ఞానులు రాసిన పుస్తకాలకూ, ఈనాటి రచయితల ''పొద్దుట వికసించి సాయంకాలానికి వసివాడే'' రచనలకూ వున్న వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కనపడింది.

కంబన్ స్మృతికి అంజలి ఘటించడానికని ఏర్పాటయిన ఒక సభలో నా అనుభవం గురించి చెప్పాను. సభ ముగిశాక ఒక మిత్రుడు నా దగ్గరకువచ్చి ''ఏమండీ! మా అందరికీ మూర్ఖత్వపు పట్టాలు కట్టారే?'' అన్నాడు. ''అదేమిటండీ! పట్టాలు కట్టడానికి విశ్వ విద్యాలయాలుండగా నేనెందుకూ ఆ పని చేయడం? అట్లాంటి పనేదీ నేను చేసినట్లు గుర్తు లేదే?'' అన్నాను. ''అది కాదండీ! మీరు రాసిన పుస్తకాలను మేము ఎంతో కుతూహలంతో కొని చదువుతుంటాము. జాగ్రత్తగా దాచి పెట్టుకుంటుంటాము. కొన్ని పుస్తకాలనయితే మూడు నాలుగుసార్లుకూడ చదువుతుంటాము. అట్లాంటప్పుడు వాటిని ఒకసారి చదివేసి పారవేయదగిన వాటితో జత కలిపారెందుకూ?'' అన్నాడాయన.

''ఏదో వినయపూర్వకంగా అన్నానంతే...దానిని గురించి పట్టించుకోకండి. కంబనూ, వళ్ళువరూ, తమ రచనలను వెయ్యేళ్ళపాటు చదువుతారు కదా అనుకుని రాశారా ఏమిటి? కాదు. తొందరగా అప్పుడు ప్రదర్శించడానికంటూ షేక్స్‌పియర్ రాసి పారేసిన నాటకాలు ఇప్పటికీ జగమంతటా

చిరంజీవులుగా నిలిచి వున్నాయి. బెర్నార్డ్‌షా విషయం చూడండి. ''నేను షేక్స్‌పియర్‌కన్న కాస్త అధికుడిని—'' అని చెప్పుకున్నాడు. ఆయన మరణానంతరం ఆయన ఇంటిని కొని ఒక స్మారక చిహ్నం నెలకొల్పుదామంటే, తగినంత ప్రోత్సాహంలేక. ఆ ప్రయత్నం మానుకున్నారు. అందుచేత—రచయితలు జీవించి వుండగా వారి పుస్తకాల గురించి ఇదమిత్థంగా ఏమీ చెప్పలేము.'' అన్నాను.

''మరయితే మీ పుస్తకాలలో ఒకటయినా నిలిచి వుంటుందా? యాభై లేక, వంద సంవత్సరాలు జీవించగల రచన అంటూ మీ వాటిలో వున్నదా?'' అని ఆయన అడిగారు. ''మీ ప్రశ్నకు సమాధానం ఇప్పుడు చెప్పలేను. వంద ఏళ్ళ తర్వాత అడగండి, చెబుతాను.'' అన్నాను.

ఆ మిత్రుడి ప్రశ్నకు తిన్నగా జవాబు చెప్పకుండా దాట వేశానేగాని ఆప్రశ్న నా మనసును వేధించ సాగింది. అప్పటినుండి ఏ కొత్త రచన కుపక్రమించినా ''ఇది ఎన్ని రోజులపాటు నిలిచి వుంటుంది? ఎన్నిసార్లు చదవడానికిది అర్హమవుతుంది?'' అన్న ప్రశ్న తలెత్త సాగేది. ఆ తర్వాత రచన ముందుకు సాగేదికాదు. ఈ సదసత్సంశయం ఆనాటినుంచి ఇటీవలిదాక నన్ను పీడిస్తుండేది.

*　　*　　*

కాకిపిల్ల కాకికి ముద్దు అని సామెత. కాకి తన బిడ్డను బంగారంలా చూచుకుంటుంది అంటారు. కాని నాకు కాకి అంత తెలివి తక్కువ పక్షి అనిపించడంలేదు. అందమైన నల్లటి తన బిడ్డకన్న బంగారానికి కాకి ఎక్కువ విలువ ఇస్తుందని నేను అనుకోవడం లేదు. అట్లా విలువలు తారుమారు చేసేవి మానవుడే! తనుకన్న బిడ్డకన్న బంగారానికి ఎక్కువ విలువ ఆ పాదించగలగడం మానవుడికే చేతనవును. ఆటువంటి మనిషికూడా బంగారం తర్వాత

అతి ముఖ్యంగా చూచుకునేది తన బిడ్డనే; కనుక ఎవరి సృష్టించినది వారికి ఉత్తమంగా వుంటుంది—అని చెప్పవచ్చును.

రచనలు సృష్టించే వారి విషయంలో ఇదెంత వరకు నిజమో చెప్పలేము. ఆయా రచనలు చేసేటప్పుడు అవి చాల ఉత్తమమనిపిస్తాయి. కాని కొంత కాలమయినాక వాటిని చదివి చూస్తే అట్లాగే అన్పిస్తాయా?

అందరిలాగే రచయితలూ ఎదుగుతారు; శారీరకమైన పెరుగుదల ఆగిపోయాకకూడా మానసికంగా ఎదగడం కద్దు. అందువలననే రచయిత తాను ఏడెనిమిదేళ్ల ముందు రాసిన దానినిప్పుడు చదివితే అందులోని లోపాలు స్పష్టంగా తెలియవస్తాయి. ''అరె! ఈ చెత్తంతా నేను రాసిందేనా!'' అని బాధ కలుగుతుంది. నాకూ ఇట్లాంటి అనుభవం కద్దు.'' ఆ కాలపు పరిస్థితి అది; అందు కనుగుణంగా రూపొందింది కథ. దానినే ఇప్పుడు రాస్తే ఇంకొక విధంగా వుండవచ్చు—'' అని నాకు నేనే సమాధానం చెప్పుకుంటుంటాను.'' ఈ పుస్తకపు మొదటి ముద్రణ ప్రతులు ఇంతటితో అయిపోతే, రెండవ ముద్రణ వెలికి పోరాదు,' అనిపించిన సందర్భాలూ వున్నాయి. అసలే ఇట్లాంటి సమస్యలకు గురి అవుతున్న మనసును మిత్రుడు వేసిన ప్రశ్న మరింతగా పీడించసాగింది.

''అలై ఓ శై'' అన్న ఈపుస్తకం మూలంగా ఆ బాధ నివృత్తి అయింది.

మొదట ఈ కథ ''కల్కి'' పత్రికలో ధారావాహికంగా ప్రచురితమయింది. పత్రికలో కథ ముగియగానే దీనిని పుస్తక రూపంలో ప్రచురించడం అవసరమా, ఉచితమా అన్పించింది. ఆ సమస్య పరిష్కరించడానికని కథ నొక్కసారి మొదటినుండి చివరదాక చదివి చూశాను. మిత్రుడి ప్రశ్నకు సమాధానం లభించింది. నా రచనలలో ఏదయినా యాభై, లేదా, నూరు సంవత్సరాలపాటు నిలిచి వుండదగినది అంటే అది ''అలై ఓ శై''యే నన్పిం

చితది. పుస్తకం ప్రచురణలో వుండగా ప్రూఫులు దిద్దుతుంటే, ఆ భావం బలపడింది.

''అలై బలై''ను నేను రాసినట్లనిపించలేదు. లలితా, సీతా, తారిణీ, సూర్యా, సౌందరరాఘవనూ, పట్టాభిరామనూ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ తమతమ అంతరాంతరాలనూ, రాగద్వేషాలనూ బహిర్గతం చేస్తూ ఈ కథను రచించారు. వారందరూ కల్పించబడిన పాత్రలు అనిపించలేదు. మనలాగే వాళ్ళూ, కష్టాలను సుఖాలను అనుభవించినతోటి మానవులనే అనిపిస్తారు. పాపం, సీత మాత్రం కస్తూర్బాతల్లిని వెతుక్కుంటూ వెళ్లిపోయింది! మిగిలిన వారందరూ బ్రతికే వున్నారు. వాళ్లను మళ్లీ ఎక్కడ, ఎప్పుడు కలుస్తామో తెలియదు మరి—''...

...ఈ రచన కుపక్రమించడానికి ముందుగా శ్రీకల్కి ఈ కథలో వచ్చే టువంటి ఊర్లన్నీ తిరిగి వచ్చారు. ఈ నవల నిమిత్తమే ఢిల్లీ, క్రొత్త ఢిల్లీ, పానిపట్టు, కర్నాల్, కురుక్షేత్రం మున్నగు వూర్లన్నిటికీ వెళ్ళారు. అక్కడ తలదాచుకున్న పంజాబీ కాందిశీకులను వారి స్థితిగతులను పరిశీలించి వచ్చారు.

ఆయన, ఇతర చారిత్రక నవలలు రాయడానికి పూర్వమూ ఇట్లాగే, ఆ రచనలలో రాబోయే ఊర్లన్నీ స్వయంగా పర్యటించి వచ్చేవారు. అందుచేత కథలో కల్పన ఎంత, చరిత్ర ఎంత అని నిక్కచ్చిగా తేల్చి చెప్పలేనట్లుగా అ రెండూ మేళవించి వుంటాయి. అయినా చారిత్రక పరిశోధకులు వేలెత్తి చూపలేనట్లుగా కల్కి కథలుంటాయి.

''అలై బలై'' కథ పొడవు తగ్గించమని నన్ను కోరారు; ఆ పని మొదలెట్టాక ఎన్నోచోట్ల—''అయ్యో! ఇంత రసవత్తరమైన భాగాన్ని తీసివేయడమా!'' అన్పించింది. ఆయినా అనువాద నిమిత్తం ఆపనిచేసి తీరక తప్పలేదు; ఎన్నో ఆసక్తికరమైన సంభాషణా భాగాలను కత్తిరించక తప్పలేదు.

"అలై ఓశై" రష్యన్ భాషలోకి అనువదించబడి, ఎన్నో సార్లు పున ర్ముద్రించబడి లక్షలాది ప్రతులు అమ్ముడయిందన్న విషయం ఇక్కడ పేర్కొ నాలి. ఈ నవలకు సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

ఇక రచయితను గురించిన కొన్ని వివరాలు. శ్రీ కల్కి అసలు పేరు రా. కృష్ణమూర్తి; పుత్తమంగలం (తంజావూరు జిల్లా) గ్రామంలో 1899లో జన్మించారు. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుండగానే సహాయ నిరాక రణోద్యమంలో పాల్గొని చెఱసాలకు వెళ్ళారు. ఆ తర్వాత దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మూడుసార్లు కారాగార వాసం అనుభ వించిన శ్రీ కల్కికి రాజకీయ గురువు శ్రీ రాజాజీ. ఆ రోజులలో తిరుచ్చెం గోడ్‌లో రాజాజీ నడుపుతుండిన గాంధీ ఆశ్రమంలోవుండి కల్కి సేవ చేశారు. ఆ ఆశ్రమం నడుపుతుండిన "విమోచనం—" అన్న మద్యనిషేధ ప్రచార పత్రికలో రాస్తూ వచ్చారు.

సుప్రసిద్ధ తమిళ రచయిత శ్రీ వి. కళ్యాణసుందర మొదలియార్ నడుపు తుండిన "నవశక్తి" పత్రికలో శ్రీ కల్కి 1923లో సహాయ సంపాదకు లుగా చేరి, రచనలు చేస్తూ, రాణింపు కొచ్చారు.

* శ్రీ "వి. క." మీద తమకున్న గౌరవాభిమానాల కారణంగా "కల్యాణసుందరం"—అన్న పేరులోని మొదటి రెండక్షరాలనూ కృష్ణమూర్తి అన్న తమ పేరులోని మొదటి అక్షరాన్ని కలిపి అయన "కల్కి" అన్న కలం పేరు పెట్టుకున్నారు.

---

* తమిళంలో "కల్యాణ సుందర" అనీ, "కిృష్ణ మూర్త్తి" అనీ రాస్తారు. కనుక మొదటి పేరులోని మొదటి రెండక్షరాలూ, రెండవ పేరులోని మొదటి అక్షరమూ కలిపితే "కల్కి" అవుతుంది.

—అనువాదకుడు

సుప్రసిద్ధ తమిళ వారపత్రికలయిన 'కల్కి'', ''ఆనంద వికటన్'' అకు కల్కి సంపాదకులుగా వుండి, కీర్తి నార్జించారు. కల్కి అన్నది కాకుండా— కర్నాటకం, ఇసైత్తేనీ, లాంగులన్, అగస్త్యన్, రాగి, యమన్, వ్యవసాయి, పెట్రోన్ మొదలగు ఎన్నో మారుపేర్లతో ఆయన రాజకీయ వ్యాసాలు, సంగీత వ్యాసాలు, కథానికలు, హాస్యగల్పికలు, సాంఘిక చారిత్రక నవలలు మున్నగు వెన్నో రచించారు. ఈ కాలపు తమిళసాహిత్యంలో కనపడుతున్న కొత్తందనాలెన్నింటికో ఆయన మార్గదర్శకులు అంటే అది అతిశయోక్తి కాదు.

కల్కి గారి సంఘసేవ గురించి యావత్తమిళనాడూ ఎరుగును. ఎట్టాయపురంలో మహాకవి సుబ్రహ్మణ్య భారతికి స్మారక మంటపం, చెన్నపట్నం (గిండీ)లోని గాంధీ మంటపం—ఆయన సేవానిరతికి నిదర్శనాలు.

ఆయన నవలలో— 'పార్థిబన్ కణవు'', ''శివకామియిన్ శబదమ్'', ''త్యాగభూమి'', ''కళ్వనిన్ కాదలి'' ''పొన్నియిన్ సెల్వన్'', ''మోహినిద్దీవు'' —సుప్రసిద్ధములు. ఇవి గాక ఆయన రచించిన వ్యాసాలు, కథలు, గల్పికలు, సంగీత విమర్శలు—పుస్తకరూపంలో ప్రచురించ బడినాయి. కల్కి ఉత్తమమైన కవికూడాను, ఆయన ఎన్నో చక్కటి కవితలను వెలయించారు.

ఆయన రచించిన ''పులిరాజా'' అన్న చిన్న కథ జర్మన్‌లోకి అనువదించ బడి కథానికా సంకలనంలో చేర్చబడింది. 'మోహినిద్దీవు'' అన్న చిన్న నవలను ''నెహ్రూ అభినందన్ గ్రంథ్''లో ప్రచురించారు.

1954లో, తమ కీర్తి పరాకష్ఠనందుకున్న దశలో శ్రీ కల్కి దివంగతులయ్యారు. ''పూర్ణ చంద్రుడు అస్తమించాడు—'' అన్నారు శ్రీ రాజాజీ.

కల్కి రచనలు పలువిధములైన ప్రశంసలకు పాత్రములయినాయి. వాటిలో కొన్నింటిని చదివితే ఆయన విభిన్న అభిరుచులుగల వారందరికీ నచ్చిన రీతులలో రచనలు చేశారని తెలుస్తుంది.

'కల్కి వచనరచన అరటిపండొలిచి చేతిలో పెట్టినట్లు సరళంగా, మధురంగా వుంటుంది.'' అన్నారు రాజాజీ.

''సాహిత్యంలో తనదే అయిన రీతులను సృష్టించుకుని ఘన విజయం సాధించారు కల్కి'' అని నామక్కల్ కవిజ్ఞరూ, ''కల్కి అన్నది అయస్కాంత శక్తి; ఆశక్తి సాహితీజగాన కలకాలం వుంటుంది'' అని ఆయన తోటి సంపాదకుడు దేవనూ, ''సరిగా రచనలు చేయలేని 'దూడలను' పైతం ప్రోత్సహించి రచయితలుగా తీర్చి దిద్దారాయన—'' అని ఒక రచయిత్రా, ''కర్నాటక సంగీతానికి తన కలం ద్వారా ఎనలేని సేవ చేశారు.'' అని సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు శ్రీ అరియక్కుడి రామానుజ అయ్యంగారూ, ''ఆయనవంటి ఉత్తమ రచయిత పుట్టడం తమిళదేశపు భాగ్యం; ఆయన నా పత్రికకు సంపాదకుడిగా వుండడం నాకు ఎంతో ఆనందకరం. ఆయనవంటి రచయిత ఇంకొక్క రుంటారా అని ఆశ్చర్య పడుతుంటాను—'' అని 'ఆనందవికటన్'' అధిపతి శ్రీ ఎస్. ఎస్. వాసనూ—ప్రశంసించారు.

''త్యాగభూమి'' నవల ధారావాహికంగా ప్రచురిత మవుతున్న రోజులలో, పత్రికలమ్మే కుర్రవాడు రాత్రి ఏ ఎనిమిదింటికో ''ఆనందవికటన్!'' అని వీధిలో ఆరిస్తే వరుసగా కిటికీలు తెరుచుకునేవి. ఇళ్ళ దీపాల వెలుగు వీధుల లోకి ప్రసరించేది—'' అంటాడొక పాఠకుడు. ఇందుమూలంగా కల్కి రచనలను పాఠకులు ఎంత ఆశక్తితో చదివేవారో తెలియగలదు.

ఈ "ఆలై ఓశై" నవల సంక్షిప్త రూపంలో ఇతర భాషలలో చదివే వారు—"తమిళంలో ఈ నవల ఎంత బాగుండి వుండాలో—"నని అనుకుంటే ఈ నవల అనువాదపు లక్ష్యం నెరవేరినట్లే!

ఆనంది రామచంద్రన్

Blank Page

1

రాజంపేట అగ్రహారపు ఇళ్ళల్లో సగానికి సగం పాతవి; కొత్త బాగున్న వాటిలో ఒకటి ఆ గ్రామ మునసబు కిట్టావు అయ్యర్ ఇల్లు. పెద్ద గదులున్న ఆ ఇల్లు చూడడానికి చాలా గంభీరంగా వుంది.

ఇంటి ముందు పక్కా హాలుంది. ఆ హాల్లో కూర్చొని సరస్వతమ్మ తన కూతురు లలితకు జడ వేస్తూంది.

"ఇంకా ఎంతసేపమ్మా...కొత్త తొందరగా వేయకూడదూ?" అని సణిగింది లలిత!

"ఏం, ఏ మంత తొందరా? ఈ మిడిమిడి ఎండలో పడి ఆ తపాలాఫీసుకు పరుగెత్తాలి కాబోలు, అవునా...అయినా ఆ వచ్చిన పుత్తరాలు ఇంటిదాకా రావా ఏం?"

ఇంతలో జడ ముగిసింది. దాన్ని సరస్వతమ్మ పైకి తీసి కట్టేలోపుగా లలిత జడను లాక్కుని, లేచి వీధివైపు పరుగుత్తింది.

"ఒసేయ్.. ఏమిటాదూకుడు? వెనక్కి వస్తావా లేదా, రా?" అని సరస్వతమ్మ అరుస్తుండగానే కిట్టా వయ్యర్ ఇంట్లోకి వచ్చారు.

నాన్నను చూడగానే లలిత వెనకడుగు వేసింది. అమాయకత్వం నిండిన ఆమె మొహంలో సిగ్గు, చోటుచేసుకుంది. ఆమె తల్లి ఈలోగా లేచి వచ్చింది.

"ఏమిటి సరసా, ఏమిటీ అరుపులు? యధా ప్రకారం చిట్టి తల్లిని ఏదో అరుస్తున్నావు, అంతేనా?" అన్నారు కిట్టావయ్యర్.

"అవును మరి మీ ముద్దుల కుమార్తెను కోప్పడడం ఒకటే కదా నాకు కాలక్షేపం. అసలు మీరిట్లా గారాబు చేయబట్టే..."

"...గారాబు చేయబట్టే అది పాడయి పోయింది. అంతేకద. నీకడుపున పుట్టినప్పుడు బంగారు కొండలా పుట్టింది...కదూ, ఫరవాలేదుకాని, ఈ అరుపులు కేకలు ఏమిటో చెప్పావుకావు—"

"దాని కెన్నిసార్లు చెప్పినా వింటుందా? తపాలాఫీసుకు పరుగెడతానంటుంది. ఆ వచ్చిన పుత్తరాలు దారిలోనే ఆగిపోతాయా... ఇదిగో శ్రావణం వచ్చేసింది. ఈసారన్నా ఆ మూడు ముళ్ళు వేయించాలి."

"పెళ్ళికీ నీ అరుపుకూ ఏమిటి సంబంధం—"

"పెళ్ళి కానున్న పిల్లను ఒంటరిగా వీధిలోకి పోనిస్తారా?"

"పోతే ఏం? తపాలాఫీసు పట్టుమని రెండు ఫర్లాంగులన్నా లేదుకదా... అయినా అమ్మాయిలను ఇంట్లోపెట్టి తాళం వేసే రోజులు పోయాయి. అమ్మా లలితా! నువ్వు వెళ్ళి! నాకూ కూడా ఏవయినా వుత్తరాలు వచ్చాయా చూడు—"

అంతే, ఆమరుక్షణం లలిత మాయమయింది.

"ఎందరినో చూచానుకాని ఇంత గారాబు చేసేవారి నెక్కడా చూడలేదు - వారీ బొంబాయికి వచ్చాకయితే అబ్బా కూతురూ ఇట్లా తయారయ్యారే. ఆఖరికి ఎట్లా తేలుతుందో ఏమో-" అని గొణిగింది సరస్వతమ్మ..

"బాగానే తేలుతోంది. నువ్వు నోరు మూసుకుని వుంటే చాలు. అల్లుడు మాత్రం పెద్ద చదువులు చదివిన వాడు కావాలి అంటావేమరి పిల్లను అందుకు తగినట్లు తయారు చేయవద్దా?"

వీధి వైపునుండి ఎవరో ఇంట్లోకి వస్తున్న శబ్దం విన్పించింది.

సరస్వతమ్మ కాస్త ప్రక్కకు ఒదిగి నిల్చుంది. ఆ వచ్చినాయన కిట్టూ వయ్యర్ ముఖ్య స్నేహితుడు చీమాచ్చు అయ్యర్.

ఆయన అడుగుపెడుతూ "ఇవాళ మా బావ కల్యాణసుందరం పట్నం నుండి వచ్చాడోయ్...ఒక పత్రిక పట్టుకొచ్చాడు దానిలో బ్రహ్మాండంగా వున్నాయి వార్తలు—" అన్నారు.

"ఏమిటా వార్తలు?"

"బీహారులో భూకంపంట!"

"ఏమిటేవిటి—?"

"చాల ఘోరమయిన భూకంపమట! విపరీతమయిన ప్రాణనష్టమూ, ఆస్తి నష్టమూనట...పత్రికనిండా ఇదే కబురనుకో—అన్నట్లు మా ఆవిడ పిలుస్తున్నట్లుంది మిమ్మల్ని" అన్నారు చీమాచ్చు.

స్తంభం చాటుగా నిల్చున్న సరస్వతమ్మ తన భర్త దృష్టిని మరల్చడాని కని కాస్త ముందుకు వచ్చి, సౌంజ్ఞలు చేయడం చూచే ఆయన అట్టా చేస్తాడు.

"ముందుకొచ్చి చెప్పు సరసా. మన చీమాచ్చే కదా" ఆమె మెల్లగా అంది. "ఆయనేదో భూకంపం అంటున్నారు...అమ్మా యేమో ఒంటరిగా వెళ్ళింది. వెంటనే వెళ్ళి తీసుకురండి. లేకపోతే ఎవరినయినా పంపించనన్నా పంపించండి."

అగ్రహారపు ఇళ్ళు దాటగానే పెద్ద వీధి వస్తుంది. ఆ వీధిని అర ఫర్లాంగు దూరం వెళ్తే తపాలాఫీసు వస్తుంది. లలిత పరుగు పరుగున వెళ్ళి అయిదు నిముషాలలో గమ్యం చేరింది.

రొప్పుతూనే అడిగింది. "పోస్టు మాస్టర్ గారూ! నాకేదయినా వుత్తరాలు వచ్చాయా?"

ఆయన తలెత్తి చూశాడు. 'ఓహో, నువ్వా తల్లీ! ఇదిగో, ఆ ఉత్తరాల కట్ట విప్పిచూచి చెబుతానుండు—" అని కట్టను విప్పాడు. ఉత్తరాలన్నీ చూచాక చివర "ఆ! ఇదిగో నీ వుత్తరాలు! వెళ్ళి వెళ్ళి అడుగును దాక్కున్నాయి." అంటూ మూడు త్తరాలను అందిచ్చాడు.

ఆతురతతో వాటినందుకున్న లలిత, తపాలాఫీసు బయటికి రాగానే కవర్లు చింపింది. అందులోని వుత్తరం చదవసాగింది.

దాదర్, బొంబాయి

14-1-1934.

నా ప్రియనెచ్చెలి, ప్రాణ సఖి

అయిన లలితకు,

పోయిన ఆదివారం నేను రాసిన వుత్తరం నీకు అందింది కదూ - దానిని రాసినప్పుడు సంతోషంగా వున్నాను. అది రాస్తుండగా మా అమ్మ నన్ను

ముద్దు పెట్టుకుని ''బంగారు తల్లీ, నువ్వూ లలితా కలకాలం ఇట్లాగే ప్రాణ స్నేహితురాండ్రుగా వుండండి!'' అంది. ఆ మాటలు అంటుంటే అమ్మ కళ్ళల్లో నీరు నిండడం చూచి ఆశ్చర్యపడ్డాను. ''ఎందుకమ్మా?'' అని అడిగాను. 'ఏమీ లేదమ్మా! ఈ ప్రపంచంలో నాకు స్నేహితురాండ్రే లేరు. నీకన్నా ఒక మంచి స్నేహితురాలు దొరికింది కదా అని ఆనందంగా వుంది.'' అంది.

కాని లలితా! ఏం చెప్పను, ఆ వుత్తరం రాసిన మరుసటి రోజుకుండే అమ్మ తీవ్రమయిన జ్వరంతో మంచం పట్టింది. మొదట ఆమె ''ఏదో మామూలు జ్వరంలే - రెండ్రోజులలో దానంతట అదే పోతొంది'' అని చెప్పడం మూలాన్ని వూరుకున్నాము. మూడు రోజులయ్యాక కూడా తగ్గక పోయేసరికి నాన్న వెళ్ళి డాక్టరును తీసుకు వచ్చారు. టైఫాయిడ్ జ్వరమని డాక్టరు చెప్పాడు. ''ఈమె చాల బలహీనంగా వుంది. సరిగ్గా పోషణ వున్నట్లులేదు. మరి ఇన్ని రోజులు అశ్రద్ధ చేశారేమిటీ'' అని డాక్టరంటుంటే నా మనసుకు ముల్లు గుచ్చుకున్నట్లయింది. అమ్మ మాటిమాటికి వ్రతాలు ఉపవాసాలు చేయడం, నాన్న ఏమీ పట్టించుకోక పోవడం గుర్తుకు వచ్చాయి.

లలితా! ఇప్పు డింక ఎన్ని అనుకున్నా లాభం ఏమిటి? అమ్మ జబ్బు ముదిరి పోయింది. ''దేవుడి దయ'' అన్నారు డాక్టరు నాన్నతో. దేవుడికి దయ కలుగుతుందా లలితా? లేక దేవుడు నన్ను అనాథగాచేసి అమ్మను తన దగ్గరకు పిలిపించుకుంటాడా?

మామయ్యకు నాన్న వుత్తరం రాశారు. వెంటనే బయలుదేరి రమ్మని రాశారు. నువ్వు కూడా చెప్పు. మామయ్య వస్తే అమ్మ జబ్బు నయం కావచ్చు; అమ్మ బ్రతకవచ్చు.

వచ్చేవారం నీకు ఉత్తరం రాయగలనో లేదో. రాసినా, రాయకపోయినా నిన్ను సదా జ్ఞాపకం వుంచుకొనే

నీ అత్త కూతురు,
సీత''

ఆ వుత్తరం చదవడం ముగించి కన్నీటితో ఇల్లు చేరిన లలితను చూచి దిగ్భ్రాంతి చెందిన కిట్టూవయ్యర్ ఆమెను ప్రేమతో చేరదీసి "లలితా ఏమయిందమ్మా! ఎందుకేడుస్తున్నావు. ఏముంది ఆ వుత్తరంలో-" అని అడిగారు.

వెక్కిళ్ళను చాల ప్రయత్నంతో ఆపుకుంటూ చెప్పింది లలిత. "నాన్న! ఆత్తయ్యకు ఒంట్లో బాగలేదు నాన్నా - జబ్బు ముదిరిందిట నాన్నా - సీత రాసింది. ఇదిగో నీకూ ఒక వుత్తరం రాసింది." అని రెండుత్తరాలను ఇచ్చింది.

కిట్టూపు అయ్యర్ మొదటి వుత్తరం చదివారు. కండ్లనీరు చిమ్ముతుండగా ఆయన వెళ్ళి పడక కుర్చీలో కూర్చున్నారు.

2

రాజంపేట కిట్టూవయ్యర్ తండ్రికి ఒకే కొడుకు. తండ్రి పోయాక కావేరి తీరాన తండ్రి సంపాదిలచిన అనేక ఎకరాల మాగాణితోబాటు కిట్టూవయ్యర్‌కు గ్రామ మునసబు గిరీ కూడా సంక్రమించింది. బంగారువంటి భూమిలో సంబా వరి, అరటి, చెఱకు, తమలపాకు పండించ సాగాడాయన.

తండ్రి జీవించి వుండగానే కిట్టూవయ్యర్ సోదరీమణు లిద్దరికీ వివాహం అయింది. అంచేత కిట్టూవయ్యర్ ఇంటి పెద్ద అయ్యాక ఆయనకు పెద్దగా ఖర్చులేమీ లేవు. కాని దాన ధర్మాలు చేస్తుండడం వల్లనయితేనేమి, స్నేహితుల అవసరాల నాదుకుంటుండడం వల్లనయితేనేమి, పిల్లల చదువులకయితేనేమి ఖర్చవుతుండడం వలన ఆస్తి పెద్దగా పెరగనూ లేదు. లలిత మాత్రం ఏటికేడాది పెరుగుతూ వచ్చింది.

అసలు గత సంవత్సరం కిట్టా వయ్యర్ లలిత పెళ్ళి విషయం పట్టి అధిక శ్రద్ధ వహించక పోవడానికి ఆయన కుటుంబ సమేతంగా బొంబాయి వెళ్లడమే కారణం. కిట్టావు అయ్యర్‌కు ఒక అక్క, ఒక్క చెల్లెలు. అక్కను ఆ సమీప గ్రామంలోనే ఇచ్చారు. చెల్లెలు రాజం మాత్రం బొంబాయిలో కాపురం చేస్తూంది.

చిన్నప్పట్నుంచీ కిట్టావయ్యర్‌కు చెల్లెలంటే అభిమానం ఎక్కువ. ఆమె పెళ్ళి పందిట్లో ఆయన ఎంత సంబరపడ్డాడో...కాని రాజం అదృష్టం బాగుండలేదు. పెళ్ళి కాగానే ఆమె భర్త దురైస్వామికి బొంబాయిలో రైల్వేకార్యాలయంలో ఉద్యోగం దొరికింది. కొన్నాళ్ళ తర్వాత రాజం బొంబాయికి వెళ్ళింది. చాల కొద్దికాలానికే ఆమె కాపురం సవ్యంగా వుండడం లేదని తెలియసాగింది. కాని వివరాలు మాత్రం తెలియలేదు.

స్వాభిమానం గల ఇల్లాలు రాజం తన ఇంటి గుట్టును రట్టుచేసుకో ఇష్టపడలేదు. బొంబాయి రాజం పేటల మధ్య రాకపోకలేమో అంత సులువు కాదాయెను. క్రమక్రమంగా ఉత్తరాలు కూడా ఆగిపోయాయి. అప్పుడప్పుడు కిట్టావయ్యర్ —"రాజం ఎట్లావుందో, ఏమో-" అని మధన పడేవారు.

ఇట్టి పరిస్థితులలో, ఒక సంవత్సరం క్రింద ఒకనాడు హఠాత్తుగా రాజం నుండి వుత్తరం వచ్చింది. గుండెను పిండివేసే వుత్తరం అది. ఇన్నేళ్ళనుండి భరించిన తన కష్టాలు ఇంకా గడవలేదని ఆవేదనలో రాసింది రాజం. రాను రాను తన ఆరోగ్యమూ పాడవుతున్నదనీ, వీలయినంత త్వరలో వచ్చి తన్నొక సారి చూసి పోవలసిందనీ అన్నయ్యకు రాసింది.

అప్పుడు కిట్టావయ్యర్ కుటుంబ సమేతంగా బొంబాయికి వెళ్ళారు. సరస్వతమ్మ, లలిత, లలిత తమ్ముడు సుండు - అందరూ వెళ్ళారు. ప్రయాణం చాల ఉత్సాహంగా గడిచింది. స్టేషన్‌కు దురైస్వామి అయ్యర్ వచ్చి దాదర్‌లోవున్న తమ ఇంటికి వారిని తీసుకు వెళ్ళారు.

బొంబాయి నగర జీవనం లలితకు సుండుకు చాల నచ్చింది. లలిత సీత ఇద్దరూ నెచ్చెలు లయ్యారు. లలితకన్న సీత ఒక్క ఏడు పెద్దది. ఇక ఆ

జన్మాంతం ఒకరి నొకరు మరచి పోరాదని చేతిలో చేయివేసి ప్రమాణాలు చేసుకున్నారు.

రాజం జీవితం నిరాశతో, కష్టాలతో నిండినదని కిట్టావయ్యర్ తెలుసుకున్నారు. కాని కారణాలేమిటో మాత్రం సరిగా తెలియలేదు. వాళ్ళు అక్కడ వున్నన్ని రోజులూ దుర్గైస్వామి, ఎన్నడూ లేనిది శ్రద్ధగా ఇంటికి వచ్చారు. వచ్చినప్పుడెల్లా గలగలమంటూ సంతోషంగా అందరితోమా మాట్లాడారు. కాని చాల రోజులు రాత్రిళ్ళు కూడా 'డ్యూటీ' వుందని చెప్పి వెళ్ళి వెనక్కు వచ్చేవారు కాదు.

అయినా కిట్టావయ్యర్ ఎదురు చూచినట్లు రాజం మరీ బలహీనంగాలేదు. చక చక తిరుగుతూనే వుండేది. అయినా సరే కిట్టావయ్యర్ అప్పుడొకటీ అప్పుడొకటీ ప్రశ్నలువేసి అసలు కథేమిటో బయటికి లాగడానికి ప్రయత్నించారు.

"ఏమిటమ్మా రాజం! మీ అయనకు చెడు అలవాట్లు ఏమయినా వున్నాయాఁ?"

"రోగము, గుర్రప్పందాలు, ఒకటేవిటి అన్ని వ్యసనాలూ వున్నాయిం ఆ మాట అనుకుంటునే కడుపు మండిపోతుందన్నయ్యా—" అంటూ విడ్డ్చేసింది రాజం. ఆమెను ఓదార్చి నెమ్మది నెమ్మదిగా వివరాలు తెలుసుకున్నారు కిట్టావయ్యర్. జూదాలేగాక వేశ్యా సంపర్కంలాటిది కూడా దుర్గైస్వామికి వుందని అయన గ్రహించారు. ఇంకా ఎక్కువ అడిగితే చెల్లెలి మనసు పాడవడం తప్ప మరొక లాభం వుండబోదని అయన వూరుకున్నారు.

ఇవన్నీ చూసిన సరస్వతమ్మ మనసు కుతకుత లాడింది. తన కూతురు లలితను సీత "ఒసే" అని పిలవడం "రాసే! పోసే! ఛీ" అని సంబోధించడం ఆమెకు కొత్తగా నచ్చలేదు.

సీత బొంబాయిలో పుట్టి పెరిగిన పిల్ల. లలిత పల్లెటూరి పడుచు. వారిద్దరి వేషభాషలలో, నడవడిలో ఆ వ్యత్యాసం కనబడుతూనే వుంటుంది. చెవి మీదుగా వ్రేలాడే వంకీలు తిరిగిన ముంగురులే చాలు సీత అందాన్ని నొక్కి చెప్పడానికి; ఇక ఆమె మాటల చలాకీ తనం అద్భుతం. లలిత ఒక మాట

మాట్లాడే లోపుగా సీత పది మాట్లాడేది; మాటల మధ్య ఏ ఇంగ్లీషు పాటనో పాడి చమక్కుమన్పించేది కాన్వెంటులో చదువుకున్న సీత.

ఇవన్నీ కాక లలిత కన్న ఏడాది పెద్దది సీత. అంచేత ఆమెలో యౌవన శోభ ప్రస్ఫుటంగా కన్పడ సాగింది.

తన కూతురి కన్న తన ఆడ పడుచు కూతురు అందమైనదని సరస్వతమ్మకు తెలిసింది. అంచేత బొంబాయిలో వున్నన్ని నాట్యాలలితకు ఏవేవో అలంకారాలు చేయసాగింది.

అట్లా సాగింది వారి బొంబాయి జీవితం.

* * *

కిట్టావు అయ్యర్ ఇంకొక కవర్ చింపి ఉత్తరం చదవ సాగాడు. మధ్యలోనే "ఛీఛీ! ఈ పాడు ఇంగ్లీషు చదువులు చదివితే ఉన్నమతికూడా పోతుందల్లేవుంది. అందులోనూ మద్రాసులో కాపురం పెడితే ఇహ వాళ్ళకు తల ఏదో తోక ఏదో కూడా తెలియదు. ఎంతగర్వం! ఎంత మదం—" అన్నాడు.

"ఎవరు రాశారు వుత్తరం? ఏమని రాశారు?" అని అడిగింది సరస్వతమ్మ.

"పాత మాంబళంలో వున్నాడుగా మేధావి వాడు రాశాడు. వాడి మెదడులో రోకలిబండ వుంది కాబోలు—"

"ఓహో! మీ చిన్న మామయ్య రాశారా? ఏమి రాశారు?' అని కుతూహలంతో అడిగింది సరస్వతమ్మ.

"మద్రాసులో పద్మాపురంలో ఒక సంబంధం వుందని చీమాచ్చు చెప్పాడు కదా? దాన్ని గురించిన వివరాలు కనుక్కోమని రాశాను. వెళ్ళి వరుడు తల్లిదండ్రులను కలిశాడట. పిల్లను మద్రాసుకు తీసుకొచ్చి చూపించమన్నారట వాళ్ళు! అట్లా అనడానికి వాళ్ళకు బుద్ధి లేకపోతే పోయె వీడి బుద్ధి ఏమయింది?" లలిత నొకసారి ఇక్కడకు పిలుచుకుని రావడం మంచిది" అని రాశాడే. ఏమిటి మంచి వీడి పిండాకూడు," అని కారాలు మిరియాలు మారారు కిట్టావయ్యర్.

"అయినా మీ కింతకోపం పనికిరాదు. మీ చిన్నమామయ్య ఆలోచించకుండా రాసివుండరు. ఒకవేళ అమ్మాయిని తీసుకుని మద్రాసు వెళ్ళినా

తిన్నగా వాళ్ళింటికి పోముకదా—అసలింతకూ ఆ చివరింటాయనతో మంచీ చెడ్డా మాట్లాడి ఏదో ఒకటి తేల్చుకోండి'' అంది సరస్వతమ్మ.

ఆమె చివరింటి ఆయన అని వర్ణించినది చీమాచ్చు అయ్యర్ నే! ఆయన పేరు చెప్పగానే భర్తకోపం తగ్గుతుందని ఆమెకు తెలుసు. ఆమె అనుకున్నట్లే అయింది. కిట్టావయ్యర్ లేచి, తొందరగా భోజనం ముగించి వీధిలోకి వెళ్ళారు.

* * *

ఆ చివరింటి అరుగుమీద అప్పటికే ముగ్గురున్నారు. చీమాచ్చువయ్యర్ అనబడే శ్రీనివాసయ్యర్ చేతిలో పేక ముక్కల కట్టవుంది. పంజు వయ్యర్. అప్పాదురై శాస్త్రిగారలు ''స్వదేశ మిత్రన్'' పత్రిక చెరొక పేజి చదువుతున్నాడు.

కిట్టావయ్యర్ రాగానే శాస్త్రిగారు పత్రికమీదనుండి దృష్టి మరల్చి ''అయ్యర్ గారూ! వార్త తెలుసా? బీహారులో పెద్ద భూకంపమట?'' అన్నారు.

''బీహారులో భూకంపం వచ్చిందో రాలేదో కాని మన రాష్ట్రానికి గాంధీ మహాత్ముడు వస్తున్నాడట'' అంటూ పంజు వయ్యర్ పత్రికలోని పతాక శీర్షికను చూపించారు.

''ఎందుకొస్తున్నాడో తెలుసా? హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించడానికట! మరి భూకంపం వస్తుంది అంటే ఎందుకు రాదూ అంట? ఒక్క భూకంపమేమిటి, తుఫాను, వరదలు, ప్రళయం, మహాప్రళయం అన్నీ విరుచుకుపడి సర్వనాశనమై పోతుంది!''

''అయ్యా శాస్త్రిలుగారూ! పంచాక్షరి జపించే ఆ నోటితో ఇట్లాంటి అవాకులు పేయకండి, కొంపతీసి ఫలించేను'' అన్నారు పంజు వయ్యర్.

''చీమాచ్చూ! నేను ఒక విషయం గురించి నీతో సంప్రతించాలని వచ్చాను—'' అన్నారు కిట్టావయ్యర్.

''అయ్యో, మరి ముందుగా చెప్పకపోయావా? పోదాంపద'' అన్నారు చీమాచ్చు. ఇద్దరూ వెళ్ళారు లోపలికి.

బొంబాయి, మద్రాసులనుండి వచ్చిన వృత్తరాల గురించి వివరంగా చెప్పి—"మరి నువ్వేమంటావు?" అని అడిగారు కిట్టావయ్యర్.

చిమాచ్చు అయ్యర్ తన అభిప్రాయం చెప్పసాగారు.

3

చెన్నపట్నంలోని పద్మాపురం కాలనీలో రావ్ బహదూర్ పద్మలోచన శాస్త్రిగారు తమ రెండవ కొడుకయిన సౌందర రాఘవన్ గురించి చింతిస్తున్నారు.

పెద్ద కొడుకు శంకర నారాయణన్ విషయంలో ఆయనకు తీవ్రమైన ఆశాభంగం కలిగింది. శంకర నారాయణన్ బుద్ధిమంతుడే. బడిలోను, కాలేజీలోను బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్నాడు. బి.ఏ., బి.ఎల్., ఎం.ఎల్ - అన్ని పరీక్షలూ చక్కగా ఉత్తీర్ణుడయాడు. మామగారు, పేరు పొందిన వకీలు అయిన వ్యాఘ్రమయ్యర్‌కు జూనియర్‌గా వృత్తి మొదలు పెట్టాడు. అక్కడే ముప్పు ముంచు కొచ్చింది. మామగారింట్లోనే ఒక భాగంగా లీనమయి పోయాడు వాడు. వాడి వేష భాషలన్నీ అతినాగరికమయిపోయాయి. పై పెచ్చు తన తల్లిదండ్రులను పాతకాలం మనుషులు అని విమర్శించడం దాక వచ్చాడు వాడు.

శాస్త్రిగారి చిన్నబ్బాయి సౌందర రాఘవనూ తెలివగలవాడే. పాఠాలూ పరీక్షలు వాడికి మంచినీళ్ళ ప్రాయం. ఆర్థిక శాస్త్రం ప్రధాన విషయంగా అతడు బి.ఏ. ఆనర్స్ పరీక్షలో రాష్ట్రంలోకెల్లా మొదటి వాడుగా ఉత్తీర్ణుడయ్యాడు. అతడు ఉత్తీర్ణుడయిన సంవత్సరమే పత్రికలలో - రూపాయకు పదహారు పెన్నీలా, పద్దెన్మిది పెన్నీలా, ఏది మంచిది?-అన్న విషయం గురించి

తీవ్రమైన వాదోపవాదం జరిగింది. దీన్ని గురించి సౌందర రాఘవన్ సంపాదకుడికి ఒక లేఖ రాశాడు. ఆ లేఖ పత్రికలో ప్రచురింపబడింది. అనేక ఆర్థిక శాస్త్రజ్ఞుల దృష్టినది ఆకర్షించింది. భారత ప్రభుత్వం వారి ఆర్థిక శాఖాధికారుల దృష్టిని ఆకర్షించింది. ఆశాఖ ప్రధానోద్యోగి సౌందర రాఘవన్ కొక ఉత్తరం రాశాడు. ఇతడు వెళ్ళి ఆయనను కలుసుకున్నాడు. అందు ఫలితంగా సౌందర రాఘవన్‌కు ఆశాఖలో పెద్ద ఉద్యోగం లభించింది.

అంచేత పద్మలోచన శాస్త్రిగారు తమ చిన్నబ్బాయి గురించి గర్వపడేవారు. కాని ఇప్పుడాయనను అతడి పెళ్ళి విషయమే బాధిస్తున్నది. సాధారణంగా తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్ళి విషయం బాధపడడం అనేది సహజం. కాని అందుకు విరుద్ధంగా మగపిల్లల తండ్రి అయిన పద్మలోచన శాస్త్రిగారు బాధపడసాగారు. మొదటివాడే మేలురా బాబూ — అన్నించేటట్లుగా రెండవ కొడుకు చేసాడేమోనని ఆయన ఆరాటం.

ఆయన భార్య కామాక్షమ్మకయితే బెంగ ఇంకా ఎక్కువ.

అయిదున్నరడుగుల విగ్రహం. శిల్పి చెక్కినట్లున్న శరీర సౌష్ఠవం గంభీరమయిన ముఖం; అందంగా దువ్విన జుత్తు; అధునాతనమైన దుస్తులు — ఇదీ సౌందర రాఘవన్ అంటే ... అతగాడు బల్ల దగ్గర కూచుని వున్నాడు. అతడి ఎదుట ఒక ఉత్తరం వుంది. తాను రాయడం మొదలు పెట్టిన వుత్తరమూ ఆ ప్రక్కనే వుంది. ఆనాటి దిన పత్రికలున్నాయి. అన్నిటి కన్న మిన్నగా, ఫ్రేములో బిగించి వున్న అందమైన ఫోటో ఒకటి వుంది.

అతడి చేతిలోని నీలిరంగు కలం ప్రస్తుతం నిశ్చలంగా వుంది. అందమైన ఆతడి ముఖంమీద కోపం, నిరాశ, చిరాకు కనపడుతున్నాయి. మాటిమాటికి నిట్టూరుస్తున్నాడు. అతడి చూపులు ఏదో దూరతీరాల, స్వాప్నికలోకాల విహరిస్తున్నట్లున్నాయి.

ఆరోజు వచ్చిన ఒక వుత్తరానికి జవాబు రాద్దామని కూర్చున్నాడు. సరిగ్గా రాయలేకపోయాడు. మళ్ళీ ఆ వచ్చిన వుత్తరాన్నే చదివాడు.

జి. ఐ. పి. మార్గం.
21-1-34.

"శ్రీ సోదర రాఘవన్ గారికి

నమస్తే.

తమరు బొంబాయికి రాసిన జాబు నేను రైలుస్టేషన్‌కు బయలుదేరుతుండగా అందింది. అందుచేత దీనిని రైలు బండిలో కూర్చుని రాస్తున్నాను.

నాకు మూరమయ్యాక మీ మనస్సు ఏస్థితిలో వున్నదో మీ ఉత్తరం ద్వారా అర్థమయింది. చాల బాధకలిగింది. నన్ను ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా మరచి పొమ్మని మిమ్మల్ని మనసారా వేడుకొంటున్నాను.

ఈ ప్రపంచంలో మీరు సాధించవలసిన కార్యాలెన్నో వున్నాయి. వాటిపట దృష్టి మరల్చారంటే మీ మనస్థితి మారిపోగలదు. మీ మనశ్శాంతి కింకో మార్గం కూడా వుంది.

మీ తల్లిగారిపట్ల నాకు అపరిమితమైన భక్తి గౌరవాలున్నాయి. ఆమె కోడలు కాగల అదృష్టంలేని దౌర్భాగ్యురాలిని నేను. అయినా ఆమెను సదా పూజిస్తుంటాను. సనాతన హిందూ ధర్మమూ, సంప్రదాయమూ మనిషి ఆకారంలో నిలిచినట్లున్న ఆ తల్లి ఈ పతిత పాదాలమీదపడి "నిన్ను వేడుకుంటున్నాను. నాకోర్కె నెరవేర్చు!" అని అడిగింది. అట్లాగే చేస్తానని ఆమెకు మాట ఇచ్చాను. ఆ మాటను నేను ఎట్లాగయినా నిలబెట్టుకుంటాను. ఆ వాగ్దానాన్ని నిలబెట్టు కోవడం అన్నది నా జీవిత భారాన్ని మోసేందుకు వలసిన దీక్షను, దృఢమనోభావాన్ని ఇవ్వగలదని నమ్ముతున్నాను.

మీరు బొంబాయికి రాసిన వుత్తరాన్ని, అంతకు ముందు రాసిన వుత్తరాలను తగలబెట్టాను...ఇంకా అవి ఎందుకు? మీరూ అదే విధంగా నేను రాసిన వుత్తరాలనూ, నా ఫొటోను నిప్పులో పడేయండి.

బీహారులో వచ్చిన భయంకరమైన భూకంపం గురించి మీరు పత్రికలలో చదివే వుంటారు. ఈ ప్రకృతి వైపరీత్యం వలన దెబ్బతిన్న బీహారు ప్రజలకు వివిధ సేవలు చేయడానికి స్వచ్ఛంద సేవకులు కావాలి అని బీహారు నాయకుడు బాబు రాజేంద్రప్రసాద్ చేసిన విజ్ఞప్తిని మీరూ చూసి వుంటారు. ఆ విజ్ఞప్తిని పురస్కరించుకుని బొంబాయినుండి బయలుదేరిన స్వచ్ఛంద సేవక దళంతోబాటు నేనూ వెళుతున్నాను...

దయచేసి నన్ను త్వరగా మరచి పొమ్మని మళ్ళీ ఒకసారి అభ్యర్థిస్తున్న—

తారిణి''

ఈ ఉత్తరం చదివి సౌందర రాఘవన్ నిట్టూర్పులు విడవడం సహజమే కద! ఎంతో కఠినమయిన ప్రశ్నా పత్రాలకు సునాయాసంగా జవాబులు రాసిపడేసిన ప్రతిభాశాలి ఈ జాబుకు జవాబు రాయలేక కొట్టుమిట్టాడడంలోనూ ఆశ్చర్యంలేదు.

పద్మాపురం,

24_1_34.

''కుమారి తారిణీదేవిగారికి

మీరు, రైలులో ప్రయాణంచేస్తూ దయతో రాసిన వుత్తరం అందింది. దానిలో వార్త నాగుండెనెట్లా చీల్చిందో నీకు తెలిస్తేనా...హుం, అందు గురించి నీకు రాసి లాభం ఏమిటి? ఇనుము, కటికిరాయి సనాతన ధర్మాలు కలచి వడబోసిన నీ ఆర్ద్రతలేని హృదయానికి నా ఆవేదన ఎట్లా అవగత మవుతుంది?...''

అంతే, అక్కడితో రాఘవన్ ఉత్తరం ఆగిపోయింది.

ఇంతలో వీధి వైపునుండి ''సార్!'' అన్న పిలుపు వినపడింది.

కాస్త కోపంతో లేచి రాఘవన్ మేడ వరండాలోకి వచ్చి వీధిలోకి చూశాడు.

"ఎవరది?" అన్న రాఘవన్ గొంతువిని ఆవచ్చిన వాళ్ళిద్దరూ కలతెత్తి పైకి చూశారు. వారిలో ఒకరు రాజంపేట గ్రామ మున్సబు కిట్టావయ్యర్, ఇంకొకరు పాత మాంబళం నివాసి, కిట్టావయ్యర్ చిన్న మామయ్య అయిన సుబ్బయ్యర్.

సుబ్బయ్యర్ మొహం చూడగానే ఆయన తన నాన్నగారికి తెలిసినవారని ఎరిగిన రాఘవన్—"ఓ! నాన్నగారికోసం వచ్చారా? ఇదిగో వస్తున్నా తలుపు తీస్తున్నా—" అంటూ వెళ్ళాడు.

"రండయ్యా! లోపలికి రండి, మీరేనా? ఇంకా ఎవరో నమ్మకున్నాను. ఈ కాలంలో తలుపులు తెరిచి వుంచడానికి వీలులేకుండా పోయింది. తెరిచి వుంచితే చాలు అడ్డమైన వాళ్ళూ చొరబడుతుంటారు—" అంటూ పద్మలోచన శాస్త్రిగారు అతిథులిద్దరినీ లోపలికి తీసుకువెళ్ళారు.

"కూచోండి నిల్చుంటా కేమిటి, కూచోండి. సుబ్బయ్యర్ గారూ! పోష్టాలో హాయిగా కూచోండి. మీరు కూచోవడంవల్ల అదేమీ అరిగిపోదు కద... అట్లాంటి 'నాజూకు' పెద్ద మనుషులంటే నాకు గిట్టదు... నేను రామనాథపురం జిల్లాలో సబ్ జడ్జిగా వున్నప్పుడు ఒక ధనికుడింటికి వెళ్ళాను. ఆ ఇంట్లో స్తంభాలకు గచ్చేబులు తొడిగి వున్నాయండీ! నిజంగానే, స్తంభాలకు గుడ్డతో కట్టిన గచ్చేబులు వున్నాయి. అవి నల్లపాల రాతి స్తంభాలు. ఒక్కొక్క స్తంభానికి అయిదువేల రూపాయలు ఖర్చు! అంత అందంగా చెక్కించిన ఆ స్తంభాలకు అడ్డంగా గుడ్డ తెరలు మూనిపుంచారు! ఏమంటారు దానినీ...కనుక హాయిగా కూచోండి..." అని గడగడ మంటూ మాట్లాడారు పద్మలోచన శాస్త్రిగారు. సుబ్బయ్యరూ, కిట్టావయ్యరూ కూచున్నారు.

శాస్త్రిగారు ఒక్కక్షణం ఊపిరి తీసుకోవడానికి మాటలు ఆపినప్పుడు సుబ్బయ్యర్ అందుకున్నారు. "పోయిన ఆదివారంనాడు సర్వజ్ఞ సంఘంలో భాగవతం ఉపన్యాసం జరిగింది. అప్పుడు అత్యంత ఆసక్తిదాయకమైన ఘట్టం ఏమిటి తెలుసా. తమరు భాగవతార్ గారికి కృతజ్ఞతలు తెలిపారే ఆ ప్రసంగం!

ఆహా...ఎంత కష్టంగా మధురంగా వుంది తెలుసా-మాట్లాడితే అట్లా మాట్లాడాలి..."

అయితే శాస్త్రిగారేమీ తక్కువ తిన్నవారుకాదు; ఆయన ముఖస్తుతికి లొంగే ఘటం కాదు.

"అయ్యా! మీలాగే వందమంది వచ్చి ఇట్లా స్తోత్ర పాఠాలు వల్లించి వెళ్ళారు. అద్భుతంగా మాట్లాడానని యోగ్యతా పత్రాలిచ్చి వెళ్ళారు. కాని నేను మాట్లాడిన దాని సారాంశం ఏమిటి ఎవరికన్నా బోధపడిందా అంటే లేదు...సరే అవన్నీ ఇప్పుడెందుకు...వీరినెవరినో పిలుచుకొచ్చారు...నేనేమో ఇంకేదో మాట్లాడుతున్నాను. వీరెవరో చెప్పలేదు మీరు - మొహం చూస్తే కావేరి నదీ జలం తాగిన కళ కన్పిస్తూంది. నిజమేనా?" అని అడిగారు.

"మీకు వెనకటికే మనవి చేశానే రాజంపేట మున్సబుగారని, అక్కిట్టా వయ్యర్ గారే వీరు! ముఖాముఖి ఒకసారి కలుద్దామని రాశాను. వచ్చారు-" అన్నారు సుబ్బయ్యర్.

"అయ్యో' వీరు ఫలానా అని ముందే చెప్పివుండకూడదా? చాలసంతోషం. కిట్టావయ్యర్ గారు వీరేనన్నమాట! మున్సబుగారు మాత్రమేనా, ఇంకా పొలం పుట్రావున్నాయా?"

"అన్ని వున్నాయి. అయ్యర్ గారికి అఖండ కావేరీ తీరాన అరవై ఎకరాల మాగాణి వేల వుంది."

"అలాగా, సంతోషం! మున్సబుగారీ వూరు విచ్చేసిన పనేమిటో? తీరు చూద్దామని వచ్చారా?"

"అబ్బే, మున్సబుగారు చెన్నపట్నం ఇదివరకే చాలసార్లు చూశారు. బొంబాయికి కూడా వెళ్ళివచ్చారు. ఇప్పుడు అల్లుడిని వెతుక్కుంటూవచ్చారు."

"ఓహో! అల్లుడిని చూడడానికా? బలేబలే, సుబ్బయర్ గారూ! ఇన్యూ రెన్స్‌తోబాటు ఈ పని కూడా చేస్తున్నారేమిటి?"

"అబ్బే, అదేమీ కాదు! పోయిన తడవ నేను వచ్చినప్పుడు మీరూఅమ్మ గారూ, ఒకసారి పిల్లను తీసుకొచ్చి చూపిస్తే బాగుంటుందేమో నన్నారు. కుర్తుందా?"

"ఆవునవును! గుర్తొస్తూంది. గట్టిగా మాట్లాడకండి. మేడమీద అబ్బాయి వున్నాడు. వినగలడు...ఆవును, నా అభిప్రాయం అదే. ఈ విషయాలలో నేను కొంత 'మాడర్న్' మనిషినే అనుకోవచ్చు మీరు...అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చాలి. నిజానికి శాస్త్రాలూ ఆమాత్రం చెబుతున్నాయి. ఈ కాలంలో వరకట్నం గిరకట్నం అంటారే అదంతా ఉత్త 'నాన్ సెన్స్!'. నాకు బొత్తిగానచ్చదు. అసలది శాస్త్ర సమ్మతంకాదు."

మధ్యలో సుబ్బయ్యర్ మాట్లాడారు. "అయ్యర్ గారూ! మీరు వాటి గురించి అసలు మాట్లాడక్కరలేదు. కిట్టావయ్యర్ కూతురి పెళ్ళికని ముప్పై వేల రూపాయలు అట్టి పెట్టారు. లాంఛనాలన్నీ కూడా ఏలోటూ లేకుండా తృప్తికరంగా చేయించడానికి సిద్ధంగా వున్నారు."

"ఆ! ఏమి లాంఛనాలు లెండి...పెళ్ళి అన్నది వైదికమైన విషయం. అగ్ని సాక్షిగా పెళ్ళి చేసుకున్నాకనే బ్రాహ్మణుడికి వైదిక కార్యాలు చేయడానికి హక్కు ఏర్పడుతుంది. అయితే పిల్లను, పిల్లవాడని అడగకుండా పెళ్ళి చేసే రోజులు గడిచి పోయాయి...మరి మున్సబుగారు అమ్మాయిని పిలుచుకుని వచ్చారా?"

ఇంతసేపటినుండి మాట్లాడకుండా కూర్చుని వున్న కిట్టావయ్యర్ పలికారు. "తీసుకొద్దామనే అనుకున్నాను కాని ఈసారి వీలుపడలేదు. నా చెల్లెలు బొంబాయిలోవుంది. దానికి ఒంట్లో బాగులేదని వుత్తరం వచ్చింది. అందుకని బొంబాయి వెళ్తున్నాను. మీరు ఒప్పుకుంటే బొంబాయినుండి రాగానే అమ్మాయినిక్కడకు తీసుకుని వస్తాను."

"దానికేం భాగ్యం. మీకెట్లా వీలయితే అట్లా చేయండి. ఇప్పుడు మాఘ మాసమే కదా. అయితే అబ్బాయి సెలవు ముగిసేలోగా పెళ్ళి అయిపోవాలి. ఎక్కువ ఆలస్యం చేయడానికి వీలులేదు. మా ఆవిడా తొందర పడుతూంది. కామాక్షీ! ఇటొకసారివచ్చి పో-" అని పిలిచారు శాస్త్రిగారు.

ఇంటి వెనుక వైపునుండి-"ఇదిగో వస్తున్నా" అన్న స్త్రీ కంఠం. విన్పించింది. శాస్త్రిగారు "రా, రా! నువ్వొస్తేగాని విషయం తేలదు-"అన్నారు. లోపలినుండి ఆమె రావడం గమనించి సుబ్బయ్యర్ "రండమ్మా, రండి!

నేనే, వచ్చాను. ఇదిగో వీరు రాజంపేట గ్రామ మున్సబు కిట్టావయ్యర్-" అన్నారు.

"చాల సంతోషం. అమ్మాయిని కూడా తీసుకుని వచ్చారా" అని కామాక్షమ్మ అడిగింది.

"ఈసారి తీసుకుని రావడానికి వీలులేకపోయింది. బొంబాయిలో వీరి చెల్లెలి ఆరోగ్యం బాగులేదని వుత్తరం వస్తే అక్కడికి వెళ్తున్నారు. జాతకాలు పొంతన కుదిరి, మిగతావన్నీ తేలితే, పిల్లను తీసుకు రావడం ఏమంత పెద్ద పని లెండి—" అన్నారు.

"మిగతావి ఏమి వున్నాయి లెండి? మీకేది ఇష్టమైతే అట్లా చేయండి. అమ్మాయిని తీసుకొచ్చి చూపిస్తే అబ్బాయికి నచ్చితే ఆ తర్వాత ఇక ఏగొడవా లేదు-పెళ్ళి ముహూర్తం నిర్ణయించుకోవడమే-" అంది కామాక్షమ్మ.

ఇట్లా అంటుండగానే మెట్లమీద అడుగుల సవ్వడి విన్పించింది.

రాఘవన్ దిగి వచ్చాడు. ఇందాక చిటపట లాడుతున్న అతడి మొహం ఈ సంభాషణ వినడం వలన కాబోలు మందస్మితంగా వుంది.

మెట్లమీద అడుగుల చప్పుడు వినగానే క్రిందవున్న నలుగురి చూపులూ ఆటుమళ్ళాయి. కిట్టావయ్యరయితే కన్నార్పకుండా చూశారు. కుర్రవాడి గాంభీర్యం అందం ఆయనను ఆకర్షించాయి. అ ఇతను మా అల్లుడయితే లలిత అదృష్టమనే చెప్పాలి...అనుకున్నారు.

అందరినీ ఉద్దేశించి-"ఏదో పెళ్ళి నిశ్చయిస్తున్నట్టున్నారే?" అన్నాడు రాఘవన్.

"ఏదో పెళ్ళికాదు, నీ పెళ్ళి గురించే మాట్లాడుతున్నాము-" అన్నారు శాస్త్రిగారు కాస్త ధైర్యంచేసి. బయటివారి ఎదుట అబ్బాయి ఇంకేమీ ఎక్కువగా మాట్లాడడని ఆయనకు తెలుసు.

"అలాగా? నన్నడగకుండానే నా పెళ్ళి నిశ్చయించేద్దామనుకుంటున్నారా?" అన్నాడు రాఘవన్.

"నిన్నడిగి, నీ ఇష్ట ప్రకారమే చేయాలనేరా నాయనా! పెళ్ళంటే ఒక నాటి విషయం కాదు, నూరేళ్ళ పంట! నిన్నడగకుండా చేయడానికి నువ్వేం పసి వాడివా?" అంది కామాక్షమ్మ.

"ఇన్నిమాట లెందుకురా రాఘవా? అసలు జరిగినదిడి. మన సుబ్బయ్యర్ గారిదివర కొకసారి చెప్పారే, ఆ రాజంపేట మున్సబువీరే! వారి అమ్మాయికి వరుడిని చూద్దామని వచ్చారు. నిన్ను పిలుద్దామనుకుంటుంటే నీవే వచ్చావు. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు. మిగతా వివరాలన్నీ మాట్లాడుకుంటే, అమ్మాయిని ఇక్కడకు తీసుకొచ్చి చూపెడతానంటున్నారు. మంచి వంశం. పేరు ప్రతిష్ఠగల కుటుంబం. నాకు మీ అమ్మకు వచ్చిన సంబంధం. కనుక వీరిని అనవసరంగా ఇబ్బంది పెట్టడంలో అర్థంలేదు. కావాలి అంటే కావాలి అనీ, వద్దంటే వద్దనీ చెప్పివేద్దాం-" అన్నారు శాస్త్రి.

రాఘవన్ మొహంమీద చిరునవ్వు మాయమయింది. చిటపటలాడుతూ చెప్పాడు: "నాన్నా! నన్ను పెళ్ళి చేసుకునేట్లయితే నేనే వారి ఊరికి వెళ్ళి అమ్మాయిని చూస్తాను. ఇక్కడకు తీసుకురానక్కర్లేదు." అతడికి జవాబు చెప్పడానికి ఎవరికి ధైర్యం చాలలేదు. రాఘవన్ కూడా జవాబు కోసం ఆగకుండా వెళ్ళిపోయాడు.

. అతడు వెళ్ళాక కామాక్షమ్మ కిటూవయ్యర్‌ని చూస్తూ-"మీరేమీ ఇదవకండి. రాఘవన్‌ను దారికి తీసుకువచ్చే పూచీనాది. మీరు తొందరగా భోంచాయి వెళ్ళి వెనక్కురండి-" అంది.

4

"జీవీ సదనం" యొక్క వెనుక భాగంలో వంట గదీ, కామాక్షమ్మగారి పూజగదీ వాటి మధ్యను పెద్ద హాలూ వున్నాయి. ఆ హాలులో ఉయ్యాల పీటమీద కూర్చుని రాఘవన్ తల్లి రాక కోసం ఎదురు చూస్తున్నాడు. ఉయ్యాల పీటలాగే అతడి మనసూ ఊగిసలాడుతూంది.

క్రొత్త ఢిల్లీలో ఆర్థిక శాఖలో పై అధికారులను కలుసుకుని వెనక్కి వస్తున్న రాఘవన్ కరాచీ ద్వారా వెనక్కి వద్దామనుకున్నాడు. ఆ సంవత్సరం కాంగ్రెసు కరాచీలో సమావేశమయింది. ఆనాటి లక్షలాది యువకుల లాగే రాఘవనూ కాలేజి విద్యార్థిగా వున్నప్పటినుండే దేశస్వాతంత్ర్యం పట్ల ప్రగాఢమైన వాంఛ కలిగి వున్నాడు. మన సంఘాన్ని బాగుచేయాలన్న కాంక్ష అతడిలో ప్రబలంగా వుంది. జాతి కుల భేదాలు సమసిపోతేగాని దేశం బాగుపడదని అతడి గట్టి విశ్వాసం.

అంచేత నే, ఢిల్లీలో పని కాగానే కరాచీ వెళ్ళి కాంగ్రెసు సభలన్నిటిలో ప్రేక్షకుడిగా పాల్గొన్నాడు. అక్కడ జరిగిన వాటన్నిటినీ చూశాక అతడికి మన జాతీయ నాయకులమీద గౌరవం అధికంకాలేదు. "ప్రపంచం ఎంత ముందజ వేసివుంది! అమెరికాలో ఫోర్డ్ కర్మాగారంలో నిముషానికి 3౧0 మోటారుకార్లు ఉత్పత్తి అవుతున్నాయి! ఇట్లాంటి యంత్ర యుగంలో ఇక్కడ వీళ్లు చేతి రాట్నాన్ని పట్టుకు వేలాడుతున్నారే! గంటకు 800 గజాల నూలు వడకడమట! ఈ వేగంతో మన దేశం ఎన్ని యుగాల తర్వాత ప్రగతిని సాధించగలదు!" అని బాధపడ్డాడు

అప్పుడే కరాచీ · విమానాశ్రయం క్రొత్తగా వెలసింది యంత్ర యుగానికి చిహ్నమయిన విమానాన్ని చూద్దామని రాఘవన్ వెళ్ళాడు. అక్కడ అద్దె విమానాలున్నాయి. అయిదు రూపాయలిస్తే వాటిలో అయిదు నిముషాలపాటు ఆకాశంలో విహరించవచ్చును. విమానం నిముషంలో రెండువేల అడుగుల ఎత్తుకు ఆకాశంలోకి ఎగిరి కరాచీ నగరాన్ని ఒకసారి చుట్టి తిరిగి వచ్చి క్రిందపడిగేది.

ఈ వింత చూడడానికి వందల కొద్ది జనం చేరారు. అక్కడ నిల్చున్న రాఘవన్ ప్రక్కన ఉత్తర భారత దేశానికి చెందిన ముగ్గురు ఆడవాళ్ళు నిల్చు

న్నారు. ఒకావిడ పెద్దది, మిగతా ఇద్దరూ యువతులు. ఆ యువతులలో ఒకతె పొట్టిగా, చామనచాయగా వుంది; అందం అన్నది ఆమెలో లేదనే చెప్పాలి. రెండవ అమ్మాయి. ఆహా...చాల సౌందర్యవతి.శీతాకాలపు ప్రాతఃకాలాల గడ్డిపోచల కొసల మంచు బిందువులు ఉదయిస్తున్న సూర్య కిరణాల బంగారు మిసిమిలో మిలమిలలాడేటట్లు వున్నాయి ఆమె కళ్లు.

అతిశ్రావ్యమైన కంఠంతో ఆమె "మీరు మద్రాసు రాష్ట్రం వారా?" అని ఆంగ్లంలో అడిగినది. రాఘవన్ చెవికి షెల్లీ, కీట్స్ కవితలన్నిటికన్న తియ్యగా వినిపించింది. అవునన్నాడు. "మీరు విమానంలోకి ఎక్కబోతున్నారా?" అని అడిగింది ఆ సుందరి. "అవును. అందుకోసమే వచ్చాను. మీరూ ఎక్కబోతున్నారా?" అని అడిగాడు రాఘవన్. "మీరు ముందు వెళ్ళి తిరిగివచ్చి ఎట్లావుందో చెప్పండి—" అంది ఆ రమణి.

ఆ తర్వాత వారి మాటలనుండి, ఆ అందకత్తె పేరు తారిణి అనీ, వాళ్ళిద్దరూ కాంగ్రెసు సంచ్ఛంద సేవికల దళంలోని వారనీ సమావేశాలు అవగానే తనలాగే కరాచీ నగరమంతా తిరిగి చూస్తున్నారనీ తెలుసుకున్నాడు రాఘవన్.

విమానంలో ఆకాశంలో తిరుగుతున్నంతసేపు రాఘవన్ మనసు భూమి మీదే తిరిగింది.

విమానం నుండి దిగగానే అతడి కళ్ళు ఆ స్త్రీలున్న వైపు తిరిగాయి. తారిణి ఆతురతతో అతడినిచూచి అడిగింది—"ఎట్లావుంది?" తన మనస్సు క్రిందే సంచరించిదన్న నిజం చెప్పలేని రాఘవన్, విమాన ప్రయాణం అద్భుతంగా వుందని వర్ణించి చెప్పాడు. "మరి మీరు ఎక్కరా విమానం?" అని అడిగాడు. నిరాశ నిండిన స్వరంతో తారిణి "లేదు. వీళ్ళిద్దరూ భయపడుతున్నారు. నన్నూ వెళ్ళవద్దంటున్నారు." అని చెప్పింది.

"భయం ఎందుకు? ఈ విమానంలో పైలట్ కాక ఇంకొక్కరికి మాత్రమే చోటుంది. ఇంకా సీట్ లుంటే నేనే మీతోబాటు వచ్చేవాడిని" అన్నాడు ఆశాభంగం పొందిన వాడిలా రాఘవన్.

"సరే, ఇంక మనం వెళ్దామా?" అంది ఇంకొక యువతి. తారిణి రాఘవన్‌ను చూచి "మేము వెళ్ళాలి" అని నడవసాగింది. కాస్త దూరం వెళ్ళి వాళ్ళు టాక్సీ ఎక్కుతుండగా తారిణి తన వైపు చూచినట్లు అన్నిపించింది రాఘవన్‌కు. అన్నిపించడమేమి, నిజంగానే చూచిందేమో?

విమాన యాత్రను అనుభవించిన రాఘవన్ నౌకాయానమూ ఎట్లావుంటుందో చూద్దామనుకున్నాడు. కరాచీ కాంగ్రెసు సమావేశానికి వచ్చినవారు చాల మంది సముద్ర మార్గాన బొంబాయికి వెళ్ళసాగారు. రాఘవనూ సింధియా కంపెనీవారి నౌక ఒక దానిలో పయనించడానికి టిక్కట్టు కొనుక్కున్నాడు. ఆ నౌక తీరాన్ని అంటిపెట్టుకునే ప్రయాణంచేసే నౌక. దాని నిండా బస్తాలు, బుట్టలూ, పెట్టెలూ, పడకలూ, ప్రయాణీకులు-అంతా క్రిక్కిరిసివుంది. ఆ జనుల మురికి దుస్తులూ, వాళ్ళ చేతలు, మాటలు విని "బాబోయ్! ఈ నౌకలో ముప్పై ఎనిమిది గంటలసేపు ఎట్లా ప్రయాణం చేయడం—" అని మండిపడ్డాడు రాఘవన్. కాని నౌక తీరా బయలు దేరుతుండగా వచ్చి, నిచ్చెన ఎక్కి, నౌకలోకి వచ్చిన ముగ్గురు స్త్రీలను చూడగానే రాఘవన్ మనోభావం పూర్తిగా మారిపోయింది. ఆ క్రిక్కిరిసిన, కంపుకొట్టే మనుషులున్న పాత నౌక గంధర్వలోకం అయింది. తారిణిని చూడగానే మనసులో నిండిన ఆనందం ఆశ్చర్యం తారిణి మొహంలో కన్పించింది. అది గ్రహించాడు రాఘవన్.

రాఘవన్ ఉత్తర దేశానికి రావడం అది మొదటిసారి. కాని తారిణి బొంబాయి వాసి. అంచేత ఆమెనుండి ఉత్తరాదివారి గురించి తెలుసుకోదగిన విషయాలెన్నోవున్నాయి. అట్లాగే దక్షిణ దేశం గురించి తారిణి రాఘవన్ నడిగి తెలుసుకోవలసిన దెంతో వుంది. ఇద్దరూ మాట్లాడుకోవడానికి ఎన్నో ఖబుర్లున్నాయి. తారిణికి తమిళం మాట్లాడడం వచ్చునని తెలిసి రాఘవన్‌కు ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

ఆ నౌకలో తారిణి, ఆమె నెచ్చెలి నిరుపమవలెనే ఇంకా ఎందరో దేశ సేవికలున్నారు. తారిణి అందాన్ని ఎత్తిచూపించడానికా అన్నట్లు ఆమె ప్రక్కనేవున్న నిరుపమ అందమైనది కాకపోయినప్పటికి ఆమె స్వరం చాల

శ్రావ్యమైనది. ఆమె నాయకత్వాన అందరు దేశ సేవికలూ హిందీ జాతీయ గీతాలు పాడారు. అప్పట్లో బాగా ప్రచారంలోవున్న "ఝండా ఊంచా రహే హమారా!" అన్న జెండా పాట పాడారు. ప్రసిద్ధ ఉర్దూకవి ఇక్బాల్ రచించిన "సారేజహాఁసే అచ్ఛా హిందుస్తాన్ హమారా!" అన్న జాతీయ గీతం పాడారు. ఈ గీతాలన్నీ సాక్షాత్తూ గంధర్వ కన్నెలే వచ్చి కూచుని పాడుతున్నట్లనిపించింది రాఘవన్‌కు. ఇక్బాల్ పాటకు అర్థం తారిణిని అడిగి తెలుసుకున్నాడు రాఘవన్. "ప్రపంచ దేశాలన్నిటిలోనూ మన భారతదేశమే ఉత్తమమైనది" అని ఆమె అర్థం చెప్పగా విని "ఔను. అందులో సందేహం ఏముంది? నీవంటి ఆడది పుట్టిన ఈ దేశం కాకపోతే ఇంకే దేశం ఉత్తమమైనది కాగలదు?" అన్నాడు. అదివిన్న తారిణి బుగ్గలు సిగ్గుతో ఎరుపెక్కడం ఈనాటికీ మరచిపోలేదు రాఘవన్.

ఇదంతా జరిగి మూడేళ్ళయింది. ఈ మూడేళ్ళ కాలంలోనూ రాఘవన్ తారిణిల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. అంతేకాదు; రాఘవన్ ఒకసారి బొంబాయి వెళ్ళాడు. తారిణి అతడిని ఎలిఫెంటా గుహలకు తీసుకు వెళ్ళి అక్కడి శిల్పసౌందర్యం గురించి చెప్పింది. తర్వాత ఢిల్లీకి వెళ్ళింది తారిణి. అప్పుడక్కడ ఉద్యోగం చేస్తున్న రాఘవన్ తారిణిని ఎర్రకోట, కుతుబ్‌మినార్, జుమ్మామసీదు మున్నగుచోట్లకు తీసుకువెళ్ళి అన్నీ చూపించాడు.

ఈ మూడేళ్ళూ చకచక గడిచి పోయాయి. ఉద్యోగరీత్యా పైపైకి వెళ్ళాడు రాఘవన్. అతడి శాఖలో పై ఉద్యోగి అయిన దొరగారు రాఘవన్‌ను తనతోబాటు ఇంగ్లండుకు తీసుకు వెళ్తానని చెప్పారు. రాఘవన్ ఏమో ప్రేమ లోకంలో విహరిస్తున్నాడు. ఎటు చూచినా ఆతడి కళ్ళకు భవిష్యత్తు బాగారమై మెరిసింది. ఏది విన్నా గంధర్వ గానమనిపించింది.

ఆహా! ఆ ఆనందాని కిప్పుడు అంత్యకాలం వచ్చిందా? ఎట్లా వచ్చిందిస్? ఎందుకు వచ్చింది? నమ్మశక్యం కావడంలేదే?

* * *

అరచిన వాళ్ళు వెళ్ళిపోయాక కామాక్షమ్మ వెనకవైపు హాలులోకి వచ్చింది. ఛిన్నవదనుడై ఉయ్యాల పీటమీద కూర్చుని నెమ్మదిగా ఊగుతున్న కొడుకును చూచింది. ఆ ప్రక్కనే గోడవారగా వున్న కుర్చీమీద కూచుంది.

ఉన్నట్టుండి తలెత్తి అమ్మను చూసి అడిగాడు రాఘవన్. "అమ్మా! నువ్వూ నాన్నా కలిసి నా జీవితాన్ని నాశనం చేయాలనుకుంటున్నారా? మీకు సంతోషంగా వుండడం మీ కిష్టం లేదా? నాన్నలాగే నిన్నుకూడా స్వార్థం పీడించ సారంభించిందా?"

�ట్లాగే ఏదో అడుగుతాడని ఎదురు చూచిన కామాక్షమ్మ తత్తరపాటు తేకుండా, నిదానంగా బదులు చెప్పింది.

"ఒకేయ్ రాఘవా! మీ నాన్నగారి విషయం నన్నడగకు...నాకు సంబంధించినంతవరకు ఇదిగో, చెబుతున్నా-విను". నిన్ను కన్న నాటినుండి వేటిదాక 'ఈ ఘడియ నాలుగు సంవత్సరాలుగా నీ సంతోషం తప్ప నాకు వేరే ఆశయం లేకేలేదు. నీ సంతోషం కన్న నాస్వార్థం నాకు ఎక్కువ అని అనుకోరా అబ్బాయ్!" అని కండ్లనిండిన నీటిని తుడుచుకుంది కామాక్షమ్మ.

"నాసంతోషమే నీ ఆశయం అయితే మరి తారిణిని అట్లా తరిమివేశా వెందుకుళి" అని మండి పడుతూ అడిగాడు రామవన్.

"అయ్యో! ఇదేమి అభాండంరా! నేనా పిల్లను తరిమివేశానా? నిజంగా చెప్పరా, నేను తరిమితే వెళ్ళిపోయే పిల్లేనా తారిణి? నీమీద దానికి నిజంగా ప్రేమవుంటే నేను చెప్పినంత మాత్రాన వెళ్ళిపోతుందా, ఆలోచించు—!" అంది.

"మరయితే నేను లేనప్పుడు ఇక్కడ నిజంగా జరిగినదేమిటంటావు?" అని అడిగాడు కాస్సేపు ఆలోచించాక రాఘవన్.

"అయ్యో! ఆ పిల్ల చెప్పిన మాటలన్నీ నేనెట్లా చెప్పనురా? ఆవిడ ఏమేమో అనుకుని ఇక్కడకు వచ్చిందట...తీరా వచ్చి చూస్తే ఆకాశంగం కల్గిందట. నేనూ మీనాన్న పాతకాలపు ఛాందసులమట! మమ్మల్ని ఎన్నన్నా ఫరవా లేదు కాని నిన్ను ఆ పిల్ల మొద్దు అని అన్నదిరా—అదే నాకు. చాల బాధని

పించింది. చీరకట్టుకున్న ఆడది ఎవతె కనిపించినా దాని వెంబడి పడిపోతావట నువ్వు-నీకు బుద్ధి చెప్పిపోదామని తాను మద్రాసు వచ్చిందట. ఇంకా ఏవేవో దుర్భాషలాడింది. నేను సహించలేకపోయాను—" అంటూ కామాక్ష్మి కళ్ళను చీరె కొంగుతో తుడుచుకుంటూ ఏడవ సాగింది.

రాఘవన్‌కు విపరీతమైన కోపం వచ్చింది. కాని ఆ కోపం అమ్మమీదనా, తారిణిమీదనా అని అతడికే తెలియలేదు.

తారిణి రాసిన వుత్తరంలోని ఒక విషయం హఠాత్తుగా గుర్తొచ్చింది. "అమ్మా! ఏడుపు మాను! ఇంకొకే ప్రశ్నకు జవాబు చెప్పు—నీవు తారిణి పాదాలు పట్టుకుని ఏదయినా అడిగావా?" అని అడిగాడు రాఘవన్.

"ఓహో! ఆ విషయం రాసిందా? అది మరి ఇంకా ఏమేమి కల్పించి రాసిందో కాని జరిగింది ఏమిటో చెబుతా విను. ఆ అమ్మాయి నన్ను అక్ష్య పెట్టుకుండా మాట్లాడేసరికి నాకు భయమన్పించింది. అమ్మాయ్! ఎట్లాగయినా వాడు సుఖంగా వుండాలన్నదే నా ప్రార్థన. జాతి, కులం, నడవడి అన్నీ వేరుగా వున్నా మా భాష మాట్లాడుతున్నావే అదే పదివేలు - నేను నిన్ను ప్రార్థించేదెల్లా ఒక్కటే-నన్ను నా బిడ్డను వేరు చేయకు! వాడూ నువ్వూ ఎక్కడవున్నా, ఎక్కడకు వెళ్ళినా నన్ను మీతోబాటు తీసుకు వెళ్ళండి. మీ ఇద్దరికి సేవచేయడం తప్ప నాకు ఇకపై వేరే సంతోషం ఏమున్నది? ఈ ఒక్క కోరికను మన్నించు! నీపాదాలంటి వేడుకుంటాను-" అని ఆమె పాదాలు ముట్టుకున్నానంతేరా, రాఘవా! నేను చెబుతున్నది నీకు నమ్మడానికి కష్టంగా వుండవచ్చును. ఆ పిల్ల అట్లా అకస్మాత్తుగా ఎందుకు వెళ్ళిందో నాకు అర్థం కాలేదు. అదిక్కడ వుండగా ఎవడో ఒకడు వచ్చి తలుపుతట్టి—"తారిణిగారున్నారా?" అని అడిగాడు. అది వెళ్ళి ఏదో ఉత్తరం తీసుకోచ్చింది. ఉత్తరాన్ని చదివాక— "ఇక నేను వెళ్తాన్తాను మీ అబ్బాయిని చెడుపుతానని భయపడకండి—" అని చెప్పి గబగబ వెళ్ళి వాకిట్లో నిల్చున్న, కాయలో ఎక్కి వెళ్ళిపోయింది. ఆ తొందరలో ఆ పిల్ల ఏ వుత్తరాన్ని ఇక్కడే జార విడిచి వెళ్ళింది. దానిని తీసి వుంచాను. కావా

లంకే చూడు.'' అంటూ లోపలికివెళ్ళి భద్రంగా దాచివుంచిన వుత్తరాన్ని తీసుకొచ్చి రాఘవన్ కిచ్చింది ఆమె.

గుండె అదురుతుండగా ఆ వుత్తరం చదివాడు రాఘవన్.

''ప్రియా! నా పని అనుకున్న దానికన్న ముందుగానే ముగిసింది. ఇవాళ సాయంకాలం తప్పకుండా బొంబాయి వెళ్ళాలి. మెయిల్‌కు వెళ్ళాలి. నువ్వు హోటల్‌కు రాలేకపోతే తిన్నగా స్టేషన్‌కేవచ్చి కలుసుకో. నీకు టిక్కట్టు కొని వుంచుతాను. మిస్టర్ రాఘవన్‌గారి ప్రణయ ప్రకోపం ఎట్లావుంది? అతడికి రెండువేల రూపాయల జుల్మానా విధించినది చాలులే...ఇంకా అతడిని శిక్షించకు! ఏదన్నా వైపరీత్య జరగ గలదు!''

ఇది చదువుతుండగానే రాఘవన్ కండ్లు చింత నిప్పులయ్యాయి. అతడి గుండె అగ్నిపర్వతమయింది. ఊపిరి వడగాడ్పులా లేచింది. శిలలాగు హుర్ఛాండిపోయిన రాఘవన్ కాస్సేపటికి తటాలున లేచాడు. అమ్మ ముందరకువెళ్ళి నేలమీద పడుకుని ఆమె పాదాలకు సాష్టాంగ ప్రణామం చేశాడు.

''నావంటి మూఢుడులేడు. తారిణి చెప్పింది నిజమే. దాని పాదాలమీద పడవలసిన స్థితికి నిన్ను దిగజార్చాను కదా—ఈక్షణంనుండి నువ్వే నాదైవానివి. నువ్వు చెప్పినట్లే నేను వింటాను. నువ్వు ఎవరిని పెళ్ళి చేసుకోమంటే ఆ పిల్లనే పెళ్ళాడుతాను'' అన్నాడు.

5

బొంబాయిలో దాదర్‌లో కనుక్కోవడం కష్టమైన ఒకవీధి; ఆనవాలు పట్టడం కష్టమైన ఒక ఇల్లు.

ఆ ఇంటి నాలుగో అంతస్తుమీద, మూడు గదుల వాటాలో, కిటూవయ్యర్ చెల్లెలు రాజమ్మాళ్ గత ఇరవై సంవత్సరాలుగా కాపురం చేస్తూంది. ఈ

రెండు దశాబ్దాల దాంపత్య జీవితంలోని ఇష్టకష్టాలన్నీ ఆవాటాలోనే గడిచాయి. బిడ్డలను కనిపెంచిన దక్కడే; బిడ్డలను కోల్పోయి కన్నీరు కార్చినదీ అక్కడే; మొగుడితో ఆనందంగా గడిపినదీ అక్కడే; అతగాడి దుర్వ్యసనాల గురించి దుఃఖించినదీ అక్కడే.

ఆమూడింట ఒక గదిలో గత ఇరవై దినాలనుండి బ్రతుకుతోంది అన్న ఆశను కోల్పోయి మంచంమీద పడుకుని వుంది రాజమ్మాళ్.

సీత బడికి వెళ్ళడం మానేసి ఏడాది అయింది. తన కూతురు ఏ ఇంటి తోడటు కావలసి వస్తుందో ఏమోనని రాజమ్మాళ్ సీతకు వంట ఇంటి పనులు అన్నీ నేర్పించింది. ఇప్పుడు నిజంగా సీత ఎంతో సాయంగా వుంటూంది.

సీత మేడ వరండాలో నిల్చుని ఆతురతతో వీధివైపు చూస్తూంది. లోపలనుండి "సీతా!" అన్న క్షీనస్వరం విన్పించగానే "వస్తున్నానమ్మా" అని సీత లోపలికి పరుగెత్తింది.

"సీతా! ఏదో కారు చప్పుడయిందే—"

"లేదమ్మా! అది ఇంకెక్కడికో వెళ్తున్న కారు...ఇంకా టైము కాలేదుగా...అసలు రైలుబండి ఈపాటికి వచ్చి వుంటుంది. స్టేషన్‌కుండి ఇంటికి రావడానికి పావు గంటయినా పడుతుంది—"

ఈలోగా మళ్ళీ కారాగిన శబ్దం వినిపించింది. సీత వరండాలోకి పరుగెత్తి వెళ్ళి తొంగి చూడగా ఒక కారు గుమ్మం ముందు ఆగివుండడం కన్పించింది. "అమ్మా! మామయ్య వచ్చేశాడు. నేను క్రిందికి వెళ్తున్నాను—"అని చెబుతూ సీత గబగబ మెట్లుదిగి క్రిందకు వెళ్ళింది. దారిలో, చేతిలో తోలుపెట్టెతో డాక్టరు ఎదురవడం చూసి టక్కున ఆగిపోయింది. "డాక్టరుగారూ! ఇప్పుడు వచ్చింది మీకారా? ఊరినుండి మా మామయ్య వచ్చాడనుకున్నాను!" అంది. "ఓహో! ఇవాళ మీ మామయ్య వస్తున్నాడా? ఆయన వచ్చాకైనా మీ అమ్మ ఆరోగ్యం బాగుపడుతుందేమో చూద్దాం!" అన్నారు డాక్టరు. అలవాటు ప్రకారం సీత డాక్టరుగారి దగ్గరనుండి తోలు సంచీ తీసుకుంది. ఇద్దరూ కలిసి మౌనంగా మేడమెట్లు ఎక్కారు.

డాక్టరు యథావిధిగా అన్ని పరీక్షలుచేసి 'ప్రిస్క్రిప్షన్' రాస్తుండగా దొరై స్వామీ, కిట్టావయ్యరూ వచ్చారు.

రాజంను చూసి కిట్టావయ్యరు నిరుత్తరులయ్యారు.

స్వగ్రామం నుండి బయలుదేరినప్పుడు కిట్టావయ్యరు మనస్సు బాగులేదు. కాని మదరాసులో పద్మలోచనశాస్త్రిగారింటికి వెళ్ళి 'అల్లుడి'ని చూశాక కొంత ఉత్సాహం కలిగింది, ఈ సంబంధం ఖాయం అయినట్లేనని సుబ్బయ్యరు చెప్పడంతో కిట్టావయ్యరుకు మరికొంత ఉత్సాహం కలిగింది. ఆ ఉత్సాహంలో 'రాజానికి' ఒళ్ళు మరీ అంత బాగుండకపోదులే' అనుకుంటూ బొంబాయి చేరారు.

అంచేత చాల రోజులనుండి జ్వరంతో మంచంపట్టి, పాలిపోయివున్న రాజమ్మాళ్ను చూడగానే ఆయన మనస్సు కలుక్కుమంది. కండ్లనీరు కుమ్ముకొస్తుండగా ఆయన డాక్టర్ని అడిగారు—" డాక్టర్‌గారూ! రాజానికి ఒంట్లో ఎట్లా వుంది?"

"మీ చెల్లెలికి శరీర వ్యాధి ఒక వంతయితే, మనోవ్యాధి మూడింతలు. "ఈ జబ్బు నయం కాదులే" అని తీర్మానించుకుని కూచున్నారీవిడ. ఇంక నేవెవ్వి మందులిస్తే ఏమిలాభం? కాని ఇప్పుడు మీరు వచ్చేశారుగా - ఇక నయమయిపోతుందేమో లెండి."

డాక్టర్ బయలుదేరారు. ఆయనను సాగనంపడానికి దొరై స్వామి వెళ్ళారు.

కిట్టావయ్యర్ తన ప్రియసోదరి ప్రక్కనవెళ్ళి కూర్చున్నారు. ఇంతవరకు ఆయువ కళ్ళల్లో క్రమ్ముకొస్తున్న నీరు పొంగి పొర్లింది. ఉత్తరీయంతో కళ్ళు నీళ్ళు తుడుచుకుంటూ "అయ్యో! నిన్ను అధైర్యపరుస్తున్నాను! ఇన్నిరోజుల నుండి నీగురించి పట్టించుకోకుండా వున్నానే అనిపించి నప్పుడల్లా నాకు దుఃఖము ఆగడంలేదు" అన్నారు.

"అన్నయ్యా, యిందులో నీతప్పేముంది? నాగురించి పట్టించుకొని మాత్రం నీవు చేయగలిగిందేముంది? నాకర్మ నేను అనుభవించక తప్పదు కదా! కాని ఈసారి మాత్రం నీవు వస్తావో, రావో అని బెంగపడ్డాను.

నీవు వచ్చావు. నా మనస్సులో వున్నదానిని నీకు చెప్పివేస్తే నా హృదయ భారం తగ్గుతుంది. అటు పిమ్మట ప్రశాంతంగా కళ్ళుమూసుకుని ఆపరమాత్ముడిని చేరుకుంటాను!". విపరీతంగా వస్తున్న వెక్కిళ్ళను ఏడ్పును ఆపుకుంటూ కిట్టా వయ్యరు "ఛీ, పిచ్చిదానా! ఏమిటీ మాటలు నీకేమీకాదు. సీతకు వెళ్ళిచేసి మనుమళ్ళను మనుమరాళ్ళను చూస్తూ హాయిగా వుంటావు." అన్నారు.

ఆ మాటలమీద నమ్మకం లేనట్లు బలహీనంగా చిరునవ్వు నవ్వింది రాజం. చావు కళ కనబడుతూన్న ఆమె మొహానికి ఆ చిరునవ్వు ఒక వింత కాంతిని ఆపాదించింది.

గది గుమ్మం దగ్గర కన్నీటితో సీత నిలుచుని వుండటం చూసిన రాజం ఆమెను సైగచేసి దగ్గరకు పిలిచింది.

"సీతా వూరినుండి మామయ్య వచ్చారు కదా, కాఫీ యివ్వవద్దటమ్మా?" అని రాజమ్మాళ్ అనగానే, "ఇదిగో, ఒక్క నిమిషంలో పట్టుకొస్తానమ్మా!" అని వంట గదివైపు పరుగెత్తింది సీత.

సీత అటు వెళ్ళగానే రాజం "అన్నయ్యా! తరువాత ఎట్లా వుంటుందో, ఏమో? అవకాశం వుంటుందో, ఉండదో? నీకు చెప్పవలసిన దానిని వెంటనే చెప్పివెయ్యాలి. అందుకు ముందుగా ఒక పనివుంది. నీవు ఏదైనా పెట్టెలాటిది తీసుకొని వచ్చావా? తెచ్చివుంటే దాన్నిటు తీసుకొనిరా!" అంది. ఆమె తొందరపాటుకు కారణం ఏమిటో తెలియని కిట్టావయ్యరు పెట్టె తీసుకొచ్చాను వసారాలో వుంది. దాంతో యిప్పుడు అవసరం ఏమిటి?" అన్నారు.

"అవసరం వుందన్నయ్యా! నీవు ముందు వరండాలోకి వెళ్ళి ఈయన డాక్టరుతోబాటు కారులోకి ఎక్కడా చూడు. సాధారణంగా మందులు తీసుకొని రావడానికని వెళ్తారు?" అంది రాజం.

"నీవు యింతలా ఎందుకు మాట్లాడుతున్నావు? నేనేమీ యివాళ కాకపోతే వెళ్ళిపోవడం లేదే! తాపిగా మాట్లాడుకోవచ్చుగదా!" అని కిట్టావయ్యరు చెబుతూండగా అడ్డంవచ్చి రాజమ్మాళ్ "అన్నయ్యా! నీకు పుణ్యంవుంటుంది దయచేసి నేను చెప్పినటు చెయ్యి యిది. చాలా ముఖ్యమైన విషయం." అంది.

ఆపైన ఆమెతో వాదించి లాభం లేదనుకుని కిట్టావయ్యారు వరండాలోకివెళ్లి క్రిందికి చూశారు. రాజం చెప్పినట్లు దుర్గాసామి కారులోకి ఎక్కుతున్నారు. కిట్టావయ్యారు వసారాలో వున్న తనపెట్టెను తీసుకొని లోపలికి వచ్చారు.

"అన్నయ్యా త్వరగా ఆపెట్టెను తీసుకొనివచ్చి నాదగ్గరపెట్టు! తలుపులు మూయి!" అంది రాజం.

కిట్టావయ్యారు అట్లాగేచేసి చెల్లెలు చేస్తున్న పనిని ఆశ్చర్యంతో చూస్తూ నిలుచుండి పోయ్యారు.

రాజం తటాలున లేచి కూచుని తలవైపున్న రెండు తలగడాలలో ఒక దానిని చేతిలో తీసుకుంది. తొందర తొందరగా దాని గలేబు తీసివేసి, ఆ తలగడా ప్రక్క కుట్లను విప్పింది. తలగడా ప్రత్తి మధ్యలోకి చేయిపెట్టి బయటికి తీసింది. మొదట రెండు—మూపాయల నోట్ల కట్టలు బయిటికి వచ్చాయి. తరువాత చాలా అందమైన అమూల్యమైన రత్నహారము ఒకటి బయటికి వచ్చింది.

"అన్నయ్యా! అన్నయ్యా! ఈ రెండువేల రూపాయలను ఈ రత్న హారాన్ని నీపెట్టెలో బద్రంగా దాచు! తొందరగా దాచు!" అంది.

కిట్టావయ్యారు ఒక్కక్షణం వెనుకాడాడు. అతడి మనసులో ఎన్నెన్నో సందేహాలు వుదయించాయి. మరుక్షణం ఏదో విచిత్రమైన కలకటున్నట్లుగా, ఆ డబ్బునూ హారాన్నీ అందుకుని పెట్టెలో పెట్టారు. పెట్టెకు తాళంవేసి తరువాత చెల్లెలిని చూశారు.

"అన్నయ్యా నేను చెప్పవలసిందంతా చెప్పకుండా చచ్చిపోను. చెప్పకుండా చస్తేనా ఆత్మకు శాంతి వుండదు!..."

"రాజం, నీవు పిచ్చిపిచ్చిగా వాగకు! నోరుమూసుకుని వుంటే చాలు నేను నిన్నేమి అడగనులే!" అన్నారు కిట్టావయ్యారు.

రాజం కాసేపు వూరుకుంది. ఎగశ్వాస అలసట తగ్గాయి.

"నీవు అడగవు కాని నేను చెప్పక తప్పదు. ఇప్పుడు యిచ్చిన రెండు వేల రూపాయలు రత్నహారమూ సీత పెళ్ళి నిమిత్తమని నీచేతికి యిచ్చాను.

సీతకు పెళ్ళి నీవే చెయ్యాలి. దానిని నీతోబాటు తీసుకెళ్ళి మనవైపు మంచి సంబంధం చూసి పెళ్ళి చేసిపెట్టాలి. చేస్తాను—అని నోరు తెరిచి చెప్పు. చెబితేగాని నా మనస్సు శాంతించదు. ఆ మాటవింటే, డాక్టరు చెప్పినట్లు ఆరోగ్యం బాగయినా బాగవవచ్చు!"

"రాజం! ఇందుకోసం నువ్వు నోరు తెరిచి అడగాలా? సీత నాకూతురు లలిత వంటిదే కాదా? సీతనట్లా వదలి వేస్తాననుకున్నావా? తప్పకుండా సీతకు మనవైపే మంచి సంబంధం చూచి పెళ్ళి చేద్దాము. నువ్వూ చూస్తావు కదా? అయినా సీత పెళ్ళికని నువ్విట్టా మీ ఆయనకు తెలియపండా డబ్బు కూడబెట్టి నాకివ్వాలా? ఈ విషయం తెలిస్తే దుర్వాస్వామి నీగురించిగాని నాగురించిగాని ఏమనుకుంటాడు?-ఏమో, నాకు ఈ నీ పని నచ్చలేదు—"

"ఆగు అన్నయ్యా! నే చెప్పేది విను. నేనేమీ చేయరాని పని చేయ లేదు. ఆయన డబ్బు నుంచి నేను చిల్లి గవ్వ తీసుకోలేదు, సరికదా ఆయనకు అవసరం వచ్చినప్పుడు - మీరు పెట్టిన నగలూ, ఆయన మొదట్లో కొనిచ్చిన నగలూ - అన్నీ అమ్మి నేనే ఆయనకు డబ్బు ఇచ్చాను. ఇక ఇంటి ఖర్చు లలో మిగల్చడం అన్నది ఈ బొంబాయి మహానగరంలో వీలుకానిపని. ఇక్కడ కాపురం చేసిచూస్తే నీకు నామాటలు బోధపడగలవు. ఈ డబ్బూ, హారమూ సీత పెళ్ళికని దేవుడు దయతలచి ఇచ్చినవి. ఎట్లా ఇచ్చాడన్నది ఒక పెద్ద కథ. ఆ కథలాటి నిజాన్ని నువ్వు నమ్మినా, నమ్మక పోయినా నీకు చెబుతాను, విను అన్నయ్యా! కాని ఇప్పుడు నేను చెప్పబోయే దానిని సీతకుకాని, వాళ్ళ నాన్నకుకాని, ఇంకెవరికికాని, తెలియనివ్వకు. అక్కడ మనింట్లో వదినకుకూడా తెలుపకు.

* * *

"చెప్పనులే, ఎవరికీ చెప్పనులే...కాని నువ్వుకూడా నాకసలు చెప్పకుండా వుండడమే మంచిది. మాట్లాడిన కొద్దీ నీకు ఆయాసం ఎక్కువవుతుంది. నిన్నిట్లా ఆలసటపెట్టడానికేనా నేను బొంబాయి వచ్చిందిరా!"

"నాకేమీ అలసట లేదు. నే చెప్పేది విను!" అంది రాజమ్మాళ్... "నేను ఈ సారి పడకపెట్టి ఇరవైరోజులయింది. ఆ మొదటి రోజు, శుక్రవారం సాయింకాలం గౌరీదేవి పటం ఎదుట దీపం వెలిగించి నమస్కారంచేశాను. తల్లీ! పార్వతీదేవీ! నా బిడ్డ సీత నొక ఇంటిదానిని చేసేభారం నీదేనమ్మా" అని మొక్కుకున్నాను. ఒంట్లో బాగులేదనిపించింది. ఇటువచ్చి, ఈ మంచం మీద పడుకున్నాను, సీతేమో దాని స్నేహితురాలిని చూచి వస్తానని వెళ్ళినది. ఈయనేమో ఆఫీసునుండి రాలేదు. నన్ను నిద్రలాటిమత్తు ఆవరించింది.

"మెలకువ వచ్చి కళ్ళు తెరిచి చూసేసరికి, దగ్గరగా వేసివున్న గది తలుపులు తెరచుకున్నాయి. అసలు ఆ తలుపులు తెరిచిన చప్పుడుకే నాకు మెలకువ వచ్చిందేమో...తలుపులు తెరుస్తున్నది సీతా, లేక వాళ్ళ నాన్నా అని చూస్తుండగా అపరిచితురాలయిన ఒక స్త్రీ లోపలికి వచ్చింది.

"దగ్గరకు వచ్చి 'రాజమ్మాళ్ నువ్వేనా?' అని అడిగింది. హిందీలో అడిగింది. నాకు హిందీ వచ్చుగాని ఆ వచ్చిందెవరో తెలియని ఆ పరిస్థితిలో నోటమాట రాలేదు.

"అంటనే ఆ వచ్చిన స్త్రీ నిర్దిష్టమైన స్వరంలో- "ఇదిగోనమ్మా! నీ నొక ముఖ్య కార్యార్థం వచ్చాను. ఊసుపోకకు రాలేదు. దురైసామి అయ్యర్ భార్య రాజమ్మాళ్ నువ్వేనా?" అంది. "ఔను" అన్నాను హీన స్వరంతో. "ఎట్లా నమ్మడం?"ంటూ నాలుగుపైపుల చూచిన ఆమె కంటబడి మీది ఫోటోలు పడ్డాయి. దగ్గరకు వెళ్ళి చూచింది. చూచి మళ్ళి వాదగరకు వచ్చి-" అవును, రాజమ్మాళ్ నువ్వే!" అంది. వెళ్ళి తలుపులను మూసి వచ్చింది. నాపైపు వీపుపెట్టి తన చేతిలోని తోలుపెట్టెను తెరిచింది.

"రాజమ్మా! నేనిప్పుడు చెప్పబోయేది వింతగా అనిపించవచ్చును. కాని ఇందులో వింత ఏమీ లేదు. అసలు విషయం ఏమిటో తర్వాత చెబుతాను. ముందు ఇదిగో ఈ రెండువేల రూపాయిల డబ్బునూ, ఈ రత్నహారాన్ని, తీసుకో-ఇవి రెండూ నీకూతురికి పెళ్ళి సమయంలో స్త్రీధనంగా ఇవ్వడానికని

ఇస్తున్నాను. జంకకు. ఆలోచించకు. తీసుకో—'' అంది ఆమె. ఆశ్చర్యం, ఆనందం, భయం అన్నీ కలిసి ముంచెత్తాయి నన్ను. ఎవ్వరీమె, ఇవన్నీ తాను నాకెందు కిస్తున్నది అని అర్థం కాలేదు. అయినా ఆమెను కాదనగల ధైర్యం లేకపోయింది నాకు. ''ఊ! తీసుకో'' అని రెండవసారి అనగానే చేతులు జాచి తీసుకున్నాను. ''జాగ్రత్తగా దాచు—'' అంది. ''అట్లాగే! తర్వాత పెట్టెలో పెడతాను.'' అని డబ్బునూ హారాన్నీ తలగడా క్రింద దాచాను.

తర్వాత ఆమె ''రాజమ్మా! ఈ ముక్కూ మొహం ఎరగని మనిషేమిటి ఈ నగా డబ్బు ఇవ్వడం ఏమిటి అని ఆశ్చర్యం కలగవచ్చు నీకు. విజమే. నీవు నన్ను తెలియదు. కాని నిన్ను నాకు తెలుసు. చాల రోజులనుండి తెలుసు. చాలకాలం క్రింద నేను నీకొక అపకారం చేశాను. ఆ పాప పరిహారం కోసమే నేడు ఈ డబ్బూ హారమూ ఇచ్చాను. వీటిని జాగ్రత్తగా కాపాడి, పెళ్ళి నాడు, మీ అమ్మాయికివి అందజేయి! ఆయితే ఇవి నేనిచ్చినట్లు ఎవ్వరికీ చెప్పకు; ముఖ్యంగా నీ భర్తకు అసలు చెప్పకు. బోధపడిందా?'' అని గట్టిగా అడిగింది. నేనేమీ బదులు పలకలేదు. వెంటనే ఆమె ముఖం మారిపోయింది, అపరకాళికలా అయింది. కళ్లు ఎర్రగా అయ్యాయి. పెట్టిలోనుండి ఏదో తీసింది. అది తళతళ మెరుస్తూంది. అది కత్తి! ఆ కత్తిని నా ముఖం దగ్గరగా పెట్టింది.

''రాజమ్మా! నేను మంచివాళ్లకు మంచి దాన్ని. చెడ్డవాళ్లకు చెడ్డదాన్ని. నే చెప్పినట్లే నడుచుకోవాలి నువ్వు. ఈ విషయాల గురించి నీ మొగుడికికూడా తెలియ నివ్వరాదు. నువ్వు చెప్పినట్లు నాకు తెలిసిందా, ఇదిగో ఈ కత్తితో నిన్ను పొడిచి చంపేస్తాను. జాగ్రత్త!'' అని హూంకరించింది.

వెంటనే ఆ తోలు పెట్టెను మూసివేసి, ''జాగ్రత్త రాజమ్మా! నేను చెప్పిం దేదీ మరవకు!'' అని చెప్పి గబగబ నడిచి బయటకు వెళ్ళింది. వరండాలో నుండి వెళ్లి మెట్లు దిగి వెళ్ళినట్లు ఆమె అడుగుల చప్పుడు చెప్పింది. అమ్మయ్య! ఆ తర్వాత నాకు ధైర్యం వచ్చింది. జరిగినదంతా కలకాదు కద అన్పించింది. తలగడా క్రింద చూచాను. డబ్బు, హారము వున్నాయి! కాదు, ఇది కల

కాదు, నిజమే అని నమ్మకం కుదిరింది. ఈలోగా సీత వచ్చింది. రావడం తోటే "అమ్మా! ఎవరన్నా వచ్చారా, ఏమిటి తలుపులట్లా తెరిచివున్నాయే. అదేమిటి, నువ్వు పడుకున్నావేం—ఒంట్లో బాగులేదా?" అని అడిగింది. మరుక్షణం కెవ్వున అరిచినంత పనిచేసింది! అందుకు కారణం మేజామీద మెరుస్తున్న కత్తి!! "అమ్మా! ఈ కత్తి ఎక్కడిదమ్మా? దీని పిడి చాల విచిత్రంగా వుందే!" నాకు మతిపోయినంత పనయింది. "సీతా! ముట్టుకోకు! ఆ కత్తిని ముట్టుకోకు!" అని అరిచాను. నా సంభ్రమాన్ని గుర్తించిన సీత ఆ కత్తిని ముట్టుకోలేదు; నావంక చూచింది. ఈలోగా మేడమెట్లమీద ఎవరో వస్తున్న చప్పుడయింది. కత్తిని దాచమందామా, లేక తలుపులు మూయమందామా అనుకుంటుండగానే తుఫాను గాలిలా ఆ స్త్రీ మళ్ళీ లోపలికి వచ్చింది. తిన్నగా మేజా దగ్గరకు వెళ్లి కత్తి తీసుకుని పెట్టెలోపల పెట్టుకుంది. తర్వాత నా మొహాన్ని సీత మొహాన్నీ మార్చి మార్చిచూచింది. "ఈ పిల్ల నీ కూతురా?" అని అడిగింది. అవునన్నాను. వెంటనే ఆమె సీతను కౌగలించుకుని, శిరస్సుమూర్కొని, బుగ్గమీద ముద్దుపెట్టుకుని—"దేవుడు నిన్ను చల్లగా చూడాలి తల్లీ! దుర్మార్గుల బారినుండి రక్షించాలమ్మా!" అని, గబ గబ బయటికి వెళ్లిపోయింది. ఆమె పాదాల చప్పుడు వినపడడం మానివేశాక సీత "అమ్మా! ఎవరమ్మా ఈ పిచ్చిది?" అని అడిగింది. "అట్లా అనకమ్మా తల్లీ! అది చాలమంచి మనిషి. నాకు చాల రోజులనుండి తెలుసు ఈమెను...ఈ మధ్య కనపడడం మానేసింది." అన్నాను...అబద్ధమే చెప్పవలసి వచ్చింది మరి..."

ఇదంతా విన్న కిట్టూవయ్యర్ 'ఇదొక్కటేనా అబద్ధం! ఇంతవరకు చెప్పినదంతా అబద్ధాల పుట్ట కద! సీత కోసం మొగుడికి, తెలియకుండా డబ్బు చేర్చిపెట్టి, ఈ కట్టు కథలల్లతోంది, పాపం!' అనుకున్నారు.

* * *

మరుసటి రోజు డాక్టర్ వచ్చారు. రాజమ్మాళ్‌ని పరీక్షచేసి చూశారు. "ఇవాళ కాస్త మేలుగా వుంది" అంటూ 'ప్రిస్క్రిప్షన్' రాయడానికి కాగి

తము కలమూ తీసుకున్నారు. రాయిబోయిన వారెల్లా చటుక్కున ఆగి
"మిస్టర్ దురైస్వామి! నేనీ మాట చెబుతా, వింటారా?" అన్నారు.
"చెప్పండి!"
"ఆ మీ ఆవిడకు ఇప్పుడు స్థలం మార్పుకన్న వేరేమందు అక్కర్లేదు. ఇరవై ఏళ్లనుండి ఈ బొంబాయిలోనే వుంటున్నారు కదా ఇప్పుడు కొన్ని రోజుల పాటు ఇంకో వూరికి వెళ్లి రానివ్వండి. మీ బావగారి గ్రామానికి పంపండి-"
"వాకేమీ అభ్యంతరంలేదు. బావగారికి వీలుండాలి కదా—"
"వాకు ఎప్పుడయినా వీలే! నా చెల్లెల్ని సంతోషంగా తీసుకు వెళ్తాను. కాని గత సంవత్సరమే తీసుకు వెళ్తానంటే వద్దన్నాడీయన..."
"నేను కాదు, మీ చెల్లెలే వద్దన్నది—"
"ఇప్పుడు కూడా వద్దనే అంటున్నాను" అంది రాజమ్మాళ్.
"మీరట్లా అనకూడదమ్మా! ఊరు మారితేగాని మీకు నయమవదు."
"డాక్టర్! ఇరవై సంవత్సరాలుగా ఇక్కడే వుంటున్నాను. మిగిలిన ఆ కొద్ది రోజులూ నన్నిక్కడే వుండనివ్వండి—"
"అట్లాగంటే నేనేం చెప్పగలనమ్మా, మీ ఇష్టం!" అని డాక్టర్‌గారు ఏవో మందులు రాసిచ్చి వెళ్లిపోయారు.

ఆ తర్వాత కిట్టావయ్యరూ, సీతా కలిసి ఎంతో నచ్చజెప్పిన మీదట రాజమ్మాళ్ ఊరికి బయలు దేరడానికి ఒప్పుకుంది. సీతకేమో మామయ్య ఊరికి వెళ్ళి లలితను చూడబోతున్నామని ఒకటే సంబరం!

ఆ రాత్రినుండే రాజమ్మ ఆరోగ్యం మెరుగవసాగింది. కిట్టావయ్యర్ బొంబాయికి వచ్చిన ఎనిమిదవ రోజు ఆయన, రాజమ్మాళ్, సీత—కలిసి విక్టోరియా టెర్మినస్ స్టేషన్‌లో మద్రాసు మెయిలెక్కారు. దురైసామి స్టేషన్‌కువచ్చి, వాళ్లని రైలెక్కించారు.

రైలు బయలుదేరే సమయానికి కిట్టావయ్యర్ రైలుపెట్టె తలుపువద్ద నిలబడి దురైసామితో మాట్లాడుతున్నారు. ఈలోగా పత్రికలమ్మే కుర్రవాడ్లు ఆనాటి ముఖ్యవార్తల గురించి కేకలు పెడుతూ అటువచ్చారు. "రజనీపూర్ మహా

రాజుపై హత్యా ప్రయత్నం''—''ఒక స్త్రీ సాహసం''—''కత్తితో ఆడదాని అరెస్టు''—అంటూ వాళ్లు హిందీ, ఇంగ్లీషూ కలిపి అరుస్తున్నారు. తనకు తెలిసిన కొద్దిపాటి ఇంగ్లీషుతో ఆ వార్తల నర్థం చేసుకున్న కిట్టా వయ్యర్—''ఈ మహారాజుపై హత్యా ప్రయత్నం ఏమిటి?'' అని అడిగాడు. ''ఆ! మనకెందుకీ గొడవ? బొంబాయిలాటి వూళ్లు ఇట్లాంటివి ఎన్నో జరుగుతుంటాయి—'' అన్న దురైసామి మొహం నల్లగా మాడిపోయినట్లు అనిపించింది.

రైలు బయలు దేరడానికి వేళయింది.

రైలు కదులుతుండగా—''రాజం! ఆరోగ్యం జాగ్రత్త సుమా! నేను బాగానే వుంటాను లే, అనవసరంగా కలత చెందకు! సాధ్యమైనంత త్వరలో నేను అక్కడికివచ్చి మిమ్మల్ని తీసుకు వస్తాను—సీతా! అమ్మను జాగ్రత్తగా చూచుకో—కిట్టావయ్యర్—వెళ్లి రండి! రాజం! ఆరోగ్యం చూచుకో—'' అని అరిచారు దురైసామి.

దురైసామి నిజంగానే తాను చెప్పినట్లల్లా చేయాలనే అనుకున్నారు. కాని విధి విలాసం ఎలాంటిదో ఎవరికి తెలుసు!

దేవపట్నం, మాడవీధిలో ఎదురెదురుగా రెండు మేడలున్నాయి. రెండిళ్లకూ వీధి వరండాలకు ఇనుప ఊచలు బిగించి వున్నాయి. రెండు గుమ్మాల మీద బోర్డులు వేలాడుతున్నాయి. ఒక బోర్డుమీద ''ఆర్. ఆత్మనాథ అయ్యర్, బి.ఏ.; బి.ఎల్'' అనీ, ఇంకో చానిమీద ''ఎన్. దామోదరం పిళ్లై, బి.ఏ.; బి.ఎల్'' అనీ వుంది.

ఆత్మనాథయ్యరూ, దామోదరం పిళ్లై చిరకాల మిత్రులు. ఇద్దరూ దేవపట్నంలో పేరు మోసిన వకీళ్లు. ఇద్దరికీ పెద్ద కుటుంబాలు. ఇద్దరూ బాగా ఆర్జిస్తున్నారు. కాని ఇద్దరూ మేడ ఇళ్లు కట్టడంతో కాస్త అప్పులపాలయ్యారు.

ఒక రోజు దామోదరంపిళ్లై ఇంటి డాబామీద వెన్నెలలో కూచుని ముగ్గురు యువకులు బాతాఖానీ వేస్తున్నారు. వారిలో ఒకడు దామోదరంపిళ్లై పెద్దకొడుకు అమరనాథన్; ఇంకొకడు ఆత్మనాథయ్యర్ గారి పెద్దబ్బాయి పట్టాభిరామన్; మూడవ యువకుడు రాజంపేట కిట్టావయ్యర్ కొడుకు సూర్యనారాయణన్.

మొదటి ఇద్దరూ ఈసారి బి.ఏ. పరీక్ష రాయడానికై చదువుతున్నారు. ఇద్దరూ ఇరవై సంవత్సరాలవారు.

వాళ్లిద్దరికన్న రెండేళ్లే చిన్నవాడయినప్పటికీ సూర్యనారాయణన్ ఎస్. ఎస్. ఎల్. సి పరీక్షకే చదువుతున్నాడు. కాస్త వయస్సయాకనే కిట్టావయ్యర్ వాడిని చదువు నిమిత్తం దేవపట్నం పంపారు.

ఆత్మనాథయ్యరుకి కిట్టావయ్యర్ గారి వకీలు; మిత్రులు. అంచేత తనబ్బాయిని కాస్త చూస్తుండమని కిట్టావయ్యర్ తన మిత్రుడిని కోరారు. సూర్యనారాయణన్ హోటల్‌లో భోజనం చేస్తూ, ఆత్మనాథయ్యర్ ఇంట్లో వుంటూ చదువుకునేవాడు.

"అమర్‌నాథ్! మన సూర్యా రేపు పూరికి వెళ్తున్నాడు తెలుసా?" అన్నాడు పట్టాభి.

"అలాగా? ఊరికి ఇప్పుడెందుకూ వెళ్లడం? పరీక్షలు దగ్గరికొస్తున్నాయిగా—" అన్నాడు అమర్‌నాథ్.

"మద్రాసునుండి ఎవరో పిల్లను చూడడానికి వస్తున్నారట. అంచేత నన్ను వచ్చి ఇమ్మని వుత్తరం రాశారు నాన్న—" అన్నాడు సూర్యా.

"ఎవరో పిల్లను చూడడానికి వస్తుంటే మధ్యలో నీకేమి వచ్చిందిరా - నువ్వేమి పిల్లవా లేక ఎవరో నా?" అని అడిగాడు అమరనాథ్.

"అదేవిటోయ్? వీడి చెల్లెలి పెళ్లి నిశ్చయం అవుతుంటే వాడు మరి అక్కడ వుండొద్దూ?" అన్నాడు పట్టాభిరామన్.

"ఏమిటీ, సూర్యా చెల్లెలు లలితకా పెళ్లి? ఆమెను చూడడానికి మద్రాసు నుండి వస్తున్నారా? ఏరా పట్టాభీ, ఇదేమివిడ్డూరం? లలితను నువ్వు పెళ్లాడతా వని కదా నేను అనుకుంటున్నాను.?"

"ఛీ, నోరు ముయ్యరా! పిచ్చి పిచ్చిగా వాగకు, అందులోనూ సూర్యా ఎదుట?"

"వాగడం ఏమిట్రా, ఉన్న మాటంటేను! సూర్యాన్నే అడుగుతానుండు, నాకేం భయమా? ఏరా, సూర్యా! మన పట్టాభి ఇక్కడ లలితకోసం పడి గాపులు కాస్తుంటే, ఆమెను చూడడానికి మద్రాసునుండి ఇంకెవరో రావడం ఏమిటీ?" అన్నాడు అమర్‌నాథ్.

"అవన్నీ నాకేం తెలుసండీ బాబూ! నన్నడిగే విచారణ చేస్తున్నారా ఏమిటి ఇవన్నీ? జాతకాలూ అవీ బాగులేదో మరేమిటో..." అన్నాడు సూర్యా.

"నా జాతకం ఎవ్వరూ అడగాలేదు, చూడాలేదు. బి.ఏ. పాసయి నెలకు రెండు వందల రూపాయిలన్నా సంపాదించుకోగల్గితేగాని నేను పెళ్లాడ దలచుకోలేదని నీకు తెలియదుట్రా అమర్‌నాథ్?" అన్నాడు పట్టాభి.

"కొయ్‌రా కొయ్! పోయిన సంవత్సరం కిట్టావయ్యరూ, వారి అమ్మాయీ వచ్చి మా ఇంట్లోవున్న ఆ వారం రోజులూ నువ్వు పడ్డ అవస్థంతా నేను ఎరగను అనుకున్నావా? తుణానికోసారి ఇంట్లోంచి బయిటికి బయిటినుంచి ఇంట్లోకి కాలుకాలిన పిల్లలా నువ్వు తిరగడం నేను మరిచి పోయానను కున్నావా?... సూర్యా! నువ్వేమన్నా అనుకుంటే అనుకోగాని మీ నాన్న చేస్తున్నపని ఏమీ బాగులేదు. మన పట్టాభి వుండగా మీ నాన్న ఇంకో సంబంధం వెతకడం ఏమిటి? వీడికేమి కొరత?"

ఇంత సేపటినుండి ముఖం ముడుచుకుని కూర్చున్న సూర్యా పలికాడు. "నిజం చెబుతా వినండి...మా నాన్న చేస్తున్న పని నాకూ నచ్చలేదు. మా చెల్లెల్ని పట్టారామన్ కిచ్చి పెళ్లిచేస్తే సుఖపడుతుందనే నా భావం. మరి దానివి ఆ ముక్కూ మొహం ఎరగని మద్రాసు వారెవరికో ఎందుకంటగట్ట చూస్తున్నారో మా నాన్న?"

పట్టాభి ''నేనొకడిని వున్నానన్న విషయం మరిచిపోయి ఏమిట్రా, మీ చిత్తం వచ్చినట్లెల్లా మాట్లాడేస్తున్నారు? లలిత విషయంలో నాకటువంటి అభిప్రాయమేమీ లేదు. కాని ఒకటి మాత్రం చెబుతాను. ముందు వెనక తెలియని ఒక ఆసామీ రావడం—అతడి ఎదుట అమ్మాయిని నిల్చోబెట్టడం—ఆ మహానుభావుడు సాముద్రిక లక్షణాలు పరీక్షించడం—చివరకు నాకు నచ్చలేదు-అనడం-ఇవన్నీ నాకు నచ్చవు'' అన్నాడు.

''ఒరేయ్, సూర్యా! నేను చెప్పినట్లు చేయి. మీ చెల్లెలితో చెప్పి, ఆ మద్రాసునుండి వచ్చేవాడిని తనకు నచ్చలేదు-అని చెప్పేటట్లు చేయి.'' అని సూచించాడు అమర్ నాథ్.

''వద్దుసూర్యా! అట్లాంటి పిచ్చిపను లేమీ చేయకు!''అని నివారించాడుపట్టాభి.

''నువ్వేమంటావు సూర్యా?'' అని ప్రశ్నించాడు అమర్ నాథ్.

''మీ సలహాను ఆమోదిస్తున్నాను.''

''చూశావా పట్టాభీ! మెజారిటీ అభిప్రాయం నీకు వ్యతిరేకంగా వుంది.'' అన్నాడు అమర్ నాథ్.

''ప్రపంచంలో అధిక సంఖ్యాకులు మూర్ఖులు - అని స్వామి వివేకానంద చెప్పారు, తెలుసా?' అని అడిగాడు పట్టాభి.

''అబ్బాయ్! అధిక సంఖ్యాకులు 'మూర్ఖులు' అని వివేకానందులవారు సెలవీయ వచ్చునుగాని, నువ్వూ నేనూ కాదు నాయనా! ముమ్మందు సంవత్సరాలలో మాత, పిత, గురువు, దైవం - అన్నీ, 'మెజారిటీ' యేరా చిట్టి తండ్రీ! అధిక సంఖ్యాకులను సరకు చేయనివాడు ముందుకు రాలేడు. ఒకవేళ అధిక సంఖ్యాకుల ఇష్టప్రకారం నడచుకొన లేకపోతే వారి కంట్లో కారం కొట్టి అయినా బ్రతకవలె నాయనా!'' అని ఉపదేశించాడు అమర్ నాథ్.

* * *

సీత, రాజమ్మాళ్ బొంబాయినుండి వచ్చాక రాజంపేటలో ఒక వారం వున్నారు. ఆ తర్వాత రాజమ్మాళ్ అక్క అభయాంబాళ్ వున్న వూరికి వెళ్ళి

వచ్చారు. వస్తూంటే దారిలో, దేవపట్నంనుండి వస్తున్న సూర్యనారాయణ్ కలిశాడు. సూర్యాకు బొంబాయి అత్తయ్యన్నా సీతన్నా ఇష్టం వీర్పడింది.

ఇక సీత, లలిత కలిసి గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. అప్పుడప్పుడు గుంట గట్టున బంగాళాకు వెళ్లేవారు. అక్కడ నిర్భయంగా తమ మనోరథాలన్నిటి గురించి చర్చించుకునేవారు. ఒక్కొక్క రోజయితే పగలెల్లా గడిచి, చీకటి ముసురుకొస్తున్నా వారి కబుర్లు ముగిసేవికావు. బంగాళా ఎగుటవున్న గుంట మెట్లమీద కూచుని సంభాషణ సాగించేవారు. ఆయువతులిద్దరూ అంతలా ఏమి రహస్యాలు మాట్లాడుకుంటున్నారా అని ఆకాశం పడ్డ ఆశ్చర్యం కోటి నక్షత్రాలై మెరిసేది.

కాని ఇవాళ గుంట గట్టు బంగాళాలో సఖియలిద్దరి సరసాలు సరిగా సాగలేదు.

"లలితా! ఇవాళ మనం రావడం తిప్పేమో...అత్తయ్య మనకోసం వెతుక్కుంటున్నదేమో...నిన్ను ఇక్కడకు తీసుకొచ్చినందుకు నన్ను కోప్పడుతుందేమో—" అంది సీత.

"నిన్ను కోప్పడడం ఎందుకూ? మా అమ్మ నన్నే కోప్పడాలి. అందుకు జవాబు నేను చెప్పుకుంటానులే—" అంది లలిత.

"భోజనాలవగానే నీకు పూలజడ వేయాలని అంటూండింది అత్తయ్య. అందులోనూ మొగలి రేకుల జడ, కనీసం గంటయినా పడుతుంది! వాళ్ళేమో సాయంకాలం అయిదింటికల్లా వచ్చేస్తారుట. మరి మనం ఇక్కడ కూచుంటే ఎలాగభి" అంది సీత.

"ఏమిటోనమ్మా, నాకివేమీ నచ్చలేదు...నువ్వు నాకన్న ఒక ఏడాది పెద్ద దానివి కదా, ముందు నీ పెళ్ళి నిశ్చయించాలి, ఆతర్వాత వా విషయం చూడాలి, అవునా? మరి నాన్నకూడా ఇట్లా ఎందుకు చేస్తున్నాడో నాకర్థం కావడం లేదు. ఇవ్వాళ్ళి విషయం చూడు! ఎందుకింత ఆర్భాటం, హడావిడి? ఏమన్నా చెబుతామంటే అమ్మకయ్యేమని లేస్తుందేమోనని భయం..."

...''భయమా? నేనుండగా ఎవరికేమి భయం?'' అంటూ బంగళాలోకి ప్రవేశించాడు సూర్యా.

కొన్ని సంవత్సరాలకు ముందు కోటావయ్యర్ ''కాస్త సుఖంగా నవనాగరింగా వుండాలి'' అనుకుని ఆ పెద్ద గుంట గట్టున విశాలమైన ఇల్లు కట్టారు. దాని చుట్టు తోట వేయించారు. దానికే గుంట గట్టు బంగళా అనే వాళ్ళు ఆ గ్రామస్తులు. కోటావయ్యర్ కార్యాలయం అదే; ఆయన తన మిత్రులతో కాలక్షేపం వేసే చోటు అదే—ఈసారి లలిత పెళ్లికని ఆ బంగాళాకు వెల్ల వేయించారు; తలుపులకు వాటికి క్రొత్తగా రంగులు వేయించారు.

అట్లాంటి బంగళాలో కబుర్లాడుకుంటున్న సీత లలిత మాటల కడ్డంగా ప్రవేశించాడు సూర్యా. లలిత కోపంతో—'' ఇక్కడకూ దాపరించావా నాయనా! ఇక్కడెవరూ భయంతో వణికి పోవడంలేదు; వీరాధివీరుడయిన సూర్యనారాయణగారి సాయమూ అక్కర్లేదు. అయినా ఆడంగుల కబుర్ల మధ్య మగవాడికేమి పని—'' అని అరిచింది.

''పనివుండే వచ్చాను లలితా! అత్తయ్య సీతను వెతుకుతూంది. ఇక్కడ వుంటే పంపమన్నది. బొంబాయి మామయ్యనుండి వుత్తరం వచ్చిందట—'' అన్నాడు సూర్యా.

''లలితా! నువ్వికక్కడే వుండు - నేనిప్పుడే వెళ్ళి అయిదు నిముషాల్లో వచ్చేస్తాను'' అని వెళ్ళింది సీత.

ఈ అదను చూచుకుని లలితతో ఆమె పెళ్ళి గురించి కొన్ని మాటలు చెప్పాలనుకున్నాడు సూర్యా. ''లలితా! నీతో ముఖ్యమైన విషయం. ఒకటి చెప్పాలనే వచ్చాను. ఇప్పుడు చెప్పకపోతే తర్వాత వీలుపడకపోవచ్చు—''

''చెప్పాల్సిందేమో చెప్పరా బాబూ! పీరికలు మాని చెప్పు-''

''పీరికలు కాదు. కాని లలితా; సాయంత్రం నిన్ను చూడడానికి మద్రాసు నుండి ఎవరో వస్తున్నారు కదూ! ఆ వస్తున్న అతడు నీకు నచ్చితే సరే సరి; నచ్చకపోతే ఆ మాట స్పష్టంగా చెప్పేయి. అమ్మా నాన్న లేమనుకుంటారో అని, సంకోచ పడి నోరు మూసుకుని వుండి పోకు! తెలిసిందా? ఇది సాధా

రణమైన విషయం కాదు, యావజ్జీవితానికీ సంబంధించినది. ఇప్పుడు అనవసరంగా సోరు మూసుకుంటే జీవితాంతమూ ఏడవాలి – తెలుసా?"

"అలాగే అన్నయ్యా! నేనూ అట్టాగే అనుకున్నాను; ఒకవేళ నాకు నచ్చకపోతే నువ్వు నా పక్షమే కదూ?"

"తప్పకుండా నీ పక్షమే! ఏమీ భయపడకు–" అన్నాడు సూర్యా.

కాస్సేపటికెల్లా సుందు పరుగెత్తు కొచ్చాడు. "లలితా! అమ్మ నిన్ను తీసుకు రమ్మంది. నీకు జడ వేయాలిట; సింగారం చేయాలిట. మూడయింది గంట. మవ్వేమో ఇంకా ఇక్కడే కూర్చున్నావే...అన్నయ్యతో కబుర్లాడడానికి ఇదేనా సమయం–?"

"ఆహా! ఏమి అధికారం! ఒరేయ్ సుందూ! సీత అక్కడేవుందా, ఇక్కడికి వస్తానన్నదా?" అని అడిగింది లలిత.

"సీత నిన్ను అక్కడికి వెంటనే రమ్మంది. ఆమె ఇక్కడికి రాదుట. ఎందుకనుకున్నావు? ఇక్కడ మిస్టర్ కె. సూర్యనారాయణ అయ్యర్ గారు వేంచేసి వున్నారుగనుక!" అనేసి, తన్ను పట్టుకుందామని వచ్చిన అన్నయ్యా సూర్యాకు అందకుండా పరుగెత్తాడు సుందు.

7

సరస్వతమ్మకూ, సీతా – లలితను ఇంటికి పిలిపించిన మాటనిజమే. లలిత రాగానే అలంకరణ మొదలు పెట్టారు. ఆ పనిలో సీత ఎంతో ఉత్సాహం కనబరచింది. లలితకు సింగారించడంలో సీత కనబరచిన శ్రద్ధ చూచి సరస్వతమ్మ కఠిన హృదయంలో సీతపట్ల దురభిప్రాయం తగ్గింది.

"ఇక సీతకొక వరుడిని వెదర్చడమే తరవాయి. ఒకే ముహూర్తంలో రెండు పెళ్ళిళ్ళూ చేస్తే మరీ మంచిది. అయినా అట్టా చేయడానికి శాస్త్రం

ఒప్పుకుంటుందా అని ముందు చూడాలి. అభ్యంతరం లేకపోతే రెండు పెళ్ళిళ్ళూ ఒకపారే చేద్దాము. ఖర్చులూ కలిసి వస్తాయి. చైత్రంలో ముహూర్తం పెట్టుకోవడం అన్ని విధాలా బాగుంటుంది," అని అందరికీ వినపడేలా తనలో తానే అనుకుంది సరస్వతమ్మ.

లలిత సింగారింపు చివరి ఘట్టంలో వుంది. సీత హడావిడికి అంతం లేకుండా వుంది. లలిత ఆ చేతి గాజులు ఈ చేతికి, ఈ చేతివి ఆ చేతికి మార్చడం - జడలో తురిమిన పూవులను మాటిమాటికి సర్దడం - దువ్వెనతో పాపిటను ముంగురులను సరిచేయడం - బొట్టు చెడిపేసి మళ్ళీ మళ్ళీ పెట్టడం - వీటిలో నిమగ్నురాలయింది సీత.

సూర్యాను చూడగానే సరస్వతమ్మాళ్ - "ఏరా! ఇంతసేపు ఎక్కడికెళ్ళా వురాళ్ళి వాళ్ళేమో అన్నదానికి ఆరగంట ముందుగానే వచ్చేశారు. టిఫన్ పంపుదామనుకుంటే నువ్వు కనపడకనే పోతివి. ఆ చీమాచ్చు మామయ్యేమో -" టయిమయిపోతుందో అని ఒకటే ఆరుపులు...ఇంక చివరకు నాకరు చేతికిచ్చి, సుందును వాడితోబాటు పంపాను. వాళ్ళిప్పుడే వెళ్ళారు. నువ్వూ వెళ్ళు - వెళ్ళి 'అల్లుడి'గారికి అన్ని అందాయో లేదో చూడు పో-" అని తరిమింది. కాని సూర్యా కదలలేదు. "నేను వెళ్ళనమ్మా! ఎంతమంది వెళ్ళాలేమిటి? ఇప్పుడే ఇంత హడావిడి ఎందుకు?" అన్నాడు.

"ఆహా! ఆబ్బాయిగారి తెలివిని చూడందయ్యా చూడండి! అంతా అబ్బ పోలికే...ఇట్టాంటి మహారాజులుంటే రేపు పెళ్ళినెట్టా చేస్తానురా దద్దమ్మా!"

సీత చెప్పింది. "సూర్యా! అమ్మ చెప్పినమాట వినకూడదూ? మరి అల్లుడి మంచి చెడ్డ నువ్వు కాకపోతే ఇంకెవరు చూస్తారు?"

"అందరూ కలిసి అప్పుడే "అల్లుడు" అని నిర్ధారణగా చెప్పేస్తున్నారే - ఇంకా ఆ మహానుభావుడువచ్చి లలితను చూడనన్నా లేదు-" అన్నాడుసూర్యా-

"నేనూ అదే అంటున్నాను." అంది లలిత.

"నువ్వు నోరుమూసుకోవే-" అంది, సరస్వతమ్మాళ్.

"చావా! నువ్విట్లా వాదిస్తూ ఇక్కడే కూచుంటే ఇక నేనే ఇల్లి వాళ్లకు అన్నీ అందించి వస్తాను. నువ్వు వెళ్తావా, నే వెళ్లనాఁ దర్జాగా వెళ్లి ఆయనతో మాట్లాడి, అన్నీ సరిచూచి రాకుండా-ఇక్కడ కూచుంటా నంటావే" అంది సీత.

"వాతల్లీ - బాగా చెప్పావమ్మా! నువ్వే గనుక ఇవాళ లేకపోతే ఇంత వరకు దీని జడ వేయలేక పోయేదాన్ని... తెలుసా? నీకూ ఒక మంచి సంబంధం చూసి పడిర్చితేగాని నా మనసు శాంతించదు-"

"అందరూ ఆ వచ్చిన వారి గురించి ఇదయి పోతున్నారేగాని ఇంట్లోని మనుషుల గురించి ఆవంతయినా పట్టించుకుంటున్నారా - ఎవరయినా నన్ను- "ఇదిగో, ఈ టిఫిన్ తిను" అని అడిగారా? ఏమి ప్రపంచమో! అంతా ఇంతే!" అంటూ సూర్యా బయిటికి వెళ్లాడు.

చిమాచ్చువయ్యర్ ఇంటికి సూర్యా చేరేసరికి మద్రాసునుండి వచ్చిన వాళ్లు ఫలహారం సేవిస్తున్నారు. వరుడు, అతడి తల్లి, తండ్రి, సుబ్బయ్యర్ - ఈ నలుగురూ వచ్చినట్లు గమనించాడు సూర్యా. వాళ్లతోబాటు కూర్చుని సుందు కూడా టిఫిన్ ఆరగిస్తున్నాడు. చిమాచ్చువయ్యర్ వారికి ఉపచారాలు చేయడంలో నిమగ్నులయి వున్నారు.

సూర్యా వసారాలో స్తంభాన్ని ఆనుకుని నిల్చుని వున్నాడు. అతడిని గమనించి మాజీ సబ్ జడ్జి శాస్త్రిగారు-"ఈ అబ్బాయి ఎవరు-?" అని అడిగాడు.

"వీడు వధువు అన్నయ్య సూర్యనారాయణన్; ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నాడు." అన్నారు చిమాచ్చుయ్యర్.

"ఎవరెవరెల్సీ చదివితే చదవ నివ్వండి. అంత కోపం ఎందుకూ అంటి?" అన్నాడు సొందర రాఘవన్.

అతడి హాస్యోక్తి రుచించని సూర్యా-"నాకెందుకు కోపం? మీరే రావడం రావడం కోపంతో వచ్చినట్లున్నారు. అందుకనే ఏది వడ్డించబోయినా వద్దు వద్దంటున్నారు!" అన్నాడు.

"భలే భలే!" అన్నాడు పద్మలోచనశాస్త్రిగారు. "కామాక్షీ! విన్నావా కుర్రవాడి మాటలు? ఈ కావేరి నీళ్ళల్లోనే ఒక ప్రత్యేక మహత్యం వుంది అని అంటుంటానే, అమ్మయిందా ఇవ్వడు?"

ఎట్టకేలకు లలిత అలంకారం పూర్తయింది.

"సీతా! ఇకనయినా నువ్వెళ్ళి ముఖం కడుక్కుని, బొట్టు పెట్టుకో వే!" అంది లలిత.

"నాకేమి టే లొందర! ఇదుగో ఈ వంకీ జుత్తు ఈ ప్రక్కన వేలాడితే ఎంత బాగుందో చూడు-" అంటూ సీత లలిత జుత్తును సర్దసాగింది.

"చాలు చాల్లేవే! నువ్వెళ్ళి చీర మార్చుకుని తయారవు పో-నువ్వు పోతే నే వెళ్ళి ఆ చీకటి గదిలో తలుపు గడియ వేసుకుని కూచుంటా నంతే! ఎవరు ఆరిచినా తలుపు తీయను తెలుసా? ఆ ముద్దాసు వాళ్ళట్లాగే వెనుకప్రక్క పోయినా సరే—"

"సీతా! లలిత చెప్పినమాట వినమ్మా! నువ్వూ తన ప్రక్కన వుండాలని అది ఆశపడుతూంది. పోమ్మా!" అంది సీత పెద్దమ్మ.

"అవును సీతా! పెద్దమ్మ చెప్పినట్లు చేయి!" అంది సరస్వతమ్మాళ్.

"సరే! ఇట్లా అందరూ బలవంతం చేస్తే ఎట్లా-" అంటూ సీత తన అలంకరణకు ప్రక్రమించింది.

ఈలోగా సరస్వతమ్మాళ్ తల్లి ఆమెను పెరట్లోకి పిలుచుకు వెళ్ళి ఏదో రహస్యంగా చెప్పింది. "సరే సంబడం! నీకోక్కదానికే వస్తాయి ఇట్లాంటి ఆలోచనలు...నోరు మూసుకో! వరద నీరొచ్చి బావి నీటిని కొట్టుకుపోనుంటే-" అని సరస్వతమ్మాళ్ అన్నది మాత్రం అందరికీ వినబడింది.

* * *

సీత చీర మార్చుకుని, మొహం కడుక్కుని బొట్టు పెట్టుకుని వచ్చిందో లేదో-సరస్వతమ్మాళ్-"సీతా! సీతా! మీ మామయ్య వీధిలోనే నిల్చుని వున్నారు-కాస్తా లోపలికి రమ్మని చెప్పమ్మా!" అంది.

సీత గుమ్మంలోకి వెళ్లి చూచింది. మామయ్య, ఇంకా కొందరు పెద్దలు పందిరి క్రింద నిల్చుని వున్నారు. అటునుండి మోటారుకారు వస్తూంది.

ఇలాంటి సమయంలో మామయ్యను పిలవ వచ్చా కూడ్దా అని ఆలోచిస్తూ గుమ్మంలో నిలబడింది సీత. ఈలోగా కారు వచ్చి గుమ్మం ముందు ఆగింది. లలితను చూడడానికి వస్తున్న వరుడు ఎట్లా వుంటాడో చూద్దామన్న కుతూహలం సీతను అక్కడే నిల్పోబెట్టింది.

కారునుండి మొదట ఒక ముసలాయన దిగారు. ఆ తర్వాత ఒక యువకుడు దిగాడు. అతడే వరుడయి వుండాలి! ఆహా! ఎంత బాగున్నాడు! నిజంగా లలిత అదృష్టవంతురాలే!

సీత మనసు కలవరపాటు చెందింది; గొంతు కడ్డంగా ఏదో నిలిచి నట్లయింది; కళ్లల్లో నీరు రాబోయింది. తల తిరిగింది; తటాలున సంబాళించుకుంది. సంబాళించుకుని తలెత్తి చూడబోతే అతడు తన వైపే చూస్తుండడం కనబడింది. "ఒకవేళ నన్ను చూచి పెళ్లి కూతురనుకుంటారేమో" నన్న తలపు వచ్చేసరికి సిగ్గు ముంచు కొచ్చింది. రెండే రెండు గెంతులలో లోపలికి వచ్చి "వాళ్లు వచ్చేశారు_" అంది సీత. తర్వాత లలిత దగ్గరకు వెళ్లి ఆమెను కావలించుకుని ఆమె చెవిలో చెప్పింది. "ఒసేవ్! నీకు కాబోయే మొగుడిని చూశాసే...చాల అందంగా వున్నారు...మామయ్య అన్నటు మన్మథుడేనే!" అంది.

"ఛీ! ఫో!" అంది లలిత.

వీధి నడవాలో మనుషులు వస్తున్న చప్పుడు వినపడగానే, ఆడవాళ్లందరూ వంట గదిలోనూ, ఆ ప్రక్క గదిలోనూ వెళ్లి దాగుకున్నారు.

ఓ నిముషం తర్వాత సరస్వతమ్మాళ్ మాత్రం బయటికి వచ్చింది; వియ్యం కురాలు కానున్న కామాక్షమ్మగారిని చూచి "రండి!" అని పిలిచింది.

వచ్చిన మగవాళ్లందరూ కుర్చీలలో ఆసీనులయ్యారు.

గబగబ లేచి వంట గది ప్రక్క గదివద్దకు వెళ్లి చీమాచ్చువయ్యర్_"అమ్మాయిని రమ్మనండి. చేతిలో తాంబూలం వున్న పళ్లెం తీసుకుని రమ్మనండి. త్వరగా రావాలి" అని అరిచారు.

గదిలోపలినుండి ఏదో వాద ప్రతివాదాలు వినిపించాయి. "మీమాచ్చు వయ్యర్ —" ఈపాటి దానికి వాగ్వాదం ఎందుకూ? సీత కూడా రావచ్చుగా... అందరూ రండి —" అన్నారు.

సీత, లలిత గది వెలుపలికి అడుగు పెట్టారు చేతిలో తాంబూలాలున్న పళ్ళెంతో లలిత వంచిన తలెత్తకుండా అడుగు వేయసాగింది. సీత ఆమె చేతిని తన చేతిలో పట్టుకుని ఆమెను కొద్దిగా తోసుకుంటూ వచ్చింది.

సీత తల వంచలేదు. వచ్చిన వారిని తలెత్తి చూస్తూ ముందడుగు వేసింది. చూపులో చూపుగా 'అల్లుడి' మొహమూ చూచింది. తాను అనుకున్నట్లుగా. అతడు లలిత వైపు కాకుండా, తన్ను చూస్తుండడం గమనించి ఆమె ఒళ్లు పులకరించింది.

కలలో, నడుస్తున్నట్లుగా నడిచి వచ్చిన లలిత అందరూ వున్నచోటికి రాగానే, చేతిలోనిపళ్ళాన్ని ముక్కాలి పీటమీదవుంచి, నమస్కారంచేసింది.

లలిత నమస్కారం చేస్తుండగా సీత మళ్లీ 'అల్లుడి' వైపు చూచింది. అతడు మళ్లీ లలితను కాకుండా తన వైపే చూస్తుండడం చూచింది. కేవలం చూడడమే కాదు, చిరునవ్వు నవ్వాడు! ఆకాశం నుండి శతకోటి నక్షత్రాలు రాలి సీత హృదయ లోకాన్ని జ్వాజ్వల్యం మానంగా చేశాయి!

నమస్కరించి లేస్తూండగా లలితకూ 'ఆయన'ను చూడాలనిపించింది. బరువెక్కిన కనురెప్పల్ని కష్టపడి పైకెత్తి చూచింది. ఆ క్షణాన 'ఆయన' పెద వులమీద చిరునగవుతో తన్ను దాటి ఇంకెక్కడో చూస్తుండడం గమనించి చూపులు దించుకుంది.

"ఇప్పుడు మనం చూడడానికి వచ్చింది, జడలో రాకడి బిళ్ల పెట్టుకున్న అమ్మాయినే కదూ —" అని అడిగారు పద్మలోచనశాస్త్రి.

"చాల బావుందండి మీరడగడం! అవతల అమ్మాయివచ్చి నమస్కారం చేసింది చూశ్లేదేవిటి-?" అంది కామాక్షమ్మ.

"తెలియక కాదులేవే! ఆయినా సందేహానికి చోటుండకూడదు కదా అని అడిగాను సరే...అమ్మాయికి చదవడం రాయడం వచ్చుకదా?" అని అడిగారు శాస్త్రి.

"ఏం ప్రశ్న వేశారండీ! నాన్న మున్సబు పనిలో సగం ఆ అమ్మాయే కాదుటండీ చూస్త! అమ్మాయి చదవని నవలలా, పత్రికలా? ఇంగ్లీషుకూడా ధారాళంగా మాట్లాడుతుంది రేపు అల్లుడుగారు మాట్లాడి తెలుసుకుంటారు గదా—" అన్నారు చీమాచ్చువయ్యర్.

ఇది విన్న 'అల్లుడు'గారే స్వయంగా పలికారు. "రేపటి డాక్ట్ర్ అయినా ఎందుకు? అదేదో ఇప్పుడే తేల్చుకుంటే సరి."

"ఖలే అన్నారు లెండి...అయినా మేమంతా పల్లెటూరి వాళ్లం కదుటండీ! ఇంకా అంత నాగరికత అలవడలేదు. పెళ్ళయి మీ ఇంటికి తీసుకెళ్లితే పదే పది రోజులలో అన్ని నాగరికతలూ నేర్చుకుంటుంది అమ్మాయి-ఏం, కిట్టా వయ్యర్, ఏమంటావ్?" అన్నారు చీమాచ్చు.

అందుకు శాస్త్రిగారు- 'కిట్టావయ్యర్ వారిని అడగడం ఎందుకు? ఈ కాలపు పోకడలు నాకూ మా ఆవిడకే నచ్చవు. కోడలు పిల్ల ఇంగ్లీషు చదువులు చదివి ఉద్యోగాలు చేయాలని మేము కోరడంలేదు. అయినా అబ్బాయి ఈ కాలపు వాడు కదండీ! అమ్మాయి చదువుకున్నదయి వుండాలని ఆశించడం సహజమే కద. పోన్లెండి అమ్మాయి పాడుతుందా?" అన్నారు.

"ఏం కిట్టావయ్యర్? జవాబు చెప్పవేం? అన్నిటికీ నేనే జవాబు చెప్పాలా ఏమిటి?"

కిట్టావయ్యర్ వెంటనే-"అమ్మాయికి ప్రత్యేకంగా సంగీతం అంటూ నేర్పించ లేదు. ఈ గ్రామాలలో అటువంటి వాటికి వసతిలేదు, కాని బాగానే పాడుతుంది. నేనే నేర్పించాను. నాకు సంగీతంలో కొద్దిగా ప్రవేశం వుంది!" అన్నారు.

"భేష్ భేష్ - ఇకనేం! దీక్షితర్ కృతి ఏదన్నా వచ్చా?"

"ఆహా! లలితా! 'మా మన పట్టాభిరామా!" పాడమ్మా!' అన్నారు కిట్టాయ్యర్.

ఇంత సేపూ తలవంచుకు నే కూర్చుని వుంది లలిత. ఇప్పుడు జాలి గొలిపే మొహంతో తండ్రి వైపు ఒక్కసారి చూచి మళ్లీ తల దించుకుంది.

"దీక్షితర్ కృతి రాకపోతే పోనీ, శ్యామశాస్త్రి కృతివన్నా పాడమనండి."

"శ్యామశాస్త్రి కృతులూ వచ్చును. 'సరోజ దళ నేత్రి' పాడమ్మా!"

లలిత ఏమీ ఊలక లేదు, పలక లేదు. సీత రహస్యంగా "ఏమిటే, మాట్లాడకుండా కూచున్నావేం? ఒక పాట పాడవే తల్లీ!" అని చెప్పింది.

అయినా ఫలిత మేమీ లేకపోవడంతో వరుడివైపు చూచింది అతడూ అదే క్షణాన ఆమెను చూచాడు. వారిరువురి కనులూ మాట్లాడుకున్నట్లయింది.

"సీతా! అమ్మాయి ఒంటరిగా పాడడానికి జంకుతున్నట్లుగా వుంది. నువ్వూ లలితా కలిసి ఒక పాట పాడండమ్మా" అన్నారు సుబ్బయ్యర్.

"ఔను సీతా! నువ్వూ కలిసి పాడు" అంది సరస్వతమ్మాళ్ ప్రక్కకు వచ్చి నిల్చుని.

"మీ ఇద్దరికీ తెలిసిన పాట ఒకటయినా లేదే-" అంది సీత స్పష్టంగా.

"పోనీ నువ్వే మొదట పాడు! తర్వాత అమ్మాయి పాడుతుంది—" అన్నారు పద్మలోచన శాస్త్రి.

"యోచించుకోనివ్వండి.. లలితా! నీకు 'నగుమోము' వచ్చుకదూ-ఇద్దరం కలిసిపాడుదామా! ఏంటి మౌనంగా వుండి పోకు-" అని సీత పాడడం మొదలు పెట్టింది. పల్లవి సగం అయ్యాక లలిత గొంతు కలిపింది కాని ఆమె గొంతు సరిగా పలక లేదు. సీత అనుపల్లవిని హాయిగా పాడుతుండగా లలిత కూడా పాడుదామని ప్రయత్నించింది. కాని స్వరం 'కీచు'మని అపస్వరం పలికింది. కాక్కున పాట ఆపి లేచి, గదివైపు వెళ్లి ప్రయత్నించింది లలిత.

అందరూ ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. కోపంగా అడిగారు కిట్టాయ్యర్ "ఇదేమిటమ్మా లలితా...?"

సరస్వతమ్మాళ్ లలిత చేయి పట్టుకొని - "పిచ్చిదానా! ఏమయిందివాళ్ళకి?" అని అడిగింది.

లలిత తల్లి చేతులను విదల్చుకుని లోపలకి వెళ్లిపోయింది.

పాపం, సీతకు ఒక్క క్షణం ఏమిచేయాలో తోచలేదు. వెంటనే వరుడిని చక్రాల్లాటి కళ్లలో ఒక్కసారి చూచేసి, లేచి, తానూ లోపలికి వెళ్లిపోయింది.

లేచి నిల్చున్న కిట్టావయ్యర్‌ను కూర్చోమని చెప్పి పద్మలోచనశాస్త్రి- "ఫరవాలేదు లెండి. అమ్మాయిని ఇబ్బంది పెట్టకండి. గొంతు విన్నాముకదా, ఇంపుగా వుంది. అదేచాలు, పాట ఇంకొక నాడెప్పుడయినా వినవచ్చు లెండి!" అని సర్ది చెప్పారు.

సౌందర రాఘవన్ మాత్రం "అమ్మాయి మూగది కాదు అని తెలిసింది కదా, అదే చాలు-" అన్నాడు కటువుగా.

"అట్లా మాట్లాడకురా అబ్బాయ్!" అని కొడుకును మందలించి కామాక్షమ్మాళ్, లేచి లోపలికి వెళ్లింది. ఆడవాళ్లూ, మగవాళ్లూ విడివిడిగా మాట్లాడుతున్నారు. తర్వాత వియ్యాలవారు విడిదికి వెళ్లిపోయారు.

8

వాళ్లందరూ వెళ్లి చాలసేపయి నప్పటికీ సరస్వతమ్మాళ్ తత్తరపాటింకా తగ్గలేదు. సీతను పిలిచి - "అమ్మాయ్! ఆ విడిదికి వెళ్లి వియ్యపురాలిని అన్నీ సర్దిగా అందుతున్నాయా అని కనుక్కునిరా! ఆ చీమాచ్చుగారిని వెంటనే ఇక్కడికి రమ్మని చెప్పు-" అంది.

సీత బయల్దేరింది. దారిలో చీమాచ్చునయ్యర్ ఎదురయినా ఆగకుండా ఆమె విడిది వైపే నడిచింది. ఆమె విడిది లోపలికి వెళ్లేసరికి ముందు వైపు

పడక కుర్చీలో ఆనుకుని కూర్చుని వున్నాడు సౌందర రాఘవన్. సీతను చూడగానే నిటారుగా కూర్చుని—"నువ్వొక తెవే వచ్చావా? నీ స్నేహితురాలినీ తీసుకొచ్చావా?" అని అడిగాడు. కొద్దిగా తటపటాయించి—"నేను మాత్రమే వచ్చాను. మరి మీరు లలితను గాభరా పెట్టేశారుగా—" అంది సీత.

"పోనీలే! నువ్వయినా ఈ మాత్రం నోరు తెరిచి మాట్లాడుతున్నావు—సంతోషం...నువ్వు కూడా ఆమెలాగే మూగనోము పడితే ఇంకేమీ లేదు—"

"నన్నూ పెళ్లి చూపులు చూడడానికి ఎవరన్నావస్తే నేనూ మూగనోము పట్టే దానినే—" అని సీత, ఇంకా అక్కడ నిల్చోవడం బాగుండదని లోపలికి నడిచింది. ఎందుకో మరి ఆమె గుండె టకటకమని కొట్టుకుంది.

హాల్లో కూచుని మాట్లాడుకుంటున్నారు శాస్త్రిగారూ, కామాక్షమ్మ. సీతను చూడగానే మాటలు ఆపారు.

"ఎందుకమ్మా వచ్చావు?" అని అడిగింది కామాక్షమ్మ.

"భోజనమూ అవీ అన్నీ సరిగా అందినాయో లేదో, చూచి రమ్మంది అత్తయ్య—"

"అన్నీ అందాయి. అంతేనా?"

"అవునండీ! లలితను గురించి నేనే ఒకమాట చెబుదామని వచ్చాలు ఇవాళ అది మాట్లాడవండా వుండే అని అనుకోకండి. మా లలితంత మంచి పిల్ల తెలివయిన పిల్ల ఇంకెవ్వరూ వుండబోరు. గలగలమని మాట్లాడుతుంది. పాటనాకన్న బాగ పాడుతుంది. ఇవాళ పెళ్లి చూపులకని క్రొత్తవారు వచ్చి పాడమనే సరికి బెదరిపోయింది. అందు గురించి మీరేమీ అనుకోకండి!"

"భలే అనాధ్యురాలే ఈ పిల్ల" అన్నారు శాస్త్రి.

"అందుకనే కాబోలు మీకు సందేహం వచ్చింది—ఒకవేళ పెళ్లి కూతురు ఈ పిలేనా అని?"

"దానిదేముందిలే—ఈ అమ్మాయికి పెళ్లి లక్షణంగా జరిగి తీరుతుంది. మీ నాన్న బొంబాయిలో ఏమిచేస్తున్నారు?" అని సీతను అడిగారు శాస్త్రి.

"రైల్వేలో పనిచేస్తున్నారండీ."

"జీతం ఎంతో?"

"జీతం నెలకు మాడు వందల రూపాయలు. అయినా ఏం లాభం? అంతా ఖర్చులకే సరిపోతుంది. నన్ను చూస్తే తెలియడం లేదూ?"

"అలితలాగా నగలు వేసుకోలేదని ఆవిధంగా అంటున్నావా? దానికేముందిలే తల్లీ! ఆ శ్రీరామచంద్రుడి దయవుంటే బోలెడన్ని నగలు వేసుకుంటావులే...అయినా మీ నాన్నగారు నీ పెళ్లికై ప్రయత్నాలు చేయడం లేదా?" అని అడిగింది కామాక్షమ్మాళ్.

"మా నాన్న 'యర్లీ మేరేజ్' పనికిరాదనే పక్షంవారు. మా అమ్మ్ మాత్రం పెళ్లో రామచంద్రా అని గోలపెడుతూంటుంది. రేపు మీతో కూడా ఈ ప్రస్తావన తెస్తుందేమో! మీరేమీ పట్టించుకోకండి-"

"అట్లా అనకమ్మా! ఏ వయసులో జరగవలసింది ఆ వయస్సులో జరిగి తీరాలి కదా!" అంది కామాక్షమ్మ.

"జరగవలసిందే కాని అయిదువేలు కావాలి పదివేలు కావాలి అని వస్తే మానాన్న ఎక్కడినుండి తేగలడు? అంచేత నేను పెళ్లే చేసుకోదలచుకోలేదు."

"కొడుకులయినా కూతుళ్లయినా ఇట్లా అమ్మా నాన్నల కష్టసుఖా లెరిగి వుండాలి!" అన్నారు శాస్త్రి.

"లలితయినా ఇంతేనండీ, అమ్మా నాన్న, గీచిన గీటు దాటదు, రేపు పెళ్లయ్యాక మీ ఇంటికి వచ్చినా మీ మాట జవదాటదు...ఇందాక మీరందరూ వచ్చేశాక ఆ విషయమే నేనంటే, అది "అవును, అత్తమామలే తలిదండ్రులు, అందులో సందేహం ఏమీ లేదు." అంది. నేనేదో చిన్న దానినని చెబుతున్నానని ఏమీ అనుకోకండి కాని లలితలాటి అమ్మాయిని పెళ్ళి చేసుకోడానికి మీ అబ్బాయి ఎంతో అదృష్టం కల్గి వుండాలి, తెలుసా? మీ అబ్బాయిని పొందగల్గడమూ దాని భాగ్యమనే చెప్పాలి-" అంది సీత.

"ఓ యబ్బో! ఈ పిల్ల చాల తెలివైందే-" అన్నారు శాస్త్రి.

ఇంక ఇక్కడ నిల్చోవడం భావ్యం కాదని సీత "అత్తయ్యగారూ! ఇక నేవెళ్తాను. నేనన్న దానిలో తప్పేమన్నా వుంటే మన్నించండి-" అని చెప్పి బయలు దేరింది.

దారిలో, ఇందాకటి చోటే కూర్చునివున్న రాఘవన్-"నీ మాటలన్నీ విన్నాను. నీ స్నేహితురాలి పక్షం చాల బాగా వాదించావు సుమా! నీ వంటి దాన్ని స్నేహితురాలిగా పొందడానికి ఆమె చాల అదృష్టం కల్గివుండాలి-" అన్నాడు.

"థాంక్స్" అంది సీత.

"నాకెందుకు థాంక్స్, నేనే నీకు చెప్పాలి కాని-"

"మీ థాంక్స్ నెనిప్పడందుకోను. రేపు నెళ్ళికి ఒప్పుకున్నారని తెలిశాక అందుకుంటాను."

"పెళ్ళికి ఒప్పుకోవలసిందే. కాని ఇరుపక్షాలవారూ ఒప్పుకోవాలి కదా?" అని చిరునవ్వు నవ్వాడు రాఘవన్. సీతకూడా మందహాసంచేసి, ముందుకు నడిచింది. రాఘవన్ మాటలు, చిరునవ్వు వీటికేమిటి అర్థం అని ఆమెకు బోధపడలేదు.

కాని ఆమె అట్లా ఆవీధి వెంబడి నడుస్తున్న క్షణాన ఆకాశంనుండి గంధర్వ లామెపై పుష్పవర్షం కురిపించిన మాట; కిన్నరులు దివ్యగానాన్ని వర్షించడం నిజం. ఆగీతాలకు నాట్యమాడుతూ నడిచింది సీత. తనకు ఏమయింది, తన ఉల్లమింత ఉల్లాసంగా ఎందుకుంది! ఏమో, ఎరగదు ఆమె; గ్రహించ యత్నించనూలేదు.

ఇంటికి చేరాక ఆమె ఈలోకంలోకి వచ్చింది. తిన్నగా సతస్వతమ్మాళ్ దగ్గరకువెళ్ళి "అత్తయ్యా! నేను మన లలిత గురించి చెప్పిన మంచి మాటలకు వియ్యాల దంపతులుప్పొంగి పోయారు. అల్లుడుగారూ వింటూ కూర్చున్నారు. రేపు అంగీకారం తెలుపుతా రత్తయ్యా, మీరు చూస్తారుగా-" అని చెప్పింది.

* * *

కిట్టావయ్యార్ ఇంటి ముందువేసివున్న పందిరి క్రింద, అరుగుల్మీద ఆసీను అయివున్నా రందరూ.

లోపలినుండి వస్తున్న కిట్టావయ్యార్ని చూచి పంజువయ్యార్—"ఏమండీ, మీ సూర్యా మాటలు విన్నారా? నాలుగు రోజులపాటు పెళ్ళి అంటే దుబారా చేయడంట! కట్నాలివ్వడం, పుచ్చుకోవడం పాపంట!" అన్నాడు.

"వాడేమిటి, ఈ రోజుల్లో అందరూ ఆమాటే అంటున్నారు. ఒక పక్క పేదవారు మలమల మాడుతుంటే ఇట్లా డబ్బు తగలెబెట్టడం న్యాయమా అని అడుగుతున్నారు." అని కొడుకుని సమర్థిస్తూ చెప్పారు కిట్టావయ్యార్.

"అంతే అయితే ఫరవాకీదనుకోవచ్చు. డబ్బు వృధా చేయకూడదు అని తండ్రీ కొడుకులంటే సహజమే. కాని మీవాడు పెద్ద సోషలిస్టు నాయకుడిలా మాట్లాడుతున్నాడు. రైతులు చెమటకార్చి పొలాల్లో పంటలు పండిస్తుంటే మనం ఊరికే కూర్చుని ఆ డబ్బంతా ఇట్లా దండగ ఖర్చులు పెడుతున్నారు. 'ఇవన్నీ చాలకాలం సాగబోవు—" అని హెచ్చరిక చేస్తున్నాడండీ!"

"ఏవిటండీ మీరు? ప్రపంచపు పోకడే తెలియకుండా మాట్లాడుతున్నారు! మాన్పు అనేది సహజమే కదా...వ్యవస్థ మారకుండా శతాబ్దాల తరబడి ఇట్లాగే వుంటుందనుకుంటే అది కూపస్థ మండూక మనస్తత్వం అని చెప్పాలి. "దున్నే వాడిదే భూమి" అన్న ప్రచారం వినలేదా మీరు?" అని అడిగారు చీమాచ్చువయ్యార్.

"ఆహా! నువ్వూ అటు చేరావా నాయనా! సరే, ఇవాళ "దున్నే వాడిదే భూమి" అన్నారయ్యా, బాగుంది. రేపట్నుంచి "కోసేవాడిదే ధాన్యం" అనరా? ఆతర్వాత "తాపీ మేస్త్రీకే ఇల్లు"—"చాకలి వాడికే బట్టలు"—"డ్రైవర్లకే మోటార్లు"—"డాక్టర్లకే మందులు"—"పోర్టర్లకే రైలుబళ్ళు" అనరూ? చివరికి "వండే వాడిదే అన్నం" అంటారయ్యా! వినాశకాలే విపరీత బుద్ధికా! అన్నారు అప్పాదురైశాస్త్రి.

ఇట్లా వాద ప్రతి వాదాలు జరుగుతుండగా, చీమాచ్చువయ్యర్ ధర్మపత్ని అన్నమ్మాళ్ విసవిసా నడిచి కిట్టావయ్యరింట్లోకి వెళ్ళింది. ఆమె లోపలికి వెళ్ళిన కొన్ని నిముషాలకు భూకంపం లాంటిది ఏర్పడినట్లు అనిపించింది. వెద్దగా అరుపులు, కేకలు, ఎవరిదో ఏడుపు వినిపించాయి. వీటన్నిటినీ మించి సరస్వతమ్మాళ్ తల్లి గొంతు విన్పడింది-"ఈ దరిద్రులను పిలిపించవద్దే అంటే విన్నావా? పెళ్ళి చూపులకు వాళ్లు రాక ముందు దొడ్లో చెప్పాను విన్నావా? బావి నీటిని వరదొచ్చి కొట్టుకుపోదు-అన్నాను. ఇప్పుడు ఆంత పని జరిగింది. ఏం చేస్తా విప్పుడు?" అంటూందామె. "ఎంత అన్యాయమ్మా, ఎంత ద్రోహమమ్మా! ఎన్నడూ కనలేదు, వినలేదు—ఒచేయ్, నుండూ! పిలవరా మీ నాన్నను! ఇక్కడ కొంపలు ఆంటుకు పోతుంటే అక్కడేదో మాట్లాడుతూ కూచున్నారు. పిలుచుకు రారా వెంటనే"అని పురమాయించింది సరస్వతమ్మాళ్.

ఈ మాటలన్నీ విధిలోవి వారందరి చెవులా పడ్డాయి. కోపంగా లేచి విసవిస ఇంట్లోకి నడిచారు కిట్టావయ్యర్. "ఏమిటే, ఏమిటా రభస! పిడుగు పడ్డట్లు ఏమిటి?" అన్నారు.

"ఆ! పిడుగే పడింది! చీమాచ్చుగారి ఇల్లాలు ఏమంటుందో వినండి! చెన్నపట్నంనుండి సాంపయిన సంబంధాన్ని పిలిపించారే వాళ్లు చేసిన ఘన కార్యం వినండి! బొంబాయినుండి ముద్దుల చెల్లెలిని తీసుకొచ్చారు కదా దాని ఫలితం ఏమిటో వినండి-" అంటూ అరిచింది సరస్వతమ్మాళ్.

"అట్లాగే. అన్నీ వింటానులే! నువ్వు మాత్రం ఎవరి ప్రాణమో లేచి పోయినట్లు అరవకు! కాస్త సెమ్మదిగా మాట్లాడు." అన్నారు కిట్టావయ్యర్.

ఆయన గద్దింపు ఫలితంగా ఇంట్లో అరుపులు కేకలు తగ్గాయి. అసలు విషయం ఏమిటో బయటి కొచ్చింది.

చీమాచ్చు వయ్యర్ భార్య అన్నమ్మాళ్ చెవిలో ఆ మద్రాసునుండి వచ్చిన వాళ్ల మాటలు కొన్ని వినబడ్డాయి. ఆనాటి సారాంశం ఇది—ఆ మద్ర వాడికి లలిత నచ్చలేదుట; అతగాడు సీతను పెళ్ళి చేసుకోవాలని ఇష్టపడు

తున్నాడట; మొదట అతడి తల్లిదండ్రులు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు కాని అతడు అదేపనిగా పట్టుబట్టేసరికి వాళ్లు అతడి అభీష్టానికి తల ఒంచ వలసివచ్చింది. కాని ఈ విషయాన్ని కట్టావయ్యర్‌తో ఎట్లా ప్రస్తావించడం అని పస్తాయిస్తున్నారు. ఇన్సూరెన్స్ సుబ్బయ్యర్ గారి అభిప్రాయం కను క్కుంటుచ్చారు. ఇప్పుడే ఐసాపైసా తేల్చుకుపోవడమా. లేక ఊరికి వెళ్లి ఉత్తరం రాస్తామని చెప్పి వెళ్లి వివరంగా అంతా రాయడమా అన్న తర్జన భర్జనలలో వున్నారు ప్రస్తుతం.

ఇదంతా విన్నాక, నెమ్మదస్తుడయిన కిట్టావయ్యర్‌కే కోపం వచ్చింది. కాని కోపం ఎవరిమీద చూపించడమో తెలియలేదు. చీమాచ్చువయ్యర్‌ను చూచి "ఏమండోయ్, నే నప్పుడే చెప్పానుగా! మీ మద్రాసు వాళ్ల పెద్ద మనిషితనం చూశారా?" అన్నారు.

"వీళ్లు వద్దంటే లలిత కింక పెళ్లి కాదేవిటి? మీరు ఊఁ అనండి, రేపే వెళ్లి వంద సంబంధాలు పట్టుకొస్తాను" అన్నారు అప్పాదురై శాస్త్రి.

"చాల్లెండి. ఈ ఏడాది నా కూతురు పెళ్లి వద్దులెండి. ముందు ఊళ్లపని వెళ్లే వాళ్లందరూ వెళ్తే చాలు!" అంది సరస్వతమ్మాళ్. రాజమ్మాళ్ పలికింది. "అన్నయ్యా తప్పంతా నాది. నేను జన్మతః నిర్భాగ్యురాలని. నే నెక్కడికి వెళ్ళినా దురదృష్టం నా వెంటే వస్తుంది—"

"నువ్వూరికే మాట్లాడకు. నిన్నెవరేమన్నారు?" అన్నారు కిట్టావయ్యర్.

"ఆ పిల్లేమో పడుకుని, గుండెలు పగిలేలా ఏడుస్తూంది. సీత మాత్రం ఏం చేస్తుందిప్పుడు? వాళ్ల ముందుకు తాను రాననే అంది. కాని లలిత విన్నదా? పోనీ వదినయినా చెప్పిందా?" అంది పెద్దమ్మ అభయాంబాళ్.

"నేనో చవటని, నా కూతురు అంతకన్న చవట! మరి మీరంతా, పెద్ద వాళ్లున్నారు కదా, చెప్పకపోయారా?" అని ఛాత్కారం చేసింది సరస్వతమ్మాళ్.

"చాలు, ఆపండి! ఏడుస్తున్న అమ్మాయిని శాంతపరచండి" అన్నారు కిట్టావయ్యర్.

"ఏడుపెందుకూ, చేయాల్చిదంతా చేసేసి పైగా ఏడుపొకటా!" అంది సరస్వతమ్మాళ్.

గదిలోపల, ఏడుస్తున్న సీతను బుజ్జగిస్తున్న లలిత ఈ మాటలన్నీ విం ది. చివర అమ్మ చెప్పిన మాటలు వినగానే చర్రుమని కోపంతో బయటికి వచ్చింది.

"నాన్నా! దయచేసి నా మాట వినండి. ఇవాళ వచ్చినా అబ్బాయిని నే నెన్నటికీ పెళ్లాడను. నన్ను ముక్కలుగా నరికినా పెళ్లాడను. అసలీ వ్యవహారమంతా నాకు నచ్చలేదని మొదటినుండే అంటున్నా మీ రెవ్వరూ విన్పించుకోలేదు. సీత ముఖం కూడా కడుక్కోనంది; నాతో రావడాని కిష్టపడలేదు. నేనే దానిని బలవంతం చేసి బయిటికి లాక్కువచ్చాను. మీరు గనుక ఇట్లా అన్యాయంగా దానిపై ఆగ్గాండాలు వేశారంటే నేను ఇంట్లోంచి పారిపోతాను; లేకపోతే బావిలో దూకి చస్తాను-" అంది లలిత కోపమూ, ఏడుపూ పొంగి పొరలుతుండగా.

ఆమె ఇట్లా సీత తరఫున మాట్లాడడం అందరికీ కాస్త ఊరట కల్గించింది. కాని సరస్వతమ్మ కోపాన్ని మాత్రం ద్విగుణీకృతం చేసింది. "పోవే! ఇపుడే పోయి బావిలో దూకు! నా కసలు పిల్లే పుట్టలేదనుకుంటాను ఫో-" అంది ఆమె.

"అబ్బబ్బ! ఏమిటర్రా ఈ అపశకునపు మాటలు! ఇప్పుడేమి పుట్టి మునిగిం దనీ...విషయం కనుక్కురావడానికి చీమాచ్చు వెళ్లాడు కదా, అతణ్ణి కానివ్వండి" అన్నారు అప్పాదురైశాస్త్రి.

"చీమాచ్చుమామయ్య ఏమి కనుక్కువచ్చినా నాకు అనవసరం. ఆ అబ్బాయికి నేను వచ్చినా సరే నే వతడిని పెళ్లాడను! ముమ్మాటికి పెళ్లాడను" అని ప్రతిజ్ఞ చేసింది లలిత.

"ఏమిటి లలితా, ఈ మాటలు?" అన్నారు కిట్టావయ్యర్.

"అది తనంటతానై మాట్లాడుతున్నదా ఏమిటి, ఇంకొకరు చెప్పగా విని మాట్లాడుతుంది. ఆ సూర్యాగాడి దురోచ్ఛనలే దీన్నిట్లా వెర్రిబాగులదాన్ని చేశాయి. వాడి మతి ఎవరో చెడగొట్టారు" అంది సరస్వతమ్మ.

ఇంతసేపట్నుంచీ ఇదంతా వింటున్న సూర్యా రంగంలోకి దిగాడు.

"అమ్మా! నా మతి లక్షణంగా వుంది. ఈ తెలివితక్కువ వ్యవహారం వద్దని ముందటే చెబితే విన్నారు కాదు. మీ కాలంలో మీరందరూ పెళ్లిళ్లు చేసుకున్న కాపురాలు చేస్తున్నారు చాలు! మా ఇష్టాలకు మమ్మల్ని వదిలి వేయండి. లలితకు ఇష్టమయితే వెళ్లి చేసుకుంటుంది, లేదూ, సాక్షాత్తు ఆ బ్రహ్మదేవుడే వచ్చి చెప్పినా చేసుకోదు. సీతయినా అంతే! ఆ దొరగారు తడలి నచ్చకపోతే ఆ మాట ధైర్యంగా చెప్పేయాలిగాని అందుకోసం ఇట్లా వెక్కి వెక్కి ఏడవడం దేనికి?" అన్నాడు.

సూర్యా మనస్సు కుతకుత లాడిపోతుంది. అసలే ఆ మద్రాసునుండి వచ్చి నతడంటే నచ్చలేదు; అందులోనూ అతడు సీతను పెళ్ళాడుదా మనుకుంటు న్నాడని తెలిసేసరికి అగ్నిలో ఆజ్యంపోసిన చందాన అయింది అతడి మనసు.

కాస్సేపటికి చీమాచ్చువయ్యర్ నుండి కిట్టావయ్యర్‌కు కబురు వచ్చింది. ఈయన వెళ్ళారు. అక్కడ సబ్ జడ్జి శాస్త్రిగారు, వాళ్ళాయిడ విషయాన్ని సుస్పష్టంగా చెప్పేశారు. "మీ అయ్యాయికి ఎటువంటి లోటూ లేదు; చిలకలా వుంది. కాని ఏం చేయడం, ఈ కాలపు పిల్లవాళ్ళ ధోరణులే విచిత్రంగా వుంటున్నాయి. పెళ్లంటూ చేసుకుంటే సీతనే పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు. మే మెంత చెప్పినా వినడంలేదు మరి మీ కిష్టమైతే చెప్పండి. పిల్లకు కాని పిల్ల తల్లికిగాని ఇష్టం లేకపోతే చెప్పండి. ఇందులో బలవంతం ఏమీ లేదు" అన్నారు.

కిట్టావయ్యర్ దిగ్భ్రమ చెందారు; ఏమీ చెప్పలేక- "దానికేం, ఇప్పుడే పిల్ల తల్లిని కనుక్కొచ్చి చెబుతాను" అని బయలుదేరారు. తిన్నగా ఇంటికి పోక, చీమాచ్చువయ్యర్‌ను, సుబ్బయ్యర్‌నూ తీసుకుని గుంటగట్టు బంగళాకు వెళ్లి ఆలోచించారు. వాళ్ళిద్దరూ కూడా "రొట్టె విరిగి నేతిలో పడ్డట్లయింది.

మా ఆయమ్మాయి కేవిటి, మంచి సంబంధాలు కొల్లలుగా వస్తాయి. కాని ఆ బొంబాయి పిల్లకు వరుడు లభించడం కష్టం. కట్నం అదీ లేకుండా చేసుకుంటానంటున్నారు. వద్దనడం ఎందుకో? అట్టా వద్దన్నందువలన ఎవరికేమి లాభం? కనుక చేసే తాంబూలాలు మార్చుకోవడం మంచిది'' అన్నారు. మొదట వచ్చిన కోపము, కలగిన నిరాశ కాస్త సర్దుకున్నందువలన కిట్టావయ్యర్‌కూ ఈ సలహా సమంజసంగానే తోచింది. కాని ఈ మాటను తన ఇల్లాలితో చెప్పడం ఎలాగ అనే సమస్య పట్టుకుంది ఆయనను. రాత్రి ఒంటిగంటకు ఆయన ఇంటికి బయల్దేరారు. ఆయన సమస్యకు పరిష్కారం సూర్యా చెప్పాడు. దుఃఖంలో నిండివున్న సూర్యా మనసూ కొద్ది కొద్దిగా కుదుట పడసాగింది. ఏమో, ఇదంతా నైవసిర్గిత మేమో ఎవరికి తెలుసు నెలకు ఎనువందలయాభైరూపాయలకు జీతంమీద ఢిల్లీ ఉద్యోగం చేస్తున్న సౌందరరాఘునే సీతకు తనకన్న తగిన వరుడనడంలో సందేహం ఏమీ లేదు. సీత అదృష్టం కొద్ది అన్నీ ఇట్లా జరిగివుండవచ్చు. సీత సుఖానికి అడ్డుగా నిలవడానికి తా నెవరు? ఇట్లా పరిపరి విధాల ఆలోచించ సాగాడు సూర్యా.

రాత్రి ఒంటిగంటకు ఇల్లు చేరిన కిట్టావయ్యర్‌ను సూర్యా ''నాన్నా! వాళ్లేమన్నారు? మీరేమనుకున్నారు?'' అని అడిగాడు. ''నువ్వింకా నిద్ర పోలేదా సూర్యా? నిన్నే ఉపాయం అడుగుదాం మనుకుంటున్నాను'' అన్నారు కిట్టావయ్యర్ ''సీతనే పెళ్లాడతానంటున్నాడా అబ్బాయి. అతడి అమ్మ నాన్న అందుకు ఒప్పుకున్నారా. వాళ్లకు కట్నాలు కానుకలు ఏమీ వద్దట. మరి నువ్వేమంటావు?'' అని అడిగారు.

''నాన్నా! వ్యవహారం ఇంతదాక వచ్చింది గనుక ఇప్పుడొక విషయం చెబుతా వినండి. మన వకీలు ఆత్మనాధయ్యర్ కొడుకు పట్టాభిరామనకు లలితను పెళ్లాడాలని వుంది. పోయిన సంవత్సరం మీరందరూ దేవపట్నం వచ్చి వాళ్లింటో కొన్నాళ్లున్నారే. అప్పుడు పట్టాభి లలితను చూశాడు. లలిత అతడికి నచ్చింది. అటూటప్పుడు లలితకోసం వేరే సంబంధాలు వెతుకుతున్నారని అతడికి బాధగా వుంది. వకీలుగారికి కూడా అదే బాధ ''మీ నాన్నకు

మే మెక్కడ కనపడతామోయ్, పెద్ద పెద్ద సంబంధాలవాద వున్నాడులే_'' అన్నాడు ఆయన'' అని చెప్పాడు సూర్యా.

''నిజమేరా. వకీలుగారింటిది మంచి సంబంధం; నాకూ ఇష్టమే కాని మీ అమ్మే నన్ను- ''ఇంకా మంచిసంబంధం వెతకండి, వెతకండి'' అని ప్రేరేపించింది. దాన్ని గురించి ఏదో ఒకటి నిర్ణయిద్దాము. ముందు ఈ సీత విషయం ఏమి చేద్దామో చెప్పు._''

''సీతకూ, అత్తయ్యకూ ఇష్టమయితే పెళ్లి చేసేయడమే! ఎక్కువ ఖర్చు లేకుండా సీతకు ఇల్లాంటి సంబంధం దొరకడం మనందరికీ సంతోషమేకదా. ఈ పెళ్లి జరిగితే మనకూ మంచి పేరేకద_''

''అయితే సూర్యా! ఈ విషయం వివరంగా నువ్వే మా అమ్మకు నచ్చ జెప్పి, దానిని ఒప్పించాలి నేను చెబుతే నా చెల్లెలి కూతురిని వెనకేసు కొస్తున్నానని పోట్లాటకు తయారవుతుంది_''

''దానికేం లెండి నావ్నా, నేను అమ్మకు చెబుతాగా!,'' అన్నాడు సూర్యా.

ఆ పని సూర్యా అనుకున్నంత సులభంగా నెరవేరలేదు. కాని చివరకతడు విజయం సాధించాడు. అన్నిటికన్న ఎక్కువగా—'ఆమ్మా! ఈ మద్రాసు అబ్బాయికి అలితనిస్తే ఢిల్లీ, లాహోరు, కలకత్తావంటి దూరదేశాలకు పోవాల్సివుంటుంది, మన వకీలుగా రబ్బాయికిస్తే దగ్గరగా వుంటుంది, నువ్వు నాన్న కావల్సివపుడెల్లా వెళ్ళి చూచిరావచ్చు—' అన్న సూర్యా హితబోధ సరస్వతమ్మాళని మార్చింది.

* * *

మరురోజు సాయంకాలం, అందరి సమ్మతంమేరకు, మద్రాసు వాస్తవ్యులు, మాజీ సబ్ జడ్జి పద్మలోచన శాస్త్రి పుత్రుడు చిరంజీవి సౌందర లాఘవన్ను బొంబాయి నగర వాస్తవ్యులు దురైసామి ఆయ్యర్ కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి సీతనిచ్చి వివాహం చేయడానికి నిశ్చితార్థం జరిగింది.

ఈ సంబరంలో అందరికన్న ఏక్కువ ఉత్సాహంతో లలిత పాల్గొంది; రాఘవన్‌ను ఒకటి రెండుసార్లు 'అల్లుడుగారూ!' అని సంబోధించి అతడితో మాట్లాడనుకూడా మాట్లాడింది!

9

సీతతో తన వివాహం నిశ్చయించుకుని మద్రాసుకువచ్చిన సౌందర రాఘవన్ మనసు ఉల్లాసంగావుంది. తన జీవితంలో నూతన అధ్యాయం ఆరంభమవుతుందన్న ఆనందం అతడిని ఆవహించింది. తారిణితో తన స్నేహం అంతా కల అని మరవడానికి ప్రయతించసాగాడు; చాలవరకు మరిచిపోయాడు కూడా. ఒక రోజు ముజఫర్‌పూర్ నుండి అతడికో వుత్తరం వచ్చింది. అందులోని విషయం అతడిని ఆశ్చర్య చకితుడిని గావించింది. ముజఫర్‌పూర్ భూకంప బాధానివారణ సంఘంవారి మకామునుండి వచ్చిన ఆ వుత్తరంలో—ఈ క్రింది విధంగావుంది.

"

ముజఫల్‌పూర్

అయ్యా, 12_2_34

మీకు దుఃఖంకల్గించే వార్తను తెలియజేయవలసి వస్తూంది. బొంబాయి నుండి తారిణి అన్న పేరుగల దేవసేవిక ఇక్కడకువచ్చి, ఇక్కడి బాధితులకు సేవచేస్తూంది. ఆమె సేవానిరతి, సచ్ఛీలత ఇక్కడ ఆమెను అందరి ప్రీతికి పాత్రురాలిగా చేసింది. కాని ఆమెకు ఒక దురలవాటుంది. ఆపుడప్పుడు వెళ్ళి భూకంప ఫలితంగా ఏర్పడిన పెద్ద పెద్ద పగుళ్ళ అంచుననిబడి తొంగి చూస్తుండేది. మేము ఎన్నిసార్లు చెప్పినా ఆమె ఆ అలవాటు మానుకోలేదు. నిన్న మధ్యాహ్నం శిబిరంలో భోజనం ముగించి వెళ్ళింది; రాత్రి

వెనక్కి రాలేదు. ఆఖరుసారిగా ఆమెను చూచినవారు ఆమె ఒక పెద్ద పగులు పక్కగా నిల్చునివుండగా చూచినట్లు చెబుతున్నారు. మరి ఆమె జాడ ఇంతవరకు లేదు. ఎంతో వెతికిచూచాము కాని ఫలితం లేకపోయింది. ఆమె డైరీలో మీ చిరునామా వున్నందున మీకు వుత్తరం రాస్తున్నాము. తారిణి బంధువులు మీకెవరన్నా తెలిసివుంటే వారికీ వార్త తెలుపగలరు. ఓక వేళ ఆదృష్టవశాత్తు తారిణి వెనక్కివస్తే మీకావార్త తెలియజేయగలము.

ఇట్లు,
సరళాదేవి.''

ఉత్తరంలోని మొదటి వాక్యాలు చదివేసరికి రాఘవన్‌కు తారిణిమీద వుండిన కోపమంతా పోయింది. అతడి హృదయంలో ప్రేమ జాలి ఉప్పొంగి వాయి. ఉత్తరం ముగించేసరికి అతడి కళ్ళనిండా కన్నీరు క్రమ్మింది. లేచి వెళ్ళి అలమారా తాళంతీసి అందులోవున్న తారిణి ఫోటోను చేతలోకి తీసుకున్నాడు. తారిణి మాటలు, చేతలు, హావభావనిలా సాలు - అన్నీ ఒక టొకటిగా అతడి మనోనేత్రం ముందు ప్రత్యక్షమయ్యాయి. ''ఆహా! ఆఖరికి ఇట్లా ముగిసిందా నీ జీవితం' అనుకున్నప్పుడాతని అశ్రువులు ఒకటొకటిగా ఆమె ఫోటోమీద రాలాయి. ఆ మరుక్షణమే ఒక విధమైన ప్రశాంతి అతడి కావహించింది.

ఆ తర్వాత వారం, పది రోజులదాక రాఘవన్, ముజఫర్‌పూర్ నుండి ఏవన్నా వుత్తరం, మంచి వార్తను మోసుకురాగల వుత్తరం, వస్తుందేమోనని ఎదురుచూచాడు. కాని అటువంటి దేమీ రాలేదు.

* * *

సీత పెళ్ళి ఖాయమయిన కొన్ని రోజులకు, సూర్యా అతడి బొంబాయి అత్తయ్యాకలిసి గుంటగట్టు బంగళాకు వచ్చాడు.

''అత్తయ్యా! మీకో విషయంచేయుదామనే ఇక్కడకు చెబపిలుచుకొనివచ్చాను.'' అన్నాడు సూర్యా. కాసేపు గుంటలోని కలువపూలనూ,

గుంట ఆవలిగట్టున వున్న సరుగుడులోవునూచూచి, తర్వాత పలికాడు. "పెద్ద విషయం కాదనుకోండి. ఆకాశరామన్న వుత్తరం అని ఎపుడన్నా విన్నారా? ఊళ్ళూపేరూ సంతకమూలేకుండా వుండే వుత్తరం; ఈర్ష్యతో, ద్వేషంతో ఎవరికో చెడుపుచేయాలనే వుద్దేశంతో రాస్తారే ఆ వుత్తరం, లాటిదొకటి మీ పేరిట వచ్చిందత్తయ్యా!"

"ఆకాశరామన్న వుత్తరమా, నాకా?! అందులో ఏముంది? ఎవరిని గురించి వుంది? నాగురించా? మామయ్యగురించా?"

"మీ ఇద్దరిగురించి కానేకాదు."

"అయితే సీతగురించా? ఏదుర్మార్గుడు ఏం రాశాడు నా తల్లిగురించి?" అన్నప్పుడామెలో కోపము శోకము ప్రతిధ్వనించాయి.

"లేదు; లేదు సీతనుగురించి ఏముంది రాయిడానికి? సీతలాటి కూతురును కనడం మీ భాగ్యం!"

రాజమ్మాళ్ మొహం నిప్పారింది: "అయితే ఆ వుత్తరంలో ఎవరి గురించి రాశారోయ్?"

"సితకు నిశ్చయించుకున్నామే ఆ వరుడిగురించి రాసివుంది;"

"అల్లుడిగురించి ఏమని రాశారు నూర్యా?" అని కుతూహలంతో అడిగించామె.

"చెప్పడానికి నోరు రావడం లేదత్తయ్యా!"

"ఫరవాలేదు, చెప్పు. నేను బాధపడతానని వెనకాడకు-"

"రాఘవన్‌కు ఇరవరకే, బొంబాయిలో ఒకమ్మాయితో సంబంధం వుందిట. ఆ అమ్మాయి ఒకగోజు పద్మాపురంవచ్చి పోట్లాడి, నానారభసా చేసి వెళ్ళిందిట. ఊరంతా నవ్వుకున్నారట. అట్లాంటివాడికి పిల్ల నివ్వదగునా అని రాసివుంది."

నిట్టూర్పు విడిచింది రాజమ్మాళ్ కాస్సేపు పూర్కుని, తర్వాత అడిగింది. "అంతేనా, ఇంకా ఏమన్నావుందా?"

"విగ్యూంకులగురించి హేయంగా రాశారు. ముసలాయనకు డబ్బు మీద ఆశ ఎక్కువట. అయన భార్య చాల చెడ్డదట. పెద్ద కోడలని నానా హింసలూ పెట్టిందట. ఆ పిల్ల పుట్టి టికి వెళ్ళిపోయింది; పెద్ద కొడుకూ ఆమెతో బాటే వెళ్ళిపోయాడట. ఇట్లాంటి సంబంధాన్ని చసుకుంటారా అని రాశారు."

కొంతసేపు మౌనంగా ఆలోచించాక అడిగింది రాజమ్మాళ్: "నాయనా మూర్యా! వయసుకు చిన్నవాడయినా అన్ని తెలిసినవాడివు నువ్వు. నువ్వు చెప్పు—నీ కేమన్పిస్తూంది? ఈ వుత్తరంలో విషయాలన్నీ నిజమయి వుంటాయా?"

"ఉండదు; ఇది ఎవరో గిట్టనివాళ్ళు ఈర్ష్యతో రాసిన వుత్తరం. ఇది కారణంగా పెళ్ళిని మానుకోవడం వివేకంకాదని నా భావన. మరి మీరేమనుకుంటున్నారో? ఇవన్నీ తెలిస్తే మామయ్య ఏమంటాడో—?"

'మీ మామయ్యనుండి వుత్తరం వచ్చింది. పెళ్ళికి ముంగురోజు ఈ వూరు చేరుతానని రాశారు. ఢిల్లీలో అబ్బాయిగురించి వాకబుచేశారట. చాల తెలివిగలవాడనీ, పై అధికారుల కితడంటే సదభిప్రాయం వుందనీ, జీతం నెలకు రెండువేలు దాక పెరిగే అవకాశాలున్నవనీ అన్నారట."

"చూశారా మరి? నా మాటలు నిజమేకదా! ఇది ఎవరో అసూయతో రాశారంతే—."

"మంచి సంబంధం కుదరడం అంటే మాటలా? ఎంతోమంది ఇతగాడికి పిల్లనిద్దామని వచ్చివుంటారు; కుదిరివుండదు. అంచేత మన సంబంధం నిశ్చయమయిందని తెలిసి వుండబట్టలేక ఇది రాసివుంటారు—"

"అవునత్తయ్యా, అంతే!"

"అయితే పెళ్ళిచేయడమే మంచిదికదూ?"

"అంతే మరి! ఇంక వెనకచూపే పనికిరాదు—"

"ఒకవేళ ఆ వుత్తరంలోనివి యదార్థమయినా కూడా మనం ఏమీ చేయలేము. సీత సుఖ సంతోషాలతో జీవించాలని ఆ పరాశక్తి దీవెనవుంటే

అట్లాగే జరుగుతుంది. ఈ పెళ్ళి జరగాలన్నది దైవనిర్ణయం అయితే దానిని ఎవరూ మార్చలేరు కద?"

"నిజమే! లలితను చూడడానికని వచ్చినవాడు ఎపుడయితే సీత నిన్నుకువ్వాడో అపుడే ఇది భగవంతుడి నిర్ణయం అని తేలిందికదా—"

"అంతే నాయనా అంతే! ఎవరో రాసిన ఆ పాడు వుత్తరాలన్ని చదివి నా మనసు పాడుచేసుకోవడం ఎందుకు? సూర్యా! ఇకనుండి, నాకుగాని, పీతకుగాని ఏ వుత్తరాలు వచ్చినా నువ్వే తీసేసుకొని, చదివిచూచి, మాకు ఇవ్వదగినదయితే ఇవ్వు లేకపోతే చింపి అవతల పారవేయి...అసలు మీనాన్నకు వచ్చే వుత్తరాలుకూడా నువ్వే తీసుకునిచూడడ మంచిది. నాకు రాసినట్లే ఎవడో దుర్మార్గుడు అన్నయ్యకూ రాసి వాడి మనసు పాడుచేయ డానికి ప్రయత్నించవచ్చు..."

"అలాగే అత్తయ్యా! వాన్న వుత్తరాలుకూడా తపాలాఫీసుకే వెళ్ళి వేసే అందుకుంటాను గా—"

"ఏమో నాయనా! నీ కెంతో ఋణపడివున్నాను. నేనేమి చేయ గలను. దేవుడు నిన్ను సదా చల్లగాచూడాలని ప్రార్థించగలనంతే—"

కొంతసేపు ఇద్దరూ మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుతూ గాలి హోరు వినించింది. సరుగుడు లోపులోనుండి దూసుకువచ్చిన ఆ గాలిహోరు సముద్రపు అలల హోరువలె ధ్వనించింది.

'అత్తయ్యా, గుర్తుందా, ముందొకనాడు ఈ అలల హోరుగంటి చప్పుడువిని మీరు భయపడ్డారు. ఏమిటని అడిగితే తర్వాత చెబుతా వన్నారు?"

రాజమ్మాల్ మొహంమీద మేఘం ఆవరించినట్లయింది:

"చెబుతాను సూర్యా! ఈ క్షణాన అదే చెబుదామనే నేనూ ఆను కుంటున్నాను. ఒక్కడికే రాకముందు బొంబాయిలో నేను జబ్బుతో పడక మీద వున్నానుకదా...అప్పుడా జ్వరవేగంలో ఎన్నో భ్రమలు, కలలు, చూచే

దానిని! కొన్ని సంతోషమైనవి; కొన్ని భయంకరమైనవి... నేను, సీతా సముద్రపు ఒడ్డుననిల్చుని వున్నాము. సీత సముద్రంలోకి నడిచి పోసాగింది. "వెళ్లవద్దే! వెళ్లకే!" అని అరుస్తున్నాను. కాని ఆ అలలహోరులో నా గొంతు దానికి వినిపించనేలేదు. అది ఇంకా నడిచిపోతూనేవుంది. పెద్ద కెరటంవచ్చి దానిని కొట్టుకుపోసాగింది. ఈత నేర్చిన నేను తక్షణం, దానిని రక్షిద్దామని, సముద్రంలోకి దూకాను. అలలను దాటుతూ ఈదుతున్నాను. ఆ అలల చప్పుడు మధ్య 'సీతా! సీతా!' అని అరుస్తున్నాను. నా చేతులు కాళ్ళు అలసిపోతున్నాయి. చటుక్కున చేతికి ఏదో తగిలింది. అది సీతచేయి! దాని చేతిని పట్టుకున్నాను...అంతే కల చెదిరిపోయింది. ఇట్లా ఎన్నిసార్లో జరిగిందీగాని సరిగ్గా సీతచేతిని నేను పట్టుకునే సమయానికి నాకు స్పృహ కలిగేది. అంతా నిజంగా నడిచినట్లేవుండేది. ఇప్పటికీ అది తలచుకుంటే భీతి వేర్వడుతుంది. ఒళ్లు కంపిస్తుంది. ఈ సరుగుడులోపు గాలిహోరు విన్నా అదే గుర్తుకువస్తుంది—"

కొంతసేపుండి సూర్యా—"ఇదంతా సీతకెపుడన్నా చెప్పారా" అని అడిగాడు.

"ఆ! చెప్పాను. జాగ్రత్తగా వుండమని దానిని హెచ్చరించాను."

"అత్తయ్యా! మీరీ విషయం సీతకు చెప్పివుండకూడదు—" అన్నాడు సూర్యా.

10

రాజంపేట అగ్రహారంలో చెప్పనలవికాని హడావిడి! మరి మున్సబు కొట్టావయ్యర్ ఇంటి పెళ్లి అంటే సామాన్యమా! పెళ్ళికి వారం రోజులు ముందే మేళతాళాలు మ్రోగాయి. ఆ తర్వాత ఆ పూరిలో ఏ ఇంట్లోమా

పాయ్యాలో పిల్లిలేవలేదంటే నమ్మండి. అందరికీ కిట్టూవయ్యరింట్లోనే భోజనం. ఎడ్డబంద్ద రాకపోకలకు, వాటి మెడగంటల గణగణ మోతలకు అంతే లేదు.

పెళ్ళికి రెండు రోజులుండగా ఇవరు విమ్మాలింద్దవారూ వచ్చేశారు. దానితో ఊరంతా ఉత్సవమే! జన సంక్షోభానికి వారి ఉత్సాహానికి అవధులు లేకపోయాయి.

ఇంత ఆనందోత్సాహాలలోనూ ఒక్క కొలత వుండిపోయింది. అది, సీత తండ్రి దుర్గాసాయి అయ్యర్ ఇంతవరకూ రాకపోవడమే.

కాని ఇందుకని సీత పెళ్ళి వాయిదా వేయాలన్న ప్రస్తావి రానేలేదు. పెళ్ళి, రాజమ్మాల్ మనసు ద్వైధీభావంతో కొట్టుకులాడుతోంది. కాని ఆమె తన అంతరంగంలోని ఆ వేదనను బయటికి కనపడనియలేదు. తన భర్త రాకపోయినాసరే సీత పెళ్లి కొనసాగవలసిందే ని చెప్పేంతామె. ఈ పెళ్లిపట్ల తన సంపూర్ణమోద ప్రమోదాలను తెలుపుతూ దొరైస్వామి రాసిన వుత్తరమే ఆమెకు ఆ బలాన్ని ఇచ్చింది. ఆ వుత్తరం చూచాకనే విమ్మాల వారి తటపటాయింపూ తగ్గింది.

రాత్రి పదిగంటలకు ఆఖరి రైలు బండిలోకూడా దుర్గాసామి రాకపోయేసరికి కిట్టూవయ్యర్ చెల్లెలితోకలిసి మాట్లాడారు. రాజమ్మాల్ అన్నయ్య అభయాంబాళూ, ఆమె భర్త పీటలమీదకూచుని సీతను కన్యాదానం చేసేటట్లు నిశ్చయించారు.

"సీత అదృష్టవంతురాలు కనుకనే వైదికాచార సంపన్నులయిన దంపతులు దానిని కన్యాదానం చేయనున్నారు—" అని సంతృప్తి చెందింది రాజమ్మాల్. అభయాంబాల్ మర్యాదనికయితే హద్దేలేకపోయింది.

కిట్టూయ్యర్, లలితను సీతను సరిసమానంగా భావించుకునే అన్ని పెళ్ళి ఏర్పాట్లనూ చేశారు. వరుడికి వధువుకు ముహూర్తపు బట్టలు కానివ్వండి మంగళసూత్రాలు కానివ్వండి ఆయన ఒకలాటి వెనకాడలేదు. కాని ఇంటి ఆడవాళ్లు

పెత్తనంవహించిన విషయాలలో తేడాలుండక మానలేదు. సరస్వతమ్మాల్ తన మూతురు లలిత కొకతీరుగా, సీతకొకతీరుగా సమకూర్చింది.

ఇదిమాచి బాధపడిన అభయాంబాళ్‌తో రాజమ్మాళ్—' చాల్లే పూర్కో- అక్కా-! ఏదో, ఈ పెద్ద మనిషి రానందుకు ఈ మాత్రమన్నా జరుగుతున్నదేమని నేను సంతోషిస్తున్నాను. అన్నయ్య మంచితనంవల్లనే ఈ పెళ్ళి జరుగుతూంది. లేకపోతే ఏమియివుండేది? దేవుడి దయవల్ల మాకు వచ్చిన విద్యాలవారునూ, "అదీలేదే, ఇదిలేదే" అని పీకేవాళ్లు కారు... అంచేత, అక్కయ్యా, అనవసరంగా బాధపడకు—" అని చెప్పింది.

సీతకు లోటుగానే వుంది. నాన్నరాలేదే అని ఆరాటంకలిగింది. లలితకు చేస్తున్నట్లు తనకు చేసేవాళ్లు లేరే అని మనసు పీకింది. కాని అదంతా తొక్కిపెట్టుకొని— 'పోని లే! లలితకు ఎవరెలపెడితేనేమి, నా అంత భాగ్యశాలి కాదుగా తాను—" అని పొంగిపోయింది.

వీరందరికన్న ఎక్కువ చింతించినవాడు సూర్యా. పెళ్లికి ముందురోజు రాజమ్మాళ్ చేరిటవచ్చిన తంతియే అతడి విచారానికి కారణం. ఎప్పటిలా వుత్తరాలందుకోవడానికి తపాలాఫీసుకు వెళ్లిన సూర్యా, రన్నర్ విడిగా తెచ్చిన తంతినీ అందుకున్నాడు. ఆ తంతిని విప్పిచదివాడు; నిశ్చేష్టుడయ్యాడు— 'పెళ్లిని ఆపండి. కారణం ఏవిటో సముఖంలోవచ్చి చెబుతాను- దుర్గైసామి "—అని వుంది ఆ తంతిలో.

ఈ తంతి నేమిచేయడమో పాలుపోలేదతడికి. సీత పెళ్ళిగురించి ఆకాశరామన్న వుత్తరాలు రాసినవాళ్ళే ఈ తంతినీ ఇచ్చి వుంటారు. అవును, అదే అయివుంటుంది. కాని దీన్నిగురించి ఎవరికయినా చెప్పినా, చూపించినా గందరగోళం అవుతుంది. కనుక దీనినిప్పుడు ఎవరికీ చూపించరాదు, అన్న నిర్ణయానికి వచ్చాడు సూర్యా. రాత్రికెటూ దుర్గైసామి అయ్యర్ రావాలి. ఆయన వచ్చాక కావాలంటే పెళ్ళి ఆపుకోనివ్వండి. కాని అప్పుడు కూడ ఆయనతో వాదించడం తన ధర్మం. కనుక తంతినిగుప్పించి ఇప్పుడు మాట్లాడరాదు; రాత్రి దుర్గైసామి రాకపోతే చూద్దాము.

ఈ విధంగా ఒక నిర్ణయానికి వచ్చిన సూర్యా, రాత్రికూడా దురైసామి అయ్యర్ రాకపోయేసరికి మరింత అయోమయంలో పడ్డాడు. 'జానువాస'పు ఊరేగింపుకూడా అయిపోతుంటే ఇంక తంతిగురించి చెప్పడం ఎట్లాగ? ఎవరో మూర్ఖుడు, ఈర్ష్యగొన్న పిశాచి ఇచ్చిన తంతి కారణంగా ఇన్ని ఏర్పాట్లు ఆపడమా, సీతకూ రాజమ్మాళికీ తీరని దుఃఖాన్ని కల్గించడమా? ఛీ! అట్లా ఎన్నటికీ చేయరాదు. దేవుడెట్లా నిర్ణయిస్తే అట్లా జరగనీ: ఈ తంతి విషయం ఇంకొకరికి తెలియనిచ్చేదిలేదు—అన్న నిర్ణయానికి వచ్చాడు సూర్యా. అయినా ఆ తంతి అతడి మనసు నొక కుమ్మరి పురుగులా దొలవడం మానలేదు.

మరుసటి రోజున తెల్లవారకముందే ముహూర్తానికి కావలసినవన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. పదిలోపుగానే ముహూర్తం. హడావిడి ఉరుకులు, పరుగులు...'' అయిపోయింది, ముహూర్తవేళయిపోయింది'' అని తలోప్రక్కనుంచీ అరిచారు. అల్లుళ్ళిద్దరూ కాశీయాత్రకని బయలుదేరి పట్టుచుని పదిఅడుగులు వేశారోలేదో—''చాల్లెండి, ఏకంగా కాశికే వెళ్లిపోకండి—'' 'అని అరిచారు, మిగతావన్నీ చకచక కానిచ్చారు. ముహూర్తం ఆసన్నమయింది. జంట నాదస్వరాలు చెవులకు తూట్లు పెడుతుండగా, డోలు వాద్యగాళ్లు ఇంటికప్పులదర గోడుతుండగా, వేద మంత్ర ఘోషలు ఆకాశాన్ని అంటగా, ముత్తైదువులందరూ ''గౌరీ కల్యాణం'' పాడగా సౌందర రాఘవన్ సీత మెడలో మంగళసూత్రం కట్టాడు; అదే సుముహూర్తాన్నే పట్టాభిరామన్ లలిత మెడలో మూడుముళ్లూ వేశాడు.

మాంగల్య ధారణకాగానే కొంత సందడితగ్గింది. అంతవరకు ఆ ఇంటిలో ఇరుక్కుని చెమటలుకక్కిన వాళ్లందరూ వీధిలోకివచ్చి గాలి పీల్చసాగారు. సూర్యాకూడా వీధిలోకి వచ్చాడు. పొద్దుటినుండి ఇంట్లోకి వీధిలోకి అధ్వమం వేయిసార్లన్నా తిరిగిన అతడికి—''అమ్మయ్య! ఇక నేం, పెళ్లి అయిపోయింది; ఇంక తిరుగులేదు'' అన్న తలపు ఊరట కల్గించింది.

కాస్సేపటికి ఎద్దుబండి రావడం వినిపించింది. ఎద్దుల మెడగంటలు వినిపించాయి. వీధి చివర కిట్టావయ్యర్ గారి బండి కనుపించింది. అందులో బొంబాయి మామయ్యవచ్చి వుండాలి. సూర్యా పరుగెత్తుకుని వెళ్ళాడు. బండిలోవున్న వ్యక్తి దిగకముందే—"అదేమిటి మామయ్య! ఇట్లా చేశావేమిటి? రాత్రంతా మీకోసం చూచిచూచి కళ్లుకాయలు కాచిపోయాయి." అని కలకరించాడు.

బండిలోవున్నది దురైసామి అయ్యరే. ఆయన సూర్యాను ఎగాదిగా చూశాడు.

"నీను సీతకు బావను; సూర్యాని"

"ఓ! కిట్టావయ్యర్ రెండో అబ్బాయివికాదూ?"

"అవును. మీరింత ఆలస్యంగా వచ్చారేం? మాంగల్యధారణ అయి పావుగంటయింది. పెద్దత్తయ్య మామయ్య కన్యాదానం చేశారు."

"ఏమిటి మాంగల్య ధారణా? ఎవరికి??"

"సీతకు, లలితకూ!"

"సీతకుకూడానా? వరుడెవరు?"

"ఇంకెవరు, సౌందరరాఘవనే! ఏం అట్లా అడుగుతువ్నారు? మీకు ఇంతకుముందే తెలుసునుకదా, ఢిల్లీనుండి మీరుత్తరంకూడా రాశారు కదా?"

"నేనొక తంతినిచ్చానే?" అని అడిగినప్పుడు దురైసామి అయ్యర్. మాటలు తడబడ్డాయి.

"తంతికూ? ఏమితంతి? ఏ దీరాలేదే?" అన్నాడు సూర్యా ఏమీ తొరొకకుండా.

"సీత పెళ్లి నాపమని తంతి ఇచ్చాను. అది అందలేదా?" సూర్యా తన పందిగావస్తను తప్పి పుచ్చుకుంటూ "మామయ్యా! నిజమే కాస్సేపు ముందర ఒక తంతివచ్చింది. నేనే అందుకుని చొక్కాజేబులో వుంచుకున్నాను. కాని ముహూర్తపు హడావడిలో మరిచేపోయ్యా. నేను చదవలేదు;

ఆ తయ్యకివ్వనూలేదు. ఇదేనా అది'' అంటూ చొక్కాజేబు వెతికి తంతిని తీసిచ్చాడు.

''ఆ! ఇవే! ఇది నిన్ననే రావాలికదా. ఈ మారుమూల కుగ్రామం కావడంలో ఆలస్యమయింది. అంతా భగవంతుడి లీల. మన మేంచేయగలం? సూర్యా! దీనినిగురించి ఎవరికీ చెప్పకు—''

''అవును మామయ్యా! చెప్పిమాత్రం లాభం ఏముంటి? జరగవలసిందేదో జరిగిపోయింది!'' అన్నాడు సూర్యా

''అవును జరిగింది జరిగిపోయింది. అది ఈశ్వరాజ్ఞ!'' అని తంతిని ముక్కలు ముక్కలుగా చింపి పారేశారు దురైసామి.

* * *

ఇంతవరకు తన క్రీగంటితో సౌందరరాఘవన్‌ను చూచి మురిసిపోతున్న సీతకు హఠాత్తుగా తండ్రి రావడం కనుపించింది. అంతనేపటినుండి అణిచి పెట్టిన దుఃఖమంతా పెల్లుబికింది. కన్నీళ్లు బొటబొట కారసాగాయి.

రాజమ్మాళ్ స్తంభాన్ని ఆనుకుని స్తంభంలా నిలచింది. ఆమె కూతురిని సముదాయించే స్థితిలోలేదు. ఆ పని అభయాంబాల్ చేసింది. ''ఎందుకే పిచ్చిదానా ఏడుపు? ఇప్పటికయినా వాన్ని వచ్చిపలకరించక—'' అందామె. సీతయొక్క అత్తగారున్నూ కడలిని శాంతింపజేసింది. అ ప్రక్కనే కూర్చున్న సుందరకూడా ''ఏడవకు సీతా! ఏడిస్తే కాటుక చెంపంతా అవుతుంది'' అన్నాడు.

దురైసామి అయ్యర్ వచ్చి సీత ప్రక్కనకూర్చుని ' ఏడవకు తల్లీ! రైలుబండి ఇట్టాచేసింది. లేకపోతే సమయానికి రాకుండావుంటానా?'' అంటూ నెమ్మదిగా ఆమె వీపు నిమిరారా.

అప్పటికీ ఆమె ఏడుపు ఆగకపోయేసరికి రాఘవన్ నెమ్మదిగా ఆమె చేతిని స్పృశించి ''సీతా!'' అన్నాడు.

సీత కన్నీటిధార వెంటనే ఆగింది. తడిసిన తన చక్రనయనాలతో అతడి నొకసారి చూచింది. ఆ చూపులో ఎన్ని విషయాలు, ఎన్ని అర్థాలు! సౌందరరాఘవన్ హృదయానికి అవన్నీ అవగతమయినాయి.

11

ముద్దాసునుండి బయలుదేరి నల్భై వినిమిది గంటలయినందున కూర్చుని కూర్చుని అలసివున్నారు ప్రయాణీకులు; వారిందరినీ మోసుకుని పొగలు కక్కుతూ పరుగెడుతూంది గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్.

ఆ రైల్లో ఒక రెండవ తరగతి పెట్టెలో సీత ప్రయాణంచేస్తూండి. ఆమెతోబాటు ఆమె అత్తగారు కామాక్షమ్మగారు కూడా వున్నది. కామాక్షమ్మ ఒడిలోకూచుని ఆమె భుజాలమీద, చెంపలమీద కొడుతున్నది ఎవరు?

ఆ కొడుతున్న వారిని సీత కోపంగా మందలిస్తూంది-" వాసంతీ! బామ్మనట్లా కొట్టకు-తప్పు! ఉష్-"

"లయిలు తలుపు తెలివాలి! తెలనకపోతే అలాగే కొలతాను-" అంటున్న వాసంతి. కామాక్షమ్మ ముద్దుల మనుమరాలు. సీతా రాఘవన్‌ల సోములపంట. ఆ చిరంజీవికిప్పుడు రెండో ఏడు.

రైలు కిటికీగుండా తల బయటకుపెట్టి తొంగిచూస్తున్నది. వాసంతి ఆని కామాక్షమ్మగారి కిటికీలు మూసింది. అవి తెరవాలని వాసంతి వివాదం. చివరికి మనుమరాలే గెలిచింది.

పంటనే తన చిన్నారిచూపుడు వేలితో బయటకు చూపిస్తూ "బొమ్మా? ఆదేంతి బొమ్మా" అని అడిగింది వాసంతి.

"ఆది పాడుపడిన కోట-" అంది సీత.

"కోతంటే ఏంతి?"

"కోటంటే కోటే! నీకు జవాబులు చెప్పడం నాచేత కాదుబాబూ, మూర్యా మామయ్యే రావాలి."

"మూర్యా మామయ్యను పిలవమ్మా!"

"ఇప్పుడే పిలుస్తే వినపడదు. రైలాగింతర్వాతే వస్తారు. కొంతసేపూరుకోవమ్మా-"

"పోమ్మా!" అని బయటికి చూడ సాగింది వాసంతి. మనమరాలి లాగే వెలుపలకు చూస్తున్న కామాక్షమ్మ-" ఎక్కడచూచినా కోటలు కనిపిస్తున్నాయే. ఇవన్నీ కట్టినవారెవరో?" అంది.

"ఎందరో రాజులూ, నవాబులూ కట్టారత్తయ్యా! సుమారు వెయ్యేండ్లపాటు ఢిల్లీయే దేశానికి రాజధానిగా వుండింది. ఢిల్లీకి ఆగ్రాకు మధ్య ఇట్లాగే కోటలమయంగా వుంటుంది" అంది సీత.

"మన దక్షిణం వైపు ప్రయాణంచేస్తే కోవెలలు కన్పిస్తాయి. చిదంబరంనుండి తిరుచ్చినాప్పల్నికి రైల్లో వెళ్తూ ఒకసారి నేను అయిదువందల గోపురాలను లెక్కపెట్టాను. ఇటువైపు అసలు కోవెలలేవున్నట్లు లేవే?" అంది కామాక్షమ్మ.

రైలు పరుగెడుతున్నపుడు దాని చక్రాలుచేసే శబ్దంనుండి ఒక శ్రుతి, ఒకలయ ఏర్పడుతాయి కదా; ఆ శ్రుతి, లయ సీత మనసులో "సౌందర రాఘవన్"—"ఢిల్లీ జంక్షన్" అని నాట్యంచేయ సాగాయి.

ఈ విధంగా మనసు సౌందరరాఘవన్‌మీద లగ్నమైవున్నా అత్తగారడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెబుతూంది సీత. "అది సరేగాని సీత సూర్యాకు ఇంతవరకు పెళ్ళికాలేదేమిటి? ఎందుకు కాలేదో తెలుసా? ఏదన్నాలోపమా," అని కామాక్షమ్మల్ అడిగింది.

"అబ్బే అట్లాంటి దేమిలేదు. అయినా సూర్యాకు వయస్సు ఎక్కువ ఏమయిందని" అయినా పెళ్లి వూసు ఎత్తితే అతడు నేనసలు పెళ్లి చేసుకోనే చేసుకోను" అని అంటాడు.

"పిల్లలందరూ కొంతకాలంవరకు అట్లాగే అంటుంటాడు చివరకు నెమ్మదిగా సర్దుకుంటారు. సూర్యా ఎంతవరకు చదువుకున్నాడు?"

"బి. ఏ. చదువుతూండేవాడు; ఇప్పుడు చదవడం మానేశాడు."

"ఎందుకు మానేశాడు? సరిగా చదవలేకనా? సూర్యాన్ని చూస్తుంటే కొంత మందమతిలాగానే వున్నాడు."

"చూడటానికి అట్లాగే వుంటాడుగాని నిజానికి సూర్యా చాలా తెలివైనవాడు. అసలు నా పెళ్ళి జరిగిందంటే కారణం అతనే అని చెప్పాలి. మీ అబ్బాయి నాకు లలితనిచ్చలేదు సీతే నచ్చింది అని చెప్పగానే మా అత్త మామలకు ఎంతకోపం వచ్చిందో తెలుసా వాళ్లను శాంతింప చేసినవాడు సూర్యానే"

"మీ అత్త మామలుకోవ్వడినంత మాత్రాన పెళ్లి ఆగిపోయుంటా ఏమిటి? అయినా సూర్యా చదువు ఎందుకు మానేశాడు?"

"అతడికేమో ఇంగ్లీషు చదువులు నచ్చవట. బి. ఏ. పరీక్ష పాసయితే తల్లిదండ్రులు ఏదైనా ఉద్యోగంలో చేరమంటారట. ఆతరువాత ఎవరైనా వచ్చి మా పిల్లను యిస్తామని గొడవచేస్తారట....."

"పిల్లను యిస్తానని వస్తే ఆది గొడవా? నేనుగూడా మా తమ్ముడి కూతురికోసమనే సూర్యాగురించి యింతగా అడుగుతున్నాను. అయినా ఉద్యోగంలేకుండా అతడు ఏం చేస్తాడట?"

"ఇటుప్రక్క ఎక్కడో కాంగ్రెసు సభలు జరుగుతున్నాయట వాటికోసం వస్తున్నాడట వచ్చే వెనక్కు వెళ్లడట. ఢిల్లీలో నేవుంటూ పత్రికలకు వ్యాసాలు అవీ రాద్దామని అనుకుంటున్నాడట."

ఈలోగా రైలు వేగం తగ్గసాగింది. ఇంజనుగట్టిగా కూసింది. దూరంగా అనేకమంది ప్రజలు ఒక్కసారే అరుస్తున్న చప్పుడు వినిపించింది. సీత రైలు పెట్టెనుండి బయటకు తొంగిచూసింది. "అత్తయ్యా అదిగో ఢిల్లీ స్టేషను... మీ అబ్బాయి స్టేషనుకువచ్చి వుంటారు," ఈలోగా నిద్రపోయిన వాసంతిని సీత లేపింది. వాసంతీ లేవమ్మా ఢిల్లీ వచ్చేసింది. నాన్నగారువచ్చి వుంటారు" అంది చెవులు చిల్లులుపడేలా వినిపిస్తున్న నానావిధ రణగణ ధ్వనుల మధ్య కేకలమధ్య గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ స్టేషన్‌లోకి ప్రవేశించింది.

అండి స్టేషన్‌లోకి ప్రవేసిస్తుండగా ప్లాటుఫారమ్ మీద నిలుచున్న వందలాది జనుల ముఖాలు సీతకళ్లల్లో ప్రతిఫలించి మాయమయినాయి కాని ఆ సుందరభవిష్యత్తును తన అంతరంగంలో చోటుచేసుకున్న ముఖాన్ని సీత

కళ్లు పెద్దవయ్యాయి. ఆ ముఖం కనుపించగానే "వాసంతీ అదిగో నాన్నగారు" అని సీత అరచిన అరుపు ఆ స్టేషనులోను చప్పట్లన్నిటిని మించి వినిపించింది.

"ఏరమ్మా నాన్న ?" అని ఆడిగింది పాపాయి.

ఆవలీలగా జనాన్ని తప్పించుకుంటూ సీతవున్న పెట్టెవైపు నడచివస్తున్న సౌందరరాఘవన్ హఠాత్తుగా గారి మధ్యలో ఆగిపోయ్యాడు. సీతవున్న చోటిగి ఎదుటివైపు, ప్లాటుఫారమే అటుప్రక్కనుండి ఒక రైలుబండి కూత వేసుకుంటూ బయలుదేరింది. సౌందరరాఘవన్ ఆ బండివైపు తిరిగాడు. సీతవైపు రాకుండా ఎదుటివైపు తొందర తొందరగా నడిచివెళ్లాడు, రాఘవన్ వెళ్లిన పెట్టెలో ఇద్దరు ఆడవాళ్లు కూర్చునివున్నారు. వారిలో ఒకామెను చూసి ఏదో అడిగాడు. ఆమె ఏదో జవాబుచెప్పింది. ఇతడు మళ్లీ ఏదోచెప్పాడు. ఈలోగా రైలుబండి కదలసాగింది. చిట్టచివరకున్న గార్డుపెట్టె కనుమరుగయ్యేవరకూ రాఘవన్ అక్కడే నిలుచుని కిటికీబయట కన్పిస్తున్న ఆ స్త్రీ మొహాన్ని చూస్తూ నిల్చున్నాడు. ఆ తరువాత సీత ఉన్న పెట్టెవైపు రాసాగాడు.

జరిగినదంతా కన్నార్పకుండా ఆసక్తితో గమనించింది సీత. తమ్ముణ్ణి బిడ్డనూ చూశాక సౌందరరాఘవన్ తిన్నగా యిటురాక అటు ఇంకొక రైలు బండి వైపు వెళ్లడం ఆశాభంగం కలిగింది. ఆ రైలుపెట్టెలోవున్న స్త్రీలు ఎవరో ఆమెకు తెలియదు. అయినా రాఘవన్ తనకన్నా వారినే ముఖ్యంగా భావించి మాటాడిరావడం సీత మనస్సులో మల్లులాగుచ్చుకుంది. ఇదంతా ఒక్క నిమిషం మాత్రమే. రాఘవన్ దగ్గరకురాగానే ఉత్సాహంతో ఆమె "వాసంతీ ! నాన్నదగ్గరకు వెళ్లు !" అంటూ బిడ్డను కిటికీగుండా భర్తకు అందించింది. వాసంతి ఎగిరి నాన్న చేతిలోకి వెళ్లింది. రాఘవనూ ఎంతో ఆశతో బిడ్డను దగ్గరకు తీసుకున్నప్పటికీ, అతడి మనస్సు పూర్తిగా యిక్కడ లేదని అతని ముఖం చెప్పింది.

"సీతా ! ముందట నీవు దిగు ! సామానులన్ని దించుకున్నాక నేను దిగుతాను !" అంది కామాక్షమ్మ.

సీత పెట్టెలోనుండి దిగింది. కూలీలకు పనులు చెబుతున్న రాఘవన్ ప్రక్కనవెళ్ళి నిల్చుంది. అతడేదో అడుగుతాడని, చెబుతాడని ఆశించింది కాని అటువంటిదేమీ జరగలేదు.

ఈలోగా అదే రైలులో ఢిల్లీ చేరిన సూర్యా వాళ్లు నిల్చునివున్న చోటికి వచ్చిచేరాడు. రాఘవన్ అతడి నొకసారి తేరి పారజూశాడు. కాని మాట్లాడలేదు కూలీలనుచూచి "సామాన్లను తీసుకోండి" అన్నాడు.

సూర్యాని రాఘవన్ పలకరించకపోవడం సీతను బాధించింది. సూర్యాని చూసింది. అతడు చిరునవ్వు మొహంతో చూశాడు.

సీత ధైర్యం తెచ్చుకుని-"సూర్యాని మీరు తెలుసోలేదో-" అంది.

"ఏ సూర్యాని ?" అన్నాడు సౌందరరాఘవన్.

"ఏ సూర్యానంటారేమిటి, లలిత అన్నయ్య సూర్యానే !" పరిగా అక్షణానికి అక్కడికి కామాక్షమ్మాల్ రావడంమంచిదయింది. అమె "దారి పొడుగునా మీకు సూర్యా ఎంత సాయం చేశాడనీ! అతడు లేకపోతే మీకు చాల ఇబ్బందయ్యేది" అంది.

ఈలోగా సామాన్లను నెత్తిమీదకు తీసుకున్నారు పోర్టర్లు. రాఘవన్ చేతినుండి చిపాయిని కామాక్షమ్మ తీసుకుంది. రాఘవన్ దారిచూపుతూ ముందునడవగా మిగతా వాళ్లు అతడి వెనక నడిచారు.

సామాన్లన్నీ కారులోకి ఎక్కించాక, రాఘవన్ కామాక్షమ్మను సీతను, పంతిసీ వెనకకూర్చోపుని తాను డ్రైవర్ చోటులో కూర్చున్నాడు. అతడి ప్రక్కచోటు ఖాళీగావుంది. సూర్యా సెలవు తీసుకుందామని బయట నిల్చున్నాడు. ఖాళీగావున్నచోట సూర్యాని కూర్చమని రాఘవన్ అంటాడని సీత అనుకుంది. రాఘవన్ చెప్పలేదు. సీత బాధతో సూర్యావైపు చూడగా, ఆమె అవస్థ నెరిగినట్లుగా చూశాడు సూర్యా.

కారు బయలుదేరబోయింది. సీత నెమ్మదిగా "అత్తయ్యా! సూర్యా వెళ్లొస్తానని చెబుతున్నాడు మీతో-" అంది.

కామాక్షమ్మాల్-"ఏం నాయనా సూర్యా! వెళ్లొస్తావా? పూరికి వెళ్లేలోగా ఒకసారి ఇంటికిరా!" అంది. అత్తగారికి మనసులో కృతజ్ఞత చెప్పుకుంది సీత.

"అట్లాగే అత్తయ్యా! తప్పకుండా వస్తాను. రాఘవన్ గారూ! మీ ఇంటి అడ్రసు ఏమిటి?" అని అడిగాడు సూర్యా. రాఘవన్ స్వభావం సూర్యాకు తెలుసు. అంచేత నే అతడిమీద కోపంతో సీతను చూడకుండా వుండరాదనుకున్నాడు, రాఘవన్ పిలిచినా పిలవకపోయినా వాళ్ళింటి కోపారి వెళ్లాలనే అనుకున్నాడు.

"నెంబర్ ఎనిమిది, నాదిర్షారోడ్!" అని చెప్పి కారు ముందుకు నడిపాడు రాఘవన్. కారు బయలుదేరగానే సీతలో ఉత్సాహం మళ్ళీ కలెత్తింది, "వాసంతీ! చూశావా? నాన్నకారు నడుపుతున్నారు-" అంది.

"నేనూ నలుపుతాను మోతార్-" అంది వాసంతి.

కాస్సేపటికి మోటారు ఆగింది. "ఏమయింది?" అన్నారు సీతా, కామాక్షమ్మా.

"ఏమీ కాలేదు; ఇల్లువచ్చింది." అన్నాడు రాఘవన్.

సీత ఇంటినిచూచింది. అందమైన చిన్న బంగళా. తోట, పూల మొక్కలు. ముచ్చటగావుంది. సీత హృదయం ఆనందంతో ఉప్పొంగి పోయింది. "వాసంతి! నీ ఇంటినిచూడవే! ఎంత బాగొందో-" అంది.

"ఈ ఇల్లు నాన్నగారు కట్టారా అమ్మా! మనకోసమే కట్టారా?" అంది వాసంతి.

12

పెళ్లి కాగానే రాఘవన్ సీతను తనతో బాటు ఢిల్లీకి తీసుకువెళ్లాడు. ఇద్దరూ ఒక పెద్ద హోటల్‌లో దిగారు. నెల రోజులపాటు వాళ్లిద్దరూ హాయిగా గంధర్వలోకాలలో విహరించారు.

క్రొత్త ఢిల్లీలోని విశాలమయిన వీధులలో బజారులో పాతఢిల్లీ లోని పాడు పడిన కోటలలో మసీదులలో చెట్టపట్టాలు వేసుకుని తిరిగాడిద్దరూ. ఇదే విధంగా ఇంకొక అమ్మాయితో చెట్టపట్టాలు వేసుకుని ఈ చోటులలోనే తిరగడం గురించిన జ్ఞాపకాలపుడపుడు రాఘవన్ మనోసీమలో మెరిసేవి. కాని వాటి నాతడు తీసి రాజాలి తన ప్రక్కనేవున్న ధర్మపత్ని సీత చేతినిగట్టిగా పట్టునొని మరీ ముందుకు నడిచేవాడు.

ఆ తర్వాత రాఘవన్ తొందరగా ఇంగ్లాండుకు బయలుదేరవలసి వచ్చింది. సీతను మద్రాసు తీసుకొచ్చి తమ ఇంట్లో వదలిపెట్టాడు తాము కొన్నాళ్లపాటు వుండి, సీతకు శతవిధాల ధైర్యం చెప్పాడు. ఇట్లా ఇంగ్లండు వెళ్లడం తన భవిష్యత్తుకు ఎంతో తోడ్పడుతుందని, ఇట్టాంటి అవకాశం మళ్లీరాదని, వచ్చిన దానిని జారవిడవడం—అవివేకమనీ చెప్పాడు. తనంతట తాను గావలచి పెళ్లాడిన భార్యను అంత త్వరలోవిడిచి వెళ్లడం అంటే తనకూ బాధాకరమేనన్నాడు. తన జీవితంలో ముందడుగు వేయబోతుండగా అడ్డంగా అమె నిలువతగునా అని అడిగాడు. మళ్లొసారి విదేశాలకు వెళ్లవలసివస్తే తప్పక ఆమెనూ తీసుకువెళ్తానని వాగ్దానం చేశాడు.

సీతకొక ప్రక్క తన హృదయాది నాథుడినుండి విడిపోవాలే అని దుఃఖం; ఇంకొకవైపు తన భర్త ఇంగ్లండు వెళ్తున్నాడే అని గర్వం.

ఎట్టకేలకు రాఘవన్ ఇంగ్లండు వెళ్లాడు. అతడు వెనక్కు రావడానికి పదిహేను మాసాలు పట్టింది. ఈ కాలంలో ఎన్నో మార్పులు జరిగాయి. సీత తల్లి రాజమ్మాళ్, తన కూతురిని ఒక అయ్యవారిచేతిలో పెట్టామన్న సంతృప్తిలో కన్నుమూసింది. తన భర్త దురైసామి అయ్యర్ ఒడిలోనే తలపెట్టుకు

పడుకుని కన్నుమూసిందా పుణ్యవతి. ఘనవేతీరాన ఆమె అంత్యక్రియలు జరిగాయి.

తల్లి మరణించి వారం చాల రోజులపాటు సీత దుఃఖించింది. వాళ్లత్త గారు ఎన్ని చెప్పినా, మామగారు భగవద్గీత చదివి చెప్పినా ఆమె దుఃఖం ఉపశమనం కాలేదు. ఇట్లాంటి సమయంలో తన ప్రియ భర్త తనప్రక్క లేకపోవడం ఆమెకు మరింత బాధాకర మనిపించింది.

ఆమెయొక్క ఆ దుఃఖం-మరొక సంఘటన జరిగాకనే, ఆదే వాసంతి జననం—తర్వాతనే తగ్గింది. కామాక్షమ్మ, ఇంకా ఇతర స్త్రీలూ "మీ అమ్మ నీకడుపున పుట్టింది-" అని మాటిమాటికి అనడంలో నిజమే నన్పించింది సీతకు. తన చిన్నారి ముఖం చూస్తూ ఆమె తన తల్లిని కురవసాగింది. ఇంగ్లండు వెళ్లిన భర్త రాగానే ఆయనకు తమ ముద్దుల పట్టని చూపించి మురిపించే రోజు దినాన్ని తలచుకుని తలచుకుని ఆమె ఆనందం చెందేది.

అత్తా కోడళ్లు చాల ఒద్దికగా కాపురం చేశారు. "అత్తయ్యా! మీ వంటివారిలో వుండలేవని పుట్టింటికి వెళ్లిపోయిన తోడికోడలు నిజంగా ఎంతటి రాక్షసో!" అనేది సీత, ఆమె చుట్టుపక్కల వారందరితో తన అత్తగారి మంచితనంగురించి చెప్పేది. కామాక్షమ్మకో మనోరథం నెర వేరింది. పద్మాపురం కాలవీధులలో ఆమె సగర్వంగా తలెత్తుకు తిరగ సాగింది.

సౌందర రాఘవన్ ఇంగ్లండునుండి వెనక్కువచ్చాడు. వాసంతినిచూపి ఉప్పొంగిపోయాడు. క్రొత్త ఢిల్లీలో ఇల్లు దొరకగానే వాళ్లకు వుత్తరం రాసి రమ్మంటానని చెప్పి ఢిల్లీ వెళ్లాడు. ఇల్లు దొరకడానికంతకాలం పట్టింది.

* * *

సీత క్రొత్త ఢిల్లీ కాపురం మొదలుపెట్టి వారమయింది. ఈ వారం రోజులూ ఇల్లు సర్దుకోవడంతోనే గడిచిపోయింది.

మునుపటివలె సాయంకాలాలు రాఘవన్‌తో బాటు కలిసి వ్యాహ్యాళి కెళ్ళాలని ఆమె ఉవ్విళ్లూరింది. కాని పని ఒత్తిడివలన ఆమె కోరిక నెరవేరే వీలులేకపోయింది.

వారంతర్వాత ఒక రోజుదయం రాఘవన్‌ను చూచి ఆమె—"ఇవాళ సాయింకాలం ఆఫీసునుండి లొందరగా రండి; ఎక్కడికయినా వెళదాం" అంది. అలాగే నన్నాడు రాఘవన్.

సాయింకాలం, కామాక్షమ్మాళ్ తాను పాపాయిని చూచుకుంటూ ఇంట్లో వుంటానని అడంలో దంపతులిద్దరూ కలిసి సరదాగా బయలుదేరారు. మొదట కనాట్ సర్కిల్ లొకసారి చుట్టి తర్వాత 'ఇండియా గేట్'వైపు నడిచారు. ఆ సూర్యాస్తమయ సమయంలో అటు ఆకాశంలో నక్షత్రాలూ, ఇటు వీధి దీపాలూ కలిసి రాజధాని నగర వీధులలొక వింతశోభ చేకూర్చుతున్నాయి.

"గంధర్వలోకం అంటారే అది ఇంతకన్న అందంగా వులటుందా?" అని అడిగింది సీత.

"నేను గంధర్వలోకం చూడలేదు గనుక చెప్పలేను!"

ఆమె గలగల నవ్వింది. మళ్ళీ ఒక ప్రశ్న వేసింది. "లండన్ అందంగా వుంటుందా? ఢిల్లీ అందంగా వుంటుందా?"

"లండన్ అందం వేరు, ఢిల్లీ అందం వేరు" అన్నాడు రాఘవన్. కాస్సేపయ్యాక "ఏమండీ! ఆరోజు రైల్వే స్టేషన్‌లో ఎవరితోనో మాట్లాడారే ఆమె ఎవరు" అని అడిగింది సీత.

"ఆమె ఎవరయితే నీకేం?" అన్నాడు రాఘవన్ కటువుగా.

"ఎవరో చెబితే ఏం?"

"చెప్పడానికి వీలులేదు."

"ఎందుకు వీలులేదు."

"ఈ ప్రశ్నోళ్ళు నాకు సవాలక్షమంది తెలుసు. వాళ్ళందరూ ఎవరెవరో అని నీకు చెప్పమంటావా?"

ఉబికి వస్తున్న కోపాన్ని అణగ ద్రొక్కుకుంది సీత.

కాస్సేపు నిశ్శబ్దం.

"ఆమె ఎవరో చెప్పరాఁ!"

మౌనం.

"ఆమె మీతోబాటు కాలేజీలో చదివిందా?"

మౌనం.

"మనవై పావిడా? ఇక్కడిదా?"

మౌనం.

"ప్లీజ్ లండి, నాతో ఎందుకమాట్లాడ తారు? ఇందుకనే కాబోలు 'వాకింగ్'కు తీసుకొచ్చింది?" సీత కళ్ళల్లో నీరు నిండింది.

"అందుకనే నేను తీసుకురానన్నాను...ఆడబుద్ధి పోనిచ్చావ్ కావు - ఫీ - పాడుదానా!" అంటూ రాఘవన్ పచ్చిక మైదానంనుండి లేచాడు.

"నేను పాడుదాన్నికాను—" అని గొణిగింది సీత.

నిష్కల్మషమైన సీత లేత మనసులో దుఃఖబీజం నాటబడింది!

ఆరాత్రి చాలసేపు సీత నిద్రపోలేదు. క్రొత్త ఢిల్లీ కాపురం పెట్టాక మొదటిసారి ఆయన తన్ను బయటికి తీసుకువెళ్ళితే కాను లేలివి తక్కువగా ప్రవర్తించి ఆయనను చీకాకుపరచి నందుకు నొచ్చుకుంది. అయినా ఆమె ఎవరోనని ఎందుకు చెప్పరాయన అన్న ప్రశ్న పదేపదే తల ఎత్తింది. 'అయినా నా మూర్ఖత్వంకాని, ఆది ఎవతోగాని వెళ్ళిపోయింది కదా! పైపెచ్చు ఆయన దాన్ని చూసి ఆశ్చర్యపడిన తీరు చూస్తే ఎక్కువ పరిచయం వున్నట్లు కూడాలేదు—అట్లాంటప్పుడు అనవసరంగా నన్ను నేనే హింపించుకుంటున్నా నెందుకు—ఆడబుద్ధి అంటే ఇదే కాబోలు—" అని తన్ను తానే విమర్శించుకుంది. 'లలితను చూడడానికి కచ్చి నన్ను వలచి వలపించి వెళ్ళాడిన ఉత్తముడి పట్ల నాకీ సందేహం తగునా?' అని తనకు తానే బుద్ధి చెప్పుకుంది.

ఇంత మనోవేదనా, ఆలోచనలూ మరుసటి రోజుదయం నిద్రలేచేసరికి ఏదో పీడకలలా అన్పించింది. పొద్దుటే కాఫీ ఆందివ్వడానికి వెళ్ళినప్పుడు రాఘవన్ నవ్వినచిరునవ్వుతో అన్నీ ఎగిరిపోయాయి. అతడు ఆఫీసుకు బయలు దేరుతుండగా సీత వాసంతి నెత్తుకుని వచ్చింది. రాఘవన్ పాపనెత్తుకుని ముద్దులాడాడు— "నాతోపాటు ఆఫీసుకొస్తావా ' అని అడిగితే—" వత్తాను వాన్నాగూ!" అంది వాసంతి. "నువ్వు వస్తే నాపని అయినట్లే—" అని దానిని ముద్దుపెట్టుకుని, రాఘవన్ వాసంతిని సీత చేతికిచ్చి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఇంకొక వారం గడిచింది. రాఘవన్ మళ్ళీ తన్ను బయటికి పిలుచుకు వెళ్తాడని సీత ఎదురుచూచింది. కాని అతడా ఊసే ఎత్తలేదు. ఇక వుండ బట్టలేక సీతే ఆ ప్రస్తావన తెచ్చింది.

"మనం బయటికి వెళ్ళి చాలకాలం అయిందే - ఇవాళ వెళ్దామా?" అని అడిగింది సీత.

"వెల్దాము కాని ఆ రోజులాగా నువ్వు చవట ప్రశ్నలు ఏమీ వేయకూడదు" అన్నాడు రాఘవన్.

"నేనడగనులెండి...పోనీ ఏదన్నా తెలివితక్కువగా అడిగినా మీరు కోప్పడకుండా సమాధానం చెప్పండేం?"

"అప్పుడే మొదలు పెట్టావా? అయితే నేను రాను."

సీత భయపడింది. 'అయ్యో, నేను మామూలుగా అన్నానండి... కోప్పడకండి. రండి. వెళదాం—" అంది.

ఆ సాయింకాలం ఇద్దరూ కలిసి ఢిల్లీలో ఇంకొక వైపు వెళ్ళారు. ఒక పచ్చిక మైదానంలో, పొద ప్రక్కగా వున్న. బెంచిమీద కూర్చున్నారు.

"మనం తాజ్‌మహల్ వెళ్ళడం ఎప్పుడండీ? మొదటిసారి వచ్చినప్పుడే చెప్పారు తీసుకువెల్తానని...ఈలోగా మీ విదేశప్రయాణం వచ్చింది. గుర్తుందా?" అంది సీత.

"గుర్తు లేకేమి ? తాజ్‌మహల్‌కు వెళ్లటంతే పౌర్ణమినాడు వెళ్ళాలి. అప్పుడే గాని అందం తెలుస్తుంది!" అన్నాడు రాఘవన్.

"అవును, వెన్నెలలో తాజ్‌ను చూడడం అపూర్వమైన అనుభూతి అని మీరు చెప్పారు—'

'పగలు చూస్తే తాజ్‌మహల్ పాలరాతితో కట్టిన్లు వుంటుంది. వెన్నెల నేళ చూస్తే ఎంద కిరణాలలో నిర్మితమైనట్లు తోస్తుంది."

"వచ్చే పౌర్ణమినాడు వెళ్దామా?"

"అలాగే చూద్దాం"

'అత్తయ్యనూ, వాసంతినీ కూడా తీసుకు వెళ్తాము కదూ?" అంటున్న రాఘవన్ సమాధానం చెప్పలేదు. ఆతడి మనసు ఊహాలోకా ఇంకెక్కడికో వెళ్లిపోయినట్లనిపించింది.

కాస్సేపటి కిద్దరూ లేచారు. ఇంటివైపు నడవ సాగారు.

ఇంచుమించు ఇంటి దగ్గరగా వచ్చారు. ఇంకాస్త వెళ్ళి ఆ వీధిలో తిరిగితే వాళ్ళ ఇల్లు చేరినట్లే. ముందుగా నడుస్తున్న సీత నివ్వెరపోయి నిల్చుండిపోయింది. ఒక్క క్షణం; ఒక్కడుగు వెనక్కు లేసింది. ఆమె ఎదుట, పెద్ద చెట్టు ప్రక్కగా చేతిలో కత్తితో ఒక స్త్రీ నిల్చుని వుంది! ఆ స్త్రీని ఎక్కడో చూచినట్లనిపించింది సీతకు, నీరసంగా మూలుగులాటిది ఆమెనుండి బయల్వెడలింది, వెనక నున్న రాఘవన్ వచ్చి ఆమెను పొదిలి పట్టుకున్నాడు. "ఏమిటి?" అన్నాడు. "అదిగో!" అని చూపించింది సీత, రాఘవన్ చూచేసరికి ఆ స్త్రీ రూపం క్షణంలో మాయమైపోయింది. ఆనిమిషంలో కనుమరుగయింది.

ఈ సంఘటన రాఘవన్‌లో ఏమీ సంచలనం కల్గించలేదు. "పిచ్చి దానా! ఢిల్లీలాంటి ప్రాణ్ళ పీఠంలో నానారకాల మనుషులూ నడయాడుతుంటారు. భయం ఎందుకు—" అన్నాడు.

రాఘవనూ, సీతా ఇంటి గుమ్మంలోకి రాగానే వారికి ఇంట్లోంచి పాపాయి నవ్వు కలకలం వినిపించింది. లోపలికి వెళ్ళారు. సూర్యా వాసంతిని ఆడిస్తున్నాడు.

"ఓ! బావా! ఎప్పుడు వచ్చావు—" అంది సంతోషంతో సీత.

'అర గంటయింది...ఏమండీ రాఘవన్! మీ అమ్మాయి మీమీద 'కంప్లయింట్' చేస్తూంది. మీరేమో వాళ్ళ బామ్మను ఒంటరిగా వదిలేసి ఎక్కడికో వెళ్ళిపోయారట...అంచేత బామ్మను చూచుకోవడానికని తాను ఇంటిలోనే వుండిపోవాల్సి వచ్చిందట! అన్నాడు సూర్యా.

ఫకాలున నవ్వాడు. "అమ్మదొంగా! అట్లాగేం?" అని కూతురు పిత్తుకొని ముద్దాడాడు.

'అలాగె చెప్పాను_మరి నన్నొదిలిపెట్టి ఎందుకెళ్లావ్?"

"బావా! కాంగ్రెసు సమావేశాలు ఎట్లా వున్నాయి?" అని అడిగింది సీత.

"బ్రహ్మాండంగా నడిచాయి." అన్నాడు సూర్యా.

"మీ బావగారు వెళ్ళాక ఇక ఆ సమావేశాలు బ్రహ్మాండంగా వుండక ఏం చేస్తాయి?" అన్నాడు రాఘవన్.

"కాంగ్రెసు గురించి సూర్యా ఎన్నో కథలు చెబుతాడన్నాడు. ముందు మీరందరూ భోజనాలు ముగించండి...వంటకాలు చల్లారి పోతున్నాయి. ఆ తర్వాత అన్ని కబుర్లూ విందురుగాని—" అంది కామాక్షమ్మాళ్.

భోజనాలయ్యాక సూర్యా శ్రీసుభాష్ చంద్రబోస్ అధ్యక్షతను జరిగిన హరిపురా కాంగ్రెసు సమావేశ విశేషాలగురించి చెప్పాడు! రాఘవన్ కూడా తన మామూలు అశ్రద్ధను ప్రక్కకు నెట్టి వీన్ని ఆసక్తితో విన్నాడు.

"అన్నీ బాగానే జరిగాయి. కాని మాపు మాత్రం సంతృప్తి గాలేదు." అన్నాడు సూర్యా.

"మాపు అంటే ఎవరికి?" అని రాఘవన్ అడిగాడు.

'సోషలిస్టు పార్టీ వారికి! నేను సోషలిస్టు పార్టీ వాడిని!"

"సోషలిస్టు పార్టీ అంటే ఏమిటి?" అని అడిగింది సీత.

వెంటనే రాఘవన్—"సోషలిస్టు పార్టీ అంటే ధనవంతుడు, పేద, మూర్ఖుడు, తెలివిగలవాడు, మంచివాడు, చెడ్డవాడు, మనిషి, పశువు—అందరినీ సరిసమానంగా సముద్రంలోకి నొక్కేయడం—అని అర్థం—' అన్నాడు.

"ఆయన సరదాకంటున్నాడు సీతా, నువ్వు భయపడకు!" అన్నాడు సూర్యా.

"అది సరేగాని కాంగ్రెసులో మహాత్మాగాంధీ నాయకత్వం ఎట్లా వుంది?" అని అడిగాడు రాఘవన్.

మహాత్ముడి కేమిటి తక్కువ? ఆయిన చలనవల్లనే మారు మూల గ్రామంలో ఈసారి కాంగ్రెసు సమావేశం ఇంత వైభవంగా జరిగాయి—"

"గాంధీ దారి వెంబడి నడిస్తే ఈ దేశంలో బిచ్చగాళ్ళే మిగులుతారు. అందరి చేతికీ చిప్పవస్తుంది. కాని భిక్ష వేయడానికి ఎవరూ వుండరు. ఆయన నాయకత్వం వున్నంత కాలం ఈ దేశం బాగుపడబోదు." అన్నాడు రాఘవన్ కోపంగా.

"వద్దురా నాయనా! గాంధీ గురించి అట్లా మాట్లాడవద్దురా! గాంధీని మహాత్ముడనీ, అవతార పురుషుడనీ జనం చెబుతుంటారు కదా—" అంది కామాక్షమ్మ.

'జనం చెప్పడానికేమిటి, గుడ్డిగా ఎన్నయినా చెబుతారు." అన్నాడు రాఘవన్.

"దయచేసి గాంధీ మహాత్ముడిగురించి అట్లా మాట్లాడకండి. నాకు వినడానికి కష్టంగా వుంటుంది. "మహాత్మాగాంధీ దేవుడ"ని మా అమ్మ చెప్పింది. అందుకు విరుద్ధంగా ఎవరేమి చెప్పినా నేను నమ్మను." అంది సీత.

ఆ తర్వాత రాజంపేట, దేవపట్నాలలోని బంధువులగురించి మాట్లాడుకున్నారు.

రాఘవన్ చెప్పాడు. "రేపు మీ అందరికీ ఢిల్లీ నగరమంతా చూపిద్దామనుకుంటున్నాను."

"సూర్యా! నువ్వు ఢిల్లీ అంతా చూసేశావా?" ఆని సీత అడిగింది.

"లేదింకా! రేపే ఆట్లా తిరిగివద్దా మనకుంటుద్నాను"

"అయితే ఇక నేం, మాతో బాటు రా! కాస్త కాలక్షేపంగా వుంటుంది" అన్నాడు రాఘవన్.

* * *

ఆ రాత్రి సీత చాల ఉత్సాహంగా వుంది. సూర్యాపట్ల రాఘవన్ కున్న న్యూనతాభావంపోయి ఆతడితో రాఘవన్ మామూలుగా మాట్లాడడం, అతడిని రేపు తమతోబాటు ఢిల్లీ చూడడానికి రమ్మని పిలవడం—గురించి అనుకున్నకొద్దీ ఆమెకు సంతోషం కలిగింది.

రాత్రి నిద్రపోవడానికి ముందుగా సీతకు, సాయింకాలం వీధిలో ప్రత్యక్షమైన ఆ కత్తి ధరించిన స్త్రీ గురించి రాఘవన్‌కు చెపుదామా అన్పించింది. కాని కాస్త ఆలోచించిన మీదట - సంతోషంగా వున్న సమయంలో అనవసరమైనదాన్ని ప్రస్తావించి చీకాకుకొని తెచ్చుకోవడం ఎందుకులే అన్పించి ఊర్కుండి పోయింది. అయినా ఆ స్త్రీమూర్తి ఆమె మనసునుండి తొలగ లేదు.

"అయ్యో రామా! తెల్లవాడేదో మహా తెలివిగలవాడని ఇన్ని రోజులూ అనుకున్నానా, వాడి చవటతనమూ ఇవాళ తెలిసింది! లేకపోతే ఎక్కడ చూచినా గోరీలూ, శ్మశానాలు, మసీదులూ వున్న ఈ వూరిలో రాజధాని పట్టుకుంటాడా?"—ఢిల్లీ అంతా తిరిగి వచ్చినాక ఇంట్లోకి అడుగు పెడుతూ కామాక్షమ్మాళ్ వెలిబుచ్చిన అభిప్రాయం ఇది.

"ఏమిటత్తయ్యా, అట్లాగంటున్నారు? ఎర్రకోటలో చూచిందేం షాజహాన్ మందిరం అది ఎంత అద్భుతంగా వుంది! ఈ ఢిల్లీ మందిరమే ఇంత సుందరంగా వుంటే ఇంక ఆగ్రా ఎట్లా వుంటుందో..తాజ్‌మహాల్ ఎట్లా వుంటుందో.--!" -- ఏముండి, ఆగ్రా పెళ్ళడం ఎప్పుడండి?" అని అడిగింది సీత.

"ఆగ్రా చూడకపోతే నిద్ర పోయేటట్లు లేదే...సరే, వచ్చే పున్నమి నాడు వెళ్దాము, ఏం, సూర్యా! నువ్వూ వస్తావా?" అన్నాడు రాఘవన్.

"తప్పకుండా—" అన్నాడు సూర్యా.

* * *

ఆకోజు ఢిల్లీ చూచిరావడానికి తమతోబాటు సూర్యాని తీసుకు వెళ్ళడం మంచిదే అయిందనుకున్నాడు రాఘవన్. సీతా అన్ని ప్రశ్నలూ తనే చేయకుండా కొన్ని కొన్ని సూర్యానడిగింది. సూర్యా ఉత్సాహంతో జవాబులు చెన్నాడు. ఇట్లాటి చోట్లకు వెళ్ళినప్పుడు ఆడవారితో మాట్లాడడానికి వాళ్ళడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి ఒక ప్రత్యేకమైన ఓపిక, సామర్థ్యమూ కావాలి. అని రాఘవన్‌కు లేవు, సూర్యాకున్నాయి. అందుచేతే సూర్యా తమతోరావడం రాఘవన్‌కు అనుకూలంగా వుంది. అందుకనే ఆగ్రాకూ సూర్యాని తీసుకు వెళ్దామనుకున్నాడు రాఘవన్.

ఆ వారంలో సీతకు లలితనుండి వుత్తరం వచ్చింది.

"నా ప్రాణ స్నేహితురాలయిన సీతకు లలిత రాయడం—నువ్వు ఢిల్లీ చేరాక రాసిన వుత్తరంచూచి చాల సంతోషం కలిగింది. మిద్దరం బ్రతికి వున్నంతకాలం మనస్నేహం ఇట్లాగే వుండాలని దేవుడిని వేడుకుంటున్నాను.

నాలుగు రోజులకింద నాకు సీమంతం జరిగింది. ఆసలు అందుకోసమే ఈ వూరికి వచ్చాను. మా అమ్మకిప్పుడు సంతోషంగా వుంది. మొన్నటి దాక— 'సీతోబాటు పెళ్లయిన పిల్లలందరూ రెండేపి సంవత్సరాల పిల్లల పెత్తుక తియ్యగుతుంటే నువ్వేమో మోడులాగా తియ్యగుటున్నావే" అని ఆడి

పోసుకనేది; పిల్లలు పుట్టడం అన్నది దైవకల్పన అని ఎంత చెప్పినా వినేది కాదు. ఇప్పుడామె కొంత తీరింది.

రాజం పేటకు వచ్చినప్పటినుండి నాకు నువ్వే గుర్తుకొస్తున్నావు. రోజూ తపాలాబండి నువ్వు రాసే పత్రాలకని తపాలాఫీసుకు వేసు పరుగెత్తుకు వెళ్ళిన పాత్రరోజులు గుర్తుకొస్తున్నాయి. గుంటూరుకు వెళ్ళి తే ఆ మెట్టినింట కూచ్చుని ఎంత విహరించిన డాబా ఇకాలు ఎగురవుతున్నాయి. నువ్వు చెప్పిన లైలామజ్నూ, ఇనార్కలి, రోమియోజూలియెట్, రతుంతల, సంయుక్త మొదలైన కథలన్నీ గుర్తుకువస్తున్నాయి..ఓసే సీతా! నిజంగా ప్రేమ ప్రేమఅంటూరే అట్లాంటిది నిజంగా వుందంటావా లేకపోతే కథల్లో మాత్రమేనా? ఇన్ని రోజులు ఇంట్లోకూపు చక్రవర్తిగా వున్న, ఎనిమిదవ ఎడ్వర్డ్ ప్రభువు ఎవరో అమ్మాయి కోసం రాజ్యాన్నవదిలివేశాడటగా! ఇది నిజమా సీతా? ఇట్లాంటి దన్నీ నిజంగా జరుగుతాయంటే నమ్మశక్యం గాకుండా వుందే!

సూర్యా మీతోబాటు రైల్లో రావడం, మీకు దారిలో సాయి పడడం చదివి ఆనందం కలిగింది. అయినా సూర్యా మధ్యలో చదువు ఎందుకు మానేశాడు? ఎంగకిట్టూ విరక్తితో మాట్లాడుతున్నాడు?—అని పన్నడిగాను. అప్పుడు నాకూ తెలియదు. కాని ఈ సారి రాజంపేటకు వస్తే తెలిసింది. మా పెద్దన్నయ్య గంగాధరన్—నీ పెళ్ళికూడా వచ్చాడు—వాడి గురించి నీకు ఎక్కువగా తెలియదులే. వాడిది చాల మొరటు స్వభావం. పోయిన సంవత్సరం సూర్యా ఇక్కడికి వచ్చినప్పుడు పొలం వ్యవహారాలలో ఏదోతగాదా వస్తే సూర్యా రైతుల పక్షం మాట్లాడాడట గంగాధరన్ వాడిని కొట్టాడట. దాంతో సూర్యాకు అసహ్యమూ, విరక్తీ కలిగాయి. మీ కెవస్తువున్నీ మీరే వుంచుకోండి. నాకేమీ వద్దు—" అని వెళ్ళి పోయాడట. ఆ డబ్బుకూడా తనకు వద్దనే కారణాలతోనే చదువు మానివేశాడట. ఈ వివరాలన్నీ నాకీసారి ఇక్కడికి వచ్చాక తెలిశాయి. అమ్మానాన్న సూర్యా గురించి బాధపడుతున్నారు. నాకూ సూర్యా గురించి అనుకున్నప్పు

డెల్లా బాధగావుంది. వాడెంతో మంచివాడు. నేనంటే వాడికి ఎంత ఇష్టమో! నేనేకాదు నువ్వనా వాడికి చాల .ఇష్టం...వాడిని జాగ్రత్తగా చూచుకో అమ్మకూడా సంతోషిస్తుంది. విశేషాలు ఏమిటి? వివరంగా ఉత్తరం రాయి.

లలిత ''

లలితకు సీత ఈ క్రింది విధంగా జవాబు రాసింది.

"ప్రియమైన లలితకు,

నీ వుత్తరం అందింది.

ప్రేమ అన్నది కథలలోనే కాదు నిజజీవితంలోనూ వుందన్నది తథ్యం. దానికి నా వివాహమే నిదర్శనం. కాని లలితా, నిజానికి నాకీ భాగ్యం అబ్బడానికి ఒక విధంగా నువ్వే కారణం—అన్నమాట నేనెన్నిటికీ మరువలేను...సూర్యా కాంగ్రెసుకు వెళ్లి వెనక్కు వచ్చాడు, లలితా! ఇంకో సంతోషకరమైన వార్త ఏమిటంటే మా వాకిలి సూర్యా ఎంతో నచ్చాడు. ఇద్దరూ కలిసి గంటల తరబడి కాంగ్రెసు, బ్రిటీషు ప్రభుత్వం మొదలైన విషయాలన్నీ చర్చిస్తూ కూచుంటున్నారు.. పోయిన ఆదివారం అందరమూ కలిసి ఇక్కడి కుతుబ్ మినార్, ఎర్రకోట, జంతర్ మంతర్ వెళ్లి అన్నీ చూచి వచ్చాము. సూర్యా కూడా మాతోబాటు వచ్చాడు. రేపు రాత్రి మేము ఆగ్రాకు వెళ్లుతున్నాము, సూర్యాకూడా వస్తున్నాడు. కాని మా అత్తగారు రావడం లేదు. ఆమె పాపాయిని చూచుకుంటూ ఇక్కడే వుంటానన్నారు.

ఆగ్రానుండి ఒక రాత్రి రైలు ప్రయాణము చేస్తే రజనీపూర్ వస్తుంది. అది స్వదేశ సంస్థానానికి చెందిన పట్నం. అక్కడ ఒక పెద్ద చెరువు, దాని మధ్య ఒక అందమైన మంటపం వున్నాయట. ఆ చెఱువు గట్టుమీద వేల కొలది తెల్లటి కొంగలు వచ్చి గుంపులు గుంపులుగా కూర్చుంటాయిట; అన్నీ ఒక్కసారే ఎగిరిపోతాయిట. చూస్తుంటే చాల ఆనందంగా వుంటుందట...అక్కడకుకూడా వెళ్దామంటున్నారీయన.

సూర్యా గురించి నువ్వేమీ దిగులుపడకు. నేను అతడిని జాగ్రత్తగా చూచుకుంటాను. మనిద్దరికీ ఎంతో సాయం చేసినందుకు అతడికి ఎంతో ఋణపడి వున్నాము. వీలు చూచుకుని మీవారితో చెప్పి సూర్యా కేదయినా మంచి వుద్యోగం ఇప్పించమని అడుగుదామనుకుంటున్నాను.

ఇదిగో మావారు "వాకింగ్‌కు వెళ్ళడానికి టయిమయి పోతూంది" అని అరుస్తున్నారు. ఇక్కడిలో ఆపేస్తున్నాను. ఆగ్రానుండి వచ్చాక వివరంగా మళ్ళీ వుత్తరం రాస్తాను.

ఇట్లు, నీ

సీత"

ఆగ్రాకు వెళ్లే వాళ్ళు సాధారణంగా మొదట అక్కడి పాత కోటలూ ఆంతఃపురాలూ చూస్తాడు. చూచి "ఆహా! ఇంతకన్న అందమైన నిర్మాణం ఇంకా ఏముండగలదు—" అనుకుంటూరు; అనుకుని తాజ్‌మహల్‌ని చూడడానికి వెళ్తారు. తాజ్‌మహల్‌ని చూడగానే ఆశ్చర్యపడే శక్తినికూడా కోల్పోయి అచేతనులై నిలబడి పోతారు.

ఆ విధంగానే రాఘవన్, సీత, సూర్యా ముందు ఆగ్రా కోటకు వెళ్ళారు. కోటగోడ ఎత్తును, నిన్ననగా నిన్న కట్టినట్లున్న ఆ గోడ మెరుపును చూచి విస్మయం చెందారు. కోట గుమ్మంయొక్క గాంభీర్యాన్నిచూచి ఆశ్చర్యపడ్డారు. లోపల దివాన్ - ఎ - ఆమ్ అన్న షాజహాన్ సభామందిరపు గోడలమీద శిల్ప సౌందర్యంచూచి అచ్చెరు పొందారు; ఆప్రక్కనేవున్న గులాబీతోట చూచారు. ఆ తర్వాత అంతఃపురంలోకి వెళ్ళారు. అక్కడ షాజహాన్ పుత్రికలు రోషనారా, జహనారాలు నివసించిన చోట్లు చూచారు. అద్దాల మహల్ చూచారు. రాణులు చెలికత్తెలతోబాటు జలక్రీడలాడిన పాలరాతి జలాశయాలను తిలకించారు. రాణుల నూపురాల గలగలతో పారే నీటి గలగలలు కలిసిన ఆనాటి వైభవాన్ని వూహించి పులకించి పోయింది సీత.

"ఆహా! ఈ ప్రసాదంలో రాణులూ రాకుమార్తెలూ వివరించివున్న దెట్లా వుండేదో!" అంది సీత.

"ఎట్లా వుంటుంది, చెరసాలవలె వుండివుంటుంది. ఎంత బంగారంతో చేసినా, రత్నాలు తాపడం చేసినా పంజరం పంజరమే కదా-" అన్నాడు సూర్యా.

"భలే సూర్యా! భలే జవాబు చెప్పావు' అన్నాడు రాఘవన్.

అ తర్వాత మల్లికా మందిరానికి వచ్చారు. "మీ రిద్దరూ నమ్మి పిచ్చి దానిని చేద్దామనుకుంటున్నారు కాని షాజహాన్ ఎంత గొప్ప చక్రవర్తో తాజ్‌మహల్‌ని చూస్తే తెలియడం లేదా? ఎంత ధనవ్యయానికి, ఎంత ప్రయాసకోర్చి తన ప్రేయసి జ్ఞాపకార్థం ఈ జగదేక సుందర మందిరాన్ని నిర్మించాడు! ఆమెపట్ల అతడికి ఎంత ప్రేమ! అంతేనా, తాజ్‌మహల్‌ను కట్టాక తన జీవితాంతందాక ఇక్కడినుండే తాజ్‌మహల్‌ను చూస్తూ గడిపాడు.' అంది సీత.

"అవును! ఇక్కడనుండి తాజ్‌మహల్‌ని చూస్తూనే మరణించాడు షాజహాన్" అన్నాడు రాఘవన్.

"ఎందుకో తెలుసా? షాజహాన్ ఈ విధంగా బొక్కసంలోని డబ్బుని వృధా చేయడం అతడి కొడుకయిన ఔరంగజేబుకు నచ్చలేదు. తండ్రిని ఖైదుచేసి ఈ కోటలో చారజేసి—" మీ ప్రియ భార్య జ్ఞాపకార్థం కట్టిన స్మారక మందిరాన్ని చూచుకుంటూ వుండండి-" అని ఆజ్ఞాపించాడట, అందుకని షాజహాన్ ఇక్కడ పడుకుని తాజ్‌మహల్‌ని చూస్తూ కన్ను మూశాడట!" అన్నాడు సూర్యా.

"షాజహాన్‌కు సరైన శిక్ష విధించాడు. నేను ఔరంగజేబయివున్నా అంతా చేసేవాడిని!" అన్నాడు రాఘవన్.

"ఇంతటి లోకోత్తర సౌందర్యాన్ని చూశాకకూడా మీరిట్లా ఎట్లా మాట్లాడగల్గుతున్నారు? మీ కళ్ళేమయ్యాయి?" అంది సీత.

నిజానికి ఆ క్షణాన రాఘవన్, మూర్యాల కట్ట ఆ ప్రక్కనే వున్న అద్భుతమైన పాలరాతి శిల్పాలమిదో, దూరంగావున్న తాజ్‌మహల్ మిదో లేదు, ఆ మందిరపు వసారా గుండా ఎటో చేపుకుండి వస్తున్న హారిణి, మిద వున్నాయి.

మగ్గురు వస్తున్నారు; ఇద్దరు స్త్రీలు, ఒక పురుషుడు. కరాచీ కార్ ప్రమాదం జరిగినప్పుడు విమానాశ్రయంలో రాఘవన్ చూచిన స్త్రీలే వాళ్ళిద్దరూ. ఒకతె హారిణి, ఇంకొకతె ఆమె స్నేహితురాలు. రాఘవన్ నిశ్చేష్టుడయి విల్చున్నాడు. తాజ్‌మీద నుండి అతడి దృష్టి తొలగలేదు. ఎక్కడి వున్నాము, ఎవరితో వున్నాము అన్నమాటే మరిచిపోయాడు. ఎటునుండి హారిణి వస్తూంది అన్న ఒక్క ఆలోచన తప్ప అతడిలో ఇంకే భావమూ లేదు.

ఓక్క నిముషంపాటు ఈ భూమండలమే కాదు ఈ లోకాలూ స్తంభించినాయి.

అటు పిమ్మట రాఘవన్ గొంతు వినిపించింది; "నేను చూస్తూన్నది నిజమా? కలయా?"

"తాజ్‌మహల్ గురించి చెబుతున్నారా? అవును, దానిని ఎందరో కవులు 'పాలరాతి స్వప్నం' అని వర్ణించారు. కాని ఇక్కడ నిల్చుని చూస్తుంటే తాజ్‌మహల్ నిజమేనని తెలుస్తుంది—" అంది హారిణి.

"ఈయన్ మిస్టర్ రాఘవన్ కదూ? అనుకోకుండా కలిశామే!" అంది హారిణి స్నేహితురాలు నిరుపమ.

"ఆవును, ఆ దురదృష్టవంతుడిని నేనే—" అన్నాడు రాఘవన్ నిరుపమను చూస్తూ.

"ఆహా! ఇంతటి వినయం ఎప్పటినుండి వచ్చింది మీకు? మీ చెనక విల్చున్న ఆమె ఎవరు?" అని అడిగింది నిరుపమ. రాఘవన్ మొహం మాడింది.

"ఆయన్నడగడం ఎందుకు, ఆమాత్రం ఊహించలేవా నిరుపమా? ఆమె ఆయన భార్య అయి వుంటుంది." అంది హారిణి.

"ఆహా! ఎంత అందంగా వుందామె! ఈమెను పెళ్లి చేసుకునికూడా మిమ్మల్ని మీరు దురదృష్టవంతుడి ననుకుంటున్నారే!! ఏమి వింత!"

ఆ యువకుడెవరు? "అని నిరుపమ అడిగింది.

"'నా భార్య బంధువు,' అని గొణిగాడు రాఘవన్.

"నాకు తెలిసిన మొహంలాగే వుంది, ఇటీ వలే ఎక్కడో కలిసినట్లున్నాము" అంది తారిణి.

"ఈ కుర్రవాడిని మీరెట్లా చూచివుంటారు? ఇంకెవరినో చూచి పొరబడుతున్నారు." అన్నాడు రాఘవన్.

ఈలోగా సూర్యా కొద్దిగా ముందుకు వచ్చి—"కాదు, నేను వీరిని హరిపురా కాంగ్రెసులో చూశాను." అని తారిణివైపు తిరిగి,

"మీరు సోషలిస్టు పార్టీ సమావేశానికి వచ్చారుకదూ—" అని అడిగాడు.

హరిపురా కాంగ్రెసు అనగానే ఎనిమిదేళ్ళ క్రింద జరిగిన కరాచీ కాంగ్రెసు గుర్తుకొచ్చింది రాఘవన్‌కు. కరాచీ విమానాశ్రయం దగ్గర మొదటిసారిగా తారిణిని కలవడం గుర్తు కొచ్చింది...ఈలోగా మధురమైన కంఠంతో తారిణి "ఔను! సోషలిస్టు పార్టీ సమావేశానికి నేను వచ్చాను. అక్కడ మీరు చేసిన అద్భుతమైన ప్రసంగాన్నింకా మరవలేదు నేను—" అని చెబుతుండడం కలలోవలె వినిపించింది రాఘవన్‌కు.

"ఓహో! అంత అధిక ప్రసంగం చేశాడు మా సూర్యా?" అన్నాడు రాఘవన్.

"ఆయన అధిక ప్రసంగం చేయలేదు; చాల మితంగా, ముచ్చటగా మాట్లాడారు. అంది తారిణి.

నిరుపమ అడ్డొచ్చి—"దయచేసి ఒక్క నిముషం మీ వాగ్వివాదాన్ని ఆపితే మా వారిని పరిచయం చేస్తాను. వారే మిస్టర్ వేణీప్రసాద్ బి.ఏ. ఎల్. ఎల్. బి; ఈ వూరిలో ప్రసిద్ధిచెందిన వకీలు; కాని ప్రాక్టీస్ మాత్రం లేదు. ప్రస్తుతానికి తనభార్యతో మీ మిత్రులను స్నేహితురాండ్రను ఇం

టికి పిలిచి ఉపచారాలు చేయడం, ఊరు చూపించడం - ఇదేవీరి ముఖ్య కార్యక్రమాలు. తారిణి మాఇంట్లోనే వుంటుంది. మీరుకూడా మా ఇంటికి వస్తే మాకు చాల సంతోషం కలుగుతుంది. మీరిక్కడ వున్నన్ని రోజులు మీరు మా ఇంట్లోనే వుండండి. అసలు ఆగ్రాలో ఎన్ని రోజులుండ దలచుకున్నారు?" అని రాఘవన్‌ను అడిగింది.

"ఇవాళ రేపు మాత్రమే వుంటున్నాము. ఎంతో ఆప్యాయతతో పిలిచారు; చాల కృతజ్ఞులము. ఇంకెప్పుడయినా వస్తాము. ఆబద్దాలాడేవారితో కలిసి ఒకే ఇంట్లో వుండడం నా కిష్టంలేదు."

"ఎవరు అబద్దమాడారు?" అని నిరుపమ ప్రశ్నించింది. ఆడి "ఇంకెవరు. మీ చెలికత్తే! అబద్ధం చెప్పినా అతికేటట్లు ఆడాలి...ఆరోజు ఢిల్లీ స్టేషన్‌లో కలిసినప్పుడు "నేను తారిణి కాదు అన్నావే, ఎందుకట్లా అబద్ధం చెప్పావు?"

"నేనట్లా చెప్పలేదే—" నేను పాత తారిణిని కాను అని చెప్పాను" ఇంకా ఏదో చెప్పబోతుండగా రైలు కదిలింది.

"ఆహా! మునుపటి వాక్చాతుర్యం ఏమీ తగ్గలేదు!" అన్నాడు రాఘవన్.

"నేను మునుపటిలాగే వున్నాను. అందరూ అట్లాగే వుంటే ఇట్లాంటి మాటలే వుండవు. దానికేంరాని మళ్ళీ మిమ్మల్ని ఎక్కడ కలవడం? డబ్బు వెనక్కివ్వాలికదా?"

"డబ్బుకేమి తొందర, నెమ్మదిగా తీసుకుంటాను. కాని మిమ్మల్ని మళ్ళీ కలవాలి తాజ్‌మహల్‌ను చూచేశారా?"

"సాయింకాలపు ఎండలో ఒకసారి, రాత్రి వెన్నెలలో ఒకసారి చూడాలని ఉద్దేశం—"

"మేమూ అట్లాగే అనుకుంటున్నాము. అప్పుడే అన్నీ మాట్లాడుకుందాము.

అని ఆ రుంకు బృందాలవాళ్ళూ ఒకరినుండి ఒకరు సెలవుల తీసుకుని విడిపోయారు.

ఇంతసేపూ ఒక్కమాటయినా మాట్లాడని సీత "ఏమండీ! ఆవిడ ఎవరు? అని అడిగింది.

"మీ బావనడుగు, చెబుతాడు-!"

"బావనెందుకడగడం? మీరే చెప్పండి, మీకు తెలీదా?"

"తెలుసు, ఆమె ఒక స్త్రీ!"

"అవును, ఆమాట నాకూ తెలుసు! ఆకారమే స్త్రీగాని ప్రవర్తన అంతా పురుషుడే!" మగవాడై పుట్టవలసింది పొరబాటున ఆడదిగా పుట్టింది"

"నువ్వన్నమాట అక్షరాలనిజం! కనుక ఆ స్త్రీగా పుట్టిన మగవాడితో నేను మాట్లాడడంవలన నీకు బాధ ఎందుకు?"

"బాధా? బాధ ఎందుకో? అసలు నీసలు ఆడదానితో మీరు మాట్లాడినా నాకు బాధ ఎందుకు? నేనేం పల్లెటూరి గచ్చిలాయి ననుకుంటున్నారా?... కాని నానుండి ఏదయినా దాచడం మాత్రం నాకు వచ్చదు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో మీరు పనుగెత్తి వెళ్ళి మాట్లాడిం దేమెతో నేనా?"

"చూచావా సూర్య, సీత తెలివి! నేను ఈవిడ కనీభయిపడి ఏదో దాచానట! మన పైపు ఆడవాళ్ళతో ఇదే చికాకు, ఉత్త నందేహ ప్రాణుల!"

"నేనేమీ సందేహప్రాణిని కాను. రైల్వే స్టేషన్‌లో చూచి మాట్లాడింది ఎవరు—అని నేనడిగితే, తెలియదు అని కప్పదాటువేసి దాచారు ఎంచేత?"

"దాచనూలేదు, దాటనూలేదు. తెలిసినావిడేమోనని దగ్గరకు వెళ్ళి పలకరించాను. ఆమె నేను కాదు - అన్నది, అలాటప్పుడు ఎవరు, ఎవరు— అని నువ్వు ప్రాణం తీస్తే నేనెమి సమాధానం చెప్పను? ఇప్పుడు నేను ఆమె మాట్లాడుకుంటుంటే విన్నావుకదా, అర్థం కాలేదా?"

"మీరేకో ఇంగ్లీషులో మాట్లాడుకున్నారు, ఏం మాట్లాడుకున్నారో నాకేం తెలుసు? నాకు అంతటి ఇంగ్లీషు రాదులెండి."

"తెలియకపోతే నోరు మూసుకుని వుండు-"

"అంతే, అట్లా వుండి పడడమే తెలుసు; ప్రేమగా ఒక్కమాట మాట్లాడడం చేతకాదు."

ఇదంతా వింటూ వెనకాల నడిచివస్తున్నాడు సూర్యా. 'సీతా! మన్వాసెను గురించి చెప్పింది నిజంకాదు. ఆమె చాల చక్కటి సేవకురాలు. హనిపుగా కాంగ్రెసులో బొంగరంలా తిరిగి పనిచేసింది, అక్కడ ఆమెను చూచివుంటే నీకామె ఉత్తమ గుణం తెలిసి వుండేది—ఆమెను గురించి మరీలా అనుకోకు—' అన్నాడు.

ఆ తర్వాత ఆగ్రా కోటలోని ఇతర భవనాలను చూశారు కాని మను పటి ఉత్సాహం లేదు.

"నడిచి నడిచి కాళ్లు నొప్పులెడుతున్నాయి. హోటల్‌కు పోదామా!", అంది సీత.

"ఆ! అన్ని పాలరాతితోనే కట్టడం వలన ఒక దానిలాగే ఇంకొకటి వుంది; వ్యత్యాసమే వేదు. పోదాంపదండి. సాయింత్రం తాజ్‌మహల్‌కు వెళ్లాలి కూడాను—' అన్నాడు రాఘవన్.

"తాజ్ మహల్‌ని చూచిన అంతే అంటారేమో-అసే పాలరాతితో కట్టిందేకదా?" అన్నాడు సూర్యా.

"ఆహా! తాజ్‌మహల్ విషయం వేరు; అది పాలరాతి భవనంకాదు, జీవం తొణికిసలాడే శిల్పకళా వైభవం; మొగలు రాజుల కళాభిరుచికి నిత్య నూతనమైన నిదర్శనం; రతీ మన్మథులు సయనించే చాల విమానం. తాజ్ మహల్‌ను చూడని జన్మ జన్మేకాదు—"అని కవితా ధోరణిలో మాట్లాడాడు రాఘవన్.

ముగ్గురూ తమ హోటల్‌కు చేరారు. భోజనాలు ముగించి విశ్రమించారు.

* * *

తన ప్రియపతిని తొలిసారిగా సమీపిస్తున్న నవవధువువలె భువనైక మోహనంగా నిలిచివుంది తాజ్‌మహల్.

పెన్నెలలో, పాలరాతిమోద, నీటికాలువ ప్రక్కగా సీత, రాఘవన్, సూర్యా, తారిణి, నిరుపమ, వేణీప్రసాద్ కూర్చుని వున్నారు.

ఆ సాయింకాలం వాళ్ళు తాజ్‌మహల్‌ను చూశారు. లోపలికి వెళ్ళి ముంతాజ్, షాజహాన్‌ల సమాధులు చూశారు. వాటిచుట్టు వున్న అతి సుకుమారమైన శిల్పకళాచాతురిని గమనించారు. దూరదూర దేశాలనుండి వచ్చిన రత్నాలవంటి శిలలలో చెక్కిన పుష్ప హారాలను చూశారు. నూటయాభై అడుగుల ఎత్తున వున్న మూల గోపురాలు నాల్గింటి పైకి ఎక్కి అక్కడినుండి కనబడే అందమైన దృశ్యాలంతటిని చూచారు. యమునలో దిగి సేద దీర్చుకున్నారు.

ఇట్లా తిరిగి తిరిగి చీకటి పడేసరికి అలసటచెంది చివరకొకచోట కూర్చున్నారు. రాత్రి తొమ్మిదయింది. ప్రశాంతంగా వుంది. కాని సీత, రాఘవన్, తారిణి, సూర్యాల మనసులు వేర్వేరు కారణాలవలన అశాంతితో కుతకుతలాడుతున్నాయి.

"మనిషిగా పుట్టాక తాజ్‌మహల్‌ని చూడకపోతే ఇంక లాభం ఏమిటి? అదే ఒక జన్మేనా?" అని సీత సంభాషణ మొదలు పెట్టింది.

"పగలు చూస్తే చాలదు. ఇట్లాటి పున్నమ రాత్రివేళ చూడాలి." అన్నాడు రాఘవన్.

"చూచిన వెంటనే ప్రాణం పోవాలి! ఆ తర్వాత ప్రాణం ఎందుకని?" అన్నాడు సూర్యా.

అతడు శరదాకు అట్లా అన్నాడని సీత—"అవును బావా! ప్రేమ చిహ్నమయిన తాజ్ మహల్ని చూశాక బ్రతకక్కర్లేదు, నిజమే!" అంది.

"మీకెంత సేపూ ప్రేమ ఊసే! ప్రేమా పెళ్ళి తప్ప ఈ ప్రపంచంలో ఇతర విషయాలేవీ లేవట్లా—" అన్నాడు సూర్య.

"అందులో సంశయమేమీ లేదు. ప్రేమను మించిన విషయం మీ విశ్వంలో లేదు, నిజమే! కవిత్వం, కావ్యాలు, కథలూ అన్నిటికీ ప్రేమకథ ఆధారం! ప్రేమ లేకపోతే వాల్మీకి రామాయణం ఎక్కడిది? కాళిదాసు శాకుంతలం ఎక్కడిది? షేక్స్పియర్ నాటకాలు ఎక్కడివి? ఈనాటి రచయితల నవలలెక్కడివి?" అన్నాడు రాఘవన్.

"ఆహా! మీ ప్రేమ నవలనన్నిటినీ తగలెట్టండి. ఇంకేమీ తెలియని కాళ్ళంతా ప్రేమకథలు రాస్తున్నారు." అన్నాడు నిముష నిముషానికీ ఆవేశం పెచ్చుతున్న సూర్యా.

"అయితే అందరూ కార్ల్మార్క్సులా రాయాలంటావు, అంతేనా?" అన్నాడు రాఘవన్ ఎగతాళిగా.

"కార్ల్మార్క్సులా రాయక్కరలేదు. టాల్స్టాయ్‌లా రాయచ్చుగా! మహాత్మాగాంధీలా రాయవచ్చుగా! జవహర్లాల్ నెహ్రూలా రాయవచ్చుగా! బెర్నార్డ్ షాలా రాయవచ్చుగా!"

"బావా! సుబ్రహ్మణ్యభారతిలా రాయవచ్చా, రాయకూడదా? ఆయన ప్రేమ గురించి ఏమి చెప్పాడో గుర్తుందా?" అని సీత ఆడిగింది.

"భారతీ ఏమంటే ఏమి? ఆయన చెప్పినదంతా సరియని నేనొప్పుకోలేదే - భారతిగారు స్పృహలో వున్నప్పుడు దేశం గురించి పాడారు, స్పృహ తప్పినప్పుడు ప్రేమగురించి పాడారు." అన్నాడు సూర్యా.

"వీరి వాలకం చూస్తే భగ్నప్రేమికుల్లావుంది—" అని చిరునవ్వునవ్విన తారిణి పళ్ళు ఆ వెన్నెలలో మల్లెమొగ్గలై మెరిశాయి.

"అబ్బే! అట్లాంటి దేమీ లేదు—" అని సిగ్గుతో తల వంచుకున్నాడు సూర్య.

"సూర్యా థోరణో అంత! ఊరంతటికీ ఒకదారయితే సూర్యాది మేయదారి...సీతా! ప్రేమగురించి భారతి కవి ఏమన్నారో చెప్పు. వినాలని వుంది" అన్నాడు రాఘవన్.

ప్రేమ గురించిన భారతిగారి కవితలోని రెండు పంక్తులు పాడింది సీత.

"ఆ పాటంతా పాడండి - వింటాము." అంది తారిణి. సీత రాఘవన్ మొహం చూచింది. అతడు "అపస్వరం లేకుండా పాడేటట్లయితే పాడు!" అన్నాడు.

సీతకు కోపంవచ్చింది. "అపస్వరమో, సుస్వరమో నాకు తెలిసినట్లే కద పాడగలను" అంది.

"మాకు ఏది అపస్వరమో, ఏది కాదో తెలియదులెండి. హాయిగా పాడండి వింటాం" అంది నిరుపమ.

పాట పాడింది సీత.

పాడినంతసేపు ఆమె మొహాన్నే అందరూ చూశారు; రాఘవన్ మాత్రం తారిణి ముఖాన్ని చూస్తున్నాడు.

పాటకాగానే తారిణి నిరుపమ సీతను అభినందించారు. నిరుపమకు ఆమె భర్తకు తారిణి ఆ పాట అర్థం చెప్పింది.

"తారిణీ! నీకు హిందీలో ఒక జాతీయగీతం వచ్చుగా, దానిని పాడు" అన్నాడు రాఘవన్.

"అవును తారిణీ!" సారా జహాఁ సే అచ్ఛా" పాడు! కరాచీనుండి బొంబాయికి ఓడలో వెళ్ళినప్పుడు నువ్వు పాడగా విన్నానంతే మళ్ళీ విన లేదు—" అంది నిరుపమ.

తారిణి పాడింది. రాత్రివేళ చప్పుడుచేసే పక్షులు, గాలికూడా నిశ్శబ్దంగా విన్నాయి ఆ పాటను. ఫోటీలు తీసుకుంటున్న యూరోపియన్ దంపతులుకూడా ఆ పాటను విన్నారు. పాట ముగియగానే "అబ్బా! బహుత్ అచ్ఛా!" అన్నారు నిరుపమ, ఆమె భర్త.

"పాడితే ఇట్లా పాడాలి; లేకపోతే పూర్తిగా వద్దు." అన్నాడు రాఘవన్.

సీత మనసు గాయపడిందని తెలిసిన సూర్యా "సీతా! ఈ పాట సుబ్బులాగా నేర్చుకోవచ్చు. దీని అర్థం ఏమిటో తెలుసా? 'ప్రపంచమంతా వేరొకటున్నా ఉత్తమమైనది భారత దేశమే' అని మొదటి పంక్తి భావం" అన్నాడు.

"అందులో సందేహం ఏముంది? ప్రపంచంలో అత్యుత్తమ దేశం మన భారతదేశమే. అందుకు ఈ ఒక్క తాజ్‌మహల్ చాలు-" అంది సీత.

"తప్పా! భారతదేశపు గొప్పతనం తాజ్‌మహల్ వల్ల వచ్చిందికాదు. హిమాలయాలవల్ల, గంగానదివల్ల, గౌతమ బుద్ధుడివల్ల, అశోకుడివల్ల. శివాజీ వల్ల, ఝాన్సీరాణివల్ల మన దేశానికీ ఉత్కృష్టత వచ్చింది." అన్నాడు సూర్యా.

"హిమాలయాల్లాటి కొండలూ, గంగలాటి నదులూ ఇతర దేశాల్లోనూ వున్నాయి, కాని తాజ్ మహల్‌లాటి దింకెక్కడా లేదు. కనుక మనదేశానికి గొప్పదనం తాజ్‌మహల్ వల్లనే వచ్చింది-" అని చెప్పాడు రాఘవన్.

ఇట్లాంటి గొప్పదనంలో మనదేశానికి పనిలేదు." అన్నాడు సూర్యా.

"ప్రపంచపు వింతలలో ఒకటయినది నీకంటికి ఆనడం లేదుకదూ!" అన్నాడు రాఘవన్.

"మిస్టర్ సూర్యా కంటికి ఆనకపోతే ఏమీ ఫరవాలేదు, తాజ్ మహల్‌వల్లన మనదేశపు కీర్తి నలుదెసల వ్యాపించింది; అమరప్రేమ గొప్పదనమూ ఇందువల్ల తెలుస్తుంది" అన్నాడు వేణీప్రసాద్.

"మీరుకూడా ప్రేమను పొగడనారంభించారన్నమాట-" అన్నాడు సూర్యా ఈర్ష్య భావంతో.

"మీకు ప్రేమంటే ఎందుకంత మంట? ఈ దివ్య సౌందర్యమైన మందిరం షాజహాన్ హృదయంలోని ప్రేమనుండేకదా ఆవిర్భవించింది?"

"షాజహాన్ ప్రేమనుండి కాదు, కాఠిన్యంనుండి ఆవిర్భవించింది ఇది. షాజహాన్ చేసిన అక్రమాలు అతడి కొడుకయిన ఔరంగజేబుకే నచ్చలేదు. అందుకనే ఔరంగజేబతడిని చెరసాలలో నిర్బంధించాడు—"

"ఔరంగజేబు కళ అంటే తెలియని కఠినుడని చరిత్ర చెబుతుంది గాని షాజహాన్ కఠినుడెట్లా అయ్యాడు?"

షాజహాన్ మంచివాడే. కాని అతడి ఒక్కడి ఆత్మసంతృప్తి కోసం, గర్వంకోసం ఎంతనుంది జనులు కష్టాలపాలయ్యారో తెలుసా? ఇరవై సంవత్సరాలపాటు ఇరవై వేల నుంది కూలి జనంచేత రాత్రి బగళ్ళు చెమట కార్పిస్తే ఇది తయారయింది. జనులు కష్టపడి ఆర్జించిన డబ్బును వారినుండి కక్కించగా నిండిన కోశాగారపు డబ్బుతో ఇది సాధ్యమైంది. ఒక వ్యక్తి గర్వంకోసం, అతడి ప్రేమకోసం ఇంత చెమటా, ఇంత రక్తమా? నాకే గనుక అధికారం వుంటేనా? తుత్తునియలు చేసేవాడిని" అని చేతిలో బొమ్మను విసిరివేశాడు. ఆవిసురుకా తాజ్‌మహల్ బొమ్మ తారిణి వైపు ఎగిరి వెళ్ళింది. ఆమె మొహానికి తలకో తగులుతుందని అందరూ కెవ్వుమన్నారు. తారిణికూడా నిశ్చేష్టురాలయి తల చటుక్కున వెనక్కు తీసుకుంది ఆ బొమ్మ తారిణి పక్కగా కూలింది; ముక్కలు ముక్కలుగా అయింది. ఆ ముక్కలలో ఒకటి ఎగిరి తారిణి నుదుటికి వెళ్ళి తగిలింది. ఆమె ముంగురులక్రింద గాయమయింది; నెత్తురు కారసాగింది.

సూర్యా తప్ప మిగతా వారందరూ ఆమెను చుట్టు ముట్టారు. మొదట ఆమె గాయాన్ని చేత్తో మూసి నెత్తురు ధారనాపడానికి రాఘవన్ యత్నించాడు. నిరుపమ అతడి చేతిని తీసివేసి తన చేతిగుడ్డను గాయానికడ్డంగా కట్టింది. రాఘవన్ చేత సీత మవసులో ముల్లువలె నాటింది.

వేణీప్రసాద్ రాఘవన్‌నుచూచి "మీ స్నేహితుడు చాల మొరటు మనిషివలె వున్నాడు -" అన్నాడు.

"ఈడ ఇడియట్! క్షమాపణయినా కోరకుండా అక్కడే కూర్చున్నాడు?" అన్నాడు రాఘవన్.

'ఇంత చిన్న విషయానికి క్షమాపణలేమిటి?' అంది తారిణి.

"అవృష్టం బాగుండి, అదికంట్లో పడలేదు; లేకపోతే?" అన్నాడు రాఘవన్.

"పడలేదుగదా, దానికెందుకింత హంగామా? మీరందరూ ఊరుకుంటే నాకు సాయం చేసినంత!" అంది తారిణి.

సీత మనసు కుతకుత లాడుతూంది. నుదుటిమీద చిన్నగాయం తగిలితే దానికింత ఉపచారమా, ఇంత ఆర్భాటమా - అని ఒక నిముషం అన్పించింది. దీనికి కావల్సిందే! ఇంకా బాగా తగిలి వుండవలసిందే!" అని ఇంకో నిముషం అన్పించింది. ఆ తర్వాత మాటలు సాగలేదు.

'చాలు, వెన్నెల్లో తాజ్‌మహల్ చూసిన అందం? ఇక వెనక్కు పోదామా?" అంది సీత.

"సరే" అని అందరూ లేచారు.

హోటలుకు వెళ్ళగానే సూర్యా తన సామాన్లు తీసుకుని, తనకు తొందరగా ఢిల్లీకి వెళ్ళాల్సిన పనివుందని చెప్పి స్టేషనుకు వెళ్ళిపోయాడు.

మరు రోజు సీత రాఘవన్‌లు మొదట అనుకున్న ప్రకారమే రజనీపూర్ వెళ్ళారు.

16

"శ్రీమతి తారిణీదేవికి: ఇవాళ తాజ్‌మహల్ దగ్గర నావలన మీకు తగిలిన గాయానికి నొచ్చుకుంటున్నాను. మీ నెత్తిమీదటిమీద గాయం తగిలించాలని నేను అనుకోలేదు; నేను అనుకొని వుంటానని మీరూ అనుకోరు. ఏవో మాటల ఆవేశంలో విసిరిన ఆ బొమ్మ ముక్కలయింది. అందుకు నేను చింతించను. నిజమైన ఆ పెద్ద తాజ్‌మహల్ ముక్కలయితేనే నేను ఆవంతయినా చింతించను. ఇంత పెద్ద భారతదేశమూ ఒకప్పుడు ఒక మూర్ఖుడయిన వృద్ధుడి చేతిలో చిక్కింది. ఆవృద్ధుడు వయసుచేత బుద్ధిని కోల్పోయి, ప్రేమనే పిచ్చిలోపడి ఒక బొమ్మ తయారుచేయించాడు. చచ్చిపోయిన తన ప్రేయసి ఆత్మశాంతికని కోట్లాది రూపాయలు ఖర్చుచేసి, వేలాది జనులను హింసించి ఆ బొమ్మను చేయించాడు. దానికే ఈనాడు "తాజ్‌మహల్" అని జనులు వేలం వెర్రిగా ఎగబడిచూస్తున్నారు. వివేక హీనులై మందలు మందలుగా వెళ్ళి చూచి ప్రశంసిస్తున్నారు. ఇది నా దృష్టమైన నమ్మకం.

అనుకోకుండా జరిగిన సంఘటనకు, మీకు తగిలిన గాయానికి మళ్ళీ ఒక సారి క్షమాపణ చెప్పుకుంటున్నాను.

ఈ వుత్తరం ముగించేలోగా ఇంకో విషయం రాయాలి. మీకు గాయం తగిలించాలనే వుద్దేశం నాకే కోశానా లేదని ఇదివరకే చెప్పాను. కాని మీ నుదుటిమీద చిన్నగాయం తగలగానే మిమ్మల్ని చుట్టుముట్టి ఆర్భాటం చేశారే, వాళ్ళందరి నెత్తిమీద తలారెండు పెట్టిగాయలు మొడదామని వుంది!

ఎందుకంటారా? భారతదేశం దాస్యంలో మగ్గుతూంది. దాస్య విముక్తికై, స్వాతంత్ర్యానికై మనమంతా ఎన్నో కష్టాలు పడాలి. లక్షలాది జనుల ప్రాణాలు ఆర్పించాలి. త్యాగాలు చేయాలి. అట్లాంటి సమయంలో చిన్నగాయానికింత హాహాకారాలా! ఈ వీరభూమిలో మన పూర్వీకులింత బేలలుగా ఎప్పుడూ లేరే! మీరు ఆరాజస్థాన వీరభూమికి వెళ్తారేమో, అక్కడ శౌర్యసాహసాలు నిండిన గాథలెన్నో వినగలరు. శత్రువు కోట

ప్రవేశించాడని వినగానే సిద్ధంగావున్న అగ్నిలోకి వందలాది మానవతులు దూకిన దేశం ఇది! రాణా సంగ్రామ సింహుడి ఒడలిమీద యుద్ధంలో తగిలిన గాయాల మచ్చలు తొంభై తొమ్మిది వుండేవిట! ఆటువంటి వీరవనితలు, వీర పురుషులు పుట్టిన ఈనాటి ఈనాడు ఒక చిన్న గాయం మనలను కదలించి వేస్తుంది; మగవాళ్ళకుకూడా 'హిస్టీరియా' కలుగ చేస్తున్నది!

ఇంతటిలో ఆగుతున్నాను. మా సుబ్రహ్మణ్య భారతి 'హృదయ స్పృహ్యా చకున్నదే' అని ఒ పాట రాశాడు; అది సీతకు తెలుసు. పాడమని వినండి.

ఇట్లు,

"సూర్యా"

ఆగ్రానుండి రజనీపూర వెళ్తూ రైల్లో కూచుని ఈ వుత్తరాన్ని చదువుకుంటూంది తారిణి. ఒకటికి రెండునార్లు చదివాక ఉత్తరాన్ని తన చేతి పెట్టెలో పెట్టుకుని తాళం వేసింది.

ఇది చూచిన రాఘవన్ "ఇంత జాగ్రత్తగా పెట్టి తాళం వేస్తున్నావే, అదేమిటి ప్రేమలేఖా?" అని అడిగాడు.

"పిచ్చివాగుడు!" అంది తారిణి.

తారిణి అన్నది తన మాటల గురించే అని తెలిసినా తెలియనట్లు రాఘవన్ "పిచ్చివాగుడయితే మరి దానిని పెట్టెలో పెట్టి తాళం వేసుకోవడం ఎందుకు?" అన్నాడు.

* * *

ఆ ఉదయం తారిణి నిరుపమా రైలెక్కగానే పెట్టెలో రాఘవనూ సీతా మాత్రమే కనుపించారు. "సూర్యా! ఏదీ?" అని అడిగింది తారిణి.

"రాలేదు; ఢిల్లీ వెళ్ళిపోయాడు." అన్నాడు రాఘవన్.

"నిన్నరాత్రి సంఘటనకని ఆయనతో పోట్లాడి పంపించేశారా, ఏమిటి?" అని అడిగింది తారిణి.

"మేమేమీ పోట్లాడలేదే అతడికే అవమానం అన్పించిందేమో, మొండి పట్టుపట్టి వెళ్ళిపోయాడు." అన్నాడు రాఘవన్.

సీత తన భావ గౌరవం కాపాడాలని— "అతడికేమో తోందర పని వుందిట. ఆగ్రాకు మాత్రమే వస్తానని ముందే మాతో చెప్పాడు. మీ కిమ్మని ఒక ఉమాపణ వుత్తరమూ ఇచ్చాడు?" అని సీత రాఘవన్‌ను చూచి "ఉత్తరాన్ని ఆమె కివ్వండి!" అంది.

"కానీ, బండి బయలుదేరనీ. ఇంతలో ఆ వుత్తరానికి తోందర ఏమిటీ!" అన్నాడు.

"ఉమాపణా! చాలచిన్న విషయానికి మీరాయనతో పోట్లాట పెట్టుకున్నట్లున్నారు. నాకు చాల బాధగావుంది." అంది తారిణి.

బండి బయలుదేరింది.

కాస్సేపటికి తారిణి "ఆ వుత్తరం ఏదీ!" అని అడిగింది.

"అది చూడకపోతే వూళ్ళో నేటట్లు లేరే!" అని రాఘవన్ ఆ వుత్తరాన్ని తీసి ఆమె కిచ్చాడు.

తారిణికి ఆ వుత్తరాన్ని అందుకి చదివి వినిపిద్దామా అన్పించింది కాని తర్వాత ఆలోచన మార్చుకుంది.

ఆవీ ఇవీ మాట్లాడాక రాఘవన్ తారిణి జీవితాన్ని గురించి అడిగాడు.

అతడి ప్రశ్నలకు నిరుపమే సమాధానాలిచ్చింది. తారిణి పాత దేశసేవిక తారిణికాదని, కాలేజిలో చేరి పట్టా పుచ్చుకుని, ప్రస్తుతం విశ్వ విద్యాలయం వారి ఉపకార వేతనం మీద చరిత్ర పరిశోధన చేస్తూందని, ప్రస్తుతం ఇద్దరూ కలిసి రాజస్తాన్ యాత్రకిమీద బయలు దేరామనీ చెప్పింది.

ఇవన్నీ చెప్పాక నిరుపమ పడుకుని నిద్రపోయింది. తారిణి కాలేజి జీవితం గురించి రాఘవన్ ఎన్నో ప్రశ్నలు వేశాడు. అన్నిటి! తారిణి అంటీ ముట్టనట్లు సమాధానాలు చెప్పింది. కాస్సేపటికి రాఘవనూ నిద్రపోయాడు.

తర్వాత తారిణి సీత ప్రక్కకు వచ్చి కూర్చుంది. "మీ బావ సూర్యా గురించి చెప్పండి. ఆయన ఎప్పుడూ ఇట్లా చిటపట లాడుతూనే వుంటారా?" అని అడిగింది.

"సూర్యా గురించిన వచారం ఇప్పుడెందుకులెండి? నాలాగే అతడూ ఒక వెర్రిమనిషి, అనాథ!" అంది సీత చికాకుగా.

"సోదరీ! ఎందుకంత విరక్తితో మాట్లాడుతారు? నానుడుటిగాయం గురించి సూర్యా చాల నొచ్చుకుని వుత్తరం రాశారు. చాల ఉత్తముడు. అయితే కొంత తొందరపాటు మనిషిలా వున్నారు. నా గాయం బాగయింది. అని మీతో చెప్పి పంపుదామనుకున్నాను. మీకు ఆయనను గురించి మాటాడడం ఇష్టంలేకపోతే వద్దులెండి." అంది తారిణి.

ఇది వినగానే సీత మనసు మారింది. "అబ్బే! విరక్తి లేదు, ఏమీలేదు. మూర్యా ఉత్తము గుణాలు కలవాడే. మామామయ్య కుటుంబంలో అందరి కన్న నిదానస్తుడూ, ఓర్పు గలవాడూ సూర్యానే! నిన్న అతడా బొమ్మ వట్లా విసరడం నాకే ఆశ్చర్యం కల్గించింది. అతడి మనసులో ఏబాధవుందో, ఏమో?...దురదృష్టవంతుడు...లేకపోతే ఇట్లా వచ్చి కష్టాలు పడనేల? చదివి పాసయి, ఎంతో బాగావుండి వుండవచ్చును." అంది.

దురదృష్టవంతుడని ఎందుకన్నారు—అని తారిణి అడగగా సీత కొద్ది కొద్దిగా సూర్యాకథను చెప్పింది. అతడి తండ్రి, అన్న, అమ్మ, చెల్లెలు మున్నగువారి గురించి చెప్పింది. అన్నయ్యతో ఊరి వారిలో అతడి కలహాని గురించి చెప్పింది. కాని తన పుట్టుక, పెంపకం, పెళ్ళి గురించి ఏమీ చెప్పలేదు.

17

రజనీపూర్ సంస్థానపు దివాన్ సర్. కె. కె. ఆది వరాహాచారిగారికి తెలివిగల యువకులంటే అభిమానం మెండు. సౌందర రాఘవన్ ఇంగ్లాండుకు ప్రయాణం చేసినప్పుడు ఓడలో ఆయనతో పరిచయం సంపాదించాడు. సౌందరరాఘవన్ బుద్ధిసటిమా, సంభాషణా చాతుర్యమూ ఆయనను ఆకర్షించాయి. అంతేకాక న్యూఢిల్లీ సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నాడా రేంవరు తెలిసివుంటే అక్కడ తమ పనులు అంత త్వరగా సమకూరుతాయన్న నమ్మకమూ సర్ ఆది వరాహాచారి గారికి వుండేది.

ఇంగ్లాండునుండి వెనక్కు వచ్చాక భార్యా సమేతంగా రజనీపూర్‌కు రావలసిందని ఆదివరాహాచారిగారు సౌందరరాఘవన్‌తో చెప్పారు. ఆ ఆహ్వానాన్ని పురస్కరించుకుని రాఘవన్ ఇప్పుడు సీతతో పాటు దివాన్ గారింటికి వెళ్ళాడు. తారిణి, నిరుపమ ఇంకొక చోటికి వెళ్ళారు.

దురదృష్టవశాత్తు అప్పుడు ఆదివారాహాచారిగారు సౌందర పనిమీద వేరే వూరికి వెళ్ళారు. కాని రాఘవన్ ఇచ్చిన తంతిని చూడగానే వారి వసతికై అన్ని ఏర్పాట్లుచేసి, అతడినీ అతడి భార్యనూ ఆదరణలో చూచుకోమని తమకూతుళ్ళకు చెప్పి వెళ్ళారు. వాళ్ళు రాఘవన్ దంపతులకు సాదరంగా స్వాగతం చెప్పారు.

దివాన్ గారి కూతుళ్ళయిన భామ, ధామ - ఇద్దరూ ఇంగ్లాండు వెళ్ళి వచ్చినవాళ్ళు. ఇంగ్లీషు నాగరికతలో తలమునకలు వేసిన వాళ్ళు. వారిలో ఒకతె సన్నగా పొడుగ్గాను ఇంకొకతె పొట్టిగ లావుగాను వుండేవాళ్ళు. ఇద్దరూ బుజాలకరకు జుత్తు కత్తిరించుకున్నారు. సదా సర్వదా ఆంగ్లంలోనే మాట్లాడుతారు. అందులోనూ ఆంగ్ల నవలాకారుడు ఓడ్ హావుస్ రచనలలో పాత్రలధోరణిలో మాట్లాడేవారు. పియానో నాయించడంలో, బాల్‌రూమ్ డాన్స్ చేయడంలో ఆరి తేరారు.

ఇట్టామటివారి ధ్య చిక్కుకుని సీత నానా అవస్థా పడింది. వాళ్ళు మొదట ఏదో ఇంగ్లీషులో అడిగేవాళ్ళు. సీత ఏమీ అర్థంకాక తెల్లబోయి

చూస్తుంటే కష్టపడి ఆదేవిషయం తమిళంలో చెబ్పేవాళ్లు. వాళ్లు ఇంగ్లీషు వారివలె ఉచ్చరించడంలో సీతకు వచ్చిన కొద్దిపాటి ఇంగ్లీషూ బొత్తిగా పనికిరాకుండా పోయింది. అంచేత ఆమె చాల ఇరకాటంలో పడింది.

సీతకన్న రాఘవన్‌తో వాళ్ళిద్దరూ సన్నిహితంగా మెలగారు. అతడూ వాళ్ళతో చాల సరదాగా మాట్లాడాడు. అతడికబుర్లకు, చట్టరీక్తులకు వాళ్ళు పకపక నవ్వారు. ఇవన్నీచూచి సీతకు ఆవంతయినా కోపంగాని అసూయగాని కలగలేదు. వాళ్లు అందగత్తెలుకారనో, లేక వాళ్ళపట్ల రాఘవన్‌కు ఎటువంటి గౌరవమూ లేదనో—ఏమోమరి?

భారతదేశంలోని స్వదేశ సంస్థానాల ముఖ్య పట్టణాలలో రజనీపూర్ చాల అందమైనది. మరునటి రోజంతా రాఘవనూ సీతా అందమైన ఆ పూరి దృశ్యాలు చూస్తూ గడిపారు. మహారాజావారి పాత అంతఃపురం, వసంతో త్సవ మందిరం, జంతుప్రదర్శనశాల, కాస్తదూరంగా వున్న పాత కోట శిథిలాలు – అన్నీ చూశారు. కాని ఏ ఒక్కచోటకూడా రాఘవన్ పట్టుమని పదినిముషాలు ప్రశాంతంగా నిలవలేదు. సీతకూడా అందు కనుగుణంగానే చక చక లన్నీ చూచేసి అతడి వెంట నడిచింది.

దివాన్ గారింటికి సాయంకాలం తిరిగివస్తుండగా సీత—"వాళ్లిద్దరూ ఇవాళ్టిల్లా కనపడలేదు" అంది.

"అవును—అదే నేనూ అనుకుంటున్నాను. టెలిఫోన్ చేస్తానన్నారు, చేయలేదు" అన్నాడు రాఘవన్.

మరునిముషం రాఘవన్ కారు డ్రైవర్‌తో "ఫైకీ—" అనడం వాడు హఠాత్తుగా బ్రేక్‌వేసి కారాపడం, సీత ఉలిక్కి పడడం అన్నీ వెన్వెంటనే జరిగాయి. ఏమిటో అని చూస్తే ప్రక్కన ఒక ఇంటిముందు ఆగివున్న టాంగా నుండి తారిణీ, నిరుపమ దిగుతూ వుండడం కనుపించింది.

రాఘవన్ తారిణిని చూచి—"ఇట్లూ మోసంచేశారేమిటి?" అన్నాడు రోషంగా.

"మోసమేముంది ? మీతో వస్తే వాగ్వాదాలతో సరిపోయింది; వీధి ప్రశాంతంగా చూడడానికి వుండదు. అందుకని మా అంతటమే మేం వెళ్ళి అన్నీ చూచి వచ్చాం." అంది తారిణి.

'రేపుకూడా ఇలాగే చేద్దామనుకుంటున్నారా ?"

"రేపు చెలువు చూడడానికయితే మేమూ వస్తాము. ఇక్కడవుండి వచ్చి మమ్మల్ని పిలుచుకుని వెళ్ళగలరా ?" అని అడిగింది తారిణి.

"ఆలాగే పిలుచుకుని వెళ్తాము. గాని ఇవాళలా చేయకండి; నాకు చాలకోపం రాగలదు." అన్నాడు రాఘవన్.

అవ్వాళల్లా రాఘవన్ ఎందుకంత నిలకడ లేకుండా వున్నాడో అర్థమయింది సీతకు. ఆరాత్రి ఆమె అర ఘంటకన్న ఎక్కువ సేపు నిద్రపోలేదు. మరుసటి రోజుదయం నిద్ర లేచేసరికి తలపోటు ప్రారంభమైంది.

"నేనివ్వాళ చెలువు చూడడానికి రాను...తిన్నగా ఢిల్లీ వెళ్ళిపోదామని వుంది." అంది సీత.

ఆ మధ్యాహ్నం రాఘవన్ ఆడిగాడు!" నిజంగానే తలపోటుగా వుందా ?"

"అంటే అబద్ధపు తలపోటనా, ఏమిటి మీ వుద్దేశం ?" అంది సీత.

"అయితే నేను వెళ్ళి వస్తాను."

"వెళ్లక తప్పదా ?"

"తప్పదు. అనుకున్నదానిని నీ తలనొప్పికోసం మార్చడం పడదు."

సీతకు ఏడుపు ఆక్రోశము ముంచుకొచ్చాయి. కాని అప్పుడు రాఘవన్‌తో తగాదా పెట్టుకుని ఏమీలాభంలేదని ఆమెకు తెలుసు.

"ఆడజన్మ ఎత్తాక తలనొప్పి అని చెప్పి మాత్రం లాభం ఏమిటి ? ఇక్కడ ఒంటరిగా చావడం కంటె మీతోబాటే వచ్చి చావడం మేలు." అంది సీత.

"ఆ చచ్చేదేదో త్వరగా చావడం మంచిది; కానివ్వు మరి" అన్నాడు రాఘవన్.

కారెక్కాకకూడా ఇద్దరూ మౌనంగా వున్నారు. సీత మాటిమాటికి చేతి గుడ్డతో కళ్లతుడుచుకుంటూంది.

తారిణి నిరుపమల మకాముకు తచ్చి ఆగింది కారు. నిరుపమ మేడమీద నుండి లొంగిచూచి—"కాస్సేపు లోపలికివచ్చి కూర్చోండి తారిణి బయలుదేరడానికింకో పదినిముషాలు పడుతుంది." అంది.

"నేను కారులోనే వుంటాను. మీరు వెళ్లండి. ఎపుడయినా నేను బయలుదేరడం ఒక నిముషం ఆలస్యమయితే ధూంధాం అంటారే, మరి ఇప్పుడో?" అంది సీత.

"పిచ్చి పిచ్చిగా వాగకు, సరేనా?" అని కోపంగా అని రాఘవన్ కారు దిగి ఆ ఇంట్లోకి వెళ్లాడు.

కారులో కూచున్న ప్రతి నిముషమూ ఒక యుగమనిపించింది సీతకు. అట్లాంటి ఎన్నో యుగాలతర్వాత గలగలమని నవ్వు వినిపించింది. కారు బయటికి తలపెట్టి చూచింది సీత. క్రింది అంతస్తు కిటికిలోంచి విన్పించసాగింది ఆనవ్వు. ఇంకేమీ కన్పించలేదు కాస్సేపు. తటాలున ఒత దృశ్యం కనుపించింది. రాఘవన్ చేతిలో కవర్‌తో తారిణికిద్దామని ఆమె దగ్గరకు వెళ్లాడు. ఆమె దానిని తీసుకొన నిరాకరించింది. రాఘవన్ చటుక్కున ఆమెచేయి పట్టుకుని ఆకవర్ నివ్వ యత్నించాడు. దానిని తీసుకోకుండా అతడి పట్టునుండి విడిపించుకుని పరుగెత్తింది తారిణి. రాఘవన్ ఆమెవెంట పరుగెత్తాడు.

అరనిముషంలో జరిగిన ఈ దృశ్యమంతా సీత మనోఫలకంమీద ముద్రిత మయింది. కొంతసేపు ఆలోచనా శక్తినే కోల్పోయి కూచుండి పోయింది. తర్వాత శరీరమంతా కోపంతో కంపించింది.

కాస్సేపటికి రాఘవనూ తారిణీ వచ్చారు. ఆవెనకాలే నిరుపమ వస్తుంది కాబోలు ననుకుంది సీత, కాని ఆమె రాకుండానే కారు బయలు దేరడం చూచి ఆశ్చర్యపడింది.

* * *

నీలాకాశం నుండి ఒక ముక్క నేలను రాలినట్లుంది రజనీపూర్ చెరువు. దానికిరువైపులా రత్నిక శ్రేణుల్లా కొండలు నిలచివున్నాయి. మిగిలిన రెండు వైపులా ఆకుపచ్చగా చెట్లూ చేమలూ పరచుకుని వున్నాయి.

తెల్లగా పాలవలె వున్న కొంగలు వేలకొలది సంఖ్యలో ఆ చెరువు నీటి మీదుగా ఎగిరిపోతుండగా చూడడం ఒక అపూర్వమైన అనుభూతి.

ఆ చెరువు గట్టున సీత, రాఘవన్, తారిణి కారునుండి దిగారు.

"అహా! ఎంతందంగా వుంది! నేను ఎన్నో ప్రఖ్యాతి దృశ్యాలను చూచానుగాని ఇంత మనోహరమైన దృశ్యం ఎక్కడా చూడలేదు." అంది తారిణి.

"అందుకనే మీ ఇద్దరికి నచ్చజెప్పి మరీ తీసుకు వచ్చాను. జగత్ప్రసిద్ధి చెందిన స్విట్జర్లండ్ సరసులు దీని కాలిగోటికి సరికావు. ఇట్లాంటి చోటికి మిమ్మల్ని తీసుకురావడానికి నా తలప్రాణం తోకకు వచ్చింది" అన్నాడు రాఘవన్.

సీత మాట్లాడకుండా చెరువునే చూస్తూంది, అయితే ఆమెకండ్లు ఆ సీటిని చూస్తూన్నాయేగాని మనసు ఎక్కడో సంచరిస్తూంది. ఆ నీటిమీదుగా వచ్చిన చల్లటిగాలి ఆమె శరీరాన్ని అగ్ని జ్వాలవలె తాకింది. ఆమె విసవిస నడిచి వెళ్ళడం గమనించి తారిణి రాఘవన్‌తో "మీ భార్య ఏదోలా వున్నారు. కేవలం తలనొప్పేకాదు. మనసుకూడా బాగులేనట్లుంది—" అంది.

"ఇట్లా చేస్తుందని తెలిస్తే అసలు పిలుచుకుని వచ్చి వుండేవాడినే కాదు."

స్త్రీమనసు తెలుసుకోలేరు మీరు. ఆమెకు మీతో ఏకాంతంగా రావాలని, తిరగాలని వుంది."

"ఆమెతో ఒంటరిగా వస్తే అయినట్టే...నామాట తన బ్రతికెక్కదు; తనమాట నా చెవికెక్కదు—" అన్నాడు రాఘవన్.

"ఆ తప్పు ఎవరినీ అమెయ బాగా చదివించి మీస్థాయికి ఎదగనివ్వాలి. లేకపోతే మీకు సాటి అయిన చదువులు చదవని దానిని మీరు పెళ్ళాడి వుండరాదు. ఆ తప్పు అవ్వమీదు చేసి ఇప్పుడిట్లా మాట్లాడితే ఏం లాభం?"

"తప్పు నాదికాదు తారిణీ! మీది!"

"చాల బాగుం! ఇట్లాగెప్పుడూ మాట్లాడకండి. మీ అవిడ వున్న చోటికి కెళ్దాం రండి, లేకపోతే ఆమె 'బాధ' ఎక్కువగలదు."

"అయితే కానీ, వాకేం చింతలేదు." అన్నాడు రాఘవన్ అయినా తారిణి నడవడంమూచి ఆమె వెనకాలే నడిచాడు. ఇద్దరూ వెళ్ళి చెరువు గట్టున వున్న సీత ప్రక్కన కూర్చున్నారు.

చెరువు గట్టు దగ్గర పడవలులేవు. చెరువులో తేలి యాడుతూ వెళ్తున్నాయి కొన్ని పడవలు. అవి చెరువు నడుమ, పండ్ల తోటలు నిండిన చిన్న ద్వీపం వైపు వెళ్తున్నాయి. ఆ తోటల మధ్య ఒక మేడ కనుపిస్తూంది.

"ఆ మేడ ఎవరిది?" అని అడిగింది తారిణి.

"అది రజనీపూర్ రాజుగారిది. చచ్చి స్వర్గానవున్న పెద్ద రాజుగారు అప్పుడప్పుడు అక్కడే నివసించేవారు. వారి కేళీవిలాసాలన్నీ అక్కడే జరిగేవిట. మీకు తెలుసో తెలియదో అయిదాలేళ్ళముందు పత్రికలనిండా ఒక వార్త పతాక శీర్షికలతో కనబడేది—అది ఈ పెద్దరాజుగారిని హత్య చేయాలని బొంబాయిలో ఒక స్త్రీ చేసిన ప్రయత్నం. కాని ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆ స్త్రీకి రెండేళ్ల కఠిన కారాగారా వాస శిక్ష విధించారు. పోతే రాజుగారు త్రాగుడువల్ల ఆరోగ్యం చెడి రెండేళ్ల క్రింద చచ్చారు." అన్నాడు రాఘవన్.

మొదటి అర్థరాత్రిగా వుండిన సీత, బొంబాయిలో రజనీపూర్ రాజావారి హత్యా ప్రయత్నం గురించి వినగానే, వారి సంభాషణ అసక్తిగా వినసాగింది. "బొంబాయిలో ఈ రాజుగారిని చంపడానికి యత్నించిన స్త్రీ ఎవరు?" అని అడిగింది.

"ఓహో, నువ్వూ వింటున్నావన్నమాట...ఆ స్త్రీ ఎవరో తెలియదు. కొందరామె ముస్లిము స్త్రీ అన్నారు; కొందరు హిందువన్నారు. ఎవరయితేనేమి, మహా ఘాతకురాలయి వుండాలి. లేకపోతే పట్టపగలే హత్యా ప్రయత్నానికి తలపెడుతుందా?" అన్నాడు రాఘవన్.

"మగవాళ్లేమి ఘోరాలు చేసినా చెల్లుతుంది; కాని వాటికి ప్రతీకారంగాకూడా ఆడవాళ్ళేమీ చేయరాదన్నమాట?" అంది సీత.

"ఏమిటేవిటి! హంతకురాలిని వెనకేసుకొస్తున్నావే— ఇదెక్కడి నేర్చుకున్నావు?" అని అడిగాడు రాఘవన్.

మధ్యలో అడ్డొచ్చి తారిణి "ఆ తర్వాత ఆస్త్రీ ఏమయిందో తెలుసా?" అని అడిగింది. ఇంతసేపు మౌనం దాల్చిన ఆమె స్వరం వింతగా మారింది. అంతకు ముందు సీత స్వరం వణికినట్లు ఇప్పుడు తారిణి స్వరమూ వణికింది. ఇదేదీ గమనించని రాఘవన్—"ఏం ఖర్మ. ఎక్కడ ఏమి ఘోరాలు చేస్తూన్నదో ఎవరికి తెలుసు? దానిని గురించి మనకెందుకు దిగులు—" అన్నాడు. పడవ ఒకటి ఒడ్డును చేరింది. అందులోంచి యాత్రికులు దిగారు.

"దీనిని మాట్లాడుకుందామా? చెఱువుమీద తిరిగివద్దామా?" అని అడిగాడు రాఘవన్.

తారిణి చెప్పింది. "నేను సిద్ధమే, మీ ఆవిడే మంటారో?"

"తనూ వస్తుంది లెండి. రావడం ఇష్టంలేక పోతే ఇక్కడే మూచుని వుంటుంది. మనిద్దరం వెళ్లొద్దాం." అని రాఘవన్ పడవవాడితో మాట్లాడి రావడానికి వెళ్లాడు.

* * *

రాఘవన్ వెళ్లాక తారిణి సీతను చూచి "సీతా! నీ మెడలో రత్నహారం ఎక్కడిది?" అని అడిగింది.

"మా అమ్మ నాకిచ్చింది. నువ్వెందుకడుగుతున్నావు? దానిని నేను ఎక్కడయినా దొంగలించానని అనుమానమా?" అంది సీత.

"ఎందుకంత కటువుగా మాటాడుతావు? చాల అందంగా వుంది కదా, ఎక్కడ చేయించావు అని అడిగానంతే, ఎందుకంత కోపం?"

"నాకేమీ కోపం లేదే."

18

పడవ కదుర్చుకుని వచ్చాడు రాఘవన్.

ముగ్గురూ పడవ నెక్కారు. పడవ కదలసాగింది.

కాసేపటికి వున్నట్లుండి ఆకాశం నిండా కారు మేఘాలు క్రమ్మ కున్నాయి. గాలి పెద్దగా వీచ సాగింది. ఇది ఎవరూ గమనించలేదు.

చెరువు ఒడ్డున వారు కూర్చుని వుండగా నీటిమీద చిన్న చిన్న అలలు కదలుతూన్నాయి. ఇప్పుడు గాలివేగానికి ఆ అలలు అడుగెత్తుకులేచి పడుతున్నాయి. అక్కడక్కడ అలల కోసలందు వెండి నురుగు కనపడసాగింది. అలల హోరు నెమ్మదిగా హెచ్చ సాగింది.

ఒడ్డునుండి చెరువు నడుమనున్న ద్వీపం వైపు పడవ పోసాగింది. కొంత దూరం వెళ్ళేసరికి గాలి వేగం ఇంకా హెచ్చింది. అలలు చెలరేగి నురుగులు కక్కుతూ గజం ఎత్తున ఎగిరిపడ సాగాయి. అలల హోరుతో చెవులు గింగురుమంటున్నాయి. పడవ ఇటూ అటూ ఊగిసలాడ సారం భించింది.

పడవవాడు తన భాషలో ఏదో చెప్పాడు.

సీత నాలుగు వైపుల బిత్తర చూపులు చూచింది. ఉన్నట్లుండి "అయ్యో! అమ్మా! నాకు భయం వేస్తూంది!" అని ఏడవ సాగింది.

రాఘవన్ కటువుగా—"సీతా! ఇదేమి బుద్ధిలేని తనం! ఏడుపు మానుతావా లేవా?" అన్నాడు.

సీత ఆవేశం హెచ్చింది. "అయ్యో! అమ్మా! నువ్వన్నదంతా నిజం కానున్నదే! నేను అలల్లో మునిగి చచ్చిపోతున్నానే—" అని కేకలు వేయసాగింది.

ఎదురుచూడని ఈ పరిణామం రాఘవన్‌ను కలచివేసింది. ఏమిచేయాలో పాలుపోని అయోమయంలో పడ్డాడు అతడు. తారిణిని చూచి 'మీరు కాస్త బుజ్జగించండి" అన్నాడు రాఘవన్, "మిస్టర్ రాఘవన్! బుజ్జగించి ప్రయోజనంలేదు. మీ భార్యకు 'హిస్టీరియా' వున్నట్లుంది. పడవవాడితో పడవను ఒడ్డుకు మళ్లించమని చెప్పండి" అంది తారిణి.

రాఘవన్ పడవవాడికి గట్టిగా అరిచి చెప్పాడు. వాడు 'కుర్ఖడర్ నహీసాబ్!" అన్నాడు.

"పడవవాడు వెనక్కి పోదండీ, పోడు! వాడి కెవ్వరో నూరిపోశారు!" అని చెప్పి వెక్కి వెక్కి ఏడవసాగింది సీత.

"పిచ్చి పిచ్చిగా వాగకు సీతా! నోరు మూసుకో—" అని రాఘవన్ పడవవాడితో—"వెనక్కు మళ్లించు! మళ్లిస్తావా, లేదా" అన్నాడు గట్టిగా.

"ఠీక్ సాబ్, ఠీక్!" అన్నాడు వాడు.

సీత ఏడుపు ఎక్కువయింది. మధ్య మధ్య—"అమ్మా! నువ్వు చెప్పింది నిజమయిందమ్మా!" అని కేకలు పెడుతూంది. ఆమె చేతులు వణుకుతున్నాయి.

ఇది చూచి తారిణి "మిస్టర్ రాఘవన్! 'హిస్టీరియా' అధికమవుతూంది. మీరుకూడా ప్రక్కనవచ్చి కూర్చుని చేయి పట్టుకోండి." అని చెప్పి సీత చేతిని గట్టిగా పట్టుకుంది.

తారిణి పట్టుకున్న చేతిని బలంగా విదిలించుకుని ఒక్క గెంతుగెంతి లేచి నిల్చుంది సీత. పడవ విపరీతంగా కదలుతూంది.

రాఘవన్ లేచి సీతవైపు వద్దామని ఒకడుగు వేశాడు. ఆ సమయాన ఒక పెద్ద అలవచ్చి పడవను ఢీకొంది. పడవ తలక్రిందులయి పోయిందేమో నన్నంతగా ఇటూ అటూ ఊగిసలాడింది.

రాఘవన్ తడబడి పడవలోనే పడ్డాడు.

సీత 'కెవ్'మని అరుస్తూ నీటిలో పడింది.

"అయ్యో, భగవాన్!" అని అరిచింది తారిణి.

పడవవాడు తన భాషలో ఏదో అరుస్తున్నాడు.

మునిగి పోబోతున్నట్లున్న పడవ పైకి లేచింది.

నీటిలో మునిగిన సీత పైకి కనబడుతూ మునుగుతూ వుంది.

సీత ఒకసారి నీటినుండి తల పైకెత్తి 'అమ్మా!' అని అరిచింది. ఆ కేక ఆ అలలహోరునుమించి ధ్వనించింది. తారిణి రాఘవన్‌ల మనసుల నా కేక ఈటివలె గుచ్చింది.

రాఘవన్ అంతరంగంలో ఒక భయంకరమైన ఆలోచన మెరిసింది.

"ఇదే విధి నిర్ణయం కాబోలు! సీత మరణిస్తే?..." ఆపైన ఆలోచనకు తానివ్వకుండా "పడవవాడా! ఒరేయ్ పడవవాడా!" అని అరిచాడు.

మునిగిపోతున్న మనిషి ప్రక్కగా పడవను తీసుకు వెళ్ళమని చెబుదామనుకున్నాడు. ఈలోగా తారిణి పడవనుండి నీటిలోకి దూకి సీత మునిగిపోతున్న చోటువైపు అతి లాఘవంగా ఈదుకుంటూ వెళ్తోంది!

'హోరు'మని పెద్దగా చప్పుడు వినబడుతూంది.

కొంత సేపుదాక ఆ ధ్వని తప్ప ఇంకేదీ వినబడలేదు. వేరే స్మృతి ఏదీ లేదు. ఏమిటాధ్వని అని ఆలోచించింది సీత. చాలసేపు అదే ఆలోచన. చటుక్కున గుర్తుకొచ్చింది.

అమ్మ మాటిమాటికి హెచ్చరిస్తూ వచ్చిన అలల హోరు కాబోలు! అవును, ఆహోరే! చెవులు మూసుకు పోయేలా వినపడుతూంది.

నీటిపైగా వున్నప్పుడు ఇంత చప్పుడు లేదే! నీటి లోపల ఇంత ఎక్కువగా వుందే!' అని అనుకున్నది—గుర్తుకొచ్చింది సీతకు. ఆ తర్వాత—

'సరే, ఇక చావడం ఖాయం! అని అనుకోవడమూ, 'అమ్మా! నీ మాట వినకపోతినే, అని దుఃఖించడమూ గుర్తుకొచ్చాయి. అటు తర్వాత, చేతికేదో తగిలింది. ఆ తగిలింది ఒక చేయేనని తెలిసింది. ఆపత్కాలంలో తన్ను వచ్చి కాపాడతానని చెప్పిన తన అమ్మే అయివుండాలి...ఇట్లా పరిపరివిధాల ఆలోచించడమంతా ఇప్పుడు గుర్తుకు వచ్చింది. కాని కళ్ళు తెరుద్దామంటే కుదరలేదు! ఎంత ప్రయత్నించినా కనురెప్పలు పైకి లేవడం లేదు...!

ఏదో గొంతులు వినపడుతున్నాయే, ఏమిటవి, ఎవరిగొంతులవి? ఎవరు ఏమంటున్నారో? ఈ పాడు ఆలల ఘోష తగ్గితే బాగుండును.

"మీ ఆవిడకు స్పృహ వస్తూంది. కాస్సేపట్లో కళ్ళు తెరుస్తుంది."

"సీత ఇవాళ పునర్జన్మ ఎత్తింది. నీవల్లనే బ్రతికి బయటపడింది. నువ్వే ఆమెకు రెండవ తల్లివి!"

"సీతకు నేను తల్లినయితే మీరు నాకు అల్లుడవుతారు. బలే మంచి అల్లుడే!...సీతకు తెలివి వస్తూంది. ఆమెను తొందరగా మీ ఒడిలోకి తీసుకోండి. ఆమెకు స్పృహ వచ్చేసరికి తాను నా ఒడిలో పడుకుని వున్నట్లు, మీ బట్టలు పొడిపొడిగా వున్నట్లు చూస్తే ఎన్నటికీ మిమ్మల్ని క్షమించలేదు."

"సీత తెలియదు తారిణీ సీత తెలియదు. మా వైపు ఆడవారి క్షమాగుణం ఎంతటిదో సీత తెలియదు!"

* * *

ఈ సంభాషణ వివరాలు అన్నీ సీత మనసుకు అందలేదు. కాని వాటినుండి తాను మునగడానికి ముందర జరిగిందంతా జ్ఞాపకం వచ్చింది. చెరువులో పడి కొట్టుకుంటున్న తన్ను రక్షించింది తారిణి అని తెలుసుకుంది. తానప్పుడు తారిణి ఒడిలో పడుకుని వున్నానని తెలుసుకుంది. 'క్షమాగుణం' గురించి రాఘవన్ చెబుతుండగా తారిణి తన్ను అతి నాజూకుగా ఎత్తి రాఘవన్ ఒడిలో పడుకోబెట్టడమూ తెలుసుకుందామె.

"సీతా! సీతా!" అని పిలుస్తూ ఆమె కనురెప్పలు స్పృశించాడు రాఘవన్. వెంటనే కళ్ళు తెరుచుకున్నాయి.

"సీతా! నేనెవరో తెలుస్తూందా? బాగా చూచి చెప్పు!"

బలహీనమయిన స్వరంతో సీత "తెలియకేమి, తమరు మిస్టర్ సౌందర రాఘవన్ ఎం.ఏ." అంది.

"భేష్... అదిగో నీ ఎదుటవున్నది ఎవరో చెప్పు చూద్దాం."

"నా అమ్మను నాకు తెలియదా?"

ఇది విని రాఘవన్ అదిరి పడ్డాడు. తానూ తారిణీ కాన్సేపు ముందు మాట్లాడుకున్నది ఈమె విన్నదా, లేక మతి చెడిందా?

తటాలున రాఘవన్ ఒడిలోనుండి లేచి కూర్చుంది సీత. ఆమె ఏమి చేయనున్నదోనని వాళ్ళిద్దరూ ఊహించేలోగా సీత తారిణికి నమస్కారంచేసి, ఆమె చేతులను పట్టుకుంది. "మీరు నా ప్రాణాన్ని కాపాడారు. ఈ క్రొత్త జన్మలో మీరే నాకు తల్లి!" అంది.

* * * * *

సీత మనసున ఎన్నడూ లేని ఆనందం పొంగి పొర్లుతూంది. ఆ ఆనందం అణువణువున విద్యుత్తై ప్రవహిస్తూంది. తాను సాక్షాత్తు యమ ధర్మరాజు చేతులనుండి తప్పించుకుని వచ్చిన విషయం ఆమె ఎరుగును. ఇంకాస్త వుంటే ప్రాణం పోయి వుండేది. ఆ విదుటవున్న చెరువు, ఆనీరు, ఆ పచ్చనిచెట్లు ఆ తెల్లని కొంగలు అన్నీ నిజమే! రాఘవన్ ఒడిలో తాను పడుకుని వుండడమూ నిజమే. ఢిల్లీలో అత్తగారివద్ద వదలి వచ్చిన తన గారాలపట్టి నిజమే. ఆహా! ఈ లోకం ఎంత ఆనందమయమైనది! ప్రాణంతో వుండడం ఎంత సుఖమైన విషయం! ఇటువంటి జీవితాన్ని దుఃఖమయం చేసుకొనడంకన్న తెలివి తక్కువతనం మరొకటి వుంటుందా?

వాళ్ళ ముగ్గురూ ఆ రాత్రి దివాన్ గారింటికి చేరేసరికి దివాన్ గారు వెనక్కు వచ్చి వున్నారు. చెఱువులో జరిగిన దానిని ఆయన, ఆయన కూడా తర్వాత చాల కలతచెందారు. తారిణి ధైర్యాన్ని ప్రశంసించారు. దివాన్ గారికి తారిణి నచ్చింది. ఆమె, ఆమె స్నేహితురాలు తక్షణం తమ ఇంటికి

వచ్చేయాలని, రెండు రోజులుండాలని అయన అన్నారు. ఆయన కూతుళ్లూ అదే అన్నారు. సీతకూడా బలవంతం చేసింది.

కనుక సీత, తారిణి దివాన్ ఇంటికి వచ్చి చేరారు. ఆ తర్వాత రెండు రోజులపాటు దివాన్ గారింటినిండా సందడి. ఆ రెండ్రోజులలో సీతా, తారిణీ అత్యంతం సన్నిహితులయ్యారు.

రాఘవన్ చాల సంతోషించాడు. సీత మనసులోని అనుమానం పూర్తిగా తొలగి పోయినట్లన్పించింది.

ఢిల్లీ వెళ్ళడానికి ముందురోజు తారిణీ సీతా ఒంటరిగా వున్నప్పుడు-

"సీతా! ఆరోజు నేనొక విషయం అడిగితే నువ్వు సరిగా జవాబు చెప్పలేదు. ఏ కంఠాన ధరించిన ఆ రత్నహారం గురించి ఇప్పుడయినా చెబుతావా?" అని అడిగింది తారిణి.

"నేనే చెబుదా మనుకుంటున్నాను. ఈ వూరికి వచ్చినప్పటినుండి అదే గుర్తు కొస్తూంది."

"అదేవిటి, ఈ వూరికీ ఆ రత్నహారానికీ సంబంధం ఏమిటి?"

"ప్రత్యక్షంగా ఏమీ సంబంధం లేదు కాని ఒకదాని వెంట ఒకటిగా గుర్తుకొస్తున్నాయి. చెబుతా విను."

అని, సీత తనకు రత్నహారం లభించిన కథను చెప్పసాగింది. తన తల్లి జబ్బున పడివుండగా, ఒక స్త్రీ వచ్చి రత్నహారాన్ని రెండువేల రూపాయలనూ ఇచ్చి తన పెళ్ళికోసం ఇచ్చానని చెప్పడమూ, కత్తిని మరిచిపోయి వానికోసం పెనక్కు రావడమూ, అప్పుడు తన్ను ఆలింగనం చేసుకుని ముద్దు పెట్టుకోవడమూ—అన్నీ చెప్పింది సీత. ఆ తర్వాత తాను అమ్మా కిట్టా వయ్యర్ గ్రామానికని బయలుదేరినప్పుడు పత్రికలో వచ్చిన వార్తను చదవగానే తనకు కలిగిన సందేహం గురించి చెప్పింది.

"అక్కా! బొంబాయిలో రజనీపూర్ రాజాగారిని చంపడానికి ప్రయత్నించిన స్త్రీయే నాకీ రత్నహారం ఇచ్చిందన్న అనుమానం నాకప్పుడే కలిగింది. ఈ వూరికి వచ్చినప్పటినుండి ఆమె పదేపదే గుర్తు కొస్తూంది. దానికి

తోడు ఈయనా చెరువుగట్టు దగ్గర ఆ డోసెత్తారు. అక్కా! దీనినిగురించి నీకేమనిపిస్తూందిరా?'' అంది సీత.

''నీ అనుమానం నిజం కావచ్చు. కాని నువ్వు ఇదంతా ఎవరికీ చెప్పకుండా వుండడమే మంచిది. మీ ఆయనకిదన్నీ చెప్పావా?''

''లేదు. చెప్పినా విన్పించుకోరుగా...'' అంది సీత.

''మీ అమ్మ ఇచ్చిన స్త్రీధనాన్ని జాగ్రత్తగా కాపాడుకో!— అన్నట్లు మీ అమ్మ పేరేవిటి?'' సీత అమ్మా నాన్నల పేర్లు తెలుసుకుంది తారిణి. ''మీనాన్న ఇప్పుడెక్కడ వున్నారు? ఆయన ఎపుడయినా నిన్ను వచ్చి చూస్తుంటాడా'' అని అడిగింది.

''అమ్మ చనిపోయింది. నాన్న వచ్చి నన్ను చూచి చాలరోజులయింది. ఆయన బ్రతికే వున్నారో లేదో కూడా తెలియదు. దేవపట్నంలో మా మామకూతురు, నానెచ్చెలి లలిత వుంది, ఇప్పుడు నువ్వు దొరికావు. మిరిద్దరు తప్ప ఈ ప్రపంచంలో నాకు కావలసిన వాళ్ళే లేరు.''

కాస్సేపూర్కుండి, తారిణి అడిగింది. ''సీతా! రత్నహారం ఇచ్చిన ఆ స్త్రీ ఎవరని మీ అమ్మ చెప్పలేదా?''

''లేదు. బహుశ అమ్మకే తెలిసి వుండదు. తెలిసినా నాకు చెప్పలేదు.''

''సీతా! ఆస్త్రీని మళ్ళీ ఎప్పుడూ చూడలేదా?''

''ఒక్కసారి చూశాను.''

''ఎక్కడ? ఎప్పుడు?''

తాను ఢిల్లీలో ఒక రోజు భర్తతో వ్యాహ్యాళికి వెళ్ళి వస్తుండగా సాయింకాలం వేళ చేత కత్తి ధరించిన ఆస్త్రీ కనబడడం—చెప్పింది సీత.

''అరెరే! ఆమెను చూడాలని ఎంతో ప్రయత్నిస్తున్నానునేను. కాని నాకు కనపడనేలేదు.''

''అట్లాగా అక్కా? నువ్వు ఆమె కోసం ఎందుకు వెతకాలి? నీకు ఆమెను తెలుసా?''

"తెలుసు సీతా!"

"ఎట్లా తెలుసు?"

"ఆమె నాతల్లి!"

ఆశ్చర్య సముద్రంలో మునిగింది సీత. తారిణిని తదేకంగా చూచింది. "ఇప్పుడు నిజం తెలుస్తూంది. నీ ముఖవళికలు సరిచిత్రమైనట్లు, ఇంతకు ముందెక్కడో చూచినట్లు అన్పించేది. ఇప్పుడు కారణం తెలిసింది."

"సీతా! నీ ఊహ సరికాదు. ఆమె నా స్వంత తల్లికాదు, నన్ను పెంచినతల్లి - నా అసలు తల్లిదండ్రు లెవరో నాకీ వాటికీ తెలియదు. ఆమాట తెలుసుకోవాలనే నేను రజియాబేగం కోసం వెతుకుతున్నాను."

'ఆమె పేరు రజియాబేగమా? ఆమె ముస్లిమ్ అన్నమాట!"

"అవును. నన్ను పెంచింది ముస్లిము స్త్రీయే! నాల్గేళ్ళక్రితం నేను బీహార్ భూకంప బాధితులకు సేవ చేయడానికవి వెళ్ళివున్నప్పుడు రజియా బేగం రజినీపూర్ రాజును హత్య చేయడానికి యత్నించి రెండేళ్ళ కారాగార శిక్షకు పాత్రురాలయింది. చెరసాలనుండి విడుదలయినాక, ఎంత ప్రయత్నించినా ఆమె నాకంట పడలేదు. సీతా! నేనెంత దురదృష్టవంతురాలినో చూశావా?" కన్నీరొలుకుతుండగా సీత "అక్కా! ఆమె నా కీసారి కనబడితే నీకు తెలియబరుస్తాను." అంది.

"అంతేకాదు, నేనామెను తప్పక చూడాలని చెప్పు. చూడలేక పోతే నేను చచ్చిపోదలచుకున్నాననీ చెప్పు!"

'అలాటి మాటలనకు! నా ఆశలంతా నీ మీదే వున్నాయి! అంది సీత.

19

"నా ప్రాణానికి ప్రాణమైన సీతకు,

లలిత రాయడం. మీ ఆగ్రా యాత్ర వివరాలు చదివి చాల సంతోషం కలిగింది. అవన్నీ చదువుతుంటే నేనూ మీతో పాటే అవన్నీ చూస్తున్నట్లే అన్పించింది. ఈయనతో మనమూ వెళ్ళి తాజ్‌మహలు ఆవీ చూచివద్దామా?' అంటే—'మన తమిళనాడులో చూడవలసిన వెన్నో వున్నాయి. తంజావూర్, మహాబలిపురంవంటి వాటినింకా చూడలేదు. ఇంక తాజ్‌మహల్ చూడలేదనే చింత ఎందుకు?" అని కొట్టి పారేశారు. ఎందుకబ్బా ఈయనతో చెప్పాం అనిపించింది. నామాటలు విన్నమా అత్తగారు "అమ్మా! ఏదో కాశీరామేశ్వరం వెళ్ళాలని అనుకోవడం కద్దు. ఏదో కాలుగు పుణ్య స్థలాలను చూస్తే ఆవెళ్ళేచోట పుణ్యమయినా కలుగుతుంది. తురకరాజులు కట్టుకున్న సమాధులు చూడాలవి ఎవరన్నా ఎగబడతారా ఏం విపరీత బుద్ధులమ్మా ఈ కాలం ఆడ పిల్లలవి..." అని ఒక రోజు రోజంతా నాకు హితబోధ చేశారు.

మా ఎదురింట్లో వకీలు దామోదరం పిళ్ళేగారని వున్నారు. మా మామగారు ఆయనా స్నేహితులు. పెళ్ళేగారబ్బాయి అమర్‌నాథూ మావారూ మిత్రులు. మన సూర్యా వుండగా వీళ్ళు ముగ్గురూ కలిసి చదువుకునే వాళ్ళట. అమర్‌నాథ్‌కు రెండేళ్ళ క్రింద పెళ్ళయింది. పిల్లతండ్రి డిప్టీ కలెక్టరట. పిల్లబాగా చదువుకున్నదికాని బొత్తిగా గర్వం లేదు. పెళ్ళిలోనే మాకిద్దరికీ స్నేహం కుదిరింది. ఒక ఏడాదికి ముందు ఆమె ఈవూరు వచ్చిన పుటినుండి మా ఇద్దరి స్నేహమూ వృద్ధి చెందింది. మా ఇద్దరి మైత్రి చూచి మా భర్తలు సంతోషించారు.

కాని అదంతా పాతకథయి పోయింది సీతా! కారణం ఏమిటో తెలుసా? నేను రాజంపేటకు వెళ్ళి వుండగా ఇక్కడ మున్సిపల్ ఎన్నికలు జరిగాయిట. ఆ ఎన్నికలలో ఎదురింటి దామోదరం పిళ్ళేగారూ, మా మామగారి ఇంకో స్నేహితుడయిన రాజారామయ్యరూ నిల్చున్నారట. మా మామ

గారు రాజారామయ్యగారికోసం పనిచేశారట. ఏదో ఒక సభలో పిళ్ళైగారినీ మామ "తెల్లవాడితోక నాశ్రయించేవాడు" అన్నారట. అందుకని దామోదరంపిళ్ళై ఈయనా 'బాపనబుద్ధి చూపిస్తున్నాడు" అన్నారట. దాంతో ఆరంభమైంది తగాదా. చిలికిచిలికి గాలివానయింది; ఇప్పుడు రెండు కుటుంబాలమధ్య రాకపోకలు లేవు; మాటలు లేవు. ఈ వైరం వల్ల నాకున్న ఒక్క- స్నేహితురాలూ దూరమయింది. ఆ కాస్త కాలక్షేపమూ పోయింది. ఇల్లు చెరసాలలా అయింది.

సూర్యా గురించి అనుకుంటే జాలికలుగుతుంది. ఇల్లు విడిచి, ఊరువిడిచి ఢిల్లీ పట్నం వెళ్లి సరయిన తిండికికూడా నోచుకోకుండా ఎన్నో అవస్థలు పడుతున్నాడు! చిత్రం విన్నావా! డబ్బు కొంత పంపమని నాకు రాశాడు. మావారి నడిగి అయినాసరే పంపమన్నాడు. డబ్బుకావాలని ఇంటికి రాయడట. ఇంటినుండి డబ్బు వచ్చినా తీసుకోడట. ఇట్లాంటి కుర్రవాడెక్కడయినా వుంటాడా? ఆతడిని నాకోసమయినా కాస్త కనిపెట్టి వుండు.

చిరంజీవి వాసంతి కులాసాగా వుందనుకుంటాను. చక్కగా మాట్లాడుతూ ఆటలాడుతూ వుందనుకుంటాను.

నీ లలిత."

ఈ వుత్తరాన్ని చదివి సీత గడియారం చూచింది. రాత్రి ఎనిమిదిన్నర అవుతూంది. ఇంకా ఆయన ఎందుకో రాలేదు! తానూ పాపాయి ఒంటరిగా వుండగా ఆయన ఇంత ఆలస్యం చేయనేల?

జూన్ నెల మొదట ఢిల్లీలో ఉష్ణోగ్రత 110 డిగ్రీలు ఫారెన్‌హైట్‌కు పెరిగింది. పగటివేళ వీధిలోకి వెళ్ళిన వాళ్ళు మలమల మాడిపోతున్నారు. రాత్రి ఇంటిలో వున్నవారు ఇటుకల ఆవిలో వున్నట్లు మండిపోతున్నారు. పగలయినా, రాత్రి అయినా గాలి నిప్పులా వీచ సాగింది. ఢిల్లీలో వున్న వైస్రాయి ప్రభువూ, ఉన్నతోద్యోగులూ సిమ్లాకు వెళ్ళిపోయారు.

సౌందరరాఘవన్ సీతతోబాటు సిమ్లా వెళ్దాం అనుకున్నాడు. కామాక్షమ్మ తన ఆరోగ్యానికి సిమ్లా సరిపడదని అనసాగింది. ఈలోగా ఊరినుండి

ఆమె అన్న కొడుక్కు పెళ్లి అని ఉత్తరం వచ్చింది. కామాక్షమ్మాళ్ ఒక నెల రోజులలో వస్తానని చెప్పి ఊరికి వెళ్లింది.

అనుకోకుండా ఏదో పని రావడంతో సౌందర రాఘవన్ సిమ్లాకు వెళ్లలేకపోయాడు. "నువ్వూ వాసంతీ పిల్లా వెళ్ళివస్తారా? ఎందరో స్త్రీలు వెళ్ళి వస్తున్నారు ఒంటరిగా" అని అడిగాడు. "బాగుంది మీరు లేకుండా నాకు సిమ్లావాసం ఒక్కటే తక్కువ నేను వెళ్లను." అంది సీత.

అందు చేతనే ఆ సాయింకాలం సీత, వాసంతీ ఆ ఇంట్లో ఒంటరిగా వుండడం తటస్థించింది. ఎనిమిదిదాక "నాన్నగారెపుడొస్తారు" అని అడిగి అడిగి వాసంతి నిద్రపోయింది. అది నిద్రపోయాక ఒంటరి తనం ఇంకా కొట్టవచ్చినట్లనిపించింది సీతకు. అవాళనగా పనిమనిషీ రాలేదు.

ఆవేళ ఆఫీసుకు బయలుదేరుతుండగా రాఘవన్ 'ఇవాళ ఎట్లాగయినా సూర్యా ఎక్కడ వున్నాడో వెతికి తీసుకువస్తాను." అని చెప్పి వెళ్ళాడు. అందుకనే ఆలస్యమయిందేమో?

లలితకు వుత్తరం రాద్దాం అని చూచుంది సీత.

"ప్రాణ సఖీ, లలితా! నీ వివరాలతోకూడిన వుత్తరం చదివి సంతోషం చెందాను. దేవపట్నం మున్సిపల్ ఎన్నికలు చాల రంజుగా వున్నాయి. అయితే నువ్వు స్నేహితురాలిని కోల్పోవడమే బాగాలేదు. నేనూ మావారూ మూడు వారాలక్రింద వైస్రాయి భవనంలో జరిగిన 'గార్డెన్ పార్టీ'కి వెళ్లాము. అబ్బబ్బ! ఏం చెప్పను లలితా? వైస్రాయి తోట శోభగురించి చెప్పనా? ఆక్కడి వింత వింత పుష్పాల గురించి, మొగ్గల గురించి, చెట్ల గురించి చెప్పనా? ఆ పూతకీండ్లలో దాగివుండి వింత కాంతులు వెదజల్లిన దీపాల గురించి చెప్పనా? ఆక్కడి కొచ్చిన స్త్రీపురుషుల హావభావ విలాసాలగురించి చెప్పనా? పాశ్చాత్య స్త్రీలు నల్లటి మెరిసేటి గౌనులు తొడుక్కుని వచ్చారు; మన దేశపు స్త్రీలు రంగు రంగుల చీరలతో వచ్చారు. ఒక్కొక్క చీర ఒక్కొక్క రకం; ఆభరణాలూ అంతే! నాకు దేవలోకంలో తడుగిడినట్లు దిగ్భ్రమ కలిగింది. వచ్చిన వారిలో చాలమందిని ఈయన ఎరుగుదురు. వారి

అందరికీ నన్ను పరిచయం చేశారు. తెల్ల వారికి మనలను పరిచయం చేయగానే "ఎలా డు యు డూ?" అని వాళ్ళు ఎంత తియ్యగా పలకరిస్తారనీ! వాళ్లని ఊరికే అ స్తమానం దూషించితే ఏమి లాభం? మనం వాళ్ళనుండి నేర్చుకో వలసినవి ఎన్నో వున్నాయి.

దేవపట్నం ఎన్నికల గురించి రాశావు. పాశ్చాత్య దేశాలలోనూ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నిక లవగానే ఓడిపోయిన వారు జయించినవారిని వెళ్ళి మొదట అభినందించి వస్తారుట. ఇక్కడయితే ఆ జన్మాంతం శత్రువు లయి కూర్చుంటారు. ఎంత మూర్ఖత్వం!"

సరిగా ఈ చోట వుత్తరాన్ని ఆపింది సీత. హఠాత్తుగా కుళాయిలో నీరు వస్తున్న శబ్దం విన్పించింది. స్నానాల గదినుండి విన్పించింది! సీత నాలుక పిడచ కట్టుకపోయి గొంతు కడ్డంగా పడింది. ఆమె కాళ్ళు చేతులు కూరుకు పోయాయి. తనకు తెలియకుండా ఎవరో ఇంట్లోకి ప్రవేశించి దొడ్డి వైపున్న స్నానాలగదిలోకి వెళ్లి వుండాలి; ఆక్కడ కుళాయి తెరిచి వుండాలి. ఎవరది?

సందేహమూ, కలవరపాటూ ఆమెను మధించ సాగాయి. ఎవరయితే నేమి, వెళ్లి చూద్దాం అని నిర్ణయించుకుంది. తడబడుతూ, కాళ్ళ నీడ్చుకుని వెళ్లి, స్నానాలగదిని సమీపించింది. తలుపులు మూసి వున్నాయి. కాని గోపలివై పు గడియ వేసి వున్నట్లు లేదు. చేతులు వణుకుతుండగా తలుపును నెమ్మదిగా తట్టింది. కుళాయి చప్పుడు ఆగింది.

"ఎవరక్కడ?" అని అడిగింది సీత.

స్నానాల గదిలో అడుగుల చప్పుడు వినబడింది. ఆ ఒక్కొక్క అడుగు చప్పుడుకూ ఆమె గుండె వందసార్లు కొట్టుకుంది. ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు; తలుపులు తెరుచుకున్నాయి.

గుమ్మాని కడ్డంగా ఒక ఆకారం నిలిచి వుండి! దాని చేతిలో కత్తి వుంది

''సీతా ! నేనెవరో తెలుస్తున్నదా? జ్ఞాపకం వస్తున్నదా?'' అతి ప్రయత్నంమీద నోరు తెరచి రహస్యం మాట్లాడుతున్నట్లు సీత ''తెలుస్తూంది'' అంది.

'' నేనెవరు?''

తన మెడలోని రత్నహారాన్ని చూపిస్తూ— ''దీని నిచ్చినవాడ!'' ఆంది సీత.

''మంచి పిల్లవు. ఆన్నీ జ్ఞాపకం వుంచుకున్నావు. ఇంటిలో నువ్వొక్కర్తివే వున్నావా? ఇంకెవరూ లేరా?'' అని అడిగింది ఆ స్త్రీ.

ఈ ప్రశ్న సీత చెవిని పడలేదు. ఆమె దృష్టి ఆ స్త్రీ నడుముకు చెక్కుకునివున్న రుమాలుమీద పడింది. తెల్లటి ఆ రుమాలు సగానికి సగం ఎర్రగా తడిసివుంది. అది చూచిన సీత గుడ్లు మిటకరిస్తూ ''అయ్యో ! రక్తం! రక్తం!'' అని అరిచింది. ఎందుకో ఏడుపూ, వెక్కిళ్లూ కలిసివచ్చాయి.

రజియాబేగం రెండడుగులు ముందుకువేసి సీతను సమీపించింది. సీత భుజాన్ని పట్టుకుని కుదిపి ''ఇదిగో చూడు సీతా! నువ్వు తెలివయిన దానివనుకున్నాను. కాని అందరి ఆడవాళ్ళలాగే నువ్వూ మూర్ఖత్వంతో ప్రవర్తిస్తున్నావు. నువ్వు అరిచి గందరగోళం చేశావంటే ఏం చేస్తానో తెలుసా? కాస్సేపు ముందుగా వీధిలో ఒక పిచ్చి పక్కను పొడిచి చంపాను, అవిధంగా నిన్నూ చంపేస్తాను!'' అంది.

సీత వెక్కిళ్ళు వెంటనే ఆగాయి.

'' నిన్నిది చాల భయ పెడుతున్నట్లుంది. వుండు! కళాయి దగ్గర కడుక్కుని వస్తాను.'' అని స్నానాల గదిలోకి వెళ్లి ఆ స్త్రీ రుమాలును రుద్ది కడిగింది గాని ఆ ఎర్ర మరక పోలేదు. ''దీనిని తగల బెట్టవలసిందే'' అంటూ దానిని క్రింద పారవేసి వచ్చింది.

సీత ఈలోగా ఆలోచించ సాగింది. పక్కను చంపానంటున్నదే: నిజమేనా? నేనిక్కడ వున్నది తెలిసి వచ్చిందా? తెలియక వచ్చిందా? ఈలోగా ఆయన వస్తేనో...? ఆలోగా, ఈమె కేదయినా మంచి మాటలు

చెప్పి బయటకు పంపేయాలి. లేకపోతే ఏం జనుగుతుందో? దేవుడా! ఈ ఇంటికెందుకు రావాలీ? ఇంకే ఇంటికయినా వెళ్లి వుండకూడదా?

ఆ స్త్రీ చుట్టూరా తేరిపార చూచింది. స్నానాల గదికి ఎదుటవున్న గదిని చూపించి "ఆ గదిలో ఏముంది?" అని అడిగింది.

"కట్టెలు, బొగ్గులు, చిల్లర మల్లర సామాన్లు వున్నాయి." అంది సీత.

ఆ గదిని తెరచిచూచి ఆస్త్రీ "సరే! ఇవాళ రాత్రి నేనిక్కడ పడుకుంటాను. ఈ సంగతి ఎవరికీ తెలియకూడదు. నువ్వు తలుపుకు బయటతాళం వేసుకో!" అంది.

"దీనిలో ఎట్లా పడుకుంటారు? గాలి అసలు రాదే! సామాన్లన్నీ చిందర వందరగా పడివున్నాయే!"

"ఫరవాలేదు సీతా! ఇంతకన్నా అధ్వాన్నమయిన చోట్ల పడుకున్నా నింతకు ముందు—"

ఇదివిన్న సీత మనసు కరిగింది. ఆ స్త్రీ జీవితం ఎట్లా వుంటుందోనని ఊహించిందంతా గుర్తుకొచ్చింది. జీవితంలో ఎన్ని కష్టాలు భరించిందామె; అందులో సందేహం ఏమీ లేదు. ఆ కష్టాలన్నీ, రజనీపూర్ రాజు వలన కలిగాయన్నది తథ్యం. కాని అవి ఎట్లాంటి కష్టాలు? ఆమె నడిగి తెలుసుకోవా అనిపించింది. కాని ఇప్పుడు వీలులేదు. ఏ నిముషానయినా తన భర్త రావచ్చు. వస్తే పిచ్చిదానిలావున్న ఈమెను తరిమివేయడం తథ్యం.

"ఇదిగో జంపకానా, తలగడా తెస్తాను" అని లోపలికెళ్లి తెచ్చింది సీత. ఇంత సేపటినుండి ఆమె మనసు, ఏదో ముఖ్యమైన దానిని మరిచాము. గుర్తుకు తెచ్చుకోవాలి అని అంటూనే వుంది. అదిప్పుడే గుర్తుకు వచ్చింది. అది తారిణి చెప్పిన విషయం.

"మిమ్మల్ని ఒక విషయం అడగాలి." అంది సీత.

"తొందరగా అడుగు; నాకు అలసటగా వుంది?"

"మీ పేరేమిటి?"

"ఏదయితే నేమి, ఇప్పుడెందుకు?"

"మీరు చెప్పక పోతే నాకు తెలియదా ఏమిటి?"

"తెలిస్తే చెప్పు!"

"రజియా బేగం! —అవునా?"

"అవును. కాదు నాపేరు రమామణి. ఒక కార్యార్థం కొంత కాలం పాటు, రజియాబేగం అన్న పేరు పెట్టుకున్నాను. దాని వెనకో నీతి చెప్పి వట్లున్నారు. ఎవరు చెప్పి వుంటారు! ఆ వెర్రి బ్రాహ్మడు కాదు గద?"

ఏ వెర్రి బ్రాహ్మడో సీతకు అర్థం కాలేదు. తటాలున "వేరెవరో కాదు. మీ మూతురు తారిణి చెప్పింది." అంది సీత.

సీత ఎదురు చూచినట్లే ఆమె అదిరి పడింది.

కాస్సేపు సీతను తదేకంగా చూచి "నిజంగానా? తారిణి చెప్పిందా?" అని అడిగింది. "తారిణి నెక్కడ చూచావు? ఎప్పుడు చూచావు?"

"కొన్నాళ్ళకు ముందు ఆగ్రా వెళ్ళాము- అక్కడ కలిశాము."

"తర్వాత?"

"ఆగ్రా తర్వాత రజనీపూర్ వెళ్లాము..."

ఆ స్త్రీ మనసులో ఏదయినా కలవరపాటుంటే అది ఆమె మొహం మీద కనపడలేదు. ఆమె మొహం క్రమంలో చేసిన దానివలె ఆయింది.

సీత చెప్పిందంతా: "రజనీపూర్‌లో ఏవేవో మాట్లాడుకున్నాము. తారిణిని ఆమె అమ్మనాన్నల గురించి అడిగాను. అప్పుడు తన్ను పెంచిన తల్లి మీ రేనని చెప్పింది. ఆమె చెప్పిందానిని బట్టి, కొంత నాకు తెలిసిన దానినిబట్టి మీరెవరో ఊహించ గలిగాను."

"నువ్వూ తారిణీ స్నేహితురాండ్రయారన్నమాట!" అని ఆ రజియా బేగం అనబడే రమామణి అడిగింది.

"స్నేహం కాకుండా ఎట్లా వుంటుంది? పడవనుండి నేను చెరువులో పడిపోతే తారిణి వెంటనే నీళ్లలోకి దూకి నన్ను రక్షించింది."

రజియాబేగం ముఖం కొంత విప్పారింది. "అది నాకూతురు!" అని అతిశయంతో చెప్పుకుంది.

"కూతురంటే యింత ప్రేమకదా, ఆమెను చూసి ఎన్నో యేళ్ళ యిందటగా? మిమ్మల్ని చూస్తే వెంటనే తనకు తెలియ బరచమని చెప్పింది."

రజియాబేగం జం ఘఖావాను దిండుకుక్రిందటదేసి "ఏది సీతా చేతిలో చేయివేయి! "అని కొంత అధికారంలో చెప్పింది. సీత అట్లాగే చేసింది.

"నే నివాళరాత్రి యిక్కడకు వచ్చినట్లు తారిణికిగాని, నీభర్తకు గాని చెప్పరాదు. ఎటువంటి కారణం వున్నా ఈ విషయం ప్రస్తావించనే కూడదు. అట్లాగని ప్రమాణం చెయ్య లేకపోతే అపిచ్చి కుక్కను చంపినట్లు నిన్ను ఈ నిమిషమే పొడిచి చంపిపారేస్తాను." అని రజియాబేగం నడుములోనుండి ఎడమ చేత్తో కత్తిని పైకితీసి చూపించింది.

సీత బెదరిపోయి అట్లాగే ప్రమాణం చేసింది.

"అదే సమయంలో వీధివైపునుండి మోటరుకారు హారన్ మోగింది."

"అయన వచ్చేశారు మీరు త్వరగా గదిలోకి వెళ్ళండి!" అంది సీత.

"జాగ్రత్త జ్ఞాపకం లేకుండా నా వూసెత్తేవు సుమా!" అని చెప్పి రజియాబేగం ఆ సామాన్ల గదిలోపలికి ప్రవేశించింది.

సీత గదితలుపులను దగ్గరకులాగి తాళం వేసి, నిట్టూర్చింది. తరువాత వీధి తలుపులు తెరుద్దామని గబగబ నడిచి వెళ్ళింది.

20

వీధి తలుపులు తెరిచిన సీతకు అంతకన్న ఆశ్చర్యపు గొలిపే దృశ్యం ఎదురయింది.

గుమ్మంముందు వాళ్ళ కారొచ్చి ఆగింది. కారు ముందు సీట్‌లో ముగ్గురు కూర్చుని వున్నారు. వాళ్ళొక్కొక్కరే కారునుండి దిగారు.

వెంటనే కారు వెనక సీటువైపు సీత దృష్టి వెళ్ళింది. అక్కడ ఏదో పొడుగ్గా మూటవలెవుంది. అది మూటేనా, లేక...?

అసలే కలవరమందిన సీత హృదయం భీతితో కంపించింది.

వచ్చిన వాళ్లను లోపలికి రమ్మని చెప్పాలని గుర్తుకు వచ్చింది. వాళ్లా పాటికే గుమ్మం వైపుగా వస్తున్నారు. మందకొడిగా వున్న వీధి దీపం వెలుగులో వాళ్ళ మొహాలు చూచింది సీత. ఎందుకు వీళ్ళిట్లా, ఏదో కోల్పోయిన వారిలా వున్నారు?

"ఎందుకట్లా గుమ్మంలో నిల్చోవడం? కాస్త దారివ్వు!" అంటూ ముందట రాఘవన్ వచ్చాడు. అది ఎప్పటివలె కోపంకాదు; చికాకు, తొందరనిండిన స్వరం; వింతగా వుంది సీతకు. వస్తూండగానే ఏరియో ధోరణి?

సీత ప్రక్కకు ఒదిగి నిల్చింది. ఆ వెంటనే తారిణి వచ్చింది, ఆమెకు స్వాగతం చెప్పాలనుకుంది సీత. కాని ఆమె మొహం స్వాగతం చెప్పడానికి ప్రోత్సహించలేదు.

ఆ తర్వాత సూర్యా వచ్చాడు.

"బావా! ఏమిటిది, మీరందరూ ఎక్కడి నుండి వస్తున్నారు? ఎందుకిట్లా వస్తున్నారు? ఏదో హత్యచేసిన వారిలా వున్నాయేం మీ మొహాలు?" అని అడిగింది సీత.

హత్య—అన్న పదం వినగానే అదిరిపడి సీత మొహం చూచాడు సూర్యా; "సీతా! ఒక భయంకరమైన విషయం జరిగింది. ముందు లోపలికి పద." అన్నాడు.

సీత, సూర్యా లోపలికి వెళ్ళేటప్పటికి; అక్కడ రాఘవన్ టెలిఫోన్‌ను చేతిలో పట్టుకుని నిల్చుని వున్నాడు. తారిణి ఒక సోఫాలో కూర్చుని వుంది. ఆమెలో ఏదయినా మాట్లాడుదామని అనుకుంటుండగా

"సీతా! పాపాయి ఏం చేస్తూంది? నిద్ర పోయిందా?" అని రాఘవన్ తత్తరపాటుతో అడిగాడు.

ఆప్పుడే లోపలినుండి "నాన్నా! నాన్నా!" అన్న గొంతు వినిపించింది.

"ఇంతసేపటినుండి నిద్రపోతూంది. మీ గొంతు వినగానే మేల్కొన్నట్లుంది. నిద్రలోకూడా నాన్నగారి జపమే బిడ్డకు!" అంది సీత.

"సరేసరే! ఆ ముచ్చటలన్నీ తర్వాత. ముందు వెళ్లి దానిని నిద్రపుచ్చు. నాన్నగారప్పుడే వస్తారని చెప్పు—వెళ్లు—"

ఇదేదో ముఖ్యమైన విషయమేనని రాఘవన్ ధోరణి చెప్పింది. సీత లోపలికి వెళ్లింది.

"నాన్న వచ్చేశారమ్మా?" అని అడిగింది వాసంతి.

"వచ్చారమ్మా! వచ్చి ఏపక్కనే పడుకుంటారుగాని నువ్వు నిద్రపో!"

"నాన్న కోపంగా వున్నారా?"

అంత గొడవలోనూ వాసంతి వేసిన ప్రశ్న సీతకు నవ్వు కలిగించింది. "లేదమ్మా! ఇంకెవరో వచ్చారు; వాళ్లతో మాట్లాడుతున్నారు నాన్న. నువ్వు నిద్రపో—" అంది.

ఓ నిమిషం తర్వాత వాసంతి నిద్రలో మునిగింది. సీత ముందు గదిలోకి వచ్చింది.

అప్పుడు రాఘవన్ టెలిఫోన్‌లో మాట్లాడు తున్నాడు. "హలో! పోలీసు స్టేషన్? ఎవరక్కడ?...ఇక్కడ పి. ఎల్. ఎస్. రాఘవన్ మాట్లాడుతున్నాను...ఇక్కడ ఒక 'ఆక్సిడెంట్...నో; కాదు ఆక్సిడెంట్' కాదు.. హత్యేమోనని...ఎస్, ఎస్; మర్డర్' అని సందేహంగావుంది...వెంటనే ఎవరినన్నా పంపండి...థాంక్స్!"

"ఏమిటక్కా ఇదంతా? పోలీసు నెందుకు పిలుస్తున్నారు?" అని సీత హీన స్వరంతో అడిగింది.

తారిణి ఏమీ జవాబు చెప్పలేదు, విచిత్రంగా చూచింది.

రాఘవన్ సూర్యాను చూచి—"రా సూర్యా! మనం వెళ్లి వీధిలో నిల్చుందాం! ఏక్షణాన్నా పోలీసు వాళ్లు రావచ్చు! అన్నాడు.

మగవాళ్లద్దరూ వీధి వైపు వెళ్లగానే సీత తారిణిని సమీపించి—"అక్కా! ఇదేవిటి? ఈయన ఫోన్‌మీద ఏదో భయంకరమైన విషయం గురించి మాట్లాడారే, ఏమిటది? పోలీసుల నెందుకు పిలవాలి?" అని అడిగింది.

"ఔను, భయంకరమైన విషయమే!"

"ఏవిటది? తొందరగా చెప్పు!"

"ఎందుకు దానిని గురించి అడుగుతున్నావు? నువ్వు అందుగురించి తెలుసుకోకుండా వుండడమే మంచిది."

"ఆయనలాగే నువ్వూ మాట్లాడుతున్నావే? నాకెందుకు తెలియకూడదు? మీరిట్లా దాస్తున్న కొద్దీ నాకు మనసింకా కలవరం చెందుతూంది."

"నిజమే! నీకు తెలియవలసిందే! నేను నీకు చెప్పనంత మాత్రాన నీకు తెలీయకుండా వుండబోదు కదా...అయినా అందుగురించి చెప్పాలంటేనే జుగుప్సగా వుంది. అందుకనే తటపటాయిస్తూన్నాను... మేము ముగ్గురమూ కారులో వస్తున్నాము. దారిలో, మీ వీధికోస దగ్గర...", తారిణి మధ్యలో ఆపేసింది. ఆమె, నిలువెల్ల కంపించింది.

"అదేవిటక్కా, ఎంతో ధైర్యశాలి అయిన నువ్వే ఇట్లా వణుకుతున్నావు?"

ఆ తర్వాత జరిగిన దానిని ఎట్లాగో తడబడుతూ చెప్పింది తారిణి. దాని సారాంశం ఇది.

ముగ్గురూ వస్తున్నారు. ఈ వీధి మొగదల రాఘవన్ హఠాత్తుగా 'బ్రేక్' వేసి కారాపాడు. తారిణి, సూర్యా ఒక్కసారే "ఏమిటి? ఏమిటి?" అని అడిగారు. రాఘవన్ జవాబు చెప్పకుండా క్రిందకు దిగాడు. మిగతా

ఇద్దరూ దిగారు. దారి కడంగా ఏదో పడివుంది. దగ్గరకు వెళ్లి చూస్తే అది ఒక మనిషి అని తెలిసింది.

"ఎవడో మడ్డి వెధవ, తప్ప త్రాగి వీధి కడ్డంగా పడివున్నాడు." అన్నాడు రాఘవన్.

"ఏదయినా బండి గుద్దిందేమో—" అన్నాడు సూర్యా.

"నాన్సెన్స్; బండి గుద్దలేదు—" అన్నాడు రాఘవన్.

"బండి గుద్ది వుండకపోయినా. పడివుండగా మీదుగా వెళ్ళి వుండ వచ్చుకదా, ఇంకా దగ్గరగా చూద్దాం—" అన్నాడు సూర్యా.

"చూద్దాం పదండి!" అంది తారిణి.

"మాట్లాడకుండా కారును ఆ ప్రక్కగా నడిపించుకుని పోదాం పదండి!" అన్నాడు రాఘవన్. అతడి మాట వినకుండా సూర్యా, తారిణీ ఆ పడివున్నవాడి ప్రక్కకు వెళ్ళి చూచారు.

అతడి వేషాన్నిబట్టి చూస్తే పెద్ద మనిషిలా వున్నాడు. సూర్యా అతడి ముక్కుదగ్గర వేలుపెట్టి పరీక్షించి—"ఊపిరాడుతూంది! ప్రాణంవుంది!" అన్నాడు.

కారు మందుచక్రం అతడి తాకుతూ వుండడం చూచింది తారిణి.

"బండెక్కండి! వెళ్ళిపోదాం—" అన్నాడు రాఘవన్.

తారిణి అంది: "చాల బాగుంది! ఒక మనిషిని ఇట్లా గుద్దేసి మనం వెళ్ళిపోవడమా?" వెంటనే ఆస్పత్రికి తీసుకు పోవాలి గాని..." అంది.

సూర్యాకూడా ఆమె చెప్పిందానిని ఆమోదించాడు.

"అట్లాగయితే పరోపకారులిద్దరూ కలిసి అతడిని తెచ్చి కారులో పడేయండి; నాచేతకాదు." అన్నాడు రాఘవన్.

"ఓ! అట్లాగే!" అని తారిణి తలవైపు పట్టుకుని ఎత్తింది. సూర్యా నడుముదగ్గర పట్టుకున్నాడు. తారిణి అతడి మెడక్రింద పెట్టింది చేయి, చేయి తడిసింది. అతడి తలను నేలమీదనుండి పైకి ఎత్తగానే, ఆక్కడ రక్తపు మడుగులావుంది. అయినా భయపడలేదు తారిణి. వణుకుతున్న చేతులను

నిశ్చలంగా వుంచుకుంది. ఇద్దరూ కలిసి మోసుకొచ్చి కారువెనక సీటులో పడేశారు.

"సరిసరి, కారెక్కండి!" అన్నాడు రాఘవన్. వాళ్ళిద్దరూ ముందు సీటులోకి ఎక్కి కూర్చున్నారు.

కారు నడుపుతూ రాఘవన్ "మీరిద్దరూ మూర్ఖులు! మిమ్మల్ని వెతుక్కుంటూ రావడం నా తప్పు." అన్నాడు.

"బోను తప్పే! మిమ్మల్ని ఎవరు రమ్మన్నారు?" అంది తారిణి.

"అందుకు ఫలితం ఇదుగో, లభించింది! నన్నొక హత్య కేసులో ఇరికించేశారు. ఈ బండి అతడిని గుద్దనేలేదు. గుద్ది వుంటే నెత్తురంతలాపారి, ముద్దగా అయి వుండదప్పుడే...ఎవరో పొడిచి పారేసి వెళ్ళిపోయారు. మీరు నన్ను కాస్తా అందులో ఇరికించారు. నన్నుమాత్రం ఏమిటి. మీరూ ఇరుక్కున్నారు!"

సూర్యా "మీరు చెప్పిందే నిజమయితే మనం ఎందుకు భయపడాలి? ఈ హత్య మనమీద మోపలేరుకదా?" అన్నాడు.

"అదొకటే తక్కువ! హత్యా నేరంలో సాక్షులుగా నిలబడడం చాలదా? పత్రికలనిండా మన పేర్లు రావడం చాలదా! అని అడిగాడు రాఘవన్.

"సరేసరే, ఇప్పుడేమి చేయాలో దాన్నిగురించి ఆలోచించండి!" అంది తారిణి.

"మీరే చెప్పండి. నాకేమీ తోచడంలేదు." అన్నాడు రాఘవన్.

"తిన్నగా అస్పత్రికి వెళ్దాం. లేకపోతే పోలీసు స్టేషన్ కు వెళ్దాం." అన్నాడు సూర్యా. తారిణి అతడిని సమర్థించింది.

"ముందు ఎక్కడికి వెళ్దాం? అన్నాడు రాఘవన్; వాళ్ళిద్దరూ ఏమీ జవాబు చెప్పలేకపోయారు.

"నాకు చేతులు వణుకుతున్నాయి. ఇక కారు నడిపితే ఏ చెట్టుకో గుద్దడం తథ్యం. తిన్నగా ఇంటికే వెళ్దాము. అక్కడినుండి ఫోన్ చేయవచ్చు." అన్నాడు రాఘవన్.

* * *

భయంతో ఆశ్చర్యంతో ఇదంతా విన్న సీత "అక్కా! ఇదేమి వైపరీత్యం! ఒకవేళ పోలీసులు ఈయనను అరెస్టు చేస్తారేమో?" అని వణికి పోతూ అడిగింది.

"భయపడకు సీతా! అటూ జరగదు, ఢిల్లీ పోలీసులంత తెలివి తక్కువగా ప్రవర్తించరు. పై పెచ్చు మీ ఆయన పెద్ద ఉద్యోగస్తుడు. నలుగురినీ తెలిసినవాడు...ఒకవేళ వారంటు లం ఇవ్వడానికి పోలీసుస్టేషన్ దాకా రమ్మనవచ్చు నంతే—" అంది తారిణి.

కాస్త మనసు కుదుటబడింది సీతకు. మనసు ఇతర విషయాలమీదకు మళ్లింది. ఆదే సమయాన దొడ్లో, సామాన్ల గదిలో తారిణి తల్లి వుంది— అన్న విషయం గుర్తుకి వచ్చింది. కాని తాను అందుగురించి నోరు మెదపడానికి వీలులేదే! ఆ రజియా బేగం కిచ్చినమాట జవదాటడానికి వీలులేదే!

రజియాబేగం రక్తసిక్తమైన కత్తిని కుళాయి క్రింద కడగడం గుర్తుకు వచ్చింది. ఆమెకూ, ఇప్పుడు తారిణి చెప్పిన సంఘటనకూ ఏదన్నా సంబంధం వుందా? ఎందుకుండకూడదు? వున్నట్లయితే, తాను ఆశ్రయం ఇచ్చింది ఒక హంతకురాలికా? ఈ విషయం తన భర్తకు తెలిస్తే ఆయన ఏం చేస్తారు?

"అక్కా! మీరు ముగ్గురూ ఎట్లా కలిశారు?"

"నూర్యా గదికి నేను వెళ్లాను. అక్కడికే మీ ఆయనా వచ్చారు. అందరం కలిసి నిన్ను చూద్దామని బయలుదేరాం. దారిలో ఇట్లా అయింది." అంది తారిణి.

"నూర్యాని చూడడానికి వెళ్లావా? నన్ను చూడడానికి ఒక్కసారయినా రాలేదే? నన్ను మరిచేపోయావా?

"మరవలేదు సీతా! వద్దామనే అనుకున్నాను. కాని మీ ఆయన ఏమనుకుంటాడో అని భయపడ్డాను. నూర్యాకూ అదే సందేహం."

ఇది విని సీతకు ఒళ్లు మండింది. ఇప్పుడు వీళ్లిద్దరూ ఒకటయ్యారన్న మాట. నేనే ఒంటరినయ్యాను. అయినా సూర్యాకు నాకన్న ఎక్కువగ ఈమెతో స్నేహం ఏమిటి?—ఇట్లా అనుకుని సీత—"ఈయనంటే భయం ఎందుకు? మిమ్మల్ని కొరికితినేస్తారనా? ఈయనకు మీ ధ్యాసేకదా? అయినా సూర్యా ఇంతటి మోసగాడని నేనెప్పుడూ అనుకోలేదు" అంది.

తను ఒక క్షణం చూచి పలికింది తారిణి—"ఎందుకు అట్లా అంటావు? సూర్యావంటి నిష్కల్మషమైన వ్యక్తిని నేనెక్కడా చూడలేదు" అంది.

"ఔను. సూర్యా కల్మషం లేని మనిషేగాని కొన్ని రోజులనుండి యుక్తులు నేర్చుకున్నట్లున్నాడు. ఆగ్రానుండి వచ్చాక ఇవాళేనా మొదటి సారి నువ్వు సూర్యాని చూడడం?"

'లేదు సీతా! వెనక్కు రాగానే ఒకసారి చూశాను. నానుదుటి గాయం గురించి ఆయన బాధపడుతూ రాసిన వుత్తరానికి సమాధానం చెబుదామని వెళ్ళాను."

'నేనట్లాగే ఊహించాను." అంది సీత.

తారిణి ఏదో అందామనుకుంటుండగా వీధిలో 'దడదడ' మని చప్పుడయింది. పోలీసులు వచ్చినట్లున్నారు." అంది తారిణి.

పోలీసులు వచ్చాక కొంతసేపు వీధిలోనే మాట్లాడారు—కాస్సేపు తర్వాత రాఘవనూ, ఒక పోలీసు అధికారీ లోపలికి వచ్చారు.

రాఘవన్ తారిణిని చూపించి "ఈవిడే!" నన్నాడు.

"ముఖం చూస్తేనే చాల భయపడ్డట్లు తెలుస్తూంది. భయానికి కారణం లేకపోలే దనుకోండి—" అన్నాడు ఆ అధికారి.

" ఈమె కోసమే నేను తిన్నగా పోలీసు స్టేషన్‌కు రాలేకపోయాను.

"ఎటాగయినా ఇందులోకి ఈమె పేరు రాకుండా చూడండి." అన్నాడు రాఘవన్.

"నాచేత వయినంత వరకు ప్రయత్నిస్తాను. వీరి చిరునామా వుంది కదా, ఒకవేళ సాక్ష్యం నిమిత్తం అవసరం వుంటే...?"

"...అవసరం వుంటే నేనే పిలుచుకుని వస్తాను. కాని ఆ ప్రసక్తి కూడా లేకుండా వుంటే బాగుండును."

"చూద్దాం లెండి!...నువ్వేమీ భయపడకమ్మా! ఇట్లాంటి పనుల్లోకి స్త్రీలు తలదూర్చరాదు. ఇది నీకొక పాపంగా వుంటుందని ఆశిస్తున్నాను. ఈ సంఘటన గురించి ఎవరితోనూ మాట్లాడకు! నీకు తెలిసినట్లు ఎవరికీ తెలియకుండా వుంటే మంచిది!" తారిణితో ఈ మాటలు అని పోలీసు అధికారి రాఘవన్‌నుచూచి—"మనం వెళదాం పదండి! ఇప్పటికే ఆలస్యం అయిపట్లుంది." అన్నాడు.

"సీతా! నేను వెళ్ళొస్తాను. తారిణి ఇవాళ ఇక్కడే వుంటుంది." అన్నాడు రాఘవన్.

కొద్ది నిముషాలకెల్లా వీధిలో కారూ, మోటార్ సైకిలూ బయలుదేరిన చప్పుడు వినిపించింది. సీత నీధి తలుపు గడియపెట్టి వచ్చింది. "ఇకముందు నేనీ కారెక్కను బాబూ! నా బిడ్డనూ ఎక్కనివ్వను...ఈ కారునమ్మేసి వేరేకారు కొనాల్సిందే—" అంది సీత. "అవును! ఈ కారులో నన్నెక్కడ పడున్నా ఎక్కను. నువ్వింత ధైర్యంగా వుండడమే నాకు ఆశ్చర్యంగా వుంది." అంది తారిణి.

"మా అత్తగారిప్పుడిక్కడ వుంటే రభసగా అయి వుండేది. అదృష్టం బాగుండి వాసంతీ నిద్రపోయింది."

"సీతా! మీ అమ్మాయిని చూడాలని వుంది...కాని ముందు స్నానం చేయాలి." అంది తారిణి. "కుళాయి నీళ్ళలో స్నానం చేస్తే చాలదు. యమునలో వెళ్ళి చేసి రావాలి."

"ప్రస్తుతానికి కళాయిలన్నీ స్నానం ముగించు. యమునలో స్నానం తర్వాత చేద్దువుగాని..." అని సీత తారిణిని ఇంటి ముందు పైవున్న స్నానాల గదికి తీసుకు వెళ్ళింది. వెనక పైకి వెళ్ళడానికే భయం వేసింది.

రాఘవనూ, సూర్యా వెనక్కు వచ్చే సరికి సీత, తారిణీ వంటగదిలో రొట్టెలు చేస్తున్నారు. అదిచూచి వారికి సంతోషం కలిగింది. 'ఆకలి లేదు' అని మొదట అన్నారు; ఆతర్వాత 'అయ్యోపాపం! మీరింత కష్టపడి తయారుచేసినందుకయినా కొంత తింటాములే" అన్నారు.

సూర్యా స్నానానికని దొడ్డిపైకి స్నానాలగదికి వెళ్ళి స్నానంచేసి వచ్చాడు వస్తూ—"సీతా! స్నానాలగది ఎదుట గదికి తాళం వేసివుందే, అందులోంచి ఏదో చప్పుడవుతుందేమిటి?" అని అడిగాడు.

సీత మొహం ప్రక్కకు తిప్పుకుని 'పాడు పందికుక్కలు!" అంది.

"తారిణీ! మీరు స్నానాల గదిలో మీ రుమాలు పడేసి వచ్చినట్లున్నారే...దాన్నిండా రక్తమే! నేను దానిని శుభ్రంగా వుతికి ఆరవేసి వచ్చాను" అన్నాడు సూర్యా.

"నేను పడేయలేదే!" అని తారిణి సీత మొహం చూడగా, సీత ఆమె మొహం చూచింది.

మాట మార్చడానికని సీత—"ముందు ఈ కారునమ్మేయాలి. తెలుసా! నేను ఇకముందు దీనిలో ఎక్కను." అంది.

"నేనూ అదే అనుకున్నాను. రేపు మొదటిపని; ఈ కారును అమ్మి వేయడం; రెండవది, రివాల్వర్ లైసెన్స్ పుచ్చుకోవడం ... రోజులు బాగుండడం లేదు...వీధిలో వెళ్తున్న వారిని పొడిచి చంపడమా!" అన్నాడు రాఘవన్.

తర్వాత అందరూ కలిసి భోజనానికి కూర్చున్నారు.

"సీతా! మీ బావ వున్నాడే అతగాడు చాల ధైర్యవంతుడు! కారులో వున్నంతసేపూ చేతులూ కాళ్ళూ వణికాయి. క్రిందకు దిగినప్పటినుంచి మాటలు మాత్రం బ్రహ్మాండంగా వస్తున్నాయి." అన్నాడు రాఘవన్.

"ఈ మాటలు చాలుగాని వేరే ఏదయినా మాట్లాడండి." అంది సీత.

"నువ్వే చెప్పు వేరే ఏదయినా కబురు." అన్నాడు రాఘవన్.

"వీళ్ళిద్దరూ ఇన్ని రోజులనుండి మనింటి వైపు తొంగికూడా చూడలేదేమని అడగండి!"

"తమించు సీతా! పనిమీద వుండి రాలేక పోయాను. ఇకమీద తరచు వస్తుంటాను—రాఘవన్ గారికి అభ్యంతరం లేకపోతే..."

"నువ్వు వస్తే నాకు అభ్యంతరం ఎందుకు? ఈ కుంటిసాకులు ఎందుకు చెప్పు—"

"బాగా అన్నారు...సూర్యా నువ్వు వస్తే ఆయనకెందుకు అభ్యంతరం? పనట పని! ఈ అక్కను వెళ్ళి చూడడానికి మాత్రం తీరిందేం?" అని అడిగింది సీత.

"అదికాదు సీతా! మే ముద్దరమూ ఒకే పార్టీకి చెందిన వాళ్ళం. ఆ పనిమీదనే తరచు కలుసుకోవలసి వస్తూంది."

"ఏం పార్టీలో ఏమిటో! అవన్నీ నాకు అనవసరం. ఇకనుంచయినా మీరిద్దరూ తరచుగా ఇక్కడికి వస్తుండాలి."

భోజనాలు అయ్యాయి. అందరూ ముందు గదిలోకి వచ్చేసరికి టెలిఫోన్ మోగడం మొదలు పెట్టింది. రాఘవన్ ఫోన్ నందుకున్నాడు.

"ఓహో! ప్రాణం పోయిందా? ... అయ్యో...'కత్తిపోటు వలన మరణం' అని డాక్టర్ సర్టిఫికేట్ నిచ్చారా? ఐసీ...ఎవరు? వినాయకరావ్ మదోంకరా? ఫరవాలేదు, ప్రపంచానికేం తీరనిలోటు కాదు...ఏమంటారు? అయినా హత్య హత్యే...ఎవరయి వుంటారు?...మీ ఊహ ఏమిటో?... రజనీపూర్ పిచ్చిది...వినలేదే...సరే లెండి...నేను చూచుకుంటాను...చాల థాంక్స్!"

టెలిఫోన్ రిసివర్ని రాఘవన్ క్రింద వుంచగానే ముగ్గురూ ఏమిటేమిటని చుట్టు మూగారు.

"ఆస్పత్రిలో మేము వదలి వచ్చిన అరఘంటకు ప్రాణం పోయిందట. కత్తి పోటువల మరణించాడని డాక్టర్ సర్టిపికేటిచ్చారట. హత్యచేయ

ఖడిన వాడిపేరు వినాయకరావ్ మదోంకర్; పాత రజనీపూర్ రాజుగారి చెడ్డ మంత్రి అని చెప్పాగా అతడేనట. కొన్ని రోజులనుండి ఈ వూరిలో వుంటున్నాడట. ఏదో క్లబ్బులో మెంబరట. అక్కడ తాగి తందనాలాడే వాడట. రజనీపూర్ పిచ్చిది అనబడే స్త్రీ కొన్ని రోజులనుండి అతడి వెన్నెంటనే అనుసరిస్తున్నదట. ఈ విషయమై మదోంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడట. నిజానికి ఆమె రాజావారినే హత్యచేయ యత్నించిన మనిషేనట.. ఇతడిని చంపిందీ ఆమెనని పోలీసువారి ఊహ...వివరాలు చాలునా?''... ఏమిటి అందరూ మౌనంగా వున్నారు? సీతా! నీకు అపరాధ పరిశోధక కథలంటే ఇష్టంకదా...?',

'రజనిపూర్ పిచ్చిది' అనగానే సీత, తారిణి ఒకరి నొకరు చూచుకున్నారు. భయము బాధ కలిసివున్నాయి ఆచూపుల్లో. సీతను రాఘవన్ ప్రత్యేకించి సంబోధించడంలో ఆమె-''ఇట్లాంటివి కథలరూపంలో వుంటే బాగుంటాయి; వాస్తవంగా జరగకూడదు.'' అంది.

''ఆ రజనీపూర్ పిచ్చిదానిలాటి వాళ్ళు ఇంకొందరు బయలుదేరితే బాగుండును...మన రాజులకూ, వాళ్ళ దుష్ట మంత్రులకూ బుద్ధి వస్తుంది!'' అన్నాడు సూర్యా.

సీత మనసంతా దొడ్డివైపు తాళం వేసిన గదివైపే వుంది. 'రజనీపూర్ పిచ్చిది' అన్నమనిషి ఆక్షణాన ఆ ఇంట్లోనే వుంది. తానా విషయం ఎవరికయినా చెప్పాలా? చెబుతే ఏమి వైపరీత్యం జరుగుతుందో? ఆమెను కలుసుకుని తన తల్లి దండ్రులు ఎవరో తెలుసుకోవాలని తారిణి అనుకుంది కదా? అందుకు మళ్ళీ వీలు కలుగుతుందా?

ఆ పిచ్చిదానికి తన తల్లిమీద తనమీద అంత ఆదరం ఎందుకు? తనకని రత్నహారం, డబ్బు ఎందుకిచ్చింది? దీనికి కారణం తెలుసుకోవాలి అన్న కాంక్ష అన్నిటికన్నా బలంగా తలెత్తింది...

...రాత్రి గడియారం రెండు కొట్టగానే సీతకు మెలకువ వచ్చింది. అయ్యో భగవాన్! నిద్రపోయినట్లున్నానే...గంట రెండేనా? గడియారం

చూచింది. అవును రెండే! ఇప్పుడ్చు ఆగదికి వెళ్ళవచ్చు. కాని చాల నిశ్శబ్దంగా వెళ్ళాలి. పక్కగదిలో మగవాళ్ళు, ఇక్కడ తారిణీ నిద్రపోతున్నారు.

అదేమి శబ్దం? తలుపు తెరుచుకుంటున్న శబ్దంలావుందే? ఆవేళప్పుడు ఏ తలుపు ఎవరు తెరుస్తున్నారు? ఒకవేళ...లేదు, లేదు...పక్కింటి తలుపయి వుంటుంది. అయినా కాసేపు తర్వాత లేచి వెళ్ళవచ్చు. మళ్లీ నిద్రపోకూడదు...

ప్రక్క గదిలో చప్పుడేలేదు. బాగా నిద్రపోతున్నారు. తారిణీ కూడా నిద్రపోతూంది. ఇదే సమయం—రజియా బేగంను చూడడానికి. ఆమెను హెచ్చరించాలి. తెల్లవాలేసరికి ఇక్కడ వుండకూడదామె.

తలగడ క్రిందనుంచి తాళాన్ని తీసుకుంది సీత. కొద్దిగానయినా శబ్దం చేయకుండా పడకమీదనుండి లేచింది. అడుగుమీద అడుగువేసుకుంటూ అతి పెమ్మదిగా నడిచివెళ్ళింది...చివరకు ఆసామాన్ల గది చేరింది. చీకట్లో తడివిచూచి తాళంకప్పును పట్టుకుంది. తాళాన్ని ఆందులో దూర్చి యత్నించింది. కాని తాళం వెళ్ళలేదు...ఇదెక్కడి బాధ...దీపం వెల్గించకుండా వీలుకాదు కాబోలు...వేస్తే ఏమి? చేతిలో వెతికి స్విచ్చిని నొక్కింది...

తాళం తెరవబడింది...! తలుపులు తెరవబడినాయి!...సీత మెల్లగా లోపలికి ఒక్కడుగువేసి తొంగిచూచింది. ఇదేవిటి?...గదిలో ఎవ్వరూ లేరే!

ఇంకొక్కపాదమూ లోపలికి మోపి నాలుగు వేపుల తేరిపారచూచింది. గదిఖాళీగా వుంది. ఆరాత్రి మొదట జరిగినదంతా నిజమా కలా? ఆస్త్రీ గదిలోకి వెళ్ళింది, బయట తాళం వేసుకోమన్నది—అన్నీ మాయనా? భ్రాంతియా?

అప్పుడా గది వెనక తలుపులు తెరిచి వుండడం కన్పడింది సీతకు. సీత కిప్పుడర్థమైంది. ఆ తలుపులు తెరుచుకుని అమె వెళ్ళి వుండాలి. పోలీసు వాళ్ళ రాక హడావిడిని ఆమె వినివుంటుంది. కాస్త సందడి తగ్గగానే వెళ్లిపోయి వుండాలి! తాను తెలుసుకోదలచిన తెలుసుకోవడానికి వీలులేక

పోయింది. పోతే పోనీలే ఏ గొడవా లేకుండా ఆమె ఇక్కడనుండి క్షేమంగా వెళ్ళింది, అదేచాలు!

ఇట్లా అనుకుంటూ సీత గది బయటికి వచ్చి తాళం వేయడానికి యత్నించింది. తటాలున తన్ను రెండు కళ్లు చూస్తున్నాయి అన్నభ్రమ ఏర్పడింది. దిగ్భ్రమతో పెనకకు తిరిగి చూచింది.

తారిణి దొడ్డి గుమ్మం దగ్గర నిల్చుంది.

సీత అట్లాగే వెర్రిదానిలా తారిణి చూస్తూ నిల్చుంది. చేతిలో వున్న తాళంతో తాళంకూడా వేయలేక పోయింది. అదిచూచి చిరునవ్వుతో ఆమెను సమీపించింది తారిణి. "సీతా! భయం ఎందుకు? నువ్వెవరిని చూడడానికి వచ్చావో ఆమెను చూడడానికే నేనూ వచ్చాను. ఆమెపట్ల నీ కన్న నాకు ఎక్కువ శ్రద్ధ వుండడం సహజమే కదా?" అంది.

ఆశ్చర్యంతో విప్పారిన కళ్ళతో "ని కెట్లా తెలుసు?" అని అడిగింది సీత.

"ఊహించే తెలుసుకున్నాను. సీతా! నీ మాటలు, చేతలు, ప్రవర్తనాలో సందేహాన్ని రేకెత్తించాయి..స్నానాల గదిలోనా చేతి రుమాలు పడి వుందని సూర్యా చెప్పగానే నా అనుమానం దృఢమయింది.

"నేను లేచిరావడం నీకు తెలుసా? నువ్వు నిద్రపోలేదా?"

"నాకు నిద్ర ఎట్లా వస్తుంది? ఇంత భయంకరమైన సంఘటనలు జరిగాక నిద్ర ఎట్లా వస్తుంది? గడియారం రెండు కొట్టి నిన్ను లేపడానికి ముందుగా తోటగుండా ఎవరో వెళ్లడం చూచాను. సీతా! ఈ గదిలో వున్నది ఒక్కరా, ఇద్దరా?"

"ఒక్కరే! నువ్వు రజియాబేగం అని చెప్పావే ఆమే ఇక్కడ వుంది. ఒకరా ఇద్దరా అని ఎందు కడిగావు?"

"ఇద్దరు వెళ్లడం నేను చూచాను సీతా! అయితే ఇంకెవరో వచ్చి రజియాబేగాన్ని పిలుచుకుని వెళ్లి వుండాలి."

"ఆస్త్రీ నిజంగా మీ అమ్మేనా ?... నేను నమ్మలేకుండా వున్నాను. అయినా మనం ఇక్కడ నిల్చుని మాట్లాడుకోవడం ఎందుకు? వాసంతి లేచి విడుస్తుందేమో—? మగవాళ్లు లేస్తే మనకేదో అయించని భయపడగలరు. లోపలికి వెళ్ళి పడుకునే మాట్లాడుకుందాం. ఇంక నాకు నిద్రరాదు. నీ గురించిన వివరాలన్నీ చెప్పు, వింటాను" అంది సీత.

ఇద్దరూ తమతమ పడకలమీద కూర్చున్నారు. ఆరాత్రి మొదట జరిగిన దంతా సీత తారిణికి చెప్పింది.

"ఆమె నిజంగా ముస్లిమ్ స్త్రీయేనా? ఆమె పేర రజియాబేగమేనా?" అని సీత అడిగింది.

"కాదు ఆ విషయం తర్వాత చెబుతాను. నాకు బుద్ధి తెలిసినప్పటినుండి ఆమెవే తల్లిగా ప్రేమించాను. ఏ తల్లీకూడా ఆమె నన్ను పెంచినంత వాత్సల్యంతో ప్రేమతో, తనబిడ్డను పెంచివుండదు. ఆయితే మా అమ్మ ప్రపంచంలో అందరి స్త్రీలవలె భర్తతో కాపురం చేయకుండా, దేనికో భయపడుతున్నట్లు దాగుకుంటూ తిరుగుతుండేది. అప్పుడప్పుడు ఆమెను చూడడానికొక ఆయన వచ్చేవాడు. ఆయనను నేను 'నాన్న' అని పిలిచేదానిని. ఈ అలవాటు నా అంతట నాకే వచ్చిందా, ఎవరన్నా నేర్పించారా అన్నది నాకు తెలియదు. ఆయన అమ్మ కొన్నిసార్లు అతి ప్రేమగా వుండేవారు; మరి కొన్ని సార్లయితే అతిఘోరంగా పోటాడుకునేవారు. వాళ్ళ లోకంలో అందరివలె పెళ్ళాడిన భార్యాభర్తలు కారని నాకు తెలిసింది. అయినా ఆయనే మానాన్న అని నమ్మాను. వాళ్ళిద్దరూ నా విషయంలో మట్టుకు అతి సఖ్యతగా వుండేవాళ్ళు. నాకేది కావాలని అడిగితే అది తెచ్చిచ్చేవారు. నాకు కొద్దిగా ఒళ్ళు బాగా లేకపోతే ఇద్దరూ నాకోసం ప్రాణాలర్పించడానికయినా సిద్ధంగా వుండేవారు. నా పెంపకానికి, నా చదువుకు ఏమాత్రం వెనుకాడక డబ్బు ఖర్చు చేశారు. వాళ్ళేమీ ధనవంతులుకారు. నా చిన్నతనంలో మీ అమ్మవద్ద విలువైన నగలు ఎన్నో వుండేవి. వాటిలో ఒక్కొక్కటి దానినే తీసిచ్చి మా నాన్నగారిని వెళ్ళి అమ్మి డబ్బు తెమ్మని చెప్పి

పంపుతుండేది. కొన్ని సమయాలలో నాన్నే డబ్బు తెచ్చేవారు. తీసుకోను—అని పోట్లాడేది అమ్మ. ఎందుకంటే నాన్న సంపాదన ఎక్కువలేదని ఆయన కాపాడవలసిన కుటుంబం ఇంకొకటి వుంది అని అమ్మకు తెలుసు... కాన్వెంటు బడిలో నిరుపమ అనే అమ్మాయితో నాకు స్నేహం కుదిరింది. నేను నా జననం గురించి, పెంపకం గురించి దిగులుగా వున్న రోజులలో ఆమె స్నేహమే నాకు ఊరటను కల్గించేది...మా ఇద్దరిదీ ఒకటే వయసు... పెద్దవాళ్ళు అవుతున్న కొద్దీ భవిష్యత్ గురించి ఆలోచించే వాళ్ళం... ఇద్దరమూ పెళ్ళీ చేసుకోకూడదనీ, దేశసేవ చేయాలనీ నిర్ణయించు కున్నాము. కాని నిరుపమ తన నిర్ణయం మార్చుకుంది. నువ్వామెను చూశావుకదా, అంత అందకత్తెకాదు. అది తెలిసే ఆమె పెళ్లి వద్దనుకుంది. కాని ఆమె ఆత్మ సౌందర్యాన్ని అర్థం చేసుకోగల వ్యక్తి లభించాడు. అతడిని పెళ్లాడి ఇప్పుడు సుఖంగా వుంది. అదృష్ట వంతురాలు!" తారిణి కళ్లల్లో నీరు చూచి జాలి కలిగింది సీతకు.

"అక్కా! నిరుపమలాగా నువ్వూ ఒకరోజు హాయిగా ఒక ఇంటి దానివయి వుంటావు." అంది సీత.

"ఆమెకు నాకు ఒక తేడావుంది. సీతా! నా పుట్టుకే నాకు మచ్చ. తల్లి దండ్రు లెవరో తెలియని నాలాటి దానిని పెళ్ళాడగల పురుషుడీదేశం లోవున్నాడా ! ఒకవేళ వుండి అతడొప్పుకున్నా అతడి బంధువులు ఒప్పుకోవద్దా? మనదేశంలో పెళ్ళిళ్ళకు బంధువుల అరిణీకారం ప్రధానంకదా? పోనీతే నాకు పెళ్ళిపట్ల ఆంత మొజులేదు. నిజంగా దేశసేవ చేయాలనేవుంది. బొంబాయిలో ఉప్పు సత్యాగ్రహం జరిగినప్పుడు నేను నిరుపమ అందులో పాల్గొన్నాము. చిన్న వయస్సు కారణంగా మమ్మల్ని ఖైదు చెయ్యలేదు. చాలా సార్లు పూరి బయటకు తీసుకొనివళ్ళి వదలి పెట్టేవారు. నేనూ నిరుపమా కలిసి వున్నందున సరదాగా వుండేది. ఆ ఉద్యమం ముగియగానే కరాచీ కాంగ్రెసుకు వెళ్ళాము..."

ఈచోట తారిణి కొంతసేపు మౌనంగా వుంది, పెద్దగా ఒకసారి నిట్టూర్చి ఆపైన చెప్పింది; "ఆ తరువాత ఈ పుణ్య భారతభూమిని తిరిగి

చూద్దామనిపించింది. కాశ్మీరునుండి కన్యాకుమారివరకు, కరాచినుండి కల కత్తావరకూ ఆన్ని వూర్లు తిరిగి చూచాము. ఈలోగా :బీహారులో భయంకర మైన భూకంపం ఏర్పడి దేశమంతటిని కదిలించి వేసింది. భూకంప బాధితులకు సేవ చెయ్యడానికని బొంబాయినుండి బయలుదేరిన సేవాదళంలో వేనూ నిరుపమా చేరాము. అప్పుడు మా ఇరువురి జీవితాలలోను ముఖ్యమైన ఘటనలు జరిగాయి. నిరుపమ వేణీ ప్రసాదును కలుసుకుంది. కొంత కాలా నికి అతడిని భర్తగా స్వీకరించింది!" అని చెప్పి తారిణి ఆగిలది.

"అక్కా! ఆపైన చెప్పండి. ముఖ్యమైన ఘట్టంలో ఆపివేశారేం? మీ జీవితంలో ఏమి జరిగింది?" అని సీత ఆతురతతో అడిగింది.

'నిరుపమకు పెళ్ళి జరిగింది? నాకు మరణం కలిగింది! ఏదో వాగు తున్నానని అనుకోవద్దు. సీతా! నాకు తెలిసిన వారందరికి నేను మరణించిన దానినే అయ్యాను. ఆ విధంగా అందరూ నన్ను పూర్తిగా మరచి పోవాలని ఆశించాను. కనుకనే నేను చనిపోయినట్లు నాతోబాటున్న ఇతర సేవకులు నమ్మేటట్లుచేసి నేను ఆక్కడినుండి బయలుదేరాను. ఇందుకు కారణం నువ్వు పత్రికలలో ఏ వార్తను చదివి మా అమ్మను సందేహించావో. ఆవార్తయే! నా తల్లికి హత్యా నేరానికని కారాగార శిక్ష విధించారన్నవార్త నా మన స్సును అంతగా గాయపరిచింది. ఈ ప్రపంచంలో నేను సంపూర్ణంగా ప్రేమిం చనవ్యక్తి నాతల్లి ఒక్కతే. మా నాన్నగారని అనుకున్న ఆ వ్యక్తినికూడా నేను అంతగా ప్రేమించలేదు. కానీ నాతల్లిని నా ప్రాణంగా భావించాను. అమె ప్రవర్తన గురించి ఎటువంటి సంశయాలు పొడ నూపినా వీటన్నిటికన్న ఆమె మీది ప్రేమ బలంగా వుండేది. కొన్నేళ్ళుగా మాటి మాటికి ఆమెకు దూరమై తిరుగుతున్నప్పటికి ఆమెపట్ల వాత్సల్యం ఆవంతయినా తగ్గలేదు. ఆమెకు ఈ అపకీర్తి—ఈ కష్టమూ రావడం నేను సహించలేక పొయ్యాను. ఒక మహారాజును ఆమె చంపబూనడం గురించి ఆలోచించినకొద్దీ అర్థపర్థంలేని సందేహాలెన్నో వుదయించాయి. సరిగ్గా ఇటువంటి పరిస్థితిలో ఒకనాడు ఢిల్లీలో మా నాన్నను కలిశాను. నా మనస్సును బయటపరచాలని ఆయన

కొన్ని విషయాలను చెప్పారు. వాటిలో ఒకటి ఏమిటో తెలుసా ? అంత వరకు నేను తల్లి అని భావించినది నిజంగా నా తల్లి కాదన్నదే ఆ వార్త. ఇది నా మనస్సును ఉపశమింప చెయ్యడానికి బదలుగా మరింత గాయపరిచింది. నా జీవితపు చీకటి నడుమ వెలుగుతుండిన ఆ ఒక్క దీపమూ ఇప్పుడారిపోయింది. ఆమె నా తల్లి కాకపోతే ఈయన నాతండ్రికాదు. మరయితే నే నెవరి బిడ్డను ? సీతా ! నా పెంపుడు తల్లి అప్పుడప్పుడు కోపంతో మాట్లాడుతూ వచ్చిన కొన్ని సంగతులకు అర్థం ఇప్పుడు తెలియ సాగింది. అందుమూలంగా ఎవరో ఒక స్వదేశ సంస్థానపు రాజుకూతురిని నేను, అన్న సందేహం కలిగింది. నా పెంపుడు తల్లి తరచుగా ఇట్లి మారినదీ, రమామణి అన్న తనపేరుకు బదలుగా రజియాబేగం అన్న మారుపేరు పెట్టుకున్నదీ,— వీటన్నిటికీ కారణం లీలగా గోచరించింది. ఈ ఆలోచనల ఫలితంగా నేను పడ్డ వేదనను నా పెంపుడు తండ్రి గ్రహించనేలేదు. ఆయనకు వేరే ఒక ముఖ్యమైన పని వుండింది. నాకు ధైర్యం చెప్పి తన్ను మళ్లీ కలుసుకోవడానికి చోటూ, తేదీ చెప్పివేసి ఆయన వెళ్లిపోయ్యారు. అయినా నేను ఆయనను కలువలేదు. కలవడానికి ఇష్టమూ లేదు.''

కాసేపు ఆగదిలో నిశ్శబ్దం ఆవహించింది. తరువాత సీత ''రజియాబేగం నిజంగా పిచ్చిదని అనుకుంటున్నావా ?' అని అడిగింది. ''నా కెట్లా తెలుసు, సీతా! నేను ఆమెను చూసి నాలుగేళ్ళయింది. ఆమె మనస్సులో తీవ్రమైన ద్వేషభావము తిష్టవేసుకున్నదని మాత్రం నేను ఎరుగుదును. ద్వేషం మొదిరితే దెయ్యం పట్టినట్లే...ఆతరువాత పిచ్చెగదా! నిజంగా పిచ్చిదయి వుంటే ఒకందుకు మంచిదే. పోలీసువారి చేత చిక్కినా, ఇవ్వాళ్టి సంఘటనకు ఆమెకు వురిశిక్ష విధించరు; పిచ్చాసుపత్రికి పంపుతారు.

కొంతసేపుండి సీత 'ఇంకా ఒక్క ప్రశ్న, నేను ధరించిన రత్నహారం గురించి అడిగావే, అది రజియాబేగం నాకు ఇచ్చి వుంటుందనీ అడిగావా?'' అని అడిగింది.

"అవును, అది ధృడపరచుకోడానికే నిన్నడిగేను. నా పెంపుడం తల్లీ నగలన్నీ అమ్మివేశాక మిగిలినది అది ఒక్కటే."

"ఆ రత్నహారాన్నీ, కొండుపేల పూపాకులనూ, నాకామె ఎందుక యిచ్చింది?"

'నన్నెందుకు అడుగుతావు సీతా? నానోటితో చెప్పించాలనా? నువ్వే ఊహించి తెలుసుకోలేవా?" అంది తారిణి.

సీతమనసు ఊహించి తెలుసుకునే వుంది. అదిప్పుడు బుజువయింది. తారిణి ఊహ వచ్చినప్పటినుండి 'నాన్న' అనుకున్నది. తన తండ్రినే! తన చిన్నతనంనుండి తమ ఇంట్లో దారిద్రం తాండవించడానికీ, అమ్మ ఎప్పుడూ దుఃఖంతోనే వుండడానికీ అదే కారణం. వాటంతటికీ ప్రాయశ్చిత్తంలాగా ఆ స్త్రీ రహస్యంగా వచ్చి రత్నహారాన్ని ఇచ్చి వెళ్ళి వుండాలి.

ఈ విధంగా అనుకున్న సీత..." ఏది ఏమయినా నువ్వు నాతో బుట్టువుగానే వుండాలి! అంది.

గడియారం నాలుగు కొట్టింది.

22

ఉన్నట్లుండి ఒకనాడు భామ, భామ సీత ఇంటికి వచ్చారు. వాళ్ళ రాకతో, మాటలతో నవ్వులతో ఇల్లు గలగలమని వుంది.

యోగక్షేమాలయ్యాక, వాసంతిని ముద్దులాడాక? "మిస్టర్ రాఘవన్ ఏరీ? ఆయన్ను 'కంగ్రాచ్యులేట్' చేయాలనే ముఖ్యంగా వచ్చాము." అంది భామ.

''ఇవాళ మా అత్తగారు వస్తున్నారు. ఆమెను తీసుకు రావడానికని స్టేషనుకు వెళ్ళారు.'' అంది సీత.

''అయ్యబాబోయ్, అత్తగారొస్తున్నారా? నాకు భయం వేస్తూంది.'' అంది భామ.

''నీకు తెలుసా సీతా: పెళ్ళి చేసుకుంటే అత్తగారొస్తుందన్న భయం కొద్దీ మేమిద్దరం పెళ్ళి మానేశాము.'' అని థాము నవ్వింది; భామకూడ నవ్వింది.

సీతకూడ నవ్వింది, ''వీరిని 'కంగ్రాచ్యులేట్' చేయాలన్నారె ఎందుకు?'' అని ఆడిగింది.

''రాఘవన్ ఇంగ్లండ్ వెళ్ళి వచ్చారు కనుకనే అంత ధైర్యం వచ్చింది. మనవాళ్ళయితే 'మనకెందుకీ తంటా?' అని ప్రక్కకు తొలగి పోయేవాళ్లు. రాఘవన్ దారిలో పొడిచి పారవేయబడిన వాడిని ఆస్పత్రిలో చేర్చారు; పోలీసులకూ తెలిపారు. ఈ విధంతో బాధ్యతతో ప్రవర్తించి నందుకు మీ ఆయన్ను మానాన్న ఎంతో మెచ్చుకున్నారు. సీతా! ఆమాట చెప్పి పోదామనే వచ్చాము.'' అంది భామ.

ఆ రాత్రి నిజంగా జరిగిందేవిటో సీతకు బాగా గుర్తొచ్చింది. ఇంగ్లండు వెళ్ళివచ్చిన తిన భర్త ''మనకెందుకు ఈ తంటా! ప్రక్కనుంచి బండిని నడిపించుకుని వెళదాం!'' అన్నారు. కాదు, బండిలో పడేసి తీసుకెళ్ళాలని సూర్యా, తారిణీ అన్నారు. 'మావల్లనే ఇందులో ఇరుక్కున్నాను' అని ఈయన ఆ తర్వాత రెండు సార్లన్నదీ సీతకు గుర్తువచ్చింది. అయినా సీత ఇప్పుడా విషయం ఏదీ చెప్పదలచుకో లేదు. భామ థాములు తన భర్త కిచ్చిన గౌర వాన్ని తాను కాదనలేక?

టెలిఫోన్ మ్రోగింది. సీత వెళ్ళి అందుకుంది. తానూ, తారిణీ వస్తున్నామని సూర్యా చెప్పాడు.

''చాల సంతోష. నిన్నుచూచి చాల రోజులయింది. తొందరగా రా.'' అంది సీత.

ఆ విషయం భా మ ధా మలతో చెబు తే వా ళ్లు—.'' మీ ఆయనను చూడ లేక పో యా ము. క నీసం తా రిణీ న యి నా చూ చిపో తా ము'' అని సం తో ష్ం చా రు.

''ఆ యన కూ డా అ ర ఘం ట లో వ చ్చే స్తా రు. ఆ యన ను కూ డా చూ చే ద్దు రు గా ని...'' అం ది సీ త.

సీ త కు సూ ర్యా ను చూ డా ల ని వుం ది; తా రిణి నీ చూ డా ల నే వుం ది. కా ని వా ళ్ళి ద్ద రూ క లి సి రా వ డం ఆ మె కు న చ్చ లే దు.

దీ ని గు రిం చి రా ఘ వ న్ చె ప్పి న వీ ఆ మె కు గు ర్తుం ది. ''సూ ర్యా తా రిణీ క లి సి ఊ రం తా తి రు గు తు న్నా ర ట. ఇ దే మీ బా గు లే దు. అ యి నా సూ ర్యా కి దే ం బు ద్ధి? వా డి అ మ్మా నా న్నా ని ం చే ఎం త బా ధ ప డ తా రు?'' అ ని చె ప్పా డు రా ఘ వ న్. అ ది అం త మం చి ప ని కా ద నే సీ త అ ను కుం ది, కా ని రా ఘ వ న్ దో ష మం తా సూ ర్యా మీ ద మో పి తే, సీ త త ప్పం తా తా రిణి దే అ ను కుం ది. 'సూ ర్యా గ్రా మం నుం డి వ చ్చి న వా డు, అ భం శు భం ఎ ర గ ని వా డు. అ ట్లా టి వా డి ని, ప్ర పం చా ను భ వం క ల తా రిణే పా డు చే స్తుం ది' అ ను కుం ది. ఒం ట రి గా సూ ర్యా వ చ్చి న పు డి త డి ని ''తా రిణి వ ల లో ప డే వు సు మా!'' అ ని హె చ్చ రి ద్దా మ ను కుం ది.

తా రిణి వి ష య మై సీ త మ న సు ద్వై ధీ భా వం లో ప డిం ది. ఎ దు ట వు న్న ప్పు డు తా రిణి మీ ద ఎం తో అ భి మా నం, ప్రే ము క లి గే ది. ఎ దు ట లే న ప్పు డు ఆ మె మీ ద అ కా ర ణం గా కో పం క లి గే ది. త మ ఇం టి క ష్టా ల కు, త న త ల్లి కో కా ని కి, ఆ మె అ కా ల మ ర ణా ని కీ తా రిణే కా ర ణం అ ని పిం చే ది. త న భ ర్త ను బా గా ఎ రి గి న దా ని లా వుం ది, ఆ య న తో సం కో చం లే కుం డా మె ల గు తుం ది. ఇ ప్పు డు సూ ర్యా ని పి చ్చి వా డి గా చే స్తుం ది. ఇ వ న్నీ భా ర త స్త్రీ చే య వ ల సి న ప ను లే నా—అ ని పిం చే ది.

ధా ను భా మ ల తో—''మీ రి ర వు రూ ఈ వూ ళ్లో నే వుం టే నా కెం తో సం తో షం గా వుం టుం ది. నా కు దూ సు పో వ డం క ష్టం గా వుం ది...అం ది సీ త.

"మేము త్వరలోనే ఈ పూరికి వచ్చినా రావచ్చు సీతా! నాన్నగారికి భారత ప్రభుత్వంలో పెద్ద వుద్యోగం వచ్చేటట్లుంది. నాన్నగారే తటపటాయిస్తున్నారు." అంది భామ.

"నీకు స్నేహితుల కేమి కొదవ? తారిణి వుందిగా!" అంది ధామ.

"తారిణీ స్నేహం వున్నా వూడినా ఒక్కటే! ఎంతసేపూ సోషలిజం, కాంగ్రెసు, విప్లవం అని చెబుతూ వుంటుంది. నాకవన్నీ గిట్టవు." అంది సీత.

"అదేవిటట్లా అంటున్నావు? నీకూ అట్లాటి విషయాలలో చాదస్తం వుందనే అనుకున్నానే?"

"అబ్బే లేదు! గాంధీజీ అంటే నాకు కొంత భక్తి భావం వుంది. ఆయనను ఎవరైనా విమర్శిస్తే సహించలేను. మీవారు విమర్శించినా ఆయనతో పోట్లాటు పెట్టుకుంటాను."

"గాంధీజీ మహాత్ముడే! కాని ఆయన ఆర్థిక విధానాలే చాలఘోరం. ఆయన విధానాలన్నీ అనుసరిస్తే దేశం రెండువేల ఏళ్ళు వెనక్కు వెళ్ళడం ఖాయం." అంది ధాను.

"రాను రాను గోజులు పాడయి పోతున్నాయి. ఇంగ్లండులో ఎద్దులోలేవాళ్ళను, పందులు మేపేవారిని ఇక్కడికి గవర్నర్లుగా వైస్రాయిలుగా పంపుతున్నారు." అని భామ అంటూండగా ధామ—"ఇంకా నయం! లేబర్ పార్టీ గవర్నమెంటు వస్తే రైల్వే పోర్టర్లనూ, పోస్టల్ ప్యూన్లనూ మనకు వైస్రాయిలుగా పంపుతారు. వాళ్లందరికీ మన రాజులూ, నవాబులూ సలాములు కొడుతుండాలి!" అంది.

అందుకు బదులుగా భామ అడిగింది. "ఇంగ్లాండు పోర్టర్లు ప్యూన్లు ఎందుకూ? మన కాంగ్రెసు వారూ, సోషలిస్టులూ చెప్పేటట్లు జరిగితే మన దేశపు పోర్టర్లూ, ప్యూనులూ గవర్నర్లయి కూర్చుంటారు. ఏది మేలంటావు?"

సీతకు రాజంపేట గ్రామమూ, తపాలాఫీసూ గుర్తుకు వచ్చాయి. తపాలా బంట్రోతు బాలకృష్ణన్ గవర్నర్ గా వస్తే ఎంత బాగుంటుందోనని

పించి నవ్వొచ్చింది. భారతదేశంలో ప్రభుత్వమూ, ఉద్యోగాలూ ఇప్పటి లాగే వుండడమే మంచిదనిపించింది.

సూర్యా తారిణీ వచ్చారు. ధామ, భామ 'హలో? మై డియర్!' అంటూ తారిణిని కౌగలించుకుని, చేతులు కలిపి స్వాగతం చెప్పారు. సీత సూర్యాని పక్కకు తీసుకు వెళ్ళి "బావా! నీకు తారిణితో ఎందుకింత స్నేహం? మీ అమ్మ నాన్నలకు తెలిస్తే ఏమనుకుంటారు? అనవసరంగా చెడ్డ పేరు తెచ్చుకోకు...నేను మంచి పిల్లనుచూచి త్వరలో నీకు పెళ్ళి చేయిస్తాను." అంది.

సూర్యా చిరునవ్వుతో 'పిల్ల నెక్కడ చూచావు? వారిద్దరిలో ఒకరా?" అని భామ ధామల వైపు చూశాడు.

"ఛీఛీ! వీళ్ళ నవవాగరికతకూ, మీ అమ్మ ఛాందసానికీ ఒక్క నిముషమయినా పడదు. వేరే మంచి సంబంధం చూశాము. నువ్వు మాత్రం తారిణి వలలో పడకు—" అంది సీత.

సీతా! ఇట్లా మాట్లాడడం ఎవరి దగ్గర నేర్చుకున్నావు? తారిణి గురించి అట్లాంటి అనుమానాలు పెట్టుకోకు. నేనిదివరకే చెప్పానుకదా' మేమిద్దరమూ సోషలిస్టు పార్టీకి చెందివవాళ్లం. అందుకని మాటమాటికి కలిసి మాట్లాడవలసి వస్తూంది. ఇద్దరమూ త్వరలోనే లాహోర్ వెళ్లాలనుకుంటు న్నాము." అన్నాడు. సూర్యా.

ధామ, భామలను సీత పరిచయం చేయగానే సూర్యా—"మేము వస్తుండగా పోర్టర్ల గురించి మాట్లాడుతున్నారే, ఏమిటది?" అన్నాడు సూర్యా.

సీత చెప్పింది విషయం.

"అట్లాటి రోజు తానే వస్తుంది. రైల్వే పోర్టర్ గవర్నరవుతాడు. కార్మిక వ్యవహారాల మంత్రి అవుతాడు. తపాలా బంట్రోతు ప్రధాన మంత్రి అవుతాడు. వీటన్నిటికీ సిద్ధంగా వుండండి. ఇంగ్లీషు చదివినవాళ్లు, పెద్ద కుటుంబాల వాళ్ళూ మాత్రమే పెద్ద వుద్యోగాలు చేస్తారని అనుకోకండి.

ఇవ్వాళ జర్మనీ పేరు చెబితే గజగజలాడేటట్లు చేసిన హిట్లర్ ఎవరు! గోడలకు సున్నం పూసినవాడు. రష్యా విషయమే..." అని సూర్యా మాట్లాడుతూనే వున్నాడు.

"అబ్బబ్బ! ఈయన నిప్పులు కక్కే సోషలిస్టులా వున్నాడే—" అంది భామ.

"అవును మా బావ తీవ్రవాదే! గ్రామంలోని పాలం వ్యవహారాలలో రైతుల పక్షం వహించి నాన్నతో అన్నయ్యతో పోట్లాడి వచ్చేశాడు. సభలలో చాల ఆవేశంతో మాట్లాడుతాడట, నేనెప్పుడూ వినలేదు." అంది సీత.

పెద్దవాళ్ల మాటలు ఏమీ అర్థం కాకపోయినా వింటున్న వాసంతి "నాన్నగారొచ్చారు! బొమ్మను తీసుకొచ్చారు—" అంటూ గెంతుతూ పరుగెత్తింది.

సీత—"వచ్చినట్లున్నారు. మీరు మాట్లాడుతూ వుండండి." అని చెప్పి వీధివైపు వెళ్ళింది. పాపాయి నెత్తుకుని గుమ్మండగ్గర నిల్చుంది.

కారొచ్చి గుమ్మం ముందు ఆగింది. తల్లి దిగిరావడానికి ముందుగా రాఘవన్ తొందరగా దిగివచ్చాడు. సీతను సమీపించి..."సీతా! ఊరికి అట్లా ఎందుకు రాశావు వుత్తరం? నిన్నిప్పుడో బాగా లెంపలు వాయించేస్తాను గాడిదా! పొగరెక్కువయినట్లుందే?" అని అరిచాడు.

"అయ్యో! ఇదేవిటి? నేనేమీ రాయలేదే—?" అంది. పొంగి వస్తున్న దుఃఖాన్ని ఏడుపును ఆణుచుకుంది. ఇంత కోపంగా, ఇంత నీచంగా రాఘవన్ తిట్టడం ఇదే మొదటిసారి.

"నువ్వు రాయలేదూ? అబద్ధం ఎందుకు చెబుతావు? రజనీపూర్ చేరువులోకి నిన్ను పడవనుండి వేను తోశానని లలితకు రాయలేదూ?"

సీతకు నిజం అర్థమయింది. సూర్యా లలితకు ఏదో రాయగా అది ఈ విధంగా ఈయన చెవికి చేరింది. ఎవరో తన అత్తగారిని వూళ్ళో అడిగి వుంటారు. ఆమె స్టేషన్లో దిగీ దిగగానే కొడుకునడిగినట్లున్నారు!

"ఏం బదులు చెప్పకుండా గుడ్లప్పగించి చూస్తావేం ?"

"వద్దు వద్దు! మీకు పుణ్యం వుంటుంది అరవకండి. బిడ్డ జడుసుకుంది. లోపలి ఎవరెవరో వచ్చి వున్నారు." అంది సీత. చటుక్కున రాఘవన్‌కు బుద్ధి వచ్చింది." ఎవరు వచ్చారు ?"

"తారిణి..."

' ఓహో!" అన్న రాఘవన్ ముఖం మారింది.

"ధాము, భాము..."

"ఈ గ్రహాలు దాపురించాయా? అందుకనే ఇల్లంతా రభస—ఇంకా ఎవరొచ్చారు ?"

"సూర్యాకూడా వచ్చాడు."

"ఆ రాస్కెల్ ఎందుకు వచ్చాడు ? ఎప్పుడో ఒకనాడు వాడిని రివాల్వర్‌తో కాల్చి పారేస్తాను." అలి గొణిగాడు రాఘవన్.

నాన్న అమ్మల వాగ్వాదం విని జడుసుకున్న వాసంతి బొమ్మ దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళింది.

వీధి గుమ్మంలోని రాఘవన్‌కు, ఇంట్లోకి వచ్చిన రాఘవన్‌కు పోలికే కేదు. ఆ రాక్షసత్వం మాయమయింది. ముఖంలో మాటలో తియ్యదనం ఒలికింది. ఈ మార్పు సీతకు సంతోషాన్ని కలుగజేసింది. నామీద కోపమయినా, తాపమయినా—మిగతావాళ్ళ ఎదుట చూపకుండా వున్నారుకదా అని సంతోషించింది.

మొదట ధామా భామాలను పలకరించాడు రాఘవన్, నవ్వుతూ మాటాడాడు. తర్వాత తారిణినిచూచి "మిమ్మల్ని చూడడం తదియ చంద్రుడిని చూచినటుంది !" అన్నాడు.

"పూర్ణచంద్రుడు కొన్ని సమయాలలో అర్ధచంద్రుడవడం సహజమే కద—" అంది తారిణి.

"పూర్ణచంద్రుడు ఎప్పుడూ పూర్ణచంద్రుడేకద! మన చూపుకు కొన్ని వేళల పూర్ణంగా, కొన్ని వేళల అసంపూర్ణంగా కనుపిస్తాడు. కాని ఒకటి

మాత్రం నిజం. సూర్యుడితో కలిస్తే మాత్రం చంద్రుడు పూర్తిగా అదృశ్యమయిపోతాడు." అని రాఘవన్ సూర్యాని చూచాడు. "ఏమోయ్! నువ్వప్పుడు వచ్చావు" అని అడిగాడు.

సూర్యచంద్ర శబ్దాలను శ్లేషించి రాఘవన్ మాట్లాడినదానికి సూర్యా మొహం ఎర్రబడింది. తన మనోభావాన్ని కనబడనివ్వకుండా "వచ్చి అరగంటయిందండి అల్లుడుగారూ! నేనూ తారిణీదేవీ కలిసే వచ్చాము." అన్నాడు.

భామ, ధామలు అడ్డొచ్చి, ఆ రాత్రి వీధి కడ్డంగా పడివున్న దేహాన్ని ఆస్పత్రికి తీసుకు వెళ్ళినందుకు రాఘవన్‌ని ప్రశంసించారు. "ఆ! దాన్దేముంది ఆది ఎవరయినా నిర్వర్తించ వలసిన బాధ్యతేకద...పేరే విషయం మాట్లాడండి!" అన్నాడు రాఘవన్.

అప్పుడు టెలిఫోన్ మోగింది. రాఘవన్ రిసీవర్ అందుకున్నాడు.

"ఏమిటి? ఓహో, మధోంకర్ విషయమా? ముద్దాయిని పట్టుకున్నారా? ఎవరది? అరెరే! ఎంత సాహసం? కావలసిందే...సరే! నాకు తెలిసిన దానిని సాక్ష్యం చెప్పడానికి నేనెప్పుడూ సిద్ధమే...అబ్బే, లేదు. ఎక్కడికీ పోవడం లేదు. ఊరిలోనే వుంటున్నాను...ఆల్‌రైట్—"

తారిణి, సీతల కళ్ళల్లో భయము, విచారము కన్పించాయి.

రాఘవన్ టెలిఫోన్ పెట్టేసి రాగానే— "ఏమిటేమిటి?" అని అందరూ అడిగారు.

"మధోంకర్‌ని హత్యచేసిన ముద్దాయిని పోలీసులు పట్టుకున్నారట. మధోంకర్ వద్ద చాలకాలం పనిచేసిన నేరపడే అతడిని చంపాడట. అతడే నేరాన్ని ఒప్పుకున్నాడట" అన్నాడు రాఘవన్.

* * *

23

రెండు రోజులయ్యాక రాఘవన్ తారిణి ఇంటికి వెళ్లాడు. అప్పుడు అక్కడ సూర్యా వున్నాడు. వాళ్ళిద్దరూ ప్రయాణ సన్నాహంలో వున్నట్లు గమనించాడు రాఘవన్.

'అయితే, మీ లాహోర్ ప్రయాణం నిశ్చయమయినట్లుందే—'' అన్నాడు.

"అవును. ఇవాళ రాత్రి బండికే ప్రయాణం'' అని చెప్పింది తారిణి.

రాఘవన్ సూర్యానిచూచి, ఇదిగో చూడు సూర్యా! నువ్వు లాహోర్‌కు వెళ్ళు లేకపోతే రావల్పిండికి వెళ్లు. కాబూలుకు వెళ్లినా సరే లేదా మధ్య ఆసియా ఎడారులకు వెళ్లితే మిరీ మంచిది. సోషలిజం, కమ్యూనిజం వంటి ఎండ మావుల వెంటబడే వారికి ఆ ఎడారులే మంచివి...కాని తారిణిని తీసుకుని వెళ్లక. అది నీకు మంచిదికాదు; ఆమెకూ మంచిది కాదు!' అన్నాడు.

విప్పారిన మొహంతో అంతావిని సూర్యా; "అల్లుడు గారూ! చివర పొరబడ్డారంతే! తారిణిదేవిని నేను తీసుకు వెళ్లడం లేదు. ఆవిడేవాళ్ళ నచ్చజెప్పి నన్ను తీసుకువెళ్తాన్నారు.'' అన్నాడు.

"నిజమేనా తారిణీ!'' అని అడిగాడు రాఘవన్.

"అవును, నిజమే! నేను చారిత్రక పరిశోధన చేస్తున్నానని తెలుసా? అందు నిమిత్తం పంజాబు వెళ్ళవలసి వుంది...''

'చాలు చాల్లే, నువ్వూ నీ పరిశోధనా! భారతదేశంలో హిందూ ధర్మాన్ని నిలబెట్టినవారు స్త్రీలే!...పోనీలే ఇప్పుడా గొడవ ఎందుకు? వీళ్ళో నేను ఏకాంతంగా మాట్లాడాలి! అన్నాడు రాఘవన్.

అతడి మొహంలోని ప్రతికూల భావాన్ని గ్రహించిన తారిణి—"మీ అభిప్రాయమేరకయితే స్త్రీలతో ఏకాంతంలో పురుషులు మాటాడవచ్చా? అది ధర్మ విరుద్ధంకాదా?'' అని అడిగింది.

ఒక క్షణం నిశ్చేరపోయాడు రాఘవన్. "నీకు అభ్యంతరం లేదు కదా! అంచేత నాకూ ఫరవాలేదు. ఆటలుకాదు తారిణీ! ఇదంగానే ముఖ్యమైన విషయం." అన్నాడు రాఘవన్.

అప్పుడు సూర్యా "బయలుదేరడానికి ముందుగా చక్కబెట్టుకోవలసిన పనులున్నాయి. నేను వెళ్ళివస్తాను, తారిణీ దేవీ! ప్రయాణంలో ఎదయినా మార్పుంటే, వెంటనే తెలుపండి!" అని చెప్పి వెళ్ళి పోయాడు.

సూర్యా వెళ్ళిపోయాక ఆ గదిలో కాస్సేపు నిశ్శబ్దం తాండవించింది. రాఘవనే మొదలు పెడతాడని ఎదురుచూచి అట్లా జరగక పోయేసరికి తారిణీ "ఏకాంతంలో మాట్లాడవలసిన ముఖ్య విషయం ఏమిటి?" అని అడిగింది.

రాఘవన్ తారిణి ఎదుట వాటకంలో పాత్రలా నిలబడి—"తారిణీ! నేను ఒంటరిగా నీతో ఏమి చెప్పాలనుకుంటున్నానో నీకు తెలియదా? నిజంగానే నా మనసు నీకు తెలియదా? లేక తెలిసికూడా తెలియనట్లు నటిస్తున్నావా?" అని అడిగాడు.

"మీ మనసు నాకు తెలిసి ఉంటే, నా మనసుకూడా మీకు తెలిసి వుండాలి కదా? ఆలాటప్పుడు ఇక మాటతో పనేముంది?"

"లేదు తారిణీ! నీ మనసు నాకు తెలియదు. ఒకప్పుడట్లా వుండేది. నీ మనసులోని తలపున మనసులో ప్రతిఫలించేది. ఆ విధంగానే నా మనసూ నీకు తెలిసేది. కాని అది అరోజులు అయినా ఇప్పుడు చల్లకొచ్చి ముంతను దాచడం నా కిష్టంలేదు. తారిణీ! నువ్వు నేనిదే నీనిక ఒక్క నిముషమయినా బతకలేను; మూడు నెలలక్రింద ఢిల్లీ స్టేషన్‌లో నిన్ను చూచినదాదిగా నా మనసు నా శరీరంలో లేదు. తాజ్‌మహల్ వద్ద నిన్ను చూచినప్పటినుండి వెర్రెత్తినవాడిలా అయిపోయాను. ఈ మూడు నెలలనుండి నా మనసు ఏ పనిలోనూ లగ్నమవడం లేదు. ఆఫీసులోనూ సరిగా పనిచేయలేక పోతున్నాను, నా మీద ఎంతో అభిమానంగల నాపై అధికారి దొరగారుకూడా "ఏమయింది నీకు?" అని మందలిస్తున్నారు. సిమ్లా ప్రయాణంకూడా నీ

నీకోసమే మానుకున్నాను. నువ్వక్కడ వుండగా అక్కడ సిమ్లాలో నాకు సంతోషం ఎక్కడిది? నీకు జ్ఞాపకం వుందా తారిణీ, మన ఇద్దరమూ పెళ్ళి చేసుకున్నాక 'హనీమూన్'కు కాశ్మీర్‌కు వెళదామని అనుకున్నది జ్ఞాపకం వుందా?..."

"అయ్యా! మిమ్మల్ని చాలా వేడుకుంటాను. దయచేసి ఆ పాత కథ లన్నీ ఇప్పుడు చెప్పకండి. అపన్నీ పాత కలగా భావించి మరచి పొండి."

'నువ్వు మరిచి పోయావు తారిణీ! ఆ విషయం తెలుస్తూనేవుంది. నువ్వు అదృష్టవంతురాలివి, అందుకనే మరవగలిగావు. కాని నేను మరవ లేకున్నాను. ఆ పాత స్మృతులు నా మనసును అనుక్షణం రంపపు కోతకు గురి చేస్తున్నాయి. ఆ జ్ఞాపకాలు సుఖాన్ని కల్గిస్తున్నాయా, దుఃఖాన్ని కల్గిస్తు న్నాయా అని చెప్పలేకుండా వున్నాను.

"ఒకనాడు మనిద్దరం బొంబాయిలో మలబార్ హిల్స్ తోటనుండి వీధిలోకి రాగానే సూర్యుడు అస్తమించాడు. క్రింద బొంబాయి నగరపు లక్ష లాది దీపాలు నక్షత్రాలతో పోటీ పడుతున్నాయి. జగమే ఆనందమయమై తోచింది. అప్పుడా పక్కన ఇంట్లోంచి సైగల్ పాట—"ప్రేమనగర్ మే బనాపూంగీఘర్'—అన్న పాట వినిపించింది." ఆ పాట మనకోసమే పాడి నట్లున్నాడు సైగల్, ప్రేమ అదే నగరంలోనే మన ఇంటిని కట్టుకుందాం!" అన్నాను నేను. ఇప్పుడు నేను చెప్పిన తర్వాతయినా గుర్తుకు వస్తుందా? లేక ఏదో పేలుతున్నాడులే అని ఇంకేదయినా ఆలోచిస్తున్నావా?"

తారిణి మనసు కలవర మందినట్లుంది, ఆమె వెంటనే స్పష్టంగా జవాబు చెప్పలేక పోయింది. తడబడుతూ ఇట్లా అంది." "మీరు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాను. నేనేదీ మరవలేదు. కాని అప్పుడు మనం చేసిన తప్పే మిటో ఇప్పుడు బోధపడుతూంది. ప్రేమనగర్ అన్నది నిజంగా లేదు. అది మాయ; కవులకల్పన అంతే. ఒకవేళ అట్లాంటిది వున్నా నేనందులో ఇల్లు కట్టుకోను. నేను నా ఇంటిని సేవానగర్‌లో కట్టుకుంటాను, రాఘవన్! నేను చూచిందంతా మీరు చూచివుండి నేను అనుభవించిందంతా మీరూ

అనుభవించిపుంటే నేనాలోచించినట్లే మీరూ ఆలోచించేవారు. ప్రేమవలపు వంటి భ్రమలోకి పోరు. ఈ ప్రపంచ జనుల కష్టాలను కించిత మాత్రమయిన తొలగించగలనా అని రాత్రింబగళ్ళు విచారించేవారు.''

''తారిణీ! ఏమిటీ మాటలు? ఈ లోకంలోని బాధితుల కష్టాలను నువ్వు తగ్గించగలరా? నువ్వూ నేనూ భగవంతుడి కన్న శక్తివంతులమూ? భగవన్నిర్ణయం మేరకు పురుషులు సుఖమో, దుఃఖమో అనుభవిస్తారు, వారివారి విధి విహితాన్ని వారనుభవించే తీరాలి. దానిని మనం మార్చగలం. దీనజనావళినంతా ఉద్ధరించగలం అనుకోవడం ఎంత అహంభావం! ఎంత పొరబాటు! ఆ బుద్ధిహీనుడు సూర్యాలాగే నువ్వూ మాట్లాడుతున్నావే? వాడి దగ్గరే నేర్చుకున్నావా?'' అని అసహనంతో అరిచాడు.

తారిణి నిదానంగానే చెప్పింది. ''ఎందుకింత తొందరపాటు? ఇందులోకి సూర్యా పేరు లాగడం అనవసరం. నేను ఆయనను కలవకముందే కొన్ని అనుభవాలకు గురి అయ్యాను; కొన్ని నిర్ణయాలకు వచ్చాను. దేవుడి సృష్టిని మెరుగు పరుద్దామన్న అహంభావంతో, విధిని మార్చగలనన్న అతిశయంతో నేను సేవకు పూనుకోలేదు. బాధా సర్వదష్టులకు సేవ చేయడంలో నామనసు శాంతిని పొందుతూంది; సుఖంగా వుంటూంది. ఇంక దేనివైపూ నా మనసు పోవడం లేదు. దానికి నేనేమి చేయగలను? విధిలిఖితం అని ఒకటి వుందనీ, భగవంతుడు ఎవరి బారి వారికి నిర్ణయించి వుంచుతాడనీ మీరన్నారు. నిజమే మీ దారివేరు, నా దారివేరు అని ఆయనే నిర్ణయించాడు. నాబుద్ధిని కప్పిన మాయ తొలగగానే నా దారి నాకు తెలిసింది. నన్ను క్షమించండి. నాదారిని నన్ను పోనివ్వండి.''

''పిల్లేదు. నిన్ను ఇప్పుడు మాయ ఆవహించివుంది. ఆ కోజాలలో నువ్వనుకున్నదే నిజం. నీ దారి వేరు, నా దారివేరు అన్న భావమే తప్పు. హిందూ ధర్మంలో పురుషుడు వడిచే దారే స్త్రీది; స్త్రీకి వేరే దారంటూ లేదు.''

"ఆ విధంగా మనసారా నమ్మి తమరిని దైవ సమానులుగా పూజించే స్త్రీని మీరు భార్యగా పొందారు. అది మీ అదృష్టం. రాఘవన్! కొంచెం ఆలోచించండి. నా ఎదుట ప్రేమ మాటలాడుతున్నప్పుడు మీకు సీతగురించిన జ్ఞాపకమే లేదా? మీరే సర్వస్వమని నమ్మివచ్చిన ఆ అమ్మాయిమీద కనికరం లేదా? ఆమెపై ద్రోహం చేయడానికి మీకు మనసెట్లా ఒప్పింది?"

"ఆహ, ద్రోహం గురించి మాట్లాడుతున్నావా? ఎవరు ఎవరికిద్రోహం చేశారు? నాకూ, సీతకూ నువ్వు చేశావు ద్రోహం! తారిణీ! నిన్ను పరిపూర్ణంగా నమ్మిన నన్ను నట్టేటముంచి, చెప్పకుండా మద్రాసునుండి వెళ్ళిపోయావు. అన్వేషణకి దారి తీసే ఒక తెలివి తక్కువ వృత్తాంతాన్ని వదలి వెళ్ళావు. అసలుకూడా నువ్వు కావాలని పన్నిన పన్నాగమేమో నాకు తెలియదు. ఆ తర్వాత బీహారు భూకంపంలో మరణించినట్లు వృత్తరం రాయించావు. ఇట్లా నువ్వు ఆడిన నాటకాల ఫలితంగానే నేను సీతను పెళ్ళాడవలసి వచ్చింది..."

"నేను చేసినది ద్రోహమే అనుకుందాం. అందుకు తగిన కారణాలున్నాయి. అయితే సీతను మీరు, మిగతావారిలా సాధారణమైన రీతిలో పెళ్లాడలేదే...?..మీకు నామీద అభిమానం వున్నమాట ఏ మాత్రం నిజమయిన మీ భార్య సీతను ప్రేమతో ఆదరించండి. ఆ అమాయకురాలిని విడనాడకండి—"

"ఆమెను విడనాడుతానని నేననలేదే! ఆ ఉద్దేశమే నాకులేదు. ఆమెకూడా వుంటే వుండిపోనీ.."

"వైదిక కార్యాల నిమిత్తం తాళికట్టిన భార్య; సరదాలకు నేను; అంతేనా?"

"ఛీఛీ, అంత నీచుడినికాను నేను. నిన్నూ పెళ్ళి చేసుకుంటాను. ఎంతనుంది ఏమన్న నేను లెక్కచేయను."

"ఏమన్నారు, మళ్ళీ ఒకసారి చెప్పండి!"

"ఇప్పుడీ నిముషం సరేనంటే, మరు నిముషం నిన్ను అగ్ని సాక్షిగా పెళ్లాడడానికి సిద్ధంగా వున్నాను."

"రాఘవన్! ఈ విషయంలో మీ భార్య సీత అభిప్రాయం ఎట్లా వుంటుందోనని ఆలోచించారా?" అని కటువుగా అడిగింది తారిణి. ఆమె ధోరణి క్రమంగా మారసాగింది.

"ఆ విచారం నాకు లేదు; ఒకరికోసమని ఇంకొకరు తన జీవితాన్ని బలివ్వడం సాధ్యమా? పై పెచ్చు సేనావిడను పూర్తిగా వదలడం లేదే.. ఆమెకూడా వుంటే వుండనీ!"

"అయ్యో పాపం! ఎంత ఔదార్యం' ఈ విషయాన్నింకో కోణం నుండి పరిశీలించండి. మీ మాదిరే సీత ఇంకొక పురుషుడిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటే, అందుకు మీరంగీకరిస్తారా?"

"ఛీఛీ, ఏమిటా పాడుమాటలు! అది హిందూ ధర్మానికే విరుద్ధమైన పని—"

"మగవాళ్ళు మట్టుకు ఇచ్చవచ్చినట్లు చేయవచ్చునని హిందూ ధర్మం ఘోషిస్తున్నది కాబోలు!"

"ఈ ధర్మ పన్నా లెందుకు తారిణీ; ఒక మాట చెబుతా, వినుం. కావాలంటే సీతకు విడాకు లిచ్చేస్తాను; ఆమె ఎవరినయినా పెళ్ళాడనీ... అప్పుడు నువ్వు నన్ను పెళ్ళాడుతావా?"

"సీత మిమ్మల్ని విడిచిపెట్టదన్న మీపాదాల వద్దేపడి వుంటుందన్న ధైర్యంతో ఇట్లా అంటున్నారుకదూ?... నేను ఇందాక చెప్పిన దానినే మళ్ళీ చెబుతున్నాను. తమ జీవిత లక్ష్యం వేరు; నా జీవిత లక్ష్యం వేరు. మనిద్దరి అక్ష్యాలకు పొసగదు అది ఎన్నటికీ సాధ్యంకాదు."

రాఘవన్ నివ్వెరపోయి కాసేపు తారిణినే చూస్తూ సిల్చున్నాడు. తర్వాత ఏదో ఓక నిర్ణయానికి వచ్చిన వాడిలా కోపంతో నవ్వాడు. "తారిణీ! కాసు ఇటీవలె రివాల్వర్ లైసెన్స్ లభించింది!"

"రాఘవన్! నన్ను భయపెట్టలేవు మీరు! బీహార్ భూకంపం చూశాక నాకు చావంటే భయం పోయింది."

"నన్ను సరిగా అర్థం చేసుకోలేదు నువ్వు! నన్ను నేను కాల్చుకుంటానని చెప్పాను."

"నా చావును గురించిగాని, ఇంకొకరి చావు గురించిగాని నేను చింతించబోను. భవద్గీత ఏమంటుంది? శరీరాన్ని చంపవచ్చుగాని ఆత్మను చంపలేము. వజ్రాయుధంతో వయినా చంపలేము."

"తారిణీ! నీ నిజస్వరూపం నాకిప్పుడు బోధపడింది. నువ్వు ఆడదానివి కావు, రాక్షసివి; నీ అందం శూర్పణఖ అందంలాటిది...కానివ్వు చూస్తాను. నువ్వూ సూర్యా ఎట్లా పైకెక్కి వెళ్తారో నేను చూస్తాగా!" అని శపథంచేసి బయటికి నడిచాడు రాఘవన్.

అతడు వెళ్లాక అంతవరకు అణచి పెట్టిన తారిణి దుఃఖమంతా పెల్లుబికి వరదలా వచ్చింది.

24

పద్మాపురంలో, ఇంటిమేడమీద రాఘవన్ తండ్రి మేజా ఎదుట కూచుని పత్రికలేదో ఘాటుగా రాస్తున్నారు. అప్పుడు "భిక్షాందేహి", అన్న గొంతు వినపడింది.

మేడ వసారాలో నిల్చుని తొంగి చూశారు. యువకుడయిన ఒక సన్యాసి నిల్చుని వుండడం చూశారు. అయనకు చాల ఆశ్చర్యం కలిగింది. గబగబ క్రిందకు దిగివెళ్ళి వెనక వైపున్న భార్యను పిలిచారు. 'కామాక్షీ! ఈ చిత్రం చూశావా! గుమ్మంలో ఒక బాల సన్యాసివచ్చి నిల్చున్నాడు.

ముఖంలో తేజస్సు వెల్లి పోతూంది. భిక్షాందేహి అన్న ఆయన గొంతు విన గానే నా ఒళ్ళు పులకరించింది. వీధి తాళం చెవి తీసుకురా తొందరగా! సాక్షాత్తు ఆదిశంకరులే మన పూర్వ జన్మ సుకృతం కొద్దీ విచ్చేశారు. రా! అట్లా నిలబడతావేం?'' అని అరిచారు.

ఈలోగా గుమ్మం వైపు తొంగిచూచి ఎవరో సన్యాసి నిల్చుని వుండడం చూచి కామాక్షమ్మాళ్ ''ఎందుకింత హడావిడి? వీధి తలుపులు తెరిచే వున్నాయి. అంతోటి గొప్ప స్వాముల వారెక్కడనుంచి దిగబడతారులెండి, ఏరామ కృష్ణ మఠంనుండో చందాకని వచ్చి వుంటారు'' అంది.

ఇది విని శాస్త్రిగారి ఉత్సాహం కాస్త చప్పబడింది.

ఈలోగా స్వాముల వారే తలుపుతోసుకుని లోపలికి విచ్చేశారు. శాస్త్రి గారూ, కామాక్షమ్మా—' తెలిసిన మొహంలాగుందే? అనుకుని ఆశ్చర్య పోయారు.

''అత్తయ్యా! నన్ను గుర్తు తెలియలేదా?'' అని స్వాముల వారడగడంతో కామాక్షమ్మకు హఠాత్తుగా జ్ఞానోదయం అయింది.

''మన నూర్యా లాగుందే? ఇదేమి ఘోరం?'' అంది కామాక్షమ్మాళ్.

''నిజంగానా? అందుకనే పరిచితమైన ముఖంలాగు వుంది.'' అన్నారు శాస్త్రి.

''ఔను పూర్వాశ్రమంతో ఈ దేహం పేరు సూర్యనారాయన్ ఈ ఆశ్రమలో స్వతంత్రానందులు'' అన్నారు సన్యాసి.

''అలాగా చాల సంతోషం! పండు జారి పాలలోపడటయింది.', అంటూ ఉపచారాలు చేస్తూ శాస్త్రిగారు శ్రీ స్వతంత్రానందులవారిని తీసుకువెళ్ళి హాల్లో సోఫామీద కూర్చోబెట్టారు. కామాక్షమ్మాళ్ ''ఇంత లేత వయసులో ఇదేమిగోల? అమ్మా నాన్న ఒప్పుకున్నారా? ఆయా వయిసుల్లో జరగవలసినవన్నీ జరిగాక పెద్దతనంలో సన్యాసం పుచ్చుకుంటే ఫరవాలేదు గాని!' ' అంది.

స్వాములవారు ఏదో చెప్పబోతుంటే అడ్డొచ్చి చెప్పాను శాస్త్రి! "చాల బాగుంది నువ్వు చెప్పడం! అందరూ నిన్నడిగే సన్యాసం పుచ్చుకో వాలి కాబోలు! లోకాన్ని త్యజించి ఆశ్రమ స్వీకారం చేశాక ఇక అమ్మేసి విటి! నా కిన్నివిటి? పరివ్రాజలకీ బంధాలే లేవు. ఆ వెర్రిబాగులదాని మాట అకేమిటిగాని స్వామీజీ! తమరలా చిన్నవయసునే వైరాగ్య పథాన్ని అనుసరించి ఒక వేయిమంది సన్యాసం పుచ్చుకొని సనాతన ధర్మ ప్రచారానికి బయలుదేరితే ఆ ధర్మం దివ్యంగా పునరుద్ధరింప బడుతుంది. అది సరేగాని స్వామీ! తాము ఎప్పుడు ఎక్కడ ఆశ్రమ స్వీకారం చేశారు? స్వీకరించాక ఎక్కడెక్కడికి వెళ్ళారు. ఈవూళ్ళో ఎన్నాళ్ళుందామని సంకల్పం? అన్నీ వివరంగా తెలుపండి. కామాక్షీ! నువ్వెళ్ళి శాస్త్రోక్తంగా స్వామిగారి భిక్ష కన్ని ఏర్పాటు చేయి." అన్నారు.

"సరే! అన్నీ చేస్తాను. మీరే మీ బెంగ పెట్టుకోకండి—" అని ఆమె వెళ్ళుతుంటే ఆమెతో బాటు వాసంతి వెళ్ళడం చూచిన బాలసన్యాసి—'వాసంతీ! నన్ను జ్ఞాపకం లేదూ? మాట్లాడవేంమరి?" అని అడిగారు. ఏమీ జవాబు చెప్పకుండా వాసంతి వెళ్ళి వాళ్ళ బామ్మను "బామ్మా! సూర్యామామయ్య తల గుండు కొట్టించుకు వచ్చారెందుకు తిరుపతి కెళ్ళి వచ్చారా?" అని అడగడం విని అందరూ నవ్వారు.

కామాక్షమ్మ వెళ్ళిపోయాక శాస్త్రిగారడిగారు? "ఔనుగాని తామీ ఆశ్రమాన్ని స్వీకరించడం ఎట్లా జరిగింది? కాంగ్రెసులో చేరి" "క్విట్ ఇండియా" ఉద్యమానికై పాటుపడుతున్నారని విన్నానే?"

"అది నిజమే. 'క్విట్ ఇండియా' ఉద్యమ నిమిత్తమే ఊళ్ళు తిరుగుతుండగా హరిద్వార్‌లో ఒక స్వామీజీని దర్శించాను. ఆ దర్శించినవేళ, పూర్వజన్మ సుకృతం అన్నీ కలిసి వచ్చాయి."

"నిజమే! నిజమే! ఏమి స్వామీ! ఇండియాకు స్వరాజ్యం ఎప్పుడు సిద్ధిస్తుంది? గాంధీ, పటేల్, నెహ్రూ—ఇందరు చెఱసాలకు వెళ్ళినా స్వరాజ్యం రాలేదే?"

"ఇండియాకు స్వరాజ్యం రానేరాదని అనుకుంటున్నారా? అన్నారు సన్యాసి.

"ఎవరన్నారు ఆ మాట? ఇండియాకు స్వరాజ్యం వచ్చి తీరుతుంది. అయితే వీరివల్లకాదు. దేవుడి దయవల్ల. ఇంకో విధంగా రానున్నది. కలిపురుషుడు జర్మనీలో హిట్లర్ పేరున అవతారం ఎత్తాడు. హిట్లర్ రష్యామీద దండెత్తింది ఇండియాను దృష్టిలో వుంచుకునే. స్టాలిన్ గ్రాడ్ పడగానే ఆయన ఒక్క ఊపున విమానంలో వచ్చి ఇక్కడ దిగనున్నాడు. యూరోపేల విమానాలలో సైనికులూ వచ్చి దిగుతారు. హిట్లర్ చెప్పుకదా ఆర్య జాతే సర్వోత్కృష్టమైన జాతి అని. అలాంటప్పుడు ప్రపంచ సామ్రాజ్యపు రాజధాని ఈ దేశంలోనే కదా వుండాలి? హిట్లర్ ఇక్కడికి రాగానే చేయబోయే మొదటి పని ఏమిటో తెలుసా? అప్పుడీ జాతి భేదాలు పనికిరావు అంటున్నాడే బృహస్పతులు వీళ్ళందరూ నెత్తిమీద గుడ్డ వేసుకుపోవలసిందే! ప్రపంచ జనులందరిని హిట్లర్ నాలుగు వర్ణాలుగా భాగించనున్నారు. అప్పుడు తెలుస్తుంది వర్ణాశ్రమ ధర్మపు గొప్పతనం! ఆయుస్సుంటే నేనూ చూడక పోతానా ఏమిటి?" అన్నారు శాస్త్రి.

నవ్వు నాపుకుంటూ స్వామిగారన్నారు; "అయితే కొంధరేమో, హిట్లర్ ఓడిపోతాడంటున్నారే?"

"అంటారంటారు! ఎవరో చవటలు అన్నారని జరిగేది జరగక మానుతుందా? హిట్లర్ ఎట్లా జీవిస్తున్నాడనుకున్నారు? మాంసం తినడంలేదు; మధుపానం లేదు; స్త్రీల మోహం చూడడంలేదు. పుట్టినప్పటినుండి బ్రహ్మచర్యం. విన్నారా స్వామీ! హిట్లరేదో సామాన్య మనుష్యుల సేవకుచెరదిన వాడనుకోకండి. ఆయన గొప్ప మహయోగి. సంస్కృత భాషను జీర్ణం చేసుకున్న మహాపండితులిప్పుడు జర్మనీలోవే వున్నారన్న విషయం తెలుసుకదా? హిందూ జ్యోతిశ్శాస్త్ర ప్రకారము తిథివార నక్షత్రాలు చూచిగాని హిట్లర్ ఏ పనీ చేయడంలేదు. చెకోస్లావేకియామీద, ఫ్రాన్సుమీద దాడి చేసినప్పుడు

డంతే! లేకపోతే నెపోలియన్ పుట్టిన ఫ్రాన్సు దేశాన్ని పదేపది రోజులలో పడగొట్టడం సాధ్యమా చెప్పండి—ఏమంటారు?" అన్నారు శాస్త్రిగారుం

ఈ విధంగా శాస్త్రిగారు వర్షిస్తుంటే, వేరే దారిలేక వింటున్నారు స్వామివారు. ఇంత చదువుకున్నవారు బి.ఏ., బి.ఎల్., పట్టాలు పుచ్చుకున్న వారు, సబ్‌జడ్జి వుద్యోగం చేసినవారు, ప్రపంచానుభవంగల వారు అయిన శాస్త్రిగారిట్లాటి గ్రుడ్డి నమ్మకాలు కలిగివుండడం స్వామికి ఆశ్చర్యంగానే వుండింది. తరతరాలుగా వస్తున్న నమ్మకాలను వదలిపెట్టడం అంతా సులభం గాకాదు—అన్పించింది ఆయనకు. ఆయన మనసులో ఇంకొక ఆలోచనా వుంది. కామాక్షమ్మాళ్ ఒంటరిగా సీతను గురించి మాట్లాడడం ఎట్లాగ అని ఆలోచిస్తున్నారు. చివరకు—"మీరన్నదంతా నిజమేకాని ఇట్లా గట్టిగా అరుస్తున్నారే? ఈగోజుల్లో ఎక్కడ చూచిన సి. ఐ. డీ.లు తిరుగుతున్నారు కద...ఎవరయిన విన్నా, విని రిపోర్టు చేసిన అనవసరమైన గొడవకదా?" అన్నారు.

దాంతో శాస్త్రిగారి వాగ్ధోరణి తాత్కాలికంగా ఆగిపోయింది.

శాస్త్రిగారు మేడమీదికి వెళ్ళాక కామాక్షమ్మాళ్—"సూర్యా! ఇదేమిటి ఇట్లాంటి పని చేశావు? ఈ వయసులో సన్యాసం ఏమిటి? ఇదేమీ బాగాలేదు. నిన్ను ఎట్లా పిలవడమో తెలియడం లేదు. "స్వామిగారూ రండి! కూర్చోండి? ఆనాబి కాలోలు" అంది.

"అత్తయ్యా! మీతో నిజం చెప్పేస్తాను, నేనొక కార్యార్థి ఈ వేషం వేసుకున్నాను. అంతేగాని నిజంగా సన్యాసం స్వీకరించలేదు" అన్నాడు సూర్యా.

"ఇదేమివింతరా నాయనా! ఇంకేదీ లేనట్లు ఈ వేషం ఏమిటి?"

"నేను స్వరాజ్యోద్యమంలో చేరాను గదా?"

"స్వరాజ్యమూ గిరాజ్యమూను! నీకో పిల్లను చూచి వుంచాక మాయిగా పెళ్ళి చేయిద్దా మనుకుంటుంటే ఈ వేషంలో నిన్ను చూచేసరికి నా కడుపు భగ్గునమండిందనుకో!"

"పెళ్లి అంత అవసరమా అత్తయ్యా? పెళ్లి చేసుకున్న వాళ్ళం అరా సంతోషంగా వుంటున్నారా?" అని అడిగాడు సూర్యా.

"పెళ్ళి చేసుకుని పిల్లా పాపాతో సుఖంగా వున్నవా. రెందరులేరు? కొందరి తలరాత—సంతోషంగా వుండలేరు. ఆ మాటకొస్తే ఎవరు మాత్రం ఎల్ల కాలమూ సంతోషం తప్ప ఇంకొకటి లేకుండా వున్నారు! సీతమ్మగారిని పెళ్ళాడిశ్రీరామ చంద్రుడెన్నో కష్టాలు పడ్డాడు. అందుకని శ్రీరామ చంద్రుడు పెళ్ళే చేసుకుని వుండకూడదు—అని అనగలమా?"

"సీతారాములకొకరిపై ఒకరికి ప్రేమ వుండేది. కాని ఈ కాలపు దంపతులు అట్లా వుండడం లేదే?"

"సూర్యా! నాకొడుకూ కోడలూ అన్యోన్యంగా లేదనేకదా నువ్వు చెప్పడం? అది వాస్తవమే. పెద్దవాళ్లు చెప్పినమాట వినకుండా చేయడం వలన వచ్చిన చిక్కిది. పెళ్ళి నిశ్చయం చేయడానికి ముందు జాతకాలు అవీ చూడాలని పెద్దలు చెబుతా రెందుకు? ఇట్లా అల్లకల్లోలం రాకూడదు అనే! మీ చెల్లెలు లలితను చూడడానికనేకదా మేమందరమూ మీ వూరొచ్చాము? లలత జాతకం రాఘవన్ జాతకం పొంతన సరిపోయింది. అట్లా జరిగివుంటే ఈ గొడవలన్నీ వుండేవికావు." అంది కామాక్షమ్మాళ్.

"ఇప్పుడు సీత పడుతున్న కష్టాలన్నీ నాచెల్లెలు పడివుండేది." అన్నాడు సూర్యా.

కామాక్షమ్మాళ్‌కు కోపం వచ్చింది. "మా బాగా చెప్పొచ్చావులే! మీ అత్తకూతురు పరమసాధువు; రాఘవన్ దానిని రాచిరంపాన పెడుతున్నాడు అని అనుకుంటున్నారేమో? పెళ్ళయిన కొత్తలో నేనూ సీత సాధువనే అనుకున్నాను. పోను పోను తెలిసింది; అది ఎంతటి రాక్షసో అర్థమయింది."

"సాధువుగా వున్నపిల్ల రాక్షసిగా మారిందంటే అందుకు కారణం వుండాలికదా?"

"కారణమేమిటి కారణం? దానిని మొదట సాధువు అనుకున్నామే అదే తప్పు! అయినా సీతలాటి దుర్మార్గురాలి నెక్కడా చూడలేదు. ఒక్క

సారి నాకు భయం వేస్తుంది. సూర్యా! అది ఏ విషాన్నో మింగేసి రాఘవన్ మీద నింద మోపుతుందేమోనని భయం వేస్తుంది. 'నా భర్తపెట్టే ఇడుములు భరించలేక ఇట్లా చేశాను' అని రాసిపెట్టి చచ్చినా చస్తుంది! దాని మూర్ఖత్వం గురించి ఆలోచిస్తే ఏమిటో భయాలు..."

: "అత్తయ్యా! విషం తాగి అయినా చచ్చి పోదామనుకునేటంతగా జీవితంమీద విరక్తి ఎందుకు పుట్టాలి? అందుకు తగిన కారణం ఏదయినా వుండాలికద? మీ అబ్బాయి తప్పేమీ లేదు అంటే వేరే కారణం ఏ మండగలదో చెప్పండి." అన్నాడు సూర్యా.

అందుకు కామాక్షమ్మ వ్యంగ్యంగా జవాబు చెప్పింది:

"నా కొడుకు తప్పు చేయలేదని నేననలేదే? వాడెన్నో తప్పులు చేశాడు! మీ చెల్లెలని చూడడానికని వెళ్ళినవాడు దారిలో ఈ రతీదేవిని చూచి "దీనినే పెళ్లాడుతా"నన్నాడే అది పెద్ద తప్పు. ఒక చిల్లిగవ్వ కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకోవడమూ తప్పే. పెంట కుప్పలోపడి వున్నదానిని తీసుకువెళ్ళి ఆలయంలో వుంచుకున్నాడే అదీ తప్పే. ఆగోజుల్లో నేను నెత్తీనోరూ బాదుకున్నాను — "ఇంతలా నెత్తికెక్కించుకోకురా!" అని. నా మాట విన్నాడా? లేదు. ఎక్కడి ఆగ్రా ఎక్కడి సిమ్లా, ఎక్కడి కాశ్మీరు—షికార్లు తిప్పాడు. నన్ను కాశికి తీసుకు వెళ్ళమంటే వాడికి తీరిక చిక్కలేదు. సీతను లండన్ తీసుకు వెళ్ళడానికికూడా సిద్ధమయ్యాడు. వైస్రాయి ఇంటి పార్టీలకు తీసుకువెళ్ళాడు. ఇంగ్లీషు చదువులు చదివించాడు..."

ఈ రీతిలో ఈమెతో మాట్లాడి లాభంలేదని తెలిసి సూర్యా ఇంకో విధంగా మాట్లాడాడు.

"అత్తయ్యా! నేనా అత్త కూతురిని వెనకేసు కొస్తున్నానను కోకండి; మీ అబ్బాయిమీద నేరం మోపుతున్నాననీ అనుకోకండి! సీతతల్లి లేనిపిల్ల అని మీకు తెలుసు. తండ్రి వున్నాడో లేడో, వుంటే ఎక్కడ వున్నాడో ఎవరికీ తెలియదు. మీరూ మీ అబ్బాయీ తప్ప ఆమెకు వేరే

దిక్కు లేదు. కొట్టి తరిమివేస్తే వెళ్లి ఏ నూతిలోనో దూకవలసిందే... మూ అత్తయ్య ఈన్నిన్ని వాళ్ళూ కష్టాలు పడింది. కనీసం తనకూతురయిన మంచి మొగుడు దొరికి సుఖంగా కాపురం చేయాలని ఉబలాట పడింది. ఈ పెళ్లి జరిపించినందుకామె నన్ను ''మహారాజుగా వర్ధిల్లు నాయన?'' అని వేయి సార్లు దీవించింది. అవన్నీ తలచుకుంటే ఇప్పుడు మీకొడుకూ కోడలు వున్న పరిస్థితి చూస్తుంటే నా కెంతో దుఃఖంగావుంది. ఏదయినా ప్రయత్నంచేసి వాళ్ళిద్దరూ సుఖంగా వుండేలా చేయాలని వుంది. సీత తప్పేమిటో తెలిస్తే ఆమెకు బుద్ధి చెప్పడానికి ప్రయత్నిస్తాను.''

సూర్యా యొక్క ఈ మాటలు కామాక్ష్మి కోపాన్ని తగ్గించాయి.

''నాకూ అదేకోరిక సూర్యా! వాళ్ళిద్దరూ చిలకాగోరింకల్లా వుండడంకన్న నాకు సంతోషకరమైనదేముంది?...వాళ్ళిద్దరికీ ఒకరిపైన ఒకరికి ఎంతో ఇష్టం వుందని తెలుసు. కాని పొద్దు పొడిస్తే ఏదో కీచులాట తప్పడం లేదు. అంతటికీ కారణం సీత నోరే! వచ్చేటప్పుడు ఎంత మూగలా వచ్చిందో ఇప్పుడంత నోరు ముదిరింది. ఇంతటి మాటకారితనం ఎక్కడినుండి వచ్చిందో గాని ఆశ్చర్యంగావుంది. వాడొక్క మాటంటే చాలు తాను నాలుగు అనడం నేర్చుకుంది. కొన్ని సార్లయితే వాడు రుద్రుడయి పోతాడు. అట్లాంటప్పుడయినా ఇది కాస్త తగ్గవచ్చునా, ఊహు! నీకు ఆ తారిణిని తెలుసు కదా, దాని నడిగిచూడు...నేను కాశికి వెళ్లినప్పుడు, సీతకు జ్వరం వచ్చి ప్రాణాంతకమయింది. అప్పుడు తారిణివచ్చి రాత్రిం బగళ్లు శుశ్రూషచేసింది. అట్లాటి దానిని, తన ఆరోగ్యం బాగవగానే, సీత ఎంత తిట్టిందనుకున్నావు? దానిని రాఘవన్‌నూ నానా తిట్లు తిట్టింది. ఆ తారిణి అన్నీ సహించి నెమ్మదిగా ఏదో నాలుగు మాట్లాడి వెళ్లిపోయింది. ఒకనాడు ఆపిల్ల కడుపు మంటను నే పోసుకున్నాను. ఇదే పూజగదిలో నాకాళ్లమీదపడి రాఘవన్‌ను పెళ్ళాడడానికి అంగీకరించమని కోరింది. ఏ జాతిదో ఏమోనని నేను వీలు లేదని ఖచ్చితంగా చెప్పి వేశాను. ఇప్పుడాలోచిస్తే అది తప్పని తోస్తుంది.

తారిణిని పెళ్లాడి వుంటే నా కొడుకు సుఖపడి వుండేవాడు. ఆ పిల్ల ఊసురే ఇట్లా నన్నూ వాడినీ ఏడిపిస్తూంది.''

ఇదంతా విన్న సూర్యా ఆలోచనలో పడ్డాడు. తారిణి మీద కోపం వచ్చింది. పాత కథ ఈ విధంగా వుండగా సీతా_రాఘవన్‌ల జీవితంలోకి తారిణి ప్రవేశించే వుండకూడదు—అనుకున్నాడు.

''అత్తయ్యా! జరిగిన దాని గురించి ఇట్లా కాక ఇంకో విధంగా జరగ లేదే అనుకోవడం వలన ఏమి ప్రయోజనం? బ్రహ్మ రాసిన దానిని ఎవరూ మార్చలేరు కదా? మీ అబ్బాయి సంతోషంగా వుండడానికి దారి ఏది అని చూడాలి. నేను నాకు చేతనయిన విధంలో సీతకు హితవు చెబుతాను. మీరూ నెమ్మదిగా చెప్పి చూడండి.

''ఢిల్లీకి ఎపుడొస్తున్నారు మీరు?'' అని అడిగాడు సూర్యా.

''రాఘవన్ నుండి వుత్తరం కోసం ఎదురుచూస్తున్నాను...నీతో చెప్పడానికేమిటి...ఒకసారి సీత ఈ పసి పాపకేదో బోధన చేసినట్లుంది. ఇది కాస్తా నాన్న దగ్గరకు వెళ్ళి ''అమ్మను తిట్టకు! కొట్టకు!'' అని చెప్పింది. వాడూ మూర్ఖంగా ఆ కోపంలో దీనిని కొట్టాడట. బిడ్డకు జ్వరం వచ్చింది...''

''అయ్యో...!''

''నువ్వు 'అయ్యో' అంటున్నావు కాని సీత ఏమి చేసిందో తెలుసా? పాపకు జ్వరం అని మూడు రోజుల దాక ఎవరితోనూ చెప్పలేదు. ఆతర్వాత రాఘవన్‌కు ఎట్లాగో తెలిసి వాడు డాక్టర్ని తీసుకు వచ్చాడు. బిడ్డ బ్రతకడం కష్టమయింది. మీ అత్త కూతురి రాక్షసితనం చూచావా?''

అది రాక్షసితనమా లేక తన భర్త బిడ్డను కొట్టగా దానికి జ్వరం వచ్చిందని నలుగురికీ తెలియ రాదన్న సహనమా - అని సందేహం వచ్చింది సూర్యాకు. కాని ఆ విషయమై కామాక్షమ్మతో వాదించి లాభం లేదని అతడు—''జరిగిందేదో జరిగింది. నేను రేపు పొద్దున ఢిల్లీకి బయలుదేరుతున్నాను. ఢిల్లీ చేరగానే సీతను కలుసుకుని, మీకు అన్ని వివరాలూ రాస్తాను. ఎట్లాగయినా వాళ్ళిద్దరూ సుఖంగా వుండేటట్లు చేయాలి'' అన్నాడు.

"అందుకోసమే వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటున్నాను నాయనా! ఈ ప్రపంచంలో వాళ్లిద్దరి కన్న, ఈ బిడ్డ కన్న నాకెవరున్నారు చెప్మా. మళ్ళీ సీతకు నచ్చజెప్పు. దాని జాతకం వుంటే పంపించు. ఏదయినా గ్రహదోషం వుంటే శాంతి చేయిద్దాం" అంది కామాక్షమ్మాళ్.

25

చరిత్ర ప్రసిద్ధి చెందిన ఢిల్లీ మహానగర స్టేషన్‌లో దిగాడు సూర్యా. ఆది 1943 సంవత్సరం. ఢిల్లీ ఐశ్వర్యమూ, జనాభా అతి త్వరితంగా వృద్ధి కాసాగాయి. యుద్ధం భారత దేశ సరిహద్దులను సమీపిస్తున్నందున రాజధానిలో యుద్ధ సన్నాహాలు తీవ్రంగా చేస్తున్నారు. టాక్సీలకు, టాంగాలకు, రిక్షాలకూ మునుపెన్నడూ లేనంత గిరాకీ ఏర్పడింది. ఈ పరిస్థితిలో ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో దిగిన సూర్యాకు ఏ వాహనమూ దొరకక పోవడంలో ఆశ్చర్యమేమీ లేదు.

స్టేషన్ బయటికి వచ్చి నిల్చుని అయిదు నిమిషాలు ఆలోచించాడు సూర్యా. కొత్త ఢిల్లీ వైపు నడక ప్రారంభించడమా, లేక మొదట పాత ఢిల్లీకి వెళ్లడమా అని ఆలోచించి, ఆలోచించి, చివరకు బయలుదేరి విసవిసమని పాత ఢిల్లీ వైపు నడవసాగాడు.

'చాందినీ చౌక్' బజారుకు రాగానే సూర్యా నడక వేగం తగ్గింది. అతడి మనసు గడచిన కొన్ని రోజుల నుండి తన అనుభవాలన్నిటినీ నెమరు వేయసాగింది.

తాను మొదట అగరు వత్తుల వ్యాపారి వేషంలో దక్షిణాన ప్రయాణం చేసింది గుర్తుకొచ్చింది. ఆ వేషంతో అతడు దేవపట్నంలో లలిత ఇంటికి

వెళితే, అతడి తల్లి సరస్వతమ్మ కూడా అతడిని ఆనవాలు పట్టలేక పోయింది' తలపాగా తీసి వేసి సూర్యా నవ్వితే—లలితా, సరస్వతమ్మా ఆశ్చర్య పడి, సంతోషించారు.

మరుసటి రోజు లలిత కొడుకు పుట్టిన రోజు పండగ అవడం వలన సమయానికి వాడి మేనమామ వచ్చినందుకు లలిత ఎంతో సంతోషించింది. ఆ పండగకని కిట్టూవయ్యర్, సూర్యా యొక్క అన్న గంగాధరన్, తమ్ముడు ముండు అందరూ వచ్చారు. చాల కాలం తర్వాత వచ్చిన సూర్యా మీద అందరూ వాత్సల్యం వర్షించారు. గంగాధరన్ కూడా "ఒరేయ్ తమ్ముడూ! అయిదేళ్ల పాటు ఊళ్ళ వెంబడి తిరిగి కష్టపడిందిచాలురా...నువ్వు రాజంపేటకు వచ్చి నాకు ఏమేమి సంస్కరణలు చేయాలని వుందో చేయి—" అన్నాడు.

లలిత భర్త పట్టాభిరామన్ చెరసాలకు వెళ్లి వచ్చాడని అదివరకే సూర్యాకు తెలుసు. "అయినా పట్టాభి తెగించి ఇట్లాటి పని చేస్తాడని అనుకోలేదు" అన్నాడు సూర్యా.

అందుకు లలిత—"అయితే ఒకటుంది సూర్యా! ఈయన ఇతరులవలె కోర్టులు తగలబెట్టో, రైలు పట్టాలు ఊడబీకో, వంతెన పడగొట్టో చెరసాలకు వెళ్లలేదు. పోయిన అక్టోబర్ రెండవ తారీకున గాంధీ జయంతినాడు గాంధీ గారిని చెరసాలలో వుంచడాన్ని సభలో విమర్శిస్తూ ప్రసంగించారు. అందుకని ఆయన్ను అరెస్టు చేసి ఖైదు చేశారు." అని గర్వంగా చెప్పుకుంది.

పట్టాభి గదిని శుభ్రంగా వుంచింది లలిత. ఆ గది నిప్పుడు సూర్యా ఆక్రమించాడు. లలిత అత్తగారు చనిపోయి రెండేళ్లయింది. ఇప్పుడు పెత్తనం అంతా లలితదే అని తెలిసింది. ఆతర్వాత ఇద్దరూ సీత గురించి మాట్లాడుకున్నారు. సీత పడుతున్న కష్టాల గురించి సూర్యా చెబుతే బాధ పడింది లలిత.

"నీ అదృష్టం గురించి అమ్మ చెపుతుంటే అది నిజమే...పట్టాభికి బదులుగా ఆమూర్ఖుడి కిచ్చి వుంటే ఎంత కష్టపడే దానివీ...సీత పడుతున్న కష్టాలన్నీ వింటే గుండె పగిలి పోతుంది" అన్నాడు సూర్య.

"అవునన్నయ్యా! ఢిల్లీ వెళ్లిన మొదటి రోజుల్లో సీత చాల ఉత్సాహంగా ఉత్తరాలు రాసేది. రాను రాను వుత్తరాలే లేవు. పిల్లను కూడా అత్తగారితో బాటు మద్రాసు పంపిందట. ఎందుకోఁ?..." అని అడిగింది లలిత.

"విషయాలు తర్వాత చెబుతాను. మొత్తం మీద సీత జీవితం నరకమయింది" అని నిట్టూర్చాడు సూర్యా.

ఆ తర్వాత ఎదురింటి వారి గురించి అడిగాడు.

"రెండు రోజుల క్రిందే వీరి స్నేహితుడు అమర్‌నాథ్‌గారూ, అతడి భార్య చిత్రా కలకత్తా నుండి వచ్చారు. ముసలి వాళ్లిద్దరికీ మధ్య మాటలు లేవు. అయినా రేపు అబ్బాయి పుట్టిన రోజుకు రమ్మని పిలిచి వద్దామనుకుంటున్నాను. ఈ వెర్రితనం ఈయనకు నచ్చలేదు. తండ్రి కోసమని వూరుకున్నారు" అంది లలిత.

"అలాగే పిలువు లలితా! నేనూ ఎదురింటికి వెళ్లివద్దామనుకుంటున్నాను" అన్నాడు సూర్యా.

ఆ రాత్రి సూర్యా ఎదురింటికి వెళితే—"జయము! జయము! స్వతంత్ర వీరుడు సూర్యాకు సుస్వాగతము" అని పరాచికాలాడుతూ చేతులు పట్టి తీసుకు వెళ్లాడు అమర్‌నాథ్.

దామోదరం పిళ్లై సూర్యా నొక్కసారి తేరిపార చూచి—"ఏమోయ్, సూర్యనారాయణ అయ్యర్! తమరెక్కడో ఆఫ్ఘనిస్తాన్‌లో వున్నారన్నారు; మాస్కోలో కనబడ్డారని చెప్పుకున్నారు; తర్వాత సైగాన్‌కు వచ్చారని విన్నాను. చివరకు మన వూళ్లోనే తేలారే? ఇండియా స్వాతంత్ర్యం ఎక్కడుంది? ఎంత దాక తీసుకు వచ్చారు?" అన్నారు.

"మామా! నా గురించి ఇంత జ్ఞాపకం పెట్టుకుని అడిగారే చాల సంతోషం...ఇండియా స్వాతంత్ర్యం ఇండియాలోనే వుంది. ఇండియా స్వాతంత్ర్యం కోసం ఆఫ్ఘనిస్తాన్ వెళ్లడం ఎందుకు?" అన్నాడు సూర్యా.

"అట్లాగనకోయ్! నేతాజీ మలయాలో స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని స్థాపించారట కదా! జయప్రకాశ్ నారాయణ్ నేపాల్‌లో, టిబెట్‌లో భారత దేశ స్వాతంత్ర్యాన్ని నెలకొల్పుతారని అంటున్నారు. ఇవన్నీ అబద్ధమా?"

"నిజానికి భారత దేశ స్వాతంత్ర్యాన్ని అహ్మద్ నగర్ చెరసాలలో గాంధీజీ, నెహ్రూ మొదలైన నాయకులు స్థాపిస్తున్నారు" అన్నాడు అమర్ నాథ్.

"భారత దేశ స్వాతంత్ర్యం ఎట్లా వస్తుందంటావు?" అని అడిగారు పిళ్లై.

"చెప్పడానికి వీలులేదు మామా! ఎట్లాగో ఒకలాగు వచ్చి తీరుతుంది. కాని అది వచ్చినప్పుడు అందుకు మన ప్రజలు సిద్ధంగా వుండాలి. వారిని అందుకు. ఆర్హులుగా తయారు చేయడమే మన ప్రస్తుత కర్తవ్యం."

'స్వాతంత్ర్యానికి మన వాళ్లను తయారు చేయాలంటే ఒకటే దారి, నూర్యా! జపాన్ వాళ్లు మన దేశాన్ని స్వాధీన పరచుకుని పదేళ్లు పాటు రాజ్యం చేయాలి. పిలకలన్నిటినీ పట్టుకుని ఒక ఊపు ఊపాలి; కుల మత వ్యత్యాసాలు రూపు మాపాలి. పప్పూ, బియ్యం మెక్కే వాళ్లను కొరడాతో కొట్టి మాంసమూ, చేపలూ తినిపించాలి. అప్పుడు మన వాళ్లు స్వాతంత్ర్యానికి అర్హులవుతారు" అన్నారు పిళ్లై.

"నేనంగీకరించను. జపాన్ పరిపాలన పదేళ్లు కొరితే వంద యూభై ఏళ్లుండవచ్చును. నేతాజీకి సాయం చేసి భారతదేశ స్వాతంత్ర్యానికి దోహదం చేయడమే జపానీయుల ఆశయం."

"నేతాజీ సైన్యంలో ఇప్పుడు యూభై వేల మంది చేరారట. జపాన్ వాళ్లందరికీ ఆయుధా లిచ్చిందట" అన్నాడు అమర్ నాథ్.

"యూభై వేలు కాకపోతే అయిదు కోట్ల మందిని చేరనివ్వండి. ఫరవా లేదు. కాని ఎప్పుడో నేతాజీ వస్తాడని ఇక్కడ కొందరు ప్రబుద్ధులు 'సాబొటాజ్' (విధ్వంసక) పనులలోకి దిగుతున్నారు. అది తెలివి తక్కువతనం.

జపాన్ వాళ్లొచ్చేదాక ఆగకూడదా? ఈలోగా రైళ్లు కూల్చడం, వంతెనలు ధ్వంసం చేయడం, లాటివి చేస్తున్నారే వీటి వలన ప్రభుత్వానికి ద్రోహమే కాదు, ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. నేను గనుక జడ్జి అయితే అట్లాంటి పనులు చేసేవారికి మరణ శిక్ష వేసేవాడిని.''

ఇట్లా దామోదరంపిళ్లై చెబుతుండగా సూర్యా మొహం నల్లబడింది. అది అమర్‌నాథ్ గమనించాడు; అమర్‌నాథ్ గమనించాడని సూర్యా గ్రహించాడు.

మరుసటి రోజు పుట్టిన రోజు పండగ పరమోత్సాహంతో చేసుకున్నారు. లలిత మామగారయిన ఆత్మనాథయ్యరూ ఎదురింటి పిళ్లైగారితో మాటలు మళ్లీ మొదలవడం గురించి సంతోషించారు. అందరూ ''సూర్యా! సూర్యా!'' అనడమంతా గమనించి లలిత కూతురు పట్టు మామయ్యతో నేస్తం కట్టి, అతడి ఒళ్లో ఎక్కి కూచుంది.

వీటన్నిటి కారణంగా చాల రోజుల తర్వాత ఎంతో ఆనందంతో, ఉత్సాహంతో వుండగా వీధిలో నుండి ''ఈ ఇంట్లో కె. యస్. నారాయణ్ అని ఎవరయినా వున్నారా?'' అని ఎవరో అడగడం వినిపించింది. వీధిలోకి వెళ్లి చూస్తే తపాలా బంట్రోతు బాలకృష్ణన్ నిల్చుని వున్నాడు ''ఏమోయ్ బాలకృష్ణా! బాగున్నావా? నేను జ్ఞాపకం వున్నానా?'' అని సూర్యా అడిగాడు.

''ఓహో, మీరా సార్! మీరే వనుకున్నాను లెండి. ఈ వుత్తరం మీకే నేమో చూడండి'' అని ఒక వుత్తరం ఇచ్చాడు.

చిరునామా తారిణి చేతి రాతలో వుండడం చూచి ఆతురతతో దాని వందుకున్న సూర్యా—''అవును. నాదే'' నన్నాడు.

''లలితమ్మకూ ఒక వుత్తరం వచ్చింది. ఈ వుత్తరాలన్నీ తెరిచి చూసినవేనా?'' అన్నాడు బాలకృష్ణన్ చిరునవ్వుతో.

''లేదు'' అన్నాడు సూర్యా.

"తెరిచి చూసి వున్నా తెరిచిన వాడిని నేను కాదండోయ్!" అని చెప్పి నడవసాగాడు బాలకృష్ణన్.

"ఇదేవిటి, బాలకృష్ణన్ ఇట్లా వాగుతాడేవిటి?" అని ఆడిగాడు సూర్యా.

"వాడు వాగడం లేదన్నయ్యా! మనకు వచ్చిన వుత్తరాలను 'సెన్సార్' చేసి వుంటారని చెబుతున్నాడు. అది వాడికి ఒక్కడికే తెలుసు. మూడు చెరసాలకు వెళ్లినప్పటి నుండి ఇక్కడికి వచ్చే వుత్తరాలన్నిటినీ 'సెన్సార్' చేసిగాని పంపడం లేదు" అంది లలిత.

కాస్తకలవరంతో సూర్యా తనకు వచ్చిన వుత్తరాన్ని చూచుకున్నాడు. అందులో పోలీసువారికుపయోగపడే సమాచారాలేమీ లేవు. కాని అంతకన్న ఎక్కువగా బాధించగల విషయం వుంది. "ఆత్తయ్య కూతురి ఆరోగ్యం మునుపటికన్న అధ్వాన్నంగా వుంది. దేహము, మనసు - రెండూ బాగులేవు. మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటూంది. వీలయినంత త్వరగా రండి. వెంటనే మీరు రాకపోతే ఏదో వైపరీత్యానికి దారి తీయవచ్చును - చరిత్ర" అని ముక్తసరిగా రాసింది తారిణి. వాళ్ల ఉద్యమంలో తారిణికి 'చరిత్ర' అనీ, సూర్యాకు 'దూత' అనీ మారు పేర్లు.

ఈ వుత్తరం అతడికి ఆందోళన కల్గించింది. దక్షిణ దేశానికి ఏపని మీద వచ్చాడో అదింకా పూర్తి కాలేదు. అయినా వెనక్కు వెళ్లక తప్పదు. కెథవ గొడవ! బలే అత్త కూతురు ఏర్పడింది. దానికి తోడు ఆమె మొగుడు. అటూటి మనిషి కూడా వుంటాడా?

ఉదయం 10-30 గంటలకు దామోదరంపిళ్లై గదిలో ఫోన్ మోగింది. అందుకున్నా డాయన. "పోలీసు స్టేషనా? ఏమిటి విశేషం? ఎదురింట్లోనా? నేను ఆ ఇంటివైపు తొంగి కూడా చూడను కదా! నాకేమీ తెలియదు. రండి రండి! అన్ని వింతలూ మా ఇంటి నుండే చూస్తుంటాను" అని రిసీవర్ క్రింద పెట్టి కొడుకును పిలిచారు.

'అమర్‌నాథ్! నీ స్నేహితుడు సూర్యా గురించి ఊరూరి పోలీసులకేదో కబురందినట్లుంది. డి. ఎస్. పి. ఇప్పుడు నన్నడిగాడు. నాకూ ఎదురింటికో జన్మ విరోధం కదా అని చెప్పి తప్పించుకున్నాను. ఇంక కాస్సేపట్లో వాళ్ళక్కడకు రస్తారు. మనం అక్కడ వుంటే డి. ఎస్. పి. తో చెప్పించి అసత్యమని బుజువు అవుతుంది కదా?" అన్నారు పిల్లై.

'నాన్నా, ఏమిటి చెయ్యడం? సూర్యాకు హెచ్చరిక చేయవద్దా?'

"అది నీ ఇష్టం. ఈ ఇంట్లో నాకెంత బాధ్యత వుందో నీకూ అంతే వుంది. నీకేది ఉచితమని తోస్తే అది చేయి. నన్నడగకు. ఏది చేసినా వెంటనే చేయి. తెలిసిందా?"

మరు నిముషం అమర్‌నాథ్ ఎదురింట్లో- వెళ్లాడు. ఐదు నిముషాలలో సూర్యాను తీసుకొచ్చాడు. అతడిని మేడ మీద, వెనక వైపు గదిలో వుంచి తాళం వేశాడు.

* * *

ఆతర్వాత జరిగిన కోలాహలం, ఘోరం అంతా తలచుకుంటే సూర్యా రక్తం ఉతకుతలాడింది. పోలీసుల లాఠీలు ఆత్మనాథయ్యరింట్లో స్వైరవిహారం చేస్తుంటే తాను మాత్రం ఎదురింట్లో మేడ మీద గదిలో దాగుకొని వుండడం గురించి అనుకుంటే చాలు ఆవేశమూ ఏడుపూ వస్తున్నాయి.

ఆ రాత్రి అమర్‌నాథ్ సూర్యాను బండిలో పిలుచుకుని వెళ్లి ఒక పల్లెటూరి స్టేషన్‌లో రైలెక్కించాడు. సి. ఐ. డి. వాళ్లకు చిక్కకుండా వుండాలని సన్యాసి వేషం వేసుకుని మద్రాసు చేరిన సూర్యా కామాక్షమ్మాళ్‌ను కలుసుకుని, ఆతర్వాత తారిణి సూచించినట్లుగా ఢిల్లీ వచ్చి చేరాడు.

ఇప్పుడు తారిణిని ఎక్కడ కలవడం అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు సూర్యా.

ఎవరినో, దేనినో అతడి కళ్లు వెతుకుతున్నాయి. కాని ఫలితం దక్కలేదని అతడి మొహంలోని నిరాశ చెబుతూంది.

సూర్యా వెండి బజారును దాటి జుమ్మా మసీదును చేరాడు. మసీదు మెట్ల నెక్కసాగాడు. ముప్పాతిక మెట్లు ఎక్కాక ఆగి, ఆ చుట్టుప్రక్కల వీధులను కలయజూచాడు. దూరంగా వున్న ఎర్ర కోట వైపు చూచాడు. కోటకూ, మసీదుకూ మధ్య వున్న చోట ఒకప్పుడు బాగా జనసమ్మర్దంగా వుండేది; ఇళ్లు బాగా వుండేవి. కాని బ్రిటీషు ఫిరంగులు వాటన్నిటిని కాల్చి నేలమట్టం చేశాయి; ఇప్పుడదంతా ఒక ఖాళీ స్థలం. జుమ్మా మసీదు కూడా ఒకప్పుడు బ్రిటీషు సేనల ఆధిపత్యంలో వుండేది. తైమూరు, నాదిర్ షా ఆటవికులు, పాత కాలపు రాక్షసులు. కాని ఈశతాబ్దపు వారు, నాగరికులు, విద్యావంతులు అనదగిన బ్రిటీషు వారీ ఢిల్లీ నగరంలో చేసిన అక్రమాల గురించి ఏమని చెప్పాలి?

హిందువులు ముస్లిములు తమ స్వల్ప భేదాలను విస్మరించి బ్రిటీషువారిని భారత దేశం నుండి తరిమి వేసే కాలం వస్తుందా? పాత ఢిల్లీలో, క్రొత్త ఢిల్లీలో భారత స్వాతంత్ర్య పతాక ఎగిరే సుదినం వస్తుందా? ఆ సుదినాన్ని చూచే భాగ్యం తనకు కలుగుతుందా?

ఈ విధంగా సూర్యా ఆనుకుంటుండగా ఎవరో తన ఎడమ చేతిని గట్టిగా పట్టుకున్నట్లనిపించి నిశ్చేష్టుడయి, తిరిగి చూశాడు.

ఇనుప హస్తాలతో ఆ విధంగా తన జబ్బను పట్టుకున్నది ఆజానుబాహుడయిన ఒక పోలీసువాడని చూశాడు సూర్యా. ఒక్క క్షణంలో అతడి లోలోపల వెయ్యి ఆలోచనలు మెదిలాయి. ఇంత పెద్ద దేశమంతా ఎవరికీ చిక్కకుండా తిరిగి వచ్చి, ఈ ఢిల్లీ సోమరిపోతు పోలీసుల చేతికి చిక్కడమా? ఇదేమీ బయిటికి కనపడనివ్వకుండా ఆ పోలీసును దబాయించాడు. "ఎవరు

నువ్వు? నా చేతి నెందుకు పట్టుకున్నావు?'' పోలీసు—''ఇన్స్పెక్టర్ సాబ్ మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నాడు'' అన్నాడు. ''మీ ఇన్స్పెక్టర్ సాహిబ్‌ను నే నెరగను. ఆయనకు నాతో ఏం పని?'' అన్నాడు. అందుకు పోలీసు ''ఆయన్ను చూస్తే అట్లా అనరు. త్వరగా పదండి!'' అన్నాడు.

అతడి స్వరమూ, అంతకన్న ఆ పోలీసు కనుబొమల ఎగరవేత, చిరు నవ్వు—ఇవి సూర్యాను తికమక పెట్టాయి. ఎట్లాగయినా వాడితో బాటు వెళ్లడమే మంచిదని—''పోదాం పద! ఎక్కడున్నాడు మీ ఇన్స్పెక్టర్?'' అని అడిగాడు. ''మాట్లాడకుండా రా! అయితే నన్నంటి పెట్టుకుని రాకు. కాస్త ఎడంగా నడిచి రా! ఇన్స్పెక్టర్ సాబ్‌ను చూపిస్తాను'' అన్నాడా పోలీసువాడు; అని నడవసాగాడు.

ఇప్పుడు 'గాంధీ మైదానం' అని పిలువబడే మైదానాన్ని సమీపించగానే పోలీసు వెనక్కు తిరిగి చూశాడు. సూర్యా వాడిని సమీపించాడు. దూరంగా వున్న ఒక చెట్టును చూపించి పోలీసు—''ఆ చెట్టు వెనకాల వున్నారు—వెళ్లండి'' అని చెప్పి చిరునవ్వు నవ్వాడు.

ఆశ్చర్యంతో వాడు చెప్పినవైపు నసిచాడు సూర్యా. ఆ చెట్టు వెనకాల ఒక మహిళ కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటూంది. అతడి అడుగుల సవ్వడి విని ఆమె తలెత్తి చూచింది. ఆమె తారిణి అని తెలిసి మహదాశ్చర్యానికి గురి అయ్యాడు సూర్యా.

''స్వాగతం, స్వాగతం! వీరుడు సూర్యాగారికి సుస్వాగతం!'' అంది తారిణి.

''ఓహో! ఇన్స్పెక్టర్ సాబ్ మీరేనా? ఆ పోలీసు నా చేతిని పట్టుకోగానే అదిరి పోయాను!'' అంటూ సూర్యా ఆమె ఎదుట కూర్చున్నాడు; ''మీ సామర్థ్యం నాకు తెలియనిది కాదు గాని ఒక పోలీసువాడినే ఇట్లా బలలో వేసుకుని వుంటారని మాత్రం అనుకోలేదు.''

''వెళ్లిన పనులన్నీ అయ్యాయా?'' అని అడిగింది తారిణి.

"ఎట్లా అవుతాయి? ఈలోగా కొంపలంటుకు పోతున్నాయంటూ తమ వుత్తరం వచ్చిందిగా! ఆ వుత్తరం కారణంగా దేవ పట్టణంలో జరిగిన వైపరీత్యాలు వింటే ఆశ్చర్య పోతావు...అంతలో ఏమయిపోయింది సీతకు? సీత అంటే బలే కోపం వస్తూంది. ఒక వ్యక్తి కోసం ముఖ్యమైన జాతీయ కార్యాలకు ఆటంకం కలగడమంటే..."

"నేనట్లా అనుకోవడం లేదు. గోపురాన్ని విగ్రహం మోయడం లేదు కదా! అట్లాగే జాతీయ కార్యభారమంతా మన భుజస్కంధాల మీదే లేదు. అన్నీ దైవనిర్ణయం ప్రకారం జరుగుతాయి. దేశాన్ని కాపాడ యత్నించడం కన్న మనకు తెలిసిన ఒక వ్యక్తి కష్టాన్ని నివారించడం వాంఛనీయమని నా అభిప్రాయం. సీత కష్టాలు తొలగితే చాలనిపిస్తూంది" అంది కారిణి.

"సీత మీద మీకింత కరుణ కలగడానికి కారణం ఏమిటి?"

"ఒకరి మీద ప్రేమ ఏర్పడడానికి కారణం వుంటుందా ఏమిటి?"

"వుండనక్కర్లేదు, నిజమే! అట్లా ప్రేమకు కారణం వుండనక్కర్లేదనే కాబోలు ఆడవాళ్లు ఒకటో రకం చవటలను ప్రేమిస్తుంటారు!"

"మీరు చెబుతున్నది నాకర్థం కావడం లేదు. అడవాళ్లు అనర్హులని మాత్రమే ప్రేమిస్తారన్నది మీ మతమయితే నేనందుకు అంగీకరించను. స్త్రీలు ప్రేమించదగిన యోగ్యులు కూడా వున్నారు. వారిలో ఒకరిని నే నెరుగుదును" అని దూరంగా చూచింది కారిణి.

"అట్లాంటి ప్రత్యేకమయిన యోగ్యత కలవాడెవడో నాకు తెలుసు. అతడి పేరు సౌందరరాఘవన్!" అని నిష్ఠూరంగా అన్నాడు సూర్యా.

"రాఘవన్ గురించి నేను మాట్లాడలేదు. అయినా ఆయనను కూడా అయోగ్యుడని నేను అనను. ఆయన కొన్ని పొరబాట్లు చేసి వుండవచ్చును. కాని సీతంటే ఆయినకు అనురాగం వుందని నాకు తెలుసు. సీత అనవసరమైన అనుమానాలతో ఆయన అనురాగాన్ని విషపూరితం చేస్తుంది."

'పోనీ! సీత పట్ల రాఘవన్ అనురాగాన్ని మీరు తెలుసుకున్నారు కదా?"

"కొన్ని సందర్భాలలో ఒక వస్తువు స్వరూపాన్ని, గుణాన్ని దాని చగ్గరవున్న వారికన్న దూరంగా వున్నవారు బాగా గ్రహించగలరు. అందుకనే రాఘవన్ అంతరంగాన్ని సీతకన్న బాగా నేను తెలుసుకోగలిగాను."

"ఏమో ఎవరికి తెలుసు! రాఘవన్ అంతరంగానికి సీతకన్న మీరు చగ్గరగా వుండవచ్చు కదా?"

"సూర్యా! మీకేదో వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. ఇట్లా మాట్లాడే టట్లయితే నేను మీతో మాట్లాడనిచ్చగించను. మీరు లేచి పోవచ్చును."

"ఏం, మీరీ మైదానాన్ని గుత్తక తీసుకున్నారా?"

"సరే, నేనే వెళ్తాను లెండి!" అని తారిణి లేచింది.

తత్తర పాటుతో సూర్యా "పొరబాటయింది! నా మాటలన్నీ ఉప సంహరించుకుంటున్నాను. కూర్చోండి. వెళ్లిపోకండి" అన్నాడు.

తారిణి మళ్లీ కూచుంది. "హఠాత్తుగా మీలో ఇంత మార్పెట్లా వచ్చిందో అర్థం కావడం లేదు. ఎవరో ఏదో చెప్పి మీ మనసును పాడు చేశారు. సీతను చూచి ఇటు వస్తున్నారా?"

"లేదు. రైలుస్టేషన్ నుండి తిన్నగా ఇటు వచ్చాను. నాగదికి కూడా పోలేదు. సీత ఎట్లా వుంది? ఆమె విషయంలో నేనేమి చేయాలి?"

"ఆమె మనసులో ఏదో ఒక విషం ప్రవేశించింది. మీరెట్లాగయినా అదేమిటో తెలుసుకోవాలి. కొన్ని నాళ్లపాటు ఆమెను వేరెక్కడికయినా పంపితే బాగుంటుందేమో?"

"ఆమె ఏవూరు వెళ్తుంది? వెళ్లడానికి ఆమెకొక చోటంటూ లేదే? నే చెబుతా వినండి తారిణీ! సీత సుఖపడడానికి ఒకటే దారి వుంది. అది రాఘవన్‌కు విడాకులివ్వడం. కాని హిందూ ధర్మశాస్త్రమూ బ్రిటీష్ చట్టమూ అందుకు సమ్మతించవు. కనుక కుళ్ళి కుళ్ళి చావవలసిందే!"

"నేనూ అప్పు డప్పు డనుకుంటూ వుంటాను – సీత విడాకు లిచ్చేసి మిమ్మల్ని వివాహం చేసుకుంటే సుఖపడుతుంది అని__"

"కాదు. మీ ఆలోచన సరికాదు. ఆమెపట్ల నా అభిమానం అట్లాంటిది కాదు. మా అత్తయ్య మీద నాకున్న అభిమానం ఆమె కూతురు క్షేమం పట్ల నన్నాసక్తుడిని చేస్తూందంతే! ఆమె ఆశయాలకు నా ఆశయాలకు పొంతన కుదరదు. సీత శీతాకోక చిలుక వంటిది. పట్టు చీరలు, పటా టోపాలు, పార్టీలు ఇవే ఆమె ప్రాణాలు."

"సీతకు పుట్టుకలో వచ్చిన గుణాలు కావుగా ఇవి; తర్వాత అలవడినవే కద?...అవన్నీ ఎందుకు గాని, మీరు ముందు వెళ్ళి ఆమె పరిస్థితి ఏమిటో తెలుసుకు రండి. నేనామెను చూచి ఇరవై రోజులయింది. ఎట్లా వుందోనని దిగులుగా వుంది."

"అట్లాగే కానివ్వండి. రేపు ఇక్కడే కలుద్దామా?"

"వద్దు. చుట్టూ పరికించండి; ఎంత మంది మనలను గమనిస్తున్నారో తెలియగలదు. మన 'చోట' కలుద్దాం. మీ అనుభవాలను వినడానికి మన మిత్రులంతా ఆసక్తులై వున్నారు. రేపీపాటికి గంటస్తంభం దగ్గరకు రండి. పోలీసువాడు ఇందూలాల్ మిమ్మల్ని 'చోటు'కు తీసుకు వస్తాడు. మీరిప్పుడు నాతో బాటు రాకండి. నేనా పోలీసు దగ్గరకు వెళ్ళేదాక ఈ చెట్టు క్రిందే కూర్చుని వుండడం మంచిది."

ఇట్లా చెప్పి తారిణి లేచి వెళ్ళింది. సూర్యా అక్కడ కూర్చునే తారిణీ పోలీసువాడూ కనుమరుగయ్యేదాక చూశాడు.

ఇక లేద్దాం అనుకుంటుండగా, ఇంత సేపటినుంచి కొద్ది దూరంలో కూర్చుని వున్న ముగ్గురు మనుష్యులు తనవైపు వస్తుండడం కనపడింది. వాళ్లు ముగ్గురూ సూర్యా చుట్టూ కూర్చున్నారు.

"మనదేవూరు తమ్ముడూ?" అన్నాడు వారిలో ఒక్కడు.

"నాది మద్రాసు" అన్నాడు సూర్యా.

"ఇక్కడొక అమ్మాయి కూర్చుందే ఆమె నీకేమవుతుంది?" అని ఇంకొకడడిగాడు.

"నా స్నేహితురాలు!"

"ఆ! స్నేహితురాలు!!" అన్నారు వాళ్లు ముగ్గురూ.

కాస్సేపు ఎవరూ మాట్లాడలేదు. సూర్యా అడిగాడు: "మీకేమి కావాలి? ఎందుకడుగుతున్నారు?"

ముగ్గురిలో ఒకడు ఇద్దరినీ చూచి - "చెప్పేద్దామా?" అని అడిగాడు.

"చెప్పేద్దామూ?" అని వాళ్లూ అన్నారు.

మొదటి వ్యక్తి సూర్యాను చూచి "తమ్ముడూ! నీకు డబ్బు కావాలా?" అని అడిగాడు.

"ఎంత!" అని అడిగాడు సూర్యా.

మొదటి వ్యక్తి మిగతా ఇద్దరినీ చూచి "ఎంతని అడుగుతున్నాడు? చెప్పనా?" అన్నాడు.

"చెప్పు!" అన్నారు.

"తమ్ముడూ, లక్ష రూపాయలు కావాలా? ఒక లక్ష రూపాయలు!" అన్నాడు మొదటివాడు.

సూర్యా దిగ్భ్రమ చెందాడు; కాస్త తమాయించుకుని అడిగాడు: "నిజం నోట్లా? దొంగ నోట్లా?"

"ఆహా! దొంగ నోట్లు!" అని ముగ్గురూ నవ్వారు.

తర్వాత మొదటి వ్యక్తి - "తమ్ముడూ! నిజం డబ్బు! ఒక లక్ష రూపాయల నోట్లు వద్దంటే బంగారం ఇస్తాము" అన్నాడు.

"ఇవ్వండి!" అన్నాడు సూర్యా.

"ఒక లక్ష రూపాయలు ఊరికే వస్తాయా? మాకొక సాయం చేస్తేనే ఇస్తాము."

"ఏమి సాయం?" అన్నాడు సూర్యా.

"ఇంతకు ముందు నువ్వు మాట్లాడుతుంటివే, ఆ అమ్మాయిని తీసుకరమ్మని మాకు పైనుండి ఆజ్ఞ వచ్చింది. అందుకు నువ్వు సాయపడితే ఒక లక్ష రూపాయలు రొక్కం లభించగలదు..."

ఇట్లాంటిదే ఏదో వుంటుందని ఊహించాడు సూర్యా కాని ఇది విన గానే విపరీతమైన కోపం వచ్చింది. కాని కోపాన్ని అణచుకున్నాడు. కోపంవలన లాభం ఏమిటి? వాళ్ళ ముగ్గురూ గూండాల్లా వున్నారు. వాళ్ళతో పేచీ పెట్టుకుంటే అనవసరంగా వ్యవహారం చెడుతుంది. కాస్సేపు ఆలోచిస్తున్నట్లు నటించి—"రెండురోజులు టైమివ్వండి. ఆలోచించి చెబుతాను" అన్నాడు.

"ఎక్కడ, ఎప్పుడు కలుద్దాం?"

"ఇదే చోట, ఇదే సమయానికి ఎల్లుండి కలుద్దాం." అన్నాడు సూర్యా.

"నీ బస ఎక్కడ?"

"ఇప్పటికి బస అంటూ లేదు. ఇకపై వెతుక్కోవాలి," అంటూ సూర్యా లేచాడు. వాళ్ళూ లేచారు.

ఆ తర్వాక సూర్యా ఎక్కడికి వెళ్ళినా కాస్త వెనకాలవాళ్లూ అతడి వెంటే వచ్చారు. సూర్యా తనకు పనిలేని చోటులన్నిటికీ కూడా వెళ్లి వెళ్లి వాళ్లని తప్పించుకునే సరికి రాత్రి చాల సేపయింది. అయినా సరే ఆ రాత్రి ఎట్లాగయినా సీతను చూచి తీరాలని అనుకున్నాడు.

27

సీత తన ఇంట్లో, గదిలో కూర్చుని వుంది. గోడమీద గడియారం 'టిక్ టిక్' మంటూంది. సీత హృదయమూ కొట్టుకుంటూంది.

పదకొండున్నర అయింది; తన ఆయుస్సులో ఇంక అరగంటే మిగిలివుంది.

ఈ అరగంటలో చేయాల్సిన పనులెన్నో వున్నాయి.

పాపకో వుత్తరం రాయాలి; ఈయనకూ నాలుగు పంక్తులు రాయాలి కదా.

కాని ఎంత ప్రయత్నించినా ఏమీ రాయడానికి వీల్లేక పోతున్నదే, ఏమిటి చేయడం?

సరిగ్గా పన్నెండు గంటలకు రివాల్వర్‌తో తన కష్టాలను అంతం చేసుకోవాలని నిశ్చయించుకుంది సీత.

తొమ్మిదింటికే అన్ని పనులూ అలంకరించుకుంది. చస్తూ చస్తూ అవ అక్షరాంగా చావడం ఎందుకు?

వాసంతికి మొదట వుత్తరం రాద్దామనుకుంది. పాపనుగురించి అనుకుంటే ఏడుపు ముంచుకొస్తుంది. దానిని చూడకుండానే చనిపోతున్నామే అన్న తలపు రాగానే హృదయం పగిలిపోతున్నది. వాసంతికి ఏమిటి రాయడం?

మొదట లలితకు రాద్దామని మొదలు పెట్టింది. "నా ప్రాణసఖి లలితకు" అని రాసిందంతే. ఆపైన ఇంకేమీ తోచలేదు. లలితను గురించి అనుకోగానే పాతజ్ఞాపకాలన్ని వరదలా ముంచుకొస్తున్నాయి. ఆహా! పెళ్ళికి ముందు లలితా, తానూ కలిసి రాజంపేటలో ఆడి, పాడి, గంతులువేసి, ఖుబుర్లాడుకున్న రోజులు ఎంత ఆనందకరమైనవి! ఆ తర్వాత ఈయన లలితను పెళ్ళి చూపులు చూడడానికి వచ్చి తన్నే తప్ప : పెళ్ళాడనన్నప్పుడు కలిగిన ఆనందం ఎక్కడ? నేడనుభవిస్తున్న నరకవేదన ఎక్కడ?

లలితకు ఇప్పుడేమి రాసినా ఏమి ప్రయోజనం? సంతోషంగా వున్న వాళ్ళకు తన దుఃఖం గురించి రాయడం ఎందుకు? ఆమె ఒకవేళ జాలిపడినా దానివలన తన కొరిగేదేమిటి!

ఈయనకు రాద్దాం అనుకునేసరికే ఎదబద్దలయి పోతున్నది. ఏమని రాయడం?

"ఈ భూప్రపంచంమీద మీరు తప్ప నాకు వేరేగతిలేదు. నన్ను అసహ్యించుకున్నారు మీరు. ఇంక నేను జీవించి ఏం లాభం?"—అని రాయడమా!

"ఎప్పుడూ 'ఆఘూరించు ఘో!,' 'తగలడు ఘో' అని చీదరించుకునే వారుకదా, ఇదిగో అట్లాగే పోతున్నాను!' అని రాయడమా?

సీత కళ్ళనుండి బొటబొటమని అశ్రువులు కారాయి.

రాఘవన్ తన్నెన్నో విధాల కష్ట పెట్టినా ఆమె అంతగా బాధ పడలేదు. కాని చోటి మాటికి "తగలడు ఘో!" తగలడు ఘో! అని చీదరించుకోవడం ఆమె హృదయాన్ని ఆరని పుండుగా చేసింది. ఎవరున్నారు తన్ను కారమ్మని ఆదుకోవడానికి? తల్లి లేదు. తండ్రి ఎక్కడున్నాడో తెలియదు. ఘో, ఘో అంటే చచ్చిపోవడం తప్ప ఇంకెక్కడికి పోవడం?

ఈయన తుపాకి కొనివుంచడం మంచిదయింది. అందుకని కృతజ్ఞతో చెప్పాలి. ఉత్తరంలో కృతజ్ఞతలు తెలుపుతేనో?

అయ్యో, ఈ గడియారం ఇంత తొందరగా నడుస్తున్నదే! ఈ గొండె ఇట్లా కొట్టుకుంటున్నదేమి!

ఇదిగో పన్నెండు కావస్తున్నది. ఇంకా కొన్ని నిముషాలే వున్నాయి.

పన్నెండున్నర పాటికి వస్తారాయన. ఆలోగా ముగించాలి పని. ఆయన వుండగా చేస్తే ఆయనమీద నింద పడుతుంది అకారణంగా...వాసంతి తల్లి లేని పిల్లకావచ్చు, తండ్రియినా బాగుండాలికదా?

ఆ రెండు నిముషాలూ అయి పోయాయి. గడియారం 'టంగ్, టంగ్' మని మోగసాగింది.

గంటలను మనసులోనే లెక్క పెడుతూ వచ్చిన సీత, పన్నెండుసార్లు గడియారం మ్రోగాక, రివాల్వర్‌ని చేతిలోకి తీసుకోవాలి—అనుకుంది.

అప్పుడు ఆ గది దగ్గరగా ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది. సీత హృదయ స్పందన తటాలున ఆగింది. చెయ్యి కదలలేదు.

ఎవరు వస్తున్నారు? ఆయనేనా? త్వరగా వచ్చేశారా?

రివాల్వర్ ని చూడగానే తన ఉద్దేశం ఆయన ఊహిస్తారా? తనమనో వేదనను తెలుసుకుంటారా? తనను క్షమించమని అడుగుతారా?

పాదాల చప్పుడు బాగా దగ్గరయ్యాకకూడ సీత వెనుదిరిగి చూడలేదు. ఎందుకు చూడాలి?

ఆ వచ్చిన వ్యక్తి ఆమె వెనుకగా వచ్చి నిలబడ్డాడు. చటుక్కున రివాల్వర్ను చేతిలోకి తీసుకున్నాడు. "సీతా!" అన్నాడు.

గొంతు రాఘవన్ది కాదని తెలిసి ఆర్చర్యంతో సెనక్కు తిరిగి చూసింది వచ్చినవాడు సూర్యా అని తెలిసింది. ఆశాభంగమయింది. అదే క్షణాన ఆమె మనసు పూర్తిగా మారిపో నారంభించింది. చనిపోవాలి అన్న తలపు మారి పోయింది. ఎన్నాళ్ళ వీలుంటే అన్నాళ్లు బ్రతికి రాఘవన్కు చేతనయినంత మనఃక్లేశాన్ని కల్గించాలి అని నిర్ణయించుకుంది.

"నువ్వా బావా? మంచి సమయానికే వచ్చావు. రా!" అంది.

"ఏమంత మంచి సమయం కాదనుకుంటానే! నీవు తలపెట్టిన పనికి విఘ్నంవలె వచ్చినట్లున్నాను—"

"ఏం పని తలపెట్టాననుకుంటున్నావు?"

"అర్ధరాత్రి రివాల్వర్ని పక్కన వుంచుకుంటే, ఇంకెందుకు?"

"ఏం, దొంగవస్తే వాడిని చంపడానికోసం అయవుండవచ్చు. లేక పోతే రివ్వాల్వర్ని దగ్గరెందుకు వుంచుకున్నా ననుకున్నావు? ఆత్మహత్య చేసుకోవడానికి అనుకున్నావా?"

"అదే నిజమయితే చాల సంతోషమే. కాని నీ మొహమూ, కన్నీళ్లు నిండిన కళ్లూ వేరే కథను చెబుతున్నాయి. నాకు వచ్చిన వుత్తరమూ అదే చెబుతూంది."

"ఎవరు రాశారుత్తరం?"

"ఎవరో రాశారులే. ఎవరయితేనేమి?"

"ఏమని రాశారు? అదన్నా తెలుసుకోవచ్చునా?"

"నీ మనసు గాయపడినట్లు రాశారు. ఎందుకో తెలుసుకుందామనే నేను వచ్చాను. నీమనసుకు బాదేమీ లేకపోతే నాకు చాల సంతోషం. సీతా! నా పనిగులు తీరింది. నేవెళ్తాను. వెళ్ళి నా పనేదో చూచుకుంటాను."

"సూర్యా! నీనుండి నిజాన్ని దాచి ఏమిలాభం? నీసాయం నాకు కావాలి. అంతుకనే అన్నాను మంచి సమయంలో వచ్చావని—నన్ను నేను కాల్చుకుని చచ్చిపోదామనే అనుకున్నాను. కాని చనిపోయే ముందుగా నా ముద్దులపట్టికి ఒక వుత్తరం రాద్దామనుకున్నాను. కాని రాయలేకపోయాను. నీతో చెబుతే నువ్వెళ్ళినప్పుడు దానికి చెబుతావుకదా? మద్రాసు ఎపుడో ఒకప్పుడు వెళ్తావు కద?" అని జాలిగొలిపే స్వరంతో చెప్పింది సీత.

"సీతా! కొన్నిరోజుల ముందే నేను దేవపట్నానికీ, మద్రాసుకూ వెళ్ళి ఇవాళే వచ్చాను."

"అలాగా? మద్రాసులో వాసంతిని చూచావా?" అని అతురతతో ప్రశ్నించింది సీత.

'చూశాను. మీ అత్తమామలను చూశాను."

"వాసంతి ఎట్లా వుంది? నీతో ఏమంది?"

"ఆరోగ్యంగావుంది. అమ్మనాన్నలను చూడాలని తపిస్తూంది. అట్లాంటి పసిపాపను వదలి చనిపో సిద్ధపడడానికి నీమనసెటా ఒప్పిందో నాకాశ్చర్యంగావుంది."

"ఇందువలనంగా నువ్వు నా పరిస్థితిని తెలుసుకోవచ్చు సూర్యా! కన్న బిడ్డను దూరదేశానికి పంపి, చచ్చిపోవడానికి మనసంత సులభంగా ఒప్పుతుందా? కాని నేను అనుభవించిన నరకవేదన అంతటిది."

"సీతా! నరకవేదనయినా స్వర్గ సుఖమయినా మనం చేసుకునేదే కదా! 'దేవుడి రాజ్యమంతా నీలోనే!' అని వినలేదా నువ్వు?"

"ఇప్పుడా వేదాంతాలకు సమయం మించి పోయింది సూర్యా! మీరందరూ కలిసే నన్ను నరకంలోకి నెట్టారు. ఈయన్ను నేను పెళ్ళాడడం

పెద్ద తప్పు. ఈయన ఏతెల్ల దొరసానో, పార్సీదానినో చేసుకుని వుండవల సింది. నీ స్నేహితురాలు తారిణీవుండే అలాటిచాన్ని...''

''ఇంకొకరి గురించి మనం అనడం దేనికి?''

''అనకుండా ఎట్లా వీలవుతుంది? వాదారి కడ్డంగా రాకుంటే అనక్కర్లేదు. ఆ తారిణీ, మా అత్తగారూ కలిసి నేను జబ్బుతో పడుకుని వుంటే, విషంపెట్టి నన్ను చంపచూచారు సూర్యా, తెలుసా?''

''నీకు మతిపోయింది సీతా! నువ్వు చావడానికి సిద్ధంగా వుంటే వాళ్ళిద్దరూ నీకు పరిచర్యలుచేసి నిన్ను బ్రతికించారు. వాళ్ళగురించి ఇట్లా మాట్లాడుతున్నావేమి?''

''వాళ్ళు పరిచర్య చేశారని నీకెట్లా తెలుసు? వాళ్లు చెబితేనేగా నీకు తెలిసింది?...ఊరికే మాట్లాడి, మాట్లాడి ఏం లాభం. నేను అనాథను, దిక్కులేనిదానిని. నా మాటలను ఎవరూ నమ్మరు. అసలు నువ్వెందుకు వచ్చావు? నీ పని చూచుకో, వెళ్లు—'' అని జలజలమని కన్నీరు కార్చింది సీత.

''నాపనిమీద నేను వెళ్ళేటట్లయితే, ఎన్నో ముఖ్య కార్యాలను వదలుకుని వెయ్యిమైళ్ళ ప్రయాణంచేసి వచ్చేవాడినేకాదు, నువ్వెట్లాగయినా సుఖంగా వుండాలనే నాకోరిక. నాకు చెప్పు నీబాధేమిటో...నీ భర్తతో వచ్చిన చిక్కేమిటో చెప్పు. అతడినే అడుగుతాను. అడిగితే నాతల తీసివేయడు కద...అతడంటే నాకేమీ భయం లేదు.''

''నీకు భయం లేదు...కాని నాకు భయంగావుంది. ఆయనతో నువ్వు మాట్లాడినందువలన ఏమీ లాభం వుండబోదు. నీమీది కోపంకూడా కలిపి నామీద విరుచుకు పడగలరు. నా చిక్కేమిటో చెబుతే నీకర్థంకాదు, సాటి ఆడదానికే అర్థంకాలేదే?...నీ కెట్లా అర్థం అవుతుంది? 'పార్టీకి పోదాం, రా!'' అంటారు, పిలుచుకు వెళ్తారు. అక్కడ నేనెట్లా ప్రవర్తించినా అది తప్పే అవుతుంది. నేను గలగలమని నలుగురితో మాట్లాడితే—''ఎందు కిట్లా నోరు పారేసుకుంటావ్? ఎందుకిట్లా నీ తెలివి తక్కువ తనాన్ని నలుగురి ఎదుట ప్రదర్శించుకుంటావు? నాకు అవమానంగా వుంది.'' అంటారు. ఇట్లా

అంటారు కదా అని వూరికేవుంటే—"ఏదో పోగొట్టుకున్నదానిలే ఆదేదె మొహం ఎందుకు? నలుగురితో కలవలేని నిన్ను పెళ్ళి చేసుకున్నాను, ఖర్మ!" అంటారు. నవ్వకుండావుంటే—"హాస్య గుణంలేని మొద్దుజన్మ", అంటారు. దుఃఖం భరించలేక ఇంట్లో ఒకమూల కూర్చుని ఏడుస్తుంటే—ఇక్కడ కూర్చుని నా ప్రాణాల నెందుకు తోడుతావ్? ఎక్కడికయినా తగలడు, ఫో!" అంటారు. "తగలడు, ఫో—" అన్న మాట విని విని నా మనసు పుండయి పోయింది. నేనెక్కడికి తగలడను? ఎక్కడికి పోను? ఏకంగా ఈ ప్రపంచంనుండే పోవడంతప్ప వేరేమీ దారిలేదు...బావా! ఆ రివాల్వర్ నిటు ఇచ్చి ఫో—"

"సీతా! చనిపోవడం మాట మరిచి పో! నువ్వేమంత అనాథవుకాదు. నేనంటూ వున్నంతవరకు నిన్ను 'అనాథను' కానివ్వను. ఎంతటి చిక్కయినా దానికో పరిష్కారం అంటూ వుంటుందిలే. కొన్ని రోజులు ఓపికపట్టు...నే నేదోదారి చూచి చెబుతాను."

"నేనింక ఒక్క రోజుకూడా ఓపిక పట్టలేను. నేను బ్రతికివుండా అంటే ఒకటే దారివుంది. కానిదానికి నువ్వు ఒప్పుకోవేమో!"

"ఆదారి ఏమిటో చెప్పు! నాచేతవుతుందా అని చూస్తాను."

"నన్నిక్కడనుండి తీసుకవెళ్ళి పో! ఈ ఢిల్లీ నా పాలిటి నరకమయి పోయింది. నువ్వు నన్నెక్కడికి పిలుచుకు వెళ్ళినా వస్తాను. బొంబాయి, కలకత్తా, లాహూరు, లంక, లండన్, ఆమెరికా—ఎక్కడికయినా వస్తాను.—"

"ఆవేళ వచ్చినపుడు అట్లాగే ఆ చోట్లన్నిటికీ తీసుకు వెళ్తాను. కాని ఇప్పుడు సమయంకాదు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో లీనమయి వున్నాను. దేశం స్వాతంత్ర్యం పొందేవాక ఇంకేపనీ తలపెట్టనని నా మిత్రు లందరి ఎదుట శపథం చేశాను. స్వాతంత్ర్యం రానీ! తర్వాత..."

"అయితే సూర్యా! ఒక్కపని చేయి. నన్ను తీసుకువెళ్ళి గాంధీ ఆశ్రమంలో వదిలేయి..అక్కడ నాలాటి అనాథ లెందరోవున్నారని

విన్నాను. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నన్నిక్కడినుండి తీసుకు వద్దువుగాని—!"

"సీతా! గాంధీ ఇప్పుడు చెరసాలలో వున్నారు. ఆశ్రమంలో ఎవరున్నారో తెలియదు. క్రొత్తవారినిప్పుడు చేర్చుకోరేమో?"

"అయితే నన్నేదయినా సినిమాకంపెనీలో చేర్చు! నేనెంత చక్కగా నటిస్తానో చూడు. శోక ఘట్టాలలో నయితే ఇపుడున్న వారందరిని మించి నటిస్తాను. అగ్రశ్రేణి తారగా పేరు తెచ్చుకుంటాను."

సూర్యా ఏమీ చెప్పలేకపోయాడు. ఎక్కడి గాంధీ ఆశ్రమం, ఎక్కడి సినిమాతార! సీత మనస్థితి ఏమిటో అతడికి అవగతంకాలేదు. సీత మతి కొద్దిగా చలించిందేమో. ఇవాళ ఎట్లాగయినా ఆమెను శాంతపరచి వెళితే రేపు తారిణిని అడిగి ఏదో ఒకటి చేయవచ్చులే—అని నిర్ణయించుకున్నాడు.

"సీతా! నాకు సినిమాలగురించి తెలియదు. సినిమావాళ్ళ గురించి తెలియదు. కనుక ఆ విషయంలో నేనేమీ చేయలేను. కాని కొన్నిరోజుల పాటు నువ్వు వేరే ఎక్కడికయినా వెళ్ళి వుండాలంటే వీలులేకపోలేదు... దేవపట్నంలో లలిత వుందికదా? నీ గురించి సదా అనుకుంటూ వుంటుంది. ఆమెకన్న నిన్ను ప్రేమించే వారెవరున్నారు? నువ్వు సంతోషంగా లేవని తెలిసి ఆమె ఎంత బాధపడిందో చెప్పలేను. లలితభర్త, నా స్నేహితుడు అయిన పట్టాభి ఇప్పుడు చెరసాలలో వున్నాడు. లలిత మామగారు చాల మంచిమనిషి. నువ్వు కొన్నాళ్ళపాటు దేవపట్నంలో హాయిగా వుండవచ్చు. పాపాయినీ అక్కడికి పిలిపించుకో వచ్చును." అన్నాడు సూర్యా.

"లలితకు నామీద వున్న ప్రేమ నాకు తెలియనిదికాదు. ఆమె సుఖంగా వుందంటే నాకెంతో సంతోషం. కాని వా అభిప్రాయం నువ్వు సరిగ్గా తెలుసుకోలేదు. నేనెక్కడికి వెళ్ళాను, ఏమయ్యాను అని ఈయనకు తెలియకూడదు. దేవపట్నానికి వెళ్లితే రెండు రోజులలో ఈయనకు తెలిసిపోతుంది. కనుక ఏం లాభం? ఈయన నాకోసం వెతికి వెతికి అలసిపోవాలి.

అవస్థ పడాలి అలాటిచోటుకు నన్ను తీసుకు వెళ్తావా, వెళ్ళు—లేకపోతే నీ దారిని నువ్వు పో—''

''ఆ విధంగా మనిద్దరమూ ఎవరితోనూ చెప్పకుండా వెళ్ళిపోతే పెద్దగుడుగాని. ఇంకెవరయినాగాని ఏమనుకుంటారు? తప్పుగా అర్థం చేసుకోరా?''

''తప్పుగా అర్థం చేసుకుంటే చేసుకోనీ...నాకనవసరం. మూడునెలల ముందేమి జరిగిందో తెలుసా? ఈయన ఎవరో అమ్మాయిని కారులో తీసుకుని ఎక్కడికో వెళ్ళారు. పానిపట్టు సమీపంలో ఈయన కారు ఒక మిలిటరీ ట్రక్కుకు డీకొంది. ఈయనకేమీ గాయం తగలలేదు; కాని ఆ అమ్మాయికి గాయమయింది. ఇది అందరికీ తెలిసింది; ఢిల్లీ అంతా నవ్వింది. అందువలన ఆయనకేమయింది? మగవాడు మట్టుకు ఏమన్నా చేయవచ్చునని ఏచట్టం చెబుతూంది!''

''సీతా! అట్లాటి చట్టం ఏదీలేదు. తప్పుపనిని మగవాడు చేసినా ఆడది చేసినా అది తప్పే. అందుకనే నువ్వు చెప్పినదానికి నేనంగీకరించలేదు...నా కింకోటి తోస్తూంది. దేవపట్నంలో పట్టాభికాకుండా నాకు అమర్‌నాథ్ అని ఇంకొక స్నేహితుడున్నాడు తెలుసా? అతడూ అతడి భార్య చిత్ర కలకత్తాలో వుంటున్నారు. ఇటీవల నేను దేవపట్నం వెళ్ళినప్పుడు వాళ్ళూ వచ్చి వున్నారు. చిత్రాకు లలితా నీగురించి అంతా చెప్పింది. దంపతులిద్దరూ చాల మంచివాళ్ళు. ఇప్పుడేం చేద్దామంటే, నిన్ను ప్రక్క స్టేషన్‌లో ఎక్కడయినా కలకత్తా రైలెక్కించేస్తాను. నువ్వు కలకత్తాచేరి అమర్‌నాథ్ ఇంటికివెళ్ళు. వాళ్లతోబాటు కొంతకాలంవుండు. అవసరం వస్తే అల్లుడుగారికి మవ్వెక్కడ వున్నదీ చెబుతాను.''

''అదే వద్దన్నది. ఆయనకు తెలియనే తెలియకూడదు; వాకిట్లమై నప్పుడు నేనే తెలుపుతాను. నూర్యా! నేను కలకత్తా వెళ్లడానికి సిద్ధమే... కాని బవాళ్లో రేపో నువ్వే నన్ను పిలుచుకు వెళ్లాలి. రేపు దాటితే వేస్ట్ ఇంట్లో వుండను. ఒంటరిగా ఇల్లు విడిచి పోనూలేను. నువ్వు నన్ను తీసుకు

చెప్పడం నీ స్నేహితురాలు తారిణికి వచ్చదేమో? ఆమె ఏమన్నా అనుకుంటుందేమోనని భయంగావుంటే ఆమాట స్పష్టంగా చెప్పివేయి!''

''సీతా! ఏవిటో చిత్రమైన ఆలోచనలొస్తున్నాయి నీకు... నేనెవరికీ భయపడడంలేదు. మనం చేయబోయే పనులు మనకే బాగుండాలికదా! అందుకే కాస్త ఆగి, ఆలోచించవలసి వస్తోంది.''

''భేషుగా ఆలోచించు! ఆ ఆలోచనేదో ఇక్కడే ముగించు!... ఇన్నాళ్ళ తర్వాత బావవు నువ్వు మా ఇంటికి వస్తే మంచినీళ్లు కూడా అడగలేదు. నువ్విక్కడే వుండు. ఓవల్టిన్ కలిపి తెస్తాను—'' అని లేచి, లోపలికి వెళ్లింది సీత.

సూర్యా మనసు పెద్ద అగాధంలో చిక్కుకుంది. 'ఇదేమిటి? ఇంత భయంకరమైన బాధ్యతను చెల్తిన వేసుకుంటున్నామే? ఇదంతా సవ్యంగా సాగుస్తుందా? లేక ఏదయినా విపరీతానికి దారితీస్తుందా?'' అని కొట్టుకులది అతడి మనసు. ఈ సందిగ్ధంనుండి ఎట్లా తప్పించుకోవడం?

ఈ సమయంలో టెలిఫోన్ మోగింది.

ఇంకేదో ఆలోచనలో నిమగ్నుడయివున్న సూర్యా మనసుకు రాత్రి పన్నెండు గంటలవేళ ఎవరు టెలిఫోన్ చేస్తారు అన్నదికూడ తోచలేదు. రిసీవర్‌ను చేతిలోకి తీసుకుని. ''హలో! ఎవరండి?'' అని అడిగాడు.

టెలిఫోన్ శబ్దం విని సీత వంటింటినుండి పరుగెత్తి వచ్చింది, సూర్యా రిసీవర్‌ను చేతిలో వుంచుకుని మాట్లాడడంచూచి ఆమె ముఖంలో భీతి శోచరించింది.

28

రజనీపూర్ మాజీ దివాన్ ఆదివరాహాచారిగారిప్పుడు ఢిల్లీలోనే స్థిరపడి పోయారు. ఆయన, స్వదేశ సంస్థానాధీశులకు చట్ట సంబంధమైన సలహాదారుడి పదవిని స్వీకరించారు. క్రొత్త ఉద్యోగంలో పని స్వల్పం; కాని ఆదాయమూ పలుకుబడీ అధికం. ఆయన కూతుళ్లిద్దరూ కొత్తఢిల్లీ సమాజజీవితంలో స్థానం సంపాదించుకున్నారు. వైస్రాయింటి పార్టీలయినా, రాజుల ఇళ్లలో ఏ కార్యక్రమాలయినా ధామ, భామ వుండి తీరవలసిందే!

ఇవాళకూడా వాళ్లు తండ్రితోబాటు ఒక పార్టీకి వెళ్ళి రాత్రి పదకొండింటికి ఇల్లు చేరారు. సౌందరరాఘవనూ వాళ్లతోబాటు వచ్చాడు. నలుగురూ కలిసి షేకాట మొదలుపెట్టారు.

ఆటమధ్యలో భామ అడిగింది; "మిస్టర్ రాఘవన్? మీ భార్యను పార్టీకి తీసుకరాలే రుందుచేత? ఆమెకు ఒంట్లో బాగులేదా?"

"ఒళ్లు ప్రస్తుతం బాగయినట్లే! కాని ఇటీవల జ్వరంపడి లేచినప్పటినుండీ ఆమె మనసు మాటపోయింది. ఇంటిరి వెళ్లితేచాలు ఏదో ఫిర్యాదులు, ఏవో ఏడుపులూను!" అన్నాడు రాఘవన్.

"అంత తీవ్ర అనారోగ్యం పాలయి లేచిన ఆవిడను మీరు కొన్నాళ్లపాటు ఇంకే పూట్లోనయినా వుంచాలి." అంది ధామ.

"ఆ నాకూ తెలుసు. చేత నయినంతవరకు చెప్పి చూచాను. మద్రాసు వెళ్లి మా అమ్మతో వుండి, ఆ తర్వాత వాళ్ల బంధువులందరినీ చూచిరమ్మని ఏన్నోసార్లు చెప్పాను. ఆమె ఒప్పుకుంటేనా? నాకు చాల చీకాకుగా వుంది. ఆఫీసుకు వెళ్ళితే అక్కడోబాధ; ఇంటికి వెళ్ళితే అక్కడోబాధ... చస్తున్నాను. నిజంగా ఆత్మహత్య చేసుకుంటే బాగుండు ననిపిస్తూంటుంది. ఇదిగో మీతో గడుపుతానే ఈకాస్తసేపూ మనసు హాయిగా వుంటుంది."

"ఇంట్లో సరేసరి, ఆఫీసులో ఏమిటిబాధ?" అని ధామ అడిగింది.

"మీ నాన్న నడగండి, చెబుతారు! నేను ముస్లిము నయిపోదామనుకుంటున్నాను. ఏమంటారు దివాన్ సాహిబ్?"

"ఇదేమివింత ? మీరు ముస్లిము అవడం ఎందుకు?" అని ఆశ్చర్యంతో అడిగింది భామ.

'ఈ రోజులలో ముస్లిం అయితే తప్ప ప్రభుత్వోద్యోగాలలో ప్రమోషన్ రావడం లేదు. నాకు న్యాయశ్ర తర్వాత ఉద్యోగంలో చేరినవాడిని నా కన్నా మీద కూర్చోపెట్టారు. పోయిన సంవత్సరంచాక నాకు "ఎస్! సార్!" అన్నవాడికి నేనిప్పుడు "ఎస్, సార్!" అనవలసి వస్తూంది. దివాన్ సాబ్! ఇస్లాముమతం పుచ్చుకోనా లేక ఈ వుద్యోగానికి రాజీనామా ఇవ్వనా?"

"రెండూ చేయవద్దు. కొన్ని రోజులు ఓపిక పట్టండి!" అన్నారు మొదటిసారిగా నోరు తెరచిన ఆదివరాహాచారిగారు.

'ఓపిక పడితే ఏమవుతుందిశ్ర...ఏమీ కాదు. ఏదయినా స్వదేశ సంస్థానంలో ఉద్యోగం ఇప్పించండని మీ మామగారిని ఎప్పటినుండో అడుగుతున్నాను." అన్నాడు రాఘవన్.

"నాన్నా! రాఘవన్ కోరికను మన్నించకూడదా?"

'మన్నిస్తూనే వున్నా,ను. అయితే రాఘవన్ రాజీనామా చేయకూడదు. ఒక ఉద్యోగంలో వుండగానే ఇంకొక ఉద్యోగం లభించితేనే లభించినట్లు...ఉన్న ఉద్యోగం పోతే ఇంకొకటి రావడం కష్టం!" అన్నారు మాజీదివాన్.

"ఆదిసరేగాని రాఘవన్! మీకు ప్రమోషన్ రాకపోవడానికి హిందువులన్నదికాక వేరేదయినా కారణం వుందా?" అని అడిగింది భామ.

"మద్రాసీ అన్న కారణమూ వుంది. వీరికి మహమ్మదీయుడు మొదట కావాలి. లేకపోతే ఇంకెవడయినా మతిలేని మూఢుడు కావాలి. కాని మద్రాసువాడు పనికిరాడు."

ఆది వరాహాచారి ఇంకొక్కసారి మాట్లాడారు! "అదికాదు రాఘవన్! భామ చెప్పింది వేరేవిషయం. మీమీద ఊరంతా ఒక పుకారు వ్యాపించివుంది. మీకు తెలియదా?"

"తెలియదే; ఏమిటది?"

"విప్లవోద్యోగానికి వెళ్ళిన ఒక స్త్రీని మీ ఇంట్లో దాచి వుంచారట ఆది నిజమేనా?"

"తారిణిగురించి చెబుతున్నారేమో...ఆమె విప్లవోద్యమానికి చెందిన వార్త నిరాధారం. ఆమెను మా ఇంట్లో దాచివుంచానన్నది పచ్చి అబద్ధం. సీతకు ఆరోగ్యం బొత్తిగా బాగులేనప్పుడు ఆమె దగ్గరవుండి సేవ చేసి సీతను బతికించింది. తారిణి ఎంత సాధువు! ఎంత బుద్ధిశాలి! ఆవిషయం మీ అమ్మాయిలకూ తెలుసు!" అన్నాడు రాఘవన్.

"సాధువుగా వుండవచ్చు; బుద్ధిశాలిగా వుండవచ్చు. అంతమాత్రాన విప్లవకారిణిగా వుండరాదా?" అంది భామ.

"పోనీ అట్లాగే అనుకుందాం. అయినా అందుకు నేనా శాధ్యుడిని? ఆమె విప్లవకారిణి అని నాకెట్లా తెలుసు? అది పోనివ్వండి అసలు విప్లవ శాయకులు ఎంతోమంది, పెద్ద ఉద్యోగస్తుల ఇళ్ళల్లో దాగుకుని వుండడం మీకు తెలియనిదా? కరుణావతీదేవి ఎవరింటో దాగుకుని వుండింది? చంద్ర కాంత్ సింహా మూడు నెలలు దాగుకున్నది ఎవరింటో? వారందరినీ ఏమి చేశారు? నామీద మాత్రం ఈ ఫిర్యాదెందుకు?"

"వాళ్ళందరూ చాల పై పదవులలో వున్నవాళ్లు కదా, వారిమీద ఫిర్యాదు చేయడానికి ఎవరూ సాహసించరు. కాని రాఘవన్! మీ విషయం అట్లాకాదు గదా? మీరు ప్రమోషన్ ఎదురుచూస్తున్నవారు కదా?"

"అంతేకాదు నాన్నా! వీరి భార్య సీత ఒక విప్లవకారుడికి సాయం చేస్తూంది అని ఇంకో ఫిర్యాదుంది. ఈ వూరినుండి మద్రాసుకు వెళ్ళిన ఒక వుత్తరంలో వీరి భార్యగురించి వుందిట. ఆ వుత్తరం సూర్యా అన్న వారికి రాయబడిందట. నిన్న ఒక పార్టీలో ఒక సి. ఐ. డి. ఉద్యోగి వాళ్ళిద్దరిమధ్య ఏమి బంధుత్వం—అని నన్నడిగారు. నాకు తెలియదన్నాను. మిస్టర్ రాఘవన్! నిజంగా వాళ్లు బంధువులా?" అని భామ అడిగింది.

"బంధువులే! సీత మేనత్త కొడుకు సూర్యా! అతడిపేరిట అరెస్టు వారంటేదయినా వుందా? మీకేమన్నా తెలుసా?"

"తెలియ్దేమిటి? మద్రాసు, బొంబాయి, మధ్య రాష్ట్రాలు,—ఈ రాష్ట్రాలన్నిటిలో అతడిపేరిట అరెస్టు వారంట్ వుందిట."

"మంచిది! సూర్యాలాటి వాళ్ళను చెఱసాలలో వుంచితే దేశానికి క్షేమం. అందువలన స్వాతంత్ర్యోద్యమం పరిశుద్ధమవుతుంది." అంటూ రాఘవన్ లేచి టెలిఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

"ఈవేళప్పుడు ఎవరితో మాట్లాడుతారు?' అని భామ అడిగింది.

"ఇంట్లోమాఆవిడ నిద్రపోయిందా అని కనుక్కొని ఇంటికి వెళ్లడం అలవాటు. ఆమె మేల్కొని వుంటే తేలుకుట్టినట్లు కుడుతుంది. రాత్రంతా శివరాత్రే!" అన్నాడు రాఘవన్.

"అయ్యోపాపం! మీ పరిస్థితి ఎంత దయనీయమైనది!" అంది భామ.

సౌందరరాఘవన్ తన ఇంటి నెంబరుకు ఫోన్ చేశాడు. టెలిఫోన్ మీద మాట్లాడిన గొంతు వినగానే ఆశ్చర్యమూ, కోపమూ ముంచుకొచ్చాయి రాఘవన్‌కు.

* * * * *

టెలిఫోన్‌లో రాఘవన్ గొంతువిన్న అదే సమయంలో సీత ముఖాన్ని సూర్యా చూశాడు. ఏదన్నా పొరబాటయిందేమో నన్న తలపులో అతడి మనస్సు వికలమైంది. రాఘవన్ 'ఎవరు? సూర్యానా? ఎపుడు వచ్చావు?" అని అడిగితే "ఇవాళే!" అన్నాడు సూర్యా.

"ఓహో! నేను వచ్చేవాక వుంటావా?" అని అడిగాడు రాఘవన్. "ఆహా! వుంటాను." అని సూర్యా—"సీతా! మీ ఆయన!" అని చెప్పి రిసీవర్‌ను సీతకు ఇచ్చాడు.

రిసీవర్‌ను చెవిలో వుంచుకుని విన్న సీత మొహంలో ఇంకాభీతి కనపడింది. రాఘవన్ ఏమడిగాడో సూర్యా వినలేదు. సీత "లేదే! ఇవాళేకద వచ్చాడు." అని చెబుతుండగా ఆమె కళ్లనుండి ఆశ్రువులు రాలడం చూచాడు

శూర్యా. తర్వాత ''సరే, వుండమంటాను!'' అని చెప్పి టెలిఫోన్ రిసీవర్ను పెట్టింది.

''సీతా! అబ్బుడుగారేమన్నారు? ఎందుకు కంటనీరు పెడుతున్నారు?'' అన్నాడు శూర్యా! విచారంతో.

సీత కాస్సేపు ఎక్కడో చూస్తూ మౌనంగా వుంది. ఆ తర్వాత ఏడుస్తూ—''శూర్యా! వెళ్ళి పో! వెంటనే వెళ్ళిపో!'' అంది.

''ఇదేమిటి? నన్నెందుకు పొమ్మంటున్నావు? అబ్బుడు వుండమన్నారే?''

''అందుకనే నిన్ను వెళ్ళి పొమ్మంటున్నాను. నాతోనూ నువ్వు వుండేటట్లు చూడమన్నారు. కాని వాళ్ళకేదో భయంగా వుంది. శూర్యా! నువ్విపుడిక్కడవుంటే ఏదో అపాయం వాటిల్లుతుంది. వెళ్ళిపో!''

''నేను తొందరపడి వెళ్తేనే అపాయం జరగుతుంది. ఆయన వుండమని చెప్పినప్పుడు నేను వెళ్ళిపోతే అనవసరంగా సందేహానికి చోటిచ్చినవాణ్ణి అవుతానుకదా?''

''సందేహం ఇంకా రావడం ఏమిటి శూర్యా? నాకేమీ తెలియదు. నీకు పుణ్యం వుంటుంది. వెళ్ళిపో! నన్ను కష్టపెట్టకు. నావల్ల నీకు ఉపకారం లేకపోయినా అపకారమన్నా లేకుండా వుండనీ!''

''సీతా! ఒకవిషయం గుర్తుంచుకో. నీకు నిజంగా ఎపుడయినా సాయం కావాలంటే నేనున్నానని మరువకు. నువ్వు మనస్సును ధృఢపరచుమని చెప్పు. ఏంచేయమంటే అది చేస్తాను. నీ క్షేమమే నాకు ముఖ్యం. దేని విముక్తికూడా ఆతర్వాతే—'' అన్నాడు శూర్యా.

''చాల కృతజ్ఞురాలిని బావా! అపాయ సమయాలలో నీ సాయం ఘోరమని అమ్మకూడా నాకు చెప్పింది. నువ్వు రేపు సుధ్యాహ్నం టెలిఫోన్ చేయి. ఈలోగా నేనూ బాగా ఆలోచించుకుంటాను. లేకపోతే ఇప్పుడే తీసుకు వెళ్ళమని చెప్పి వుండేదానిని!'' అంది సీత.

శూర్యా లేచాడు. ఇందాక తీసుకున్న రివాల్వర్ పంట్లాం జేబులో వుంది. ఇట్లాటి క్రిమినల్ బాగులదాని అందుబాటులో రివాల్వర్ వుండడం క్షేమం కాదు. మన దగ్గరుంటే పనికి వస్తుంది కూడాను—'' అనుకున్నాడు.

అప్పుడు వీధిలో ''బామ్? బామ్!'' అన్న శబ్దం వినపడింది. చర్రుమని కారు వచ్చి ఇంటిముంను ఆగింది. సీతా, శూర్యా నివ్వెరపోయి నిల్చున్నారు.

రాఘవన్ కారును గుమ్మం ముందు ఆపి చకచక ఇంట్లోకి వచ్చాడు. శూర్యాను సీతనూ మార్చి మార్చి వెర్రివాడిలా చూశాడు. అతడి మనసులోని క్రోధం అతడి చూపులలో కొంత ప్రతి ఫలించింది. అయినా నెమ్మదిగానే ''ఏం శూర్యా! బయలుదేరినట్లున్నావే?'' అని అడిగాడు.

''అవునండీ! వెళ్ళాలి. పన్నెండున్నరయింది కదా! మీరు రాగానే వెళ్దామని కాచుకుని వున్నాను.'' అన్నాడు శూర్యా.

''అదేవిటి? ఈ నిశీరాత్రివేళ ఎక్కడికి వెళతావ్?''

''నాకో ముఖ్యమైన పనుంది. కొంతమంది మిత్రులను కలుస్తానని చెప్పాను.''

''చాలబాగుంది! ఈరాత్రివేళ స్నేహితులను కలవడం ఏమిటి! అందరూ కలిసి కన్నంవేయడానికి వెళ్ళాలా ఎక్కడయినా?''

''కన్నం వేయడానికి వెళ్ళేవాళ్ళూ రాత్రి వెళుతారు; వాళ్ళను పట్టుకోవడానికి వెళ్ళేవాళ్లూ రాత్రే వెళ్తారు. మనదేశానికే కన్నం వేస్తున్నవారిని తరిమి కొట్టే కార్యంలో నిమగ్నులమై వున్నాము. మీకు తెలియదా!''

''నాకెట్లా తెలుసు? సీతకు తెలిస్తే తెలిసివుండవచ్చు. నువ్వు తరచు ఆమెను వచ్చి చూచి పోతుంటావుకదా...!''

''నేమ తరచు రావడం లేదే? మూడునెలలక్రితం ఒకసారి వచ్చాము. అప్పుడు మీరు వూళ్ళో లేరు.''

''పోసీలెద్దూ; నువ్వు చాల వూళ్లు తిరిగావుట. మద్రాసుకూడా వెళ్ళివచ్చావట. నీనుండి అన్నీ వివరంగా విందామన్న మతూహలం కొద్దీ

పరుగత్తుకొచ్చాను. నువ్వేమో వెళ్లి పోతానంటున్నావు. ఈ రాత్రి ఇక్కడే వుండిపోరాదూ?''

''లేదండీ, నేను వెళ్లి తీరాలి! మద్రాసులో మా అమ్మనాన్నలను, వాసంతినీ చూశాను. వాసంతి ఇక్కడికి రావాలని కుతూహల పడ్డింది. నాకు దారిలో వేరే పనులుండినందున తీసుకురాలేక పోయాను...మిగతా వివరాలు తర్వాత ఎపుడయినా చెబుతాను.''

''మళ్లీ ఎపుడొస్తావు?'' అని రాఘవన్ అడిగాడు.

''వీలయితే రేపే వస్తాను లేకపోతే ఎల్లుండి...నా ప్రయాణ విశేషాలన్నీ చెబుతాను.''

''రేపు వచ్చినా రాత్రివేళే వస్తావేమోకదూ?''

''ఔను. పోలీసుల కంటపడకుండా రావాలంటే రాత్రిళ్ళే రావాలి. ప్రభుత్వోద్యోగంలో వున్నారు, మీకు నానుండి ఎటువంటి ఇబ్బందీ కలుగకూడదుకదా?''

''ఆహా! నామీద ఎంత దయ!...శూర్యా! నీ స్నేహితురాలు తారిణి ఎక్కడవుంది? ఆమెను చూస్తుంటావా?''

శూర్యా సీత మొహం చూశాడు. ఆమె మొహంలో కాఠిన్యం కనపడింది.

''తారిణి ఈ వూళ్ళోనే వుంటూంది నేనామె కలవవచ్చు.''

''కలిస్తే నే నామెతో ఒక ముఖ్యవిషయం మాట్లాడాలని చెప్పు. ఆమె బస ఎక్కడో తెలియదా?''

''పాత బస తెలుసు. కాని ఆమె ఇప్పుడక్కడలేదు. వేరేచోట వుంటూంది. నాకు టయిమయింది...వెళ్లొస్తాను...'' అని వెళ్లిపోయాడు శూర్యా.

రాఘవన్ సోఫాలో కూర్చుండి పోయాడు. ఆయితే నీల సూర్యాతో కాటు గుమ్మందాక వెళ్లింది. గుమ్మంలో ఆతడితో నెమ్మదిగా చెప్పింది. "సూర్యా! నామీద ఒట్టు! చేపు తప్పక ఫోన్ చేయి."

"అట్లాగే!"

29

సూర్యాను సాగనంపి లోపలికి వచ్చింది సీత. రాఘవన్ ఉగ్రరూపం ధరించి వున్నాడు.

"వాడితో ఏమిటీ రహస్యాలు?" అన్నాడు నిప్పులుకక్కుతూ. ఏమంటున్నది ఆలోచించకుండా సీత—"నేనేం మాట్లాడితే మీకేమి?" అంది.

"ఏమన్నావ్? ఏమన్నావ్? నాకేమిటా?" అని లేచి ఒక్క ఉదుటున ఆలికి ఆమె చెంపమీద కొట్టాడు రాఘవన్. పళ్ళు బిగించుకుని సీత "ఇంతేనా? ఇంకొక చెంప బాకీవుంది?" అంది,

'ఓహో, అలాగేం? గాంధీగారి శిష్యురాలు కాబోలు! పుచ్చుకో మరి!" అని రెండో చెంపమీద కొట్టాడు రాఘవన్.

సీత ఆతడి నొక్కసారి ఉరిమిచూచి వంటగదివైపు వెళ్ళిపోయింది.

"ఏమిటా తొందర? నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండా వెళ్తున్నావేం?" అని అరిచాడు రాఘవన్.

వంటింటినుండి గ్లాసులో ఓవల్టిన్ తీసుకొచ్చి ఆతడి ఎదుట వుంచింది సీత.

"ఉత్త ఓవల్టినేనా, కాస్త విషంకూడా కలిపావా?" అని అడిగాడు రాఘవన్.

"పోను!" అంది సీత.

"అయితే నువ్వు తగు...! వద్దులే! నీకింకా ఈ ప్రపంచంలో కొంత పని బాకీవుంది," అని గ్లాసును కిటికీగుండా బయటికి విసిరేశాడు.

"నాలాటి పాతకురాలిని ఇంట్లో వుంచుకుని కష్టపడవద్దులెండి. నేను రేపే వెళ్లిపోతున్నాను."

"ఎక్కడకు వెళ్ళాలని వుద్దేశం?"

"ఎక్కడికో అఘోరిస్తాను. ఎప్పుడూ మీరంటూనే వుంటారుకదా", తగలడు పో అని...

"ఇప్పుడూ అదే అంటున్నాను...దివ్యంగా తగలడు పో! వెళ్లేముందు నా ప్రశ్నలకు జవాబు చెప్పి పో—"

"వెళ్లేదానికి ప్రశ్న లేమిటి, జవాబులేమిటి?"

"జవాబులు చెప్పితీరాలి. సూర్యా—నిన్ను గురించి నాకు సందేహంగా వుంది."

"ఏమి సందేహం?"

"ఏమి సందేహమా? మీ ప్రవర్తనగురించి సందేహం!"

"చాల సంతోషం!"

"సంతోషమా?" అని రాఘవన్ ఆమె చెంపమీద బలంగా రెండు పార్లు కొట్టాడు.

సీత అక్కడనుండి కదలలేదు; ఒక బొట్టు కన్నీరు కార్చలేదు; ఆమె ముఖంకూడా మారలేదు.

"చాల సంతోషం. ఒక్కసారే నన్ను చంపి పారవేయండి. రేపు నేను పారిపోకలసిన అవసరం వుండదు."

"నీ మనసులో ఏదో మాలిన్యం వుంది. తప్పుచేసిన అంతశ్శంగం కొట్టుకుంటున్నది. అందుకనే పారి పోతానంటున్నావు."

"నా మనసులో మాలిన్యమూ లేదు, తప్పూలేదు."

"మరి పారిపోతావంటావెందుకు? పెళ్ళాడిన మొగుడిని వదిలి ఎందుకు పారిపోవాలి?"

"మీమనసు నాకు దూరమయింది. ఇంక మనం కలిసి వుండలేము. మనసులు విరిగాక కలిసి ఎట్లా వుండగలం?"

'నా మనసు విరిగిందంటే అందుకు నీ ప్రవర్తనే కారణం! నేను లేనప్పుడీ సూర్యా ఇక్కడికి ఎందుకు రావాలి. నిజంగా నువ్వు గనుక పతివ్రతవయితే ఇప్పుడు నే చెప్పలోయేది చేయాలి. చేస్తావా?" అన్నాడు రాఘవన్.

సీత మౌనంగా వుంది.

"ఇప్పుడే, ఈ క్షణాన్నే నువ్వు పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేయి. సూర్యా! ఇక్కడికి వచ్చి వెళ్లాడని చెప్పు."

"చచ్చినా చెప్పను."

"నీకావ కారణంగా నాకు ఆపద రానున్నది. వాడు విప్లవవాది. వాడిక్కడికి రావడం పెద్ద తప్పు. నాకు వచ్చే ప్రమోషన్ రాకుండా పోయింది. నాక్రింది వారంతా వాపై అధికారులయ్యారు. ఇప్పుడు కనీసం సూర్యా రాక గురించి అయినా తెలుపకపోతే నాఉద్యోగమే పూడిపోగలదు,"

"పోతే పోనివ్వండి. చావమంటే చస్తానుగాని పోలీసులకు మాత్రం చె—ప్ప—ను."

"నాకు తెలుసు! నీ మంచితనం ఏపాటిదో తెలుస్తుంది కదా అనే నిన్ను టెలిఫోన్ చేయమన్నాను. తెతిసిపోయింది. ఇక్కడ నిలవకు! ఫో! అఘోరించు! తగలడు! ఫో!" అని సీత మెడబట్టి పడకగది వైపుగా తోశాడు రాఘవన్.

సీత పడక గదిలోకి వెళ్ళి పడుకుంది. ఆమె కంట ఒక్క బొట్టు కన్నీరు కురవలేదు. చెంపలు జివ్వు మంటున్నాయి. ఇవాళ జరిగినదంతా నిజమేనా, లేక నిద్రపోతుండగా వచ్చిన స్వప్నమా అని అచ్చెరు వొందింది ఆమె. రాఘవన్ ఫోన్ డయిల్ చేస్తున్నట్లు వినిపించింది. సీత పరు

గాత్రి వెళ్ళింది. టెలిఫోన్ రిసీవర్ వున్న రాఘవన్ చేతిని గట్టిగా పట్టుకుంది. ''ఎవరికి ఫోన్ చేస్తున్నారు?' అని అడిగింది.

కోపంతో నల్లబడిన మొహంతో రాఘవన్ ''నీకెందుకు!'' అన్నాడు.

''నా కెందుకేవిటి? మీరు సూర్యా గురించి చెప్పడానికి పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేస్తున్నారు. కాని నేనుండగా ఆపని జరగనివ్వను. నన్ను చెయిదట చంపి తర్వాత ఆపని చేయండి.''

''నేను కేపు ఆఫీసునుండి ఫోన్ చేస్తేనో?''

''నాకనవసరం! నాచెవిని పడకుండా చేసరి!'' అంది సీత.

''సూర్యా గురించి నీకెందుకంత తాపత్రయం? మీ ఇద్దరికీ ఏమీ సంబంధం లేదన్నావే!''

''నేనట్లా చెప్పలేదు. ఈ ప్రపంచంలో నా మీద అభిమానం వున్న ఒకే వ్యక్తి సూర్యా, నాకోసం ఏమయినా చేయడానికి సిద్ధంగా వున్నవాడు సూర్యా. అతడిని మీరు పోలీసుల కప్పచెబుతుంటే నేను చూస్తూ ఎట్లా వూరుకోగలను?''

''ఓసి దుర్మార్గురాలా? సూర్యామీద నీ మోహం నిన్నెంత అఘోరతికి తీసుకొచ్చింది!''

''చాల సంతోషం.''

''ఏమిటే సంతోషం? ఎందుకే సంతోషం?'' అని చేయి పైకెత్తాడు రాఘవన్.

''ఇంతటి పాపపు మాటను పలికాకకూడా మీ నాలుక తెగిపడి పోనందుకు సంతోషం.''

''నా నాలుక తెగిపడిపోవాలా? శాపం పెడుతున్నావా, శాపం!'' అని మితిమీరిన ఆగ్రహంతో రాఘవన్ టెలిఫోన్ రిసీవరున్న చేతితోని గట్టిగా కొట్టాడు. ఆదెబ్బ సీత చెవిమీద పడింది.

అంతే! తటాలున సీత మొహం మారిపోయింది, కళ్ళల్లో నీరు నిండింది.

''అమ్మా! అమ్మా! ఆలలఘోష విన్పిస్తున్నదే...అమ్మా! వన్ను పిలుచు

కని వెళ్ళిపో అమ్మా!" అని చిక్కిశ్శోలో ఏడుస్తూ అరవసాగింది. ఆమె మొహంలో వెర్రికళ ఆవహించింది.

సీతకు 'హిస్టీరియా' వచ్చిందని తెలిసింది రాఘవన్‌కు.

వెంటనే ఆమెను నెమ్మదిగా పట్టుకుని సోఫాలో కూర్చోపెట్టాడు. "భద్రు సీతా వద్దు! నేను నిన్ను పరీక్షిద్దామని అన్నానంతే! నువ్వు నిజం అనుకున్నానా?' అంటూ రాఘవన్ శాంతమైన స్వరంతో బుజ్జగిస్తూ ఆమెపైపు నిమిరాడు.

కాసేపటికి సీత సోఫాలో బోర్లపడుకుంది; ఏడుపు ఆగింది. ఆమె నిద్రలో మునిగింది.

* * *

ఆ ఇంటినుండి బయటికి వెళ్ళిన సూర్యా ప్రహరీ గేటును తెరచి, మూసి, మళ్లి తోటలోకి ప్రవేశించి ఒక ప్రక్కగా చెట్లచాటుగా నడిచి వచ్చాడు. రాఘవన్ సీతలున్న గది కిటికీకి బయట చాటుగా నిల్చుని అంతా విన్నాడు. మూచాడు. రాఘవన్ టెలిఫోన్ పట్టుకున్న చేతితోనే సీతను కొట్టగానే ఆమె "అమ్మా! అమ్మా!" అని కేక వేయడం విన్న వెంటనే సూర్యా సహించలేక పోయాడు. రివాల్వర్‌తో పేల్చి పారేద్దామా అనుకున్నాడు ఒక్క క్షణం. అది సరికాదు, ఇంకొక్క రోజు ఓపిక పట్టాలి, పనులన్ని వున్నాయి—అనుకున్నాడు మరుక్షణం. ఆతర్వాత జరిగినదికూడా చూచాక అతడక్కడినుండి కదిలాడు.

అర్ధరాత్రి తర్వాత చాత ఢిల్లీవైపు నడిచి వెళ్తున్న సూర్యా మనసు ఆనందరకూ ఎన్నడూ లేనంతగా ఉడికి పోతూంది. "దేశం ఏమయితేనేమి? స్వాతంత్ర్యం ఎట్లా పోతేనేమి? దేశాన్ని స్వాతంత్ర్యాన్ని చూచుకోవడానికి సలాలక్షమంది వున్నారు. అయితే సీత అనాథ; దిక్కులేనిది, ఆమెను సంతోషంగా వుంచడమే నా మొదటి కర్తవ్యం. అది ఎట్లా సాధ్యం? రేపు తారిణి నడిగి తెల్సుకోవాలి. అంతవరకు అయ్యోపాపం, ఆరాక్షసుడి చేత చిక్కిన సీత బ్రతికి వుండాలే!"

సూర్యాన్ని చేరి పడుకున్నాకకూడా అతడికి నిద్రరాలేదు.

30

మరుసటిరోజు సాయంత్రం శూర్యా వళ్లి చాందినిచౌక్ బజారు వెంబడి నడుస్తున్నాడు. అతడి మనసు చీకాకుగా వుంది. అంతకుముందు రాత్రి నిద్ర లేమి అతడి మొహంలో కనపడుతూంది.

ఆ రోజుదయం పదకొండున్నర గంటలకు శూర్యా సీతకు ఫోన్ చేశాడు. రెండుసార్లు చేస్తే దొరకలేదు. మూడవసారి సీత గొంతు వినపడింది. "రెండు సార్లు పిలిచాను. కాని దొరకలేదు." అన్నాడు శూర్యా.

"అరగంట ముందుగా ఒకసారి టెలిఫోన్ మోగింది. నువ్వేమోనని తీసుకున్నాను. కాని జాగ్రత్తపడి "ఎవరు?" అని అడిగాను. "నేనే శూర్యాని! ఎప్పుడు కలుద్దాం?" అని అడిగింది ఒక గొంతు. అది నీ గొంతు కాదని టెలిఫోన్ పెట్టేశాను. ఏమిటంటావు దీన్ని గురించి!" అందిసీత.

"ఆశ్చర్యంగా వుందే! అట్లా ఎవరడిగి వుంటారో అర్థం కావడం లేదే!" అన్నాడు సూర్యా.

"పోతే పోనీ! నేనివ్వాళ నిన్ను తప్పక కలవాలి. ఎప్పుడు ఎక్కడ కలుద్దాం?" అని సీత ఆతురతతో అడిగింది.

"ఎక్కడో ఏమిటి, మీ ఇంట్లోనే కలవాలి." అన్నాడు సూర్యా.

"వద్దు, వద్దు! ఈ ఇంటి చాచులకు నువ్వింక రావద్దు. నేనే వస్తాను. నాకేమీ భయంలేదు. సాయంకాలం ఆరింటికి పాత ఢిల్లీకి నేనే వస్తాను. నిన్నెక్కడ కలవమంటావు?"

శూర్యకు టౌన్‌హాల్ వెనకవున్న మైదానం గుర్తుకు వచ్చింది. అక్కడికి రమ్మని చెప్పాడు. సరేనని టెలిఫోన్ క్రింద పెట్టింది సీత.

ఈలోగా నిన్న అనుకున్న ప్రకారం తారిణినీ ఇతర మిత్రులనూ చూడాలి! అందుకనే వెండి బజారు వీధివెంబడి నడుస్తున్నాడు సూర్యా. తారిణిగురించి అనుకోగానే, అంతకుక్రితం దినం ముగ్గురు తారిణిని పట్టిస్తే అక్షరాపాయలిస్తామని కాపడం గుర్తుకువచ్చి అతడి మనసు మరింత పాడయింది.

'ఖూన్-కా-బర్ష్వాజా' అన్న భయంకరమైన చారిత్రాత్మకమైన సంఘటనలు జరిగిన గుమ్మాన్ని దాటగానే, ఆజానుబాహువయిన ముస్లిమ్‌లీగ్ సేవకుడొకడు—పచ్చటి చొక్కా వేసుకున్న మనిషి—శూర్యాను ఢీకొని—"మాఫ్ కేజియే! క్యాయ్‌దే ఆజం జిందాబాద్!" అన్నాడు. సూర్యాకు బలే కోపం వచ్చింది. తేరిపారజూచాడు. ఆ ఆసామీ కనుబొమ లెగరవేయడంచూచి, నిన్నటి పోలీసు వేషధారయేనని తెలుసుకుని—"ఇదేవిటివాళ ఈవేషం?" అన్నాడు సూర్యా. "రోజుకోవేషం వేస్తేనేగద పొట్టగడుస్తుంది?" నిన్నుకూడా జాగ్రత్త పడిమన్నారు నాయకులు. నువ్వునిన్నటి వేషంలోనే వున్నావేం?" అన్నాడతడు.

"నాయకులు ఆస్థలంలోనే వున్నారా?"

'ఉన్నారు! నువ్వు నాకు యాభై అడుగుల దూరాన వెనక రా! మరీ దగ్గరగా రాకు, మరీ దూరంగాను పోకు" అని ఆ ఆసామి విసవిసనడవసాగాడు.

సూర్యా అట్లాగే చేశాడు. జుమ్మా మసీదు కుడిప్రక్క వీధినుండి చీలిన ఒక సందులోకి ఆ ఆసామీ ప్రవేశించాడు. కళ్ళు వెళ్లి, సూర్య రశ్మి సోకని చీకటి సందులో, ముస్లింలీగ్ జెండా ఎగురుతున్న ఇంటిముందాగాడు. సూర్యా వచ్చి కలుసుకోగానే ఇద్దరూ ఇంట్లోకి ప్రవేశించారు. ముందుగదిలో మాల్వీలావున్న ఒకాయన కొరాన్‌వలెవున్న అరబ్బీ భాష పుస్తకాన్ని తడిమి చూస్తూ చదువుతున్నాడు. ఆయన ఒకసారి తలెత్తి వీరినిచూచి మళ్ళీ పుస్తకం చదవడంలో నిమగ్నుడయ్యాడు.

"ఎవరబ్బా ఈ మాల్వీ? ఎక్కడో చూచినట్లుందే" అని అనుకుంటుండగా, ముస్లింలీగ్ సేవకుడు సూర్యా చేయిపట్టుకుని, ఒకప్రక్క గోడవారగావున్న పుస్తకాల అలమార వెనకకు తీసుకువెళ్ళాడు. అలమారకూ గోడకూ నడ్యు ఒకరు కష్టపడి దూరగల సందుమాత్రం వుంది; అక్కడో గోడలో ఒక తలుపూవుంది. ఆ ముస్లింలీగ్ సేవకుడా తలుపు తెరిచి సూర్యాని లోపలికి తోసేసి తలుపు మూశాడు.

ఆ చీకటిలో సూర్యా తడబడుతుండగా "నాతో బాటు రండి!" అన్న తారిణి గొంతు వినబడింది.

చాల తక్కువ వెలుగున్న పాతకాలపు మంటపానికి వచ్చి చేరాడు సూర్యా. అక్కడ పాతకాలపు రాతి స్తంభాలున్నాయి. పైకప్పూ చాల క్రిందుగా, ఎవరన్నా నిలిస్తే వారి తలకు ఒకడుగు ఎత్తున వుండి. అయితే మంటపం చాల విశాలంగావుంది. నాదిర్షా, అహ్మద్ షానంటి క్రూరులయిన దొంగలు ఢిల్లీమీద దండెత్తినప్పుడు ఢిల్లీ చాందినీ చౌకలోని ఐశ్వర్య వంతులయిన వ్యాపారులు తమతమ బొక్కసాలనీ మంటపంలోనే భద్రంగా దాచుకునేవారు. ఆ చీకటి మంటపాన్ని కనుక్కుని, దాని దారి తెలుసుకుని లోపలికి రావడం చాల కష్టసాధ్యమైనందున అక్కడ దాచిన సంపద భద్రంగా వుండేది.

ఆ మంటపం ఇప్పుడు దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటున్న విప్లవవాదుల ముఖ్యస్థలాలలో ఒకటిగా వుంటూంది.

మంటపంలో అప్పుడు సుమారు ఇరవైమంది వున్నారు కొందరు గుంపు చేరి మాట్లాడుకుంటున్నారు. కొందరు చుట్టలు తాగుతున్నాను. కొందరు నిద్రపోతున్నారు. వాళ్లు రకరకాల దుస్తులు ధరించివున్నారు.

విడిగా కూర్చొని ఏదో రాసుకుంటున్న ఒకరిని చూపించి తారిణి "అదిగో నాయకుడు!" అంది. సూర్యా ఆయన దగ్గరకు వెళ్ళి "ఇంక్విలాబ్ జిందాబాద్!" అన్నాడు.

క్రొత్త వ్యక్తిని గమనించి అందరూ నాయకుడిని చుట్టు ముట్టారు.

"ఎక్కడెక్కడికి వెళ్లారు? అక్కడ పరిస్థితి ఎట్లావుంది?" అని నాయకుడు సూర్యా నడిగారు.

"మధ్య రాష్ట్రాలు, ఆంధ్రదేశం, మద్రాసు వెళ్ళాను. మధురదాక వెళ్ళాను. అన్నిచోట్లా జనుల మనసు అగ్ని పర్వతంవలె కుతకుతలాడుతూంది. ఏక్షణాన్నయినా అగ్నిపర్వతం బద్దలయి నిప్పులు కక్కవచ్చును. ఆ నిప్పుల నదిలో బ్రిటిష్‌పాలన మాడి మసిబొగ్గవుంతుండి."

"మీ నమ్మకానికి ఆధారం ఏమిటి? బ్రిటీషు పాలన నంతంచేసి స్వరాజ్యం స్థాపించడానికి జనులేవిధంగా సాయం చేయడానికుద్యుక్తులుగా వున్నారు? గత ఆగస్టు 9 వలెనే ఈసారికూడా స్వాతంత్ర్య జ్యోతి దేదీప్యమానంగా వెలుగుతుందని ఎదురుచూచినట్లు జరగలేదే?"

"అదే కాస్త నిరుత్సాహకరంగా వుంది. కొందరు జర్మనీవాళ్లు జపానువాళ్ళు వస్తారని, దేశవిముక్తికి తోడ్పడతారని ఆశిస్తున్నారు. కొందరు సుభాష్‌బాబు బర్మాగుండా దాడిచేస్తాడని ఎదురుచూస్తున్నారు. కాని స్వాతంత్ర్యంకోసం మనం తటమనసై ఏదయినా చేయాలని అధిక సంఖ్యాకులకు తోచడంలేదు. అక్కడక్కడ పెద్దగా పలుకుబడి లేని దేసభక్తులు కొందరు విప్లవజ్యోతిని వెల్గించ యత్నిస్తున్నారు. కానివారిని పోలీసువారు అతి ఘోరంగా హింసించడంచూసి జనులు భయవిహ్వలులవుతున్నారు. నేను కళ్లారా చూచిన ఒక ఉదాహరణ చెబుతాను..."

అని సూర్యా దేవపట్నం వకీలు ఆత్మనాథయ్యర్ ఇంటో ఆరోజు జరిగిన పోలీసుల దమనకాండను వివరించాడు.

ఇవంతావిని నాయకుడన్నాడు;" స్వాతంత్ర్యం నిమిత్తం పోరాడుతున్న దేశవాసులు అనుభవిస్తున్న భయంకరమైన బాధలలో శతాంశం కూడా మనవాళ్లనుభవించడం లేదు. దీర్ఘకాల దాస్యం మూలంగా ధీరత్వాన్ని కోల్పోయారు మన ప్రజలు కాని అక్కడక్కడ కొందరు ధీరులున్నంత వరకు నిరాశ తగదు. ప్రజల నిస్పృహ ఒక్కసారిగా పొంగి పొరలదు. ఆ అగ్ని పర్వత బద్దలయ్యేదాక నిప్పు చల్లారకుండా చూడడం మన పని సుప్వీఁభూరికి వచ్చినట్లు తెలిసి పోలీసువారు నీకై గాలిస్తున్నట్లు కబురందింది. సుప్వీరోజే ఈ పూరు విడిచి వెళ్ళిపోవడం మంచిది. కలకత్తా వెళ్తావాకి అక్కడొక ముఖ్యమైన పనివుంది,

"ఆ! వెళ్తాను." అన్నాడు శూర్యా. మొండికేస్తే సీతనూ తనతో పాటు కలకత్తా తీసుకువెళ్ళవచ్చుకదా అనుకున్నాడు.

కలకత్తాలో పనిగురించి నాయకుడు వినరించసాగారు.

మాల్వీసాబ్ కోరాస్ చదువుతుండిన గదిలో మూలగా చెక్కమెట్లున్నాయి. సూర్యా, తారిణీ మంటపంనుండివచ్చి, ఆగదిలో మెట్లెక్కి మేడ మీదకు వెళ్ళారు. అక్కడ గదిలో వేము కుర్చీల్లో కూర్చున్నారు.

"కలకత్తా ఎప్పుడు వెళ్లాలనుకుంటున్నారు?"—తారిణి అడిగింది. "ఇవాళే బయలుదేరవచ్చు...వెళ్ళే ముందు సీత విషయం గురించి ఏదో ఒకటి నిర్ణయించాలి...ఈ లోకంతో నరరూపం రాక్షసులుంటారని నాకు తెలిసింది. అట్టాటి రాక్షసుడైన రాఘవన్ చేతిలో సీత పడ్డ యాతన చూశాకనే తెలిసింది."

"నిన్నరాత్రి సీతను చూశారా? ఆమె రాఘవన్‌మీద గట్టిగా ధిక్కారం చేసినట్లుంది."

"సీత చెప్పడంకాదు. నాకళ్ళారా చూచాను. నిజానికి సీతచెప్పింది, నేను చూచినదానిలో పదవవంతుకూడా లేదు." అని అంతకు ముందు రాత్రి కథంతా వివరించాడు.

ఖిన్నవదన అయింది తారిణి. "నిజంగా మీరు కళ్ళారా చూచి, చెప్పి వుండకపోతే నేను నమ్మను సుమా! రాఘవన్ ఇంత మూర్ఖంగా వుంటాడనుకోలేదు,"

"ఎవరు మాత్రం అనుకున్నాడు!...అన్నట్లు ఈ పాటికి సీత మైదానానికి వచ్చి వుంటుంది. నేనామెకు ఏమి చెప్పిరు? నాతోబాటు కలకత్తా తీసుకువెళ్ళనా?" అన్నాడు సూర్యా.

"మీరు సీతను కలకత్తా తీసుకు వెళ్ళితే ఆంతటితో ఆమె జీవితం సర్వనాశనం అవుతుంది. మీరామెకు ధైర్యం చెప్పి ఆమెను ఇంటిదగ్గర దిగ విడిచిరండి. నేను ఆమెను చూచుకుంటాను. ఇవాళ రాత్రే రాఘవన్‌ను కలసి మాట్లాడుతాను." అంది తారిణి.

"ఇవాళ రాత్రి రాఘవన్‌ను ఎట్లా కలుసుకుంటారు?"

"ఆయన వెళ్తున్న పార్టీకే నేనూ పోదామనుకుంటున్నాను. రాఘవన్ ప్రవర్తనలో ఇవాళనుండే మార్పుంటుంది. అంరకు నేను పూచీ!"

''ఆ ధూర్తుడితో మీరు మాట్లాడడం నాకిష్టంలేదు.'' ''నాకు మాత్రం ఇష్టమా! సీత మేలుకోరి అట్లా చేయవలసి వస్తూంది.''

''తారిణీ! ఒకే ఒక ప్రశ్నడుగుతాను; జవాబు చెప్పండి. సీత విషయంలో మీరింత శ్రద్ధ వహించడానికి కారణం ఏమిటి?''

''కారణం వుంది. సీతపట్ల మీకన్న నాకు ఎక్కువ శ్రద్ధ వుండడానికి కారణం వుంది. కాని దయచేసి అదేమిటని అడగకండి.'' అంది తారిణి.

''పోన్లెండి! సీతమీద ఆంత శ్రద్ధ వుంది కనుక బొంబాయి వెళ్ళినప్పుడు ఆమెతండ్రి గురించి వాకబు చేయండి. సీత పరిస్థితి గురించి ఆయనకు చెబుతే మన బాధ్యతకూడా తగ్గుతుంది.

''సూర్యా! ఆశ్చర్యపడకు! సీత నాన్న ఎక్కడవున్నారో నాకు తెలుసు. కాని ఇప్పుడు ఆయన సీతకేమీ సాయం చేయలేడు. ఆయన ప్రస్తుత పరిస్థితి తెలిసే సీత సంతోషించలేదు.''

సీత నాన్న ఏదో క్రిమినల్ నేరంచేసి దీర్ఘకాల కారాగార శిక్ష నను భవిస్తున్నాడు కాలోలు ననుకోసాగాడు సూర్యా. తటాలున అతడి మనో నేత్రం ముందు ఒక ముఖం మెరిసింది. అది గడ్డం పెంచుకున్న ముస్లిం మూల్వీ ముఖం అది.

''తారిణీ! క్రింద ఒక మూల్వీ సాహిబ్ కూర్చుని కొరాన్ చదువుతున్నారే ఆయన ఎవరో చెప్పగలరా?''

''చెప్పగలను సూర్యా! ఆయన మా నాన్న!''

31

తారిణి చెప్పినదానిని గురించి ఆలోచిస్తూ జుమ్మా మసీదుకు దాటి వెండి బజారులోకి ప్రవేశించాడు సూర్యా. టవున్ హాలు చేరగానే అక్కడ వీధి

ప్రక్కన సీత నిల్చుని వుండడం చూశాడు. త్వరగా అడుగులు వేసి ఆమెను చేరి "సీతా! నువ్వు ఇక్కడికి వచ్చి చాలసేపయిందా?" అని అడిగాడు.

"పావు గంటయింది. అయినా వీధి వెంబడి వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు నావైపు చూస్తూ వెళ్ళడం నాకు బొత్తిగా నచ్చలేదు. నువ్వురావడం మంచిదయింది." అంది సీత.

ఇద్దరూ టవున్ హాల్ వెనక వీధిగుండా గాంధీ మైదానం వైపు నడిచారు. కారిణితో అంతకు క్రింద రోజు మాట్లాడిన చెట్టుక్రిందకే సీతను తీసుకు వెళ్లాడు సూర్యా. దారి పొడవునా సూర్యా మనసు—సీత పట్ల తన బాధ్యత ఏమిటి అన్నదానిని గురించి తీవ్రంగా ఆలోచిస్తూంది.

చెట్టుక్రిందకు చేరి కూర్చోగానే సీత చుట్టుప్రక్కలచూచి, "బావా! నువ్వు వెంటనే ఈ వూరు విడిచి వెళ్లి పో! నీకోసం పోలీసువారు వెతుకుతున్నారు. టెలిఫోన్ మీద నీలాగా మాట్లాడి అసలు విషయం తెలుసుకుందామని ప్రయత్నించింది పోలీసులే! ఎట్లాగయినా ఈ విషయం నీకు చెప్పితీరాలనే ముఖ్యంగా వచ్చాను. టెలిఫోన్ మీద చెప్పడానికి భయంవేసింది. ఇవాళ రాత్రే వెళ్లిపో సూర్యా!" అని గడగడమని మాట్లాడింది సీత.

"సీతా! నాగురించిన దిగులు నీకెందుకు? నన్ను పోలీసులు పట్టుకుంటేనేమి? ఏ నిముషాన్నయినా చెరసాలకు వెళ్లడానికి నేను సిద్ధంగా వున్నాను. అంచేత నీ విషయం గురించి చెప్పు. నిన్నరాత్రి వీధిలోకి వెళ్ళినట్లే వెళ్లి వెనకొక్కచ్చి మీ ఇంటి తోటలో నిల్చుని కిటికీగుండా అంతా చూశాను. నిన్ను రాఘవన్ చేయెత్తి కొట్టినప్పుడు నారక్తం ఉడుకుత ఉడికింది. అట్లాంటి మొగుడిని వదలివెళ్లి పోదామని నువ్వనుకుంటే అందులో తప్పేమీ లేదు. నేనే నిన్ను తీసుకు వెళ్లడానికి సిద్ధంగా వున్నాను. ఇవాళ రాత్రి నేను కలకత్తా వెళ్ళుతున్నాను. నాతోబాటు నువ్వు రా! అమరేంద్ర ఇంట్లో నిన్నప్పజెప్పి నా పనిమీద నేను వెళ్తాను. అమర్ నాథూ, అతడి భార్య చిత్రా, నాకోసం ఏం చేయమన్నా చేస్తారు..."

ఇంత సేపట్నుంచి కాస్త ఆయిష్టంగానే ఇదంతా విన్న సీత ఉడ్డొచ్చి-

"సూర్యా! ఆ ఉపాయం ఇప్పుడక్కరలేదు. చనిపోవాలనే వుద్దేశాన్ని, శాశ్వతంగా యింటిని విడనాడాలనే వుద్దేశాన్ని, యిప్పుడు చదలి వేశాను. ఆయన చిత్తానుసారం నడచుకొని ఆయనను సంతృప్తి పెట్టాలి—అని నిశ్చయించుకున్నాను. నిన్నరాత్రి సంఘటన తరువాత ఈ విధంగా ఎట్లా అనుకోగలిగానో అని నువ్వు ఆశ్చర్యపడవచ్చు. నమ్మక పోయినా పోవచ్చు. కాని నేను చెబుతున్నదంతా నిజం. ఇవాళ మధ్యాహ్నం ఒక పత్రికలో కస్తూర్బా గాంధీ చరిత్రను చదివాను. అదే నా మనస్సును మార్చి వేసింది. కస్తూర్బా ఎన్ని కష్టాలు పడుతున్నదో తెలుసా? డెబ్భైయవయేట ఆమె చెరసాలకు వెళ్లుతున్నది! ఉత్తమ ఇల్లాలంటే ఆమెకదా!

సూర్యాకు తలమీద మంచి పెద్ద బరువు దించినట్లయింది. సీతనిర్ణయం అతడి హృదయానికి అనుగుణంగా వుండింది. కాని అతడి మెదడు దానిని అంగీకరించలేదు. "సీతా! స్త్రీల మనస్సు అగాధం అంటారే అది నిజమేసుమా! కస్తూర్బాగాంధీ గురించి మాట్లాడావు. ఆమె భర్త ప్రపంచం ఆరాధించే ఉత్తముడు. మీ తాతగారిని ఆ మహాత్ముడితో పోల్చతగునా?"

సూర్యా! గాంధీజీ యిష్టానుసారంగ కస్తూర్బా నడచుకొన నారంభించే సరికి ఆయన యింకా మహాత్ముడు కాలేదే?...నాకు ఈయన అన్ని విధాలా స్వేచ్ఛ నిచ్చారు! వేనకక్కడకు వెళ్లినా ఎందుకు వెళ్లావని అడగరు. ఎవరితో మాట్లాడినా ఏమీ అనరు. కానీ నేనే ఆయనను అటువంటి ప్రశ్నలు వేసి ఆయన జీవితాన్ని నాశనం చేశాను. ఆలోచించినకొద్దీ తప్పంతా నాదేనని తెలుస్తున్నది. నా మెదడు ఎందుకో పాడయివుండింది. కాని ఇప్పుడు ఖచ్చితంగా ఒక నిర్ణయానికి వచ్చాను. నువ్వు నామనస్సును మార్చటానికి ప్రయత్నించడం దండుగ." అని చెప్పింది సీత.

సూర్యా నివ్వెర పోయ్యాడు. "నేను నీ మనస్సును మార్చటానికి ప్రయత్నించబోను. యెట్లాగైనా నీవు రాఘవన్‌కు తగినట్లుగా నడచుకొని అతనిని మార్చగలిగితే మంచిదే. నువ్వూ అతడు సంతోషంగా కాపురం చెయ్యడంకన్నా నాకు కావలసినదేముంది? అయితే పోదాం, పద! చీకటి పడింది. నిన్ను మీ యింటివద్ద దిగబెట్టివచ్చి నాపని చూసుకుంటాను."

"నీవు నాతో రావద్దు. ఒక టాక్సీని పిలిచి నన్ను అందులో ఎక్కించు చాలు. లేకపోతే నేనే పిలుచుకుంటాను." అంది సీత.

"వీల్లేదు సీతా! నా బాధ్యతను నేను నెరవేర్చి తీరాలి. ఈరోజుల్లో ఢిల్లీ చాలా అపాయకరంగా వుంటూంది. స్త్రీలు ఒంటరిగా పోవడం మంచిదికాదు. అందులోనూ చీకటిపడ్డాక అసలేపోరాదు."

"నీవు అనవసరంగా భయపడుతున్నావు, శూర్యా! నాకేమి అపాయం కలుగుతుంది?"

"నీకు తెలియదు. నిన్న సాయంత్రం తారిణీ, నేనూ ఇదే చెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకుంటున్నాం. ఆమె లేచి వెళ్లాక, నేను కూర్చున్న చోటికి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. కాసేపు అవీ ఇవీ మాట్లాడాక అసలు విషయం బయట పెట్టారు. అదేమిటంటే, తారిణిని నేను వారికి అప్పచెబితే నాకు అక్షరాపాయలు ఇస్తామన్నారు! ఎట్లావుందీకథ?"

"ఇదేమిఘోరం? వాళ్లు ఎవరయి వుంటారు?" అంది సీత.

"ఏదో స్వదేశ సంస్థానపు మనుషులేమోనని వా అనుమానం. పరిస్థితి, ఇట్లా వుంటే నిన్నొంటరిగా చీకటిలో పంపమంటున్నావే?"

"శూర్యా! నాకొచ్చిన అపాయమేమీ లేదు. తారిణివంటి అందకత్తెకు లక్ష రూపాయలిస్తానంటే నాకోసం అట్టాగే అంటారనా? నిజానికి, తారిణిని వద్దని ఈయన నన్ను పెళ్లి చేసుకున్నారే అందుకోసమైన ఈయనకు ఆ జన్మాంతం కృతజ్ఞురాలిగా వుండాలి నేను."

"అట్లాగే వుండు వేను మీ ఇంటిదగ్గర నిన్ను విడిచి పెడతాను. లేకపోతే నామనసు బాధపడుతుంది. పోనీ మీ ఇంటిదాక రాను. మీ ఇంటికి కొద్ది దూరాన విడిచి పెడుతాను. ఆ తర్వాత నువ్వు ఒంటరిగా వెళ్ళిపో—సరేనా?"

"మంచిది. అట్లాగేచేయి. నీ మనశ్శాంతికోసమయితే అట్లాగే చేయి."

ఇద్దరూ ఆ చెట్టు క్రిందనుండి బయలుదేరారు. మైదానంనుండి వెండి

బజారుకు వెళ్ళే విధిలో జనసంచారం లేదు. ఆ వీధి ప్రక్కగా ఒక పాడుగాటి కారుంది. దాని నెంబరు 1111 అన్న విషయం సూర్యా గుర్తించాడు. ఆ కారును దాటుతుండగా అతడి మనసులో ఒక సందేహం వచ్చింది. కాని ఆ సందేహం తీర్చుకోవడానికి అది సమయం కాదనుకున్నాడు. ఆ తర్వాత కాస్త వేగంగానే నడిచాడు.

సూర్యా, సీతా వెండి బజారుదాటి గంట స్తంభం చేరగానే టాక్సీ ఎక్కాడు. టాక్సీ క్రొత్త ఢిల్లీ వైపు వెళ్ళ సాగింది.

తమ టాక్సీ వెనకాలె ఇంకో కారు వస్తున్నదేమోనన్న సందేహం కలిగింది సూర్యాకు. కాని క్రొత్త ఢిల్లీ వీధుల రద్దీ మూలంగా సందేహం యొక్క నిజానిజాలు తెలుసుకోలేక పోయాడు. వాళ్ళ టాక్సీ వేగంగా పరుగెత్తింది. జంతర్ మంతర్ దాటగానే సీత—"ఇక్కడే నన్ను దించేయ్. మా ఇల్లు ఇక్కడికి కొద్ది దూరమే." అంది. టాక్సీ ఆగింది.

టాక్సీనుండి దిగగానే సీత "సూర్యా! ఇవాళ రాత్రే నువ్వు కలకత్తా వెళ్లి పోతున్నావు కదూ, తప్పకుండా వెళ్లి పో!" అంది.

"తప్పక వెళ్తున్నాను."

"మళ్లీ ఎప్పుడు కలుస్తామోగాని నీకు నామీద అభిమానం ఎన్నడూ మరవలేను బావా!" అంది సీత.

"నేను మాత్రం నిన్నెట్లా మరవగలను!" అన్నాడు సూర్యా.

సీత వీధి వెంబడి నడవసాగింది. ఆమె అట్లా నడిచి వెళ్తుండడం చూస్తూ టాక్సీ పక్కన చూస్తున్నాడు సూర్యా.

వెన్నెల పిండారబోసినట్లుంది. ఆ చుట్టు ప్రక్కల తోటలనుండి రాత్రి పూచే పువ్వుల సువాసనలు గుబాళిస్తున్నాయి.

ఇట్టి పరిస్థితిలో సీత నడిచి వెళ్ళి పోతుంటే ఏదో సినిమాలో దృశ్యంలా అనిపించింది సూర్యాకు.

"సీత ఛలితవ్యం ఎట్లా వుందో? తన మనసులో మార్పుగురించి ఆమె చెప్పిందంతా నిజమేనా? లేకపోతే నాతో ఆ విధంగా చెప్పేపి, ఇంటికి

వెళ్ళి ఏ విషమో తాగి మరణించ నున్నదా ? అట్లాగయితే ఆ చావుకు బాధ్యత నాది కాదా?" అని ఆలోచిస్తున్నాడు సూర్యా.

ఆ వెనకనుండి వస్తున్న కారొకటి అతడిని దాటి వెళ్ళింది. దాని నెంబరు 1111 అని మళ్ళీ గమనించాడు సూర్యా.

అతివేగంగా వెళ్ళిన ఆ కారుకు తాళ్ళున బ్రేక్‌లు పడ్డాయి, అది సీతకు ప్రక్కగా ఆగింది. కారునుండి ఇద్దరు మూకారు. సీతను బలవంతాన కారులో పలికి నెట్టారు. కారు తలుపులు మూసుకున్నాయి. బండి 'బర్' మని మళ్ళీ తిరిగి సూర్యా వున్నవైపే రాసాగింది.

ఇదంతా అర నిముషంకన్న తక్కువ నేపులో జరిగింది.

సూర్యా బుర్ర పనిచేయడం మానేసింది ఒక్క నిముషం.

ఆ కారు తన్ను దాటి పోతుండగానే అతడి మెదడు పనిచేయ నారంభించింది. "బావా!" అని దీనమైన అరుపు ఆ కారునుండి వినిపించినట్లని పించింది. పంట్లాంజేబులోనుండి రివాల్వర్ తీసి ఆకారు చక్రాలను గురిచేసి కాల్చాడు శూర్యా. కాని అది తగలలేదు.

శూర్యా వెంటనే ప్రక్కనున్న టాక్సీలో ఎక్కి కూచున్నాడు. "అదిగో, ఆ టాక్సీని వెంబడించు. నీకు కావలసినంత డబ్బిస్తాను. లేకపోతే నిన్ను కాల్చి చంపేస్తాను." అన్నాడు.

"పెట్రోలు కొద్దిగా వుంది సాబ్" అన్నాడు టాక్సీ డ్రైవర్.

"ఫరవాలేదు ! ఉన్నంతదాక నడుపు—ఊ! కానీ!"

ఈలోగా ఒక పోలీసువాడు వచ్చాడు. "ఆ కాల్చింది నువ్వేనా ? తుపాకి నిటు తే!" అన్నాడు.

శూర్యా ఆ పోలీసు నొక్కతోపు తోశాడు. వాడు వెళ్ళి దూరంగా పడ్డాడు. "చలో—చలో!" అని అరిచాడు శూర్యా. భయపడి వెంటనే టాక్సీని స్టార్టుచేసి వేగంగా నడపసాగాడు డ్రైవర్.

పడ్డ పోలీసు కాన్‌స్టేబిల్ లేచి మూడుసార్లు ఈల ఊదాడు. కాస్సే

పటికి ఒక జీప్ వచ్చింది. అందులో నల్గురు పోలీసువాళ్లున్నారు. ఇతడూ అందులోకి ఎక్కాడు. ఏదో చెప్పాడు.

జీప్ ఆ రెండు కార్లనూ అతివేగంగా వెంబడించ సాగింది.

సీత నెక్కించుకున్న కారు క్రొత్త ఢిల్లీనుండి షాజహాన్ పురం వైపు పరుగెత్తింది. వెండి బజారుదాటి, జుమ్మా మసీదుదాటి, కుడివైపున ఎర్రకోట నుదాటి, వంతెనదాటి యమునానది పైనున్న వంతెనను సమీపించింది.

మొదట దిగ్భ్రమ చెందింది సీత. తర్వాత శూర్యా చేసిన పొచ్చరిక గురొచ్చింది. తన వెనువెంట శూర్యా వస్తున్నాడని కొత్త ధైర్యం కలిగింది ఆమెకు. ఎట్లాగయినా శూర్యా కారు ఈ కారును అందుకోగలదని ఆమె నమ్మింది. కాని యమున వంతెన సమీపిస్తుండగా ఆమె గుండె జారింది. అది చాల ఇరుకైన వంతెన. బండు ఆ వంతెనపై ఒక వరుసలోనే వెళ్ళగలవు. అందుచేత వంతెన అటువైపునుండి కాసేపు, ఇటునుండి కాసేపు చొప్పున బండ్ల రాక పోకలను అనుమతిస్తారు.

సీత భయపడ్డంతా అయింది. ఆమె ఎక్కిన కారు వంతెనమీదకు వెళ్ళగానే ఆ వెనక వస్తున్న బండ్లను ఆగి పోవలసిందిగా పోలీసువాడు చేయి చూపాడు! సీతవున్న కారు వంతెన అవతలి కొన చేరగానే ఎదుటి దిశలో వున్న బండ్లను వంతెనమీదకు అనుమతించడం చూసింది సీత. భయంకరమైన భయం ఆమె నావహించింది.

కెవ్‌మని తనకు తెలియకుండానే అరిచి, పరుగెడుతున్న కారునుండి దూకుదామని ప్రయత్నించింది సీత. ప్రక్కనున్న మనిషి ఆమె మొహంమీద బలంగా కొట్టాడు. వెంటనే అరుపు నిశ్శబ్దమయింది. బయటకు దూకే ప్రయత్నం ఆగిపోయింది. కారు లోపల ఎట్టి శబ్దమూ లేదు.

32

మరుసటి రోజుదయం సౌందరరాఘవన్ మాజీ దివాన్ ఆదివరాహాచారి గారింటికి వచ్చినప్పుడతడి మొహంలో శోకం తాండవిస్తూంది. ఎన్నో రోజులు దుఃఖంతో నిద్రలేకుండా వున్నట్లుంది అతడి మొహం; కళ్ళగుంతలు పడాయి.

"ఏవిటండీ, మరీ భార్యను కోల్పోయినవాడిలా వున్నారేం?" అంటూ పలకరించింది భామ.

చురుక్కున సూది గుచ్చినట్లు వంకరపోయింది రాఘవన్ యొక్క విచార వదనం.

"మీరుకూడా ఇట్లా జాలిలేకుండా మాట్లాడుతా రనుకోలేదు— అయితే నే వెళ్ళొస్తాను." అని ఏడుపు గొంతుతో చెప్పి రాఘవన్ వెనక్కు పోజూచాడు.

అప్పుడు ధామ లేచివచ్చి అతడి దారికడ్డంగా నిల్చుని "అదంతేనండి! దాని నాలుకమీద విషం వుంది...దాని మాటలు పట్టించుకోకండి...మీరు వచ్చి కూర్చోండి. మీరంటే మాకెంత అభిమానం వుందో మీకు తెలియదా?" అంది.

రాఘవన్ వచ్చి సోఫాలో కూర్చున్నాడు. "నాకు ఎందుకు తెలియదు? మీరుకాక నాకు స్నేహితులు ఎవరున్నారు? ఉద్యోగ స్నేహం రైలు స్నేహం లాంటిది. మంచి స్థితిలో వుండే దాక ప్రాణ స్నేహితుల్లా నటించి తమ పనులు చేయించుకుంటారు. కాని చిన్న కష్టం వస్తే చాలు ఎవ్వరూ ఆదుకోరు. ఆ ఉద్యోగంకూడా వూడితే ఇక చెప్పాలా?.....అదీ నా పరిస్థితి." అన్నాడు అతడు.

"ఏమిటీ, ఏమిటీ?" "ఉద్యోగం పోయిందా?" "ఎందుకని?" "ఏమిటీ అన్యాయం?"—అంటూ ధామ, భామ ఒకరి వెంట ఒకరుగా ప్రశ్నలు వేశారు.

''ఇంకా పూర్తిగా తీరలేదు; కాని విచారణ ముగిసేదాక 'సస్పెండ్' చేశారు. అయినా, వాళ్ళు మళ్ళీ ఇచ్చినా ఆ ఉద్యోగంలో చేర దలచుకోలేదు. చాల రోజులనుండి వేరే ఉద్యోగానికి సిఫారసు చేయమని మీ నాన్నగారిని అడుగుతూనే వున్నాను. ఇప్పుడాయన నాకు సాయం చేయవలసిన తరుణం వచ్చింది. ఆయన లేదంటే వేరే దారిలేదు.''

''నాన్నగారికి అందులో కష్టమేమీ వుండబోదు. ఖజాంచియా వాళ్ళ బ్యాంక్‌లోనో, ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించ గలరు లెండి. అయితే జరిగినదేమిటో వివరంగా చెప్పండి. మిమ్మల్ని ఎందుకు 'సస్పెండ్' చేశారు? విచారణ దేనికి?'' అని అడిగింది ధామ.

''ఇవాళే నేను ఆఫీసుకు వెళ్లగానే నా విభాగపు పైఅధికారి నన్ను పిలిచారు. 'ఏదో మూడినట్లుంది' అనుకుంటూనే వెళ్లాను. అందుకు తగినట్లుగా ఆయన—''రాఘవన్! మిమ్మల్ని సస్పెన్షన్'లో వుంచమని ఉత్తరు వొచ్చింది. అందుకు నేను చాల చింతిస్తున్నాను. కారణం మీకు తెలిసి వుండవచ్చు'' అన్నారు.

''నాకు కారణం తెలియడం లేదు. మీరే చెబుతే మంచిది'' అన్నాను.
''అయితే వినండి! విప్లవవాదులకు తరచు మీ ఇంట్లో ఆశ్రయం ఇస్తున్నారని మీమీద ఫిర్యాదు.'' అన్నారు. ఆ ఫిర్యాదు సరికాదే? విప్లవవాది గురించి పోలీసుకు కబురందజేసింది నేనే కదా?'' అన్నాను. ''మిస్టర్ రాఘవన్! మీరు చాల తెలివిగలవారు కనుక ఇదే సంజాయిషీ విచారణలో ఇవ్వకండి. ఆ విప్లవవాదియైన కుర్రవాడి గురించిన సమాచారం తెలిసి పోలీసులతడిని ఖైదు చేయడానికి సిద్ధంగా వున్నారు. అట్టి సమయంలో మీరు కబురుచేసి ఏమి లాభం? ఆఖరి క్షణాన తప్పించుకోడానికోసం కబురు చేసి నట్లేకద!'' అన్నారు. అది విని నేమ 'షాక్' తిన్నాను. ''ప్రభుత్వోద్యోగులు, అందులోనూ ఢిల్లీ సెక్రిటేరియట్ ఉద్యోగులు, సీజర్ భార్యవలె, అనుమానానికి ఏమాత్రం ఆస్కారం ఇవ్వకుండా నడచుకోవాలన్న విషయం మీకు తెలియనిదికాదు. అందులోనూ ఇది యుద్ధ సమయం. అందుకనే ఎన్నడూ

లేదని సైనికాధిపతి వేవెల్ ను ఇండియాను వైస్రాయిగా పంపారు'' అన్నాడాయన.

''అవునవును. వేవెల్ సైనిక దళాలకు ఆధిపత్యం వహిస్తే ఓటుని తధ్యమని ఈమారు మూలకు పంపారు, నిజమే—'' నన్నాను.

''ఈ మాట కూడ రేపు విచారణలో చెప్పండి. ప్రస్తుతానికి వెళ్ళండి.'' అన్నారు. ''నే చేసిన నేరమేమిటి? అది చెప్పరేం?'' అన్నాను. ''విచారణ సమయంలో వివరంగా చెబుతారు. కాని నేను చూచాయగా చెప్పగలను. ఖైదు చేయబడిన వాడి దగ్గర మీ రివాల్వర్ వుంది. అది ఒక కారణం'' అన్నారు. '' ఆ రివాల్వర్ నతడు దొంగిలించి వుండవచ్చు కదా?'' అని అడిగాను.

''దొంగిలించి వుండవచ్చును కాని అందుకు ఆధారా లుండాలి. మీ మీద సందేహానికి ఇంకొక కారణం. హఠాత్తుగా నిన్న రాత్రి నుండి మీ భార్య అదృశ్య మవడం'' అని ఆయన చెప్పగావే నా గుండె జారింది. ''అయినా నా భార్య అదృశ్య మవడానికీ దీనికీ ఏమి సంబంధం?'' అని ప్రశ్నించాను. అందుకు ఆఫీసర్ చెప్పిన జవాబు వింటే ఇప్పుడు కూడా నాకు నవ్వొస్తూంది'' అని రాఘవన్ బలహీనంగా, కళావహీనంగా ఒక నవ్వు నవ్వాడు.

''అంత నవ్వొచ్చేలా ఏమి చెప్పారండీ?'' అని అడిగింది భామ.

''విచిత్రమయిన విషయమే చెప్పాడు, అందుకనే నవ్వాను. సీత ఒక విప్లవవాదియట! ఆమె, సూర్యా కలిసి చట్ట వ్యతిరేకమయిన పనులెన్నో చేస్తూ వచ్చారట. ఇండియన్ సైన్యాల రాకపోకల గురించి శత్రు దేశాలకు రహస్య రేడియోల తెలియజేస్తూన్నారట. నేను వాళ్ళకు తోడ్పడ్డానట. ఇటు పోలీసులకు చెప్పినట్లే చెప్పి అటు వాళ్ళకు హెచ్చరిక చేసి తప్పించుకు నేటట్లు చేశానట. సీత మాత్రం ఎక్కడో దాగుకుని వుందిట... ఇదీ కథ! ఎట్లా వుంది?'' అన్నాడు రాఘవన్.

''మీ భార్య విషయం ఏమయింది? ఏవన్నా కబురు తెలిసిందా?''

"ఏమీ తెలియలేదు. ఇందులో బాధాకరమైన వింత ఒకటి వుంది. నిన్న రాత్రి నేను మీతో కూడా చెప్పాను కదా? ఇకపై జీవితాన్ని కొత్తగా ప్రారంభిద్దామని, సీతతో హాయిగా వుందామనీ నిర్ణయించుకున్నాను. అట్లా నిర్ణయించుకుని ఇంటికి వెళ్ళేసరికి సీత కనపడలేదు! దీనికేమంటారు?"

"ఏమండీ! సీతను గురించి ఏమీ తెలియలేదంటున్నారే? మరి ఖైదు చేయబడిన సూర్యా నుండి వివరాలు ఏమీ తెలుసుకో లేదా? ఆ పోలీసు ఇన్స్‌పెక్టర్ మీ స్నేహితుడే కద?" అంది ధామ.

"ఆ, స్నేహితుడే ఇంతకు ముందొకసారికూడా నాకు సాయం చేశాడు. ఇప్పుడూ ఆయన మీద ఆశ పెట్టుకున్నాను. ఈ వూళ్ళోగనుక బహిరంగంగా సూర్యా కేసు విచారణ జరిగితే నేను ఆ అవమానం భరించలేను.. ఆ కేసును నాగపూర్‌కు పంపమని అడిగితే సరే అన్నాడు. నా పైన గుహ్య విచారణ జరిగితే నా తరపున మాట్లాడుతానన్నాడు, అయినా సీత గురించి ఏమీ తెలియలేదు. నెత్తి మీద తగిలిన గాయంతో పడివున్న సూర్యా కింకా పూర్తిగా స్పృహ రాలేదు. మధ్య మధ్య ఆ మత్తులోనే "సీతా! సీతా! ఆపద వచ్చింది! పట్టుకున్నారు, పట్టుకున్నారు!" అని పలవరిస్తున్నాడు. అతడెక్కిన టాక్సీ యొక్క డ్రైవరును నా ఎదుటే విచారించారు. వాడు చెప్పినదింకా విచిత్రంగా వుంది. పాజహానాబాద్, వెండి బజారు వద్ద ఒక యువకుడూ, యువతీ టాక్సీలో ఎక్కారట. జంతర్ మంతర్ వీధికి రాగానే ఆ యువతి టాక్సీ దిగి నడవ సాగిందట. కొంత దూరం వెళ్ళేసరికి ఆమె ప్రక్కగా వచ్చి ఒక కారాగిందట. ఆ యువతిని బలవంతాన ఎక్కించుకుని ఆ కారు వేగంగా వెళ్ళిందట. సూర్యా చెప్పాక ఈ టాక్సీ డ్రైవరూ వెన్నంటి టాక్సీ నడిపాడట. అయితే యమున వంతెన మీద ఆ కారు వెళ్ళగానే ఈ టాక్సీని ఆపివేశారట. వెంటనే పోలీసు జీపు టాక్సీ నందుకుందిట. వాడు చెప్పే గుర్తుల ప్రకారం అయితే ఆ బలవంతంగా తీసుకుపోబడిన యువతి సీత అనే అనిపిస్తున్నది. సీత నట్లా ఎవరు తీసుకువెళ్తారు? ఎందుకు తీసుకువెళ్తారు? ఆలోచించిన కొద్దీ తల గిర్రున తిరిగిపోతూంది" అన్నాడు రాఘునన్.

"మరయితే ఆ ముందు వెళ్ళిన కారును పట్టుకోవడానికి పోలీసువారేమీ ప్రయత్నించలేదా?" అని భామ అడిగింది.

"ప్రయత్నించారు. నాలుగు వైపుల తంతులనిచ్చారు, టెలిఫోన్ చేశారు. టాక్సీ డ్రైవర్ ఆ కారు నెంబరు ఇచ్చాడు. ఆ నెంబర్ వున్న కారును ఇక్కడికి నూరు మైళ్ళ తర్వాత ఆటకాయించి చూశారు. అందులో యువతి ఎవరూ లేదని వార్త వచ్చింది. పోలీసు ఇన్స్‌పెక్టర్ నన్ను ఫోన్ మీద పిలిచి చెప్పాడు!"

"అయితే మీ ఆవిడ జాడే తెలియలేదన్న మాట! మిస్టర్ రాఘవన్! మీకు నా హృదయపూర్వకమైన సానుభూతి!" అంది భామ.

"ఎట్లాగయితేనేమి నా జీవితం నాశనమయింది. ఇన్ని కోజులూ ఉద్యోగం ఉండేది. ఇప్పుడదీ పోయింది. ఇంక బ్రతకడం ఎందుకో అర్థం కావడం లేదు."

"అదేం మాట? మద్రాసులో బంగారం లాటి బిడ్డ వుంది. దానిని తీసుకొచ్చి హాయిగా వుండండి."

రాఘవన్ కళ్ళల్లో నీరు నిండింది. "బిడ్డను తీసుకువస్తే మొదట ఆది 'అమ్మేదీ?' అని అడిగితే ఏం చెప్పను? బిడ్డను తెచ్చినా చూచుకునే దిక్కెవరు?"

"దానికేం దిగులు? బిడ్డను తెచ్చేలోగా ఇంకొక తల్లిని రెడీగా వుంచాలి. ఇంటికి ఇల్లాలు, బిడ్డకు తల్లీను! ఉద్యోగ మంటారా చెంగేలేదు. నాన్నగా రింతకన్న పెద్ద ఉద్యోగం ఇప్పిస్తారు!" అంది భామ.

* * *

రాఘవన్ ఇంటికి వస్తూ దారిలో, 'ఇంకొక తల్లి' గురించి భామ చెప్పిన దానిని గురించి ఆలోచిస్తూ వచ్చాడు. ఆమె భావం అర్థమయింది. కాని అతడి మనసా విషయం గురించి ఆలోచించ నిచ్చగించ లేదు.

ఇల్లు చేరాక ఏడుపు మొహాలతో నిల్చున్న పనివాళ్ళను చూడలేక లోపలికి వెళ్ళిపోయాడు. అన్ని గదులలోకి వెళ్ళి వచ్చాడు. ఇటూ అటూ

తిరిగాడు. ప్రతీ గదీ, ప్రతీ మూలా, ప్రతీ వస్తువూ సీతనే జ్ఞాపకం చేస్తున్నాయి. ఆ ఇంటికి వచ్చిన మొదటి రోజుల మధుర జీవితం గుర్తొచ్చింది. ఆ తర్వాత వచ్చిన కలహాలు జ్ఞాపకం వచ్చాయి. ఆ కలహాలకు కారణం తానే, తప్పంతా తనదే ననిపించింది. కాని చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏమి లాభం? ఆ వెళ్ళినామె తిరిగివస్తుందా? ఆ చోట ఇంకొక స్త్రీని తెచ్చి ప్రతిష్ఠించడానికి మనస్సొప్పడం లేదే?

ఆలోచించగా ఆలోచించగా, సీత తన మీద విరక్తితోనే ఇల్లువదలి వెళ్ళి వుంటుందని తోచసాగింది రాఘవన్‌కు. తను పెట్టే హింసలను భరించ లేకనే వెళ్ళిపోయింది...బిడ్డను చూడడానికని రైలెక్కి మద్రాసు వెళ్ళి వుంటుందా? అట్లాగయితే త్వరలోనే తనకు కబురందుతుంది.

మూర్తి పట్టుబడడానికి, సీత కనబడకుండా పోవడానికి నిజంగా ఏదయినా సంబంధం వుందా? అబ్బే, వీలు లేదు.

కొన్నిసార్లు తాను సీత మనసు నొచ్చేలాగున సూర్యాను దూషించిన మాట నిజమే. అందుకు కారణం సీత పట్ల తనకేదో అనుమానం వుండడం కాదు. అటువంటి నీచత్వానికి తన మనసు పాల్పడలేదు. మరి సూర్యా మీద తన ఆగ్రహానికి కారణం ఏమిటి? అతడి గురించి పోలీసులకు కబురంద జేసేంత వెధవ పని తాను చేసిన కారణం ఏమిటి? తారిణితో సూర్యా స్నేహమే తన ఆగ్రహావేశాలకు కారణం. ఆ కోపాన్ని సీత మీద చూపించి ఆమె జీవితాన్ని నరకంగా చేసినందువలనే కొంప ఇట్లా మునిగింది!

ముందు రోజు సాయంత్రం పార్టీలో తారిణి తన్ను బ్రతిమాలడం గుర్తుకు వచ్చింది. సీతను మద్రాసులో వదిలివేసి బొంబాయికి రావలసిందనీ, వస్తే తన పుట్టుకను గురించిన రహస్యాన్ని చెబుతానని తారిణి చెప్పింది. ఏమిటా రహస్యం?

ధామ, భామలు తారిణి ప్రభుత్వపు గూఢచారిణి అన్నారు, అది పచ్చి అబద్ధం. ఆ ఆక్క చెల్లెళ్ళిద్దరూ చెడ్డవాళ్ళు. ఎప్పుడూ ఎవరినో ఒకరిని ఆడి పోసుకుంటుండమే వారి పని. వారి సావాసమే మంచిది కాదు. ఈ ఆపత్సమయంలో తన్నాదుకో గల్గినదీ, సాయం చేయగలదీ తారిణి ఒక్కతే.

తారిణి సెట్లాగయినా కలుసుకుని సంప్రతించాలి. సీత అదృశ్యమవడం గురించి ఆమెకు కొంటనే తెలియజేయాలి.

ఇంకొక రెండురోజుల సాటు నిన్న పార్టీ ఇచ్చిన ఉద్యోగస్తుడింట్లోనే వుంటానంది కదా? అక్కడికి ఫోన్ చేస్తే ఆమె దొరుకుతుందేమో?

టెలిఫోన్ చేసి అడిగాడు రాఘవన్. తారిణి లేదని చెప్పారు.

ఆ నిముషాన రాఘవన్‌కు తన భవిష్యత్తు శూన్యంగా గోచరించింది.

33

ఆగ్రా రైల్వేస్టేషన్ చాలా కోలాహలంగా వుంది. వచ్చే రైళ్ళూ, పోయే రైళ్ళూ మిళ్ళంటేలా శబ్దాలు చేస్తున్నాయి. ప్రయాణీకులు అసంఖ్యాకంగా తిరుగుతున్నారు రైళ్ళల్లోగాని ప్లాటుఫారమ్ మీదగాని కాళీ స్థలమన్నది లేదు ప్రయాణీకులలో, ఇంగ్లీషు, ఇండియన్ సిపాయిలు సగానికి సగం వున్నారు. మాజీ సేనాధిపతి వేవెల్ భారత దేశానికి వైశ్రాయిగా వున్నారు. అంతవరకూ ఆయన పాల్గొన్న యుద్ధాలన్నిటిలోను బ్రిటిషు సేనలు వెన్ను చూపించవలసి వచ్చింది. ఈ అపకీర్తిని పోగొట్టుకొనదలచిన వేవెల్ దొర గారు ఏది ఏమయినా ఇండియా రంగంలో మాత్రం వెనుక అడుగు వేయరాదని కృత నిశ్చయులై బ్రహ్మాండమైన సైనిక సమీకరణకు ఉత్తరవు లిచ్చారు.

ఎన్నో రైలు మార్గాలు కలిసే జంక్షన్ ఆగ్రా; అందుచేత అక్కడ రైలు బండ్లు నిరంతరంగా వస్తూ పోతూ వున్నాయి.

రెండవ తరగతి ప్రయాణీకులు వేచియుండే గదిలో ఒక మూల సీత కూర్చుని వుంది. ఆమె ప్రక్కన ఒక చిన్న పెట్టె వుంది. దాని మీద చేతి నానించి కూర్చుంది ఆమె. ఆమె మనస్సు ఎక్కడెక్కడో తిరుగుతూంది.

ఐదు సంవత్సరాలకు ముందు ఆదే ఆగ్రాకు సీత తన భర్తతో, సూర్యతో వచ్చింది. కోటనూ, తాజ్‌మహల్‌నూ చూచింది. ఎన్నో కలలు కంది.

ఆ కలలన్నీటినీ మించిన సంఘటన నిన్న జరిగింది. కొన్ని గంటలసేపు ఆమె తాను అంతఃపురాలలో వహించదగిన రాజకుమారి ననుకొని ఆమె ఆనంద తానందాన్ని పొందింది. కాని అంత ఆనందమూ ఒక్క క్షణంలో ఒక్కమాటలో ఎగిరిపోయింది. తాను ఉత్తి సీతేనని, సాధారణమనిషేనని తేలింది. ఆవిధంగా ఆమె ఊహా లోకంలో విహరించడానికి కారకులయిన వారామెను తీసుకొచ్చి ఆగ్రా స్టేషన్‌లో వదలి, ఢిల్లీ కొక రెండవ తరగతి రైలు టిక్కట్టు కొని యిచ్చి మాయమయ్యారు. టిక్కట్టుతో బాటు ఒక ట్రంక్ పెట్టెనూ ఇచ్చి వెళ్ళారు. ఆమెకు కలిగించిన కష్టానికి పరిహారంగా అందులో ఏదో కానుక వుందట—రాజమాతగా రిమ్మన్నారట. ఆ అమ్మగారి కానుక ఇక్కడెవరికి కావాలి? తద్దు వద్దంటుంటే వుంచి వెళ్ళిపోయారు.

పెట్టె తెరచి అందులో ఏముందోనని కూడ సీత చూడలేదు...సీతను బలవంతంగా తీసుకువెళ్ళిన వారామెకు ఏదో మత్తు మందు నిచ్చివుండాలి. మరు సటి రోజుదయం ఆమెకు కొద్దిగా స్పృహ వచ్చినప్పుడు పక్షుల కలకలారవం వినపడింది.

తర్వాత ఇద్దరు ముగ్గురు మాట్లాడుతున్నట్లు వినిపించింది.

"నిద్ర మందు ప్రభావం ఇంకా తగ్గలేదులా వుంది' అంది ఒక గొంతు.

"ఈమె నిజంగా నా సోదరియేనా?" అంది ఒక యువతి కంఠం.

"ఈమె నీలాగే ఈ అంతఃపురంలో పెరగవలసిన పిల్ల. కాని విధి ఈమెను దూరం చేసింది" అంది ఒక ఆడగొంతు. సీత ఒళ్ళు పులకరించింది. ఆ పార శ్యంలోనే ఆమెకు నిద్ర పట్టింది.

మళ్ళీ నిద్ర పూర్తిగా పోయి, మెలకువ వచ్చి, లేచి చూడగా సీత తానొక పెద్ద అంతఃపురపు గదిలో వున్నట్లు, విశాలమైన ఆ గదిలో,నగిషీలు చెక్కిన మంచం మీద మంచిమల్ పరుపుపై పడుకుని వున్నట్లు తెలుసుకుంది. అప్పుడొక దాసీది వచ్చి "ప్రక్క గదిలో ముఖం కడుక్కోవచ్చును" అనీ.

ఖాద్దుటి ఫలహారం తయారుగా వుందనీ వినయ విధేయలతో తెలిపింది. ఆమెను వీడేదో అడగాలనుకుంది సీత. కాని ధైర్యం చాలలేదు.

తాను విన్న సంభాషణ గుర్తుకు వచ్చింది. అందు మూలంగా, తాన్నె వరూ దురుదేశంతో తీసుకుని రాలేదని తెలిసింది.

ఇది ఏ సంస్థానమో, ఎవరి అంతఃపురమో? ఈ ఐశ్వర్యంలో తనకొక భాగముందా? తాను రాజ వంశంలో పుట్టిన రాజకుమార్తెయా? విధివశాత్తుగా ఇన్నాళ్ళూ దూరంగా వుండవలసి వచ్చిందా? ఆ ఆడగొంతు ఎవరు? ఆ రాజకుమారుడు తన తోబుట్టువా? ఇదంతా నిజమేనా? ఆహా! ఈ ప్రపంచంలో ఎన్ని వింతలు విడ్డూరాలు జరగడం లేదు! వాటిలో ఒకటి తన జీవితంలోనూ సంభవించినట్లుంది. లేకపోతే తన్ను ఇక్కడకు తీసుకురావడానికి ఇంత పెద్ద ప్రయత్నం ఎందుకు?

ఇవన్నీ తెలిసినప్పుడు ఆయన మనస్సు ఎట్లా వుంటుంది? ఒక రాజకుమారిని పెళ్ళాడడం తన భాగ్యమని మురిసిపోతారా? తన్నింత కాలమూ అతన పెట్టినందుకు దుఃఖిస్తారా? ఇకనుంచయినా తన్ను అగౌరవించకుండా ప్రేమగా ముద్దుగా చూచుకుంటారా?

నిద్ర మందు ప్రభావమూ, ఆమె కల్పనా శక్తీ కలిసి సీత చేత ఆకాశ కార్యాలను నిర్మింపచేశాయి.

వాళ్ళు మళ్ళీ వచ్చారు. రాజమాత, రాజకుమారుడు, వాళ్ళ అంత రంగికులూ—ముగ్గురూ వచ్చారు. సీత ఎనలేని కౌతుకంతో వారిని అనిమేషంగా చూచింది.

రాజమాత ముఖంలో చిరునవ్వు వెలిగింది. "అమ్మాయీ! మేము పరాయివాళ్ళం కాదమ్మా! నేను నీ చిన్న తల్లిని. ఇతడి నీ సహోదరుడు. కాల వైపరీత్యం వలన నువ్వు ఇంకెక్కడో నివసించడం తటస్థించింది" అందామె.

సీత దిగ్భ్రమలో వుంది. తానునుకున్నదంతా నిజమే సన్న మాట! నిరు పేద సీత రాజకుటుంబంలో పుట్టిన రాకుమార్తె! వింతల్లో కెల్ల వింత!

"అమ్మాయీ! నువ్వింకా మాట్లాడలేదు. నిన్ను ఇక్కడికి తెచ్చిన పద్ధతి నీకు నచ్చినట్లు లేదు; కోపంగా వున్నట్లున్నావు. అయితే నీకు నేను ఎన్నోసార్లు కబురు చేసినప్పటికీ నువ్వు రానిచ్చగించలేదు. అందువలననే నిన్ను బలవంతంగా ఇక్కడికి రప్పించవలసి వచ్చింది. నువ్వే ఆలోచించి చూడు. నీ సోదరుడికి త్వరలో పట్టాభిషేకం జరగనున్నది. అంతకు ముందుగానే నీకు జరిగిన అన్యాయానికి పరిహారం చెల్లించి, న్యాయం చేకూర్చాలని నీ సోదరుడు పట్టుబట్టాడు" అంది రాజమాత.

"సోదరీ! అమ్మగారు చెప్పిందంతా నిజమే. మిమ్మల్ని ఈ విధంగా ఇక్కడికి తెప్పించినది నా కోరికే. దారిలో ఇబ్బందులేమయినా కలిగివుంటే క్షమించండి. మీరు భారత దేశ స్వాతంత్ర్యం కోసం దీక్షతో కృషి చేస్తున్నారని తెలిసింది. అందుకు అంతరాయం కల్గడం నా కిష్టం లేదు. నాకూ ఈ సంస్థానికి రాజు కావడం పట్ల అంత మోజు లేదు. తెల్లవారిని తరిమివేసి దేశంలో స్వాతంత్ర్యాన్ని నెలకొల్పాలని నాకు ఆశగా వుంది. మీరూ ఇక్కడ వుండి నాకు తోడ్పడుతారని ఆశించవచ్చునా?" అని అడిగాడు రాజకుమారుడు.

కళ్ళకు గంతలు కట్టి నట్టడవిలో వదలిపెట్టినట్లుండింది సీతకు. ఇదేమి తోద్యం? వీళ్ళు ఏమిటేమిటో మాట్లాడుతున్నారే?

"నేనొక అబలను. నిస్సహాయురాలిని. నేను మీకేమి సాయం చేయగలను? పైపెచ్చు నా భర్త అనుమతి నడగవద్దా? ఆయనకు తెలియకుండా నన్నిట్లా తీసుకురావడం తప్పుకాదా?" అంది సీత.

మిన్ను విరిగి మీద పడ్డట్లయింది వారికి!

ఆ మూడవ వ్యక్తిని చూచి రాజమాత అంది: "గ్యాన్ దాస్! బాగా చదువుకున్నదన్నారే, ఇట్లా మాట్లాడుతున్నదేమి?"

గ్యాన్ దాస్ తన జేబులో నుండి సంభ్రమంతో ఒక ఫోటోను తీసి చూశాడు: "అయ్యో! తప్పయి పోయింది! ఈమె ఆ అమ్మాయిలాగే వుంది కాని ఆమె కాదు. అరెరే! ఎంత పెద్ద పొరబాటు జరిగింది? ఇప్పుడేమి

చేయడం?', అని అంగలార్చాడు.

సీతను చూచి రాజమాత ''అమ్మాయీ! నిజం చెప్పు. నీ పేరు తారిణీ కాదా?'' అని అడిగింది.

ఆ ఒక్క ప్రశ్న ద్వారా సీతకు అన్ని విషయాలూ అర్థమయ్యాయి. ఆమె ఆకాశ సౌధాలూ, మనోహర్మ్యాలూ కూలి నేల పాలయ్యాయి. ఆహా! ఈ ముగ్గురు మూర్ఖులూ కలిసి తారిణి అనుకుని తన్నిక్కడకు తెచ్చారు. తానూ మోసపోయి ఏదేదో కలలు కంది! ఆ కలలకు ఇంద్ర చాపపు రంగులు పూసుకుంది! ఆకాభంగం వలన, అసూయవలన, ఆక్రోశం వలన సీత ఎద అగ్ని పర్వత మయింది. ఆమె నోటి నుండి మాటలు లావాలా దూసుకొచ్చాయి.

''నేను తారిణీ కాదు. మీ ధూర్త రాజవంశంలో పుట్టలేదు. తలుపు చెలుకులతో మూర్ఖులయిన మగవారికి మత్తెక్కించి వలలో వేసుకునే టక్కులాడిని కాను. నే నొక పేద కుటుంబంలో పుట్టిన పేదరాలిని; తాళి కట్టిన భర్తతో గౌరవంగా కాపురం చేసుకునే ఇల్లాలిని. మీ మూర్ఖత్వం కారణంగా నన్నిట్లా బజారు పాలు చేశారు. ఇన్నాడు నాగతేమిటి?'' అని రోదించింది సీత.

''అమ్మాయీ! అనవసరంగా గొడవ చేయకు. తెలియకుండా జరిగింది ఈ పొరబాటు. నిన్ను మళ్ళీ వెనక్కు తీసుకువెళ్ళి వదిలే ఏర్పాటు చేయిస్తాను. తప్పిదానికి క్షమించు'' అంది రాజమాత.

''మీకేమి, స్వార్థపరులు! మహాపాపులు. నా భర్త కేమని చెప్పను? మీరు దయా దాక్షిణ్యంలేని క్రూరులు. నన్నిట్లా అరడిపెట్టిన మీ వంశం సమూలంగా నాశనమయి పోతుంది...''

అక్కడ నిలవలేక రాజమాతా, రాకుమారుడూ చరచర వెళ్ళి పోయారు. పోతూ పోతూ గ్యాస్‌పింగ్‌ని గట్టిగా చీవాట్లు పెట్టి వెళ్ళారు. అతడు క్షమాపణ కోరుతూ, సంజాయిషీ చెబుతూ వెళ్ళాడు.

వాళ్ళు వెళ్ళాక సీత కళ్ళనుండి నిరంతరాయంగా అశ్రుధార ప్రవహించింది. పురాణగాథలలోని సీతకో గనుక శక్తి వుండి వుంటే వాళ్ళ ముగ్గురిని భస్మం చేసి వుండేది.

"ఆహా! ఎక్కడికి వెళ్లినా ఆ రాక్షసి తన శత్రువుగా ఎదురవు తూంది. తన ఆశలను నేలపాలుచేసి తన జీవితాన్ని నాశనం చేయడానికనే పుట్టినట్టుంది. ఓసీ మోహనరూప రాక్షసీ! నిన్ను నాశనం చేయడాని కెవడయినా వీర పురుషు డెవడయినా రాడా? నిన్నీసారి చూస్తే విషం పెట్టి చంపుతాను. పీడా విరగడయి పోతుంది."

అవమానానికీ ఆశాభంగానికీ గురయిన సీత మనసులో ఇటువంటి దారుణ మయిన ఆలోచనలు తలెత్తాయి.

ఆ తర్వాత అన్నీ త్వరత్వరగా జరిగాయి...ఆగ్రా స్టేషన్ వెయిటింగ్ గదిలో కూర్చొన్న సీతకు పైవన్నీ తన జీవితంలో జరిగిన సంఘటనలనిపించ లేదు.

ఇప్పుడేమి చేయడం? భవిష్యత్తు అన్నది ఒకటి వున్నది. దానిని ఎట్లా దిద్దుకోవడం? తన చేతిలో ఢిల్లీకి రైలు టిక్కట్టు వుంది, నిజమే. రైలు కొద్ది సేపట్లో వస్తుంది. కాని ఢిల్లీ వెళ్ళి ఏమి చేయడం? ఆయన మొహం ఎట్లా చూడడం? రెండు రోజుల నుండి ఎక్కడి కెళ్లావని అడిగితే ఏమి చెప్పడం? అసలే కారణం లేకుండా మండిపడే ఆయన తన్నసలే నిరాకరించ వచ్చు కదా...? సూర్యాతో కలిసి తానేదో కుట్ర చేసినట్లు అనుకోవచ్చు కదా? అలాగనుకుంటే తన్ను స్వీకరిస్తారా? జరిగినదంతా చెబుతే కట్టుకథలనవచ్చు కదా? నమ్మక పోవచ్చు కదా? అన్ని జరి'న తనకే జరిగినదానిని నమ్మడం కష్టంగా వున్నప్పుడు ఆయనెట్లా నమ్ముతారు? ఆయనను ఎట్లాగయినా వదలి వెళ్లాలని మొదటే అనుకున్నట్లుగా చేస్తేనో? అయితే ఎక్కడికి పోవడం? చెన్నపట్నంలో వాసంతి వుంది. కాని అక్కడికి వెళ్ళి అత్త మామల నెట్లా చూడడం? ఉన్నట్లుండి ఒంటరిగా వచ్చినందుకు వారికేమి కారణం చెప్పగలను? అంతకన్న సూర్యా చెప్పినట్లు కలకత్తా పోవడం మంచిది. అక్కడ లలిత స్నేహితురాలు చిత్ర వుంది. ఆమె ఇంటికి మొదట వెళ్ళి అక్కడినుండి చెన్నపట్నానికి వుత్తరం రాయాలి. అక్కడి పరిస్థితి ఏమిటో తెలుసుకున్నాక వెళ్లవచ్చు...అయినా మద్రాసు కెందుకు వెళ్లాలి? కలకత్తాలో

స్వతంత్రంగా బ్రతకడానికి ఒక ఉద్యోగం చూచుకోవడమే మంచిది. ఈ రోజుల్లో ఎందరో ఆడవాళ్లు ఉద్యోగాలు చూచుకుంటూ వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి వున్నారు. అదే విధంగా తానూ ఒక ఉద్యోగంలో చేరి, తర్వాత వాసంతికి వుత్తరం రాసి దానిని తన దగ్గరకు పిలిపించుకోవడం మంచిదేమో!

ఇట్లా పరి పరి విధాల ఆలోచించిన సీత చివరకు కలకత్తాకే వెళ్దామని నిర్ణయించుకుంది.

34

ప్రపంచ మహా నగరలలో కెల్లా నవయౌవన శోభతో విలసిల్లేది కలకత్తా నగరం. ఆ నగర సుందరి సుందర శరీరం మీద నీలిరంగు పట్టు పమిటవలె వొయ్యారంతో పారుతుంది ఏరు. ఆ పమిటికు అంచులవలె ఆ ఏటికిటూ, అటూ పచ్చటి గడ్డిమైదానాలు వున్నాయి.

ఏటి నడుమ చిత్రకారుడు తీర్చిదిద్దిన చిత్రంవలె చెట్లు చేమలతో నిండిన ద్వీపం అలరారుతున్నది. ఏటి నీటిలో అక్కడక్కడ తెల్లటి పక్షులూ, పడవలూ, కనుపిస్తున్నాయి. ఏటి మధ్య ద్వీపం నుండి పక్షుల కిలకిలా రవాల గానాన్ని చల్లటి పిల్లగాలి నలుదిశలకు మోసుకు వెళ్తూంది. ఉత్సాహపూరిత మైన ఆ సాయం సమయాన ఏటి ఒడ్డున గడ్డి మీద అక్కడక్కడ స్త్రీలు, పురుషులు కూర్చుని వున్నారు. కొందరు ఏకాంతంగా గడ్డి మీద పడుకుని పగటి కలలు కంటున్నారు; కవితలల్లుతున్నారు.

కొందరు గుంపులు గుంపులుగా కూర్చొని వాదించుకుంటున్నారు.

దేవవట్నం వకీలు దామోదరం పిల్లకొడుకు అమర్‌నాథూ, అతడి భార్య చిత్రా అక్కడ కూర్చొని వున్నారు.

"ఈ అందం తిరుచెందూర్ సముద్ర తీరానికి కూడా లేదు" అంది చిత్ర.

"నీకింకా ఈ వంగదేశం మీద మోజు తగ్గినట్లుంది. నాకేమో ఈ సరస్సు సంతోషం కల్గించడం లేదు; దుఃఖం కలిస్తూంది. తన ముద్దు బిడ్డల దయనీయ స్థితిని చూచి వంగమాత కార్చిన కన్నీరే ఈ సరస్సేమో నని పిస్తూంది."

"ఒకప్పుడు మీరు 'బంకించంద్రుడి నవలలను, రవీంద్రుడి గీతాలనూ చదివి వంగమాత కార్చిన ఆనంద భాష్పాలే ఈ సరస్సు—" అన్నారు గుర్తుందా?

"ఆ ఆనందాన్ని భయంకరం క్షోమం వచ్చి మాయం చేసింది. ఆకలిలో అలమటించి చనిపోయినవారి శవాలు వీధుల కిటూ అటూ పడివుంటే ఇంకా కవిత్వా లేమిటి, గానాలేమిటి? అందుకనే గాంధీ మహాత్ము డన్నాడు! "ఆకలితో జనులు అలమటించే దేశంలో కళ ఏమిటి, కవిత లేమిటి, పాట లేమిటి?" రాట్నం మోతయే మధురాతి మధురమైన సంగీతం" అన్నాడు.

"ఈ బెంగాలీలు ఇంత దైవభక్తి, దేశభక్తి కలవాళ్లు కదా! మరి దేవుడు వీళ్ల నెందుకిట్లా పరీక్షి స్తున్నాడో?" అని విస్మయం ప్రకటించింది చిత్ర.

"బెంగాలీలు మంచివాళ్ళే కానీ వీళ్లకో దుర్గుణం వుంది. చాల సంకు చితమైన దృక్పథం ఒకటి వుంది. "బెంగాలీలు దైవజాతి జనులు, మిగిలినవాళ్లు అధములు" అన్న భావం వుంది వీళ్లకు...ఆ చెడ్డ గుణం వుందిగనుకనే దేవుడు వీరి నిట్లా దండిస్తున్నాడు."

"దేవుణ్ణి అంత కఠినుడిగా ఎందుకు చిత్రిస్తారు? కృష్ణ చైతన్యుడూ, రామకృష్ణ పరమహంసా, వివేకానందుడూ పుట్టిన ఈ భూమి బిడ్డలనాయన కరుణ లేకుండా దండిస్తారా? సురేంద్రనాథ్ బెనర్జీ, సుభాష్ చంద్రబోసుల వంటివాళ్ళు పుట్టిన వంగ దేశీయులకు ఆ మాత్రం స్వరాష్ట్రాభిమానం వుండదీ ఏం?"

"మరయితే వీరి కష్టాలకు కారణం ఏమిటంటావు?"

"మనుష్యులు చేసే పనులే కారణం. ధనమోహం పట్టుకున్న పిశాచాలు పండిన ధాన్యానంతా మూటలు కట్టి దాచివేస్తే క్షామం రాకుండా వీలవుతుంది?"

"ఆ మనుషులను సృష్టించింది దేవుడే కదా! సకలచరాచర జీవులలో, వస్తువులలో వున్నది ఆ దేవుడే కద? కనుక మనుషులు చేస్తే దేవుడు చేసినట్లే కద?"

"మీరు కమ్యూనిస్టులతో చేరి నాస్తికులయి పోయారు. నేను మీతో మాట్లాడలేను."

"కమ్యూనిస్టుల వలన ఒక్క మేలయినా జరిగింది. ఒక నారీమణి నోరు మూతపడింది!" అని ఎకతాళిగా అన్నాడు అమర్‌నాథ్.

కొంతసేపు వూరుకుని చిత తర్వాత—"సుభాష్‌బాబు ఇక్కడ వుండి వుంటే ఇప్పుడు విప్లవం బయలుదేరి వుండేది...ఆయన ఇప్పుడు మలయా దేశంలో సమీకరిస్తున్న సైన్యంలో భారత వీరులు అసంఖ్యాకంగా చేరుతున్నారట! ప్రాణాలను సైతం త్యాగం చేయగల ధైర్యాన్ని కల్గించిన ఆ సుభాష్‌బాబే నిజమైన నాయకుడు!" అంది.

"సుభాష్‌బాబు పట్ల నీమోజింకా తగ్గలేదు. సుభాష్‌బాబు జయిస్తే ఏమి జరుగుతుందో తెలుసా? ఇంగ్లీషువాళ్ళ పాలనకు బదులుగా బెంగాలీ వాళ్ళ పాలన వస్తుంది!" అన్నాడు అమర్‌నాథ్.

రానివ్వండి! పరాయివాళ్ళ కాళ్ళ క్రింద నలగడం కన్న బెంగాలీల పాలన క్రింద వుండవచ్చు కద?"

"ఉండవచ్చు కాని, నీకింతాక చెప్పానే అదే తంటా! బంకించంద్ర ఛటర్జీ 'ఆనందమఠ్' నవలలో ఎవరిని సర్వోత్కృష్టంగా చిత్రించారో తెలుసా? బెంగాలీలను! 'వందే మాతరమ్' అన్న గీతంలో 'ఏడు కోట్ల జనులు' అనే వుంది. దానిని తర్వాత ముప్పై కోట్లుగా మార్చారు. బెంగాలీల కొచ్చిన దుర్గుణం ఇదే."

"టాగూర్ బెంగాలీయే కద? అయినా ఆయన వసుధైక కుటుంబం

గురించి పాడలేదా? మీరు బెంగాలీల నిష్ఠా విమర్శించడం నాకు నచ్చలేదు. అందులోనూ మనం ఇక్కడ వుంటూ ఈ మాటలనడం బొత్తిగా బాగులేదు... ఇక లేవండి...హౌరాకు వెళ్లాలన్నారు కదా?" అంటూ లేచింది చిత్ర.

"నే నిక్కడ ఎక్కువ కాలం వుండబోను. తమిళనాడుకు వెళ్ళిపోదామనుకుంటాను" అంటూ అమర్ నాథ్ కూడా లేచాడు.

ఇద్దరూ వెళ్ళి కారులో ఎక్కారు.

అమర్ నాథ్, చిత్రాలు జాలిగంజ్ లో ఒక అందమైన ఇంట్లో వుంటున్నారు. మనుషులెల్లా సరస్సు వద్దకు తరచు వచ్చేవారు. కాని క్షామ పీడితులు కలకత్తా నిండా చేరడం మొదలయినప్పటినుండీ వాళ్ళు రావడం తగ్గించేశారు. అంతే కాదు? చిత్ర ఒక క్షామ నివారణ సంఘంలో చేరి పని చేస్తూంది. మొదట ఆ సంఘం వారు బర్మా నుండి వచ్చిన శరణార్థుల పునరావాసంకోసం కృషి చేశారు. ఆ పని ముగింపు వస్తుండగా ఈ కరువు ప్రారంభమయింది. ముఖ్యంగా క్షామ పీడితులయిన స్త్రీలకు పిల్లలకు సేవచేస్తూంది ఈ సంఘం.

ఇప్పుడు ఆ క్షామ నివారణ పని ఒత్తిడి కాస్త తగ్గినందున అమర్ నాథ్, చిత్ర, కాస్త ఏటి గాలిని పీల్చి, హౌరా వెళ్ళి మిత్రులను చూచి వద్దామని అనుకున్నారు. హౌరా స్టేషన్ సమీపాన పెద్ద పెద్ద వ్యాపారం సంస్థలున్న వీధులున్నాయి.

"క్షామంలో లక్షలాది ప్రజలు మరణించారంటారే ఈ వీధుల్లో మాత్రం రద్దీ కొద్దిగా కూడా తగ్గలేదే?" అన్నాడు అమర్ నాథ్.

"తగ్గకపోతే పోన్లెండిగాని తమరు కారు నెవరి మీదకయినా నడిపి జవాబు తగ్గించే యత్నం చేయకండి—" అంది చిత్ర.

"ఈ వీధిలో ఎవరి మీద కారు నెక్కించినా వాడొక బ్లాక్ మార్కెట్ వ్యాపారి అయి వుంటాడు. అట్లాటివాడిని చంపడం దేశసేవ చేయడం తెలుసా?" అన్నాడు అమర్ నాథ్.

సాయంకాలం రాత్రవుతూంది. వీధి కిరువైపుల వున్న దీపాలు వెలిగాయి. కాని అన్నిటికీ ఏర్ - రెయిడ్ - ప్రికాషన్ (ఏ. ఆర్. పి.) దృష్ట్యా

తొడుగులు తొడిగివున్నందున వెలుతురు మందకొడిగా వుంది.

మునుపెల్లా ఈ వీధులు దీపాలతో ఎంత శోభాయమానంగా వుండేవి! ఈ జపాన్ యుద్ధం రానన్నా వచ్చింది. కలకత్తా కళే పోయింది.'' అంది చిత్ర.

ఇట్లా ఆమె అంటూండగానే దిక్కులు దద్దరిల్లేట్లు 'ఢాం ఢాం' అని చప్పుడు వినబడింది. వెంటనే ఏ. ఆర్. పి. సైరన్లు ఒళ్లు కంపించేలా శోకంగా గింగురు మనసాగాయి. జపాన్ విమానం బాంబులు ప్రయోగిస్తూందని, సైరన్లు ముందు హెచ్చరిక చేయడానికి బదులుగా, తర్వాత హెచ్చరిక చేస్తున్నాయనీ అమర్‌నాథ్ చిత్ర తెలుసుకున్నారు. వాళ్ళకిది క్రొత్త అనుభవం; గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చిత్ర అమర్‌నాథ్ భుజాన్ని గట్టిగా పట్టుకుంది. అతడు నెమ్మదిగా కారును వీధి ప్రక్కగా ఆపాడు. వీధిలో ఇసుక వేస్తే రాలనంతగా వుండిన జనం ఒక్కరు కూడా లేకుండా మాయమయ్యారు. కార్లూ ఇతర బండ్లూ ఆగిపోయాయి.

బాంబుల శబ్దం ఆగి అయిదు నిముషాలయింది. 'ఇహ పోవచ్చు' అని వారనుకుంటుండగా కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు కనబడింది! వంద సూర్యుళ్ల వెలుగది! వెంటనే మాయమయింది అది. వెన్వెంటనే పెద్దగా—బ్రహ్మాండం పగిలిపోతున్నట్లు - శబ్దం! మోటారుకార్లు వణికాయి. వాటి అద్దాలు పగిలి రాలుతున్నాయి. చుట్టుప్రక్కల జనుల ఆర్తనాదాలు విన్పిస్తున్నాయి.

ఇంతటితో ముగియలేదు. దట్టమైన నల్లటి పొగ, ఆ పొగ ఎర్రటి అగ్ని జ్వాలలు భూమినీ దివినీ ఏకం చేస్తున్నాయి.

ఇంతసేపూ అమర్‌నాథ్‌ను గట్టిగా పట్టుకునే వుంది చిత్ర. ఇప్పుడు గజ గజ వణికిపోతూ అడిగింది. ''ఏమండి, ఏమిటిది? ఇంత పెద్ద జ్వాల లేమిటి?''

''ఇప్పుడే నాకూ బోధపడుతూంది. టి. ఎన్. టి. అనే ప్రేలుడు పదార్థం గిడ్డంగి అగ్ని ప్రమాదానికి గురి అయి వుండాలి. అందుకనే అంత పెద్దగా చప్పుడయింది'' అన్నాడు అమర్‌నాథ్.

''కారును వెనక్కు త్రిప్పండి. ఇవాళ హౌరాకు వెళ్లవద్దు.''

"కాస్త ఆగు. నా చేతులు వణకడం తగ్గనీ! హఠాత్తుగా వెళ్ళాలన్నా వెళ్ళలేము ఇవ్వాళ!" అన్న అమర్‌నాథ్ మాటల నిజాన్ని బుజువు చేస్తూ మంటలు ఇంకా ఇంకా పైపైకి లేవసాగాయి. చిన్న చిన్న మంటలు కొత్తగా ఆరంభమయ్యాయి. పొగల తెరలు ఆకాశాన్ని కప్పివేయసాగాయి. జనులు కేకలతో ఏడ్పులతో నిప్పంటుకున్న చోట్లకు పరుగెడుతున్నారు. నలువైపుల నుండి 'ఠంగ్ ఠంగ్' మని గంటలు మోగించుకుంటూ అగ్నిమాపక శకటాలు పరుగెత్తి వస్తున్నాయి.

అమర్‌నాథ్ చిత్ర కారెక్కాడు. కారు ఆ వీధి దాటి ప్రక్క వీధిలో వెళ్ళింది. అక్కడ కొద్ది దూరంలో జనం గుంపుగా వున్నారు. దగ్గరకు వెళ్ళి చూస్తే ఒక మార్వాడీ దుకాణంలోకి జనులు దూరి చిత్తం వచ్చిన సామాన్లు తీసుకుని పరుగెడుతున్నారు. ఆ జనసమ్మర్దాన్ని చూచి అమర్‌నాథ్ కారును వెనక్కు మళ్ళిద్దామా అనుకున్నాడు. కాని వేరే మంచి దారి ఏదీ లేదు. ఈ అలగా జనానికి భయపడి వెనకకు తిరగడమా అన్పించింది. ముందుకు, ఆ జన సమ్మర్దంలోకే కారును నడిపాడు. కొందరు కారు బానెట్‌ను చేతిలో తట్టారు; మరి కొందరు తలుపులు తట్టారు. కొందరు బండిని లాగి ఆపుదామని యత్నించారు. 'హేయ్!' అంటూ బెదరిస్తూ అరిచారు కొందరు. 'మారో మారో!' అని అరిచింది ఒక గొంతు.

భయ భయంగానే కారును ముందుకు తోలాడు అమర్‌నాథ్. కాని ఎవరికీ ఏమీ అపాయం వాటిల్లలేదు. జనుల గుంపును దాటగానే కారు వేగాన్ని హెచ్చించాడు.

"చిత్రా! చూశావా మనవాళ్ల లక్షణం? ఎక్కడో బాంబులు పడ్డాయి! ఎక్కడో నిప్పంటుకుంది! ఇక్కడ దుకాణాలు కొల్లగొడు తున్నారు. ఇంతోటి దేశానికి స్వరాజ్యం ఒక్కటే తక్కువ!"

కొంత దూరం వెళ్ళాక వీధి ప్రక్కగా ఒక బస్సు ప్రక్కవాటుంగా పడి కాలుతుండడం కనపడింది.

"బస్సుకు నిప్పంటుకుందండీ!"

"ఎవరో నిప్పు పెట్టి వుంటారు!"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? గూండా వెధవలకూ, ఆకతాయిలకూ కారణాలతో పనేమిటి? హత్య, మానభంగం, నిప్పు పెట్టడం, దొంగతనం—ఇవన్నీ నిష్కామకర్మల్లాగా చేస్తారు వాళ్లు!"

కొంత దూరం వెళ్ళాక వీధికి ప్రక్కగా ఎవరో పడివున్నట్లు కనపడింది. అది స్త్రీ రూపంవలె అన్పించింది. ఆ ప్రక్కనే ఒక బ్బాయి వంగి నిల్చొని వున్నాడు.

"ఆపండి! ఆపండి!" అని అరిచింది చిత్ర.

కారాగింది. అది చూచి ఆ అబ్బాయి కాలికి బుద్ధి చెప్పాడు.

"ఆ అబ్బాయి ఏం చేస్తున్నాడు?" అని అడిగింది చిత్ర.

"చేతి గాజుల్ని తీయబోతున్నాడు. మనల్ని చూచి పారిపోయాడు."

"ఇద్దరూ దిగి ఆ పడివున్న మనిషిని సమీపించారు.

"అయ్యో! మద్రాసు వైపు అమ్మాయి! వయసూ ఎక్కువ వున్నట్లు లేదు" అంది చిత్ర.

"మద్రాసు వైపు అమ్మాయి అని యముడు వదిలిపెడతాడనుకున్నా? వాడ్డం అయిందిగా, పోదాం పద!" అన్నాడు అమర్‌నాథ్.

క్రింద పడివున్న స్త్రీ ముక్కు దగ్గర వేలుపెట్టి చూచింది చిత్ర. ఊపిరాడుతూంది. "ప్రాణం వుందండీ! తొందరగా పట్టుకోండి" అంటూ చిత్ర ఆ యువతి తల క్రింద చేతులు పెట్టి పైకెత్తింది. "ఎందుకట్లా చెట్టులా నిల్చుంటారు? కాళ్ళ పక్క పట్టుకోండి."

"ఎవరో దారిని పడివున్న ఆడదాని ధర్మమా అని 'చెట్టు' అని చీవాట్లు తినడం—ఆ పైన ఆ ఆడదాని కాళ్లు పట్టుకోవడం—ఇదీ మన అదృష్టం!" అంటూ ఆ పడివున్న యువతి కాళ్లు పట్టుకుని పైకెత్తాడు అమర్‌నాథ్. ఇద్దరూ కలిసి ఆమెను మోసుకొచ్చి కారులో పడేశారు.

"నడపండి! వేగంగా నడిపి ఒక ప్రాణాన్ని కాపాడండి!"

కారు నడుపుతూ అడిగాడు అమర్‌నాథ్ ''ఎక్కడికి?''

''ఇంకెక్కడికి? ఇంటికే?''

''ఇంటికా? అయితే కారు నాపేస్తాను. ఈదిక్కు మొక్కలేని మనిషి మనింటిబో చచ్చిపూచుంటే ఏం చేస్తాం—?'' అన్నాడు అమర్‌నాథ్.

''ఎంత దయలేని వారండీ మీరు! అయితే అనాథశరణాలయానికి నడపండి కారును—'' అంది చిత్ర.

కారు వేగంగా నడపసాగాడు. వేగంగా గాలి మొహం మీదకు వీచి నందువలన కాబోలు అచేతనంగా పడివున్న ఆ స్త్రీ మొహంలో కొంత కదలిక కన్పించింది. శరణాలయం చేరాక ప్రథమ చికిత్స చేసేసరికి ఆమె పరిస్థితి బాగా మెరుగయింది. ఇంక ప్రాణానికి అపాయం లేదని తెలుసుకున్నాక చిత్ర, అమర్‌నాథ్ అక్కడినుండి వెళ్లిపోయారు.

35

ప్రొద్దుట ఒక అర గంటసేపు బాగా వర్షం కురిసినందున కలకత్తా వీధులు శుభ్రంగా వున్నాయి. వీధుల కిరుప్రక్కల వున్న చెట్ల నుండి వాననీటి బొట్లు ముత్యాల జల్లుగా రాలుతున్నాయి. పక్షులు తమ తడిసిన రెక్కలను విదిలించుకుంటున్నాయి. మేడ వసారాలో నిలుచుని ఈ దృశ్యాన్ని చూస్తూంది. ఆమె భర్త అమర్‌నాథ్ ఆఫీసుకు వెళ్లడానికి తయారు అవు తున్నారు.

''ఇవాళ తొందరగా రండి. వాన కురిసినందున చెరువుగట్టుమనోహరంగా వుంటుంది. మనం వెలుదాం'' అంది చిత్ర.

"సరే, సరే! ఆ రోజు పిల్లింది చాలదా? ఇవాళ గూడా దారిలో ఏ అబలనో రక్షించాలా? ఈ బాబరబందీ అంతా లేకుండా మంచి సినిమాకు పోదాం పద! 'అన్నా-కెరనీన' వచ్చిందట!"

"మీ మొగవాళ్ల పోకడే విచిత్రంగా వుంటుంది. సినిమాలోనో, నాటకంలోనో గనుక ఒక అనాథ స్త్రీ వీధి ప్రక్కన పడివుంటే జాలితో కరిగి పోతారు. అదే నిజంగా జీవితంలోనైతే ముఖం ప్రక్కకు తిప్పేసి వుంటారు! ఎవరో ఊరి పేరు లేని ఆడదాని పట్ల మీ కింత కారుణ్యం ఎందుకు?"

"ఊరు పేరు లేనందువల్లనే మనం జాగ్రత్తగా వుండాలి. ఆమె యోగ్యురాలైతే తన పూరా పేరూ చెప్పడానికి జంకనేల? ఇప్పటికింకా చెప్పలేదు కదా?" అన్నాడు అమర్‌నాథ్.

"దానికేం, ఎన్నో కారణాలు వుండవచ్చు. చాలా దుఃఖాల పాలైన మనిషి లాగుంది. అనాథశరణాలయపు వార్డన్ చౌదురాణి ఈ యువతిని చాలా బాగడుతుంది. రోజూ యాభైమంది పిల్లలకు స్నానాలు చేయిస్తుందట. అలసట న్నది లేకుండా పని చేస్తుందట. ఆమె యిక్కడే వుండిపోతే తనకెంతో సహాయంగా వుంటుందని చౌదురాణి చెబుతూంది."

"అంత మంచి వ్యక్తి అయితే తన వివరాల నెందుకు చెప్పలేదు?" అన్నాడు అమర్‌నాథ్ మళ్ళీ.

"ఏమో, ఆమె మొగుడు మీలాగా దయలేని వాడేమో, ఇంటి నుంచి వెళ్ళగొట్టాడేమో, అని చెప్పడాని కీమె సిగ్గు పడుతున్నదేమో?" అంది చిత్ర.

"అలాగేం, అయితే ఎవ్వడో ఒకడు నిన్ను ఇంటినుండి వెళ్ళగొడతా, చూస్తూండు" అన్నాడు ఆమె భర్త.

"అట్లా చేస్తేనా నేనీ మంచి అమ్మాయిలా వూరోక్కను; నన్ను వెళ్ళగొట్టిన ముద్దుల భర్త ఎవరో ప్రపంచమంతా చాటుతాను" అంది చిత్ర.

పనివాడీలోగా ఆరోజు వచ్చిన వుత్తరాలన్నీ తెచ్చి అక్కడ పెట్టాడు. అమర్‌నాథ్ వాటిని మొదట చూశాడు. "శ్రీమతి చిత్రాదేవికి లలితాదేవి రాసినటున్నాడు" అంటూ ఒక వుత్తరం తీసి ఇచ్చాడు. తర్వాత తన వుత్త

రాలను చింపి చూడసాగాడు.

చిత్ర తన వుత్తరాన్ని చదివింది, "విన్నారా ఈ కథను?" అంది. అమర్‌నాథ్ తలెత్తి చూశాడు.

"లలిత అన్నయ్య సూర్యా ఢిల్లీలో పోలీసు వారినుండి తప్పించుకుపారిపోయాడట; తుపాకితో కూడా కాల్చడట ! అప్పుడు పోలీసు లతడిని అరెస్టు చేశారట. సూర్యాకు పెద్దగా దెబ్బ తగిలి ఆస్పత్రిలో వున్నాడట. లలిత చాలా బాధపడుతూ రాసింది...సీత ఉన్నట్టుండి ఒక రోజు మాయమయిందట. ఏ కబురూ లేకుండా అదృశ్య మయిందట! సూర్యా పట్టుపడడమూ, సీత అదృశ్యం కావడమూ రెండూ ఒకే రోజు జరిగాయిట. సీత భర్త లలిత వాళ్ళ నాన్నకివన్నీ రాశాడట! ఒకవేళ సీత రాజంపేటకు గాని, దేవ పట్నానికి గాని వస్తుందేమో, వస్తే తనకు వెంటనే తెలుపమని రాశాడట!" అని చెప్పింది చిత్ర.

ఇది వింటున్న అమర్‌నాథ్ ఆలోచనలో మునిగాడు. ఉన్నట్టుండి అతడు "చిత్రా! నాలుగు రోజుల ముందు ఢిల్లీ వార్త ఒకటి పత్రికలో వచ్చింది, గుర్తుందా?" అంటూ గదిలోకి వెళ్ళి, పాత దినపత్రికల కట్ట నుండి, తనకు కావలసిన నాలుగు రోజుల క్రిందటి పత్రికను తీసుకువచ్చాడు. "ఆ...ఇదిగో ఆ వార్త!" అని చదవసాగాడు.

"నాలుగు రోజుల క్రింద సూర్యనారాయణన్ అన్న విప్లవవాదిని పోలీసులు అరెస్టు చేశారన్న వార్త ఈ పత్రిక పాఠకులకు తెలిసిందే. ఖైదు చేస్తుండగా పోలీసువారిని ఎదిరించిన కారణంగా నేరస్తుడికి బలంగా గాయాలు తగిలాయి. చికిత్సకని అతడిని పోలీసువారు ఆస్పత్రిలో చేర్చారు. నిన్నరాత్రి అతడి కాపలా కాస్తున్న పోలీసుల కంట్లో కారం గొట్టి ఆస్పత్రినుండి పరారయ్యాడట! అతడెట్లా తప్పించుకోగలిగాడో పెద్ద మర్మంగా వుంది. రహస్య పరిశోధకశాఖ వారీ విషయమై అతి తీవ్రంగా అన్వేషణలు జరుపుతున్నారు.

"సూర్యనారాయణన్ అరెస్టయిన రోజే మాయమయిన విప్లవకారిణి ఇంకా దొరకలేదని తెలుస్తుంది. ఈమె చాల సౌందర్యం కలదనీ, ఢిల్లీలో

రెండు షేర్లతో తిరిగిందనీ, పెద్ద పెద్ద ఉద్యోగస్తులతో బాటు కలసి మెలసి తిరిగిందనీ తెలియవస్తూంది. ఈ మె గురించి గూఢారహస్య పరిశోధకశాఖ వారు స్వేషణలు జరుపుతున్నారు."

—ఈ వార్తను సంభ్రమంతో చదివిన అమర్‌నాథ్ ఇట్లా అన్నాడు: "ఏమంటావు చిత్రా! ఈ వార్తలో 'సూర్యనారాయణన్' అని చదవగానే నాకు మన సూర్యా పేరు గుర్తుకు రానేలేదు. ఆహా! వాడెంత గట్టివాడు! ఇన్ని నెలలూ పోలీసులకు చిక్కకుండా తిరగడం కాదు, చిక్కాక ఆస్పత్రి నుండి కాపలావుండగా తప్పించుకున్నాడంటే మాటలా?...ఏం, మాట్లాడకేం? సూర్యా చేసిన పని గొప్పది కాదూ?"

"మీ సూర్యా గొప్పదనం అట్లా వుంచండి! నే నింకో విషయం గురించి ఆలోచిస్తున్నాను—మాయమయిన సీత గురించే...ఏవండీ! ఇవాళ ఆఫీసుకు సెలవు పెట్టండి. ఈ వేళ అనాథశరణాలయం వెళ్ళాలి."

"ఎందుకు?"

"ఎందుకేమిటి? ఆ నాడు మనం అక్కడొక స్త్రీని వదలివచ్చామే, ఆమె గురించి నాకు అనుమానంగా వుంది."

"ఒకవేళ ఆమె సీతేమోనని నీ? ఏడ్చినట్లుంది నీ అయిడియా! ఢిల్లీ ఎక్కడ, కలకత్తా ఎక్కడ? ఆమె భర్త రానినట్లుగా ఆమె దేవపట్నమో రాజంపేటో కాకుండి గాని ఇక్కడి కెందుకు వస్తుంది."

"ఆహాహా! ఏమి తెలివి!! సీత విప్లవవాది అని మరిచి మాట్లాడుతున్నారయ్యగారు...రాజంపేటో దేవపట్నమో వెళ్తే పోలీసువారికి నోటీసు ఇచ్చినట్లే! కను మరుగుగా వుండడానికి కలకత్తాకన్న మించిన వూరే వుందీ? అంచేత ఇక్కడికే వచ్చి వుంటుంది. మీరు ఇదివరకొకసారి సీతను చూశారుకదూ? ఆమెను గుర్తుపట్టగలరా!"

"ఎప్పుడో పెళ్ళిలో ఒకసారి చూశానంతే! పదేళ్ళయింది. ఎట్లా గుర్తుంటుంది?"

"ఇప్పుడొచ్చి కాస్త నిదానంగా చూడండి. చూచి ఆమె సీతేనా అని చెప్పండి."

"ఆమె సీతయితే నాకేమి, కాకపోతే నాకేమి? నువ్వే కనుక్కో! నేను నిన్ను అనాధాశ్రమం దగ్గర విడిచివెళ్తాను." అన్నాడు అమర్‌నాథ్.

ఆ సాయంకాలం ఆతడాఫీసునుండి త్వరగా ఇంటికి వచ్చాడు. ఇంటి గుమ్మంముందు కారాగగానే చిత్ర పరుగెత్తుకొచ్చింది. ఆమె ముఖం కళగా వుంది.

"ఏమిటి కథ! సంతోషంగా వున్నావే" అని పలకరించాడు అమర్‌నాథ్.

"సంతోషానికి కారణం వుంది!"

"ఆ అమ్మాయి ఎవరో తెలిసింది కాబోలు?"

"అవును నేనూహించిందే నిజమయింది; అట్లా వుండబోదు అని కాదించారు?"

వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళారు. హాల్లో సోఫాలో కూర్చుని ఉత్తరం చదువుకుంటూంది ఒక యువతి. అమర్‌నాథ్ నిశ్చేష్టుడయ్యాడు. వీరి రాకను చూచి ఆమె లేచి మేడమీదికి వెళ్ళింది.

ఆమె వెళ్ళాక—'చిత్రా! ఈమె సీతా? ఫలానా అని తెలుసుకోవడమేకాక ఇంటికే తీసుకొచ్చేశావా?" అని అడిగాడు అమర్‌నాథ్.

"ఔను మరి! ఏదయినా కార్యం మొదలెడితే సాంతం చేసిగాని వూరుకోనని తెలియదూ?" అంది చిత్ర.

"తెలియకేమి? ఈ శనిదేవత నింట్లోకి తీసుకువచ్చి ప్రతిష్టించావుగా!"

"చాలు చాలు, నోరు మూసుకోండి!"

"చిత్తం దేవి చిత్తం! ఈ అదృష్టదేవతను, గంధర్వకాంతను ఇటువలుచుకొని వచ్చిన కారణం బెయ్యది?"

"చాలు వేషాలు! కారణం ఏముంది? మనవైపు స్త్రీ; మీ ప్రాణస్నేహితుడు సూర్యాకు అత్తకూతురు. అట్లాంటిదానిని అనాధ శరణాలయంలో ఎట్లా వదిలి రమ్మంటారు?"

"వదిలివస్తే ఏమి? పై పెచ్చు ఈమె సీతేనని హామీ ఏమిటి?"

"మీరు నన్ను శరణాలయం దగ్గర వదలి వెళ్లిపోయారుకదా! వెంటనే కళ్ళి సీతతో మాట్లాడాను. యదాప్రకారం ఆమె ముభావంగా వుంది. పిల్లలకు ఆహారం అందిస్తూంది. ప్రక్కన నిల్చున్న చౌదురాణితో మాట్లాడుతూ నేను, సీత వినేటట్లుగా, సూర్యాగురించిన వార్త చెప్పాను. కాస్సేపుతర్వాత నన్ను వెతుక్కుంటూ వచ్చింది సీత. చౌదురాణితో చెప్పినవార్త వీమిటవి అడిగింది. సూర్యాను గురించి ఆమెకూ చెప్పి—"అయినా నీకెందుకింత కుతూహలం?" అని అడిగాను. ఆమె మారు పలకలేదు. "నాదగ్గర ఎందుకు దాస్తావు? నువ్వు సీతవుకదూ?" అనగానే ఆశ్చర్యపడింది ఆమె. తర్వాత అన్నీ ఒప్పుకుంది. మన ఇంటికి రమ్మన్నాను. ఆమె ఒప్పుకోలేదు. శరణాలయంలో పిల్లలకు సేవచేయడమే తనకు హాయిగా వుందని చెప్పింది. మీరూ అందరిలాగే వారానికి రెండు రోజులపాటు వంతులు వేసుకుని శరణాలయంలో సేవచేయవచ్చునని చెప్పి, బలవంతంగా ఇంటికి తీసుకొచ్చాను... కాయుక్తి చూశారా?"

"అద్భుతం! నిజానికి నీలాంటివారు ఆ సి. ఐ. డి. శాఖలో వుండాలి. తేకపోబట్టే యు. జి. లు ఇట్లా పరారీ ఆవుతున్నారు!"

"యూ. జీ. అంటే ఏమిటండీ?"

"—అంటే 'అండర్ గ్రౌండ్' అని అర్థం. పోలీసులకు చిక్కకుండా అజ్ఞాతంగా తిరిగేవారికి 'యు. జీ.' అని ముద్దు పేరు...ఈ ప్రక్కవీధి చివర కొందరు పోలీసులూ, సి. ఐ. డి. లూ నిల్చుని వున్నారు. వాళ్ళు ఒక యు. జి. కోసం వెతుకుతున్నారట! అని అమర్‌నాథ్ అంటుండగానే వీధీవైపు చాలమంది ఇంట్లోకి ప్రవేశించినట్లు చప్పుళ్లు వినిపించాయి. ఎవరో కని దంపతులు ముందు వైపుకు వెళ్ళారు. పోలీసులూ, సి. ఐ. డి. లు వచ్చినట్లు గమనించారు. చిత్ర తల గిరగిర తిరగ సాగింది.

వచ్చినవారి నాయకుడయిన ఇన్స్‌పెక్టర్ అమర్‌నాథ్‌తో చెప్పాడు. "ఈ యు. జీ. స్త్రీ చాల తెలివిగలది. ఢిల్లీలో సీత, తారిణి అన్న రెండు

పేర్లతో తీరిగి పోలీసుల కంట్లో కారం కొట్టి ఇక్కడికి వచ్చింది. ఇప్పుడు జరిగిందేమిటో చూడండి! అనాథ శరణాలయానికి మేము వస్తున్నామని తెలుసుకుని, అరఘంట ముందుగా మీ ఆవిడకేదో కల్లిబొల్లి కబుర్లు చెప్పి మీ ఇంటికి వచ్చి చేరింది. మీరు ఇంటికి వచ్చాక వద్దామని కాచుకుని వున్నాము.''

''ఇన్స్‌పెక్టర్! మీరు పొరబడుతున్నారు. ఈమెను నేనెరుగుదును. ఈమె యు. జి. కాదు; విప్లవవాదీకాదు.'' ఆన్నాడు అమర్‌నాథ్.

''మీకెట్లా తెలుస్తుందండీ? కావలసిన ఆధారాలు మావద్ద వున్నాయి. ఫొటోకూడా వుంది.'' అన్నాడు ఇన్స్‌పెక్టర్.

కన్నీళ్లతో పైకి పరుగెత్తి సీతకు చెప్పింది చిత్ర.

మొదట సీతకు విషయం ఏమిటో అర్థం కాలేదు. తర్వాత తేట తెల్లమయింది. ఆమెకు పెద్ద భారం తగ్గినట్లయింది. ఎక్కడికి పోవడం, ఏమిటి చేయడం—అన్న సమస్యలు తీరి పోయాయి. చెరసాలలోకి వెళ్లి ప్రశాంతంగా వుండవచ్చును. విద్యావతులు, గౌరవ కుటుంబాలకు చెందినవారు అయిన స్త్రీలు ఎందరో ఇప్పుడు చెరసాలల్లో వుంటుండగా తనకేమి రచ్చింది?

వాసంతి నిప్పుడెల్లా చూడడానికి వీలులేదు. అదీ ఒకందుకు మంచిదే...దానిని చూచి ఏం చెప్పడం? నాన్న గురించి అడిగితే ఏమి చెప్పడం? అవ్వదగ్గర అల్లారు ముద్దుగా పెరుగుతూంది. అదే పదివేలు. మంచి కాలం రచ్చి అన్నీ చక్కపిడితే అప్పుడు చూడవచ్చును.

ఈ విధంగా నిర్ణయించుకున్న సీత ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా మేడ దిగివచ్చి పోలీసులకు తన్ను తాను అప్పగించుకుంది.

అమర్‌నాథ్ పోలీసు ఇన్స్‌పెక్టర్‌తో సీత గౌరవస్తుల కుటుంబానికి చెందినదనీ ఆమెపట్ల మర్యాదతో ప్రవర్తించమనీ కోరాడు.

సీత ఇల్లు విడిచి వెళ్తుండగా చిత్ర భోరుమని ఏడుస్తూ ఆమెను కౌగలించుకుని "సీతా! దిగులుపడకు! నేను ఈయనతో చెప్పి 'హేబియస్ కార్పస్' పిటీషన్ పెట్టిస్తాను...నిన్ను విడిపిస్తాను." అంది.

"అదేమీ చేయకు చిత్రా! దేవుడే నా మీద జాలితో ఈ సాయం చేశాడు, నువ్వు దుఃఖించకు!" అంది సీత.

36

రాజంపేట అగ్రహారం మారింది. ఇప్పుడు చాలా ఇళ్ళు పాతబడి పోయాయి. కట్టావయ్యర్ ఇంటిముందు పందిరి వుండేది. ఆదిప్పుడు లేదు. ఆ ఇంటి గుమ్మాని కింతకు ముందున్న కళ ఇప్పుడు లేదు. అయితే చీమా చ్చువయ్యర్ ఇల్లు పెద్దది అయింది; శోభాయ మానంగా వుంది; అయ్యర మంచి అదను చూచుకుని కొల్లి దేవపట్నంలో బట్టల దుకాణం పెట్టారు. ఆకునకు లక్ష్మీకటాక్షం లభించింది.

కట్టావయ్యర్ గారి కటీవల చాల కష్టాలు వచ్చాయి. భూస్వాము లకూ రైతులకూ మధ్య పొలం విషయంలో తగాదాలు వచ్చి కోర్టు కెక్కాగు. కోర్టువారు భూస్వాముల పక్షమె తీర్పు చెప్పారు. ఆ పక్షానికి నాయకత్వం వహించిన కట్టావయ్యర్ రైతుల ఆగ్రహా వేశాలకు పాత్రు డయ్యారు.

పది రోజులక్రింద కట్టావయ్యర్ దేవపట్నం వెళ్లి, అప్పుడే చెరసాల నుండి విముదలయివచ్చిన అల్లుడు పట్టాభి రామన్‌నూ కూతురిని మనుమడినూ మాచి వెనకొ క్తున్నారు. రాజంపేట నుండి నాలుగుమైళ్ళ దూరాన, రాత్రి పదిగంటలవేళ, ఎడ్లబండిలో వస్తుండగా ముసుగులు వేసుకున్న ఏడెని

మిది దొంగలుమీదపడి ఆయనను, బండివాడిని బాగా కొట్టి, కిట్టావయ్యర్ దగ్గరవున్న డబ్బును లాక్కుని మాయమయ్యారు.

ఒంటినిండా గాయాలతో ఇల్లు చేరిన కిట్టాయ్యర్‌కు ఆ రాత్రే బాగా జ్వరం వచ్చింది.

ఈ వార్త తెలియగానే దేవపట్నం నుండి పట్టాభీ, లలితా పిల్లలూ వచ్చారు. రెండురోజులుండి పట్టాభి వెళ్ళి పోయాడు. కిట్టావయ్యర్, సరస్వతమ్మాలూ కోరినట్లు తన భార్యాబిడ్డలను అక్కడే కొన్ని రోజులపాటు వుండమని తాను వెళ్లిపోయాడు.

* * *

తన కష్టాలగురించి వెళ్లబోసుకుంటున్న లలిత తల దువ్వుతూంది సరస్వతమ్మాళ్.

లలిత జడ పూర్తి అవుతుండగా వీధిలో 'పోస్ట్' అని కేక వినపడింది. లలిత అమ్మచేతినుండి జడను లాక్కుని వీధిలోకి పరుగెత్తుకు వెళ్లింది. "ఇన్నేళ్ళు వచ్చినా అప్పటిలాగే పరుగెత్తడం మానలేదు." అని సణిగింది సరస్వతమ్మ.

కవర్ మీద తన భర్త చేతిరాతను గుర్తించి అతురతతో దానిని చింపింది లలిత. అందులో రెండు ఉత్తరాలున్నాయి. ఒకటి భర్త రాసినది; ఇంకొకటి, ఆహా! సీత రాసినట్లుంది. ముందు భర్త వుత్తరం చదివింది.

" సౌ॥ లలితకు ఆశీస్సులు.

సీత వుత్తరం రాయ నారంభించే టప్పుడు "నా ప్రాణమా!" నా ప్రేమ సౌధమా!"అంటు మొదలు పెడదామని అనుకుంటాను గాని తీరా రాయబోయే సరికి పాతకాలపు మాటలే వస్తాయి. ఏం చేయను? నేనిక్కడ కులాసాగా వున్నాను.నన్నెవరూ దారిలో అటకాయించి నాపర్సును దొంగలించుకుపోలేదు. ఒకవేళ దొంగలించినా వారికి దేవపట్నానికి రైలు ఛార్జి డబ్బులూ,ఆపైన ఒకటి న్నర అణా మాత్రం లభించి వుండేది! పెద్ద ఆకాభంగమయి వుండేది! మామగారి కిప్పుడు ఒంట్లో నయంగా వుందనుకుంటాను. ఆయనకు ఈ వయస్సులో

ఈ విధమైన కష్టాలు రావడం తలచుకుంటే బాధగావుంది. నూర్యా చెప్పి నట్లు చేసివుంటే ఈ నష్టాలూ కష్టాలూ వచ్చి వుండేవికావు...అంతా భగవంతుడి లీల! నువ్వెప్పుడు వస్తున్నావు? త్వరగా రా! నువ్వు త్వరగా ఎందుకు రావాలో ఇందులోబాటు పంపుతున్న వుత్తరం చెప్పగలదు.

నీనెచ్చెలి సీత నిన్ను చూడడానికి వస్తానని బెదరిస్తూ రాసింది! ఆమె వచ్చేసరికి నువ్వికక్కడ లేకపోతే నేనేమి చేయగలను?

కనుక ఈ వుత్తరం ఆందగానే అమ్మా నాన్నలకు చెప్పి బయలుదేరి రా! చీమాచ్చు వయ్యర్ గారు నిన్ను తీసుకువచ్చి దిగబెడతానన్నారు.

ఇట్లు

పట్టాభిరామన్''

పై వుత్తరంలో ఎన్నో విషయాలున్నప్పటికీ 'సీత వస్తోంది! అన్న ఒక్క విషయమే లలిత మనసుకు అందింది. భర్త లేఖ కాగానే అమిత ఉత్సాహంతో సీత వుత్తరాన్ని చదవ సాగింది.

అప్పుడు లోపలి గదిలోనుండి ''లలితా!'' అని ముద్దుగా నాన్న పిలిచినట్లు వినపడగానే, ఉత్తరం చదువుతూ వెళ్లింది లలిత.

ఆమెను చూడగానే కిట్టావయ్యర్—''లలితా! వాకు ఏదయినా వుత్తరం వచ్చిందమ్మా? ఎవరు రాశారా వుత్తరం?'' అని అడిగారు.

''ఒకటి దేవపట్నంనుండి ఈయన రాశారు. ఇంకొకటి కలకత్తాలో చిత్ర ఇంటినుండి సీత రాసింది వాన్నా! త్వరలో మద్రాసు వస్తోందట. అక్కడనుండి దేవపట్నం వస్తానని రాసింది...''

''అలాగా! సీత రాసిందా? పాపం! ఆమె గురించిన కబురే తెలియలేదు ఇటీవల! ఆమి నొకసారి చూడాలని వుంది నాకు. ఆమె కొన్ని హితవులు చెప్పాలని వుంది. దేవపట్నం వస్తే సీతను ఒకసారి ఇక్కడికి రమ్మని చెబుతావా లలితా?', అన్నారు కిట్టావయ్యర్.

''అట్లాగే రమ్మంటాను!...నాన్నా! నేనింక వూరికి వెళ్లవచ్చా! సీత వస్తుంది గనుక నన్ను త్వరగా రమ్మన్నారీయన. నిన్నిలా వదిలి వెళ్ళ

డానికి మనసొప్పడం లేదు. అయినా...'నువ్వు వెళ్లాలమ్మా! అల్లుడు రెండేళ్ళ కారాగారవాసం చేసిఇప్పుడే కదా వచ్చాడు...ఆయనను ఎన్ని నాళ్ళు వదలి వుంటావు? అందులోనూ సీత వస్తుంటే తప్పక వెళ్లాలి...నాకూ అన్పిస్తుంటుంది మకాము దేవపట్నానికి ఎత్తి వేద్దామా అన్పిస్తుంటుంది. ఇంక ఇక్కడేముంది? ఊరు మారితేగాని మనశ్శాంతి వుండదు—"

వీధిలో ఎద్దుల బండి వచ్చి ఆగిన శబ్దం వినబడింది. లలిత వీధిలోకి వెళ్లింది. బండి నుండి దిగిన వారిని చూడగానే ఆమె హర్షాతిశయానికి హద్దులు లేకుండా పోయింది.

37

బండి నుండి సూర్యా, సీతా దిగారు. సుందు కూడా దిగాడు. అయితే సూర్యాను, సుందును లలిత ఎక్కువ పట్టించుకోలేదు. వాళ్లతో ఒకటి రెండు మాటలు మాట్లాడేసి, సీత చేతులు రెండూ పట్టుకుని లోపలికి లాక్కుని వెళ్ళినది.

"నీ గురించే అనుకుంటూ, మాట్లాడుకుంటున్నాము. కాస్సేపు ముందరే పోస్టుమన్ వచ్చి వుత్తరాలిచ్చి వెళ్లాడు. ఈయన నీ వుత్తరం చింపి చూచి నాకు పంపారు. నువ్వు వచ్చేలోగా అక్కడికి రావాలని నాకు రాశారు. ఈలోగా నువ్వే వచ్చేశావు" అంటూ ఎనలేని కుతూహలంతో గలగల మని మాట్లాడింది లలిత.

ఈ లోగా వాళ్లు ఇంటి హాల్లోకి వచ్చిచేరారు. అక్కడ పిల్ల లిద్దరూ విడియపడుతూ నిల్చున్నారు. "వీళ్ళేకదూ నీ పిల్లలు పట్టూ, బాలూ!" అని

సీత అడిగింది. "ఔను, వీళ్ళే!" అని లలిత పిల్లలను చూచి "అత్తయ్య అందంగా వుంటుందని చెప్పానా లేదా? నా మాట నిజమా కాదా అని మీరే చూచుకోండి. సీతా! నువ్వు చెరసాలలో వుండి, ఇంకా ఎన్ని కష్టాలు పడి కూడా ఎంతందంగా వున్నావే! మీ ఆయన నిన్ను విడిచి ఎట్లా వున్నాడో బోధపడ్డం లేదు! ఆయనకు ఇంగ్లండు పిచ్చి బాగా పట్టినట్లుంది...అయినా ఇంగ్లండులో పనేమిటట ఇప్పుడు? అది సరేగాని వాసంతిని పిలుచుకు రాలేదేం?" అంది.

అసలే నిరుత్సాహంగా వున్న సీత మొహం వాసంతి ప్రస్తుతి వచ్చే సరికి ఇంకా స్తబ్ధచిన్నదయింది.

"వాసంతికి బడి వుంది కదా? దాని చిదువు పాడుచేయడం ఎందుకని తీసుకురాలేదు. మామయ్య ఎక్కడ?"

"ఇంతకు ముందే నాన్న, నిన్ను చూడాలని వుందన్నారు. నువ్వు రావడం ఆయనకు ఎంతో సంతోషంగా వుంటుంది. నాన్న గండం గడిచి బయట పడ్డారు తెలుసా?..."

"దేవపట్నంలో నిన్న రాగానే తెలిసింది. మీ ఆయన మార్యాతో చెప్పారట. అది విన్నవెంటనే బయలుదేరి వచ్చాము. మీ వారు ఒక్కరోజుండి పోరాదా అన్నారట..."

"అన్నారుట అంటున్నావేం? నీతో చెప్పలేదా? ఆయనకు ఆడవారిని చూస్తే చచ్చేబిడియం! నువ్వంటే ఆయనకు చాల గౌరవం. దేశంకోసం చెరసాల వేళ్ళావని తెలిసినప్పటి నుంచీ నీ గురించి కనుక్కుంటున్నారు. ఇప్పుడు నువ్వే వచ్చేశావు. సీతా! మీ ఆయన ఇంగ్లండు నుండి వచ్చేదాక నువ్వు దేవపట్నంలో మా ఇంట్లో వుండాలి తెలుసా?"

"దానికి తొందరేమిటి, నిదానంగా మాట్లాడుకుంటాము. ఇప్పుడు ముందు మామయ్యను చూడాలి" అంది సీత.

కిట్టావయ్యర్ పడుకునివున్న మంచం పక్కన కూర్చుని కూర్మా, నుండు మాట్లాడుతున్నారు. లలిత, సీత గదిలోకి రాగానే వాళ్ళిద్దరూ లేచారు.

మామయ్యకు సీత నమస్కారం చేసింది. ఆయన కూర్చోమన్నాక కూర్చుంది. కిట్టావయ్యర్ మంచం మీద లేచి కూచుని ప్రేమతో ఆమె తల నిమిరారు; ''సౌభాగ్యంతో చిరంజీవిగా వుండమ్మా!'' అన్నాడు.

మామయ్యను ఆ బలహీన స్థితిలో గాయాలతో కట్లతో చూడడం, ఆయన ఆట్లా తన్ను దీవించడం సీతలో ఎన్నో గత స్మృతులను రేకెత్తాయి. ఆమె కళ్ళల్లో నీరు పొంగింది.

సీత కన్నీరు తుడుచుకుంటూ ''మామయ్యా! మమ్మల్ని ఇటా చూస్తే నా కడుపు తరుక్కు పోతూంది. మిమ్మల్ని ఎవరో కొట్టారని వినగానే నా మనసు విలవిల లాడిపోయింది. ఈగకు కూడా కీడెంచని మీ మీద చేయెత్తడానికి ఏ రాక్షసుడికి మనసొప్పిందీ!'' అంది.

''తలతాత తల్లీ తలరాత! అందుకు వాళ్ళ నెందు కనాలి? సీతా! ఈ విషయం వినవమ్మా! నేను వస్తున్న బండిని దొంగలు అటకాయించినప్పుడు 'ధన్' మని ఒక దెబ్బ నా నెత్తి మీద పడింది..అప్పుడు నా మనోనేత్రం ముందు ఏమి నిలిచింది తెలుసా? మీ అమ్మ రాజమ్మాళ్ నిలబడింది. ఆమె ఎక్కడో ఆకాశంలో నిలిచి చేతులు జాతులు చూపి ''అన్నయ్యా! రా!'' అని పిలిచినట్లనిపించింది. అప్పుడు నాకు ''అరెరే! సీత తల్లిని చూడకుండా వచ్చేశామే? సీత ఎట్లా వుంది అని ఈమె అడిగితే ఏమని చెప్పడం!'' అనిపించింది. ఇదంతా దెబ్బతిన్న మరు నిముషంలోగా జరిగిపోయింది'' అన్నారు కిట్టావయ్యర్.

''మామయ్యా! నా మీద, మా అమ్మ మీద నీకు ఎంత ప్రేమి!'' కాని మీరెక్కువ మాట్లాడకండి. డాక్టర్ చెప్పినట్లు విశ్రాంతిగా వుండండి'' అంది సీత.

''ఔను. ఒక్కసారిగా ఎక్కువ మాట్లాడకూడదు, నిజమే...నిన్ను చూడాలని, నీతో ఎన్నో చెప్పాలని ఎంతో ఎదురు చూస్తున్నాను...తర్వాత: తాపీగా మాట్లాడుకుందాము. నువ్వెళ్లి స్నానం చేసి భోంచేయమ్మా—'' అన్నారు కిట్టావయ్యర్ ప్రేమతో.

ఆ రాత్రి—కిట్టావయ్యర్ బలహీనస్వరంలో అడిగారు: "సీతా! నీ కోసం చాలసేపటి నుండి ఎదురు చూస్తున్నాను. చీకటి పడుతుంటే, ఇంత సేపూ గుంటగట్టున కూచోవడం?" అన్నారు.

"దయచేసి క్షమించండి మామయ్యా! ఇంకా కొన్ని రోజులపాటు ఇక్కడే ఉంటాను కదా?" అంది సీత.

"నువ్వింకా కొన్ని రోజుల పాటు ఇక్కడ వుంటావు నిజమే, కాని నేను బ్రతికి వుండొద్దూ?"

"అయ్యో, అదేం మాటలు మామయ్యా! నే నసలే దురదృష్ట వంతురాలిని...చిక్కు లేనిదానివి. మీరు గూడా ఇట్లా కోపంతో మాట్లాడితే..." అని కళ్ళనీరు పెట్టుకుంది సీత.

"ఓపికతో వినమ్మా సీతా! నీ మీద నా కేమీ కోపం లేదు. నా మీద నాకే కోపంగా వుంది. ఇటూ పడుకుని ఆలోచిస్తుంటే, ఇన్నేళ్ళ నుండీ నేను చేసిన పనులన్నీ తప్పేమో ననిపిస్తూంది. అందుకు తోడుగా ఈ వూళ్ళో కొందరి సలహాలు విని రైతులతో వైరాధ్యం సంపాదించుకున్నాను. మా తాతల నాటినుండి మా కుటుంబానికి సేవజేస్తూ వచ్చిన రైతు లీనాడు మా మీద కత్తిగట్టారు. ఏదో పూర్వుల చేసిన పుణ్యమా అని ప్రాణాలతో బయట పడ్డాను...అందుకు దొంగలకు కృతజ్ఞత చెప్పుకోవాలి.

"మామయ్యా! మిమ్మల్ని కొట్టిన దుర్మార్గులు ఎన్నటికీ బాగుపడరు—వాళ్ళను మీరు క్షమిస్తారేమోగాని నేను క్షమించలేను—"

"వాళ్లను క్షమించడానికి నువ్వెవరు, నేనెవ్వరు? వాళ్ళను అనడం ఎందుకు? బాణం వేసినవాడిని అనకుండా బాణాన్ని అనడం ఎందుకు? నిజానికి భగవంతుడే వాళ్ల రూపంలో వచ్చి నాకు గుణపాఠం వేర్పాడు. సీతా! నా కింక ఈ వూళ్లో వుండాలని లేదు. నీతోపాటు సూర్యా కూడా రావడం మంచిదయింది. ఈ బాధ్యతలన్నీ వాడి కప్పగించేసి తీర్థయాత్రలు చేద్దామని వుంది. కాశికి వెళ్ళి గంగలో స్నానం చేయాలి. ప్రయాగ వెళ్లి త్రివేణిలో స్నానం చేయాలి. హృషీకేశ్, బదరీనాథ్ కెళ్ళాలి. కొన్ని రోజులు

ముందర 'కైలాస యాత్ర' అన్న పుస్తకం చదివాను. అప్పటి నుండి కైలాస గిరి వెళ్లాలని వుంది."

"మామయ్యా! యాత్రలు చేయాలంటే నాతోబాటు రండి, నేను తీసుకువెళ్తాను—" అంది సీత సంతోషంతో.

"అట్లాగేనమ్మా! నీతోబాటు ఆ పుణ్యస్థలాలన్నిటికి వెళ్ళడంకన్న కావలసిందేముంది...కాని ముందు నీ జీవితాన్ని సరిదిద్దుకోవాలి!" అన్నాడు కిట్టావయ్యర్.

సీత ఏమీ మాట్లాడకుండా తల వంచుకుంది.

"నే నేం చెబుతున్నానో నీకు అర్థమైంది. అందుక నే తల వంచుకున్నావు. నీకూ, మీ ఆయనకూ సరిపడడం లేదని విన్నప్పటినుంచి నేను పడ్డ ఆవేదనకు అంతులేదు. నీ పెళ్లి ఈ వూళ్లోనే జరిగింది. లలితను చూడడానికి వచ్చినవాడు నిన్ను పెళ్ళాడతా నన్నాడు. మీ అత్తయ్యకు ఆగ్రహం వచ్చింది. ఎందరో ఈర్ష్య చెందారు. కాని నేను మాత్రం ఎంతో సంతోషంతో నిండైన మనసుతో నీ పెళ్లి జరిపించాను. లలితతోబాటు అదే పందిరి కింద నీపెళ్లి జరిపించాను. నీ కంత భాగ్యం అబ్బినందుకు వెయ్యి దేవుళ్లకు మొక్కుకున్నాను. అట్లాంటిది ఈ విధంగా కావడం ఏమిటి? మీ అమ్మ పరే చివరదాక కష్టాలు పడి, పడి కన్ను మూసింది. నువ్వూ కష్టపడాలా? ముచ్చటపడి, కోరి నిన్ను పెళ్ళాడిన భర్తతో నువ్వు సంతోషంగా కాపురం చేయకూడదా?"

"తలరాత అట్లావుంటే ఎవరేమి చేయగలరు మామయ్యా! మీరు సంతోషంతో పెళ్లి చేశారు. నేమా సంతోషంగానే పెళ్ళాడాను. అయితే ఆయన గుణం ఇట్లా వుంటుందని ఎవరనుకున్నారు?"

"ఆతగాడి గుణం గురించి చెబుతున్నావుగాని నీ గుణం గురించి ఆలోచించావా?" పరుల తప్పులెన్నడం సులభం; మన తప్పు తెరుగడు కష్టం. సీతా! నువ్వు చదువుకున్నదానివి; అన్నీ తెలిసిన దానివి. నువ్వు చేస్తున్న దేశసేవ గురించి నూర్యా ఎంతో పొగుడుతూ చెప్పాడు. నాకూ సంతోషం కలిగింది. కాని ఒక విషయం చెబుతా వినుు. ఈ దేశపు ప్రత్యేకత ఏమిటో

తెలుసా? ప్రపంచంలో ఎన్నో దేశాలున్నాయి. అవి కొంత కాలం ఉచ్చ్రి
తిలో వుంటాయి; తర్వాత వామరూపాలు లేకుండా పోతాయి.
కాని మన దేశమో? పదివేల సంవత్సరాల నుండి తల ఎత్తుకుని నిత్య చైతన్యమై
అలరారుతున్నది. మహాత్మగాంధీ వంటి అవతార పురుషులు ఈ నాటికీ ఈ
గడ్డపై ఉదయిస్తున్నారు. ఎందుకో తెలుసా? ఈ దేశపు స్త్రీల మహిమ
వల్లనే! ఆదిశుండీ ఈ దేశపు మగవాళ్లు ఎంత మూర్ఖులయినా, ఎంత కఠిను
లయినా వాళ్ల కనుకుణంగా నడుచుకుంటూ వస్తున్న ఇల్లాళ్లే ఈ దేశాన్ని
సంరక్షిస్తున్నారు. గాంధీ మహాత్ముడు తన భార్య కస్తూర్బా గురించి రాసినది
చదివే వుంటావు. మహాత్ముడు అకారణంగా ఆమెను కోప్పడితే ఆ తల్లి
ఎంత ఓపికతో వుండి, చివరకు భర్తే పశ్చాత్తాప పడేటట్లుం చేసింది కదా?
అంతెందుకు? మీ అత్తయ్యనే చూడు. నాతో జగడమాడుతుంది, నిజమే!
కాని ఏ పనిమీదనయినా నా మాటను జవదాటి ఎరగదే! నే నెన్నోసార్లు
అమె నెంతో కోప్పడ్డాను. అందుకని ఈ ఇల్లు విడిచి వెళ్లిపోతానని చెప్పిందా
ఎప్పుడన్నా?"

"మానుయ్యా! కస్తూర్బా డైవాంశం గలది. అత్తయ్య మాలాటి
భర్తను పొందిన భాగ్యశాలి. కాని నేనో అన్ని విధాలా నిర్భాగ్యురాలిని. కల
కత్తా ఆలీపూర్ జైయిల్లో నేనున్న రెండేళ్లలోనూ ఈయన ఒక్క సంవత్సరం
కలకత్తాలో వున్నారు. నేను చెరసాలలో వున్నానని ఆయినకు తెలుసు. కాని
ఒక్కసారి కూడా వచ్చి చూడలేదు. అయినా సరే విడుదలయి రాగానే
ఆయన పాదాల మీద పడి క్షమాపణ కోరుదామనుకున్నాను. కాని నేను
విడుదలవడానికి సరిగ్గా ఒక నెల ముందుగా ఆయన ఇంగ్లండు వెళ్లిపోయారు.
కలకత్తాలో ఆయన జీవితం గురించి తెలుసుకున్నాక వా మనసు పూర్తిగా
విరిగిపోయింది. ఇంక అయనతో కలిసి కాపురం చేయడం అసాధ్యమని తెలుసు
కున్నాను!"

"అట్లాగనకు సీతా!" వినదగు నెవ్వరు చెప్పిన—వినినంతనే కోపర
పడక"—అన్న హితవు వినలేదా? నీ కంటితో నువ్వు చూడనిదానిని, ఎవరో

చెప్పినదానినిబట్టి నిర్ణయాలు చేసుకోకు. నీ మీద రాఘవన్‌కు కోపం వుండడానికి కారణం వుంది. నువ్వు నీ ఇంట్లో చోటివ్వడం వలన, ఆ తర్వాత నువ్వు చెరసాలకు పోవడంవల్ల రాఘవన్ ఉద్యోగం పోయింది. నీ వల్ల అంత మంచి ప్రభుత్వోద్యోగం పోయిందంటే అతడికి కోపం రాకుండా వుంటుందా ?''

''ఆ ఉద్యోగం పోతేనేమి, అంతకన్న ఎక్కువ జీతంతో బ్యాంక్ వుద్యోగం దొరికింది కదా ?''

''ఏది ఏమయినా రాఘవన్ ఇంగ్లండు నుండి వెనక్కు రాగానే నే నతడిని కలుస్తాను. నువ్వూ నాతోబాటు రా ! మీ ఇద్దర మధ్యవున్న అపార్థా లను పోగొట్టి మిమ్మల్ని ఏకం చేస్తే కాని నా మనసు శాంతించదు; మీ అమ్మ ఆత్మ శాంతించదు. అతడి మనసు నెట్లాగయినా మారుస్తానమ్మా త్వరలోనే ని కష్టాలన్నీ తీరిపోతాయి.''

''నా కష్టాలు తీరిపోతాయంటున్నారు కాని నాకట్లా తోచడం లేదు. కారణం లేకుండా నా మనసు నేదో భయం ఆవహిస్తూంది. గుండె టపటప కొట్టుకుంటుంది. కడుపు కలియబెడుతుంది. రాత్రి వేళల ప్రశాంతంగా నిద్ర పోలేను. భయంకరమైన కలలొస్తాయ'' అన్న సీత ఒళ్లు వణికింది; కన్నీ రొలికింది.

అంతవరకు పడుకునే మాట్లాడుతున్న కిట్టావయ్యర్ లేచి కూచున్నాడు. సీత తలవ స్పృశిస్తూ ''తల్లీ ! అవన్నీ ఉత్త భ్రమ ! పాత కష్టాలు గుర్తుకొచ్చి మనసట్లా సడలుతుంది. అట్లా భయమనిపించినప్పుడెల్లా 'రామ రామ' అనుకో వమ్మా ! అన్ని భయాలూ పోతాయి. నేను నీతోబాటు వస్తాను కదా—నీకే కష్టమూ రాకుండా నేను చూచుకుంటాను !'' అన్నాడు కిట్టావయ్యర్.

ఈ సమయంలో లలిత ఆ గదిలోకి వచ్చింది. కిట్టావయ్యర్ చివర చెప్పిన మాటలు విన్న లలిత—''నాన్నా ! ఇదేమిటి ? దేవపట్నానికి నాతో వస్తానని చెప్పి అరగంట కాలేదు, అప్పుడే మరచిపోయారా ? ఇప్పుడు

సీతతోబాటు వస్తానంటున్నారే! ఈ బొంబాయి వదినలో ఏదో వశీకరణ శక్తి వుందిలే!'' అంది.

తిరుమూలర్ అన్న మహాత్ముడు మనిషిజన్మ బుద్బుదప్రాయమని చెప్పడానికి ఒక పాట రాశాడు.

దాని భావం: రాత్రి భోజనం ముగించాడు ఒక గృహస్తుడు. తర్వాత భార్యతోబాటు శయనాగారం ప్రవేశించాడు. ఎడమ రొమ్ముకైపు కొద్దిగా నొప్పెడుతూంది'' అన్నాడు. నిద్రపోతే నొప్పి పోతుందిలే అని పడుకున్నాడంతే! మళ్ళీ లేవలేదు.

తిరుమూలర్ చెప్పిన ఆఖరి వాక్యం కిట్టావయ్యర్ విషయంలో నిజమయింది. రాత్రి సీతతో తన మనసులో వున్న దానినంతా చెప్పి వేసి హాయిగా పడుకున్నారు. మళ్లీ లేవలేదు.

ఆ మరుసటి రోజుదయం ఆ ఇల్లు రోదనతో, శోకంతో, విలాపంతో నిండింది.

38

శత్రువు యొక్క బాణాల వర్షాన్ని సరకు సేయకుండా ముందుకు చొచ్చుకుపోయే వీరుడిలా ఆ రైలుబండి వర్షాన్ని, గాలిని లెక్కచేయకుండా దూసుకు పోతున్నది.

ఒక రెండవ తరగతి పెట్టెలో సీత, లలిత, పట్టాభిరామనూ, వాళ్ళ పిల్లలూ వున్నారు. వాళ్ళంతా బయటికే చూస్తున్నారు. ఆకాశమంతా కారుమేఘాలతో నిండికుండ పోతగా వర్షం కురుస్తున్న కారణంగా పట్టపగలే చిమ్మ చీకటిగా వుంది.

ఒక పూరి ప్రక్కగా పొలాల మధ్య ఒక చితి మండుతూంది. చితి కాన వలన ఆరిపోకుండా దానిపైన ఎత్తుగా తాటాకుల పందిరి వేస్తున్నారు.

"అమ్మా! నిప్పు మీద పందిరి వేస్తున్నా రెందుకు?" అని పట్టు అడిగింది. అందరూ అటు చూశారు.

"మామయ్యనూ ఇట్లాగే కాల్చి బూడిద చేశాం కదా!" అని భోరుమని ఏడ్చింది సీత. లలిత కళ్ళల్లో అశ్రువులు నిండాయి. "నాన్న పోయిన దానికన్ని నీ దుఃఖం చూస్తుంటే నాకు ఏడుపు ఆగడంలేదు" అంది లలిత.

"మామగారి మరణానికి చింతించ నవసరంలేదు. ఆయన మోక్షం పొందివుంటారు" అన్నాడు పట్టాభిరామన్. కళ్ళు తుడుచుకుంటూ సీత_ 'నిజమే! సూర్యా వంటి కొడుకును కన్నందుకే ఆయన సద్గతిని పొందుతారు!" అంది.

"అవును! పది రోజులలో సూర్యా రైతులందరి అభిమానాన్ని చూరగొన్నాడే!" అన్నాడు పట్టాభి.

* * * * *

ఎక్కడ చూచినా నీరే!

"ఇదేమిటి, జలప్రళయం లాగుందే! రాజంపేట కన్న ఇక్కడ ఎక్కువ వర్షం కురిసినట్లుంది—" అన్నాడు పట్టాభిరామన్.

"మనం రైలెక్కి వచ్చాక అక్కడా ఇట్లాగే వర్షం కురిసిందేమో!" నంది సీత.

"వాన లేదు, లేదు అని వాపోయారు. ఇప్పుడేమో ఎడతెరిపి లేకుండా కురుస్తూంది" అంది లలిత.

"కొన్ని రోజులపాటు వర్షం లేకపోతేనే జనులకు దాని విలువ తెలుస్తుంది. వేదకాలపు ఋషులు సూర్యుడి నెట్లా ప్రార్థించారో వరుణుడినీ అటాగే ప్రార్థించారు. "శిలప్పదికారం" కావ్యంలో సూర్య చంద్రుల నెంత అందంగా వర్ణించారు!" అంటూ పట్టాభిరామన్ తన పాండితీగరిమను ప్రదర్శించాడు.

"అయినా ఇంత వర్షం పనికిరాదు. ఇట్లా కుంభీపాతంగా కురిస్తే జనులేమవుతారు? ఆదిగో చూడండి!" అని చూపించింది లలిత. అటు వున్న గ్రామ వీధులలో వర్ష పునీరు కాలువలై పారుతూంది. ఒక గుడిసెకప్పు తెను గాలికి లేచిపోయింది.

రైలుబండి రాత్రి ఎనిమిదింటికి దేవపట్నం చేరింది. రైలు పట్టాలకిటూ అటూ నిలిచి వున్న వాననీళ్లల్లో రైలు దీపాలు వరుసగా ప్రతిఫలించాయి. ఆ విధంగానే దేవపట్నపు వీధి దీపాలు వీధిలో నిలిచివున్న వాననీటిలో మిల మిల మని మెరిశాయి.

రైలుబండి నుండి ప్లాట్‌ఫార మ్మీదికి పట్టాభిరామన్, లలిత, సీత, పిల్లలు దిగారు. స్టేషన్‌లో ఒకవైపు తడిసిన బట్టలతో ఆరుస్తూ పరుగెత్తు కొస్తున్నారు చాల మంది జనం. ప్లాట్‌ఫారం వందలాది స్త్రీ పురుషులతో, పిలలతో నిండిపోయింది.

ఆ జనం నుండి అతి కష్టంమీద బయటపడి స్టేషన్ నుండి వెలుపలి కొచ్చారు పట్టాభిరామన్ కుటుంబం.

"ఏ రైలుకోసం ఈ గుంపు?" అని కూలీని అడిగాడు పట్టాభి.

"అబ్బే, రైలుకోసం కాదండీ! ఇవాళ సాయంకాలం వచ్చిన గాలి తోనవ పీళ్ళ గుడెసె లెగిరిపోయాయి. అందుకని ఈ దరిద్రులంతా స్టేషన్‌లో తలదాచుకుందామని వచ్చారు" అన్నాడు కూలీ.

అతికష్టం మీద ఎద్దుబండి ఒకటి కుదుర్చుకుని ఇల్లు చేరారు పట్టాభి కుటుంబం. లలిత వెంటనే ఇంటి పనులలో లీనమయింది. పట్టాభిరామన్ ఆఫీసు గదిలోకి వెళ్ళి పత్రికలు తిరగవేయ సాగాడు. పిల్లలు బట్టలు మార్చుకుని, అన్నం తిని నిద్రపోయారు.

సీత తడిబట్టలయినా మార్చుకోకుండా, శోకమే రూపమెత్తిన దానివలె కూర్చుని వుంది. భోజనానికి పిలుద్దామని వచ్చింది లలిత; "ఇదేమిటి సీతా! తడిబట్టలయినా విప్పకుండా కూర్చున్నావేం?" అని అడిగింది. ఆ సమయానికి పట్టాభీ అటువచ్చాడు.

"నాకు ఆ నిరుపేదల గురించి తలచుకుంటేనే బాధగా వుంది. చిన్న పిల్లలతో సహా వాళ్లందరూ ఈ రాత్రంతా ఆ తడిబట్టలతోనే గడపాలి కదా! వాళ్ళను గురించి ఆలోచిస్తుంటే పొడిబట్టలు ధరించాలనిపించడం లేదు. ఈ మేడ ఇంట్లో కాస్తయినా తడవకుండా తిరిగేవడమే కష్టంగా వుంది" అంది సీత.

"నిజమే! వాళ్ళ స్థితి తలచుకుంటే జాలి వేస్తుంది. కాని మనమేమి చేద్దామన్నా పదినుండా, ఇరవైమంది? వేయికన్న ఎక్కువ వున్నట్లున్నారు...అయినా తెల్లవారాక వాళ్లకోసం ఏదన్నా చేద్దాము" అన్నాడు పట్టాభిరామన్.

"భోజనం చేస్తూ మాట్లాడుదాం, పదండి...పిల్లలిద్దరూ కాస్త తడిగాలి ఏ డగ్గో జలుబో రాకుండా వుంటే చాలు నన్నిస్తూంది నాకు!" అంది లలిత.

"రైలు స్టేషన్‌లో ఎంత మంది పిల్లలను చూశాము. వాళ్ళంతా ఇవాళ రాత్రి ఆ వానలోనే జల్లులోనే వుంటారు కదా వాళ్లకు జబ్బు చేస్తే ఎవరు చూస్తారు?" అంది సీత.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ రాత్రి గడవనివ్వండి. నా మిత్రులతో కలిసి ఆలోచించి వాళ్లకేదయినా ఏర్పాటు చేస్తాను. ఇప్పుడు భోజనం చేద్దాం, పదండి!" అన్నాడు పట్టాభిరామన్.

సీత లేచి భోజనానికి వెళ్ళింది. భోజనాలయ్యాక ముగ్గురూ కాస్సేపు మాట్లాడుకున్నారు. తర్వాత నిద్రకుపక్రమించారు.

లలిత పడుకోగానే రగ్గును కప్పుకుని హాయిగా నిద్రపోయింది.

సీతకు రైల్వేస్టేషన్‌లో చూచిన నిరుపేదల గురించిన ఆలోచనలు నిద్రకు లేకుండా చేశాయి.

మరుసటి రోజుదయం పట్టాభి, సీతతో చెప్పినట్లు ఏదియినా చేయాలని బయటికి వెళ్ళాడు. ఎంతమంది పేదలు నిరాశ్రయులయ్యారో లెక్కలు వేశారించాడు. మిత్రులతో సంప్రతించాడు. వరద బాధితుల సహాయార్థం కావల్సి

సిన వీర్పాట్లు చేశాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి సీతకు అన్ని వివరాలూ చెప్పాడు.

"కలకత్తాలో నా కిట్లాంటి సహాయపు పనులలో అనుభవంవుంది. నేనూ మీతోబాటు వచ్చి స్త్రీలకు, పిల్లలకు నాకు చేతనయినంత సాయం చేస్తాను" అంది సీత.

పట్టాభి చాల సంతోషంతో అంగీకరించాడు. "ఈ వూళ్ళో ఇట్లాంటి సేవచేసే సోదరీమణు లున్నారు. వారికి మిమ్మల్ని పరిచయం చేస్తాను!"

ఆ మధ్యాహ్నం నుండే పట్టాభిరామన్ ఒక వైపూ, సీత ఇంకొక వైపూ సహాయక కార్యక్రమంలో నిమగ్నులయ్యారు.

కొన్ని రోజులపాటు, నిరాశ్రయులయిన పేదలకు పాఠశాలలో వసతి కల్పించారు. వాళ్లందరికీ ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య సౌకర్యాలు కల్పించారు. పిల్లల ఆరోగ్య విషయమై తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

సేవ బాగా ఎండినాక వాళ్లు మళ్లీ గుడిసెలు నిర్మించుకోవడానికి అన్ని విధాలా సాయం చేశారు.

ఈ పనులన్నీ ముగియడానికి మూడు నెలలు పట్టింది. ఈ మూణ్ణెల్లూ సీతకూ, పట్టాభిరామన్‌కూ తీరికే లేదు. వారితో కలిసి ఆ వూరి వారెందరో పని చేశారు. ఈ పనిలో సీత చూపిన దీక్ష, ఉత్సాహాలూ, ఆమె మృదు స్వభావమూ, మధుర భాషణమూ అందరి మెప్పుదలకూ పాత్ర మయింది. సీత పేరు దేవపట్టణమంతా వ్యాపించింది.

చెరసాల నుండి వచ్చాక పట్టాభిరామన్‌లో వెనుకటి ఉత్సాహం తగ్గిపోయింది. దేశానికి స్వాతంత్ర్యమూ, రాలేదు. జాతీయోద్యమమూ పుంజుకోలేదు. పాత వకీలు పని చేద్దామంటే మనసిచ్చగించలేదు. చేయడానికి వేరే పనీ లేదు. ఈ విధంగా మందకొడిగా వున్న పట్టాభికి ఈ వరద బాధితుల సహాయక కార్యక్రమం పునర్జన్మ వొసగింది; చేతుల నిండా పని తగిలింది. ఆ పని అతడికి చాల నచ్చింది. సాయంకాలం ఇంటికి రాగానే ఆ రోజు పనిని

గురించి పట్టాభీ, సీతా ఉత్సాహంగా మాట్లాడేవారు! ఇల్లు గలగల మని వుండేది. లలితకిది సంతోషంగా వుండేది.

'ఈ ఇల్లు మునుపెన్నడూ ఇంత సందడిగా ఎప్పుడూ లేదు. ఈయనా ఇంత ఉత్సాహంగా వుండేవారు కాదు. ఈయనకు నువ్వెంతగానో నచ్చావు' నువ్వంటే నచ్చనిదెవరికి? నువ్విక్కడే వుండిపో!" అనేది లలిత మాటికి.

"దైవ చిత్తమూ అట్లాగే వున్నట్లుంది; నాకు వెళ్లడానికి మాత్రం వేరే చోటంటూ ఏముంది గనుక?" అనేది సీత.

"నీ కూతురు వాసంతి మద్రాసులో వదలి వుండడం బాగులేదు" అనేది లలిత. "దానినిక్కడకు పిలిపించు. ఇద్దరు పిల్లలతో బాటు మూడవదవుతుంది."

'ఈ వేసవి సెలవులివ్వగానే వాసంతి నిక్కడకు పిలుచుకు వద్దామనే అనుకుంటున్నాను" అనేది సీత.

శర్మ వలన కష్టాలపాలయిన వారికి చివరకు ఆ వానవలన మేలే జరిగింది. అందరికీ రెండేసి క్రొత్త బట్టల చొప్పున లభించాయి. శుభ్రమైన చోట, చక్కగా కట్టిన గుడిసెలలో నివాసం మొదలయింది. వాళ్లకని ఒక వినాయకుడి ఆలయం కట్టారు. ప్రతి శనివారం భజనలు జరుగుతుండేవి.

ఇట్లా సాయం పొందినవారు హాయిగా వున్నారు, కాని సాయం చేసినవారంత హాయిగా లేరు. చేయడానికి పని లేకపోవడంతో పట్టాభి రామక్క మళ్ళీ నిరుత్సాహం మొదలయింది. సీతకు భర్త గురించి బిడ్డ గురించి దిగులు మొదలయింది. ఇంటి సందడి తగ్గింది. అందరి ఉత్సాహమూ కుంటువడింది.

ఒకవాడు సాయంకాలం కొందరు స్నేహితులు పట్టాభిరామన్ వద్దకు వచ్చారు. మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయని, పట్టాభి ఎన్నికలలో అభ్యర్థిగా నిల్చోవాలని ప్రోత్సహించారు. ఎన్నికలలో గెలిస్తే 'ఛేర్మన్' పదవి కూడా రాకచ్చని అంటారు.

పట్టాభి మొదట ఒప్పుకోలేదు. చెరసాలకు వెళ్ళివచ్చిన దోషి అయిన అగ్నిని ఎవరూ ఎదిరించరని మిత్రులు చెప్పారు. "ఆలోచిస్తాను—" అన్నాడు పట్టాభిరామన్.

"ఎన్నికలూ వద్దు, ఏమీ వద్దు—" అంది లలిత. ఆ రాత్రి భోజనాల వద్ద పట్టాభి ఆ విషయం ప్రస్తావించగా.

"ఎందుకట్లా అంటావు లలితా? ఆ వచ్చిన వాళ్ళంతా ఆయన మిత్రులే కదా!" అంది సీత.

"నీకీ వైపు మనుష్యుల సంగతి తెలియదు సీతా! వీరి నాన్న ఎన్నికలలో పని చేసినందువలనే ఎదిరింటివారితో విరోధం వచ్చింది...ఎందుకొచ్చిన బాధ?" అంది లలిత.

"అవి ఆ రోజులు; అంతే కాదు. వీరి నాన్న దేశాభిమానం కోసం ఏమీ చేయలేదు. ఈయన రెండున్నర సంవత్సరాలు ఖైదులో వుండి వచ్చారు. ఈయనతో ఎవరూ పోటీ చేయరు" అంది సీత.

"మీరన్నంత సులభం కాదు. బ్లాక్ మార్కెట్‌లో లక్షలు—ఆర్జించిన ఒక ఆసామీ ఈ వార్డులోనే నిలబడుతున్నాడట. పోటీ గట్టిగానే వుంటుంది" అన్నాడు పట్టాభిరామన్.

"వుంటే వుండనివ్వండి. అందుకోసం భయపడటమా? మీరు ఎన్నికలలో నాలుగ్గంటానం టే నేను ఇంటింటికి వెళ్ళి ఓట్లు అడగటానికి సిద్ధం" అంది సీత.

"మీరంత దీక్షతో కృషి చేస్తానంటే నేను విశ్రాంతి తీసుకోవడానికి సిద్ధమే" అన్నాడు పట్టాభిరామన్.

ఎన్నికలలో తాను అభ్యర్థిగా నిశ్చయించుకున్నానని పట్టాభి ప్రకటించిన రోజు నుండి ఆ ఇంటికి వచ్చే, పోయే, వారి సంఖ్య, వారి సమావేశాలు, ఆలోచనలు, అధికమయ్యాయి. చాలా మందికి పట్టాభి ఇంట్లోనే కాఫీ, టిఫిన్, భోజనం ఏర్పాటు చేయవలసి వచ్చేది. ఖర్చు అయ్యే తనులపాకు బుట్టలకు పొగాకు కట్టలకు అంతమే లేదు. డబ్బు నీరులా ఖర్చవసాగింది. లలితకు ఇవేవీ నచ్చలేదు.

అయితే సీత యొక్క హడావిడి, అధికారఘోరణి రోజుకు రోజు హెచ్చ సాగాయి. ఇదివరకల్లా సీతను మిక్కటంగా ప్రశంసించిన ఇరుగు పొరుగు వారందరూ యిపుడు దుయ్యబట్ట సాగారు.

సీత ధోరణికి నొచ్చుకున్న లలిత, పట్టాభికి మధ్య ఒక రోజు తీవ్రంగా వాగ్వాదం జరిగింది. కోపంతో "ఈ ఎన్నికల పీడా, సీత పీడా, ఎన్నడు విరగడై పోతాయో?" అని లలిత చెప్పగా రౌద్రాకారం తాల్చి పట్టాభి ఆమె మొడ బట్టి గెంటుతుండగా అక్కడికి సూర్యా వచ్చాడు.

సూర్యాను చూసి సిగ్గుపడి ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయాడు పట్టాభి. సూర్యా వెనకాల మూటలతో జాడీలతో వొచ్చిన తన తల్లికి స్వాగతం చెప్పి వాని గుమ్మంలోకి వెళ్ళింది లలిత.

సూర్యా ఒంటరిగా వుండగా పట్టాభి "సూర్యా! నేనెమో ఈరెచెడ్ ఎన్నికలలోకి దిగాను. చచ్చేంత పని వుంది. ఇంక రెండు వారాలే వున్నాయి. లలిత నన్ను పెడ్తున్న యాతన భరించలేకుండా వున్నాను. ఆమె సీతను చూస్తే చాలు. మండిపడ్తూంది. సీత అమ్మనాతవంగా వుండటమూ, నలుగురితో పొట్లాడుతూ, మెలుగుతూ, వుండటమూ, ఈమెకు నచ్చలేదు. ఇది చాలదని మువ్వు కాస్తా మీ అమ్మను తీసుకొని వచ్చావు. ఇక యిల్లు రణరంగమే ముమా!...మహా పసో! నువ్వు ఎటూ వచ్చావు, సీతను తీసుకొని వెళ్ళిపో. నా పాటేదో నేను పడతాను."

"బావా! మీరు అలాంటి ఈ స్థితికి వస్తారని నేను అనుకోలేదు. ఈ ఎన్నికల జోలికే పోయివుండకూడదు. ఏదో దిగి యింత దూరం వచ్చాక యిప్పుడు వెనకడుగు వేయకూడదు. ఎన్నికల పనిలో సీత చాలా సాయపడ్తుంది అని విన్నాను. కనుక ఇప్పుడామెను పంపివేయడం మంచిపని కాదు. ఇన్ని రోజులు ఎటూ వుంది; యింకో రెండు వారాలు వుండనివ్వండి. తరువాత చూద్దాం" అన్నాడు సూర్యా.

* * *

సీతను చూచి సూర్యా "సీతా! నేను వస్తుండగా జరిగిన నాటకాన్ని

నువ్వు కూడా చూచినట్లుంది'' అన్నాడు.

''ఔను నూర్యా! నేను మేలు చేయబోయినా అది కీడుగానే పరిణమిస్తుంది. నేనీ ఇంటి నుండి వెళ్ళిపోవాలనుకుంటున్నాను.'

''ఎక్కడికి?''

''ఏట్లోకి, బావిలోకి, సముద్రంలోకి! పోవాలంటే ఎన్నో చోట్లున్నాయి. ముందు మద్రాసు వెళ్ళి వాసంతిని చూడాలి. ఆ తర్వాత నా దారి నేను చూచుకోవాలి'' అని కన్నీరు కార్చింది సీత.

''అట్లా అనకు సీతా! నీ ప్రస్తుత కర్తవ్యం పట్టాభి ఎన్నికలలో గెలిచేటట్లు చేయడమే! ఇప్పుడు నువ్వెళ్ళిపోతే పరిస్థితి అధ్వాన్నమవుతుంది. ఇదివరకు పట్టాభి మనసులో పదవీ వ్యామోహం వుండేది కాదు. నువ్వే అతడి నిరోధంలోకి దిగడానికి ప్రోత్సహించావు. కనుక ఎన్నికలు ముగిసేదాక వుండి తీరాలి.''

''నువ్వు చెప్పేది నిజమేగాని నేనీ ఇంట్లో వుండలేను. నన్ను ఇంట్లోంచి తరిమిగాని వేరే పని చూడనంది లలిత. ''సీత ఈ ఇంట్లోంచి వెళ్ళగు. కావాలంటే నువ్వే వెళ్లు'' అన్నారు పట్టాభి ఈ మాటలు నా చెవులార విన్నాక ఈ ఇంట్లో ఎలా వుండను?''

''సీతా! వాళ్ళిద్దరూ కోపంలో అన్న మాటలను పట్టించుకోకు... ఎన్నికలయ్యేదాక నిన్నిక్కడే వుండమని లలిత చేత చెప్పిస్తాను. సరేనా!''

నే నెటూ మద్రాసు వెళ్లాలి నూర్యా! నిన్న నే వాసంతి నుండి వుత్తరం వచ్చింది. దాని బడి ఇంకో నాలుగు రోజుల్లో మూస్తారు. నన్ను చూడాలని తహతహ లాడుతూంది బిడ్డ. వెంటనే రమ్మని రాసింది.''

''నువ్వు ఎన్నికల పని చూచుకో! నే వెళ్ళి వాసంతిని తీసుకొస్తాను'' అన్నాడు నూర్యా.

* * *

సరస్వతమ్మాళ్ తన కూతురితో-''ఈ అంతటి వైరిదానిని నేనెక్కడా చూడలేదు. నీ భర్త విజయానికని సీత అంత కష్టపడుతుంటే నువ్వూరికే ఆడిపోసుకుంటావెందుకు?'' అంది.

"అమ్మా! ఈ ఎన్నికల రోగం నీకూ అంటుకున్నట్లుంది. ఇదేదో సాధారణ విషయం అనుకున్నావు. దీనివల్ల ఎన్నో కష్టనష్టాలు కలుగుతాయి. మామామగారీ ఎన్నికల ధర్మమా అని ఎందరి విరోధాన్ని సంపాదించారో నవ్వేరగవు!" అంది లలిత.

"ఎరుగుదునమ్మా ఎరుగుదును! ఆ బ్రాహ్మడు ఇంకవరికోసమో పని చేసి విరోధాలు తెచ్చుకున్నాడు. కాని అల్లుడే స్వయంగా ఎన్నికలలో నిల్చున్నాడు కదా? ఇందులో గెలిస్తే ఛేర్మన్ అవుతాట్ట కదా?"

"ఛేర్మన్ పదవి వస్తే మాత్రం ఏమి లాభం? జీతం బత్తెం లేని ఉద్యోగం!"

"జీతం లేకపోతేవేం ఆదాయం వుంటుంది, గౌరవం వుంటుంది. ఇన్నాళ్లు ఛేర్మన్‌గా వున్నాయన రెండు లక్షలు సంపాదించాడట. ఆయన బిడ్డ పుట్టిన రోజునాడు యాభై వేల రూపాయల కానుకలు వచ్చాయట. నీ బిడ్డకూ పుట్టిన రోజు జరిగింది, ఏమొచ్చింది? పోలీసు వారి లాఠీ దెబ్బలు!"

ఫక్కుమని నవ్వింది లలిత.

అప్పుడు సీత అక్కడకు వచ్చింది. ఆమెను చూచి సరస్వతమ్మ "రామారా! నేను అన్ని విషయాలూ విన్నాను. అల్లుడు గెలవాలని నువ్వు చాల కష్టపడి పని చేస్తున్నావట. అందుకనే మనుషులు వుండాలంటారు" అంది.

అత్తయ్యతో ఏమి మాట్లాడాలో ఎట్లా మాట్లాడాలోఅని జంకుతూ వచ్చిన సీతకు, ఆమె ప్రేమతో మాట్లాడడం ఆశ్చర్యం కల్గించింది.

"అత్తయ్యా! ఇక మీరొచ్చేశారు గనుక బాధ్యత అంతా మీదే! నే మారికి వెళ్లిపోతాను" అంది.

"బాగుంది సంబడం! ఎన్నికలయ్యాక వెళ్ళొచ్చులేవమ్మా! నువ్వు ప్రోత్సహిస్తేనే అల్లుడు ఎన్నికలలో నిలబడ్డాడట. నువ్వు మీటింగుల్లో మాట్లాడతావుట, పాడుతావుట, నీ వల్లే ఈయనకు ఛేర్మన్ పదవి వస్తుందని జిల్లా అంతా అనుకుంటున్నారు. నువ్వు వూరికి వెళ్తే ఈయనకు సాయం ఎవరుంటారు?"

"మీ అల్లుడికి ఎవరి సాయమూ అక్కర్లేదు. ఆయన సామర్థ్యానికి ఎవరికి వత్తాసూ అక్కర్లేదు. ఆయన ఎన్నికలలో నిల్చున్నారని ఈ దేవపట్నమంతా సంతోషిస్తూంది. అందరూ "మీ కేమా ఓటు" అంటున్నారు. అయితే ఒక్క లలితకే ఇదేదీ నచ్చలేదు. ఎప్పుడూ గొణుగుతూంది. ఆయనను సాధిస్తూంది. ఆయనకే చీకా కన్పించేలా ఏదో అంటూనే వుంది."

"లలితను గురించి పట్టించుకోకు...దాని విషయం నేను చూచుకుంటాను. అది నోరెత్తకుండా చూచుకునే పూచీ నాది. నాలుగేళ్ళయి అల్లుడు ఖాళీగా వున్నారే, ఈ సారి ఈ చేర్మన్ ఉద్యోగం వస్తే బాగుండునే అని నేను అన్నీ దేవుళ్ళకూ మొక్కుకుంటున్నాను. చిమాచ్చువయ్యర్ అదే పనిగా వచ్చి నీ మీద ఏవేవో చెబుతే—"చాలు చాల్లెండి! ఎప్పుడూ ఎవరినో ఒకరిని ఆడిపోసుకోవడమే మీ పని—" అని నోరు మూయించాను. ఇప్పటి చేర్మన్ ఆయనకు జవుళి లై సెన్స్ ఇప్పించాడు కదా అందువల్ల చీమాచ్చు గారికి బోలెడు లాభం వచ్చింది. రెండు మేడలు కట్టారు. అందుకనే చీమాచ్చు ప్రస్తుతపు చేర్మన్ తరఫున పని చేస్తున్నారు. స్నేహం బంధుత్వం అన్నీ అడుగున పడిపోయాయి. ఆ రోజుల్లో డబ్బు ప్రధానం గాని ఇవన్నీ ఎవడికి కావాలి? మనవాళ్ళేనని నీలాగా అభిమానంతో పని చేసేవాళ్ళెవరున్నారమ్మా? ఈ పిచ్చిది తెలిసీ తెలియక వాగితే నువ్వు వూరుకున్నావే అది నీ గొప్పతనం. ఇది నీకు తన చర్మంతో చెప్పాలు కుట్టిచ్చినా దీని ఋణం తీరదు తెలుసా?" అంది సరస్వతమ్మ.

అమ్మ స్వార్థం లలితకు వినడానికే చేదుగా వుంది; కాని తన స్నేహితురాలి పట్ల ఆమె వైఖరి మారినందుకు సంతోషం కలిగింది. సీత పొంగిపోయింది. అత్తయ్య తన్ను మెచ్చుకునే రోజు వస్తుందని ఆమె ఎప్పుడూ ఎదురు చూడలేదు. అట్లాటి రోజు రానేవచ్చింది. సీత తన ఇటీవలి బాధనంతా మరిచిపోయి సంతోషించింది.

40

నీలి సంద్రాన్ని చీల్చుకుంటూ ఓడ ముందుకు సాగుతూంది. ఇంగ్లండు నుండి భారత దేశానికి పయనిస్తున్న ఆ ఓడ పేరు "ఎస్. ఎస్. ఎలిజబెత్." యుద్ధం ముగిసి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. ఓడలలో ప్రయాణీకులకు చోటు లభించడం కష్టంగా వుంది. ఎంతో ప్రయత్నం మీద సౌందరరాఘవన్ ఆ ఓడలో చోటు సంపాదించాడు.

యుద్ధం ముగిసిన కొన్ని నెలలకు రాఘవన్ ఇంగ్లండుకు వెళ్ళాడు. ఎంత బ్యాంక్ ఖనయినా, జీతం ఎంత ఎక్కువయినా ప్రభుత్వోద్యోగానికి సాటి రాదని అతి త్వరలో తెలిసిపోయింది. పై పెచ్చు సర్కారు దస్తావేజులలో తన మీద ఒక అభాండం వుండనేల? యుద్ధంలో బ్రిటన్ ఓడిపోయి భారత ప్రభుత్వం మారివుంటే ఒక విధంగా మనసు శాంతించి వుండేది. కాని బ్రిటన్ గెలిచింది, భారత దేశంలో బ్రిటీషు పాలన సలిచివుంది! అలాటప్పుడు అతడు ప్రభుత్వోద్యోగాన్ని ఎట్లా అలక్ష్యం చేయగలడు?

అందుకని తన ఉద్యోగ విషయమై ఇంగ్లండు వెళ్ళి ప్రయత్నాలు చేశాడు. కాని ఆవేమీ ఫలించలేదు. అంచేత వెనక్కి వెళ్ళి బ్యాంక్ ఉద్యోగంలోకే చేరుదామని నిశ్చయించుకున్నాడు. భారత దేశానికి వెళ్ళడానికి ఓడలో చోటు దొరకడం దుర్లభమైంది. అందుకని చాల ప్రయాస పడ్డాడు; తిరిగాడు. ఆ తిరుగుళ్లల్లో అతడు కన్నవి, విన్నవి అతడి దృక్పథంలో మార్పుకు దారితీశాయి. ఆహా! ఈ ఇంగ్లీషు వాళ్ళెంత ధీరులు! దేశ స్వాతంత్ర్యం నిమిత్తం ఎన్నెన్ని త్యాగాలు చేశారు! స్వదేశంలో ఇన్నాళ్ళూ తానేమి చేశాడు? అన్యుల అడుగులకు మడుగులొత్తాడు. ఆ ఉద్యోగం పోతే దాన్ని మళ్లా సంపాదించుకోవాలని ఇంగ్లండుకు వచ్చి అడ్డమైన వాడి పాదాలు పట్టుకున్నాడు. ఛీ ఛీ ఎంత సిగ్గుమాలిన జన్మ! ఇంగ్లీషు చదువు తన బుద్ధి నిట్లా పెడదారిని పెట్టింది. జరిగిన దానికి పరిహారంగా ఇక ముందు నడుచుకోవాలి. భారత దేశ స్వాతంత్రంకోసం నలుగురూ ఆశ్చర్యపడేలా

వీడయినా చేయాలి...ఎస్. ఎస్. ఎలిజబెత్ పై 'డెక్' మీద పడక కుర్చీలో వాలి పడుకున్న రాఘవన్ మనసు పై విధంగా ఆలోచించసాగింది. మనసు ఆలా ఆలా వెనక్కి వెళ్ళి, పదిహేను సంవత్సరాల క్రింద తాను కరాచీ నుండి బొంబాయికి చేసిన ఓడ ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చింది. ఆ ప్రయాణం తను ఆకాశంలో పుష్పక విమానంలో గంధర్వ కన్యల సామీప్యంలో, నృత్య గాన సమేతంగా చేసిన అనంతయాత్ర అన్పించింది. అహా! ఎంత తప్పు చేశాను? కొంత పట్టుపట్టి తారిణిని పెళ్ళాడివుంటే జీవితం ఎంత ఆనంద మయంగా వుండేది!

మనసు తారిణి నుండి సీత మీదకు వెళ్ళింది. తారిణిని కోల్పోవడం తప్పయితే, సీతను పెళ్ళాడడం ఇంకా పెద్ద తప్పు! కిట్టావయ్యర్ కూతురు లలితను చూడడానికి వెళ్ళితే ఈమె అడ్డంగా వచ్చింది! తన చక్రాల్లాంటి కళ్ళతో చూచి తన మతిని పోగొట్టింది! ఒకటి మాత్రం నిజం, సీత కళ్ళు చాల అందమైన కళ్లు! తారిణి కళ్లు కన్నా సీత కళ్ళే కొంచెం ఎక్కువ అందంగా వుంటాయి...కాని ఒక ఆడదానికి అందమైన కళ్ళుంటే సరి పోతుందా? పోడని తన జీవితం బుజువు చేసింది! ఆ కళ్ళ వెనక వున్న హృదయాన్ని చూచేశక్తి తనకు లేకపోయింది. ఛీ ఛీ! ఎంత దంచల హృదయం! ఎంత అనూయ! ఎంత పోట్లాడే గుణం!

ఛీ ఛీ...ఇదేమి ఘోరణి? తప్పంతా సీతదేనా? కాదు, తనది కొంత వుంది. ఆమెతో మొదటినుండీ ప్రవర్తించవలసిన రీతిలో ప్రవర్తించి వుంటే ఆమె అణిగి మణిగి వుండేది...ఆమె స్వభావం అట్లా మారిపోవడానికి ఆ మూర్ఖుడు సూర్యా కొంత కారణం. తన అభిప్రాయాలకన్నా వాడి అభిప్రాయాల మీద కదా ఆమె కెక్కువ మోజు? చివరికి వాడెమైను ఎంతటి అధోగతి పాలు చేశాడు?

ఈ ఆడవాళ్ల స్వభావమే అర్థమయి చావదు! సూర్యాలో ఏమంత అందాన్ని, తెలివి తేటలను, ఆకర్షణనూ చూస్తారో తెలియడం లేదు. సీత సరే 'బావ' గనుక కరిగిపోయింది. ఆ తారిణికీ సూర్యాకూ ఏమి సంబంధం?

వాళ్ల మధ్య స్నేహం ఏమిటి? ఆ నూర్యా ఆస్పత్రి నుండి పారిపోవడానికి తారిణి ఎంత సాహసానికి ఒడిగట్టింది! ఏమి ధైర్యం! ఆ రోజు నుండి ఈ రోజు దాక వాళ్లిద్దరూ ఏమయ్యారో ఎవరికీ తెలియదు కద!

ఇంకో చిత్రం ఏమిటంటే కలకత్తాలో తారిణి అనుకుని సీతను ఖైదులో వుంచడం! కలకత్తాలో తాను కొన్ని రోజులున్నాక ఈ కబురు తెలిసింది కాని తాను ఏమీ చేయలేక పోయాడు...ఉండనీ, ఖైదులో పడివుండనీ! కొన్ని రోజులుంటేనన్నా బుద్ధి వస్తుందేమో! అందరూ విడుదలయ్యేటప్పుడు తానూ అవుతుంది. అప్పుడు చూద్దాం—అనుకున్నాడు తాను...కాని సీతకు ఇంకో అవకాశం ఇవ్వాలి! ఆమెతో కలిసి కాపురం చేయడానికి ఇంకోసారి ప్రయత్నించాలి!

ఇట్లా సౌందరరాఘవన్‌కు దయకల్గడానికి కొన్ని కారణాలున్నాయి. సీతతో కలిసి కాపురం చేయకపోతే ఆ భూమ అన్న పిశాచి బారి నుండి తప్పించుకోవడం కష్టం! రెండవ కారణం వాసంతి. ఇంగ్లండుకు వెళ్లడానికి ముందుగా రాఘవన్ మద్రాసు వెళ్ళాడు. అప్పుడు వాసంతి ఎంతో ఆమాయకంగా ఆతురతో అడిగింది—"నాన్నా! అమ్మ నెందుకు తీసుకురాలేదు?" ఆ ప్రశ్న అతడి హృదయాన్ని కలచివేయడం ఇంకా మరపుకు రాలేదు. బిడ్డ కోసమయినా సీతతో కాపురం చేయాలి...ఇంకొక కారణమూ వుంది.

రాఘవన్ ఢిల్లీ విడిచి బయలుదేరడానికి కొన్ని రోజులు ముందుగా ఒక రాత్రి పది గంటల వేళ హఠాత్తుగా ఒక స్త్రీ వచ్చింది! ఆమెను చూస్తుంటేనే భయం వేసింది; ఆమె మాటలింకా భయంకరంగా వుంది. "నే నెవరో తెలుసా?" అంది. "తెలియదు" అన్నాడు రాఘవన్. "సీతకు తల్లిని నేను" అంది. "సీతకు తల్లులు ఎందరేమిటి?" అని నవ్వుతూ ఆడిగాడతను. "నవ్వకు! నీ బోడి తెలివితేటలు నా ఎదుట ప్రదర్శించబోకు! సీత నా కూతురు, నా కన్న కూతురు కాదు. కాని అంతకన్న ఎక్కువే. నీ భార్య దగ్గర ఒక రత్నహారం వుండేది. అదింకా వుందా లేక అమ్మి ఆ డబ్బులు కాజేశావా?" అని అడిగింది. భయమూ ఆశ్చర్యమూ కలిగాయి రాఘవన్‌కు.

అయినా బయటికి కనపడనివ్వకుండా ''నువ్వెందుకు అడుగుతున్నావు? నువ్వెవరివి? నీ పేరేమిటి'' అని అడిగాడు. అందుకామె—.''చెబుతా వినుు, నేను నీ అత్తగారిని. నా పేరు రజియా బేగం. నేను సీతకు ఆ హారానిచ్చాను. అందుకనే అడుగుతున్నాను. అది సరే గాని నువ్వు సీతను చాల ఆరడి పెట్టావని విన్నాను. నీ దగ్గర కాపురం చేయడం కన్న చెరసాలలో వుండడమే సుఖమని చెరసాలకు వెళ్ళింది సీత. ఆమె ఎప్పుడో ఒకనాడు విడుదల అవుతుంది. అప్పుడు నువ్వామెను ఆదరించి, ప్రేమతో వున్నావా సరే, లేకపోతే నిన్ను పొడిచి చంపిపారేస్తాను, జాగ్రత్త'' అని కత్తిని పైకిలాగి చూపించింది. రాఘవన్ నిజంగా, భయంతో నణికిపోయాడు. నోట మాట పెగల్లేదు. చటుక్కున ఒక విషయం గుర్తుకు వచ్చింది. 'రజనీపూర్ పిచ్చిది' అన్న పేరుగల ఆడది ఢిల్లీలో తిరుగుతూంది, అని విన్నాడు. భయం భయంగా ''నువ్వు రజనీపూర్...'' అన్నాడు. ''అవును. నేను రజనీపూర్ మహారాణినే నా మడ్డుల కూతురిని జాగ్రత్తగా చూచుకో. లేకపోతే నా చేతుల్లో చావడం ఖాయం'' అని చెప్పి ఆ స్త్రీ మాయమయింది.

ఈ సంఘటన కొన్ని రోజుల పాటు రాఘవన్ మనసును కుదుటపడనివ్వలేదు. రజనీపూర్ పిచ్చిది ఎవరు. ఆమెకు సీతకు గల సంబంధం ఏమిటి—అని తెలుసుకోవాలని కుతూహలం బయలుదేరింది. కాని ఎట్లా తెలుసుకోవడం? సీత వచ్చాక ఆమె నడిగి తెలుసుకోవలసిందే!...

...సముద్రపు గాలి చల్లగా వీస్తూంది నేపథ్యగానంవలె తరంగనాదం వినిపిస్తూంది. రాఘవన్‌కు తెలియకుండానే కళ్ళు మూసుకుపోయాయి. నిద్ర పోయాడు....

....ఒక స్త్రీ అతడిపైపు కాసాగింది. తారిణి అనుకున్నాడు. నిదానించి చూడగా సీత అని తెలిసింది. ''సీతా, నేను నిన్ను పెట్టిన బాధలన్నిటిని మరిచి, నన్ను క్షమించు!'' అన్నాడు రాఘవన్. ''మీరు నన్ను బాధ పెడితే, నేను మిమ్మల్ని బాధ పెట్టాను. కాబట్టి సరిపోయింది. ఇంక క్షమాపణ లెందుకు? వాసంతీ ఏదీ?'' అని అడిగింది సీత. ''ఆ! వాసంతి విషయమే

మరిచిపోయాను. ఇదిగో వెళ్ళి పిలుచుకువస్తాను'' అని పరుగెత్తి పోగాడు రాఘవన్. వాసంతిని ఎక్కడో వదలిపెట్టినట్లు జ్ఞాపకం వుంది కాని ఎక్కడ అన్నది గుర్తుకు రావడం లేదు. గుర్తుకు తెచ్చుకుంటూ పరుగెడుతున్నాడు. ఓడ దిగి వీళ్ళలో పరుగెత్తాడు. ఇసుకలో పరుగెత్తాడు. కొండలలో కోనలలో పరుగెత్తాడు. మొదట ''వాసంతీ! వాసంతీ!'' అని అరుస్తూ పరుగెత్తాడు. కాని తర్వాత గొంతు మూసుకుపోయింది; మాట రావడం లేదు. అతి కష్టం మీద, ఎంతో ప్రయత్నించి ''అయ్యో! వాసంతీ!'' అని సావుకేక పెట్టాడు.

కల ముగిసింది. ఆ కలగన్న క్షణం నుండి బిడ్డను చూడాలని రాఘవన్ హృదయం తపించింది. ఇక ముందెప్పుడూ వాసంతిని విడిచి వుండరాదని నిశ్చయించుకున్నాడు. తన చిన్నారికి ఏ చిక్కూ లేకుండా వుండాలని దేవుడికి మొక్కుకున్నాడు.

బొంబాయి రేవులో ఓడ దిగి రాఘవన్ విమానం మీద మద్రాసు చేరుకున్నాడు. పద్మాపురం కాలనీలో తమ ఇంటికి చేరాడు.

వీధిగుమ్మానికి ఎదుట బండి ఆగి వుండడం గమనించాడు. ''ఎవరు ఊరికి వెళ్తున్నారు?'' అనిపించింది. టాక్సీ చప్పుడు విని కామాక్షమ్మాళ్ బయటికి వచ్చి కొడుకును చూసి ఆశ్చర్య పడింది. ''ఏరా నాయనా! వస్తున్నట్లు ఉత్తరం ముక్కయినా రాయకూడదా?'' అంది ప్రేమతో.

''అమ్మా! ఎవరయినా ఊరికి వెళ్తున్నారా?'' అని అడిగాడు రాఘవన్.

''అవున్రా! నువ్వు రావడం తెలియదు కదా...ఊరి నుండి నూరాత్రి వచ్చాడు. వాసంతిని తీసుకుని బయలుదేరుతున్నాడు. ఈ లోగా నువ్వే కనిపించావు.''

''బిడ్డను ఎక్కడికి తీసుకుపోతున్నాడు?''

''దేవపట్నానికి! అక్కడ వాసంతి వాళ్ళమ్మ వుంది కదా!''

''ఓహో! అలాగేం?'' అని గర్జించాడు రాఘవన్.

"నువ్వు వచ్చేశావుగా, ఇంక బిడ్డ ఇవ్వాళ ఏం కథ్తుంది లేఁ!" అంది కామాక్షమ్మ్.

"ఇవ్వాళా వెళ్లదు. ఎన్నటికీ వెళ్లదు" అంటూ రాఘవన్ లోపలికి వచ్చాడు.

సూర్యాతో ఊరి కెళ్లడానికి తయారవుతున్న వాసంతి వాన్నను చూడగానే పరుగు పరుగున వచ్చి అతడి కాళ్ళకు చుట్టేసుకుంది.

రాఘవన్ పంట్లాం జేబునుండి రివాల్వర్ ను తీసి, సూర్యాకు గురిపెట్టి- "క్రాష్టుడా! నీలాటి ద్రోహిని కాల్చిపారేస్తే ఆవంతయినా పాపం లేదు!" అని గర్జించాడు.

నిరుత్తరుడయి ఒక్క నిముషం అట్లాగే నిల్చుండిపోయాడు సూర్యా... తన దిగ్భ్రమను అణచుకుని "మిస్టర్ రాఘవన్! ఏమిటీ కోపం? ఇంగ్లాండులో ఇంగ్లీషు సినిమాలు ఎక్కువగా చూశారా ఏమిటి? కారణం లేకుండా కాల్చేస్తా, పేల్చేస్తా అంటూ బయలుదేరారే? తూటాలను పాడు చేయకండి. ఆ తర్వాత ఎందుకయినా కావల్సి వస్తాయి" అన్నాడు.

'నీ పెంకె ధోరణులు నే నెరుగుదును. నీడాబుసరి మాటలకు నేను మోసపోను! ఒరేయ్, సీతను తీసుకుని ఆనాడు పారిపోయావ్...ఇవాళ వాసంతిని 'కిడ్నాప్' చేయబోయావు! నిన్నివాళ పోలీసుల కప్పగించిగాని ఇంకో పని చేయను" అన్నాడు రాఘవన్. అతడి వెనకాలే నిల్చునివున్న కామాక్షమ్మ "ఒరే రాఘవా! వచ్చీ రావడంతోటే ఈ రభస ఏమిట్రా? సూర్యా ఏమంత తప్పు చేశాడనీ? వాసంతి అమ్మా నాన్నలను చూచి చాలా రోజు లయింది, అది తహతహ లాడుతూంది కదా అని నేనే అతణ్ణి వాసంతిని తీసుకెళ్ళి వాళ్లమ్మ్ర దగ్గర విడిచిపెట్టమన్నాను" అంది.

వాసంతి, "సూర్యా మామయ్యా! నేను నాన్నను గట్టిగా పట్టుకుంటాను. నువ్వు పారిపో" అంది. ఆ ముద్దు మాటలు విన్న రాఘవన్ కోపం కొంత తగ్గింది; కొంత సిగ్గూ కలిగింది.

"మిస్టర్ సూర్యా! ఆడవాళ్ళందరూ నీ పారీ యేనని నే నెరుగుదును. ఈ

సాకికి తుమించి వదలిపెడుతున్నాను. పో! వెళ్లిపో ఇక్కడనుంచి! గెటవుట్!'' అన్నాడు రాఘవన్.

''అయ్యా! నే నెటూ పోతున్నాను, కాని వెళ్ళే ముందు మీ తప్పు అభిప్రాయాన్ని సరిదిద్ది వెళ్తాను. నేను సీతను పిలుచుకుని పారిపోయానని ఇపు డన్నారే, నిజంగా మీ రట్లాగే నమ్ముతున్నారని నేను అనుకోవడం లేదు. నమ్మితే మాత్రం అంతకన్న తప్పు మరొకటి వుండబోదు. సీతను తీసుకు వెళ్ళింది రజనీపూర్ రాజు తాలూకు మనుష్యులు. వారిని అడ్డగించి సీతను కాపాడుదామనే నేను వారిని వెంబడించాను. అప్పుడే నన్ను పోలీసులు పట్టు కున్నారు. ఇదీ అసలు నిజం'' అన్నాడు సూర్యా.

''ఓనురా నాయనా! ఇవన్నీ సూర్యా నాకు చెప్పాడు. నిజమనే అన్పిస్తూంది నాకు. సీత కూడా ఇదే నిథంగా చెప్పింది'' అంది కామాక్షమ్మ.

'అమ్మ పడ్డ కష్టాలు వింటే ఆశ్చర్యంగా, భయంగా వుంది నాన్నా'' అంది వాసంతి.

రాఘవన్ రివాల్వర్‌ను పంట్లాం జేబులో పెట్టుకుని—''అయితే సూర్యా, అవన్నీ నాకు వివరంగా చెప్పు. ఇప్పుడు వెంటనే వెళ్లి తీరాలి సువ్వు!' అన్నాడు.

''అట్లాగే కానివ్వండి రాఘవన్, నా కేమీ తొందరలేదు'' అన్నాడు సూర్యా.

* * *

సూర్యా రజనీపూర్ మనుష్యుల గురించి చెప్పగానే, వారి గురించి తెలుసుకోవాలి అన్న కుతూహలం రాఘవన్‌లో ఉదయించింది. స్నానం భోజనం అయ్యాక అతడు సూర్యాను తీసుకుని తన మేడ మీద గదికి వెళ్లాడు.

''సూర్యా! ఓడలో వస్తుండగా నే నొక భయంకరమైన కలగన్నాను. వాసంతి కనబడకుండా పోయినట్లు, నేను దానికోసం భూమి మీద, నిటిలో, గాలిలో, నిప్పులో పొగలో పరుగుత్తి పరుగెత్తినట్లు కలగన్నాను. వాసంతి మాత్రం 'వాన్నా! నాన్నా!''అని అరుస్తూంది, కాని వాసంతి ఎక్కడ వుందో

కామకపోకలేక పోయాను. మెలకువ రాగానే- 'ఇకపై ఎన్నడూ సీతని విడిచి వుండరాదు" అని నిశ్చయించుకున్నాను. అందుకనే నేను రాగానే మన్మథ అమ్మాయిని తీసుకుపోతున్నావు అనగానే విపరీతమైన కోపం వచ్చింది. అందుకు నువ్వేమీ అనుకోకు...ఇందాక రజనీపూర్ మనుషులెవరో సీతని కొత్తుకుపోయారని ఒక కథ చెప్పావే..."

"అది కథ కాదండీ, నిజంగా జరిగిందే!"

"సరే, నిజంగా జరిగిందే అనుకుందాం? రజనీపూర్ మనుషులు సీతని తీసుకుపోయారు? నువ్వు చెప్పేది నిజమని నిరూపించావా ఆ రజనీపూర్ సంస్థానాన్నే నాశనం చేసి పారేస్తాను" అన్నాడు రాఘవ్.

"ఏదేమీ నిరూపించలేనండీ బాబూ, ఎవరో ఎప్పుడో చేసినదానికి నేను సాక్ష్యాలూ, బుజువులూ, ఎక్కడినుండి తేను? నేను చెప్పేది మీరు నమ్మాలి!"

"అయితే మరి, నమ్మకం కుదిరేలా నీ కథను చెప్పు, వింటాం"

"ఇంకా మీపరిహాసం మానలేదు మీరు...రాఘవ్! ఎప్పుడయినా మీరీ విషయం గమనించారా? ఒక కోణం నుంచి చూస్తే తారిణికీ సీతకూ పోలికలున్నాయని గమనించారా?"

అదిరిపడ్డాడు రాఘవ్. అతడి మనసులో ఎన్నో ఊహలు, ఎన్నో సందేహాలు ఒక్కసారిగా ఉదయించాయి. అయినా కాంతంగా "లేదు సూర్యా, నేను ఆడవాళ్ళ గురించీ, పోలికలూ అంతగా తరచి చూడను. పోనీ తారిణికీ సీతకూ పోలికలున్నాయనే అనుకుందాం, తర్వాత?"

రజనీపూరు మనుష్యులు తారిణి అనుకుని సీతను తీసుకుపోయారు."

"ఏమిటీ! అట్లాగయితే...?" అని కాస్సేపాగి రాఘవన్ మాట్లాడాడు "...అట్లాగని నీకెట్లా తెలిసింది సూర్యా? అన్ని రోజులు నాతో మెలగింది కాని తారిణి నాకు చెప్పలేదే?"

"తారిణి చెప్పలేదు. సీత ద్వారా తెలిసింది నాకు."

''అసలు సీతను తారిణి అని ఎత్తుకపోయినట్లు నీకేట్లా గుండేహాం పచ్చింది?''

''సీతను వాళ్ళు తీసుపవెళ్లడానికి ముందు రోజు నేనూ తారిణిదేవి వెండి బజారు వెనకాల వున్న గాంధి మైదానంలో కూర్చుని మాట్లాడుకుంటున్నాము. కాసేపయ్యాక తారిణి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ముగ్గురు వ్యక్తులు నా దగ్గరకు వచ్చారు. వాళ్ళవాలకం చూస్తి స్వదేశ సంస్థానపు మనుష్యులవలె వున్నారు. తారిణిని పట్టుకోవడంలో వారికి సాయం చేస్తే లక్ష రూపాయి లిస్తామని చెప్పారు. వాళ్ల ఉద్దేశమేమిటో నాకు తెలియలేదు. సంస్థానాధీశులకు అలవాటయిన చెడ్డ తలపుతోనే తారిణిని తీసుకవెళ్ళాలనుకుంటున్నారని తలచాను. వాళ్లకు ఏదో మాటలు చెప్పి పంపించేశాను. మరు రోజు ఆ మైదానంలో, ఇంచుమించు ఆ చోటే నేనూ, సీతా కూర్చొని మాట్లాడుతున్నాము...''

''ఓహో, అలాగా? ఉత్తమ ఇల్లాలు సీత ఎవరికీ చెప్పకుండా గాంధీ మైదానానికి వచ్చిందన్న మాట!''

'మిస్టర్ రాఘవన్! మీరు కోప్పడనంటే నిజం చెబుతాను!''

''కోప్పడేటట్లయితే అబద్ధం చెబుతావన్నమాట?''

''ఎట్లాగయినా నిజమే చెబుతా, వినండి! ముందొకసారి మీరు వన్నె పోలీసులకు అప్పచెప్పాలని అన్ని ఏర్పాట్లూ చేసివుంచారు. మీ ఇంటి చుట్టూ రహస్య పోలీసుశాఖ వారు కాపలా కాచేటట్లు ఏర్పాటు చేశారు. అప్పుడు మీ ఇంటికి వన్ను రావద్దని హెచ్చరించడానికే సీత.. గాంధీ మైదానానికి వచ్చింది...'' సీత ఎందుకు వచ్చిందో నన్న పూర్తి నిజం చెప్పలేదు కార్యసిద్ధికి సగమే చెప్పాడు. ఈ సగం నిజానికే రాఘవన్ మనసు కుతకుతలాడింది 'ఆ దుర్మార్గురాలట్లా చేసిందన్న మాట! ఈ వెధవను కాపాడ్డానికి ఎందుకంత శ్రద్ధ?' అనుకున్నాడు మనసులో.

తర్వాత సూర్య—రజనీపూర్ సంస్థానపు వ్యక్తులు తారిణి అనుకుని

సీతను తీసుకువెళ్ళడం దగ్గరనుంచి ఆమె కలకత్తాకు వచ్చి ఖైదీ గావడం దాకా జరిగినదంతా ముక్తసరిగా చెప్పాడు.

"రజనీపూర్ వాళ్ళు చేసిన పొరబాటునే కలకత్తా పోలీసులూ చేశారు. సీతనే తారిణి అనుకుని రక్షణ చట్టం క్రింద సీతను ఖైదులో వుంచారు" అంటూ ముగించాడు సూర్యా.

తర్వాత రాఘవన్, ఒకనాడు తన ఎదుట కత్తితోబాటు ప్రత్యక్షమై సీతను బాగా చూచుకోమని హెచ్చరించిన స్త్రీ గురించి సూర్యాకు చెప్పాడు చెప్పి—"ఆమె ఎవరు? సీత విషయంలో ఆమె కెందుకు అక్కరి?" అని అడిగాడు.

"చెబుతా వినండి!" అన్న సూర్యా మాటలు విని ఉలిక్కి పడ్డాడు రాఘవన్.

"ఆ స్త్రీ మొదటి పేరు రమామణిబాయ్. ఇప్పుడామె పేరు రజియా బేగం సీత పట్ల ఆమెకు ద్వేషం కలగడానికి కారణం వుంది. అది చాల పెద్ద కథండీ! ముప్పై యేళ్ళ ముందు ప్రారంభమవుతుంది ఆ కథ. నాకా కథ రజియాబేగం చెబుతేనే తెలిసింది. ఆ నిర్భాగ్యురాలు పిచ్చిపట్టి తిరుగుతూంది. అప్పుడప్పుడు చాల అపూర్వంగా ఆమె తెలివిగా, మామూలుగా మాట్లాడుతుంది. అట్లాంటి సమయంలో ఆకస్మాత్తుగా ఆమెను కలవడం తటస్థించింది. అప్పుడు చెప్పిందామె—"అన్న ఉపోద్ఘాతంలో మొదలు పెట్టి ఆశ్చర్యజనకమైన ఆ కథను చెప్పసాగాడు సూర్యా.

41

ముప్పై యేళ్ళ ముందు రజనీపూర్ సింహాసనాన్ని అధిష్ఠించిన మహారాజు తీవ్ర సంస్థానాధీశుల వలెనే విలాస, భోగాలలో మునిగి తేలుతుండేవాడు. ముష్ట

లైన మంత్రులు ఎందరో ఆయన వద్ద పని చేసేవారు. వాళ్ళల్లో ముఖ్యుడు మధోంకర్.

ఒకసారి రజనీపూర్ మహారాజు సభలో మహారాష్ట్ర నుండి వచ్చిన ఒక గాయకురాలు పాడింది. ఆమె పేరు గంగాబాయ్. మహారాజుగారి కామె నచ్చింది. ఆమెతో బాటు ఆమె అక్క వచ్చింది. ఆమె పేరు రమామణి; చాల ధైర్యస్థురాలు. ప్రపంచ వ్యవహారాలలో తిన్ను మించిన వాళ్ళు లేరని రమామణి నమ్మకం.

మహారాజు ఎగుట మూడు గోజుల పాటు కచ్చేరీలు జరిగాక మధోంకర్ ఆ స్త్రీలు విడిది చేసిన చోటికి వచ్చాడు. మహారాజా వారికి గంగాబాయ్ మీద మనసయిందని చెప్పాడు. "అయితే మహారాజా వారిని మా చెల్లెలిని పెళ్ళి చేసుకోమని చెప్పండీ—" అంది రమామణి. "మహారాజా వారి ఉద్దేశమూ అదే!" నన్నాడు మధోంకర్. 'పెళ్ళి' అన్న మాటతో రమామణి మోగపోయింది. తన చెల్లెలికి నచ్చచెప్పి ఒప్పించింది. 'పెళ్ళి' అంటూ ఒక తతంగం జరిగింది.

ఆ తర్వాత కొన్నాళ్ళకు రాజావారికి మూడు పెళ్ళిళ్ళయ్యాయని, అంతఃపురంలో ముగ్గురు రాణులున్నారని తెలిసింది. ఇది తెలిసి రమామణి నిశ్చేష్టురాలయింది కాని ఆశను కోల్పోలేదు. ఆ ముగ్గురు రాణులకూ పిల్లలు లేరని ఆమె తెలుసుకుంది. ఒక రోజు మహారాజును రమామణి ఏకాంతంలో కలుసుకుంది; కత్తి చూపి బెదిరించింది. తన చెల్లెలి కడుపున కొడుకు పుడితే అతడిని రజనీపూర్ సంస్థానానికి యువరాజుగా చేస్తానని మహారాజా చేత ఒక కాగితం మీద రాయించి పుచ్చుకుంది.

ఇవన్నీ తెలిసిన మధోంకర్ ఎత్తుకు పైయెత్తు వేశాడు. రాణి గంగాబాయ్‌కి కొడుకు పుడితే. పుట్టగానే ఆ బిడ్డను చంపివేయడానికి మంత్రతంత్రాలతో చెప్పి ఏర్పాట్లు చేశాడు.

ఉత్తమ ఇల్లాలయిన మూడవ రాణి, మధోంకర్ మంత్రతంత్రాలతో మంతనాలాడుతుండగా వినింది. ఆమె ఈ శిశు హత్య ఏర్పాటు రహస్యాన్ని

రమామణికి చెప్పింది. చెప్పి, ప్రసవానికి ముందుగా నాలుగవ రాణిని బొంబాయికి తీసుకువెళ్ళి పాప్మర్చీ, అందుకు కావలసిన పాయం తాను చేస్తానని ఆమె చెప్పింది. మహారాజు అప్పుడు యూరపు వెళ్లివున్నాడు. అంచేత రమామణి మూడవ రాణి సలహామేరకు, మధ్యాంక్ మనుష్యులకు కూడా తెలియకుండా చెల్లెలు గంగాబాయిని తీసుకుని బొంబాయికి వెళ్లిపోయింది.

రాజపుత్ర స్త్రీల ఆనవాయితీ ప్రకారం గంగాబాయ్ 'పరా'లో వుండిగనుక ప్రయాణం చేయడం సులువయింది. కాని ఇతర విధాల కష్టాలు వచ్చిపడ్డాయి. చేతిలోనూ డబ్బూ, రైలు టిక్కట్లూ దారిలో ఎక్కడో పడిపోయాయి. అంచేత బొంబాయికి ముందు స్టేషన్‌లో టికెట్ కలెక్టర్ వచ్చి చూచి, వారినద్ద టిక్కట్లు లేకపోవడం చూచి వారినక్కడే దించివేశాడు.

ఇదరూ ఆడవాళ్లు అందులో ఒకటి నిండు చూలాలు, చేతిలో డబ్బు లేదు. అయితే గంగాబాయ్ ధరించిన నగలున్నాయి. వాటిలో ఒకదానిని అమ్మితే డబ్బు వస్తుంది. కాని అది చిన్న స్టేషన్. రాత్రివేళ ఏదో బండ్లు వచ్చినప్పుడు తప్ప, నిర్మానుష్యంగా వుంది. రమామణి చెల్లెల్ని తీసుకుని వెయిటింగ్ గదిలోకి వెళ్లింది. జరిగినదంతా తెలుసుకుని గంగాబాయ్ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఈ ఏడుపు ఎవరిది?" అన్న కుతూహలంతో ఆ రాత్రి డ్యూటీలో వున్న స్టేషన్ మాస్టర్ ఆ గదిలోకి వచ్చారు. "ఏమిటమ్మా సంగతి?" అని అడిగారు. అట్లా అడిగిన స్టేషన్‌మాస్టర్ ఎవరో కాదు, సీత తండ్రి దొరైస్వామి అయ్యంగారే.

రమామణిబాయ్ వెలుపలికి వచ్చి ఆయనతో తమ పరిస్థితి చెప్పి, తనకు ఆ రాత్రి వుండడానికి చోటు కావాలని, మరుటి రోజు తన చెల్లెలిని ఏవయినా ప్రసూతి గృహంలో చేర్చాలనీ అందుకు సాయం చేయమని కోరింది.

"సాయం చేస్తే నాకేమిస్తారు?" అని అడిగారు దురైస్వామి అయ్యర్.

దురైస్వామి అయ్యంగార్‌కు జీతం తక్కువ. ఆయన భార్య రాజమ్మాళ్ ఆప్పుడు తన మొదటి బిడ్డను ప్రసవించడానికని ప్రసూతి గృహంలో వుంది.

దురైస్వామికి ఖర్చులు ఎక్కువయి డబ్బుకు చాల కటకట లాడుతున్నాడు. ఆదీగాక ఆ స్త్రీలను చూస్తే బాగా ధనవంతులని తెలిసింది. కనుకనే నాకేమిస్తావు' అని నోరు తెరిచి అడిగాడు.

రమామణి—"ఈ ఆపత్సమయంలో సాయం చేస్తే మిగడిగిన వస్తువు నిస్తాను. నన్ను కావాలన్నా ఇచ్చుకుంటాను" అంది.

దురైస్వామికి సిగ్గూ ఆశ్చర్యమూ కలిగాయి.

"తిట్లా మాట్లాడకండమ్మా! నాకేమీ వద్దులెండి. నా చేతనయిన సాయం నేను చేస్తాను!" అన్నారు.

మరునాటి నోజువయం, తన భార్యను చేర్చిన ప్రసూతి గృహంలోనే గంగాబాయ్‌ను చేర్చారు. కాని ఈ విషయం భార్యతో చెప్పలేదు...! పతి రోజూ తన భార్యను చూడడానికి వెళ్లినపుడు దురైస్వామి రమామణినీ చూచేవారు. ఆమె అయన సాయానికి కృతజ్ఞతలు చెప్పేది. ఆ కృతజ్ఞత స్నేహంగా స్నేహం ప్రణయంగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు.

రాజమ్మాళ్, గంగాబాయ్ ఒకే రాత్రి ప్రసవించారు. రాజమ్మాళ్ మగబిడ్డనూ, గంగాబాయ్ ఆడబిడ్డనూ ప్రసవించారు.

ఈ లోపుగా మధోంకర్ ఎట్లాగో వీరి ఆచూకీ తెలుసుకున్నాడు. ఆ ఆస్పత్రిని కనుక్కున్నాడు రమామణి కిది తెలిసింది. మధోంకర్ బారినుండి తప్పించుకుని వేరేవయినా చోటికి వెళ్లిపోదామనుకుంది. దురైస్వామి సాయం కోరింది. ఆమె పలపుకు దాసుడయిన దురైస్వామి సరేనని, ఆ బొంబాయి మహా నగరంలో ఎవ్వరూ కనుక్కోలేని మారుమూల ఒక ఇంటిని అద్దెకు తీసుకుని, అందులోకి వాళ్ళను తరలించారు.

దురైస్వామి రాజమ్మాళ్‌కు తెలియకుండా రమామణి ఇంటికి తరచు వెళ్ళి వస్తుండేవారు.

తారిణి పుట్టినప్పుడే రాజమ్మాళ్‌కు పుటిన అబ్బాయి త్వరలోనే కన్ను మూశాడు. ఆ దుఃఖాన్ని మరిచిపోవడానికని దురైస్వామి రోజూ రమామణి ఇంటికి వెళ్లి తారిణిని ముద్దాడి వస్తుండేవారు.

రజనీపూర్ మహారాజు యూరపు నుండి తిరిగి వచ్చారు. ఆయన బొంబాయిలో బస చేసిన చోటికి రమామణి వెళ్ళి గంగాబాయి పరిస్థితి గురించి చెప్పింది, ఆయన వాళ్ళేవరో తనకు తెలియనే తెలియదన్నారు. రమామణి ఆయన స్వహస్తాలలో రాసిచ్చిన వుత్తరాన్ని చూపించింది. మహారాజు ఆనతి మేరకు ఆయన అనుచరులు ఆ వుత్తరాన్ని లాగేసుకుని ఆమెను బయటికి గెంటి వేశారు.

ఎనలేని దుఃఖంతో నిరాశతో ఇంటికి తిరిగి వచ్చింది రమామణి. చెల్లెలికి అన్నీ చెప్పింది. ఆమె మూర్ఛపోయింది. కొన్ని నెలల తర్వాత గంగాబాయ్ మరణించింది.

... తారిణి నిజంగా ఒక రాజకుమార్తె అని తెలియగానే రాఘవన్ మనసు వెనుగాలిలో సముద్ర తరంగాలవలె చెలరేగింది. అంతవరకు అతడికి అర్థంకాని విషయాలు ఎన్నో బోధపడ్డాయి. తారిణి సామాన్యమైన, సాధారణమైన స్త్రీ కాదని తాను అపుడపుడు ఊహించినది నిజమైందికదా అని గర్వించాడు. ఒకప్పుడు తాను ఆ రాజకుమార్తె ప్రేమకు పాత్రుడయినందుకు ఉప్పొంగిపోయాడు. కాని ఆ ప్రేమను సఫలం చేసుకోలేక పోయినతన చేతకాని తనానికి విలవిల లాడాడు.

తానెంత ప్రయత్నించినా తెలుసుకోలేని తారిణి జన్మ వృత్తాంతాన్ని ఈ నూర్యా తెలుసుకోగల్గినందుకు ఆశ్చర్య పడ్డాడు. తారిణీ, సీత, సూర్యాల మీద కోపమూ కలిగింది. వాళ్లు ముగ్గురూ కలిసి తన జీవితాన్ని వాశనం చేయడానికి కుట్ర పన్ని నట్లనిపించింది.

కోపమూ, కడుపుమంటా, అసూయా కలిసి మధించగా వాటన్నిటినీ దిగమ్రింగి రాఘవన్—"నూర్యా! నువ్వు చెప్పిన గంగాబాయ్ కథ 'డ్యుమాస్' నవల కన్నామిన్నగా వుంది!" అన్నాడు.

"కల్పన లన్నిటిని మించిన నిజాలు మన స్వదేశ సంస్థానాల వెనుక దాగి వున్నాయి. ఆ కథలు నా గుండెలో మంటలు రేపుతున్నాయి. గంగాబాయ్, రమామణిలవలె ఎన్ని వేల స్త్రీలు అన్యాయాలకు, అత్యాచారాలకు బలి

అయినారో ? ఆ నారీమణుల కన్నటి సెగలలో స్వదేశ సంస్థానాలు మాడి మసి అయిపోలేదేనని ఆశ్చర్యం వేస్తూంది నాకు !" అన్నాడు సూర్యా.

"అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇది కలియుగం కదా ! పతివ్రతలకు శాపం పెట్టే శక్తి త్రేతాయుగంతోనే అంతరించింది. ఇప్పుడు అన్యాయాలు, అక్రమాలు చేసేవారికి మంచి కాలం. సరే, తర్వాత కథ చెప్పు ! గంగాబాయ్ మరణించాక రమామణి ఏమి చేసింది ? ఆ అదృష్టవంతుడు, మీ మామగారు ఏమి చేశారు ?" అని అడిగాడు రాఘవన్.

"ఆ పైన చెప్పడానికి ఎక్కువేమీ లేదు. బహుశ నా కన్న మీకు ఎక్కువ తెలుసేమో ? అయినా నాకు తెలుసిన వివరాలు మీకు చెబుతాను" అని చెప్పసాగాడు సూర్యా.

* * *

గంగాబాయి మహాన్మరణం రమామణి మతిని చెడగొట్టింది. ఆమె తన చెల్లెలి దుర్గతికి కారణమయిన రజనీపూర్ మహారాజుపై, మధోంకర్‌పై పగ సాధించి తీరుతానని ప్రతిజ్ఞ పూనింది. ఆ ఉద్వేగమే ఆమెను ఎన్నో ఇడుములపాలు చేసింది.

పగ సాధించడానికీ, తారిణిని మధోంకర్ బారి నుండి తప్పించడానికీ రమామణికి మగసాయం కావలసి వచ్చింది. అంచేత తన ఆకర్షణంతా ప్రయోగించి ఆమె దురైస్వామితో తన సంబంధాన్ని దృఢపరచుకుంది.

దురైస్వామి అయ్యర్ గారి స్థితి చాల ఇరుకున పడింది. తనకొచ్చే కొద్ది పాటి ఆదాయంతో బొంబాయిలో రెండు కుటుంబాలను నడపడం చాల కష్టమైంది. ఆర్థికంగా చాల చిక్కులు కలిగాయి.

తారిణి పెరిగి పెద్దదయింది. ఒక రోజు రమామణి ఆమెకు, రజనీపూర్ రాజు వలన తన చెల్లెలు గంగాబాయికి జరిగిన అవ్యాయాన్ని వివరించి అందుకు అతగాడికి తగిన శాస్తిచేసి తీరడానికి తానునిశ్చయించినట్లు తెలిసింది.

గంగాబాయ్ కథను విన్న తారిణి మనసు స్వదేశ సంస్థానాల గురించి దేశ స్వాతంత్ర్యం గురించి ఆలోచించ సాగింది. స్వాతంత్ర్య పోరాటం పట్ల, సంఘసేవ పట్ల మక్కువ కలిగింది. అప్పుడు దేశమంతా జరుగుతున్న ఉప్పు సత్యాగ్రహోద్యమంలో ఆమె పాల్గొంది ఆ తర్వాత బీహార్ భూకంపానికి గురి అయినవారికి సాయం చేద్దామని వెళ్ళింది.

ఇంచుమించు ఈ సమయంలోనే రాజమ్మాళ్ చాలా జ్వరాల నుంచి జబ్బు పడి వుందనీ, బ్రతకడం కష్టమనీ రమామణికి తెలిసింది. ఆమెనూ, ఆమె కూతురు సీతనూ చూడాలన్న కాంక్ష రమామణికి చాల కాలం నుండి వుంది. రజనీపూర్ సంస్థానపు ఆభరణాలలో తన వద్ద నున్న అఖరి ఆభరణమయిన రత్నహారాన్ని, రెండు వేల రూపాయలనూ తీసుకుని, దుర్గాస్వామి ఇంట్లో లేని సమయంలో, ఆయన ఇంటికి వెళ్ళింది.సీత పెళ్ళికని చెప్పి రత్నహారాన్ని డబ్బును, రాజమ్మాళ్ చేతికి ఇచ్చివచ్చింది.

ఈ బాధ్యతను నెరవేర్చాక రమామణి తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చడంలో లీనమయింది. బొంబాయికి వచ్చినప్పుడు రజనీపూర్ రాజును చంపడానికి యత్నించి విఫలురాలయింది. హత్యా ప్రయత్నానికి ఆమెకు కారాగార వాసపు శిక్ష లభించింది.

ఆ తర్వాత కొద్ది కాలానికి రజనీపూర్ రాజు చనిపోయాడు అందువలన చెరసాల నుండి విడుదలయి రాగానే రమామణి మధోంకర్ వైపు తన దృష్టిని మళ్ళించింది. కాని ఆమె ఆ ప్రయత్నంలోనూ ఓటమినే పొందింది. ఆమె మధోంకర్ కోసం వేచి వేచి ఆఖరికి అతడు దొరికాడు కదా అని అనుకున్న సమయానికి, రమామణివలెనే మధోంకర్ మీద పగబూనిన ఇంకొక దెవడో ఆమెకన్న ముందుగా మధోంకర్ని పరలోకానికి పంపించేశాడు!...

42

...ఇవంతా చెప్పి సూర్యా "రాఘవన్ గారూ! ఎవరో స్త్రీ వచ్చి పీత నుంచి హెచ్చరిక చేసి వెళ్లిందన్నారే ఆమె గజియా బేగమే అయి వుండాలి. పీత పట్ల ఆమె శ్రద్ధ వహించడానికి కారణం ఏమిటో తెలిసింది కదా?" అన్నాడు.

"ఆ ప్రియమైన మామగారిని నేను నా పెళ్ళి తర్వాత ఒక్కసారి కూడా చూడనే లేదు. ఆయన ఇప్పుడెక్కడ వున్నారు? ఏమి చేస్తున్నారు?' అని అడిగాడు రాఘవన్.

"అదే నాకూ తెలియదు. గజియా బేగం ఎక్కడ వుందో కూడా తెలియలేదు. నేనూ తారిణీ వాళ్ళిద్దరికోసం ఎంతో ప్రతికాము కాని దొరక లేదు" అన్నాడు సూర్యా.

"ఎందుకు వెదికారు?"

చిరునవ్వుతో చెప్పాడు సూర్యా; "మిస్టర్ రాఘవన్! ఒక పనికి వారి అనుమతి, ఆశీర్వాదం కావాలి. అందుకనే వెతికాము. వెతుకుతున్నాము. నేనూ తారిణీ పెళ్ళి చేసుకోదలిచాము..."

రాఘవన్ పకపక నవ్వి—"సూర్యా! నువ్వెంతో తెలివిగలవాడివని కదా అనుకున్నాను!" అన్నాడు.

"ఆ అభిప్రాయం తప్పని ఇప్పుడనిపిస్తుందా?' అని అడిగాడు సూర్యా.

'పోను. లేకపోతే తారిణిని పెళ్ళాడతానంటావా? ఇన్ని రోజులు ఆమెతో మెలగాక కూడా ఆ మాట్లే అంటావా?...సూర్యా! నీకు తెలుసో తెలియదో కాని తారిణిని ఒకప్పుడు పెళ్ళి చేసుకుందామనే అనుకున్నాము. ఆమె కూడా నన్ను ప్రేమించినట్లే నటించింది..."

"రాఘవన్! తారిణిని గురించి అట్లా మాట్లాడకండి. తారిణి నటిం

చింది అని అనగలిగారంటే మీరు ఆమెను అర్థం చేసుకోలేదన్న మాట!"

"అయితే ఆమెను నాకన్న నువ్వు బాగా అర్థం చేసుకున్నావనా?"

"ఆహా! అందులో ఏమీ సందేహం లేదు. తారిణి అర్థం చేసుకున్నవాడయితే ఆమె నటించిందని అని వుండరు!"

"ఒకప్పుడు నన్ను ప్రేమించానని చెప్పిన మనిషి నిన్ను పెళ్ళి చేసుకుంటానంటే, అందులో ఏదో ఒకటి అసహ్యమయి వుండాలి కదా?"

"అక్కర్లేదు. తన అభిప్రాయాన్ని మార్చుకునే హక్కు ప్రతి వ్యక్తికీ వుండి ఒకప్పుడు తారిణి మీపట్ల అనురాగాన్ని ప్రకటించిన మాట నిజమే. అది నటన కాదు. వేషమూ కాదు. అయితే, ఆ తర్వాత తన జీవిత ఆశయాలకు అనుగుణంగా లేదని తెలిసి తన అభిప్రాయాన్ని మార్చుకుంది. అది తప్పెట్లా అవుతుంది?"

"సూర్యా! ఆమె తరపున ఆ తేరిన వకీలులా మాట్లాడుతున్నావే! కాని నీ యత్నమంతా దండగే! తారిణి గురించి నీకన్న నాకెక్కువగా తెలుసు. ఆమె నన్ను ప్రేమించినట్లు ఎందుకు నటించిందో నాకు తెలుసు. కేవలం రెండు వేల రూపాయల కోసమే! రాజులను వెతుక్కుంటూ వెళ్ళిన గాయకురాలి కూతురే కదా!"

కోపంతో లేచాడు సూర్యా: "రాఘవన్! జాగ్రత్తగా మాట్లాడండి! తారిణి గురించి అవాకులు చెవాకులు మాట్లాడితే..." ఆ పైన అతడికి మాట రాలేదు; పెదవులు వణుకుతున్నాయి.

"...మాట్లాడితే ఏమి చేస్తావోయ్? ఆ రజియా బేగంలా తాడిచి చంపేస్తానంటావా?" అన్నాడు రాఘవన్ హేళనగా.

"మీతో మాట్లాడి లాభం లేదు. నేను వెళ్లిపోస్తా—" అంటూ సూర్యా లేచాడు.

"అరెరె! అటా వెళ్లిపోతా ఎట్లాగోయ్? కూర్చో బాబూ కూర్చో! నీ ముద్దుల మరదలు సీతాదేవి ఎక్కడుంది, ఏమి చేస్తూంది అని చెప్పి వెళ్లవోయ్!..ఆమెను గురించి మాట్లాడినా కూడా కోపం వస్తుందా ఏమిటి?

అవును మరి, నేనేమో తాళిగట్టిన భర్తను; నువ్వేమో ముద్దుల బావవూ!"

సూర్యా వంగి నేల వంక చూస్తున్నాడు. ఆతడి కండ్ల నుండి రెండు మొట్టు కన్నీరు నేల మీదకు చిందాయి.

"ఇదేమిటోయ్ ఆడపిల్లలాగ? సీత పేరు చెప్పగానే హృదయం కరిగి పోతూందేం? ఏమిటో ఆ అనుబంధం?"

సూర్యా కళ్లు తుడుచుకుని, రాఘవన్ వైపు చూశాడు.

"నన్నెన్నయినా అనండి, తారిణిని ఎన్నయినా అనండి. కాని సీతను గురించి అటాంటి మాటలు మాట్లాడిన వారి నాలుక తెగి క్రింద పడిపోతుంది. ఆ పాపం చేసినవారు ఘోర నరకానికి పోతారు. వాళ్లను ఈ భూమి బ్రద్దలయి మింగివేస్తుంది" అన్నాడు. ఆతడి మాటల కాఠిన్యానికి రాఘవన్ మూడు ఐంకాడు.

సూర్యా ఇంకా మాట్లాడాడు: 'సీత మీ పాదాల వద్ద వాలడానికి సిద్ధంగా వుంది. ఏదయినా తప్పు జరిగివున్నా అవన్నీ మరిచి విమ్మల్ని దైవం లాగా పూజించడానికి సిద్ధంగా వుంది ఆమె. సీతకీ కార్డు ముక్క రాయండి రెక్కలు కట్టుకుని వాలుతుంది."

'సూర్యా! నువ్వు చెబుతున్నది ఈ జన్మలో జరగబోదు. సీతకు రమ్మని వుత్తరం రాయడం కన్న ఈ చేతిని నరికేసుకుంటాను."

"అయ్యో! అడ్డంగా నరకండి! నా మాట నాలకించండి. జరిగినదంతా మరిచిపొండి, సీతతో కాపురం చేయండి; సంతోషంగా వుంటారు. రాఘవన్! మీరూ సీతా అన్యోన్యంగా వుండడం కన్న నాకూ తారిణికీ కావలసిందేముంది?"

అసలే అగ్గిలా వున్న రాఘవన్‌కు, సూర్యా తారిణి పేరెత్తడం, ఆజ్యం పోసినట్లయింది. "నీకూ ఆ తారిణికీ సంతోషం కల్గించడమే నా జీవిత లక్ష్యం అనుకున్నావా!" అని పెడేలు మని సూర్యా చెంప మీద దెబ్బ వేశాడు. వెంటనే చేయెత్తాడు సూర్యా, కాని దించివేశాడు.

"ఏం చేయి దించేశారేం వీరుడుగారు?"

"రాఘవన్! ఒకప్పుడయితే దెబ్బకు పది దెబ్బలు కొట్టిపుండేవాడిని కాని ఇప్పుడు నేనూ తారిణీ గాంధీజీ శిష్యులం; అహింసను నమ్మేవారం; బల ప్రయోగం పనికి రాదని విశ్వసించేవారం. ఆ సహనానికి మొదటి పరీక్ష మీరు పెట్టారు"

"ఓ! గాంధీజీ శిష్యులా! అయితే మరొకటి పుచ్చుకోండి!" అని రెండో చెంప మీద కొట్టాడు రాఘవన్.

పళ్ళు కొరుక్కుంటూ సూర్యా "ఇప్పుడు మీకు తృప్తిగా వుందా? మీ మనసు శాంతించిందా?...ఇక నేను వెళ్ళొస్తాను" అన్నాడు.

"తృప్తిగా లేదబ్బాయి; అప్పుడే శాంతి ఎట్లా లభిస్తుంది?" అంటూ రాఘవన్ సూర్యా మెడను గట్టిగా పట్టుకున్నాడు. "ఇదిగో సూర్యా! నువ్విక వుందు సీతనుగాని తారిణినిగాని చూడబోనని ప్రమాణం చేయి. లేకపోతే నిన్ను చంపేస్తాను" అన్నాడు.

"మీ కోరిక సమంజసమైనది కాదు. నా మనసులో కల్మషం లేనప్పుడు నేను సీత నెందుకు చూడరాదు? తారిణి నిషయమై మీకు నేనెట్టి హామీలు ఇవ్వ నవసరం లేదు. శావాలంటే నన్ను శాల్చి పారేయండి. మీరు చేసిన ఘన శార్యానికి సీత, తారిణి, మీ అమ్మ వాసంతి సంతోషిస్తారు!"

"ఓరి శుంఠా! నన్ను బెదిరిస్తావుట్రా?" అన బలమంతా వుపయోగించి సూర్యాను మెట్లవైపు తోశాడు రాఘవన్.

సూర్యా మెట్ల మీద దొర్లుకుంటూ వెళ్ళి, మలుపు దగ్గర ఎట్లాగో సంబాళించుకుని లేచి కూర్చున్నాడు. వాసంతి, కామాక్షమ్మ పరుగెత్తుకు వచ్చారు.

"అయ్యో! ఇదేవిటి మామయ్యా! మెట్ల మీద పడ్డారా?" అని శాసంతి అడిగింది.

"అవునమ్మా! కాలు జారింది" అన్నాడు సూర్యా.

"వాసంతీ! పాపం సూర్యా కాలు జారి పడ్డాడు. కాని అదృష్టం బాగుండి మెట్లకేమీ నష్టం కలుగలేదు" అని చెప్పి గొల్లుమని నవ్వాడు రాఘవన్.

43

దేవపట్నం కోలాహలంగా వుంది. ఎన్నికల రోజుకు ముందు రోజు పట్టాభిరామన్ అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తూ పెద్ద సభ జరిగింది. ఆ సభకు జనులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు.

వేదిక మీద పట్టాభి కాక ఇంకా పురుషులూ, స్త్రీలు కూర్చుని వున్నారు. స్త్రీలలో సీత కూడా వుంది. గత నలభై రోజుల నుండి సభలలో మాట్లాడడంతో ఆమె అరితేరిన వక్త అయింది. దేశ భక్తి, స్వాతంత్ర్య వేశము నిండిన ఆమె ప్రసంగాలు అవినీతిని, లంచగొండితనాన్ని చీల్చి చెండాడాయి. పట్టాభి రామన్ అభ్యర్థిత్వాన్ని ఆమె ఎంతో నేర్పరితనంలో ప్రేమతో సమర్థించింది. పోటీ అభ్యర్థిని విమర్శిస్తూ ఆమె చేసిన ప్రసంగాలు రామ బాణాల వలె తగిలాయి. అంచేత ఆ నాటి శ్రోతలందరూ శ్రీమతి సీతా దేవి ప్రసంగానికై తహ తహ లాడుతూ వేచియుండడం సహజమే కద?

అయితే వారి ఆశ నెరవేరలేదు. శ్రోతలకు ఆశాభంగం కలిగింది. ఎందుకంటే ఆ రోజు సీత మాట్లాడలేక పోయింది. లేచి నిల్చుని నాలుగు మాటలు మాట్లాడేలోగా ఆమెకు తలూలున ఏడుపు వచ్చేసింది. అందుకు కారణం ఇది. సభ జరుగుతుండగా ఒక మూలగా ఎవరో ఒకడు ఏదో కరపత్రాన్ని జనానికి పంచ సాగాడు. ఆ కరపత్రాన్ని చదివిన వారంతా సీత వైపు తదేక దృష్టితో చూడసాగారు. వేదిక మీదికి కూడా ఒక కరపత్రం వచ్చింది. దానిని సీత అందుకుని చదివింది. మొదటి నాలుగు పంక్తులు చదివేసరికి గుండె పగిలిపోతుందేమో నన్నించింది.

ఆ కరపత్రంలో సీతను గురించి నిందా పూర్వకంగా, నీచంగా రాసి వుంది. ఆమె తన మొగుడివి వదిలేసి, సూర్యాతో పారిపోయి వచ్చిందనీ, ఆమె చెరసాలకు వెళ్ళింది దేశభక్తితో కాదని రైల్లో ఏదో దొంగిలించినందువల్లనని, అటువంటి టక్కులాడి ప్రసంగాలకు ఓటర్లు మోసపోరాదనీ, అందులో రాసివుంది.

ఆడదాని మనసును గాయపరచడాని కింతకన్న ఏమి కావాలి? ఆ తర్వాత రెండు రోజుల దాక సీత ఇల్లు విడిచి బయటికి రాలేదు.

ఈ సంఘటనకు పట్టాభి ఎంతో బాధ పడ్డాడు. కాని ఎన్నికలలో గెలిచితీరాలి. అన్న అతడి పట్టుదల దిగాణీకృతమైంది.

పై కరపత్రం ఓటర్ల దృక్పథాన్ని ఏ విధంగానూ మార్చలేదు. 'ఏవడీ ఆకాశ రామన్న? మాటలు వినిమోసపోయేటంత మూర్ఖులము మేము అంటాడా? ఈ చెత్త రాసిన వాడే 'మూరుడు—' అని నిరూపించదలచుకున్నారు—దేవపట్నం ప్రజలు. నల్ల బజారు ద్వారా జనాన్ని దోచుకుంటున్న పెద్ద మనిషి ఈ విధంగా ఒక స్త్రీని నానా దుర్భాషలూ ఆడి విజయం సాధిద్దామనుకుంటున్నాడు, వీడికో గుణపాఠం చెప్పాలి. అనుకున్నారు. ఈ అభిప్రాయాలు ఓట్లలో ప్రతిఫలించాయి. పట్టాభిరామన్ అధిక ఓట్ల మెజారిటీతో గెలిచాడు.

ఆ ఘనవిజయం పట్టాభికి అపరిమితమైన ఆనందోత్సాహాలను కల్గించి వుండాలి కాని కలిగించలేదు. ఆ ఆనందామృతంలో విషపుబొట్టులాగా—సీతను గురించిన నిందా ప్రచారం—పని చేసింది.

మిత్రులూ అభిమానులూ వచ్చి పట్టాభిరామన్‌కు అభినందనలు తెలియజేశారు. ఆతడికీ లలితకూ పూలమాలలు వేశారు. "ఈ విజయానికి మూలం మీ అదృష్టమే!"నని ఆమె నభినందించారు కొందరు.

ఒకరిద్దరు సీతనూ పలకరించారు. "నలుగురిలోకి వచ్చాక ఇట్లాంటివి ఎన్నో జరుగుతూనే వుంటాయి. ఎందరో నీచులుంటారు. వాళ్ళందరికీ భయపడి ఉత్సాహాన్ని కోల్పోరాదు" అన్నారు. ఎదురింటి దామోదరం పిళ్ళై.

"మిస్టర్ పట్టాభిరామన్ మీరే సీతగారికి ధైర్యం చెప్పాలి"అన్నారు అడ్వకేట్ అప్పారావ్.

అందరూ వెళ్ళిపోయాక భోజనానికి కూర్చున్నారు. లలిత భోజనానికి రమ్మని సీతను ప్రాధేయపడింది.

"తల నొప్పి ఎట్లా వుంది?" అని అడిగాడు పట్టాభిరామన్.

"మీ గెలుపు వార్త వినగానే పోయింది; చాల సంతోషం" అంది సీత.

"ఇదంతా మీ ప్రోత్సాహం, సాయాలవల్లనే అయింది మీకు నే నెంతో ఋణపడి వున్నాను."

"మా లలిత అదృష్టమే అన్నిటినీ సాధిస్తుంది" అంది సీత.

"సీతా! ఈయన ఆశ చూశావా? ఈ విజయం చాలదుట. ఛేర్మన్ పదవి కూడా వస్తే అప్పుడు సంతోషిస్తారట" అంది లలిత.

"నీ అదృష్టం వల్ల అదీ వస్తుందిలే!"

"అదృష్టం ఒకటి చాలదు. నా కోరిక నెరవేరాలంటే మీరు మనసు పడిలా సాయం చేయాలి; మేడ మీద కూర్చుంటే కాదు" అన్నాడు వల్లభి.

"ఇంక నా వల్ల మీకు అపకారమేగాని ఉపకారం జరగబోదు... ఈ రెండు రోజుల నుండి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. అడవాళ్ళంట్లాంటి. వాటి జోలికి రాకూడదు; లోకులు పలుగాకులు; దుర్మార్గులు" అంది సీత.

"మీరన్నది నిజంగాదు; ఇవాళ అభినందించడానికి వచ్చిన వారం తమూ మిమ్మల్ని ప్రశంసించారు. ఒక్కరయినా ఒక చెడ్డ మాట అనలేదు."

"ఇవాళ అనకపోతే రేపు అంటారు. ఆ కరపత్రం మీరు చూచారా? కూచి వుంటే వాలాగే మీ గుండె కూడా మండేది!"

లలిత అడ్డొచ్చింది. 'చాలు చాల్లెండి ఈ మాటలు! సంతోష సమయంలో ఈ అపశకునపు కూతల గురించి ఎందుకు మాట్లాడడం?"

భోజనాలయ్యాక సీత పైకి వెళ్ళింది. అప్పుడు సరస్వతమ్మాళ్ లలితతో—"ఇంక ఈ పిల్ల ఇక్కడ వుండడం మంచిది కాదు. ఈమె పూరికి వెళ్ళితే బాగుంటుంది" అంది.

"బాగుందమ్మా నువ్వు చెప్పడం! పనయ్యేదాక సాదాలు పట్టుకుని, పన్యాళ మెడబట్టి గెంటడమా? ఆ సీత సాయం చేయకపోతే ఈయన ఎన్నికలలో పాల్గొనేవారూ కాదు, గెలిచేవారూ కాదు. ఆసూట ఇంతకు ముందు అన్నావు?"

'ఆమె సాయం చేసింది నిజమే! నేను కాదనడం లేదు. కాని పీత

మంచి మనిషయితే రెండు మూడు రోజులలో పెళ్ళిపోవాలి. ఆమెకూ మొగుడూ బిడ్డా వున్నారు. ఇక్కడే కూర్చుని వుంటే ఆ మె కుటుంబం ఏమవు తుంది? నువ్వు ఇటూ వెళ్ళి ఇంకొకరింట్లో వుంటావా? ఆలోచించు!" అంది భరస్వతమ్మ. తల్లి చెబుతున్నదానిలో కొంత నిజం వుందనిపించింది లలితకు.

అత్తగారి కోరిక మేరకు వట్టాభిరామన్ మున్సిపల్ ఛేర్మన్ పదవి వరించింది. అయితే ఆ విజయం మామూలుగా రాలేదు; ఊరుములతో మెరుపు లతో వచ్చింది.

రోజులు గడిచిన కొద్దీ పట్టాభికి తాను ఛేర్మన్ అయితీరుతానన్న విశ్వాసం ఏర్పడసాగింది. పట్టాభి, లలిత, సీతల ఉత్సాహం హెచ్చసాగింది. ఛేర్మన్ ఎన్నికకు ఇంకా రెండు రోజు లుండగా లలితకో వుత్తరం వచ్చింది. అప్పుడు పట్టాభి ఇంట్లో లేడు. కవర్ చింపి చూచింది లలిత. అందులో వుత్తరమేమీ లేదు; ఒక పత్రిక ప్రతి వుంది. 'పట్టాభి లీలలు! అన్న శీర్షిక చదవగానే ఆమె మనసు ముక్కలయింది; ఒళ్ళంతా వణికేంది.

వెంటనే తన గదిలోకి వెళ్ళి, తలుపులు వేసుకుని, కిటికీ ప్రక్కగా నిల్చుని చదివింది. సగం చదివింది; ఆపైన చదవలేక పోయింది. కంటి నుండి వేడి కన్నీరు ముప్పిరుగొన్నది. కొంత సేపట్లో కన్నీరు కార్చాక మనసు తేలిక పడింది. 'ఎవరో అయోగ్యుడు, అసూయగొన్నవాడు, అవాకులూ చెవాకులూ రాసి అమ్మితే అది చదివి సంయమనం కోల్పోవడమా?' అని తనకు తానే సమాధానం చెప్పుకుంది.

ఇట్లా లలితను బాధించి, దోక నీచాతి నీచమైన పత్రిక దేవపట్నం లోని ప్రముఖులు చేస్తున్న అన్యాయాలను బయట పెడుతున్నామన్న సాకుతో ఆ పత్రిక ఇట్లాంటి అభాండాలనూ అశ్లీలాలనూ ప్రచురిస్తూంటుంది. ఇట్లాంటి పత్రిక వుందని లలిత విని వుంది. ఎవరో పుణ్యాత్ములు ఆ పత్రికలో ఒక పుటను కత్తిరించి తనకు పంపారు. ఆ పుటలో—సీత పట్టాభి ప్రేమికులనీ, ఇంట్లో వున్న లలిత మూర్ఖురాలనీ, ఇటువంటి పట్టాభికాయనకు పురపాలక సంఘాధ్యక్ష పీఠంపై కూడుగా ఎన్నుకోబోతున్నారు కదా!—అని మొసలి కన్నీరు కార్చారు.

ఎంత వద్దనుకున్నా లలిత ఈ విషయాలను మరువలేక పోయింది. కాని ఛేర్మన్ ఎన్నిక దినం దగ్గరలోకి వచ్చేసింది గనుక ఉత్సాహంగా వున్నట్లు నటించింది.

ఎన్నికలలో గెలిచినట్లు తెలిసి, మిత్రులు అభినందనలు స్వీకరించి ఇంటికి వచ్చాడు పట్టాభి. 'ఇవాళ లలిత సీతకు ఏమొచ్చింది?' అని లిస్తు పోయాడు. స్నేహితులందరూ తన వీపు వెనక గుసగుస లాడడం కర్ణాకర్ణిగా విని అతడి మనసు వికలమయింది.

ఆ రాత్రి లలిత అతడితో నెమ్మదిగా సంభాషణ మొదలు పెట్టింది. "ఏమండీ! 'యమునూత' పత్రిక చూశారా?" అని అడిగింది.

పట్టాభికి నెత్తిన పిడుగుపడ్డట్లయింది...ఓహో! ఇదా సంగతి! ఆ కంపు పత్రికలో ఏదో రాసినట్లున్నారు. ఎవరో ఆది పనిగా వచ్చి దానిని గురించి చెప్పి లలిత మనసు పాడు చేసినట్లున్నారు.

"ఆ చెత్తను చదవలేదు; చదవబోను—"

"ఊరంతా చదువుతున్నారు; మనలను చూచి నవ్వుతున్నారు"

"ఎందుకని?"

"యమునూత పత్రికలో విషయాల నురించే! ఆ ప్రక్కటి పిన్నిగారు, ఎదురింటి గాములక్కమ్మ నా దగ్గరకు వచ్చి చెప్పి నెళ్ళారు. ఊరంతా తెలిసి పోయింది; మీకొక్కరికే తెలియలేదు."

"ఆ పత్రిక నీ దగ్గర వుందా?"

"ఉంది!"

"తే, చూద్దాము!" అన్నాడు పొంగుకొస్తున్న కోపాన్ని అణచుకుని పట్టాభిరామన్.

"ఇదిగో—" అంటూ దీపం వేసి, తన పెట్టెలోనుండి ఆ పత్రిక పుటను తీసి అతడి కిచ్చింది.

నిల్చునే పట్టాభి ఆ పత్రికను చదివాడు. చదువుతుండగా అతడి రక్తం లావాలా ఉడికింది. పళ్ళు బిగించుకుని చదివాడు. "అగ్గిపెట్టె వుందా!" అని అడిగాడు.

"ఎందుకు ?"

"ఇవ్వు, చెబుతా !" ఆమె అగ్గిపెట్టె తెచ్చిచ్చింది. అగ్గిపుల్ల వెలిగిం ఆ పత్రికకు అంటించాడు పట్టాభి.

"అయ్యో ! తగలబెట్టకండి !"

'ఏం ?"

"నే నందులో సగమే చదివాను !"

"అట్లాగేం ?" అని ఆ కాగితాన్ని కాల్చి బూడిద చేశాడు పట్టాభి.

"ఎమంత తొందర ? నేను చెబుతుంటే అక్కర్లేదా ? ఉన్న మాటంటే ఉలుకెందుకు ?"

లలిత చెంప ఛెడేలు మంది. "ఇట్లాంటి చెత్త పత్రికలు కొనడం, చదవడం పనికి రాదని చెప్పలేదూ ? ఎంత తెగించావు !" అన్నాడు పట్టాభి.

లలిత దిగ్భ్రమ నుండి తేరుకుని, వెక్కిళ్ళతో "నేను కొనలేదు. పోస్టు ద్వారా వచ్చింది" అంది.

"ఇట్లాంటి దొంకటి పోస్టులో వచ్చిందని నాతో చెప్పలేదేమి ? దీనిని పెట్టెలో పెట్టి తాళం వేశావు అంటే నీ మనసు అశ్లీలాన్ని అభిలషిస్తున్న దని తెలుస్తూంది !"

లలిత మౌనంగా వుండి. దీనమార్చి పట్టాభి పడుకున్నాడు.

"నేను చేసింది తప్పే ! క్షమించండి—" అంది లలిత.

"సరే ! ఇక ముందు వాకు తెలియకుండా ఏమీ చేయకు ! పడుకుని నిద్రపో !" అన్నాడు పట్టాభి.

లలిత పడుకుంది కాని నిద్ర రాలేదు; ఏడుపూ వెక్కిళ్ళూ వచ్చాయి.

44

ఎన్నికల సభలో పంచిన కరపత్రంలోనే మనసు పాడయివున్న సీత పేపరు మీద ఇంకొక పిడుగు పడింది. అది సూర్యా ఉత్తరం రూపంలో వచ్చింది. అ ఉత్తరంలో_ "నేను మద్రాసుకు వెళ్ళిన రోజే హఠాత్తుగా సౌందర రాఘవనూ ఇంగ్లండు నుంచి వెనక్కు వచ్చారు!" అన్న సూర్యా వాక్యం విద్యుదాఘాతం వలె తగిలింది సీతకు. ఆ ఆఘాతంలో ఆశ్చర్యమూ సంతోషమూ కలిసి వున్నాయి. ఆ వాక్యం చదవగానే తన కష్టాలన్నీ కరిగిపోయినట్లనిపించింది. వెంటనే ఎగిరివెళ్ళి సౌందరరాఘవన్‌ను చేరాలనిపించింది. కాని ఆ తర్వాత సూర్యా రాసినది చదివితే అంతులేని ఆవేదన ఆకాశంగం కతిగాయి. సూర్యా తన అనుభవాలన్నిటిని రాసి ఉత్తరాన్నిట్లా ముగించాడు.

"సీతా! నీ భర్త తిరిగి రాగానే నిన్ను అతడి దగ్గరకు చేర్చాలని ఎంతో తపించాను. కాని అదంతా పగటి కలగ ముగిసింది. కారణాంతరాల వల్ల ఇప్పుడు నేను వెనక్కు తిరిగి రావడం లేదు. ఇక్కడ నుండి ఢిల్లీ వెళ్తున్నాను.

చివరకు ఒక మాట చెబుతున్నాను. నీకు నచ్చకపోతే క్షమించు. పట్టాభి ఎన్నికల గొడవలలోకి నువ్వు దిగడం, అతడి పక్షాన పని చేయడం నాకు నచ్చలేదు. సాధ్యమైనంత వరకు నువ్వు ఇంటి పట్టునే వుండడం మంచిది. ఈ లోకం అంత మంచిది కాదు."

ఇది చదివి సీత విలవిల లాడింది. ఆమెకు భగవంతుడి మీద, ప్రపంచం మీద కోపం వచ్చింది. అందరికన్న మిన్నగా తాను కన్న కూతురి మీద కోపం వచ్చింది. అమ్మ వద్దనిపించే కదా వాసంతి, వాళ్ళ నాన్నతో పాటు కలకత్తా వెళ్లింది. ఆమెకు అవధులులేని ఆగ్రహం కల్గింది.

ఈ సూర్యా తనను ఆయనను కలపాలని చూచాడట! ఎవరడిగారు ఈ మధ్యవర్తిత్వాన్ని?...ఇన్ని రోజులు విడివున్న తర్వాత కూడా ఆయన

మనసు మారలేదల్లే వుంది. నేను మాత్రం వెళ్లి ఆయన పాదాల మీద పడనేల? సూర్యాకు నేను ఎన్నికలలో పని చేయడం నచ్చలేదుట...నచ్చకపోతే నాకేమి? ఇతగాడి ఇష్టాల కోసమే నేమిటి నేను పుట్టిందీ, పెరిగిందీ? ఆ తారిణి ఏమి చేసినా నచ్చుతుంది కాబోలు...ప్రపంచం ఏమీ గొడ్డుపోలేదు... నేను వేదిక మీదకెక్కి మాట్లాడితే సంతోషించి మెచ్చుకునేవారు లేక పోలేదు. వారి ఆదరాభిమానా లుంటే చాలు వాకు..."

ఈ విధంగా ఆలోచించి తన వేదనను సరిపెట్టుకుంది సీత. యథా ప్రకారం ఉత్సాహంతో తిరగసాగింది.

సీత సూర్యా ఉత్తరాన్ని ఎవరికీ చూపలేదు. కాని సూర్యా వాసంతిని తీసుకుని రాకపోవడడానికి కారణం చెప్పక తప్పలేదు. సౌందరరాఘవన్ ఇంగ్లండు నుండి రాగానే వాసంతితోబాటు కలకత్తా వెళ్ళిపోయినందున సూర్యా తన కూతురిని దేవపట్నం తీసుకురాలేక పోయాడని చెప్పింది. లలిత మిగతా వివరాల నూహించింది. సీత పట్ల మునుపటికన్న ఆదరాభిమానా లతో మెలగ సాగింది.

ఛేర్మన్ ఎన్నికల రోజు సమీపించిన కొద్ది ఒకటి తర్వాత ఒకటిగా ఇబ్బందులు కలిగాయి సీతకు.

ఢిల్లీ నుండి సూర్యా రాశాడు.

"తారిణితో మాట్లాడాను. నీకూ రాఘవన్‌కూ మధ్య ఇంకెవరు తల దూర్చినా అందువలన అపకారమే కాని ఉపకారం జరగబోదని ఆమె అంది. నువ్వే కలకత్తా వెళ్ళి ఆయనకు క్షమాపణ కోరడం మంచిదని ఆమె అభిప్రాయం. సీతా! మునుపొక్కసారి నువ్వు నీ భర్త చెంతకు వెళ్ళి—'గతాన్ని మరచి క్రొత్తగా జీవితం ప్రారంభిద్దాం—' అని కోరుదామనుకున్నావు కాని అది జరగలేదు. ఆ నిర్ణయాన్ని ఇప్పుడు ఎందుకు అమలు జరపరాదు? నువ్వు వెంటనే కలకత్తాకు వెళ్లడం మంచిది. ఇక్కడ మాజీ దివాన్‌గారి కూతుళ్ళుండేవాళ్ళే వాళ్ళిప్పుడు కలకత్తా వెళ్ళారు. ఇది వాకింకా చింతను కలిస్తూంది."

ఇది చదవగానే మండి పడింది సీత. ఓహూ! అట్లాగా? ఆయన "రా!" అని పిలవకుండా నా అంతట నేనే వెళ్లి ఆయన కాళ్ళ మీద పడడమా? వీల్లేదు. ఆయన ఏదెయ్యానయినా వెళ్లి చేసుకుని ఊరేగనీ! నేను పాత సీతను కాను! ఢిల్లీ లో వుండిన అమ్మాయికురాలు సీతను కాను! నే నెవరి పాదాల మీద పడను!..."

ఛేర్మన్ ఎన్నిక జరిగిన రోజు రెండు ఉత్తరాలు వచ్చాయి.

చిత్ర ఇట్లా రాసింది: "ప్రియమైన సీతకు! నువ్వెంతో తెలివిగలదానివి అనుకున్నాను. కాని ఇదేమి వెర్రితనం! మీ ఆయన మా యింటి ఎదుట మేడపై వుంటున్నారు. పొద్దుస్తమానం ఆ కిటికీ దగ్గర వెర్రివాడిలా కూర్చోవడం చూస్తే జాలివేస్తుంది. నా భర్త ఆయనతో పరిచయం చేసుకున్నారు. నేను కూడా మా వారితోబాటు మీ అమ్మాయిని చూచి వచ్చాను. ఎంత అందంగా వుంది నీ కూతురు! అట్లాంటి బిడ్డను వదలి ఎట్లా వుంటున్నావో నా కర్థం కావడం లేదు.

"ఒక రోజు వాసంతి మా ఇంటికి వచ్చింది. నా నోరు వూరు కుంటుందా? "మీ అమ్మ ఎప్పుడొస్తుందిట?" అని అడిగాను. "మా అమ్మ రానేరాదు" అంది బిడ్డ. "ఎందుకని?" అని అడిగాను. "మా నాన్నంటే మా అమ్మకు సచ్చదు" అంది. "నీకెవరంటే ఇష్టం?" అన్నాను. "నాకు అమ్మా ఇష్టం. నాన్న ఇష్టం!" అంది. "మరయితే నాన్నతోనే వున్నావేం? అమ్మ దగ్గరకు వెళ్ళవా?" అని అడిగాను. "వెళ్లాలనే వుంది. కాని ఏం చేయడం? వాన్న, ఒంటరిగా వున్నారు కదా అనుకుని వదలి ఎట్లా వెళ్ళడం?" అంది. సీతా! ఇట్లాంటి కూతురిని కన్నది నీవే కదూ?"

"కొన్ని రోజుల నుండి ఇద్దరు ఆశ్చర్యకరమైన యువతీమణులు ఎదురింటికి వచ్చి వెళ్తున్నారు. చాలా ప్రేమగా [illegible]తో మాట్లాడి వెళ్తుంటారు. మావారి కిదేమీ నచ్చలేదు. ఒక [illegible] ఎవరు—అని అడిగారట. 'ఢిల్లీలో నే నెరిగిన వాళ్ళే!' అన్నారట తియ్యగా. 'చాల దగ్గరివాళ్లలా వున్నారే?' అని అడిగితే "ఇంకా దగ్గరకు రానని చూస్తున్నారు. నన్ను

పెళ్లి వలలో ఇరికిద్దామని చూస్తున్నారు.'' అన్నారట మీవారు. అప్పుడీయన అన్నారట—''మీరయినా ఒంటరిగా ఎంత కాలం వుంటారు? ఇద్దరిలో ఒకరిని పెళ్ళి చేసుకోరాదా?'' అందుకు మీ ఆయన ఏమన్నారో తెలుసా?—''దేవత వుండి వెళ్ళిన ఆలయంలో దెయ్యాన్ని ప్రతిష్ఠించ మంటారా?'' అన్నారట.

''నీ భర్త నిన్ను 'దేవత' అంటుంటే, నువ్వేమో వెళ్లి ఎక్కడో కూర్చున్నావు. ఇదిట్లావుండగా. నిన్నటినుండి వాసంతి జ్వరంగా వుంది. ''అమ్మ రాదు—'' అని కలవరింతలూట! నీ మనసున ఆర్ద్రత అనేది వుంటే కంటనేరా!''

ఈ వుత్తరం సీత మనసు కల్లోల పరచింది. చిత్ర రాసిందంతా నిజమేనా? లేక తన్ను రప్పించాలని వేసిన ఎత్తా? ఆయన తన్ను దేవత అన్నది నిజమేనా?...దేవుడా! నా బిడ్డను కాపాడు తండ్రీ! నేను చేసిన పాపాలకు నన్ను శిక్షించు కాని నా బిడ్డకేమీ కీడు జరగకుండా చూడు తండ్రి!...చిత్ర రాసింది నిజమైనా కాకపోయినా వెంటనే వెళ్ళాలి. ఇంక ఆలస్యం పనికి రాదు. రాత్రే చెప్పేసి వెళ్ళిపోదాం.

ఇట్లా తలపోసిన సీత ఆ రెండో కవర్‌ను చింపింది. దానిలో ఒక పత్రిక పుట వుంది. అది వేరేమీ కాదు, రెండు రోజుల ముందు లలితకు వచ్చిన పుటయే! లలిత మాత్రం దానిని చదివి, సీత చదవకుండా వుండిపోతుందేమో నన్న బాధతో ఎవరో పుణ్యాత్ముడు అతిశ్రద్ధగా దానిని సీతకు పంపించాడు!

ఆ పుటను చదువుతుంటే కళ్ళు రెండూ భగ్గున మండుతున్నట్లనిపించింది సీతకు. అవమానంతో శరీరం దహించుకు పోయింది. భూమి బ్రద్ధలయి తన్ను లోపలికి తీసుకోకూడదా? ఆ అదృష్టం ఆ జానకీదేవికేగాని తనలాంటి దౌర్భాగ్యురాలికి ఎందుకు కలుగుతుంది?

చెప్పరాని, చెప్పలేని ఆవేదనతో అవమాన భారంతో వెర్రెత్తినదానిలా అయింది సీత. కాస్సేపయాక బాధ కొంత సద్దుకుని మళ్ళీ ఆలోచించే శక్తి కల్గింది. రెండు రోజుల నుండి లలిత ప్రవర్తనలో మార్పుకు ఇదేనా కారణం?

ఇట్లాంటి వార్త చదివిం తర్వాత కూడా లలిత తన్ని ఇంట్లో వుంచుకుందా? అయితే ఆమె సీత, సావిత్రి, దమయంతి అందరూ ఆమే! ఆమె మొహాన్ని తానిక చూడలేదు. పట్టాభిరామన్ వైపు కన్నెత్తి చూడలేదు. తాను ఎవరినీ చూడకుండా, ఎవరికీ చిప్పకుండా, రాత్రి అందరూ నిద్రపోయాక వెళ్లిపోవలసిందే!

తాను చేయవలసిన దానిని గురించి కొద్దిపాటి సందేహం వుంటే అది కాస్తా ఆ రాత్రి పది గంటలకు తీరిపోయింది. ఆ చిన్న ఇంట్లో పడక గదిలో పట్టాభి లలితల మధ్య తారస్థాయిలో చెలరేగిన వాగ్వాదం సగానికి వైగా సీత చెవిన పడి ఆమెను నరక యాతనకు గురి చేసింది.

ఆ భార్యా భర్తలు ఎప్పుడు నిద్ర పోతారా—అని కాచుకుంది సీత. మాటల శబ్దం ఆగిన గంట తర్వాత వెళ్దాం అనుకుంది...

...సీత కన్నీరు ఎండిపోయింది. ఆమె మనోభారం కరిగి పోయింది. తాను అనుసరించదగిన మార్గమేమిటో స్పష్టంగా నిర్ణయించుకుంది ఆమె. అందువల్ల ఇటీవల కాలంలో లేని మనశ్శాంతిని అనుభవించింది ఆమె.

సీత ఒకటి రెండు చీరలనూ, వున్న డబ్బు మొత్తాన్నీ చేతి పెట్టెలో భద్రపరచుకుంది. ఉత్తరాలన్నిటినీ చింపివేసింది. బయలుదేరడానికి ఆయత్తమై,ఇంట్లో సవ్వడి తగ్గాలని వేచివుంది.

దీపాలు ఆర్పారు. అంతటా నిశ్శబ్దం అలముకుంది. ఆ తర్వాత కాసేపు కాచుకుంది సీత. చెప్పకుండా వెళ్లడం బాగుంటుందా అని సంశయం పీడించింది.

కాగితం తీసుకుంది లలితకు ఉత్తరం మొదలు పెట్టింది. ఒకటి రెండు పంక్తులు రాసి చింపి పారేసింది. ఉత్తరం రాయడం తనవల్ల కాదని ఆ ప్రయత్నం మానుకుంది. చేతి పెట్టెను తీసుకుంది. దీపం ఆర్పింది. అడుగుమోద అడుగు వేసుకుంటూ మెట్లు దిగింది.

క్రింద వసారాలో రాత్రి దీపం మందంగా, నీలంగా వెలుగుతూంది. ఎదుట గోడ మీద కరుణామయుడయిన గాంధీ మహాత్ముడి పటం కనపడింది.

"కలియుగపు అవతార పురుషుడు గాంధీజీ" అన్న అమ్మ మాటలు సీత గుర్తుకొచ్చాయి. పెట్టెను క్రింద పెట్టి చేతులు జోడించింది. "బాపూ! నన్ను ఆశీర్వదించండి! నూతన జీవిత పథాన అడుగిడబోతున్న నాకు కావలసిన శక్తిని ప్రసాదించండి!" అని ప్రార్థించింది. "కరుణామూర్తీ! మీ ఆశీఃబలంతోనే ఒంటరిగా బయలుదేరుతున్నాను. ఇక నుంచి ఎట్టి కష్టాలు వచ్చినా పరీక్షలు వచ్చినా మీ నిర్దేశాలకు అనుగుణంగా నడచుకుంటాను. ప్రతి పనినీ 'దీనిని గాంధీజీ ఆమోదిస్తారా?" అని ప్రశ్నించుకుని మరీ చేస్తాను."

ఈ విధంగా మనసులోనే ప్రతిజ్ఞ చేసుకుని గాంధీ పటాని కింకొక సారి నమస్కరించి పెట్టెను తీసుకుని బయలుదేరింది సీత. ఏ మాత్రం చప్పుడు చేయకుండా వీధి తలుపులు తెరుచుకుని వీధిలోకి అడుగు పెట్టింది.

పటాభిరామన్ ఇంటి నుండి రైల్వేస్టేషన్‌కు అర మైలుంది. రైలు స్టేషనుకు వెళ్ళే కాలిబాట మీద సీత నడవసాగింది.

45

సీత రెండు రోజుల సాటు కలకత్తా మెయిల్‌లో ప్రయాణం చేసింది. ఆ రెండు రోజులూ రెండు యుగాలనిపించాయి. సీత ప్రయాణం చేస్తున్న ఆడవారి పెట్టెలో చాల మంది దక్షిణాది స్త్రీలు పయనిస్తున్నారు. వారిలో ఒకామెకు హౌరాలో ఇల్లుంది. ఆమెకు సీతకూ స్నేహమయింది.

మెయిల్ ఆలస్యంగా హౌరా స్టేషన్ చేరింది. ఆ రోజు పొద్దుటినుండి ప్రతి స్టేషన్‌లోనూ జనులు గుంపులు గుంపులుగా చేరి ఏదో మాట్లాడుకుంటున్నారు. ఆ రైలుబండిలోనే ప్రయాణీకులు కూడా దేనినో తీవ్రంగా చర్చిస్తున్నారు. కాని ఆ విషయం ఏమిటోనని ఆడవారి పెట్టెలో వారికి తెలియలేదు.

హౌరాకు ముందరి స్టేషన్‌లో ఒక దక్షిణాది ఆయన ఆడవారి పెట్టె దగ్గరికి వచ్చి—"మీకు పురుషుల సహాయం వుందా? ఎవరన్నా తోడువస్తారా? స్టేషన్ నుండి ఇంటికి తీసుకువెళ్ళేవారున్నారా? చాల జాగ్రత్తగా వెళ్ళాలి. కలకత్తాలో ఏవో అల్లరులు జరుగుతున్నాయిట!" అన్నారు. ఈ వార్త సీత మనసును కలవరపరచలేదు.

కాని హౌరా స్టేషన్‌లో దిగాక తన వూహ తప్పని తెలిసింది సీతకు.

అది 1946 వ సంవత్సరం, ఆగస్టు నెల 16 వ తేది. ఆ నాడు నరకంలో తిరుగాడే పిశాచాలా నాడు కలకత్తా నగరంలో నాట్యం చేశాయి; పిల్లలు, పెద్దలు, స్త్రీలు అని దయాదాక్షిణ్యాలు లేకుండా చంపి నెత్తురు తాగాయి, సర్వనాశనం చేశాయి; మధ్య మధ్య 'పాకిస్తాన్ జిందాబాద్!' అని అరిచాయి.

సీతకు రైల్లో పరిచయమయిన స్త్రీని తీసుకు వెళ్ళడానికి మనుష్యులు వచ్చారు. వాళ్ళు ఆరోజు కలకత్తాలో పరిస్థితి చాల ఘోరంగా వుందనీ, హౌరా బ్రిడ్జి దాటి వెళ్లడం అసాధ్యమనీ, అసాయమనీ చెప్పారు. సీత కూడా తమతో వచ్చి హౌరాలో వుండి, అల్లరులు తగ్గాక కలకత్తాలో తన వాళ్ల ఇంటికి వెళ్లి వచ్చునని సూచించారు. ఇది విని సీతకు చాల చికాకు కలిగింది. మనసును కుదుట పరచుకుని "వద్దండీ! నేను ఇవాళే వెళ్లితీరాలి. నాకేమీ కాదు లెండి!" అంది. "అయితే వెళ్లి చూడండి!" అన్నారు హౌరా వాళ్లు. సీత ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని హౌరా వంతెనదాక నడిచింది. అటునుండి స్టేషన్ వైపు వస్తున్న పెద్దగుంపొకటి ఆమెను తోసుకుని స్టేషన్ వైపు పరుగెత్తింది. ఇది గమనించిన హౌరా మనుష్యులూ, ఆ దక్షిణాది స్త్రీ సీతకు నచ్చజెప్పి తమతో బాటు తీసుకవెళ్లారు.

సీత పడ్డ వేదనకు అంతులేదు. ఇంకొక్క రోజు ముందుగా వచ్చి వుంటే—ఇటువంటి ప్రమాద సమయంలో తాను భర్తతో బిడ్డతో కలిసి వుండి వుండవచ్చునే అని విలవిల లాడింది. భర్త ఏమయ్యాడో, పిల్ల ఏమయిందో నని తపించింది; వెక్కి వెక్కి ఏడ్చింది. కలకత్తాలో జరుగుతున్న

ఘోరాల గురించి అందుతున్న వార్తలు ఆమె గుండెమంటను పైకెగదోశాయి. పిల్లల్ని విసిరి పారేస్తున్నారనీ, మంటలలో పడేస్తున్నారనీ వచ్చిన వార్త విని ఆమే ఎనలేని యాతన పడింది. అట్లాంటి దేదయినా తన చిన్నారికి రాదు కదా అన్న ఆలోచనతో ఆమె బుర్ర బ్రద్దలయి పోయింది. ఈ గండం గడిస్తే చాలు, ఇంకెప్పుడూ కూడా, ఎటువంటి కారణం వచ్చినా బిడ్డను వదలి వుండ కూడదని మనసులో లక్షసార్లు అనుకుంది...కాని అది బ్రతికే వుండాలి! ఆయనా పాపాయీ క్షేమంగా వుండాలి! ఈ పాపిష్టి దాని అదృష్టం ఏ విధంగా వుందో?

రాత్రిం బగళ్లూ మె నిద్ర పోలేదు. కొద్దిగా కన్ను మూసినా భయంకర మైన కలలు వచ్చి మెలకువ వచ్చేసేది. ఆమె బాధను చూచి ఆ ఇంటివారు ఆమెను ఎంతగానో ఓదార్చారు.

* * *

హౌరా స్టేషన్‌లో దిగిన తర్వాత వారం రోజు లిట్లూ నరక వేదన అనుభవించాక, సీత ఎనిమిదవ రోజున అమర్ నాథ్ ఇల్లు చేరింది. ఆడవాళ్ళూ, మగవాళ్ళూ, పిల్లలూ కలిసి వంద మందిదాక ఆ ఇంట్లో వున్నారు. ఆ దక్షిణాది వాళ్లంతా కలహాలు జరిగిన చోట్లనుండి పారిపోయి వచ్చి తలదాచుకుని వున్నారు. వాళ్లల్లో చాల మందిని ప్రమాద పరిస్థితుల నుండి తప్పించి రక్షించి ఇక్కడికి చేర్చిన వ్యక్తి తన భర్తేనని తెలిసే సీత మనసు ఉప్పొంగింది.

పొందరరాఘవ్ సేవ, అమర్ నాథ్ ఇల్లు దక్షిణ భారతీయులకు ఆశ్రయం కావడం—వీటి గురించి సీత హౌరాలోనే వినింది. అందుకని తిన్నగా అమర్ నాథ్ ఇల్లు చేరి చిత్రాను పలకరించింది. చిత్రా—'వచ్చావా తల్లీ! ఇప్పటికయినా క్షేమంగా వచ్చి చేరావే అదే పది వేలు! ఇక నువ్వాయె, నీ మొగుడాయె! మేడ మీద పడుకునివున్నారు. వెళ్లి చూచుకో!" అంది. 'ఏమయింది? ఆయన ఎందుకు పడుకున్నారు?" అని అడిగింది సీత. "అయన కేమిటా? 105 డిగ్రీలు జ్వరం, ప్రేలాపన, అన్నీను! ఈ వారం రోజులలో ఆయిన చేసిన కార్యాలకు ఆ మాత్రం రావడంలో ఆశ్చర్యం లేదు లే..."

అంది చిత్ర. "చిత్రా ! నిజంగా ఆయనకు అపాయం ఏమీ లేదు కద ? ప్రాణ భయం లేదు కద ?" అని అడిగింది సీత.

"ఆది నీ చేతుల్లో వుంది; నీ బిడ్డ చేతుల్లో వుంది. మీ శుశ్రూష మీద ఆధారపడి వుంది. అట్లాగనే డాక్టర్ చెప్పారు...కాని నీ కూతురుండే అది బంగారం లాటిది సుమా ! ఈ వారం రోజులలో అది నాకెంత సాయంగా వుందో ? ఊరంతా అల్లకల్లోం పడుతుంటే అది ఏ మాత్రం భయపడకుండా ఉత్సాహంగా మాట్లాడి అందరినీ ధైర్య పరచేది. ఇట్లాటి బిడ్డను అట్లాటి మొగుడినీ వదలి ఆ దేవపట్నంలో ఎందుకన్నావో నా కర్థం కాలేదు___ వెళ్లు ! వెళ్లి మీ ఆయనను చూచుకో ! ఈ వారం రోజుల నుండీ వాసంతే వాళ్ళ నాన్నను చూచుకుంటూంది. ఈ వంద మందికి చేయడం ఒక ఎత్తు;మీ ఆయనను చూచుకోవడం ఇంకో ఎత్తు...వెళ్ళు, వెళ్ళు మేడ మీదకు ! అని చెప్పి చిత్ర వేరే పనుల్లో లీనమయింది.

విచారం, ఆతురత ముందుకు నెడుతుండగా, సిగ్గు వెరుకు వెనక్కు లాగుతుండగా తడబడుతూ మెట్లెక్కి మేడకు చేరింది సీత.

అక్కడ సందడిగా వుంది. డాబా మీద ప్రశాంతంగా, ఏకాంతంగా వున్న గదిలో ఒక మంచం మీద పడుకుని వున్నాడు రాఘవన్. అతడి కళ్ళు మూసుకుని వున్నాయి. స్పృహలేని స్థితిలో ఏదో గొణుగుతున్నాడు. అతడి తల దగ్గర కూర్చుని వాసంతి అతడి తల మీద, నుదుటి మీద విన్ సంచిని వేడుతూంది.

గది తలుపులు తెరచుకుని సీత లోపలికి ప్రవేశించగానే వాసంతి తల వైకెత్తి చూచింది. చెప్పలేని ఆతురత, ఆశ్చర్యం, జాలి, ప్రేమ, రోషం కలిసి వున్నాయి. ఆ చూపులో. దాని నోటి నుండి ఒక్క మాటయినా రాలేదు.

సీత నాలుక కదల్చలేక పోయింది. నెమ్మది నెమ్మదిగా మంచాన్ని సమీపించింది. రాఘవన్ అరిపాదాన్ని మృదువుగా స్పృశించింది; చల్లగా తగిలింది. అరిచేతుల్ని ముట్టుకుని చూచింది. చల్లగా తగిలాయి. మెడ క్రిందుగా

లొమ్మ్మ మీద చేయి ఆనించి చూస్తే జ్వరం బాగా వున్నట్లు తెలిసింది. వాసంతి ఇంత సేపూ అమ్మనూ, నాన్ననూ చూస్తూంది. సీత దాసంతిని చూడగానే ఏమి లేమిటో చెప్పాలనుకుంది, వాటన్నిటికి ఇప్పుడు అవసరం లేకపోయింది.

"వాసంతీ! ఐస్ సంచిని నా చేతికివ్వు! నీ చేతులు నొప్పెడతాయి."

"వద్దమ్మా! నా చేతులు నొప్పెట్టడం లేదు. నీకు ఐస్ సంచి సరిగా పెట్టడం వచ్చునో రాదో—" అంది వాసంతి.

"నా తల్లీ! తెలియకపోతేనేం నువ్వున్నావు కదా చెప్పడానికి!" అని సీత ఐస్ సంచిని తీసుకుని రాఘవన్ నుదుటి మీద పెట్టసాగింది.

కాస్సేపటికి వాసంతి మొహం మీద ఒక చిరునవ్వు పూచింది; "అమ్మా! నువ్వింక నాన్నను, నన్ను ఎప్పుడూ విడిచి వెళ్ళవు కదూ?" అంది.

సీత మొహం విప్పారింది. "వెళ్లను తల్లీ వెళ్లను! మునుపయినా వెళ్తే దానికి? వేరే దారిలేక వెళ్లాల్సి వచ్చింది...మరి నువ్వూ నాన్నా నన్ను తీసుకురాకుండా వచ్చేశారేం?"

"అవన్నీ పోనియ్యవమ్మా! ఇంకెప్పుడూ మమ్మల్ని విడిచి వెళ్లకమ్మా!"

"వెళ్ళవమ్మా, వెళ్లను!"

"అమ్మా! అయిదారు రోజుల నుండి ఈ వూళ్ళో అల్లర్లు జరుగుతున్నాయి. ఎవ్వరూ బతికి బయటపడలేరని అంతా అనుకున్నారు. అప్పుడు నాకేమి అనిపించిందో తెలుసా, నువ్వు చెప్పు!"

"నువ్వే చెప్పు—"

"నేనూ చనిపోతానేమో, చనిపోవడానికి ముందు నిన్నొక్కసారి చూడాలనిపించిందమ్మా!"

"వాసంతీ! అటాంటి మాటలు మాటాడకమ్మా!...అది సరేగాని నాన్నగారి ఆరోగ్యం గురించి డాక్టర్లు ఏమన్నారు?"

"షాక్ వల్ల వచ్చిన జ్వరం అన్నారు. తీవ్రంగానే వుంది గానీ, జాగ్రత్తగా చూచుకుంటే తగ్గిపోతుందన్నారు."

"మీ నాన్నగారు చాల సేవ చేశారట అందరికీ?"

''నాన్నగారు చేసినదంతా చెబుతే మహాభారతమంతా అవుతుంది. అందరికీ ఎన్ని విధాలసేవ చేశారో, ఎందరి ప్రాణాలు కాపాడారో చెప్పలేము. ఒక్కటి చెబుతా విను. ఒక ఇంటిని గూండాలు ముట్టడించారు. తలుపులు తెరవకపోతే ఇంటికి నిప్పు పెడతామని బెదరిస్తున్నారు. అప్పుడు నాన్న పెద్ద ఆఫీసరొకాయనకు ఫోన్ చేసి ఒక ముస్లిం ఇంటిని హిందువులు చుట్టు ముట్టారని చెప్పారు. అట్లా చెబితే పోలీసులను వెంటనే పంపుతారని నాన్న అట్లా చెప్పారు. పోలీసులు వచ్చారు. వాళ్ళ సాయంతో నాన్న ఆ ఇంట్లో వాళ్ళను తప్పించి తీసుకొచ్చారు.

ఉన్నట్టుండి సౌందరరాఘవన్ ఆరవసాగాడు. ''నే నెవరనుకున్నా రేమిటి? జాగ్రత్త! దగ్గరి కొచ్చారంటే కాల్చిపారేస్తాను. కత్తికి కత్తి. తుపాకికి తుపాకి. హత్యకు హత్య. ఖబర్దార్! నేను మహాత్మా గాంధిని కాదు సుమా! అని కేకలు పెడుతూ లేచి కూర్చోబోయాడు. సీతా, వాసంతీ బలవంతాన అతడిని పడుకోబెట్టారు. రాఘవన్ సీత వైపు గుడ్లు మిటకరించి చూశాడు. కాని ఆ మె ఎవరో అతడికి తెలిసినట్లు లేదు.

ఆప్పుడు సీత తన మనసులోనే నేడుకుంది: ''భగవాన్! ఈయన జ్వరంతోనే మరణించే టట్లయితే ఒక్కసారి పూర్తిగా తెలివిరప్పించి నేను పలావా అని గుర్తించేటట్లు చేయి. నేను వచ్చానని, ఆయనకు భక్తురాలనై చేస్తున్నానని తెలుసుకోనివ్వు...ఈ వరం నాకు ప్రసాదించు!''—అని మనఃపూర్వకంగా ప్రార్థించింది.

* * * * *

సీత రాకవలన రాఘవన్ ఆరోగ్యం మెరుగయినట్లనిపించింది. అంతలో అరుపులూ పలవరింతలూగా వుండిన రాఘవన్ సీత చల్లని చేయి పడగానే శాంతించేవాడు. ఇది చూచి ''సీతా! నువ్వు మునుపు తప్పు చేస్తే చేశావేమోగాని ఇప్పుడు మంచి సమయంలో వచ్చి నీ మొగుడికి సేవ చేస్తున్నావే! నీ పాపాలన్నిటికీ ప్రాయశ్చిత్తం చేసుకున్నావు'' అంది. ఇది విని సీత కళ్ళలో నీరు నిండింది.

సీత వచ్చిన మొదటి రోజులలో రాఘవన్ కళ్ళు ఆమెను చూచినా గుర్తించేవి కావు. రెండు మూడు రోజుల తర్వాత ఆమెను చూచినప్పుడే రాఘవన్ కళ్ళల్లో ఆశ్చర్యమూ, సంతోషమూ కనబడ్డాయి. ఆతర్వాత అతడు నెమ్మది నెమ్మదిగా ఆమెతో మాట్లాడ నారంభించాడు. ఆమె కలకత్తా కెప్పుడు వచ్చింది, ఎట్లా వచ్చింది, ఎక్కడ వున్నది మున్నగు వివరాలన్నీ అడిగి తెలుసు కున్నాడు. ఈ కాలంలో ఆమెకు ఆశ్రయం ఇచ్చిన వారిని చాల మెచ్చు కున్నాడు.

వాసంతి వేసిన ప్రశ్నే ఒకనాడు రాఘవనూ వేశాడు. "సీతా! నీ ప్రయాణాలన్నీ ముగిసినట్లేనా? ఇంకెక్కడికీ వెళ్లనక్కర్లేదు కదా?"

"ఇంతకు ముందూ నాకు ఎక్కడికో వెళ్లవలసిన అవసరం లేదు; ఇక ముందూ వుండబోదు" అంది సీత.

"ఒకవేళ వెళ్లవలసి వచ్చినా వాసంతిని వదలివెళ్లకు. దానిని నీతోబాటే తీసుకపో!" అన్నాడు రాఘవన్.

"వాసంతినీ వదలి వెళ్లను; మిమ్మల్ని వదలి వెళ్లను" అంది సీత.

"నా గురించి దిగులెందుకులే?"

జవాబు చెప్పకుండా ఆవేదనలో రాఘవన్‌ను చూచింది సీత.

ఇంకొకనాడు రాఘవన్ "సీతా! నీ కీ కలకత్తా నగరం చాల నచ్చిం దని చిత్ర చెప్పింది. నిజమేనా?" అని అడిగాడు.

"ఔను. నాకు కలకత్తా చాల నచ్చింది. ఇక్కడే వుండాలని వుంది."

"మరికనేం? నువ్వూ వాసంతీ ఇక్కడే వుండవచ్చు. మీకు మంచి తోడు కూడా వుంది...కాని నాకీ వూరు నచ్చలేదు. అందులోనూ ఇక్కడ జరిగిన ఘోరమైన సంఘటనలు చూచాక అసలుండలేను. ఇక్కడ వుంటే నా బుర్ర పాడయిపోతుంది. ఆరోగ్యం కోలుకున్నాక ఇక్కడనుండి వెళ్లిపోవా అని అనుకుంటున్నాను."

"దయచేసి ఇట్లా వేరుచేసి మాట్లాడకండి ఈ వూరు మీకు నచ్చక పోతే నాకూ నచ్చనట్లే! మీకేవూరు నచ్చితే నాకూ అదే ఇష్టం. ఇంతకూ ఎక్కడికి వెళ్దామనుకుంటున్నారు?"

"పంజాబు రాష్ట్రం వెళ్దామనుకుంటున్నాను...నీకా రాష్ట్రం నచ్చ దేమో?"

"ఎందుకు నచ్చదు? మనం ఢిల్లీలో వున్నప్పుడే పంజాబు వెళ్ళి చూడా అని ఆశగా వుండేది. అమృతసర్‌లో శిఖ్కుల స్వర్ణ దేవాలయం చాల బాగుం టుందిట. లాహోర్‌లో షాలిమార్ తోట అద్భుతంగా వుంటుందిట. దేశ మంతటా వెడ్డైన మసీదు అక్కడే వుందట. అవన్నీ చూడవద్దూ?

రాఘవన్ మొహం ముడుచుకుంది. "సీతా! ఇంక దేనిని గురించి అయినా మాట్లాడు; కాని మసీదుల గురించి మాట్లాడకు. ఆ పేరు వింటేనే నా ఒళ్లు కంపించి పోతుంది" అన్నాడు. సీతకు గత స్మృతులు నెమరుకు వచ్చాయి. తాజ్‌మహల్ చూడాలి, అక్బర్ సమాధిచూడాలి అనిపోతే ఎలాటి అనర్థాలు దాపురించాయి!

"ఏమో అన్నాను కానీ, ఇకముందు నేనేదీ చూడనక్కర్లేదు.నిమ్మల్నీ వాసంతినీ చూచుకుంటూ వుండడం కన్న వాకింకేమీ అక్కర్లేదు" అంది సీత.

ఆ మాటలు రాఘవన్‌కు అపరిమితమైన ఆనందాన్ని, ఇటీవలి కాలంలో, అనుభవించని హాయిని కలిగించాయి.

46

వెయ్యేళ్ల దాస్యానంతరం భారత దేశం స్వాతంత్ర్యం పొందిన 1947 ఆగస్టు 15 వ దినం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలలో లిఖించదగిన దినం. వలవైన కోట్ల భారతీయులు శృంఖలా విముక్తులయ్యారు. వారిలో ముప్పైకోట్లు మంది స్వతంత్ర భారత పౌరులయ్యారు; పది కోట్ల మంది పాకిస్తాన్ అన్న క్రొత్త స్వాతంత్ర్య దేశపు పౌరులయ్యారు.

భారత దేశం స్వతంత్ర దేశ మయినందుకు ప్రజలు అపరిమిత ఆనందో త్సాహాలతో వైభవంగా పండుగ చేసుకున్నారు. ఢిల్లీ నగరంలో నయితే చెప్పక్కర్లేదు, ఆ రాత్రీ పగలూ ఆనందం అగ్గవమై పొంగింది.

సూర్యా, తారిణీ ఆ సాయంకాలం ఢిల్లీ నగరపు వేడుకలన్నీ చూస్తూ, దీపాలంకరణలను తిలకిస్తూ వెండి బజారు వెంబడి నడుస్తున్నారు. శతకోటి దీపాలతో ఢిల్లీ నగరం వెలుగుతున్నట్లే హర్షాతిశయంతో వారిరువురి మొహాలూ వెలుగుతున్నాయి.

ఇదే వెండి బజారున వాళ్ళిద్దరూ పోలీసులకు చిక్కకుండా వుండాలని మారువేషాలతో తిరిగిన రోజులున్నాయి; దీపాల వెలుగును తప్పించుకుని చాటు మాటుగా నడిచిన రోజులున్నాయి. కాని ఇప్పుడా భయం లేదు; ఆ అవసరం లేదు. వారిప్పుడు సర్వస్వతంత్రులైన భారతీయులు. సూర్యా ఖద్దరు టోపీ ధరించి వున్నాడు; తారిణి నారింజురంగు చీర కట్టింది. విలాసంగా నడుస్తున్నా రిద్దరూ.

"మన అనుంగు దేశం స్వాతంత్ర్యం పొందగా చూడగలిగామే ఇంత కన్న మనం కోరదగిన అదృష్టం ఏమున్నది!" అంది తారిణి.

"మన ఇద్దరి విషయంలో ఇంతకన్న కోరదగిన అదృష్టం ఒకటి వుంది; అదే మన పెళ్ళి!" అన్నాడు సూర్యా.

"ఇవాళ ఢిల్లీ నగరపు దీపాలు ఆకాశంలోని నక్షత్రాలతో పోటీ పడుతున్నాయి."

"మీ రేమనుకోకపోతే ఒక మాట! దేశం స్వాతంత్ర్యం పొందగానే పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం కదా, దానిని గురించి ఏమనుకుంటున్నారు?" అన్నాడు సూర్యా.

"ఈ వెండి బజారు వెంబడి ఎంతటి భయంతో తిరిగేవాళ్ళం! గాంధీజీ వంటి మితవాద కాంగ్రెసు పార్టీ నాయకుల వలన భారత దేశానికి స్వాతంత్ర్యం రాదనీ వీళ్ళందరినీ నాయకత్వం నుండి తొలగించి విప్లవం లేవదీయాలనీ, ఆ పని ఒక్క సోషలిస్టు పార్టీయే చేయగలదనీ మనం అనుకునేవాళ్ళం. తీరా

చేస్తే గాంధీ ద్వారా. మితవాద కాంగ్రెసు ద్వారా స్వాతంత్ర్యం వచ్చింది!'' అంది తారిణి.

'దానిని గురించి చర్చ ఎందుకు ? ఏ గిన్నెలో నయితేనేమి అన్నం పుడకడం ప్రధానం...స్వాతంత్ర్యం వచ్చేసింది. మన పెళ్లికింక ఆటంకం ఏమీ లేదు.''

''భారత దేశానికి నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందనే అంటారా ?''

''అందులో సందేహం ఏమీ లేదు !'' గాంధీజీ ఆత్మశక్తి జయించింది''

''భారత దేశం స్వాతంత్ర్య దేశం !''—''మౌంట్ బాటన్‌కూ జై !'' అని దేశమంతా ఘోషిస్తుంటే ఇంకా సందేహం ఎందుకు ?''

''స్వతంత్ర దేశమయితే రెండుగా ఎందుకు చీలింది ? ఇది మన దేశం స్వతంత్రంగా చేపిన పనేనా ?

''చీలితేనేమి, రెండూ స్వతంత్ర దేశాలుగా వుంటాయి. రాజకీయంగా చీలినవే తప్ప భౌతికంగా కాదు కదా ? ఉపఖండ మంతా ఒకటిగానే వుంది కదా ?''

''ఉందా అనే నా అనుమానం. భరతమాత చేతులు రెండింటినీ కోసి పారేసినట్లు అన్పిస్తూంది నాకు...''

''దేశం గురించి మనం పడ్డ బాధలు చాలు. ఇంక మన పెళ్లి గురించి ఆలోచిద్దా—''

''మీరు హిందువులు, నేను ముస్లిమ్‌ను. మన మధ్య పెళ్ళి ఎట్లా పొసగుతుంది ?''

''ఇదేమి వింత ! క్రొత్త ప్రశ్నను లేవదీస్తున్నారే ? మనకు మతాలే లేవు. మనది మానవమతం. దీనిని గురించి ఇదివరకే ఎన్నిసార్లు అనుకున్నాము కదా ? మీరు అప్పుడప్పుడు ముస్లిము స్త్రీ వలె బట్టలు ధరించినంత మాత్రాన ముస్లిము లయిపోరు ?''

''తల్లిదండ్రులు ముస్లిము లయివుంటే—?''

''తలిదండ్రులు ముస్లిములయితే దానిని గురించి రజనీపూర్ రాకుమార్తె కెందుకు విచారం ?''

తారిణి గలగలమని నవ్వింది.

"ముస్లిం స్త్రీ వేషం నాకెంతో తోడ్పడింది. లేకపోతే రజపీపూర్ అంతఃపురం వదలి బయిటికి రాలేకపోదును. రజనీపూర్ రాజూ ఆయన తల్లీ నన్ను అక్కడే వుంచాలని ఎంతో ప్రయత్నించారు. సగం రాజ్యం అడిగినా ఇచ్చి వుండేవాడు. కాని నేను ముస్లిమునే సరికి సహించలేక పోయారు. నేను కళ్ళిపోవడానికి సమ్మతించారు. ఇప్పుడయినా నేను నిజంగా ముస్లిం స్త్రీని కాను అని చెబుతే చాలు, రజనీపూర్ రాణినయి పోతాను."

"ఫీల్లేదు. తమరు నా హృదయ సామ్రాజ్యానికి రాణిగా వుంటే చాలు, మన పెళ్ళి కాగానే..."

"సూర్యా! మీకు బొత్తిగా సిగ్గన్నది లేకుండా పోతూంది. ఇంత తుంది మధ్య ప్రేమలూ పెళ్ళిళ్ళూ గురించి మాటలాడ్డం ఏమిటీ?..." అంది తారిణి.

తారిణీ సూర్యా ఫిల్లీ టక్‌హాల్ వెనక వున్న తోటలోని పాలరాతి బెంచీలలో ఒకదాని మీద కూర్చున్నారు. సూర్యా ఎంతో కుతూహలంతో చెప్పాడు. "తారిణీ! నిజానికి మన పెళ్ళి అన్ని వందల మంది సాక్షులుగా, జనసందోహం మధ్య నిర్ణయించడమే బాగుంటుంది...మునుపోసారి ఇట్లాగే ఏకాంతంగా కూర్చుని ఒక నిర్ణయానికి వచ్చాము. భారత దేశం స్వాతంత్ర్యం పొందగానే పెళ్ళి చేసుకుందామని అనుకున్నాము..."

తారిణి అడ్డుతగిలి—"చిన్న పొరబాటు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక పెళ్ళి గురించి ఆలోచిద్దాం అని అనుకున్నాము...కాని నా మనసింకా సంతృప్తి చెందలేదు. స్వాతంత్ర్యం రావలసినప్పటికన్న కాస్త ముందుగానే వచ్చిందేమో నన్పిస్తూంది."

"అందుకు నేను బాధ్యుణ్ణి కాను కద? మహాత్మా గాంధీ బాధ్యుడు. ఆయన చేసిన తప్పును నేను సరిదిద్దలేను...తారిణీ! మన పెళ్ళికి ఇంకా ఏవైనా ఆటంకాలున్నాయా?"

"ఇంకా ఒకటుంది. నా తల్లిదండ్రుల గురించి పూర్తి నిజం తెలుసుకోబిదే నేను పెళ్ళి చేసుకోలేను."

"తారిణీ! మీరు నిజంగా రజనీపూర్ రాజుగారి కూతురు కాదా?"

"నేను ఎట్లా చెప్పగలను? రజనీపూర్ రాణి నేను రాజుకుమార్తెనే అంటూంది. కాదని ఇంతవరకంతా అన్న రజియా బేగం ఇప్పుడు అదే నిజమని అంటూంది...అయితే నా మనసు మాత్రం ఖచ్చితంగా చెబుతూంది—నేను స్వదేశీ రాజు కూతురు కాదు—అని చెబుతూంది."

"తారిణీ! నా మనసు మీది నుండి బరువు దింపినట్లయింది. మీ ఇంగితం ఎప్పుడూ సరిగ్గానే వుంటుంది. ఈ విషయంలోనూ సరిగానే వుండివుంటుంది."

"సూర్యా! నాలో విచిత్రమైన ఊహ కలుగుతుంది. నే ననుకుని సీతను రజనీపూర్ వ్యక్తులు తీసుకువెళ్ళారు కదా? ఆ తర్వాత సీత ఏమయిందో తెలుసుకోవడానికని నేను రజనీపూర్ వెళ్ళాను. అప్పుడు అక్కడివాళ్ళు, సీతకూ నాకూ బాగా పోలిక లున్నాయనీ, అందుకనే ఆ పొరబాటు జరిగిందనీ చాలసార్లు అన్నారు. ఇది నిజమా? అయితే అందుకు కారణం ఏమిటి? మీరూహించగలరా?"

సూర్యా ఆలోచనలో పడ్డాడు. రజనీపూర్ మనుష్యులు అట్లాంటి తప్పు లెందుకు చేశారు?" బహుశ వాళ్లు చేసిన పొరబాటులో తారిణి జన్మరహస్యం ఇమిడివుందా? ఉంటే అదేమిటి? సూర్యాకు అర్థమవలేదు.

కాస్త ఆగి తారిణి "ఇప్పుడు సౌందరరాఘవనూ సీతా ఎంత సంతోషంగా వున్నారో చూస్తే మీరు ఆశ్చర్యపడతారు!" అంది.

"ఆ విషయం మీ కెట్లా తెలుసు?"

"నేను పంజాబు వెళ్లి వారిని చూచి వచ్చానుగా!"

"నిజంగానా? పంజాబు ఎప్పుడు వెళ్లారేమిటి? సీత నిజంగా సంతోషంగా వుందా?" అని ఆసక్తితో అడిగాడు సూర్యా.

"ఆహా! సీత పేరు చెప్పగానే ఎంత ఆసక్తి!" అంది తారిణి.

"నాకన్న ఆసక్తి ఎవరికి ఎక్కడో తెలుస్తూందిగా! నేనేం పంబాబు వెళ్లి వాళ్లను చూచి రాలేదుగా?"

"నిజమే! సీతంటే నాకింత అభిమానం, శ్రద్ధ ఎందుకో నాకే బోధపడడం లేదు..."

"తారిణీ! సీత మీద అభిమానమే నిన్ను పంజాబుకు తీసుకువెళ్లిందా?"

"కాను... నా చరిత పరిశోధన విషయమై నేనూ, నా స్నేహితురాలు నిర్మలా తక్షశిలకు వెళ్లాము. తిరుగు ప్రయాణంలో హోషంగాబాద్ వచ్చింది. అక్కడ దిగకుండా వుండలేక పోయాను. సీత, రాఘవన్, నాసంతి చాల హాయిగా, సంతోషంగా వున్నారు. వాసంతి బుగ్గలు కాశ్మీరు గులాబీల్లా వున్నాయి. దానిని మరవలేకుండా వున్నాను. సీత ఆరోగ్యమూ బాగుంది..."

"సౌందరరాఘవన్ ఆరోగ్యమూ బాగుంది. ఆయనను ఇవాళ చూచిన వారెవరూ ఆయన సరిగ్గా ఏడాది కింద యమలోకంలోకి తొంగిచూశాడని అనలేరు!" అన్న సూర్యామాటలు విని తారిణి ఆశ్చర్యపడింది.

"మీరాయన్ను ఇవాళ చూశారా? ఎక్కడ? ఇవాళ అంటే ఢిల్లీలోనే చూచివుండాలి. ఆయన్నొక్కరినే చూశారా? సీతను కూడా చూశారా?"

"ఆయన్ను మాత్రమే చూశాను. సీతను తీసుకురాలేదు. ఆయనకు మళ్లీ పాత వుద్యోగపు ఆశ పట్టుకుంది. స్వతంత్ర ప్రభుత్వం ఏర్పడింది కదా, తన వుద్యోగం తనకిస్తారా అని కనుక్కోవడానికి వచ్చారు, ఢిల్లీ వచ్చి వారం అయిందిట."

"ఆయ్యో! ఇదేమి వైపరీత్యం? రెండు రోజుల నుండి నాకు సీత పదే పదే గుర్తుకు వస్తూంది. అందుకు కారణం ఏమిటో ఇప్పుడర్థమైంది. సూర్యా! సౌందరరాఘవన్ ఎక్కడున్నారు? ఆయనను నేను వెంటనే చూడాలి!"

"వెంటనే చూడలేరు. ఎందుకంటే ఆయన ఇవాళ పొద్దుటి రైలు బండిలో కలకత్తా వెళ్లారు. ఆయన వుద్యోగానికి సంబంధించిన పాత కాగితాలేవో కలకత్తాలో వుండిపోయాయిట. వాటిని తీసుకురావాలని వెళ్లారు. అయినా తారిణీ! ఈ తత్తరపాటేమిటి?"

"నాకే తెలియడం లేదు సూర్యా! సీతకేదో ఆపద రానున్నదని పిస్తూంది. మనం వెంటనే బయలుదేరి వెళ్లాలి. ఆమెను రక్షించాలి."

"ఇదేమి పిచ్చి?"

పిచ్చికాదు. రావల్పిండి దురంతాలు జరిగినప్పుడు నేనక్కడ వున్నాను. ఆ భీభత్సాల గురించి తలచుకుంటే నేటికీ శరీరం కంపిస్తుంది. అట్లాంటి రావల్పిండోలు వెయ్యి జరగనున్నాయని అక్కడనుండి వచ్చినవారంటున్నారు. మన పార్టీ వాళ్లు చాల మంది పంచాబులో వుండలేక ఇక్కడికి వచ్చేశారు.''

''అట్లా వుంటే ఆ విషయం సౌందర రాఘవన్‌కు తెలిసివుండదా?' ఆయన సీతను ఒంటరిగా వదలి ఎందుకు వస్తారు?'

''నాకు పిచ్చి అంటున్నారు కదూ...పంజాబు శిఖ్కులను ఎవరూ ఏమీ చేయలేరని రాఘవన్ గట్టిగా నమ్ముతున్నారు. అందుకనే ఆయన శిఖ్కుండే చోట ఇల్లు తీసుకున్నారు. ఆయన నమ్మకమే పిచ్చి నమ్మకం... మూర్యా! మీరు నాతోబాటు వస్తారా? లేదా? రాకపోతే నే వొంటరిగానయినా వెళ్తాను.''

''తారిణీ! మీతో నరకానికయినా రావడానికి సిద్ధం—అని నే నెన్నో సార్లు చెప్పాను. అయితే ఇది అవసరమా, ఉచితమా అని మళ్లీ ఒకసారి ఆలోచించడం మంచిది. మనం సీత విషయంలో జోక్యం కల్పించుకున్నప్పట్నుంచీ అమెకు కష్టమే కలిగింది.''

'వాటన్నిటికీ పరిహారం చెల్లించుకోదగిన సమయం ఆసన్నమయిందేమో, ఎవరికి తెలుసు?'' అంటూ తారిణి లేచి తొందరగా నడవసాగింది.

మూర్యా కూడా ఆమె ననుసరించాడు.

47

అర్ధరాత్రి అవుతూంది. సీత 'టిబ్యూన్' పత్రిక చదువుతూంది. కొంతసేపు పత్రిక చదవడం, కొంతసేపు ఆలోచించడం, గడియారం వైపు

చూడడం—ఇదీ ఆమె వరస. నిద్రరాని రాత్రిళ్లు ఏ పుస్తకమో చదవడం ఆమె అలవాటు, కాస్త చదివేసరికి ఆమెకు నిద్ర వచ్చేసేది. కాని ఇవాళ ఎంత చదివినా నిద్ర రావడం లేదు. ఎన్నో కారణాల ఫలితంగా ఆమె మనసివాళ చికాకుగా వుంది.

హోషంగాబాద్ నగరంపుశివార్లలో ఆ ఇల్లు చివర విడిగా వుంది. ఇంటి చుట్టూ చిన్న తోట, ప్రహరీగోడ వున్నాయి. ఇంటి మేడమీద గదిలో ఒంటరిగా వుంది సీత. ప్రక్కన మంచం మీద వాసంతి నిద్రపోతూంది. కాని ఆమె సీతకు తోడు అని చెప్పడానికి వీలులేదు కదా...ఇంటికో శిఖ్కు కాపలా వాడున్నాడు. వాడు రోజూ రాత్రి ఎనిమిదింటికి వెళ్లి భోజనం చేసి రావడం అలవాటు. ఇవాళ వాడు భోజనానికి వెళ్లినవాడు ఎంచేతనో వెనక్కు రాలేదు. ఇవాళ పత్రికలో వచ్చిన వార్తకూ, వాడు రాకపోవడానికీ ఏమన్నా సంబంధముందా?

వాసంతి వైపు చూచింది సీత. దాని బుగ్గలు చూడడానికి ఆపిలు పండ్లల్లా వున్నాయి హాయిగా నిద్రపోతున్న పిల్ల మొహం చూడ ముచ్చటగా వుంది. పంజాబు వచ్చిన ఈ ఏడాదిలో బిడ్డ చక్కగా పెరిగింది...

...ఆహా! ఈ ప్రాంతాలలో ప్రకృతి సౌందర్యం వినని చెప్పడం! మన వైపు వసంత కాలమని మురిసిపోతాం కాని అదేమి వసంత కాలం? అక్కడ వసంత కాలంలో పుస్తకాలలోని వర్ణనలలో చదవవలసిందే... ఇక్కడ ఫిబ్రవరి రెండవ వారం పచ్చేసరికి చూడాలి వసంత శోభ! అంతట ముందు మోడుగా వున్న చెట్లు ఒక్కసారే చిగుర్చుతాయి. చిగురాకులతో, రంగు రంగుల పువ్వులతో, భూదేవి గలగల మని నవ్వుతున్నట్లు అన్పిస్తూంది. ఇంత చక్కటి ప్రాంతాన్ని వదలి ఎక్కడికి వెళ్ళడం?...

...పంజాబు వొచ్చిన తర్వాత ఈ పది మాసాలలో సీత జీవితం ఆనంద మయంగా వుంది. చింత లేదు, చీకాకు లేదు, పొల్లుమాట లేదు, పొట్లాట లేదు. హాయిగా ఆయన ప్రేమాను రాగాల వెన్నెలలో గడిచింది జీవితం. వాసంతి ముద్దు ముద్దు మాటలతో పాటలతో గడిచింది జీవితం.

ఇంతటి ఆనందం ఈ మధురమైన జీవనం ఇంకా ఎన్నాళ్లకొనసాగుతుందో, ఏమో? మళ్లీ ఆ పాడు ఢిల్లీకి వెళ్లాలేమో? ఈయనకు మళ్ళీ ఆ ప్రభుత్వోద్యోగపు మోజు ఎందుకు పుట్టిందో? అయినా ఈ మగవాళ్ళ తీరే విచిత్రం! ఇంట్లో శాంతి, సుఖమూ వుంటే వాళ్ళకు చాలదు. జన సమ్మర్దం, హడావిడి, అరుపులు, ఆర్భాటాలు వుంటేగాని వాళ్ళకు జీవితం నిండుగా వుందనిపించదు కాబోలు. లేకుంటే పంజాబుకు వచ్చిన మొదట్లో వున్న ఉత్సాహం ఈయనలో ఇప్పుడు లేదేం? ఆ నవ్వు, ఉత్సాహం, ఆల్లరి, ఆనందం ఇప్పుడు తగ్గిపోయాయేం?

పది రోజుల ముందు బాంబులా ఈ వార్తను పడేశారు ఆయన: "సీతా! ఆగస్టు 15వ తేదినాడు భారత దేశానికి స్వాతంత్ర్యం రానున్నది. మన జాతీయ ప్రభుత్వం ఏర్పడుతుంది. విప్లవకారులకు నా ఇంట్లో ఆశ్రయం ఇచ్చానన్న కదా నన్ను ఉద్యోగం నుండి తొలగించారు? కనుక ఆ పోయిన ఉద్యోగం నాకు మళ్లీ వస్తుంది. నిజంగా సీతా! ఎంత బ్యాంకు ఉద్యోగం అయినా ప్రభుత్వోద్యోగానికి సాటి కాదు. జీతం తక్కువయినా, ప్రభుత్వోద్యోగపు ఆకర్షణే వేరు!" అన్నాడు రాఘవన్.

"నిజమే! ప్రభ్వుత్వోద్యోగం వస్తే వద్దని ఎవరుంటారు?" అంది సీత.

"అయితే ప్రభుత్వోద్యోగం మనలను వెతుక్కుని రాదు. దానిని వెతుక్కుంటూ మనం వెళ్లాలి. అంచేత నేను ఢిల్లీకి వెళ్లి కొంత ప్రయత్నం చాలి. వెంటనే వెళ్తేగాని కాదు. వెనక్కు రావడానికి పది రోజులు పట్టవచ్చు..."

రాఘవన్ వెళ్ళిన రెండో రోజు భామ వచ్చింది. ఒకప్పుడయితే సీతకు ఆమె మీద కోపం వుండేది. కాని ఇప్పుడు కోపంగాని అసూయగాని లేదు. ఒకవేళ ఎప్పుడన్నా అట్లాంటి భావం తలెత్తగానే సీతకు, దేవపట్నం నుండి ఆ రాత్రి బయలుదేరే ముందుగా గాంధీజీ ఎదుట చేసిన ప్రమాణం గుర్తుకొచ్చేది; వెంటనే ఆ కోపం ఆణిగిపోయేది; శాంతించేది హృదయం. భామకు సీత హృదయపూర్వకంగా స్వాగతం చెప్పింది.

భామలో కూడా మార్పు వచ్చిందని తెలిసి సంతోషించింది సీత. రాఘవన్ ఢిల్లీ యాత్రకు ఇంకొక కారణం భామ ద్వారా సీతకు తెలిసింది. అతడూ పని చేస్తున్న బ్యాంక్ వారు పంజాబులో తమ శాఖను మూసివేయాలని ఆనుకుంటున్నారట. పంజాబు పాకిస్తాన్‌లో చేరనుండడమే అందుకు కారణమట.లాహోరులో బ్యాంకి వ్యవహారాలను ముగించడానికని భామ వాన్నగాతు వచ్చారట. ఆయనతో బాటు వచ్చిన భామ రాఘవన్ ఏమిచేయమన్నారో తెలుసుకుందామని హోషంగాబాద్‌కు వచ్చిందట.

భామ కొన్ని రోజులు సీతతో బాటుంది; పంజాబులో పరిస్థితి గురించి ఆమె సీతతో ఏంతో భయంకరమైన విషయాలు చెప్పింది. అట్టి స్థితిలో రాఘవన్ సీత నొంటరిగా వదలివెళ్లడం అంత మంచిది కాదంది భామ. తనతో వచ్చేయమంది భామ. సీత అంగీకరించలేదు. "అయితే రాఘవన్ వచ్చేదాక నేనిక్కడే వుంటాను" అంది భామ. అగస్టు 12 వ తేదివాడు "నాన్న నా గురించి దిగులు పడుతుంటారు. నేనింక ఒక్క క్షణమయినా ఇక్కడ వుండబోను" అని చెప్పి భామ వెళ్ళిపోయింది.

భామ వెళ్లిపోయాక సీతకు ఒంటరితనం అధికమయినట్లనిపించింది. ఆమె వెళ్ళి నాలుగు రోజులయింది. రాఘవన్ నుండి ఉత్తరం రాలేదు. అయనతో బాటు తానూ ఢిల్లీకి ఎందుకు వెళ్లలేదు? భామనయినా ఇక్కడ వుండమని బలవంతం చేసి వుండాల్సింది. ఈ పత్రికలలో వార్తలను చదువుతుంటే కొంత భయంగా వుంది! ఎక్కడ ఎప్పుడు ఏమి జరగనున్నదో తెలియకుండా వుంది. పంజాబు అంతటా అగ్నిపర్వతం బ్రద్దలవడానికి సిద్ధంగా వుందిట. ఇట్లాగు రాస్తున్న రాతలకు అర్థం ఏమిటో?

దీపం ఆర్పేసి పడుకుంది సీత. గడియారం పన్నెండు కొట్టింది. పన్నెండవ సారి గడియారం మోగిన వెంటనే నిశ్శబ్దం అలముకుంది. మరుక్షణం ఎక్కడో దూరంగా ఏదో శబ్దం వినబడింది. రాను రాను ఆ శబ్దం దగ్గరకు సాగింది. సముద్రపు అలల హోరులా వుంది. ఛీ ఛీ! ఇదేమి భ్రమ! ఆ పాత గొడవ మళ్ళీ వస్తున్నదా ఏమిటి? అయిదారు వెలల నుండి ఇట్లా

చెవిలో ఏవో శబ్దాలు వినపడుతున్నాయి. చెవులు పాడయ్యాయని రాఘవన్ చెప్పింది నిజమయి వుండాలి !

చెవిలో వినిపించిన అలల హోరు రాను రాను హెచ్చుతుండగా, ఆ భ్రమ నుండి బయటపడదామని పడిక మీదనుండి లేచింది. సీత. కిటికీ గుండా బయటికి చూచింది.

రాత్రి ఏ వేళప్పుడయినా హోషంగాబాద్ నగరమంతటా విద్యుద్దీపాలు వెలుగుతుంటాయి. కాని ఇవాళ ఒక్క దీపమయినా లేదే ? విద్యుత్తు ఆగిపోయిందా ?

ఎక్కడో ఒక ఈల వినిపించింది. దానికి జవాబులా మరొక ఈల వినిపించింది. మళ్ళీ ఎక్కడో మూలిగింది. ధం, ధం—అని ఢంకా చప్పుడు వినిపించింది భయంకరంగా.

సీతకు ఒళ్ళు జలదరించింది. ఛీ ! ఇదేమి భయం ? పోలీసులు ఈల లూదితే అందులో వింతేమున్నది ? మళ్ళీ మూలగకుండా ఇంకేమి చేస్తుంది? శిక్షాలయం నుండి కాబోలు ఆ ఢంకా చప్పుడు.

హఠాత్తుగా ఆమె నొక క్రొత్త భయం ఆవరించింది. రెండు కళ్ళు తన్నే తదేకంగా చూస్తున్నాయి. అవి ఎక్కడ నుండి చూస్తున్నాయో తెలియడం లేదు. గది లోపలి నుండా, బయటి నుండా అని తెలియలేదు.

తల నొక్కసారి విదిలించి బయట చెట్టు మీద నుండి చూపును ఆ ప్రక్కనున్న ఇంటి వైపు మరల్చింది..."నా మతి చలిస్తున్నట్లుంది...పిచ్చి పడుతుందేమో...ఆయన ఎప్పుడొస్తారో తెలియకుండా వుంది..." అనుకుని, కిటికీని వదలి పడక దగ్గరకు వచ్చి పడుకుంది. తలగడా ప్రక్కగా తడిమి చూస్తే టార్చిలైటూ, రివాల్వరూ తగిలాయి. రాఘవన్ ఈ పది నెలల నుండీ రోజూ టార్చిలైటూ, రివాల్వరూ ప్రక్క నుంచుకునే నిద్రపోతున్నాడు. తానూ అట్లాగే చేయాలని చెప్పాడాయన. ఆ మాట ప్రకారమే చేసింది. కానీ రివాల్వర వలన తనకేమి లాభం ? తన శత్రువు బయటలేదు కదా !

...ఈ చప్పుడేమిటి ? ఇంటి ప్రక్కన చెట్టు మీద గలగల మని

చప్పుడు వినిపిస్తూంది. ఎవరో చెట్టెక్కుతున్నారు. దొంగ. సందేహం లేదు. ఎవరది? దొంగా, హంతకుడా? లేక కాపలా మనిషయిన శిఖ్కువాడా? వాడయితే చెట్టెక్కి ఎందుకు రావాలి?

ఆ చెట్టు నెక్కిన వాడెవడయితేనేమి, మేడ వరండాలోకి దూకాడు. మూకిన శబ్దం స్పష్టంగా వినిపించింది. తర్వాత ఏమి చేయమన్నాడు?

వరండా కిటికీ ప్రక్కగా ఒక నీడ గోచరించింది. నల్లగా, భయంకరంగా ఒక ఆకారం నిల్చుంది. అది ఎవరో తెలియడం లేదు.

ఆహా! ఆడవాళ్ళు మగవాళ్ళను వదలి వుండడం ఎంత పెద్ద తప్పు! ఈ సారి బ్రతికి బయటపడితే ఇట్లాంటి పొరబాటు ఎన్నడూ చేయరాదు. ఇవాళ బయట పడడం ఎలాగ?

సీత గుండె టకటక మని అతివేగంగా కొట్టుకోసాగింది. చెవిలో ఆలల చప్పుడు తగ్గి తన హృదయ స్పందనే వినబడ సాగింది. గడియారపు టిక్‌టిక్‌లతో గుండె టక్‌టక్‌లూ కలుస్తున్నాయి. ఒళ్ళంతా చెమటలు పోసింది; వళ్ళు శిఖ పర్యంతం శరీరం వణికింది.

వణుకుతున్న చేతితో రివాల్వర్‌ను తీసుకుంది సీత.

"సీతా! సీతా! లే సీతా! నిశ్శబ్దంగా లేచిరా!" అంది ఒక గొంతు. ఆహా! ఈ గొంతెవరిది? ఆ గొంతు వినగానే ఒళ్ళుపులకరిస్తున్నదెందుచేత? రివాల్వర్‌ను క్రింద పెట్టి టార్చి తీసుకుని సీత స్విచ్చి నొక్కింది. కిటికీ బయట నిల్చున్న ఆకారం మీద టార్చి వెలుగు పడింది.

టార్చిలైటు వెలుతురులో తెలిసిన ఆకారం భయం కల్గించలేదు; ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ గడ్డమున్న ముస్లిము వ్యక్తి నిదివరకే ఒకటి రెండు సార్లు చూచి వుంది సీత.

"సీతా! టార్చి ఆర్పు! తలుపు తెరు! ఎక్కువ వ్యవధిలేదు; తొందరగా కానివ్వు!"

టార్చి ఆర్పింది సీత. చీకటిలో ఆమె హృదయాన్ని మళ్ళీ భయం ఆవరించింది. ధైర్యం తెచ్చుకుని కిటికీ ప్రక్కకు వెళ్ళింది.

"తలుపు తెరు సీతా! తలుపులు తెరువు!" అంది చీకట్లో ఆ స్వరం.

"మీరెవరు? తలుపులు ఎందుకు తెరవాలి? మగవాళ్లెవరూ లోపల లేరే—?"

"నాకా విషయం తెలుసు! అందుకనే వచ్చాను. నన్ను తెలియలేదా నీకు?"...

"...నాన్నా!"

"అవునమ్మా! నాన్ననే! సీతా! ఇంకొక అర గంటలో ఈ ప్రాణ్లో ప్రళయం తాండవం చేయనున్నది. రక్తం తాగే పిశాచాలు సైరవిహారం చేయనున్నాయి..."

"అయ్యో! అదెవరు?" అని కెవ్వుమంది సీత. ఆ ప్రక్క గోడ చాటు నుండి ఒక స్త్రీ ఆకారం కన్పించింది.

"ష్! గోల చేయకు! పనంతా పాడవుతుంది! ఈమె మీ పిన్ని. నిన్ను కాపాడడానికే ఈమె కూడా వచ్చింది."

అందుకా స్త్రీ—"కాదు. నేను ఈ కృతఘ్నురాలిని కాపాడడానికి రాలేదు. నా బంగారు మనుమరాలు వాసంతిని కాపాడడానికి వచ్చాను. ఈ మూర్ఖురాలిని తీసుకుని మీరేగండి! ఏం అమ్మాయ్! మర్యాదగా తలుపులు తెరుస్తావా? లేక కత్తితో పొడిచి చంపమంటావా?"

ఆమె ఎవరో సీతకు బోధపడింది. ఇంక తలుపులు తెరవకుండా వుండడం తెలివితక్కువ. ఏదో ప్రమాదం ముంచుకొస్తూంది, దానినుండి తన్ను కాపాడడానికి వీళ్లు వచ్చారు—అన్న విషయం ఆమెకు సుస్పష్టమయింది. వణుకుతున్న చేతులతో తలుపు గడియతీసింది. మరుక్షణం తలుపులు తోసుకుని వాళ్లిద్దరూ లోపలికి వచ్చారు.

"నాన్నా! మిమ్మల్ని ఈ వేషంలో చూడాలా?" అంది సీత. అప్పుడు రజియా బేగం మాట్లాడింది: "మరింక ఎట్లా చూడాలి? ఎప్పుడు చూడాలి? మీ నాన్నకు నీ మీదవున్న ప్రేమను ఇవాళ చూస్తావుగా! ఓసి పిల్లా! నీ గురించిన విచారంతో ఈ ముసలాయన ఎన్నో రోజుల నుండి నిద్ర.

పోవడం లేదు. ఢిల్లీ నుండి నన్ను లాక్కొచ్చి ఈ వెధవ వూళ్లో ఒక పెళ్ళి చేశాయ..."

సీత నాన్న చెప్పాడు: "అనవసరంగా కాలయాపన చేస్తున్నారు. వెళ్ళాలు వృధా అయ్యాయి. నిన్నటిదాక పరిస్థితి ఇంత విషమిస్తుందని తెలియకదా! సీతా! నిన్నటినుండి పంజాబు అంతటా ఘోరకలి మొదలయింది. మనుష్యులు చేస్తారని కలలో నయినా అనుకోని పనులు చేస్తున్నారు. ఇంకొక అర గంటలో ఈ వూరు రౌరవనరకం కాబోతున్నది. ఈ వూళ్లో ఒక్క సిక్కు బిడ్డ, హిందూ బిడ్డ కూడా లేకుండా సర్వ నాశనం జరగనున్నది. కనుక ఈ చుప్పు నుండి తప్పించుకోవాలంటే పారిపోవడం ఒక్కటే శరణ్యం. నువ్వు వెంటనే బయలుదేరాలి. బిడ్డను ఈ మెతో పంపించివేయి. తర్వాత నువ్వు నాతో..."

"నేను రాలేను నాన్నా! పాపాయిని పంపించేస్తాను. అయన ఇక్కడికి వచ్చి నా కోసం వెతికితే—?"

"పిచ్చిదానా! ఆ మూర్ఖుడు ఇట్లాంటి సమయంలో నిమ్మొంటరిగా వదలి వెళ్లాడు, చూశావా?" అంది రజియా బేగం.

"...అదిగో, అదిగో...నరకం వచ్చేస్తూంది..." అన్నాడు మూల్వి. దూరంగా హుతాత్తుగా వినిపించిం దొక భయంకరమైన అరుపు. కేకలు, అరుపులు దగ్గరవ సాగాయి. చేతులలో దవ్వీటీలతో నల్ల నల్లటి ఆకారాలు ఆటూ ఇటూ పరుగెడుతున్నాయి.

"సీతా! ఇంకొక్క నిముషం అయినా ఆలసించరాదు. బిడ్డను శీఘ్రం తీసుకెంటనే కానివ్వు—" అన్నాడు మూల్వి.

సీత తటపటాయించింది.

"సీతా! నేను నీ కన్న తండ్రిని...నీకన్న, నీ మీద ఎక్కువ ప్రేమ గలది రజియా బేగం...ఆమెతో బాటు వాసంతిని పంపించు..."

"నువ్వూ, మీ నాన్న ఇక్కడే వుండి నాశనమయిపోయినా, నేను ఎట్లాగో నీ భర్తను కలుసుకుని బిడ్డ నతడికి అప్పగిస్తాను..." అంది రజియా బేగం.

సీతకు కాళ్ళూ చేతులూ ఆడ్డంలేదు. అట్లాగే వెళ్ళి వాసంతిని లేపింది. కళ్లు మలుముకుని వాళ్లందరినీ తేరిపారి చూచింది వాసంతి.

"వాసంతీ! నాన్నకు ఒంట్లో బాగులేదు. మనం వింటనే ఢిల్లీకి వెళ్ళాలి—" అంది సీత.

"పరేనమ్మా, పోదాం, పద!" అని మంచం నుండి దిగింది వాసంతి.

"గా బంగారు తల్లివి కదే!" అని ఆవాసంతిది ముద్దాడింది రజియా బేగం.

"ఓహో! ఈ అత్తయ్యను నే పెరుగుదునమ్మా! ఈవిడ పొయిన్నాక నాడు నాకు బజారులో ఆపిల్ పండ్లు కొనిపెట్టింది" అంది వాసంతి.

"ఔను తల్లీ! నీకు గుర్తుందే!"

"మీరూ ఢిల్లీ వస్తారా?" అని ఆడిగింది వాసంతి.

"ఔను. నేనూ ఢిల్లీకి వెళ్తున్నాను" అంది రజియా బేగం.

"వాసంతీ! నువ్వు అమ్మ చెప్పిన మాట వింటావుగా, బంగారు తల్లీ! నువ్వీ అవ్వతో రైళ్ళోస్టేషన్‌కు వెళ్ళు. నేను ఇంటి తలుపులు తాళాలు వేసుకుని తాతయ్యతో బాటు వస్తాను" అంది సీత.

"నేను చెప్పిన మాట వింటాను గాని నువ్వు మాత్రం అబద్ధాలాడకమ్మా!" అంది వాసంతి.

ముగ్గురూ నిరుత్తరు లయ్యారు.

"నేను ఇందాకే నిద్ర మేలుకున్నానమ్మా! మీ మాటలన్నీ విన్నాను."

"సరే సరే! ఈ అవ్వతో బాటు వెళ్తావా వెళ్లవా?"

"వెళ్తాను...నువ్వూ వచ్చేయమ్మా! నాన్న మనల్ని ఇక్కడ వదలి వెళ్లడమే తప్పు. నువ్వు ఇక్కడే వుంటానడం ఇంకా పెద్ద తప్పు" అంది వాసంతి.

"అట్లా చెప్పవే నా బంగారు కొండా!" అని పిల్లను ముద్దు పెట్టుకుంది రజియా బేగం.

'అమ్మ రాకపోతే నేనూ రాను.''

''సరే, వేరే దారిలేదు. దేవుడి మీద భారం వేసి పస్తాను పడండి'' అంది సీత.

కేకలు, అల్లరు, ఆర్తనాదాలు బాగా దగ్గరయ్యాయి.

అప్పుడు మాల్వి వాసంతితో అన్నారు: ''నువ్వు చాల తెలివిగలదానివమ్మా! మనం అందరమూ ఒక్కసారే తప్పించుకో ప్రయత్నించడం చాలా ఆపాయకరం. నువ్వూ ఈ అవ్వా మొదట వెళ్ళండి. నేనూ అమ్మా ఇంకొక పాతిక గంటలో వస్తాము—''

''సరే!'' అంది వాసంతి.

మరు నిముషం రజియా బేగమూ, వాసంతీ, అతి త్వరగా మెట్లు దిగి మాయమయ్యారు.

''ఊన్నా! మనమూ బయలుదేరడమే కదా తరువాయి?''

''కాము సీతా! మనం వెంటనే వెళ్ళడం లేదు. కొంత సేపు ఇక్కడే వుండాలి. ఎవరూ తప్పించుకు పారిపోకుండా ఊరి చుట్టూ కాపలా వుంచారు. ఆ పనికి ఒప్పుకున్న వారిలో నే నొకడిని. నేను ఇప్పుడు నా చోటికి వెళ్ళి కాపలా కాస్తాను. కాస్సేపు తర్వాత విద్వేష పిశాచాలు కొన్ని ఈ ఇంటి మీద దాడి చేస్తాయి. వాళ్ళకు నాయకుడిగా నేను వస్తాను. అప్పుడు నేను ఎట్లా ప్రవర్తించినా నువ్వు ఆశ్చర్య పడకు. నాన్నా, ఆని పిలవబోకు. నేను నిన్ను కత్తితో పొడవడానికి మీద కొచ్చినా భయపడకు. చేతనయితే క్రింద పడి మూర్ఛపోయినట్లు నటించు.''

గొడవలు, గగ్గోలు అతి సమీపంగా వచ్చాయి. అక్కడక్కడ ఇళ్లు తగలబడి పోతున్నాయి. ఆ ఎర్రటి మంటల వెలుగులో భయంకరమైన ఆరుపులు ఆరుస్తూ కత్తులు, గొడ్డళ్ళు, కొడవళ్లు చేతబూని, ఇటూ అటూ తిరగడం కనుపించింది.

''సీతా! నేను చెప్పిందంతా గుర్తుంచుకో! దేవుడు తప్పకుండా నిన్ను కాపాడుతాడు!'' అని చెప్పి చరచర దిగి వెళ్లిపోయాడు మాల్వి.

సీత వేచివుండి. ఒక్కొక్క క్షణం ఒక యుగమైంది. చుట్టూ అరుపులు, మంటలు, అరుపులు, ఆక్రందనాలు హెచ్చాయి.

సీతకు తన చిన్నప్పుడు బొంబాయిలో ఆనందంగా గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి. తల్లిదండ్రులు తన్ను ఒడిలో వుంచుకుని ముద్దాడిన రోజులు గుర్తుకొచ్చాయి. ఆదుర్దా స్వామి అయ్యరేనా ఇప్పుడిట్లా వచ్చింది? నమ్మశక్యం కావడం లేదే!

ఆ తర్వాత సంఘటనలు అన్నీ మెరుపు వేగంతో జరిగాయి. అవన్నీ తనకు జరిగినట్లు అన్పించలేదు సీతకు. చాలా 'క్విక్ టెంపో'లో తీసిన సినిమా దృశ్యాలవలె అన్పించాయి. ఒక నిముషం ఆ ఇంటి గుమ్మం ముందు భయంకరమైన ఆరుపులు విన్పించాయి. మరు నిముషం తలుపులను గొడ్డళ్లతో పగలగొట్టడం విన్పించింది. దడదడ మని చాలా మంది లోపలికి ప్రవేశించారు గబగబ మెట్లెక్కి వచ్చారు. ఆ గుంపుకు ముందుగా మాల్వీ వచ్చాడు. ఆయన చేతిలో పదునైన కత్తి తళతళ మని మెరిసింది. ఒక్క దూకుదూకి సీత మెడ పట్టుకుని క్రిందకు తోశాడు. ఆమె మెడ మీద పాదం నొక్కి పెట్టాడు. "ఈమె నాది, ఈమె నాది" అని అరిచాడు. ఆ వెనుక వచ్చిన రాక్షసులలదరూ వెనక్కు తగ్గారు. ఒకడు నవ్వాడు. ఇంకొకడు "ముసలివాడి కిదేం బుద్ధి"—అన్నాడు. మరొకడు ముసలివాడిని నంపిపారేస్తానంటూ ముందుకొచ్చి కత్తిని పైకెత్తాడు. వాడి నాపడానికని వచ్చిన ఇంకొకడు పాదంతో సీతను తొక్కాడు. అయినా సీత నాన్న తన చొటి నుండి కదలలేదు. ఎవరో "నిప్పు! నిప్పు!" అని అరిచారు. ముసలాయన "పరుగెత్తండి! పరుగెత్తండి!" అని అరిచాడు. బయటి నుండి తెరలు తెరలుగా పొగ వ్యాపించసాగింది. వచ్చిన వారంతా పరుగెత్తారు.

* * *

ఆ నరకమంతా మండుతూంది. పొగలు సెగలు ఆకాశాన్ని అంటుతున్నాయి దెయ్యాలవలె పిశాచాలవలె ఆట్టహాసాలు చేస్తూ ఆటూ ఇటూ

పగులగొడుతున్నారు నరకపు రాక్షసులు. ముసలివాళ్లనూ పసిపిల్లలనూ తెచ్చి వాళ్లు ఆ మంటలలోకి విసిరేస్తున్నారు.

ఈ నరకంలో ఒక మంచి భూతం సీత నెత్తుకొని సందుగొందుల గుండా పోతూంది. అవి అక్కడక్కడ ఆగి అన్ని పక్కల చూచి వెళ్తూంది. కొన్ని సమయాలలో మెల్లగా నడిచింది; కొన్నిసార్లు పరుగెత్తింది; ఒకొక్కప్పుడు గోడ వంటి పెట్టుకుని నడిచింది; మరొకసారి చెట్ల మరుగున చాటుమాటుగా పరుగెత్తింది.

* * *

ఆహా! నరకాన్ని దాటినట్టుంది. ఆ పొగలు, నిప్పు సెగలు మొహం మీదకు విచడం లేదు. చల్లటి గాలి హాయిగా తగులుతూంది. ఆ ఘోరమయిన శబ్దాలు దూరమయ్యాయి. నరకం నుండి స్వర్గంలోకి అడుగిడి నట్లయింది.

సీతకు నెమ్మదిగా స్పృహ రాసాగింది. కష్టంతో కను రెప్పలు తెరిచింది. లక్షలాది నక్షత్రాలు కదలు తుండడం కన్పించింది. ఓహో! ఆకాశవీధి దాటి స్వర్గానికి చేరువలో వున్నట్లుంది. పుష్పక విమానంలో ప్రయాణం చేస్తున్నట్లున్నాము.

ఇదంతా ఉత్తి భ్రమేనని ఆమెకు కడుత్సాహంగా తెలిసింది. ఎడ్లబండి చప్పుడూ, ఆ బండి కదలికకు ఇటూ అటూ ఆడుతున్న శరీరపు నొప్పులూ ఆమెకు సాక్షాత్తూ ఈ భూమి మీదే వున్నామన్న నిజాన్ని తెలిసాయి.

"నాన్నా!"

"మేలుకున్నావా సీతా!"

"చాలసేపు నిద్రపోయానా?"

"తెల్లవారుతూంది!"

"వాసంతి...?"

"వాసంతి క్షేమంగా వుంటుంది. నువ్వేమీ కంగారు పడకు. మీ పిన్ని చాల సమర్థురాలు. ఇట్లాంటివెన్నో అనుభవించింది."

కాస్సేపు మౌనంగా వున్నాక అడిగింది సీత: "నాన్నా! మీరు ముస్లిం మతాన్ని ఎందుకు స్వీకరించారు?"

ఆయన వీటికి పలకలేదు.

"నే నడగడం తప్పయితే క్షమించండి. మీకు దేవుడి మీద నమ్మకం వుండా అని తెలుసుకోవాలని అడిగాను. దేవుడంటూ వుంటే లోకులకిన్ని కష్టాలు ఎందుకు కల్గిస్తాడు?" అంది సీత.

"ఇట్లాంటి పరిస్థితులలో దేవుడున్నాడా అన్న సందేహం ఎవరికయినా కలుగక మానదు. ఆ ప్రశ్నకు నువ్వు జ్ఞాన సంపన్నుల నుండి సమాధానం సంపాదించాలి. ప్రస్తుతానికి నేను నీ మొదటి ప్రశ్నకు జవాబు చెబుతాను. "సీతా! వాకథేగాక ఇంకొక రహస్యాన్ని చెప్పబోతున్నాను. ఎట్లా ఆరంభించడమా అని ఆలోచిస్తున్నాను" అన్నారు సీత నాన్న.

48

బాట కిటూ అటూ పొట్టిగా ఈత చెట్లున్నాయి. ఒక ప్రక్క చిన్న గుట్ట లాటిది వుంది. మౌల్వీ సాహిబ్ బండి తోలేవాడితో ఏదో చెప్పారు. వాడు బండిని బాట నుండి ప్రక్కనున్న అడవిలోకి మళ్లించాడు. ఈత చెట్ల సందుగుండా వెళ్లి, బండిని ఆగుట్ట వెనుకకు తీసుకవెళ్లి ఆపాడు.

తండ్రీ కూతురూ బండి నుండి దిగారు. మౌల్వీజీ బండి నుంచి గొంగళి తీసి క్రింద పరిచారు. "ఇక్కడ కూర్చోవమ్మా...పగలంతా మనం ఇక్కడే గడపాలి' అని చెప్పి ఆయన బండి నుండి ఒక తోలు సంచినీ, చిన్న పెట్టెనూ క్రిందకు దించారు. "సీతా! ఈ సంచిలో నీళ్లున్నాయి; ఈ పెట్టెలో బిస్కట్లున్నాయి. వీటితో మనం ఎన్ని రోజులు గడపాలో తెలియదు" అన్నారు.

"నాన్నా! కలకత్తా ఘోరాలు చూసి జుగుప్స కలిగి పంజాబుకు వచ్చినప్పు డిది స్వర్గమే అనిపించింది. ఇక్కడ ప్రజలు ఎంతో అన్యోన్యంగా వున్నారు. కాని ఈ ఏడాది కాలంలో వీరి కేమయింది?"

"ప్రజలకు పిచ్చి పట్టిందమ్మా, పిచ్చి పట్టింది. కలకత్తాకు ప్రతిగా నౌఖాలీలో దురంతాలు జరిగాయి. నౌఖాలి పగను బీహారులో సాధించారు. బీహారుకు జవాలుగా తూర్పు పంజాబులో ఘోరాలు చేస్తున్నారు, దీని ఫలితం ఎక్కడ కనుపిస్తుందో ఎట్లా వుంటుందో ఎవరూ చెప్పలేరు. ఇంతటి ఆవేశాల మధ్య, ద్వేషాగ్ని మధ్య ఆ మహాత్ము డొక్కడు ప్రేమామృతాన్ని చిలుకుతున్నాడు. నిజంగా ఆయన మహాత్ముడే! మీ అమ్మకు గాంధీజీ అంటే చాల భక్తి. ఆయన మహాత్ముడు, దైవం—అంటుండేది."

"నాన్నా! నే నొక మాటడుగుతాను గాని కోప్పడకండి! అమ్మను మీరు నిజంగా ప్రేమించిన కాలం వుందా?"

"ఇది అడిగినందుకు నాకు కోపం లేదమ్మా! ముప్పై యేళ్ళనుండి వా మనసు మోసిన బరువును వెడు దించివేయ దలచాను. ఎవరికయినా చెప్పేస్తే కాని తగ్గదు ఈ భారం. ఒక వ్యక్తి తాను చేసిన పాపాలను తన కూతురికి చెప్పడం అన్నది కష్టమైన పని...కాని ఈ బరువు పోతే మళ్లీ వీలవుతుందో కాదో?" అన్న ఉపోద్ఘాతంతో ముప్పై ఏళ్ళ క్రింద జరిగిన కథను మొదలు పెట్టారు మాల్వీ సాహిబ్.

* * *

దురైస్వామి రాజమ్మాళ్‌ని పెళ్ళి చేసుకుని బొంబాయిలో కాపురం మొదలు పెట్టాక కొంత కాలం వారి దాంపత్య జీవనం హాయిగా కొనసాగింది. ప్రతి దినమూ అతి మధురమై కాలం ఎగిరిపోయింది. రాజమ్మాళ్ గర్భవతి అయింది.

దురైసామి జూదాలలోకి పేకాటలోకి దిగడంతో వారి జీవన మాధుర్యం లోకి విషాదం ప్రవేశించింది. అసలే జీతం చాలని దురైసామి ఈ వ్యసనాలలో పోగొట్టుకున్న డబ్బును ఎట్లాగయినా సంపాదించాలనుకుని, అప్పుచేసి కూర

పందాలలో పణం ఒడ్డ సాగారు. తెలివిగా పందాలలో డబ్బు కాస్తే ఒక్క-సారి పెద్ద మొత్తం వస్తే డాంతో డబ్బు ఇబ్బందులన్నీ తొలగిపోతాయి, అంతటితో ఆ పంధాల జోలికి వెళ్ళడం మానేద్దాం—అనుకున్నారు. కాని చివరకు సర్వ్ నాశనం అయ్యే సమయానికి రాజమ్మాళ్ ప్రసవ సమయం సమీపించింది. ఆమెమ ఆస్పత్రికి తీసుకువెళ్దామంటే బండికి డబ్బుల్లేక పోయాయి. ఈ స్థితిని గురించి ఆలోచిస్తూ కుమిలిపోతున్న సమయంలోనే రమామణీ, ఆమె చెల్లెలూ రైల్వేస్టేషన్‌లో తటస్థ పడ్డారు. రమామణి కన్నీరు, ఆమె చెల్లెలి యొక్క జాలిగొలిపే గాధా విన్న దురైసామికి మనసు కరిగింది. అందుకు తోడుగా వారికి సాయం చేస్తే తన ఇక్కట్లులూ తీరుతాయన్న ప్రలోభమూ చేరింది. తన భార్యనూ, గంగాబాయినీ ఒకే ప్రసూతి గృహంలో చేర్చారు.

ప్రసూతి గృహానికి వెళ్ళి భార్యను చూచినప్పుడెల్లా దురైసామి రమామణినీ చూచేవారు. అసలే దారిద్ర్యం అనుభవిస్తున్న అతడి మీద రమామణి తన ఆకర్షణ లన్నిటినీ ప్రయోగించే సరికి అతడామె దాసుడయ్యాడు.

రాజమ్మాళూ, గంగాబాయ్ ఒకే రాత్రి ప్రసవించారు. ఆ రాత్రి దురైసామికి స్టేషన్‌లో 'డ్యూటీ' వుంది. కాబట్టి ఆస్పత్రికి వెళ్ళలేకపోయారు. రాత్రి ఒకపారి ఫోన్ చేసి కనుక్కుంటే రాజమ్మాళ్‌కు సుఖప్రసవం అయిందనీ, ఆడపిల్లను కన్నదనీ, తల్లీ పిల్లా కులాసాగా వున్నారనీ జవాబువచ్చింది. దురైసామి తమ 'డ్యూటీ' అయిపోగానే పరుగు పరుగున ఆస్పత్రికి వెళ్ళారు.

"నేను చెప్పిందే నిజమయింది" అంది రాజమ్మ. "ఏమంటున్నావో నాకు తెలియడం లేదు" అన్నారు దురైసామి. "అబ్బాయి పుడతాడని చెప్పాను కదా!" అంది రాజమ్మ. "అదెట్లా వీలవుతుంది? అమ్మాయి అబ్బాయి ఎట్లా అవుతాడు?" అన్నారు దురైసామి ఆయన హాస్యమాడుతున్నారనుకుంది రాజమ్మ; "తొట్టెలోకి చూడండి మరి!" అంది. దోమ తెర తొలగించి చూశారు దురైసామి. మగపిల్లవాడిని చూచి నిశ్చేష్టులయ్యారు... రాత్రి టెలిఫోన్ మీద చెప్పినవారు పొరబడి వుండాలనుకున్నారు.

తర్వాత రమామణిని కలుసుకుంటే, ముందు రోజు రాత్రి గంగాబాయ్

ఆడపిల్లకు కన్నదని చెప్పింది. గంగాబాయ్‌ని కూడా తానే ఆస్పత్రిలో చేర్పించాడు గనుక రాత్రి ఆమె ఆడపిల్లను కన్న విషయమే తనకు ఫోన్ మీద చెప్పివుంటా రనుకున్నారు దుర్గాసామి.

భార్యనూ బిడ్డనూ ఇంటికి తీసుకువెళ్ళారు దుర్గాసామి. కొన్ని రోజుల తర్వాత వాళ్ళిద్దరినీ దుఃఖసాగరంలో ముంచి ఆ బిడ్డ మరణించాడు.

తన బిడ్డను పోగొట్టుకున్న దుఃఖాన్ని మరచిపోవడానికి దుర్గాసామి తరచువెళ్ళి గంగాబాయ్ బిడ్డను ముద్దాడి వస్తుండేవారు. గంగాబాయ్ మరణించింది. ఒక రోజు రమామణి ఇంటికి వెళ్ళినప్పుడు, ఒక ఘోరమయిన మోసం జరిగినట్లు ఆయన తెలుసుకున్నారు. ప్రసవాలు జరిగిన రాత్రి గంగాబాయి బిడ్డ రాజమ్మ బిడ్డగాను, రాజమ్మ బిడ్డ గంగాబాయ్ బిడ్డగాను మార్చారు అన్న విషయాన్ని నర్సూ, రమామణీ మాట్లాడుకుంటున్న మాటల నుండి తెలుసుకున్నారు! నర్సు బయటికి వెళ్ళిపోతుండగా ఆమె కంటపడకుండా దాగుకుని, ఆమె వెళ్ళాక లోపలికి వెళ్ళారు. నిజం చెప్పమని రమామణిని అడగగానే ఆమె భోరుమని ఏడ్చేసింది. "నా చెల్లెలి మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాను. వాటన్నిటినీ మట్టిలో కలిపి తానూ మట్టి అయింది. ఇంక ఈ బిడ్డ మొహం చూచుకుంటూ బ్రతుకుదామనుకున్నారు. దీన్ని మీరు తీసుకు వెళ్ళిపోతే నేను ఇంక బ్రతకడం అనవసరం" అని విలపించింది. చివరకు ఆమె ఈప్సితమే నెరవేరింది.

ఆ బిడ్డలనట్లా మార్చినదెందుకు అని దుర్గాసామి అడిగి తెలుసుకున్నారు. తన చెల్లెలికి కొడుకు పుడితే, వాడు రజనీపూర్ సింహాసనానికి వారసుడవుతాడనీ, ఆ కారణం చేతనే రజనీపూర్ ఆస్థానపు దుష్టులు ఆ మగబిడ్డ కెట్లాగయినా చంపడానికి యత్నిస్తారనీ అనుకుంది రమామణి. ఆ భయం చేతనే ఆ మగబిడ్డ వేరొక చోట పెరిగితే క్షేమంగా వుంటాడనీ, తగిన సమయంలో నిజాన్ని వెలిబరచవచ్చుననీ అనుకుంది, బిడ్డలను మార్చింది. ఆ మగబిడ్డ మృణిస్తుంది, గంగాబాయీ మరణిస్తుంది అని ఆమె ఎదురుచూడలేదు. అంత కన్న మిన్నగా, తాను తీసుకొచ్చి పెంచుతున్న రాజమ్మాళ్ బిడ్డ మీద తన

కింత గాఢంగా మమకారం ఏర్పడుతుంది అని ఆమె ఎదురుచూడ లేదు.

ఈ బిడ్డను తీసుకెళ్ళి రాజమ్మతో—"ఇది నీ కూతురే" అనీ చెప్పడం ఎట్లా? అంచేత అప్పటికి ఆ బిడ్డను రమామణి వద్ద వదలిపెట్టడమే మంచిదని తోచింది దురైసామికి.

ఆ ఒక్క ఆశ్చర్యకరమైన, విపరీతమైన సంఘటన అలాటి సంఘటన లెన్నింటికో దారితీసింది.

రమామణి చెంత పెరుగుతున్న తన బిడ్డపై దురైసామి ప్రేమ నానాటికీ అధికం కాసాగింది. అందువలననే రమామణితో ఆయన సంబంధ సుస్థిరమై కొనసాగింది. ఆమె చెప్పినట్లెల్లా ఆయన నడచుకోసాగాడు. రాజమ్మాళ్‌కు ఎనలేని దుఃఖాన్ని కల్గించవలసి వచ్చింది.

* * *

"సీతా! రాజమ్మ కడుపున పుట్టి, రమామణి ఇంట పెరిగిన ఆ పిల్లే తారిణి. నువ్వు ఆమె చెల్లెలివి. మీ రిద్దరూ చిన్న పిల్లలుగా వున్నప్పుడు నే ననుభవించిన బాధ ఇంతా అంతా కాదు. అటువంటి ధర్మసంకటం ఎవ్వరూ అనుభవించి వుండరు. అయితే అంత బాధలోనూ సంతోషం కూడా వుండేది" అన్నారు దురైసామి అయ్యర్.

తన జీవితంలో అర్థం కాని విషయాలెన్నో స్పష్టంగా విశదీకరించ బడినట్లు అనిపించింది సీతకు. తారిణి అనుకుని తన్ను, రజనీపూర్ మనుషులు ఎత్తుకుపోయిన కారణం తెలిసింది. అంతకంటే ముఖ్యంగా. దేవపట్నంలో తన్ను చూడగానే సౌందరరాఘవన్ ప్రేమించిన దెందుకో తెలిసింది. తారిణికి తన పట్లవున్న అనురాగానికి కారణం అర్థమైంది. తన అంతరంగమూ తారిణ పట్ల అనురాగం నిండే కాని, ఆ వెధవ అన్యాయా గుణం తలెత్తి ఆ అనురాగాన్ని అణచివేసింది. ఎంత నీచంగా ఆలోచించింది తన మనసు! తారిణిది ఎంత విశాల హృదయం! ఎంత మేలిగుణం! దేవుడి దయవల్ల ఈ సారి ఈ గండం తప్పి బయటపడితే?...

"నాన్నా! తాండి అక్కయ్యకు ఈ విషయాలన్నీ తెలుసునా?" అని అడిగింది.

"తెలియదు! నాది చాల పిరికిమనసు సీతా! ఎన్నోసార్లు నేను చెబుదామనుకున్నాను. కాని చెప్పలేకపోయాను. రజియా బేగం కూడా చెప్పవద్దని పట్టుబట్టింది."

"ఎందుకని?"

"పిచ్చి! అంతే! నిజం తెలిసిపోతే తారిణికి తన మీద అనురాగం వుండదేమోనని భయం ఆమెకు. అంతే కాదు, రజనీపూర్ రాజ్యంలో సగభాగం తారిణి కిప్పించాలని మీ పిన్ని ఉబలాటం. చాల కొద్ది కాలంలో ఈ సంస్థానాలన్నీ ఎగిరిపోతాయి, దేశ వ్యవస్థే మారిపోతుంది అని ఆమె అర్థం చేసుకోవడం లేదు."

కాస్సేపు తర్వాత సీత అడిగింది: "నాన్నా! నాకు మీరొక వరం ప్రసాదించాలి."

"నే నేమి దేవుణ్ణా వరం ప్రసాదించడానికి?"

"తల్లిదండ్రులు దేవుళ్ళతో సమానమే కదా! నాన్నా! నాకీ ప్రయాణంలో ఏదయినా ఆపద సంభవిస్తే మీరు నా తరపున తారిణి అక్కయ్యకు ఈ మాట చెప్పాలి. నేనామెకు చేసిన ద్రోహానికి మనఃపూర్వకంగా క్షమాపణ వేడుకున్నానని ఆమెకు చెప్పండి."

"ఇటా మాట్లాడకమ్మా!"

"నే నొకవేళ దారిలో చనిపోతే మీ రెట్లాగయినా తారిణి అక్కయ్యను కలుసుకోవాలి. ఈయన మనసులో తారిణి అక్కయ్య చోటు చేసుకుని వుంది. అక్కయ్య ఈయనను తప్పక పెళ్ళి చేసుకోవాలి అని చెప్పండి. వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకుని సుఖంగా వుంటేనే నా ఆత్మ శాంతిస్తుంది.

'ఇదేమి పిచ్చివాగుడు?.. అసలు [illegible] నాది! నీతో వీమీ చెప్పి వుండకూడదు."

"నేనిప్పుడు చెప్పినట్లు అక్కయ్యతో చెబుతానని వాగ్దానం చేయండి. లేకపోతే నే నిక్కడనుండి కదలను, మీతో రాను."

"అట్లాగే చేస్తానమ్మా! అయినా అందుకవసరం వుండబోదు. దారిలోనే మీ అక్కను చూస్తాము. ఆమెకు నీవే చెబుదువుగాని..."

49

ఆ తర్వాత ఏడెనిమిది వారాలపాటు జరిగిన సంఘటనలన్నీ సీతకు తన జీవితంలో జరిగిన సంఘటనలుగా తోచలేదు. కొన్నిసార్లు పూర్వ జన్మలో జరిగిన సంఘటన లనిపించాయి. కొన్నిసార్లు కలలో జరగినట్లు అన్పించాయి. మరికొన్ని పూర్తయిపోయే ఎవరో చెప్పగా విన్న సంఘటనలవలె తోచాయ.

పగటి వేళలలో సీత, దుర్గాసామి కొండ గుహలలోను, పొదల మాటు నను, పాత మసీదులలోను దాగుకునేవారు. చీకటి పడ్డాక ముందు వెనుకలు చూచుకుంటూ భయం భయంగా ప్రయాణం చేసేవారు. దారిలో నిప్పంటుకుని మండిపోతున్న ఎన్నో గ్రామాలను దాటవలసి వచ్చింది. కాలిపోతున్న ఇళ్లనుండి లేచిన జ్వాలలు చాల దూరం వరకు వెలుగును ప్రసరించేవి.

రాత్రి వేళల బాటల వెంబడి వెళ్తున్నప్పుడు ముందుగాని వెనకగాని ఆడుగుల చప్పుడు వినపడితే వారి గుండెలు దడదడ లాడేవి. ఒక్కొక్కసారి గుంపులు గుంపులుగా జనులు పరుగెత్తుకొస్తునట్లు విన్పించేది. వెంటనే వాళ్లు అడవిలోకి దూరి తలదాచుకునేవారు. భయ విహ్వలులై పరుగెత్తుకు పోతున్న జనులను తరుముకుంటూ రాక్షసులు వచ్చేవారు. వాళ్ల అట్ట హాసాలూ, స్త్రీల పిల్లల ఆక్రందనాలూ కలిసి దిక్కులు పిక్కటిల్లేవి.

ఇదంతా విని పీత చెవులలో అలలహోరు విన్పించేది. ఆమె మనసు మరణాన్ని ఆహ్వానించేది.

* * *

నడిచి నడిచి సీత కాళ్ళు నొప్పెట్ట సాగాయి. పాదాలు వాచిపోయాయి. 'ఇంక నడవలేము మొర్రో' మన్నాయి ఆమె కాళ్ళు. "నాన్నా! నన్ను తుపాకితో కాల్చి చంపేసి మీరు ముందుకు వెళ్ళిపొండి!" అని వేడుకునేది సీత... "మరణమా! రా!" అని ఆహ్వానించేది ఆమె మనసు, ఆమె చెవుల్లో కెరటాల హోరు అధికం కాసాగింది.

* * *

ఒక చిన్న రైల్వేస్టేషన్‌ను చేరారు వాళ్లు. వెయిటింగ్ గదిలో కూర్చుని రైలుబండికోసం ఎదురు చూస్తున్నారు. ఆగదిలోకి ఎవరన్నా తొంగి చూచి నప్పుడెల్లా ఆమె గుండె జారిపోయేది. సీత కూర్చునే కునికిపాటు పడుతూంది. అలల ఘోష పెద్దగా వినబడేసరికి అదిరిపడి కళ్లు తెరిచింది. విన్నది రైలుబండి వస్తున్న చప్పుడే నని తెలుసుకుంది. ఇద్దరూ ప్లాట్‌ఫార మ్మీదకు వెళ్ళారు. విపరీతమయిన జనం. అన్ని పెట్టె తలుపులూ వేసివున్నాయి. మాల్వీ సాహిబ్ పెట్టె పెట్టెకూ వెళ్ళి బ్రతిమి లాడగా ఆఖరికి ఒక పెట్టె తలుపులు తెరిచారు. ఇద్దరూ లోపలికి ఎక్కారు. ప్రయాణీకులు తమ తమ భయంకర అనుభవాల గురించి చెప్పుకుంటున్నారు.

* * *

ఒక రైల్వే జంక్షన్‌లో రైలు ఆగింది. ఆగిన రైలు మళ్లీ కదలలేదు. ఆలస్యం అయిన కొద్దీ ప్రయాణీకుల దిగులు హెచ్చసాగింది. రైలుస్టేషన్ లోనూ బయటా అరుపులతో గోలగా వుంది.

ఉన్నట్లుండి మాల్వీ "అదిగో తారిణి!" అన్నారు. సీత సంభ్రమంతో ఆయన చూపిన వైపు చూశారు. కొంత దూరాన ఒక గుంపు మధ్యగా తారిణీ, సూర్యా పోతున్నారు. "సీతా! నువ్విక్కడే వుండు. నేను వెళ్ళి

వాళ్ళను చూచి ఇప్పుడే వస్తాను'' అని మాల్తీ బండి దిగి పరుగెత్తారు. జనులలో కలిసిపోయారు.

ఆ తర్వాత ఒక్కొక్క క్షణమూ ఒక్కొక్క యుగమై గడిచింది సీతకు. అప్పుడెన్నో యుగాల తర్వాత—వున్నట్టుండి వందలాది కిరాతకులు కత్తులతో స్టేషన్ మీద దాడిచేశారు. ప్లాట్‌ఫారం మీద నిల్చుని వున్న వారెందరినో నిలువునా చంపివేశారు. ఎక్కడ చూచినా రక్తం ఏరులై పారసాగింది. ఆ హంతకులు రైలు పెట్టెలలోకి జొరబడ్డారు. సీత వున్న పెట్టె వైపు ఐదారుగురు పరుగెత్తుకొచ్చారు. భయంతో, ఆసహ్యంతో సీత కళ్లు మూసుకుంది. ఆమె మనసుకు ''ఎట్టకేలకు నా ప్రార్థన నెరవేరింది! చావు వచ్చింది!' అనిపించింది. నలుగురైదుగురు రాక్షసులా పెట్టెలోకి ప్రవేశించారు. ఏ క్షణాన్నయినా తన రొమ్ములోకి కత్తి దిగబడుతుందని కళ్ళు మూసుకునే ఎదురు చూస్తూంది సీత...

...''సీతా! సీతా! మృదుమధురంగా ఎవరో పిలిచారు. నెమ్మదిగా ఆమెను పైకి లేవనెత్తారు. కళ్ళు తెరిచి సీత ఆ చేతులు తారిణివని తెలుసుకుంది; ''అక్కా!'' అని విలపించింది.

ఆ తర్వాత మూడు రోజులూ సీత జీవితంలో చాల సంతోషకరమైన రోజులు. ఆ మూడు రోజులూ వాళ్లు ఏనో వూరిలో ఎవరింట్లోనో మేడ మీద గదిలో, కిటికీలన్నీ మూసివేసి గడిపారు.

రైల్లో హత్య కావింపబడకుండా సీతను కాపాడిన తారిణి ఆమెను ఇక్కడికి తీసుకొచ్చి చేర్చింది. సీత తాను క్రొత్తగా తెలుసుకున్న తమ బాంధవ్యం గురించి చెప్పి—''ఇదంతా నీకిదివరకే తెలియుదా, అక్కయ్యా?'' అని అడిగింది. 'నాకు సందేహంగానే వుంది. నే నెంత అడిగినా నాకు నిజం చెప్పలేదు'' అంది తారిణి.

''ఇదేమి అన్యాయం? ఎందుకట్లా చేశారు? నువ్వు నా సోదరివని తెలియక ముందే నీ మీద నాకు మమకారం ఏర్పడింది; తెలిసివుంటేనా, ఇంకా ఎంతో దగ్గరగా, సంతోషంగా వుండేవాళ్లం మనం'' అంది సీత. తన మీద

అనూయతో సీత కల్గించిన ఇబ్బందులన్నీ తారిణికి గుర్తుకు వచ్చాయి. కానీ అవన్నీ ఆప్రస్తుతమని తోసిపారేసింది ఆమె. "అయిందేదో అయిపోయింది. దానిని గురించిన విచారం ఇప్పుడెందుకు? అందుకు బదులు ఇప్పుడు వడ్డీతో సహా కలిసి సంతోషంగా వుందాము!" అంది తారిణి.

అయినా అంతరాంతరాల్లో ఇద్దరికీ భయమూ, సందేహమూ లేకపోలేదు. పగలెల్లా ఇద్దరూ ఒకరి ఒడిలో ఒకరుగా దొర్లాని ఎన్నో ముచ్చట్లు చెప్పుకునే వారు. రాత్రిళ్లో పక్క పక్కన పడుకుని నిద్రపోయేవారు. తారిణి తన్ను విడిచి వెళ్ళిపోతుందేమోనని భయపడేది సీత.

ఆమె భయం నిజమయింది. తారిణి నుండి ఆమె విడిచిపోవలసి సమయం వచ్చింది. ససేమిరా పోరాదని పట్టుబట్టింది సీత.

తారిణి ఎన్నో విధాల ఆమెకు నచ్చచెప్పింది. "నేను ఢిల్లీలో నిన్ను కలుసుకుంటానుగా. పెషావర్ వెళ్ళి నిరుపమను చూచి, ఆమెను తీసుకుని రావాలి" అంది.

అక్క చెల్లెళ్ళిద్దరూ చాలసేపు వాదించుకున్నారు.

చివరకు సీత—"అక్కయ్యా! నువ్వు నాకో మాటివ్వాలి. ఇస్తేనే నేను నిన్ను వదలి వెళ్ళగలను" అంది.

"ఏమిటిది, చెప్పు!"

"దారిలో నేను గనుక చనిపోతే నువ్వు ఆయన్ను పెళ్ళాడాలి. ఆ వాగ్దానం చేయి!"

"ఇదేమి వెర్రితనం?" అంది తారిణి. ఆమె ఎంత చెప్పినా సీత వినలేదు. చివరకు తారిణి ఆమెను శాంతింప చేయడానికని—'సరేలే! నువ్వు చనిపోయి, నేను బ్రతికివుండి, మీ ఆయన ఒప్పుకుంటే ఆయనను పెళ్ళి చేసుకుంటాలే—" అంది.

* * *

సీత, ముస్లిం స్త్రీవలె తల నుండి కాలిదాక కప్పివేసే బురఖాను ధరించేటట్లు చేసింది తారిణి. సీత, మౌల్వీ సాహిబ్ మెట్లు దిగి క్రిందకు వచ్చారు

గుమ్మంలో ఒక జీప్ కాచుకుని వుంది. దానిలో బాటు పోలీసు డ్రైవరొక టున్నాడు.

పీత తారిణిని కౌగలించుకుని—"అక్కా! నా కిచ్చిన మాట మరకపు!" అంది...

...పోలీసు కాన్వాయ్ నడుపుతున్న ఆ జీప్ అతివేగంగా వెళ్తూంది. దారిలోని ఆటంకా లన్నిటిని గడిచి వెళ్తూంది. జనసమూహాలను, దారికడ్డంగా పడిపున్న చెటనూ తప్పించుకుని ముందుకు సాగింది.

జీప్ వేగంగా వెళ్తుంటే, మొదట సీతకు తాను అపాయాలన్నీ దాటి నట్లు అనిపించింది. కాని చాల త్వరలోనే ఆ నమ్మకం వమ్మయింది. వారి బండిని తరుముకుంటూ ఇంకొక జీప్ వస్తున్నట్లు కన్పించింది...తాను అను కున్నట్లు ఈ ప్రయాణంతో తన మరణం ఖాయమే నేమో! "మరణమా, రా! రా!" అని జపిస్తూంది ఆమె మనసు. ఆమె చెవిలో అలల ఘోష అధిక మయింది

జీప్ ఒక నది ఒడ్డున ఆగింది.

ఇదేమి ఆశ్చర్యం! ఇక్కడ సూర్యా వున్నాడే! మనకన్న ముందుగా వచ్చివున్నాడే! పై పెచ్చు ఒక పడవనూ కుదుర్చుకుని సిద్ధంగా వున్నాడే! బావా, నిజంగా నీ సాటి ఎవరూ లేరు!

తండ్రి కూతుళ్లను సూర్యాకు అప్పగించి పోలీసు జీప్‌ను వెనక్కు మళ్ళించాడు. వాడూ సూర్యా సౌంజ్ఞలతో మాట్లాడుకున్నారో. ఆదేవిటో తెలుసుకుంవామనుకుంది సీత; కాని ఇది సమయం కాదు.

సూర్యా వాళ్ళకు సేయూత నిచ్చి పడవ నెక్కించాడు. పడవ కదలడంతో సీత భయం పూర్తిగా పోయింది. ఆమె ఉత్సాహంగా వుంది. అది పంజాబ్ యొక్క అయిదు నదులలో ఒకటయిన చీనాబ్; వడిగా పారుతూంది. సీత తన బురఖాను తీసి ప్రక్కకుంచింది. "నాన్నా! మీరు ఈ వేషం తీసివేసి పాత రోజులవలె కనబడితే ఎంత బాగుంటుందో!" అంది.

"సీతా! ఈవేషమే నిన్ను కాపాడిందని మరిచిపోకు" అన్నాను

మాల్వీ. "కాపాడడం అయిపోయింది కదా! ప్రమాదాలన్నిటిని దాటాము కదా!" అంది సీత.

వాళ్ళ పడవ కొంత దూరం వెళ్ళింది. ఈ లోగా వాళ్లు వచ్చిన బాట మీద దుమ్ము రేగింది. దుమ్ము రేపుతూ వచ్చి నది తీరాన ఒక జీపు ఆగింది. దానినుండి ఒకడు క్రిందకు దూకాడు. వాడిని సీత చూచింది. వాడి చేతిలో తుపాకీ వుంది. నదిలో వెళ్తున్న పడవను గురి చూశాడు వాడు. మరుక్షణం తుపాకిని కాల్చాడు. ఇదంతా చూచి దిగ్భ్రమ చెందుతున్న సీత చెవికి "అయ్యో! చచ్చాను—." అన్న అరుపు వినపడింది. తిరిగి చూచింది. తన తండ్రి చెంప నుండి రక్తం కారుతుండడం, ఆయన పడవకు ఒక ప్రక్కగా వాలిపోతుండడం చూచింది. ఆయన జారి నీటిలో పడిపోకుండా పట్టుకుందామని సీత ఎగిరి దూకి, పరుగెత్తింది. పడవ ఊగిసలాడింది, ఒరిగింది; సీత నదీ ప్రవాహంలోకి పడిపోయింది.

* * *

50

చలి ఎట్లా వుంటుందో తెలుసుకోవాలంటే ఢిల్లీలో చలికాలంలో నివసించాలి. ఎన్ని ఊన్ని దుస్తులు వేసుకున్నా, ఎన్ని రజాయిలు కప్పుకున్నా ఎముకలను గడగడ లాడించి వేస్తుంది. 1948 జనవరిలో, దేశాన్ని ఊరిని ఇంటిని వదలి ప్రాణాలు చేతపట్టుకుని పారిపోయి వచ్చిన లక్షలాది కాందిశీకులు ఆ ఢిల్లీ చలిలో నానాయాతనా పడుతున్నారు. వాళ్ళ శరీరాలు చలికి వణికాయి; అయితే వారి మనసులు ఉడుకుతున్నాయి.

సాయంకాలం ఏడయింది. మంచును చీల్చుకుంటూ జంతర్ మంతర్

రోడ్డు మీద మోటారు కారొకటి వెళ్తూంది. రోడ్ మీద బండ్లుగాని మనుష్యులు గాని లేనందున కారు వేగంగా వెళ్తూంది.

ఉన్నట్టుండి ఎక్కడ నుండో వచ్చాడొక వ్యక్తి. ఆ కారు కడ్డంగా పడ్డాడు!

తాకున్న బ్రేకులు పడ్డాయి. బర్ర్ర్ మంటూ కారాగింది.

ఆ పడ్డ వాడెవడు? పంజాబు నుండి వచ్చిన శరణార్థి కాబోలు!

ఆగిన కారు నుండి ఇద్దరు దిగారు. వాళ్ళు సౌందరరాఘవనూ, భామా. ఆ పడ్డవాడికి గాయాలు తగిలాయేమో చూద్దామని ముందుకు వెళ్ళారు. సరిగ్గా ఆ పాటికి ఆ పడ్డ మనిషి కాస్తా లేచినిల్చున్నాడు.

"అరె! ఇదేమి వింత సూర్యానా! నువ్వెక్కడి నుండి ఊడిపడ్డావోయ్? ఎవరో పంజాబు కాందిశీకుడు ఆత్మహత్య చేసుకుందామని పడ్డాడు కాబోలు ననుకున్నాను—! ఎక్కడికి వెళ్తున్నావు...నాతో బాటు రాగలవా? నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి!" అన్నాడు రాఘవన్.

"నాకూ తొందర పనుంది. అయినా ఒక అర ఘంట వ్యవధి వుంది. పోదాం పదండి" అని కారెక్కాడు సూర్యా. అతడు కూడా రాఘవన్‌కు ఎన్నో చెప్పాలనీ, రాఘవన్‌ను ఎన్నో అడగాలనీ అనుకున్నాడు...

...సౌందరరాఘవన్ పాత ఇంటి ముందు కారాగింది. భామ కారు నుండి దిగకుండా పెలవు తీసుకుంది. మిగతా ఇద్దరూ దిగారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే సూర్యా మనసులో పాత సంఘటనలన్నీ మెదిలాయి. ఉద్విగ్నుడయ్యాడు సూర్యా.

"సూర్యా! ఈ ఇల్లు ఎంత శూన్యంగా వుందో చూడు!" అని రాఘవన్ అనడంతో కళ్ళ నీళ్ళ పర్యంతం అయ్యాడు సూర్యా.

"మీకు మళ్ళీ ఆ ఉద్యోగం వచ్చిందా?" అని అడిగాడు సూర్యా.

"ఔను. వచ్చింది. లేకపోతే ఈ ఇల్లు నాదెట్లా అవుతుంది? మరి సూర్యా! నువ్వు ఇక్కడే వుంటున్నావా? చేమి చేస్తున్నావు?"

"ఏముంది చేయడానికి? కాంతిశిఖర శిబిరాలలో తిరుగుతూ వాళ్లకు చేతనయినంత సాయం చేస్తున్నాను."

వెంటనే రాఘవన్ చాల ఆతురతతో__"అయితే సూర్యా! ఆ శిబిరాలలో దేనిలోనయినా మనకు తెలిసిన వారి నెవరినయినా చూశావా?" అని అడిగాడు.

"మనకు తెలిసిన వారిని అంటే ఎవరిని?"

"తారిణిగాని, వాసంతినిగానీ?..."

"లేదు మిస్టర్ రాఘవన్! వాళ్ల గురించి మిమ్మల్నే అడుగుదామను కున్నాను."

"రెండు నెలల క్రింద ఒక విచిత్రమైన వుత్తరం వచ్చింది. అది తారిణి రాసింది. తానూ వాసంతీ క్షేమంగా వున్నామనీ, సాధ్యమైనంత త్వరగా వస్తామనీ రాసింది. తమాషా ఏమిటంటే ఉత్తరం సీత పేరిట రాసింది...అంటే సీత ఏమయిందో తారిణికి తెలియలేదనిపించింది."

"సీత ఏమయింది?" అని అడిగాడు సూర్యా.

"అదొక పెద్ద విషాద గాథ సూర్యా! నా వంటి దురదృష్టవంతులే లోకంలో వుండరు. అందులోనూ నేను ఆఖరికి సీతను పోగొట్టుకున్న వైనం చాల ఘోరమైనది. ఆహా! ఆ పంజాబులో ఏడాది కాలమూ చాల ఘోరమైనది. ఆహా! ఆ పంజాబులో ఏడాది కాలమూ ఎంత ఆనందంగా గడిపాము...దేవుడే అవి సహించలేక పోయాడు!...ఆగస్టు 14 న నిన్నిక్కడ ఢిల్లీలో కలుసుకున్న ప్పుడు "కలకత్తా వెళ్తున్నాను" అని చెప్పాను కదా...ఆతర్వాత ఏమయిందో చెబుతా విను!" అని చెప్పాడు రాఘవన్.

కలకత్తాలో సౌందరరాఘవన్ చేరిన రోజు స్వాతంత్ర్య దినం; ఆ రోజు అక్కడ ఆనంద కోలాహలం మిన్ను ముట్టుతుండడం చూశాడు రాఘవన్. హిందువులు ముస్లిములు పరస్పరం కౌగలించుకుంటూ, 'జై హింద్!' - 'వందే మాతరం!' - 'హిందూ ముస్లిం ఏక్‌హో!' అంటూ పులకరించుకోవడం చూశాడు. సంవత్సరం క్రింద ఒకరి నొకరు

కత్తులతో సరుక్కున వాళ్ళే ఇప్పుడు సౌభ్రాతృత్వ పరీమళాలను వెద జల్లడం చూచి ఆశ్చర్య పడ్డాడు. దేశానికిది శుభ సూచకమే ననుకున్నాడు. గత సంవత్సరం అమర్‌నాథ్ ఇంట్లో వుండిపోయిన తన ఉద్యోగం తాలూకు దస్తావేజులను తీసుకుని బయలుదేరాడు. ఢిల్లీ చేరేసరికీ పంజాబు అంతటా ఘరి స్థితి అతిఘోరంగా వుందని తెలిసింది. భామ అతడిని కలుసుకుని పంజాబు దురంతాల గురించి వివరంగా చెప్పింది. ఎట్లాగయినా పంజాబులోకి వెళ్ళాలి. పులి వున్న గుహలోకి వెళ్ళినట్లు వెళ్ళాలి, వెళ్ళి సీతనూ, వాసంతినీ తీసుకు రావాలి.

భామ ధైర్యమూ, సామర్థ్యమూ, వలుగురిలో కలిసిపోగల, గుణమూ ఇప్పుడు రాఘవన్‌కు ఎంతో తోడ్పడ్డాయి. ఆమె మీద అతడికి వున్న అయిష్టం పోయింది. అడడి అంటే ఇట్లా వుండాలి అన్నించింది రాఘవన్‌కు.

ఇద్దరూ విమానం మీద లాహోర్ చేరారు.

లాహోర్‌లో ఒక భాగం మండుతూంది. వీధులలో కత్తిపోట్లు దౌర్జన్యాలు, శవాలు ఇట్లా వుంది పరిస్థితి. పంజాబులో ఇంకా లోపలి ప్రాంతాలలో పరిస్థితి ఇంతకన్న ఘోరంగా వుందని చెప్పారు. కాని ఆదృష్ట వశాత్తు రాఘవన్, వేష భాషలను చూస్తే వాళ్ళు పార్సీలో లేక ఆంగ్లో ఇండియనులో అవిపించారు. కనుక తాము అంతర్భాగాలలోకి వెళ్ళినా ప్రమాదం లేదని పించింది.

ఆంగ్లేయోద్యోగుల సాయంతో రాఘవన్ ఒక జీప్ సంపాదించాడు. ప్రయాణం మొదలు పెట్టారు. దారి పొడుగునా వాళ్లు చూచిన దురంతాలు, సీత వాసంతిల క్షేమం గురించి వాళ్ళ మనసుల్లో భయాందోళనలు కల్గించాయి. ఎట్లాగో హోషంగాబాద్ చేరారు.

వాళ్ళు చేరేసరికి ఆ పూరిలో చావు తప్పి బయటపడ్డ వారినందరినీ ఒక చోట చేర్చారు. రక్షణ నిమిత్తం శిఖ్కు సోల్జర్లు రాగానే వారందరీ ప్రయాణానికి సిద్ధంగా వుండమన్నారు. అధికారుల అనుమతితో ఆ గుంపులోకి వెళ్ళి రాఘవనూ భామా వెతికి చూశారు. సీతగాని వాసంతిగాని లేరు.

తర్వాత తెగించి, పూళ్ళోకి వెళ్లారు. సౌందరరాఘవన్ కాపురం వుండిన ఇంటివైపు వెళ్లారు. ఇల్లున్న చోట బూడిద, ఇటుకల గుట్టలు, కాలి కూలిన గోడలు వున్నాయి! ఎన్నడూ లేనిది, ఆనాడు రాఘవన్ భోరుమని ఏడ్చాడు.

ఈ లోగా అక్కడొక గుంపు చేరింది. పోలీసు అధికారి వచ్చి భామా రాఘవన్‌లను అక్కడినుండి వెళ్ళమన్నాడు. వెళ్ళబోతుండగా ఒక అబ్బాయి వారి వైపు వచ్చి—"సాబ్! మీకో విషయం చెప్పాలి" అన్నాడు "ఏమి టేమిటి?" అని అడిగాడు రాఘవన్. ఆ ఇంటి అమ్మగారు చనిపోలేదని, ఆమె వొక ముస్లిం వృద్ధుడు వచ్చి తీసుకువెళ్లాడని, వాళ్ళిద్దరూ తన బండిలోనే ప్రయాణం చేశారని చెప్పాడు. బిడ్డ గురించి తనకేమీ తెలియదని వాడు చెప్పాడు. వాళ్లు రాత్రంతా ప్రయాణం చేసి తెల్లవారు ఝామున ఒక గుట్ట చాటున దిగారని, ఆ చోటును తాను చూపించగలనని ఆ బండివాడు చెప్ప గానే వాడిని జీపులో ఎక్కించుకుని బయలుదేరాడు రాఘవన్. వాడు చెప్పిన చోట దిగి చూడగా బండి చక్రాల గర్తలింకా వున్నాయి. అంతే కాదు, సీత ఎప్పుడూ ధరించే మట్టి గాజొకటి అక్కడ పడి వుంది.

అది చూడగానే రాఘవన్ దుఃఖం ద్విగుణీకృతమైంది. ఆ దుఃఖం కోపంగా మారింది. ఎనరో ముస్లిము వృద్ధుడు ఆమెను తీసుకుపోయాడని తల చాడు. ఇంతకు ప్రతిగా ఎవరినయినా ఏదో చేసేయాలని ఉద్రేకం కల్గిం చడతడికి.

బండివాడిని వదలివేసి జీప్ ముందుకు సాగిపోయింది.

దారిలో ఒక వూరిలో వాళ్ళిద్దరూ రాత్రి వేళ ఆగారు. వాళ్లు ఆగినది ఒక ప్రసిద్ధ హిందూ వకీలుగారిల్లు. ఆయన రాఘవన్‌కు తెలిసినవాడు. ఆ వూరిలో హిందువులు అధికులుగనుక క్షేమంగా వున్నారు. కాని ఏనిముషాన ఏ ఆపద ముంచుకొస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఆ రాత్రి ఒక వార్త వచ్చింది. ఒక హిందూ యువతికి బురఖా తగిలించి ఒక ముస్లిం ముదుసలి జీపులో తీసుకువెళ్లాడన్నదే ఆ వార్త. ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఏమి

జరుగుతున్నదో తెలుసుకోవడానికని ఆ వూరి వారు నియోగించిన గూఢచారులలో ఒకడు తెచ్చిన వార్త ఇది. ఈ వార్త వినగానే రాఘవన్‌కు అయ్యవతి సీతేమోనని అనుమానం కలిగింది. లేకపోయినా ఆమె ఎవరో ఒక హిందూ స్త్రీ అయివుండాలి. ఒక హిందూ స్త్రీ ఆపాయంలో వుండగా రక్షించలేక పోతే ఇక తాను బ్రతికి ఏమి లాభం—అనిపించింది రాఘవన్‌కు.

వెంటనే ఆ జీపు ఏదారిని పోతున్నదో కనుక్కుని, అదే దారి వెంబడి తన జీపును నడిపాడు. దారిలో ఎన్నో అడ్డంకులు వచ్చాయి. అయినా లెక్కచేయకుండా ఆ మొదటి జీపును తరుముకుంటూ వెళ్ళి చీనాబ్ నదీతీరం చేరాడు. అక్కడ నది మధ్యగా ఒక పడవ వెళ్తూంది. ఆ పడవలో ఒక ముస్లిం వృద్ధుడూ, హిందూ స్త్రీ వుండడం చూచాడు. ఇంక ఆలోచించడం దేనికి? తుపాకిని గురి పెట్టి ఆ వృద్ధుడిని కాల్చేశాడు. ముసలివాడు ఒరిగి నీటిలో పడ్డాడు. ఆ తర్వాత అన్నీ అతడు ఎదురుచూడని విధంగా జరిగాయి. పడవలోని స్త్రీ, ఇంకొక పురుషుడూ నీటిలోకి దూకినట్లు కనపడింది. పడవలో సరంగు మాత్రమే వున్నట్లున్నాడు. రాఘవన్‌ను అప్పుడు వెర్రి ఆవేశం ఆవహించింది. ఆ పడవ నడిపే వాడిని గురిపెట్టి తుపాకి పేల్చాడు. తుపాకీ డెబ్బకు పడవ చిల్లిపడ్డట్లుంది. కాసేపటికి పడవ నదిలో మునిగింది.

అంతటితో రాఘవన్ ఆవేశం చల్లారింది. తాను చేసిందంతా న్యాయమేనా అనిపించింది. ఒక వేళ పడవలో వున్నది సీత అయివుంటే?...అయితే నేమి, ఒక ముస్లిం ఇంటికి తీసుకు వెళ్లబడి బలాత్కారానికి గురి కావడంకన్న నదిలో మునిగి చావడమే మేలు కదా?

ఆ తర్వాత రాఘవనూ భామా, ఎన్నో అపాయాలను గడచి ఢిల్లీ వచ్చి చేరారు. వచ్చాక పానిపట్టు, కర్నాల్, కురుక్షేత్రం మొదలయిన చోట్ల వున్న కాందిశీకుల శిబిరాలకు వెళ్లి రాఘవన్ చూచి వచ్చాడు. ఎక్కడా భార్యా బిడ్డల జాడయినా లేదు.

* * *

"నూర్యా! ఇప్పుడు నువ్వు ఎక్కడ వుంటున్నావు?" అని సౌందర రాఘవన్ అడిగాడు.

"ఒక చోటంటూ ఏదీ లేదు. స్థిర నివాసం ఏర్పడ్డాక మీకు తెలుపుతాను. మీకు భ్రామకు పెళ్ళి జరిగితే నా కాహ్వానం పంపడం మరవకండి!" అన్నాడు సూర్యా. అతడి మాటలలో అసహ్యమూ, పరిహాసమూ కలిసిన కాఠిన్యం కనుపించింది.

"నీ కెట్లా తెలుసు? మేమింకా ఎవరికీ చెప్పలేదే?"

"చెప్పడం ఎందుకు? ఊహించవచ్చు కదా? సాపం మీరయినా శూన్యంగా వుండే ఇంత పెద్ద కొంపలో ఎంత కాలం ఒంటరిగా వుంటారు?" అని కాస్త ఆగి అన్నాడు సూర్యా—"ఇంతకూ, పెళ్ళెప్పుడు?"

"అదే కాస్త జంకుగా వుంది సూర్యా! నేడు నా జీవితాన్ని ఇట్లాగే గడిపలే నన్నది నిజం. కాని సీత గురించి నిర్ధారణగా ఏదీ తేలలేదు కదా... పై పెచ్చు, తారిణి వుత్తరం నా మనసును బాగా చీకాకు పరిచింది."

"తారిణి వుత్తరం ఈ విషయంలో చీకాకు పరచడం ఎందుకు?"

"సీతో చెబుతే ఫరవాలేదు...సూర్యా! సీతను పోగొట్టుకున్న దుఃఖాన్ని తారిణి ఒక్కతే ఉపశమింప చేయగలదు. బహుశ నీకు అభ్యంతరం వుంటే వుండవచ్చు కాని ఇందులోకి నువ్వు తల దూర్చకపోవడం మంచిది" అన్నాడు రాఘవన్.

"క్షమించండి రాఘవన్! ఒకసారి ఇంకొకరి వ్యవహారంలో తల దూర్చినందుకు ఫలితం ఇంకా అనుభవిస్తున్నాను, చాలు.....మీ కింకో విషయాన్ని కూడా చెప్పాలనుకుంటున్నాను. సీత చనిపోయి, ఆమె ఆత్మ ఈ లోకానికి వస్తే, మీరూ తారిణీ పెళ్ళి చేసుకుని వుండడం చూచి సంతోషిస్తుంది; మిమ్మల్ని ఆశీర్వదిస్తుంది."

ఉన్నట్లుండి రాఘవన్‌కు కోపం వచ్చింది. సూర్యా తన్ను ఎగతాళి చేస్తున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. "ఒరేయ్! నీ అహంభావమూ, చెడ్డ స్వభావమూ ఇంకా మారలేదన్న మాట. వెళ్ళిక్కణ్ణుంచి! వెళ్ళిపో! గెటవుట్!" అని అరిచాడు.

''అదే చూస్తున్నా, మీ రింకా గెటవుట్ అనలేదేమో అని చూస్తున్నా...'' అని సూర్యా లేచాడు.

'లేదు సూర్యా, లేదు. కాసేపు కూర్చో. నువ్వు నీజంగా అట్లా అనుకుంటున్నావా?...అదే, నేను తారణిని పెళ్లాడ్డం సీతకు...'' అని ఆగిపోయాడు రాఘవన్.

'అందు గురించి ఏ సందేహమూ అక్కర్లేదు. అది తప్పకుండా సీత ఆత్మకు శాంతి నిస్తుంది. అందుకో ముఖ్య కారణమూ వుంది!''

''ఏమిటది?''

''తారిణీ, సీత అక్క చెల్లెళ్లన్నదే ఆ కారణం; వాళ్లిద్దరూ ఒకే అమ్మ కడుపున పుట్టారు; ఒకే తండ్రి బిడ్డలు'' అని సూర్యా బయలుదేరాడు.

''వెళ్లిపోకు సూర్యా! ఇట్లా నా మీద ఒక అణుబాంబును పడేసి వెళ్లిపోతానంటావేం? నువ్వు చెప్పింది నిజమేనా? తారిణీ సీతా అక్కచెల్లెళ్లేనా? అందుకు రుజువేమిటి?'' అని సంభ్రమాశ్చర్యాలతో అడిగాడు రాఘవన్.

''వాళ్ల కన్న తండ్రే చెప్పారు. ఆయన స్వయంగా చెప్పగా విని తెలుసుకున్నాను'' అన్నాడు సూర్యా.

ఆ తర్వాత, దురైసామి జీవితపు తొలి దినాల గురించి, ఆస్పత్రిలో జరిగిన బిడ్డల మార్పిడి గురించి సూర్యా వివరించాడు. నమ్మశక్యం కాని విషయాలనిపించినా ఇదంతా నిజమేనని తోచింది రాఘవన్‌కు. ''సూర్యా! ఆయన ఏడీ? ఆ బ్రాహ్మ డెక్కడ? దురైసామి అయ్యర్ ఎక్కడున్నారు? మా పెళ్లి తర్వాత ఆయన ఏమయ్యారు?'' అని అడిగాడు రాఘవన్.

''రాఘవన్! ఆ మాట అడక్కండి! వింటే మీరు బాధపడగలరు!''

''నాకు బాధేమిటి? ఏమిటి నీ మాటలు?''

''మీరు వైదిక శ్రేష్ఠులు; మీ మామగారు మాల్వి సాహిబ్ అని తెలిస్తే, మీ నాన్న పవిత్రలోచన శాస్త్రిగారి గుండె ఆగిపోవచ్చు!''

''నా మామగారు నీకు మేనమామే కద! అయినా ఆయన ముస్లిం

మతం ఎందుకు స్వీకరించారు? హిందువుగాకన్న ముస్లిమ్‌గా మోక్షం త్వరగా లభిస్తుందనా?''

''ఆయన మోక్షకాంక్షల గురించి నా కంతగా తెలియదు, కానిలోకుల కంట్లో కారం గొట్టడానికే ఆయన అట్లా వేషం వేసుకు తిరిగారని నా అనుమానం. అయితే ఆ వేషం ఆయినకు హఠాత్తుగా మోహాన్ని ప్రసాదించిన మాట మాత్రం నిజం!''

''అయ్యో, అదేమిటి?''

''...ఆ చీనాబ్ పడవలో మేము ముగ్గురమూ వున్నాము! ఒడ్డు నుండి పడవలోని వారి మీదకు తుపాకి ప్రయోగించినదే ఎవరోనని ఊహించాను. కాని ఆ ఊహ నిజమేనని ఇవాళే తెలిసింది.''

''ఏమంటున్నావు సూర్యా, నువ్వు చెపుతున్నదేమిటి? నా బుర్ర తిరిగిపోతూంది! మేము ముగ్గురం అంటే ఎవరెవరు? ఏమిటిదంతా?''

''నేను, సీత, సీత నాన్న వున్నాము పడవలో...పంజాబు నుండి పారిపోయి వస్తున్నాము. సీత నాన్న తమ మాల్వీ వేషం సీతకు శ్రీరామ రక్ష అనుకున్నారు. కాని వారి అల్లు డింకో విధంగా అనుకున్నారు!

''అయ్యో! అయ్యో! అయితే, అయితే ఆ పడవలో నేను గురి చూసి కాల్చిన ముస్లిం....?!?''

''అవును, మీ మామగారినే గురి చూసి కాల్చారు, గురి తప్పనయినా కప్పలేదు. రాఘవన్! ఈ దురదృష్టకరమైన సంఘటనను తెలిసినవాడిని నే నొకడినే...ఇప్పుడు మీకు తెలుసు. నే నెవరికీ చెప్పబోను. మీరు చెప్పరని విశ్వసిస్తున్నాను'' అని చెప్పి వెళ్ళిపోయాడు సూర్యా.

రాఘవన్ నిశ్చేష్టు డయ్యాడు.

సూర్యా చెప్పిన ఆఖరి మాటలు అమ్ములై అతడి హృదయాన్ని వేధించసాగాయి. సూర్యా చెప్పిన వార్తల మంచి చెడ్డల గురించి ఆలోచించే శక్తే తేకపోయింది. ఇవేవీ కారణికి తెలియకూడదు—అన్న ఒక్క ఆలోచన మాత్రం అతడి మనసులో మెదులుతూంది.

గుమ్మం దాటి వీధిలోకి వచ్చిన సూర్యా గబగబ నడవ సాగాడు. అతడి మానసిక ఆందోళన అతడి నడక వేగంలో ప్రతిఫలించింది.

51

అది పానిపట్టు. అంత ఎక్కువ వెడల్పుగా లేని వీధులను, ఇరుకు సందులను, దాటి వెళ్ళాడు సూర్యా. ఒక సందు నుండి కాలి బాట ఒకటి ఎత్తయిన చోటకి దారి తీసింది. ఆ ఎత్తు మీద ఒక మసీదుంది. ఆ మసీదులో స్త్రీ శరణార్థులకు వసతి ఏర్పాటు చేశారు. సూర్యా ఆ సందులోకి ప్రవేశించాడు. ఆ మసీదులోని స్త్రీలు రాట్నం వడుకుతూ, పిల్లల బట్టలు కుడుతూ, పూలగుత్తులు కడుతూ వున్నారు. వారందరూ సైన్యం మూర్తీభవించిన ట్లున్నారు; జీవచ్ఛవాలచే ఏదో మంత్ర శక్తి వలన పని చేయిస్తున్నట్లు అన్పిస్తూంది.

జాలితో వాళ్ళను చూస్తూ మసీదు దాటి వెళ్ళాడు సూర్యా. ఆ సందు చివర వున్న చిన్న ఇంట్లోకి ప్రవేశించాడు.

సీత వంట గదిలో వుంది. దురై సామి అయ్యర్ ఏదో పత్రిక చదువు తున్నారు. నదిలో పడ్డప్పటి నుండి సీత మతి చలించింది. మాట పడి పోయింది. చెవులూ వినపడడం లేదు.

రా సూర్యా! రా! ఇంత ఆలస్యమయిందేం? నిన్న రాత్రి రాలేదేం?', అని అడిగారు దురై సామి. సూర్యా పలకలేదు. ''ఏం, వూళ్ళోకొన్నా వేం? ఢిల్లీ నుండి ఏదయినా ముఖ్య వార్తలున్నాయా?'' అన్నారు దురై సామి.

''మామూలు వార్తలే! వేరేమీ లేదు. ఎక్కడ చూచినా ద్వేషం క్రోధం, భీతి—ఎవరి మనసూ ప్రశాంతంగా వుండడం లేదు.''

''గాంధీజీ ప్రార్థనా సమావేశాలకు పోలేదా? అక్కడ మనసుకు శాంతి లభిస్తుందనే వాడివే?''

''వెళ్ళాను. కాని ఈ సారి ఆ సమావేశం వలన కూడా మనసు శాంతించ లేదు. మహాత్ము డిప్పుడు ఢిల్లీలో వుండడం ఉచితం కాదేమో నన్పిస్తూంది.''

''యదార్థవాదీ బహుజన విరోధీ—అన్నారు. అంచేత గాంధీజీని ఎవ

రేమున్నా ఆయనే దైవం అని నమ్మే పరమానంద శిష్యురాలుంది...అదే, సీత గురించే చెబుతున్నాను. నువ్వొకసారి దానిని తీసుకువెళ్ళి గాంధీజీ దర్శనం చేయించాలి. ఆ పుణ్య పురుషుడి దర్శనంతో ఒక వేళ ఆమె చిత్త భ్రమ తొలగినా తొలగవచ్చు...సూర్యా! ఇవాళ పొద్దున సీత మూర్ఛపోయింది. మళ్లీ స్పృహ రావడానికి చాల కష్టమైంది. స్పృహ వస్తుండగా ఆమె వెద్ద అరుపు అరిచింది. ఆ అరుపు నన్నే భయ విహ్వాలుణ్ణి చేసింది. ఆ కేకను నువ్వూ నేనూ తప్ప ఇంకెవరూ సహించలేరు.''

''సీత బాపూజీని చూడాలంటే త్వరగా వెళ్లాలి. బాపు ఎక్కువ రోజులు ఢిల్లీలో వుండరేమో నన్పిస్తుంది. అక్కడి పరిస్థితి అట్లా వుంది. ప్రార్థనా సమావేశంలో ఎవరో బాంబు విసిరారు. ఆ విషయం తెలుసా మీకు?''

''తెలుసు, పత్రికలలో చదివాను. కాని మహాత్ముడు వీటన్నిటికీ భయ పడతాడా, ఏమిటి?...ఢిల్లీలో ఇంకెవరినయినా చూశావా? ఇంకా నా గ్రంథ ఏమయినా వున్నాయా?''

''చూశాను! మీ ముద్దుల అల్లుడుగారిని చూశాను'' అని సూర్యా చెప్పగానే దురై సామి మొహంలో ఆతురత కన్పించింది, 'నువ్వు అతడి నెందుకు కలిశావు? వద్దని చెప్పాను కదా?''

''నే నతడికోసమంటూ వెళ్ళలేదు. కాని కలవవలసి వచ్చింది. మీ అల్లుడు నన్ను పరలోకానికి పంపించేయాలని మూడవ సారిగా యత్నించారు కాని దైవక్పపల్ల బ్రతికిపోయాను.''

''నువ్వు బ్రతికావని కనపడుతూందిగా? అతడు నిన్నేమయినా అడిగాడా?''

''అడగకేం? ఇంటికి తీసుకు వెళ్ళారు. సీత గురించి నీకేమయినా తెలుసా అని అడిగారు.''

''అందుకేమని చెప్పావు?''

''సీత మరణించినట్లు చెప్పాను.''

"ఓరి పాపీ! అట్లా ఎందుకు చెప్పావు?"

"ఏమేమి చెప్పమంటారు? మీ అమ్మాయేమో తాను బ్రతికి వున్నట్టు ఆయనకు తెలియనివ్వ వద్దంటుంది. ఆయనేమో మళ్ళీ పెళ్ళికోసం తహ తహ లాడుతున్నాడు..."

"అతడి కింకో పెళ్ళా? ఆ కిరాతకుడిని ఏ మూర్ఖురాలు పెళ్ళి చేసుకుంటుంది?"

"మామయ్యా! అట్లాగంటారేమిటి? మీ పెద్దమ్మాయి ఒకతె వుంది కదా, ఆమె గురించే ఆయనా ఆలోచిస్తున్నారు."

ఇంత సేపు వాలి, పడుకుని వున్న దురై సామి నిటారుగా కూర్చున్నారు; "సూర్యా! తారిణి గురించి అతడేమయినా చెప్పాడా?"

తారిణి సీత పేరిట రాసిన వుత్తరం గురించి చెప్పి—"తారిణీ వాసంతీ ప్రాణాలతో వున్నారు. అ చల్లటి కబురు తెలిసింది." అన్నాడు సూర్యా.

"తారిణి ఎక్కడుందో తెలుసుకోవాలి. నువ్వు చెప్పినట్లు ఏదీ జరగకుండా చూడాలి. కావాలంటే మనమందరం ఢిల్లీకి వెళ్ళిపోదాం."

"మామయ్యా! నేనో ఉపాయం చెబుతాను, వింటారా?"

"చెప్పు, చెప్పు—"

"రాజంపేట వీధిలో మొదట సీతను కలిసినవాడిని నేను. మీ రిచ్చిన తంతిని దాచిపెట్టి, సీత సౌందరరాఘవన్ల పెళ్లి జరిగేటట్లు చేసింది నేను..."

"అందుకు నిన్ను ఎన్నోసార్లు శపించానులే...తర్వాత విషయం చెప్పు."

"మామయ్యా! నా పొరబాటుకు నేను పరిహారం ఎన్నోసార్లు చెల్లించలేదా? తుపాకితో ఆత్మహత్య చేసుకోబోయిన సీతను కాపాడలేదా? చీనాబ్ నది ప్రవాహంలో ఆమె మునిగిపోకుండా రక్షించలేదా?"

"సూర్యా! ఆ దుర్ఘటనలను ఎందుకు గుర్తు చేస్తున్నావు?"

"ఎందుకంటే, ఆమె మీద నాకున్న హక్కును నిరూపించడానికే! సీతను రెండు సార్లు మృత్యు ముఖం నుండి కాపాడాను. ఆమెకు పునర్జన్మ ప్రసాదించింది నేను. కనుక ఈ క్రొత్తగా బ్రతికిన సీత మీద రాఘవన్

కట్టి అధికారమూ లేదు. మీరు అంగీకరిస్తే మనం ఇద్దరమూ వెళ్లి రాఘవన్‌ను సీతకు విడాకులిమ్మని కోరుదాం...''

''అతడు విడాకులిస్తే...'' అని కోపంగా అడిగారు దురైసామి.

''మీరు తెలుసుకుంటారనుకున్నాను...విడాకు లివ్వగానే నేను సీతను వెళ్లాడుతాను. ఆమెను కాశ్మీరుకు తీసుకువెళ్తాను. నేపాలుకు తీసుకువెళ్తాను. క్రొత్త ప్రదేశాలు, క్రొత్త జనులు, క్రొత్త వాతావరణం సీత మతిభ్రమణాన్ని సరిచేయగలవు. మామయ్యా! మీ అమ్మాయిని చివరదాక పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను.''

ప్రక్కనే వున్న రివాల్వర్‌ను చేతిలోకి తీసుకుని—''సూర్యా! సీతను గురించి ఇట్లా ఇంకొకసారి మాట్లాడావంటే నిన్ను కాల్చి పారేస్తాను, జాగ్రత్త!'' అని గద్దించారు దురైసామి అయ్యర్.

తల వంచుకు నిలబడ్డాడు సూర్యా. కాసేపయాక తలెత్తి—''మామయ్యా! నాకు నిజంగా పిచ్చిపట్టింది...లేకపోతే అట్లా వాగి వుండను'' అన్నాడు.

''పిచ్చెత్తిందని తెలుసుకున్నావు కదా? అంటే కొద్దిగా బుద్ధి మిగిలి వుందన్న మాట. పోతే పోనీలే! నువ్విప్పుడు వాగిన వాగుడు మరిచిపో! నేనూ మరచిపోతాను. ఢిల్లీకి వెళ్లడానికి ఏర్పాట్లు చేయి.''

52

సీత దురదృష్టం ఆమె ఆఖరి కోరిక నెరవేరడానికి అటంకాన్ని తెచ్చిపెట్టింది. వాళ్లు రెండు మూడు రోజుల్లో అన్ని ఏర్పాట్లూ చేసుకుని ఢిల్లీకి వెళ్దామనుకుంటుండగా, జనవరి 30 వ తేది సాయంకాలం ఘోరాతి

ఘోరమైన వార్తను రేడియో ప్రపంచమంతటికీ ప్రసారం చేసింది. ఎవ్వరూ ఆ వార్తను నమ్మలేదు. ఇది నిజమా, ఇది నిజమేనా అని ఆడగసాగారు. "మహాత్ముడిని కాల్చగల మనిషంటూ వుంటాడా?" అన్నారు. 'పోనీ, బహుశ ఎవడో పాపాత్ముడు కాల్చినా ఆ దైవ సమానుడు వెంటనే మర్ణిస్తాడా? ఏదీ తొందరపడి వార్తను చెప్పివేశారు. కాని "బ్రతికారు!" అన్న వార్త ఏ క్షణాన్నయినా చెబుతారు, చూస్తూండండి—" అన్నారు మరి కొందరు. రాత్రి 8-30 గంటలకు అన్ని సందేహాలూ తీరిపోయాయి. పండిత జవహర్లాలూ, సర్దార్ పటేలూ శోకభరితమైన స్వరాలతో, పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని ఆణిచిపెట్టుకుని మహాత్ముడి హత్య వార్త గురించి చెప్పాక ఇంకా సందేహం ఏమిటి?

శరణార్థుల శిబిరంలో వుండగా ఆ ఘోర వార్త విన్న సూర్యా తమ ఇంటికి పరుగెత్తుకుని వెళ్లాడు. మూర్ఛపోయిన సీతకు స్పృహ తెప్పించే యత్నంలో వున్నారు దురై సామి. రేడియో చెప్పిన భయంకరమైన వార్తను సూర్యా దురై సామికి చెప్పాడు. ఆ వార్తవలన కలిగిన దుఃఖభారం అట్లా వుండగా, సీతకా వార్త తెలుపడమా వద్దా అన్న సమస్య వచ్చిపడింది వాళ్లిద్దరికీ—

కొంతసేపటికి సీతకు తెలివి పూర్తిగా వచ్చింది. ఆమె సొంజ్ఞలతో తానింక ఎక్కువ కాలం బ్రతకనని, అంచేత వెంటనే ఢిల్లీ వెళ్లి గాంధీజీని దర్శించాలని చెప్పింది. ఆ పై దురై సామీ సూర్యా ఒక నిర్ణయానికి వచ్చారు. పొద్దున సూర్యా ఆమెను ఢిల్లీకి తీసుకువెళ్లాలి. దారిలో సమయం చూచి ఆమెకు గాంధీజి మరణ వార్త తెలుపాలి. లేదా ఆమే స్వయంగా చూచి తెలుసుకునేదాక వూరుకోవాలి.

తనకు ఢిల్లీ ప్రయాణం చేసే ఓపిక అప్పుడు లేనందున తాను రాననాన్నాడు దురై సామి. సీతను జాగ్రత్తగా తీసుకువెళ్లి, క్షేమంగా వెనక్కు రమ్మని సూర్యాకు వందసార్లు చెప్పి పంపించారాయన.

* * *

సీత జీవితంలో సంఘటనలు మళ్లీ, కలలో జరిగినట్లు జరిగాయి. పాని పట్టు నుండి ఢిల్లీ వెళ్తుండగా దారిలో చూచిన జనసందోహాలు ఆమె మనసులో ఏవేవో సందేహాలను రేకెత్తించాయి.

చివరకు వాళ్లు ఢిల్లీ చేరారు. పాత ఢిల్లీ నుండి క్రొత్త ఢిల్లీ వైపు జన సముద్రం తరలి వెళ్లడం చూచారు. స్వప్నంలో నడుస్తున్నట్లు నడిచి వెళ్లింది సీత.

వాళ్లు చేరే సమయానికి మహాత్ముడి భౌతికకాయం యొక్క అంతిమ యాత్ర మొదలయింది. ఎందరినో తోసుకుని, ఎంతో కష్టం మీద జనాళ్ళ దాటి ముందుకు వెళ్లి వాళ్లు గాంధీజీ మొహాన్ని చూడగలంత దగ్గరగా చేరారు. ఏదో గొప్ప సంఘటనను చూడబోతున్నాననే ఆకాంక్షతో ముందుకు వెళ్లింది సీత. పుష్పాలతో అలంకరించిన రథం మీద మహాత్ముడి దేహం వున్న తీరూ, ఆయన మొహపుతీరూ, ఆ ప్రక్కనే కూర్చుని వున్న దేశనాయకుల వాలకమూ, జనసమూహపు మొహాల మీది శోక ముద్రా చూడగానే సీతకు విషయం ఏమిటో అర్థమైంది.

లక్షలాది జనుల హాహాకారాలు కేకలు కలిసి హోరు మంటున్నాయి. సీత చెవులలో ఎడతెగకుండా వినిపించే అలల హోరుతో ఈ శబ్దాల హోరు కలిసింది. గాంధీజీ లేరు అని తెలియగానే ఆమె గుండె పగిలినట్లయి ఎగసింది. మెడ వెనుక, రెండు చెవుల మధ్య, తోపల ఏదో నరం వీణియ తంతివలె 'ఫట్' మని తెగింది.

కాస్సేపటికి ఆ భ్రమ పోయింది; మనసు తేలిక పడింది. ఆలోచనా శక్తి మళ్లీ వచ్చింది.

ఆహా! ఆ దేవుడిని ఎన్నోసార్లు చూడగల్గి వుండి కూడా చూడలేక పోయిన దౌర్భాగ్యంతనది! ఆఖరికి ఈ దశలోనా మహాత్ముడిని చూడడం!

ఇట్లా అనుకుంటూ జన సమూహంతోబాటు సీత ముందుకు నడుస్తూంది. జనం తోక్కిసలాటలో కొన్నిసార్లు ఆమె పుష్పరథానికి దగ్గరగా, కొన్నిసార్లు దూరంగా—ఇట్లా నడుస్తూంది. గాంధీజీ పాదాలను స్పృశించి కళ్ళ కద్దుకోవాలన్న కాంక్ష తీవ్రంగా కల్గింది.

ఆ జన సమ్మర్దంలో ఆమె, సూర్యా విడిపోయారు. గాంధీజీ శరీరాన్ని చూచాక సీతకు సూర్యా విషయమే జ్ఞాపకం లేదు. ఆమె కనపడక పోయే సరికి సూర్యా భయపడ్డాడు. ఆ భీతితో ఆతురతతో ఆతడు అంత జనంలోనూ ఇటూ అటూ తోసుకుంటూ వెళ్ళి ఆమెకోసం వెతకసాగాడు.

ఎట్టకేలకు సాయంత్రం నాలుగింటికి ఆ ఊరేగింపు యమునా నది ఒడ్డు చేరింది. చితిని పేర్చారు. అంత్యక్రియలు మొదలయ్యాయి. ఆ సరికి జనసందోహానికి మున్ముందు నరసలోకి నెట్టబడి వుంది సీత. ఎంత ప్రయత్నించినా ఆమె వెనక్కు వెళ్ళలేక పోయింది.

చితికి నిప్పంటించారు. జ్వాలలు ఆకాశానికి లేచాయి. సప్త సముద్రాలూ ఘూర్ణిల్లినట్లు జనులు ఆక్రందనం చేశారు. సీత ఇంక అక్కడ నిలవలేక పోయింది. అన్నీ ముగిసిపోయాయి. తన జీవితం ముగిసింది. ప్రపంచమే ముగిసింది. తన ఆశలు, తన అభిలాషలు అన్నీ కాలి బూడిదయ్యాయి. ఇంక ఎందుకక్కడ నిల్చోవడం?

* * *

సీత వెనక్కు మళ్ళింది. ఎక్కడికి వెళ్ళాలో తెలియకుండానే ఆమె కాళ్ళు ఆమె నీడ్చుకుని పోతున్నాయి. అప్పుడు కూడా ఆమెకు సూర్యా గుర్తుకు రాలేదు.

వాసంతి! అవును, వాసంతి! ఏమయింది వాసంతి?! బ్రతికే వుందా? ఆమె నెవరు కాపాడుతారు? ఎవరేమిటి? దేవుడే కాపాడుతాడు. దేవుడంటూ ఒకడుంటే ఇన్ని క్రౌర్యాలను, దౌష్ట్యాలను చూస్తూ ఎట్లా వూరుకుంటున్నాడు? ఊరుకుంటే దేవుడెట్లా అవుతాడు? దయా సముద్రుడెట్లా అవుతాడు? అయితే గాంధీజీ అనుక్షణమూ ఆ దయాసాగరుడి గురించి చెబుతుండేవారే, ఎందుచేత? ఆ మహాత్ముడి విశ్వాసానికి ఏదో ఆధారం వుండాలి కద!_ ఇట్లా పరి పరి విధాల ఆలోచిస్తూ నడిచి, నడిచి, ఇంకా నడచి వెళ్తూంది సీత. గమ్యం ఏమిటో తెలియకుండా వెళ్తూంది. ఆఖరికి ఒక చోట ఆమె తూలి పడబోయింది. పొద్దుటి నుండి ఆహారం లేకపోవడంతో కళ్ళు తిరిగిన

యింది. ఆమె ఒక బంగళా ప్రహరీ గోడను పట్టుకుని నిలబడింది. ఆ బంగళా లోపలి నుండి రేడియో మాదుగా ఒక పాట వినబడింది. హృదయాన్ని కరిగించేపాట! ప్రాణాన్ని కదిలించే పాట!

"హరో! తుమ్ హమారీ జన్‌కీ పీర్!"

("హరీ! ప్రజల బాధను తొలగించు!")

అహా! ఇదేమి వింత! చెవులు వినగలుగుతున్నాయే! పాట వినపడుతూందే! అమృత వాహినిలా చెవుల్లోకి ప్రవహిస్తూందే! ఇన్ని రోజుల నుండి వినిపిస్తున్న ఆలల హోరు ఏమయింది? ఆ నిరంతరమైన, భయంకరమైన ఘోష ఎక్కడకు పోయింది?

బాపూ! మహాత్మా! మీ మరణంలో నాకు ప్రాణాన్ని ప్రసాదించారా?

గాంధీజీ కిష్టమైన ఆ మీరా గీతాన్ని, ఆయన శరీరం అగ్నికి ఆహుతి అవుతుండగా ఆకాశవాణి ప్రసారం చేస్తూంది.

"హరీ! ప్రజల బాధను నువ్వు తొలగించుదువు గాక!

"నువ్వు పూర్వం వస్త్రాలిచ్చి ద్రౌపతి మానాన్ని కాపాడినావు కాదా?

"బాలుడు ప్రహ్లాదుడిని కరుణతో కాపాడినావు కాదా?

"ముసలి గజేంద్రుడి మరణభయాన్ని పోగొట్టి కరుణను వర్షించినావు కావా?

"బాధవున్న చోటుల్లా అవతరించి ఆదుకున్న వాడివి నువ్వు కావా?

"హరీ! ప్రజల బాధను తొలగించుదువు గాక!"

మైమరచి పాటను వింటూ నిల్చింది సీత. పాట ముగిసింది. నలువైపుల నుండి కాను హోరన్లు వినిపించాయి. ఇంకా ఎన్నెన్నో శబ్దాలు వినిపించాయి. చీకటి పడింది. చుట్టు ప్రక్కల చూచింది సీత; తాను పట్టుకుని

నిలబడిన గోడను చూచింది. ఓహో! ఇదేమిటి? ఎవరిల్లు ఇది? మన ఇల్లు లాగుందే? చాల ఏళ్ళ పాటు నేను నా ఇల్లనుకుని వుండిన ఇల్లు కదూ ఇది? ఈ ఇంట్లో ఇప్పుడు ఎవరుంటారు? ఎవరో ఎందుకు. ఆయనే వుండి వుండాలి. ఆయనే రేడియో వింటున్నారు కాబోలు... దేవుడే తన్నిక్కడకు తీసుకువచ్చి వదలి పెట్టినట్లువ్నాడు. లోపలికి వెళ్ళి ఆయనను చూస్తేనో? "జరిగిందంతా మరచిపోదాం! క్రొత్తగా జీవించడం మొదలు పెడదాం—" అని ఎందుకు చెప్పరాదు?...నిజానికివన్నీ ఆయనతో చెప్పగలనా?

సీత నాలుక పాత రోజులలోవలె కదిలినట్లయింది. బాగా మాట్లాడ వచ్చును లాగుందే! మనసు వణుకుతుండగా, కాళ్లు తడబడుతుండగా ఆ బంగళా తోటలోకి ప్రవేశించింది సీత.

సీత తటపటాయిస్తూ నెమ్మదిగా ఆడుగులు వేసింది. రేడియో ఆగి పోయింది.

సీత ఇంటి గుమ్మం ముందు జంకుతూ నిలబడగానే వీధి గేటును ఎవరో తీసినట్లు చప్పుడయింది. ఎవరొస్తున్నారో ఏమో, తన్ను చూచి ఏమంటారో ఏమో? వెంటనే ప్రక్కకు తొలగి గోడ చాటుగా నిల్చుంది సీత. అట్లా చాటుగా దాగుకుని ఆ వస్తున్నది ఎవరోనని చూడసాగింది.

వచ్చింది ఒక స్త్రీ; బురఖా ధరించి వుంది. తల నుండి కాలిదాక కప్పుకుని వుండడంచేత ఆమె ఎవరో తెలియడం లేదు. ఎవరీమె? ఈ వేళప్పుడు ఇక్కడకు ఎందుకు వస్తూంది? భగవాన్! ఇప్పుడింట్లో ఇంకెవరో వున్నట్లున్నారు. ముస్లిములు కాబోలు! తాను పొరబాటున ఇటు వచ్చింది. తొందరపడి ఇంట్లోకి వెళ్ళలేదు సయం! ఈమె లోపలికి వెళ్లగానే తాను కనపడకుండా జారుకోవాలి; వెళ్ళిపోవాలి...ఎక్కడికి వెళ్ళడం?

ఆ ముస్లిం స్త్రీ నెమ్మదిగా అడుగు మీద అడుగు వేసుకుంటూ వచ్చి ఇంటి ద్వారా దగ్గర ఆగింది.

మెల్లెక్కి వసారాలోకి వెళ్ళి నిల్చుంది. మళ్ళీ కాస్త వెనుకంజ వేసూ నిల్చుని చివరకు తలుపు మీద వేళ్లతో 'టక్ టక్' మని కొట్టింది. ఆ టక్ టక్

శబ్దం సీతకు స్పష్టంగా వినబడింది. ఆహా, ఏమి ఆశ్చర్యం! తన శ్రవణశక్తి ఇంత బాగా అయింది! గాంధీ మహాత్ముడి చలవ ఇది.

ఇంట్లోంచి "గెట్ ఇన్!" అంది ఒక కంఠం. ఆ కంఠ స్వరం విని సీత దేహం పులకరించింది. పన్నెండేళ్ళ పాటు ఆమెకు చెప్పలేని ఆవం దాన్ని, చెప్పరాని ఆవేదనను ఇచ్చింది ఆ స్వరం! ఆ స్వరం తనలో ఆశలను, కాంక్షలను రేకెత్తిన రోజులున్నాయి; కోపాన్ని జుగుప్సనూ కల్గించిన రోజులున్నాయి. తన మెడలో పుస్తెకట్టి తన్ను ఇల్లాలుగా చేసుకున్నవారే! ఇంట్లో వున్నది ఆయనే!

ఆ బురఖా స్త్రీ తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్ళింది. ఇది చూచింది సీత.

తాను లోపలికి వెళ్ళాలి; వెళ్ళి ఏమి జరుగుతుందో చూడాలి అన్న ఉత్సాహం గాఢంగా కల్గింది. ఆ ఉత్సాహం ఆమె శరీరంలోని ప్రతి అణువునా నిండి ఆమెను చిత్రవధ చేసింది. పళ్లు బిగించుకుని ఆలోచించింది సీత. వీధి వైపు నుండి వెళ్లడానికి వీలులేదు. లోపలికి వెళ్లగానే వున్న పెద్ద గదిలోనే రేడియో వుంది. అక్కడే ఆయన వున్నారు.

దొడ్డి వైపు నుండి పోతేనో? తలుపులు తెరిచి వుంటే బాగుండును. ఎవరికీ తెలియకుండా ఆ ప్రక్క గదిలోకి వెళ్ళి వాళ్ళ మాటలను వినవచ్చును. దొడ్డి వైపు తలుపులు మూసి వుంటే పడకగది కిటికీ ప్రక్కగా నిల్చుని వారి సంభాషణను వినవచ్చును.

సీత కాళ్ళు ఆమెను ఇంటి వెనుక వైపుకు లాక్కొని వెళ్లాయి. వెనుక వైపు తలుపులు గడియ పెట్టలేదు. ముట్టుకోగానే తెరుచుకున్నాయి. అడుగు మీద అడుగు వేసుకుంటూ సీత లోపలికి నడిచింది. రేడియో గదికి ప్రక్క గదిలోకి వెళ్ళింది. సీత కాళ్లు వణుకుతున్నాయి. గోడ వారగా వున్న సోఫా మీద చప్పుడు చేయకుండా కూర్చుంది.

"ఎవరు నువ్వు? ఇక్కడికెందుకు వచ్చావు? ఇంకెవరి ఇల్లో అనుకుని వచ్చావు కాబోలు! వెళ్లు! త్వరగా వెళ్లిపో! నేను ఒంటరిగా వున్నాను.

ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేరు. వెళ్లిపో వెంటనే!" అంది రాఘవన్ కఠిన స్వరం.

"క్షమించండి రాఘవన్! మిమ్మల్ని ఎక్కువ సేపు శ్రమ పెట్టను! తొందరగానే వెళ్లిపోతాను" అంది ఆడగొంతు.

ఆ గొంతు వినగానే సీత ఒళ్లు మళ్లీ ఝల్లు మంది. ఆది తారిణి గొంతే! పరుగెత్తుకెళ్లి "అక్కా!" అని ఆమెను ఆలింగనం చేసుకోవాలని నర నరమూ ఉవ్విళ్ళూరింది. ఆ కోరిక నాటి బలవంతాన అణచుకుంది. అందుకో ముఖ్య కారణం వుంది. తాను బ్రతికివున్నాననీ తన భర్తకు తెలియదాదు! ఆ మనోనిశ్చయాన్ని కోల్పోరాదు.

"తారిణీ! తారిణీ! నువ్వు—మువ్వా—వచ్చింది? ఎందుకీ వికారమైన బురఖా? కూర్చో తారిణీ కూర్చో! ఎన్ని రోజుల నుండీ నిన్ను చూడాలని తపస్సు చేస్తున్నాను. దయచేసి కూర్చో!" అన్నాడు రాఘవన్.

"అట్లాగేలెండి! నాకు చాల ఆలసటగా వుంది. నేను చెప్పవలసిం దేదో కూర్చునే చెబుతాను. ఎక్కువ సేపు ఇక్కడ వుండను. నేను తొందరగా వెళ్ళాలి. వెళ్లకపోతే వాసంతి ఆందోళన చెందుతుంది..."

"తారిణీ! వాసంతి ఎక్కడ? ఎట్లా వుంది వాసంతి? దానినిప్పుడు తీసుకు రాలేదెందుచేత?"

"క్షేమంగా వుంది. దానిని గురించి మీకు చెబుదామనే వచ్చాను; దానిని ఎప్పుడు తీసుకొచ్చి అప్పచెప్పమంటారో అప్పుడప్పు చెబుతాను. "తీసుకొచ్చి అప్పు చెబుతారంటున్నావా? సరే, అట్లాగే కానివ్వు. ఈ శూన్యమైన ఇంటిలో ఆ తల్లి లేని బిడ్డతో నేను నానా అవస్థలూ పడాల్సి వుంటుంది. కానీ, ఏం చేద్దాం?"

"తల్లి లేని బిడ్డ అని ఎందుకంటారు? సీతను గురించి మీకు ఇదమిత్థంగా ఏమయినా తెలుసా?"

"నా బోటి అభాగ్యుడీ ప్రపంచంలో ఎవరూ వుండబోరు! సీత చీనాబ్ నదిలో మునిగి చనిపోయిందట గా? సూర్యా చూశాడట!"

వెక్కుతూ ఏడుస్తున్న శబ్దం వినిపించింది.

"'హోషంగా బాదులో ఆమెనూ బిడ్డనూ ఒంటరిగా వదలి నేనీ పాడు వుద్యోగం కోసం పరుగెత్తుకొచ్చానే! ఆ మాట తలచుకుంటే కడుపు తరుక్కు పోతుంది...అయినా పాకిస్తానీయులు వున్నట్లుండి అట్లా గ్రాక్షసులయి పోతారని అనుకోలేదే?''

''రాఘవన్ గత జలసేతు బంధనం ఎందుకు? సీత నిజంగా అదృష్ట వంతురాలు. మానవ లోకం లేకెల్లా పురుషోత్తము డయినవాడిని హత్య చేయడం చూశాము కదా! ఈ ఘోరాతీ ఘోరాన్ని చూడకుండా పాటు పున్న సీత అదృష్టవంతురాలే కదా!''

''నిన్న రాత్రి ఈ వార్త విన్నప్పటి నుండి నా మనసులో సీతే మెదులుతూంది. మహాత్మా గాంధీ అంటే సీతకు ఎంత భక్తి! అందులోనూ హోషంగాబాద్‌లో మేమున్నప్పుడయితే ఆమె గాంధీజీని దేవుడిలా పూజించేది...''

''సీత పుణ్యవతి! మిస్టర్ రాఘవన్! నేను వెళ్లొస్తాను. రేపు పొద్దున్నే మీ కూతురిని తీసుకొచ్చి మీకు అప్పగిస్తాను...''

''రేపటిదాక ఎందుకు? ఇప్పుడే కారు తీసుకొని వస్తాను. వెళ్దాము. వెళ్ళి వాసంతి తీసుకుని వద్దాం...అయితే ఆ తల్లిలేని బిడ్డను నా గంట గట్టేసి నువ్వెళ్ళిపోదామని అనుకోకు. నువ్వీ ఇంట్లో సీత స్థానంలో వుండి వాసంతిని పెంచుతానంటేనే నేనా బాధ్యతను స్వీకరించగలను.''

''రాఘవన్! ఏమిటి మీరంటున్నది? సీత స్థానంలో నేనుండడమా? ఇంకా మీకా పాత పిచ్చి పోలేదన్న మాట!''

''అవును. పోలేదు. నిజమే! నువ్వే యోచించి చూడు తారిణీ! ఈ ఇంట్లో వుండి వాసంతిని పెంచడానికి నీకన్న అర్హురాలు వేరెవ్వరు? నువ్వు గనుక నన్ను పెళ్లాడితే...వద్దులే—ఈ వేళ ఆ మాటలు వద్దు. మనందరి మనసులూ పాడయి వున్నాయి. తర్వాత చూచుకుందాం. మనం ఇప్పుడు వెళ్ళి వాసంతిని తీసుకుని వద్దాం. అయితే నువ్వు మాత్రం ఆ ముసుగును తీసి వేయి. ఆ భయంకరమైన బురఖాలో నువ్వుండడం నేను సహించలేను.''

"అట్లాగే కానివ్వండి! ఈ బురఖా నెటూ తీసివేయాల్సిందే. కాని పెళ్ళి మాటను వాయిదా వేయడం నా కిష్టం లేదు. అదేదో ఇప్పుడే తేల్చు. తుంటేగాని నా మనసు శాంతించదు..."

"అంతకన్న కావలసిందేముంది తారిణీ! మాటలెందుకు ఇంకా? నీ ఇష్టమేమిటో చెప్పడమే తరువాయి. నేను పదహారేళ్ల నుండీ తపస్సు చేస్తున్నాను—"

"నా ఇష్టాన్ని తెలిపే ముందుగా ఒక విషయం చెప్పాలి...మీకు ఇష్టమైతే నేను మిమ్మల్ని పెళ్ళాడతానని సీతకు వాగ్దానం చేశాను—"

"ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటావా, లేక...?"

"సీత బ్రతికి వుండగా నా వలన ఆమెకు ఎన్నో కష్టాలు కలిగాయి. చివరకు ఆమెను రక్షించడానికి నేను చేసిన ఏర్పాట్లన్నీ వ్యర్థమయ్యాయి. సీత ఆత్మ శాంతించాలంటే నే నామెకిచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. నన్ను పెళ్ళి చేసుకోవడం మీ కిష్టమైతే నాకూ ఇష్టమే! కాని మీరు బాగా ఆలోచించి మరీ చెప్పండి..."

సీత తానింత వరకూ కూర్చుని వున్న సోఫా నుండి లేచింది.

అభాగ్యురాలా! ఇంకా ఇక్కడే వున్నావెందుకు? వెళ్లిపో! వెంటనే పారిపో! నీ మనసు ఇంకా బాగుండగానే వెళ్లిపోవడం మంచిది, నీ మనసు మారిపోతుందేమో? చెడిపోతుందేమో—? అని ప్రోత్సహించింది సీత మనసు. చప్పుడు చేయకుండా అడుగు మీద అడుగు వేసుకుంటూ నడిచింది సీత. దొడ్డి గుమ్మం గుండా బయటికి వచ్చి ఇంటిని ప్రదక్షిణం చేసి, వీధి గుమ్మం చేరింది. ప్రహరీ గోడను దాటి వీధిలోకి అడుగు పెట్టింది. వేగంగా నడవ సాగింది.

చీకటి నలువైపులా ఆలుముకుంది.

* * *

"ఇంకా ఆలోచించాలి, ఆలోచించాలి అంటున్నావే, ఏముంది ఆలోచించడానికి?" అన్నాడు రాఘవన్ కొద్దిగా కోపంతో.

ముసుగులో నుండే తారిణి నవ్విన శబ్దం వినిపించింది. అది వినగానే ఎందుకనో సౌందరరాఘవన్‌ను అర్థంలేని భీతి ఆవహించింది.

"తారిణీ! వేళాపాళా లేకుండా ఇదేమి నవ్వు?"

తారిణి లేచి నిల్చుంది.

"నవ్వడం తప్పే! క్షమించండి. మీకేమి చెప్పినా సరే—నేను మీకు ఆలోచించడానికి ఒక రోజు గడువిస్తున్నాను. నేను రేపీపాటికి అమ్మాయితో సహా వస్తాను."

"నీ మొండి గుణం ఏమీ మారలేదు. నీ ఇష్టానుసారమే చేయి. రేపే వాసంతిని తీసుకునిరా...కానీ వెళ్ళే ముందు ఆ బురఖా తొలగించి నీ మొహాన్ని చూపించి వెళ్ళు!" అన్నాడు రాఘవన్.

ఆమె బురఖా తొలగించింది.

కాని రాఘవన్ చూచినది—అతడి హృదయంలో పదిల పరచుకున్న తారిణి అందాల ఆకారం కాదు. అతడు చూడాలని ఉప్పిళ్ళూరుతున్న మనోహర స్వరూపం కాదు. సీత సోదరి యొక్క పూర్ణచంద్రుని వంటి ముఖం కాదు.

అతడు చూచింది ఒక ఘోరస్వరూపం. ఒక చేయి మొండిగా తెగివున్న స్త్రీ స్వరూపం. ఒక కంటికి బదులుగా గుంత వున్న ఆకారం. నుదుటి కుడి వైపు నుండి ఎడమ చెంప దాక చిలినట్లున్న భయంకర స్వరూపం.

సౌందరరాఘవన్—భయంతో, జాలితో, అసహ్యంతో నిర్విణ్ణుడయ్యాడు.

కొంతసేపు వరకు కళ్ళార్పకుండా, తెరచిన నోరు మూయకుండా అట్లాగే నిల్చున్నాడు; తర్వాత దభీమని సోఫాలో కూలబడ్డాడు.

ఆ ఆకారం నోరు తెరిచి మాట్లాడింది. "క్షమించండి! మీకే బాధ కల్గించరాదనే అనుకున్నాను కాని మీరు నా మాట వినలేదు" ముందు పళ్ళు రెండూ లేనందున నోరు తెరిచినప్పుడా స్వరూపం మరింత ఘోరంగా వుంది.

అది తారిణే! అవును ఎంత చిన్నా భిన్నమయినా ఆ మొహం తారిణి మొహమే!

కాని నమ్మశక్యం కాలేదు రాఘవన్‌కు.

"నేను వెళ్ళొస్తాను ఒక్క రోజెల్లా ఆలోచించుకోండి. ఒక రోజే మిటి, కావాలంటే ఒక వారమంతా ఆలోచించాక చెప్పండి" అంది తారిణి.

రాఘవన్ బుర్ర లోపల వంద పిశాచాలూ, దెయ్యాలూ నాట్యం చేశాయి; వికటాట్టహాసం చేశాయి.

"వెళ్ళకు తారిణి వెళ్లకు. ఏదయినా మాట్లాడి వెళ్లు! లేకపోతే నా కిప్పుడే పిచ్చిపట్టేట్లుంది" అని రోదించాడు రాఘవన్.

తారిణి కూర్చుంది. "దయచేసి సర్దుకోండి...అనవసరంగా బాధ పడకండి. ఏమి మాట్లాడను నేను?...చెబుతా వినండి!"

రాఘవన తారిణి నొక్కసారి తదేకంగా చూచి మేజా మీద తల పెట్టుకుని ఏడ్చాడు.

"రాఘవన్! మీరెన్నో వేదాంతాలు చదివినవారు...విధిని ఎవరు తప్పించుకోగలరు?...జరిగిపోయినదానికై శోకించడం మీ బోటి వారికి తగునా?" అంది తారిణి.

రాఘవన్ తల పైకెత్తాడు: "తారిణీ! ఆ విధి నన్నింకా ప్రాణంతో వుంచిందెందుకు? ఈ ఘోర దృశ్యాన్ని చూడాలనేనా? కలకత్తాలో నేను చనిపోయి వుండకూడదా?" అని విలపించాడు.

"విధి బలీయం. దానిని తప్పించుకునే శక్తి మనకు దేవుడివ్వలేదు. కాని ఎటువంటి కష్టాన్నయినా, బాధనయినా భరించగల శక్తిని, జయించగల శక్తిని ఇచ్చాడు!" అంది తారిణి.

"దేవుడి మాటెత్తకు! దేవుడే లేడు? కావాలంటే ప్రమాణం చేసి చెబుతాను. నిన్నిట్లా చూశాక ఇంకా దేవుడున్నాడని ఎట్లా నమ్మను?"

"నే నిట్లా అయ్యాకనే నాకు దేవుడి మీద పరిపూర్ణ విశ్వాసం కల్గింది. దేవుడు సరయిన సమయంలో నన్ను, నా పెంపుడు తల్లీ, వాసంతీ వున్న చోటికి తీసుకువెళ్లాడు; వాళ్లను కాపాడగలిగాను. ఆ ప్రయత్నం లోనే ఒక చేయి పోయింది; ఒక కన్ను పోయింది; ముఖం మీద ఈ కత్తి

గాయం తగిలింది. అయినా నన్ను పెంచిన అమ్మనూ, నా ప్రాణ సమానురాలయిన సోదరియొక్క కూతురినీ కాపాడగలిగాను ఇదంతా దేవుడి చలవ కాదంటారా?"

ఆ తర్వాత రజనీపూర్ దురంతం గురించి చెప్పింది కారిణి. ఆ రాజ్యంలో ఒక చోట ఒక మసీదులో ఎందరో స్త్రీలను బంధించి ఆ మసీదుకు నిప్పుపెట్టి వారి నందరినీ చంపివేయాలని కొందరు రాక్షసులు ప్రయత్నించగా తాను వారి నెదిరించడం, ఈ లోగా ఈ వార్త రజనీపూర్ రాణికి తెలిసి ఆమె తన సైన్యాలతో వచ్చి తన్నూ, మసీదులోని స్త్రీలనూ కాపాడడం—గురించి కారిణి చెప్పింది.

రాఘవన్ ఇదివరకే ఈ ఉదంతం గురించి పత్రికలలో చదివి వున్నాడు. అప్పుడు, ఈ రజనీపూర్ రాణి మసీదును ఎందుకు కాపాడిందా అని విమర్శించాడు. కాని ఇప్పుడు కారిణి చెప్పిన వివరాలతో అతడి బుర్ర తికమక అయింది. దేవుడా! ఆ మసీదు నుండే కదా నా బిడ్డ రక్షింప బడింది...బహుశ ఇది నీ చలవేనేమో—సరిగ్గా ఆ సమయాన టెలిఫోన్ మోగింది.

53

ఆ ఘోరమైన మనస్థితిలో ఆ టెలిఫోన్ మోత అతడికో వరప్రసాదంలా అన్పించింది.

"ఈ వేళప్పుడు ఎవరు ఫోన్ చేస్తున్నారు?" అంటూ కోపంగా రిసీవర్‌ను తీసుకుని "ఎవరది?" అని అడిగాడు.

టెలిఫోన్ వార్త చాల విచిత్రమయినదని ఆతడి మొహంలోనే మార్పే చెప్పింది.

టెలిఫోన్ పెట్టేశాక తారిణిని చూస్తూ—"విన్నావా తారిణీ! సీత వదిలో మునిగి చనిపోయిందన్నది శుద్ధ అబద్ధం. మరి సూర్యా నాతో అబద్ధం ఎందుకు చెప్పాడో అర్థం కావడం లేదు. నీకు మాజీ దివాన్ కూతురు భామను తెలుసుకదా? ప్రస్తుతం వాళ్లింట్లో వుందిట సీత! సూర్యా కూడా అక్కడే వున్నాడట. భామ నన్ను వెంటనే బయలుదేరి రమ్మంటూంది! మరి నువ్వూ వ...?" అని చెప్పబోయి చెప్పకుండా మాట తుంచేశాడు రాఘవన్.

అతడి స్వరంలోని కుతూహలాన్ని గుర్తించింది తారిణి. కేవలం సీత ప్రాణంతో వుంది అని తెలుసుకోవడం వలన కల్గినది కాదు అవి; ఇంక ఒక కన్నూ చేయలేని ఘోరస్వరూపం గురించి ఆలోచించనే అక్కర్లేదు కదా?

"ఆ! నేనూ వస్తాను—" అంది తారిణి.

రాఘవన్ వెంటనే వెళ్ళి కారును బయటికి తీసుకొచ్చాడు. తారిణి వెనక సీట్లో ఎక్కి కూచుంది. కారు నడుపుతూ రాఘవన్, తాను టెలిఫోన్ ద్వారా తెలుసుకున్న ఇతర వివరాలు చెప్పసాగాడు.

"సీతా, ఆమె నాన్నా ఇన్ని రోజుల నుండి పానిపట్టులో వుంటున్నారట. ఇవాళ బాపూజీ అంతిమ యాత్ర చూడడానికని సీతా సూర్యా ఢిల్లీ వచ్చారట. జనసమ్మర్దంలో ఇద్దరూ విడిపోయారుట. జనులు ఇళ్లకు వెనక్కు మరలుతున్న సమయంలో హఠాత్తుగా సూర్యా భామాను కలుసుకోవడం జరిగిందట. సీత అదృశ్యమయిన సంగతి చెప్పాడట. పోలీసు వారికి టెలిఫోన్ చేసి సీతకోసం వెతకమని అడుగుదామనుకుని భామా వాళ్లింటికి వచ్చారుట. సరిగ్గా వాళ్ల ఇంటి గుమ్మం ముందే సీత స్పృహ లేకుండా పడి వుందట! లోపలికి తీసుకువెళ్లి చికిత్స చేస్తున్నారట. డాక్టరు కూడా వచ్చారట... అయినా ఇదెంతా చిత్రమో చూశావా తారిణీ! సీత ఇవాళే కనపడడం ఒక వింత కదూ? ఇదంతా ఆ పరమాత్ముడి కరుణ అనే చెప్పాలి!" అన్నాడు, రాఘవన్.

కారు భామా వాళ్లింటి ముందాగింది. ఆ చప్పుడు విని భామా

సూర్యా వీధి వైపు వచ్చారు. "త్వరగా రండి!" అని రాఘవన్ చేయి పట్టుకుని లోపలికి తీసుకువెళ్లింది భామ. లోపలికి వెళ్తూ రాఘవన్ "సూర్యా! నన్ను భలే మోసం చేశావోయ్...పరవాలేదులే కాని కారులో తారిణి వుంది... చూసుకో—" అని చెప్పి లోపలికి నడిచాడు. తారిణి యొక్క విచారమైన స్వరూపాన్ని చూడగానే సూర్యా మనసు ఎటూ వుంటుందో అనుకుంది అతడి మనసు.

* * * * *

తొందరతొందరగా కారు వైపు వచ్చిన సూర్యాని చూచి తారిణి— "సీత కెట్లా వుంది?" అని అడిగింది.

"బ్రతకదని డాక్టర్ అంటున్నారు. ఇప్పుడిప్పుడే కొద్దిగా తెలివి వస్తూంది. తెలివి వస్తూండగానే మీ పేరూ, వాసంతి పేరూ చెప్పింది."

"అయ్యో! అట్లాగయితే, వెంటనే వెళ్ళి వాసంతిని తీసుకరావాలి. వాసంతి మన పాత ఇంటిలో వుంది. వెళ్ళి తీసుకుని వద్దాము, వస్తారా?" అంది తారిణి.

"తప్పకుండా వస్తాను. సీత ఆఖరి ఘడియలలో రాఘవన్, ఆమెతో కొంతసేపు ఒంటరిగా గడపనీ!" అన్నాడు సూర్యా.

...డాక్టర్ ఇంజెక్షన్ సిద్ధం చేసుకుంటున్నారు.

రాఘవన్ సీత తలను తన ఒడిలో వుంచుకున్నాడు. ఉండుండి అతడు వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం వినిపించింది సీతకు.

తడబడుతూ చెప్పింది సీత: "మీరెందుకు ఏడవాలి? నా కింతకన్న ఏమి భాగ్యం వుంది! కస్తూర్బావలెనే నేనూ నా దేవుడి ఒడిలో పడుకుని మరణించాలని తపస్సు చేశాను. ఆ తపస్సు ఫలించింది. నన్ను మించిన అదృష్టవంతురాలు లేదు. మీరు ఏడవకండి—"

ఏడుపు ఒక వైపు సిగ్గు ఒక వైపు వేధించాయి రాఘవన్‌ను. "సీతా! నువ్విట్లా మాట్లాడకు! నీ ఒంటి కేమీ కాలేదు. నువ్వు కొన్నాళ్లల్లో చక్కగా లేచి తిరుగుతావు" అన్నాడు.

"లేదు, లేదు నేనింక ఎంతోసేపు బ్రతకను. నాకట్లాగే అన్పిస్తూంది. అక్కయ్య ఎక్కడుంది, ఆమెను రమ్మని చెప్పండి!"

"వాసంతిని తీసుకుని రావడానికి వెళ్ళింది తారిణి...నువ్వంటున్నది ఏదీ జరగదు. నీకేమీ కాదు సీతా! నన్నిట్లా వదలిపెట్టి నువ్వు వెళ్ళిపోవడం దేవుడే ఇచ్చగించడు—" అన్నాడు రాఘవన్. అదే క్షణాన అతడు "దేవుడా! ఈ ఒక్కసారి నా సీతను రక్షించు. నేనింక బుద్ధిగా నడుచుకుంటాను. ఇంకెప్పుడూ స్వార్థంతో ప్రవర్తించబోను" అని మనసారా ప్రార్థించాడు.

సీత పలికింది: "నా మనసులో ఒక ఆశ వుంది. నేను కన్ను మూశాక తారిణి అక్కయ్యను మీరు తప్పకుండా పెళ్ళి చేసుకోవాలి. అక్కయ్య నాకు మాట యిచ్చింది, మాట నిలబెట్టుకుంటుంది."

కాస్సేపటికి తారిణీ, సూర్యా, వాసంతీ—వచ్చారు. సీత తన ఎండి పోయిన చేతులతో బిడ్డ మొహాన్ని తన మొహానికి చేర్చుకోవాలని యత్నించింది; కాని ఆశక్తి చాలలేదు. ఇది చూచి తారిణి బిడ్డ మొహాన్ని తల్లి మొహం దగ్గరకు చేర్చింది. సీత తీక్షణంగా గమనించింది. బురఖా వేసుకున్న ఆకారాన్ని చూచి హీనస్వరంతో—"ఇది ఎవరు?" అని అడిగింది.

"నన్ను గుర్తు పట్టలేదా సీతా!" అంది తారిణి. స్వరాన్ని బట్టి ఆమె ఎవరో తెలుసుకుంది సీత.

"వచ్చేశావా అక్కయ్యా! చాల సంతోషం అక్కయ్యా! నా మనసు శాంతించింది. నువ్వు ఇందాక ఈయనతో మాట్లాడిందంతా పొంచి వుండి విన్నాను. ఇంక నాకే దిగులూ లేదు. అయినా, మొహం ఎందుకు మూసుకున్నావు? ముసుగు తీసేయి. అక్కా! నేను చనిపోయేలోగా నీ మొహాన్ని ఒక్కసారి చూడాలి. చూసేస్తే అదే జ్ఞాపకంతో పరలోకానికి వెళ్ళిపోతాను" అని చెబుతూండగానే సీత కళ్ళు తమంతట తామే మూతలు పడ్డాయి.

"సీతా! నా మొహం మీది ముసుగు తీస్తున్నాను. కళ్ళు తెరచి ననొక్క సారి చూడు! భయపడకేం! నీ కూతురు వాసంతిని కాపాడే యత్నంలో ఇట్లా అయింది. అందుకోసం నువ్వేమీ బాధపడకు..."

ఇవేమీ సీత చెవిని పడలేదు.

తారిణిని చూడగానే సీత మొహం, ఆరిపోయే ముందు దీపం వలె—మరింత ప్రకాశవంతంగా వెలిగింది.

ఇంకా బలహీనమయిన స్వరంతో—ఆనందమూ, ఆశ్చర్యమూ కలిసిన గొంతులో సీత నెమ్మదిగా పలికింది: "అక్కా! నీ మొహం మునుపెన్నడూ లేనంత శోభాయమానంగా వుంది. నిన్ను చూచి ప్రేమించిన నా భర్త నన్ను ప్రేమించలేదు అంటే అందులో వింత ఏమీ లేదు. నేను అదృష్టవంతురాలిని అక్కా! ఏ కొరతా లేకుండా ప్రశాంతంగా పోతున్నాను. నా కోసం ఎవ్వరూ దుఃఖించకండి! సూర్యా నా కోసం చాల దుఃఖిస్తాడు. అతణ్ణి బాధ పడవద్దని చెప్పండి!"

సీత తన పేరుచ్చరించడం విని సూర్యా దగ్గరకు వచ్చి, ఆమె మొహం దగ్గరగా వంగి—"సీతా! నే నిదిగో వున్నాను" అన్నాడు.

సీత అతి హీనస్వరంతో—"సూర్యా! నేను అదృష్టవంతురాలిని! సుందరగా వెళ్ళి చేసుకో!" అంది.

* * *

సీత అదృష్టవంతురాలే!

సూర్యా ఏడ్చాడు. సౌందరరాఘవన్ రోదించాడు. తారిణీ వాసంతీ దుఃఖం భరించలేక విలపించారు.

అయితే ఇవేవీ సీత చెవిని పడలేదు. ఆమె మెదడుకు అందలేదు.

సీత ప్రాణం అశాశ్వతమైన ఈ దేహాన్ని త్యజించింది. ఆకాశంలోకి ఎగిరిపోయింది. పైకి, పైపైకి ఎగిరిపోయింది.

ఇంద్ర ధనుస్సు రంగులను దాటి, వెండి మేఘాలను దాటిపోయింది.

మందమారుతాలు తెచ్చిన సుగంధ సౌరభాలలో స్నానమాడి పోయింది. మధురాతి మధురమైన సంగీతాన్ని అనుభవిస్తూ వెళ్ళింది. కాస్సేపటికి దేవలోకపు పారిజాతాలూ, నానావిధ కుసుమాలూ రేకలు విదిలించాయి. ఆ పూరేకలు సీత ప్రాణం చుట్టు ఆవరించాయి.

54

దేవపట్నపు రథం వీధిలో ఎదురెదురుగా వున్న మేడ ఇళ్ళ ముందు ఇప్పుడు బోర్డులు వేలాడడం లేదు. ఆడ్వకేట్ ఆత్మనాథయ్యరూ, ఆయన వెనకాలే దామోదరం పిళ్లే—పై లోకాలలో కేసులు వాదించడానికని వెళ్ళి పోయారు.

దామోదరం పిళ్లై మరణానికని దేవపట్నానికి వచ్చిన ఆమర్‌నాథ్ మళ్ళీ కలకత్తా వెళ్లలేదు.

అమర్‌నాథూ, పట్టాభీ—దేశపు సంపదను పెంపొందించే వృత్తి చేపట్టడంగాని పరిశ్రమ పెట్టడంగాని చేయాలనుకుంటుండగా, మహాత్ముడి హత్య వార్త వచ్చి వాళ్ళను కలచివేసింది. దాంతో బాటే సీత మరణ వార్త కూడా రావడంతో వాళ్లు నిశ్చేష్టులయ్యారు. కలకత్తా వీధిలో పడివుండగా సీతను ఇంటికి తీసుకువెళ్లి కాపాడిన అమర్‌నాథ్ చివరకామె ఇట్లా మరణించిందా అని దుఃఖించాడు. సీత సద్గుణాల దుర్గుణాల గురించి మిత్రులిద్దరూ చర్చించుకున్నారు. కాని వాళ్ళ భార్యలు చిత్ర, లలితలు సీతలో దుర్గుణం ఒకటి కూడా లేదన్నారు. తప్పులంటూ వుంటే అవన్నీ తనద్దేనని పశ్చాత్తాప పడింది లలిత. సీత కష్టాలన్నిటికి తానే కారణం అని నొచ్చుకుంది లలిత. తన్ను చూడవచ్చిన సౌందరరాఘవన్ ఆమెను పెళ్లి చేసుకున్నాడు కదా! తాను పడవలసిన కష్టాలన్నిటినీ, అతడిని పెళ్లాడి సీత పడింది. అయినా తన బాధలను తనలో దాచుకుని ఇక్కడ వుండగా ఎంత సంతోషంగా వుండింది? ఆమె ఇక్కడ వుండగా ఇల్లు ఎంత గలగల లాడుతుండేది!

ఇట్లా సీత గురించి చెప్పి చెప్పి దుఃఖిస్తున్న లలిత ఇంకా అంది. "ఎన్నిసార్లు అనుకున్నా మనసు ఒప్పుకోవడం లేదే! పాపం సీత అన్ని కష్టాలూ పడి ఆఖరికి చనిపోయింది!..."

"సంతోషం అన్నది ఎరుగకుండా సీత చనిపోయిందంటేనే నొప్పుకోను. లలితా! నేనూ సీతతో మెలగినదాన్నే...ఆమె ఎంత దుఃఖించిందో

అంత సుఖపడింది. రవీంద్రనాథ్ టాగూర్ ఏమన్నాడు? "ప్రభూ! నాకీ ప్రపంచంలో ఇంకే ఐశ్వర్యమూ వద్దు. మనసారా. కన్నీరు కార్చి ఏడ్చే భాగ్యాన్ని ప్రసాదించు" అన్నాడు. సుఖ దుఃఖాలు కలిసినదే నిండైన జీవితం. కావ్యాలు, కథలు, ఇతిహాసాలు చూడు, అన్నింటా ఈ మాటే చెబుతారు, కథానాయకులూ, నాయికలూ కష్టాలూ సుఖాలు పడ్డవాళ్లే!" అంది చిత్ర.

"సీత జీవితమూ ఒక కథగానే ముగిసిపోయింది చిత్రా! సీతకు కథలంటే ఎంత ఇష్టం! రాజంపేట గుంట గట్టు మీద కూర్చుని మేము కథలు చెప్పుకున్న ఆ మధురమైన రోజుల గురించి అనుకుంటే నా గుండె చెరువవుతూంది. ఎన్నెన్ని కథలు చెప్పేది సీత! లైలా మజ్నూ, అనార్కలి, రోమియో జూలియెట్, శకుంతల, నలదమయంతి—ఇట్లా ఎన్ని కథలు చెప్పేదో! చెబుతున్నప్పుడెల్లా ఆ కథానాయకి తానే అని ఊహించుకునేది; కలలు కనేది, స్వాప్నిక లోకాలలో విహరించేది. కాని ఏకలా నిజం కాకుండా, ఏ సుఖమూ ఎగగకుండా వెళ్లిపోయిందే?" అని భోరుమని ఏడిచింది లలిత.

"సీత గురించి ఇంత బాధపడుతున్నావే, ఆమె సోదరి గురించి ఆలోచించావా? ఒక కన్ను, చెయ్యీ పోయి ఇంకా ప్రాణంతో వుందే ఆమె గురించి అనుకుంటేనే జాలివేయడం లేదా?" అంది చిత్ర.

లలిత ఏడుపు ఆగింది.

"నిజమే, ఎంతో జాలివేస్తుంది! నా పెద్దొదినను నే నింతవరకూ చూడలేదు...మొదటిసారే ఈ విధంగా చూడవలసి వచ్చింది కదా అని బాధగా వుంది!" అంది లలిత.

"ఇందుకు కూడా నువ్వు బాధపడితే ఎట్లా?...నీ అన్న సూర్యా చూడు, ఎంతటి ధీరుడో! అట్లా అంగవిహీన అయినదానిని పెళ్లాడ నిశ్చయించాడే! ఆ ధైర్యం, ఆ త్యాగం ఎందరిలో వుంటుంది? మీ ఆయన, మా ఆయన అయితేనా పది మైళ్ళ దూరం పరుగెత్తేవారు."

"కానీ, చిత్రా! సూర్యా చేస్తున్న పని సరయినదంటావా? నాకేమో సరికాదనిపిస్తూంది. అట్లాగయినా పెళ్లి చేసుకోవలసినంత అవసరమే మొచ్చింది? మా అమ్మకీ విషయం తెలిస్తే గుండె ఆగిచస్తుంది—"

"చస్తే చావనీ! ప్రపంచంలో ఎందరో చస్తున్నారు.నిముషానికి లక్ష మంది చస్తున్నారు. గాంధీ మహాత్మ డంతటివాడే చచ్చిపోయాడు. ఇంక మీ అమ్మ వుండి చేసేదేముంది? కాని సూర్యా వంటి కొడుకును కనడానికి ఆమి ఎన్నో పూజలు చేసి వుండాలి. ఆ సత్యం ఆమె తెలుసుకోలేకపోతే ఆ తప్పు ఎవరిది? నువ్వూ ఆమెతో కలిసి ఏడవనేల? నేనయితేనా ఇటాంటి అన్నయ్యకు చెల్లెలయినందుకు గర్వించేదాన్ని!" అంది చిత్ర.

* * *

రాజంపేట వీధులు మునుపటిలాగే చెట్లతో, వాటి నీడలతో ప్రశాంతంగా వున్నాయి. తపాలాఫీసూ పదిహేనేళ్ళ క్రింద వున్నట్లే వుంది.

రాజంపేట అగ్రహారం ఆనాడెట్లా వుందో, ఈ నాడూ అట్లాగే వుంది. ప్రపంచం తలక్రిందు లయిపోయినా మన అగ్రహారాలు మాత్రం మారవు కదా!

కాని రాజంపేట మునుపటివలె గలగల మంటూ లేదు. మున్సబు కిటావయ్యర్ అక్కడ లేకపోవడమే అందుకు ముఖ్య కారణం. వంశ పారంపర్యంగా వస్తున్న ఆ వుద్యోగాన్ని 'సుండు' అని పిలవబడే శ్యామ సుందర్ నిర్వహిస్తున్నాడు. తల్లిని చూద్దామని ఆ వూరికి వచ్చింది లలిత.

వీధిలో నుండి "పోస్ట్!" అన్న కేక విని ఇంట్లోంచి పరుగెత్తుకు వెళ్ళింది లలిత. ఉత్తరం అందుకుంది. ఆ వుత్తరం ఆమె భర్త రాశాడు.

క్షేమ సమాచారాలన్నీ రాశాక పట్టాభి ఇట్లా రాశాడు: "నీకొక విచిత్రమైన కబురు రాస్తున్నాను. ఆశ్చర్యంతో మూర్ఛపోకేం? నీ అన్నయ్య సూర్యా వచ్చాడు. భార్యతోబాటు వచ్చాడు. అతడి భార్యను చూడగానే నీకు ఆశాభంగం కలగవచ్చు. కారణం ఏమిటో నేను రాయడం లేదు. నువ్వే చూస్తావుగా...ముగ్గురమూ రేపు అక్కడికి వస్తున్నాము."

ఇది చదివి కలవరం చెందింది లలిత. ఆమె అసలు రాజంపేటకు వచ్చిన కారణం అమ్మకు సూర్యా పెళ్ళి విషయం చెబుదామనే; కాని ఇంతవరకూ చెప్పడానికి ధైర్యం చాలకపోయింది. ఇంక వాయిదా వేయడానికి వీలు లేదు. వాళ్ళు రేపు వచ్చేస్తారు కదా!

ఆ వెంటనే సరస్వతమ్మాళ్‌కు లలిత, సూర్యా పెళ్ళి చేసుకుని భార్యతోబాటు వస్తున్నాడని చెప్పింది. అది విని దిగ్భ్రమను చెందింది సరస్వతమ్మ.

"పెళ్లా? నిజంగానా! మనకెవరికీ తెలియకుండా ఏం పెళ్ళే? ఇట్లా ఎవరన్నా చేస్తారా? ఆ పిల్ల ఎవరో, ఏమిటో?" అని శోకన్నాలు మొదలు పెట్టింది.

"ఏమిటోనమ్మా! నేను ఇదివరకే విన్నాను కాని నిజమని అనుకోలేదు. కాని నిజం అనే తెలుస్తూంది ఇప్పుడు—"

"ఏమిటే ఆ నిజం? నువ్వు ఏమి విన్నావు?"

"సూర్యా పెళ్లి చేసుకున్న పిల్లకు అంగవైకల్యం వుందిట! ఒక కన్ను లేదన్నారు, ఒక చేయి లేదని ఇంకొందరన్నారు. ఏమిటో, ఈ సూర్యా పనులన్నీ ఇట్లాగే వుంటాయి. అమ్మా! నాకు చాల కష్టంగా వుంది!"

"ఇదేమి అన్యాయమే? ఇట్లాటి పెళ్ళి ఎవరన్నా చేసుకుంటారా? ఇది నిజమేనటే? నేను నలుగురి మొహం ఎట్లా చూడనే తల్లీ?" అంటూ ఏడ్చింది.

పట్టాభిరామనూ, సూర్యా, సూర్యా భార్యా ఎద్దుబండి నుండి దిగారు. లలిత తత్తరపడుతూ నడవాలోకి వెళ్ళింది. తారిణిని చూడాలని ఆమె మనసు తహతహ లాడింది. ఎంత అణచి పెట్టుకుందామన్నా ఆమెచేత కాలేదు. అమ్మ ఏమి గొడవ చేస్తుందోనని ఇంకో పక్క భయం.

మొదట పట్టాభీ, సూర్యా దిగారు. తర్వాత ఒక స్త్రీ దిగింది. ఇదేమి విడ్డూరం? అనుకున్నట్లుగా లేదే? రెండు చేతులలోను రెండు పెట్టెలు పట్టుకుని దిగుతూందే? కళ్ళు రెండూ బాగానే వున్నట్లున్నాయే. కాస్త అత్యధునాతనంగా వుందంతే! ఇంకే విధమైన అంగవైకల్యమూ వున్నట్లు లేదు. ఆ తర్వాత, తారిణి దిగుతుందేమోనని చూచింది లలిత. కాని ఇంకెవరూ దిగలేదు. వచ్చిన వాళ్లను కుశల ప్రశ్నలు వేసి, స్వాగతం చెప్పి లోపలికి తీసుకువెళ్లింది.

"సూర్యా! ఆమె ఎవరు? నువ్వు రాలేదే...?" అని మొదలు పెట్టింది లలిత.

"ఈమె నన్ను పెళ్ళాడడానికి ముందంజ వేసిన నారీమణి; దివాన్ ఆదివరాహాచారిగారి పుత్రిక, నామధేయం భామ! మా పెళ్ళయి రెండు వారాలయింది. 'హనీమూన్'కని వచ్చాం!" అన్నాడు సూర్యా.

ఆ తర్వాత ఏకాంతంగా కలుసుకున్నప్పుడు లలితతో సూర్యా చెప్పాడు: "నీకు కొంచెం ఆశాభంగం కల్గివుండవచ్చు. నాకూ అంతే అయింది. అందుకు కారణం తారిణి కాదు; సౌందరరాఘవనే! అందరి అంచనాలనూ ఆసుపత్రి తలక్రిందులు చేసివేశాడు. తారిణిని తను పెళ్లాడి తీరతానన్నాడు. ఆమె ముఖలావణ్యం చూచి తానెమెను ప్రేమించలేదని ప్రమాణం చేశాడు. సీతకు తారిణి ఇచ్చిన మాట జవదాటరాదన్నాడు. తన నుండి సీత అట్లాంటి వాగ్దానమే తీసుకుంది అన్నాడు. తారిణి ఎన్ని అభ్యంతరాలు చెప్పినా ససేమిరా వినలేదు. లలితా! నిజంగా తారిణిని రాఘవన్ హృదయపూర్వకంగా ప్రేమించాడని తెలుసుకున్నాను. అందుచేత నేను తప్పుకున్నాను; వాళ్ళ ఇద్దరి పెళ్ళి జరిపించాను. సౌందరరాఘవన్ ఉద్యోగం వదలివేశాడు. వాసంతితో బాటు ఇద్దరూ రజనీపూర్‌కు వెళ్లిపోయారు. రజనీపూర్ సంస్థానం భారత దేశంలో విలీనమయినప్పటికీ రాజమాత వద్ద బోలెడంత నగలు, నట్రు, అస్తి వున్నాయి. తారిణి మీద ఆమెకు అపరిమితమైన ప్రేమ. తారిణీ ఆమె భర్తా రజనీపూర్ వచ్చి హాయిగా జీవిస్తూ, అక్కడి పంజాబు శరణార్థులకు సాయం చేయాలని, తన యావదాస్తీ వారి పేరిటే రాస్తున్నాననీ చెప్పింది రాజమాత. అంచేత వాళ్ళిద్దరూ రజనీపూర్ వెళ్ళిపోయారు."

కాస్సేపు పూర్కుండి లలిత అడిగింది: "నీ భార్యామణి నెట్లా సంపాదించావు సూర్యా?"

"మొదట భామ అంటే చాల అయిష్టంగా వుండేవాడిని. ఈమె స్వభావాన్ని, గుణగణాలను సరిగ్గా తెలుసుకోలేక పోయాను. తారిణే నాకు ఈమె గురించి చెప్పింది. మొదటిసారి నన్ను చూచినప్పటి నుండి ఈమెకు నా మీద ప్రేమ వుంది అని చెప్పింది. అంతే కాదు, 1942 సంవత్సరపు ఉద్యమం రోజులలో ఈమె—ప్రభుతోద్యోగులతో కలిసి తిరుగుతున్నట్లే వుండి—అతి రహస్యంగా వుద్యమానికి తోడ్పడిందట. తారిణిని పోలీసువారు

ఖైదు చేయకుండా కాపాడింది ఈమేనట. నేను పోలీసువారి కాపలా నుండి తప్పించుక పారిపోయానే అందుకు సాయపడింది భామేనని తారిణి చెప్పింది.

ఇవన్నీ విన్నాక నా మనసు మారింది. భామ పట్ల నా దురభిప్రాయం తొలగిపోయింది. ఆమెతో మాటాడాను, ఆమె లక్ష్యమూ నా లక్ష్యమూ ఒకటేనని తెలిసింది. ఆ తర్వాత ఆమెను నా జీవిత సహధర్మచారిణిగా స్వీకరించాను...అలితా! నువ్వామె వేషాన్నీ ఆలంకరణనూ చూచి ఇంకొకలా అనుకోకు; ఆమెతో మెలగిచూడు. ఆమె ఎట్లాంటిదో నీకే తెలియగలదు'' అన్నాడు సూర్యా.

* * *

అంతవరకూ బయట ఎక్కడికో వెళ్ళివుండిన శ్యామసుందర్ ఇంటికి వచ్చాడు. అన్ననూ వదిననూ చూచి చాల సంతోషించాడు.

''అన్నయ్యా! 'రిటర్న్' టిక్కట్టు కొనుకొచ్చావా, లేక కొన్నాళ్ళ పాటు ఇక్కడ వుందా మనుకుంటున్నావా?''.అని అడిగాడు శ్యామసుందర్.

''నువ్వు నన్ను వెళ్ళగొడితే తప్ప చాల కాలం ఇక్కడే వుందామనే అనుకుంటున్నానురా! దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఇకముందు దేశసేవ వస్తువుల ఉత్పత్తిద్వారా, పంటలు అధికంగా పండించడం ద్వారా చేయవలసిందే! ముందుగా మన గ్రామంలో మొదలు పెడదామనుకుంటున్నాను. పొలంలో కష్టించి పాటుపడే వారికి నూతనోత్సాహాన్ని గౌరవాన్ని ఇవ్వాలి...''

''ఇక్కడ రైతుల ఉద్యమం చప్పబడి పోయిందిప్పుడు. రైతు సంఘం నాయకుడు సంఘం డబ్బు అయిదువేల రూపాయలు తీసుకువి పరారీ అయ్యాడు. దాంతో ఆ ఉద్యమం గొడవ లేకుండా పోయింది; మళ్ళీ నువ్వు మొదలు పెడితే తప్ప—''

''రైతుల వుద్యమం లేదని చంకలు కొట్టుకోవడం పొరబాటు. రైతులు సుఖంగా తృప్తిగా వుండాలి. తాము శ్రమించి పండించే దానిలో తమ న్యాయమైన వాటా తమకు అభిస్తుందన్న విశ్వాసం వాటికి వుండాలి. లేకపోతే ఏ వాటికయినా గొడవా, గోలా, భీభత్సమూ తప్పవు... నేను వ్యవసాయంలో కొంగ్రొత్త విధానాల నాచరించి చూపెడతాను. భామ కూడా నాకు తోడ్పడుతా నంటూంది. నువ్వేమంటావు?''

"నే నే మంటానన్నయ్యా! మన భూమినంతా రైతులకు పంచేదా మన్నా నేనేమీ అనబోను. నువ్వు దేశమంతా తిరుగుతూ వుండక, ఇక్కడ వుండిపోతే నాకదే పది వేలు! నే నెక్కడయినా, ఏదో ఒక పని చేసి పొట్ట పోసుకుంటాను" అన్నాడు శ్యామసుందర్.

"అట్లా భూమిని పంచవలసిన రోజూ రానున్నది. అందుకూ మనం సిద్ధంగా వుండాలి. కనుక ఇప్పటినుండే ఇంకేదయినా వృత్తిని నేర్చుకోవడం మంచిదే..." అన్నాడు సూర్యా.

అటు వచ్చిన సరస్వతమ్మాళ్—"నాయనా! నేను కళ్లు మూసేదాక ఓపిక పట్టండిరా...అ తర్వాత మీ ఇష్టం వచ్చినట్లు చేద్దురుగాని..." అంది.

"మేము ఓపిక పడతాం కాని అమ్మా, భూకంపమూ అగ్ని పర్వతమూ, ప్రళయమూ ఓపిక పడతాయా?" అని అడిగాడు సూర్యా.

లలిత—"అన్నయ్యా! నువ్వు భూకంపం, ప్రళయం అంటుంటే నాకు, అత్తయ్యా సీతా తరచుగా 'అలల హోరు వినపడుతూంది' అంటుండేవారే, అది గుర్తుకు వచ్చింది. అది వాళ్ళ పిచ్చాలేక చెవులు సరిలేకనా?" అని అడిగింది.

"పిచ్చో, చెవులు సరిలేక పోవడమో నాకు తెలియదు; లేక ఏదయినా అతీతమైన శక్తి ఆపదలు కలిగే ముందుగా ఆ విధంగా వారికి హెచ్చరిక చేసేదేమో తెలియదు. పంజాబు నుండి తప్పించుకుని పారిపోయి వస్తుండగా 'చీనాబ్' నదిలో మునిగి పోయినప్పుడు చెవులు బొత్తిగా వినపడడం మానివేశాయి. కేవలం ఆ భయంకరమైన కెరటాల హోరు మాత్రమే నిరంతరం వినబడుతుండేదట. కానీ గాంధీజీ అంత్యక్రియలు జరిగిన రోజు సీత మళ్లీ వినగల్గిందట. "హరీ! ప్రజల బాధలను తొలగింతువుగాక!" అన్న మహాత్ముడి కిష్టమైన పాట మొట్టమొదట వినబడింది సీతకు. ఇది శుభసూచకమని నేనను కుంటున్నాను. పూజ్యా బాపూజీ త్యాగం తర్వాత ఈ పుణ్యభూమికి ఎటువంటి అశుభమూ వుండబోదు! ఇకపై భరతమాత సస్యశ్యామలయై, సౌభాగ్యవతియై అలరారుతుంది!" అన్నాడు సూర్యా.

ఆ దేశభక్తుడి ఆశ నిజమగుగాక!

సమాప్తం

తయారీలోనున్న పుస్తకములు

భారత దేశము — ప్రజలు

పత్రులు

భారత దేశము — ఒక పర్యాయ లోకనము

భూమి, మన్ను

కూరగాయలు

నాణెములు

మొక్కల తెగుళ్లు

ఔషధ భూజములు

పంట తెగుళు, కీటకాలు

ఋతుపవనములు

జాతీయ జీవిత గ్రంథమాల

గురు గోవింద సింగ్

స్వామి రామతీర్థ

హరినారాయణ ఆప్టే

సూరదాసు

రామానుజాచార్య

తెలుగులో నెలువడిన పుస్తకములు

భారత దేశము — ప్రజలు	వెల రూ. పై.
భారతదేశ ఖనిజములు	5-75
పెంపుడు జంతువులు	4-50
సామాన్య వృక్షములు	4-25
నికోబార్ దీవులు	5-50
జపాన్	3-75
ఉద్యాన పుష్పములు	6-00
భారత దేశ ఆర్థిక భూగోళము	5-25
భారత భౌతిక భూగోళము	4-50
అడవులు — అటవీ శాస్త్రము	6-00
పూల చెట్లు	5-50

జాతీయ జీవిత గ్రంథమాల

సముద్రగుప్తుడు	1-25
రాణీ లక్ష్మీబాయి	2-00
శంకరాచార్యులు	2-00
అహిల్యాబాయి	2-00
చంద్రగుప్త మౌర్యుడు	1-50
సుబ్రమణ్య భారతి	2-25
గురునానక్	2-25

	రూ. పై.
త్యాగరాజు	1_75
హర్షుడు	2_00
కబీరు	1_75
నానా ఫడ్నవీస్	2_00

ఆదాన్ — ప్రదాన్

పంజాబీ కథలు	3_50
తమిళ కథలు	4_00
స్మృతిరేఖలు	6_50
బన్‌గర్‌వాడి	6_25

ఇతర పుస్తకములు

భారత దేశము; నేడు — రేపు	0_75
కల్కి : లేక నాగరకత భవిష్యత్తు	0_75
జ్వాలా ముఖి	3_75
ఏక ప్రపంచము భారత దేశము	0_75
జ్యోతీలక్ష్మి	1_50
పోతన	2_75
విజ్ఞానం విశేషాలు	1_50
నవ భారత విద్యా పునర్నిర్మాణము	1_25
ప్రాక్ పశ్చిమ పవిత్రాంగనలు	5_00
మహా విప్లవ వీరుడు	4_25
శాస్త్ర విజ్ఞానము మానవ జీవితము	2_75

369

BLANK PAGE

భారతదేశంలోని ప్రతి భాషలోను ప్రఖ్యాతిచెందిన కొన్ని ఉత్తమ రచనలు ఇతర భారతీయ భాషల్లోకి అనువదింపజేసి, తద్వారా ఆయా ప్రదేశాలకు సంబంధించిన సాంఘిక జీవితం, సంస్కృతి, సామాజిక వాతావరణం, జీవిత విధానం, ఆచారాలు, అలవాట్లు ఇతర ప్రాంతీయులకి ఎరుక పరచటమే ఈ గ్రంథమాలయొక్క ముఖ్యోద్దేశము. ఈ ఉద్దేశానికి అనుగుణంగా, సామాన్యంగా ఈనాటికి చెందిన సమకాలిక రచనలనుండి ఉత్తమ గ్రంథాలను ఎన్నుకొనడం జరుగుతుంది.

మన దేశంలో ఎన్నో భాషలున్నాయి. కానీ ఇరుగు పొరుగు భాషల్లో గోచరించే భాష సంపదను గురించిగానీ, సాంఘిక సంచలనాన్ని గురించిగానీ, ఆలోచనా ప్రవాహాన్ని గురించిగానీ మనకి తెలిసినది చాలా తక్కువ. ఇది చాలా విచారకరమైన విషయం. యూరపులాటి భూభాగాల్లో వేరు వేరు భాషలు మాట్లాడేవారు, వేరు వేరు దేశాలు ఉన్నప్పటికీ, వారికి మనకంటే పరస్పర పరిచయం ఎక్కువ.

అనేక భాషలుగల మనదేశంలో, ఏక జీవితము చేకూరి, వివేకవంతులైన ప్రజానీకంలో పరస్పర పరిచయం ఏర్పడేందుకు ఈ గ్రంథమాల తోడ్పడాలని మా ప్రయత్నం. ఇదే మా ఆశయం.